వ్యాస మహాభారతం

(తెలుగు వచనం)

శాంతి పర్వం - 1



డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి

డాక్టర్ సూరం శ్రీనివాసులు

శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

విజయవాడ - 12.

96364

వ్యాస
మహాభారతం

(తెలుగు వచనం)

శాంతి పర్వం - 1

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
డాక్టర్ సూరం శ్రీనివాసులు

894-82781
రామ-మహా

వ్యాస

మహాభారతం (తెలుగు వచనం)

శాంతి పర్వం - 1

ప్రథమ ముద్రణ : వినాయకచవితి (సెప్టెంబరు 2010)

20 సంపుటాల వెల : రూ. 720/- C27484

సుందరయ్య గ్రంథాలయ నంది
A.C.No. 96364
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

ప్రతులకు :
డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
శివాలయం వెనుక, **పోలకంపాడు,**
తాడేపల్లి పోస్టు, గుంటూరు జిల్లా - 522501,
ఫోన్ : 08645-272093, సెల్ : 9491727611

ప్రచురణ & ప్రతులకు :
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్
డోర్ నెం. 76-8/1-28, లలితానగర్,
భవానీపురం, విజయవాడ - 520 012.
ఫోన్ : 0866-2414322, సెల్ : 9440346287

కీ॥శే॥ కొరెడ్ల గోపాలకృష్ణమూర్తి గారి స్మృత్యర్థం

వారి ధర్మపత్ని కమలమ్మ

కుమారులు - కోడళ్లు :

వెంకట సీతారామశాస్త్రి - అనంతలక్ష్మి

సుందరశర్మ - లలితా రాజేశ్వరి, శ్రీనివాస్ - రోజామీనాక్షి



టైటిల్ ముద్రణకు సహకరించినవారు

శ్రీ కమ్మిల వెంకటేశ్వరరావు దంపతులు

శ్రీనివాస ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ.



కీ॥శే॥ మోచర్ల రామకృష్ణ శర్మ గారు

వారి స్మృత్యర్థం

టైటిల్ బోర్డు ఇచ్చినవారు

వారి ధర్మపత్ని వరలక్ష్మి

కుమారుడు :

పూర్ణ వెంకట రామశర్మ

కీ॥శే॥ కోడిదాసు సోమేశ్వరరావు

వారి స్మృత్యర్థం

ప్రింటింగ్ ఖర్చులు ఇచ్చినవారు

వారి ధర్మపత్ని సుభద్ర

కుమారులు - కోడళ్లు :

శ్రీయుతులు శ్రీనివాస్ - సౌభాగ్యలక్ష్మి

సత్యనారాయణ (చినబాబు) - యామినీలక్ష్మి

కుమార్తెలు :

భవాని, విశాలాక్షి

రచయిత :

డాక్టర్ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి,
వారి ధర్మపత్ని శ్రీమతి సీత

రచయిత :

డాక్టర్ సూరం శ్రీనివాసులు,

వారి ధర్మపత్ని శ్రీమతి సులోచన

ఎందరో మహానుభావులు

శాంతి పర్వం ఇలా సర్వాంగసుందరంగా సకల జనహితంగా తీర్చిదిద్దడానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మాకు సహకరించిన డాక్టర్ కాళ్లకూరి అన్నపూర్ణ, శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి, శ్రీ వెలంపల్లి దాశరథి, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గార్లకు మా హృదయపూర్వక కృతాజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాము.

ఏ పనికైనా భగవంతుని ఆశీస్సులతో పాటు మానుషదైవముల సహాయ సహకారాలు కూడా అవసరమే. కొంతమంది అవ్యక్తముగా వెనక వుండి సత్ కార్యక్రమ నిర్వహణం చేయడంలో సిద్ధహస్తులై ఉంటారు. వారు భగవదాదేశాన్ని పాటిస్తున్నట్లు తమంత తామే దైవం మానుషరూపేణా అన్నట్లు వచ్చి అవ్యక్తముగా సహకరిస్తారు. అది అభిగమ్యకృతే దానం అన్నట్లుగా నిర్వహింపబడుతుంది. అటువంటి అవ్యక్త సుందరులు మా కరెడ్ల సుందరశర్మ గారు. వారు దీనివెనుక వెన్నెముకలా వుండి సర్వం తానే అయి వ్యవహరించారు. ఈ విషయంలో మేము వారికి కృతాజ్ఞతాబద్ధులమై నిలుస్తున్నాము. అటువంటి పెద్దల సహకారంతో **శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్** ఏర్పడినది.

పంచమవేదమూ, సకలశాస్త్రసారమూ, భారతీయ సంస్కృతికి మూలకందమూ అయిన వ్యాసభారతం మొత్తం పద్దెనిమిది పర్వాలు యథాతథంగా, ఉన్నదిఉన్నట్లుగా సరళమైన తెలుగు వ్యావహారిక భాషలో సామాన్యపాఠకులకు కూడా అర్థమయ్యేటట్లు **తక్కువ వెలలో** అందించాలని మా సంకల్పం.

ఈ ఆశయాలతో భారతీయ తత్త్వానికి, అధ్యాత్మిక తత్త్వానికి, సాహిత్య వైభవానికి సంబంధించిన గ్రంథాలను ముద్రించి తక్కువ వెలలో ప్రజలకు అందివ్వాలని మా ఆకాంక్ష. దీనిని ఆదరించే అభిమానులందరు మా కృతజ్ఞతకు పాత్రులు. ఈ సంస్థ వివిధ పదవులలో పాలుపంచుకొంటున్న పెద్దలు...

1.	గౌరవాధ్యక్షులు	శ్రీ కరెడ్ల సుందరశర్మ
2.	అధ్యక్షులు	డా॥ తిప్పాభట్ల రామకృష్ణమూర్తి
3.	ఉపాధ్యక్షులు	డా॥ సూరం శ్రీనివాసులు
4.	కార్యదర్శి	డా॥ పాలపర్తి శ్యామలానందప్రసాద్
5.	కోశాధికారి	డా॥ ధూళిపాళ రామకృష్ణ
6.	సహాయకార్యదర్శి	డా॥ ఉపద్రష్ట వెంకట రమణమూర్తి
7.	కార్యవర్గసభ్యులు	శ్రీ యండూరి గోవిందరావు
8.	॥	శ్రీ మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి
9.	॥	శ్రీ జన్నాభట్ల వీరేశ్వరశాస్త్రి

వీటిని అందంగా డి.టి.పి. తయారుచేసిన బెవర వెంకటరమణ, వి.యస్.గ్రాఫిక్స్ వారికి మా కృతజ్ఞతాభివందనములు.

అందరికీ వందనాలు

కార్యదర్శి
శ్రీ లలితా త్రిపుర సుందరీ ధార్మిక పరిషత్

చదివి ముందుకు సాగండి

మనిషికి కోరికలు సహజాతాలు. కోరికలు తీర్చుకొనే ప్రయత్నం సహజాతం. కోరికలు తీరినా, తీరకున్నా ఏదో ఒక దశలో ఏదో ఒక కారణం వల్ల కోరికలు దూరం కావాలన్న ఆలోచనా సహజం. ఈ ప్రవృత్తిని అధ్యయనం చేసి, ఆనుపానులు గ్రహించి మహర్షులే మార్గదర్శనం చేశారో, వారి బోధనలు గ్రహించి మనిషే అలా మారాడో కానీ భారతీయులు ఆ ప్రవృత్తికి అద్భుతంగా స్పష్టంగా రూపకల్పన చేసికొన్నారు. ఆ ప్రవృత్తినే నాలుగుగా విభజించి పురుషార్థాలని పేరు పెట్టుకొన్నారు. అవే ధర్మ - అర్థ - కామ - మోక్షాలు. వాఙ్మయమంతా ఏదో ఒక కోణంలో ఈ అంశాలనే ప్రస్తావిస్తుంది, ప్రస్తుతిస్తుంది. వాటిలో తలమానికం, ఆ వాఙ్మయానికి మూలకందం శ్రీమహాభారతం. దానికి స్రష్ట, ద్రష్ట, కర్త అన్నీ వ్యాసమహర్షియే. పురుషార్థాలకు సంబంధించి భారతంలో ఉన్నదే మరెక్కడయినా ఉంటుందని, ఇక్కడ లేనిది మరెక్కడ ఉండదని ఘంటాపథంగా చెప్పగలిగాడు వ్యాసమహర్షి.

వేదశాస్త్రాలు దేవఋణం, పితృఋణం, ఋషిఋణ మని మూడు ఋణాలతో మనిషి జన్మిస్తాడని చెప్తే వ్యాసమహర్షి మనుమార్గంలో మనుష్యఋణాన్ని కూడా చెప్పారు. సామాజికదృష్టిలో ఇది చాలా అద్భుతమూ, ఆదరణీయమూ, ఆచరణీయమూ అయిన అంశం. ఆ మనుష్యఋణాన్ని తీర్చుకొనే మార్గంలో ఆనృశంస్యాన్ని (భూతదయ) ఉద్బోధించారు వ్యాసమహర్షి. ప్రాణులన్నింటిపై కరుణ చూపగలగటమే మనుష్య ఋణవిముక్తికి మార్గం. ఆ విలువను ప్రతిపాదించటానికి తనవారినే భీష్మ, ధర్మరాజ; ధృతరాష్ట్ర, దుర్యోధనులను ప్రతినిధులుగా స్వీకరించి భారతాన్ని నిర్మించాడు. తానూ ఆ మహానిర్మాణంలో పాత్ర అయి, తన వారిలోని గుణదోషాలనే హేతుబద్ధంగా ప్రస్తావిస్తూ మనిషి ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో **స్పష్టారుంధతీన్యాయంగా** భారతంలో ప్రదర్శించాడు వ్యాసమహర్షి. అన్నమాటకు ఒదిగి ఉండటంతో పాటు అమ్మమాటకు విలువనివ్వటాన్ని కూడా మానవజాతికి నేర్పాడు. దానికి ఇబ్బంది కలుగుతున్న స్థితిలో తానే స్వయంగా వచ్చి పరిష్కరించాడు (పాండవులందరూ ద్రౌపదిని పెళ్ళి చేసికొనే విషయంలో ద్రుపదుని ఒప్పించి). అమ్మమాటమేరకు తనకవసరం లేకున్నా బిడ్డలను కన్నాడు. తలచుకొంటే చాలు ప్రత్యక్షమవుతానని

అమ్మకు మాట ఇచ్చి దాన్ని నిలబెట్టుకొన్నాడు. మానవుడు సంపాదించవలసిన వాటిల్లో ధనం ముఖ్యం అనుకొంటాం. అంతకన్న ముఖ్యం తపస్సు. లోకకళ్యాణంకోసం ఆ తపస్సును కూడా ఖర్చుచేయటానికి వెనుదీయనివాడు వ్యాసుడు. అందుకే అందరికీ కనువిప్పు కల్గించటానికి భారతమృతవీరులను కూడా చూపించాడు.

మహాభారతం మానవజీవనగమనంలో కరదీపిక. ధర్మాధర్మనిర్ణయంలో ఒరపిడిరాయి. కర్తవ్యాకర్తవ్యజ్ఞానాన్ని ఉపదేశించడంలో ఒక ఉత్తమగురువు. నిరాశకు లోను కాకుండా మనిషి బ్రతకటానికి ఒక ఒరవడి. అదుపులేని, అలవిమాలిన ఆశలను తెంచుకోవటానికి ఒక కొడవలి. తనను తాను సజీవశిల్పంగా తీర్చిదిద్దుకొవటానికి ఒక ఉలి.

అయినా భాషకారణంగా దానిని ప్రేమించే వారు, సంశయించే వారు కూడా చాలామంది దానిని చదవలేకపోతున్నారు. అందుకే తెలుగు వారికి ఆ వ్యాసభావాలను యథాతథంగా అందించేందుకే ఈ ప్రయత్నం - వ్యాస మహాభారతం (తెలుగు వచనం).*

రామాయణ మహాభారతాలను ఆధ్యాత్మికవాదులు నెత్తికెత్తుకొని మోయటం ప్రారంభమైన తరువాత ఇవి ముసలివాళ్ళకు సంబంధించినవి అన్న భావం లోకంలో ప్రబలింది. ఇది దురదృష్టకరం. యౌవనంలోనే వీటిని చదువగలిగితే జీవితాన్ని సరిగా నడుపుకొనే జవజీవాలు గలుగుతాయి. సర్వమానవసౌభ్రాత్రం, సర్వప్రాణిసమత్వం మనస్సులో మెదిలి నిష్కల్మషంగా నడువగల ప్రవృత్తి కలుగుతుంది. ఇహలోకానికి ఇంతకంటే ఏం కావాలి...?

శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్త్రోముఖాబ్జేషు యే
లోకావాం స్థితి మావహన్త్యవిహతాం స్త్రీపుంపయోగోద్భవాం
తే వేదత్రయమూర్తయ స్త్రిపురుషా స్సంపూజితా వ స్సుఖై
ర్భూయాసుః పురుషోత్తమామ్బుజభవ శ్రీకన్ధరా శ్శ్రేయసే

ఇట్లు
అనువక్తలు

---

* మహాభారతం యథాతథంగా ఆవగా అధికపాఠాలతో సహా ఇచ్చాం. అధికపాఠాలు చిన్నసైజులో, బ్రాకెట్లలో ఇచ్చాం.

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
	1. రాజధర్మానుశాసన పర్వము (130)	
1.	కర్ణజన్మను గురించి కుంతి తెలుపుట. (44)★	19
2.	కర్ణునికి కలిగిన విప్రశాపము. (29)	21
3.	కర్ణునికి కలిగిన పరశురామశాపము. (33)	23
4.	కర్ణుని సాయముతో దుర్యోధనుడు కళింగకన్యను అపహరించుట. (21)	25
5.	కర్ణుని పరాక్రమము. (15)	26
6.	ధర్మరాజు స్త్రీలను శపించుట. (13)	27
7.	తనకు రాజ్యమక్కరలేదనియు, వనములకు పోవుదుననియు ధర్మరాజు చెప్పుట. (44)	27
8.	ధనప్రయోజనమును చెప్పి అర్జునుడు ధర్మజుని యజ్ఞము చేయుమనుట. (37)	30
9.	వానప్రస్థ, సన్యాస జీవనములు మంచివని ధర్మజుడు చెప్పుట. (37)	32
10.	భీమసేనుని మాటలు. (28)	35
11.	అర్జునుడు గృహస్థధర్మమును సమర్థించుట. (28)	36
12.	నకులుడు గృహస్థధర్మమును ప్రశంసించుట. (38)	38
13.	సహదేవ వాక్యము. (13+2)	41
14.	ద్రౌపది దండనీతిని గురించి తెలుపుట. ($39\frac{1}{2}$)	42
15.	రాజదండమును గురించి అర్జునుడు వివరించుట. (58)	44
16.	రాజ్యము చేపట్టి యజ్ఞములు చేయుమని భీముడు ధర్మరాజును ప్రోత్సహించుట. (29+1)	47

★ బ్రాకెట్లలోని మొదటి సంఖ్య సంస్కృతంలో ఆ అధ్యాయంలోని శ్లోక సంఖ్య. రెండవ సంఖ్య అధికపాఠశ్లోక సంఖ్య

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
17.	భీముని మాట కాదని ధర్మరాజు మునివృత్తిని ప్రశంసించుట. (24)	49
18.	అర్జునుడు జనకుని కథ చెప్పుట. (40)	50
19.	ధర్మరాజు తన అభిప్రాయమును సమర్థించుకొనుట. (26)	53
20.	యజ్ఞము చేయుమని దేవస్థానుడు ధర్మరాజును పురికొల్పుట. (14)	55
21.	ధర్మ, యజ్ఞాదులు ఆచరింపుమని దేవస్థానుడు ధర్మజునికి బోధించుట. (20)	56
22.	అర్జునుడు క్షేత్రధర్మప్రశంసతో ధర్మజుని ప్రబోధించుట. (15)	57
23.	వ్యాసుడు శంఖలిఖితుల కథ చెప్పుట. (47)	58
24.	వ్యాసుడు ధర్మరాజును రాజ్యపాలనకై ప్రేరణ చేయుట. (34+9)	60
25.	వ్యాసుడు యుధిష్ఠిరునకు సేనజిదుపాఖ్యానమును వివరించుట. (36)	63
26.	యయాతి గాధను చెప్పి యుధిష్ఠిరుడు ధనసంపాదనను నిందించుట. (31)	65
27.	ప్రాణత్యాగమొనరింతు ననిన ధర్మరాజును వ్యాసుడు వారించుట. (33)	67
28.	అశ్మ జనక సంవాదము. (59)	69
29.	షోడశమహారాజుల చరిత్రము. (149)	73
30.	నారదుడు ధర్మరాజుకు సువర్ణష్ఠీవి చరిత్ర చెప్పుట. (44)	81
31.	నారదుడు ధర్మరాజుకు సువర్ణష్ఠీవి చరిత్ర చెప్పుట. (47)	83
32.	వ్యాసుడు ధర్మరాజుకు ప్రాయశ్చిత్తములు తెలుపుట. (25)	86
33.	వ్యాసుడు ధర్మజుని (ప్రాయశ్చిత్తరూపముగా) అశ్వమేధము చేయుటకు ప్రోత్సహించుట. (48)	87
34.	మానవుని కర్తవ్యాకర్తవ్యములు. (32)	90
35.	పాపములకు ప్రాయశ్చిత్తములను చెప్పుట. (51)	92
36.	భక్ష్యాభక్ష్య, పాత్రాపాత్ర వివేకము. (50)	95
37.	యుధిష్ఠిరుడు పురప్రవేశము చేయుట. (49)	98
38.	చార్వాకవధోపాఖ్యానము. (37)	100

విషయసూచిక

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
39.	చార్వాకుని వరదానము గురించి శ్రీకృష్ణుడు చెప్పుట. (13)	102
40.	ధర్మజుని పట్టాభిషేకము. (24)	103
41.	ధర్మజుడు భీమాదులకు కర్తవ్యములు నిర్ణయించుట. (19)	104
42.	ధర్మరాజు జ్ఞాతులకు శ్రాద్ధక్రియలు చేయించుట. (12)	105
43.	ధర్మరాజు కృష్ణుని స్తుతించుట. (17+1)	106
44.	గృహ విభాగము. (16)	107
45.	ధ్యానాసక్తుడయిన శ్రీకృష్ణుని ధర్మరాజు ప్రశ్నించుట. (20)	108
46.	మహాపురుష స్తవోపాఖ్యానము. (35)	109
47.	భీష్మస్తవరాజము. (109+33)	111
48.	పరశురామోపాఖ్యానము. (16)	119
49.	పరశురాముని చరిత్రము. (89)	120
50.	శ్రీకృష్ణుడు భీష్ముని గుణప్రభావములను వర్ణించుట. (38)	124
51.	శ్రీకృష్ణ వాక్యము. (18)	126
52.	యుధిష్ఠిరాదుల ఆగమనము. (34)	127
53.	కృష్ణాదులు భీష్ముని కడకు చేరుట. (28)	129
54.	భీష్మ శ్రీకృష్ణుల సంభాషణము. (39)	131
55.	భీష్ముడు యుధిష్ఠిరుని ఊరడించుట. (22)	133
56.	భీష్ముడు ధర్మజునికి ధర్మ ముపదేశించుట. (61)	134
57.	రాజయొక్క ధర్మానుకూల ప్రవర్తన. (45)	137
58.	రాజ్యరక్షా సాధనములు భీష్ముడు చెప్పుట - ప్రథమదివస సమాప్తి. (30)	140
59.	నీతిశాస్త్ర చరిత్ర - పృథుచక్రవర్తి. (145)	142
60.	వర్ణ ధర్మముల వర్ణనము. (55)	150
61.	భీష్ముడు ఆశ్రమ ధర్మములను వివరించుట. (21)	153

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
62.	బ్రాహ్మణ ధర్మములు - కర్తవ్య పాలనము. (11)	155
63.	వర్ణాశ్రమధర్మములలో రాజధర్మ వైశిష్ట్యము. (30)	155
64.	వర్ణాశ్రమ ధర్మములు. (30)	158
65.	ఇంద్ర (రూపుడయిన విష్ణువు) మాంధాతల సంవాదము. (35)	160
66.	రాజధర్మము - ఆశ్రమధర్మాలు. (43)	162
67.	రాష్ట్ర ప్రజల కర్తవ్యము. (39)	165
68.	బృహస్పతి వసుమను సంవాదము. (61+1)	167
69.	రాజయొక్క విశేష కర్తవ్యములు. ($105+11\frac{1}{2}$)	170
70.	రాజకు ఉండవలసిన ముప్పది ఆరుగుణాలు. (14)	177
71.	రాజ్యపాలనమునకు ప్రధాన విషయము. (33)	178
72.	రాజ పురోహిత లక్షణములు. (25)	180
73.	ఐల కశ్యప సంవాదము. ($32+7\frac{1}{2}$)	181
74.	ముచుకుందోపాఖ్యానము. (22)	184
75.	రాజకర్తవ్యమును భీష్ముడు చెప్పుట. (37)	185
76.	బ్రాహ్మణ ధర్మకథనము. (14+4)	188
77.	కైకయోపాఖ్యానము. (34+5)	189
78.	బ్రాహ్మణుని వైశ్యధర్మ జీవనము. (44)	191
79.	ఋత్విక్కుల లక్షణము - తపో విశేషము. (21)	194
80.	సచివ లక్షణము. (41)	195
81.	వాసుదేవ నారద సంవాదము. (30)	197
82.	కాలకవృక్షీయోపాఖ్యానము. (70)	199
83.	సభ్యుల లక్షణములు చెప్పుట. (57)	203
84.	శక్ర బృహస్పతి సంవాదము. (11)	207

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
85.	అమాత్య విభాగము. (34)	207
86.	దుర్గ పరీక్ష. (33)	209
87.	రాష్ట్ర రక్షణ సంగ్రహములు. (40)	211
88.	రాజు కోశమును వృద్ధిపరచుట. (33)	214
89.	రాష్ట్ర రక్షణము. (26)	216
90.	ఉతథ్య గీత - 1. (ఉతథ్య మాంధాతృ సంవాదము) (41)	218
91.	ఉతథ్య గీత - 2. (60)	220
92.	వామదేవ గీత - 1. (19)	223
93.	వామదేవ గీత - 2. (39+1)	225
94.	వామదేవ గీత - 3. (13+5)	227
95.	విజిగీషమాణ వృత్తము - 1. (22)	229
96.	రాజు యొక్క ధర్మబద్ధ ప్రవర్తన - విజిగీషమాణవృత్తము - 2. (24)	230
97.	విజిగీషమాణవృత్తము - 3. (32)	232
98.	ఇంద్రాంబరీష సంవాదము - 4. (51+23 $\frac{1}{2}$)	234
99.	విజిగీషమాణవృత్తము - 5. (18)	239
100.	సేనానీతి కథనము. (50)	240
101.	విభిన్నదేశయోధుల స్వరూపబల స్వభావాదుల వర్ణనము. (20)	243
102.	సేనా నీతి. (41)	245
103.	ఇంద్ర బృహస్పతుల సంవాదము. (53)	247
104.	క్షేమదర్శి కాలకవృక్షీయుల సంవాదము. (54+4 $\frac{1}{2}$)	251
105.	రాజ్యప్రాప్తికొఱకు కాలకవృక్షీయ ముని చెప్పిన ఉపాయములు. (25)	255
106.	విదేహరాజు కోసల రాజకుమారుని అల్లునిగా చేసికొనుట. (28)	257
107.	గణతంత్రరాజనీతి. (32)	259

అధ్యాయ సంఖ్య	విషయము	పుట సంఖ్య
108.	మాతాపితరులను, గురువును సేవించుటవలన కలుగు మహిమ. (33)	262
109.	సత్యాసత్య వివేచనము - ధర్మలక్షణము - లౌకిక నీతి. (30+2 $\frac{1}{2}$)	264
110.	దుఃఖనివారణోపాయములు. (30+3 $\frac{1}{2}$)	266
111.	వ్యాఘ్రగోమాయు సంవాదము. (90+1)	268
112.	ఉష్ట్రగీవోపాఖ్యానము. (21)	274
113.	సరిత్సాగర సంవాదము. (14)	276
114.	టిట్టిభవృత్తాంతము. (21)	277
115.	రాజసహాయకుల గుణములు. (23)	278
116.	ఋషిశ్వాన సంవాదము - 1. (23+1)	280
117.	ఋషిశ్వాన సంవాదము - 2. (23+7)	282
118.	ఋషిశ్వాన సంవాదము - 3. (28+7)	283
119.	ఋషిశ్వాన సంవాదము - 4. (20)	286
120.	రాజధర్మకథనము - 1. (56)	287
121.	రాజధర్మకథనము - 2. (60)	292
122.	దండోత్పత్తి క్షత్రియులకు పరంపరాగతమగుట. (56)	296
123.	కామందక - ఆంగరిష్ఠ సంవాదము. (25)	300
124.	శీల వర్ణనము. (71)	302
125.	ఋషభ గీత - 1. (19)	307
126.	ఋషభ గీత - 2. (19)	308
127.	ఋషభ గీత - 3. (26)	309
128.	ఋషభ గీత - 4. (27)	310
129.	యమగౌతమసంవాదము. (11)	312
130.	ఆపదలందు రాజు యొక్క ధర్మం. (50)	313

॥ శ్రీమాత్రే నమః ॥

వ్యాస
మహాభారతం
(తెలుగు వచనం)
శాంతి పర్వం - 1

1. కర్ణజన్మను గురించి కుంతి తెలుపుట.

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

నరుల మనస్సులే నివాస స్థానమైన నారాయణునికీ, నరోత్తమునికీ, సరస్వతీ దేవికీ, వ్యాసమహర్షికీ నమస్కరించి శ్రీమహాభారతమును చదువవలెను/ చెప్పవలెను.

వైశంపాయనుడు ఇట్లు చెపుతున్నాడు. "పాండవులు, విదురుడు, ధృతరాష్ట్రుడు, భరతవంశ స్త్రీలు తమవారందరికీ, స్నేహితులకూ, ఉదక్రపదానాలు చేశారు. పాండవులు ఒక నెల రోజులు శౌచకర్మలు చేసుకొంటూ, పురం వెలుపల ఉన్నారు. ఉదక ప్రదానాలు చేసిన ధర్మరాజు దగ్గరకు మహాత్ములయిన సిద్ధులు, బ్రహ్మర్షివర్యులూ వచ్చారు. వారిలో వ్యాసుడు, నారదుడు, దేవలుడు, దేవస్థానుడు, కణ్వుడు, వారి శిష్యులూ ఉన్నారు. ఇంకా ప్రజ్ఞావంతులయిన వేదవిద్వాంసులు, గృహస్థులు, స్నాతకులు, సజ్జనులు ధర్మరాజును సందర్శించారు. మహర్షులంతా యథావిధిగా పూజింపబడి వారికి తగిన ఉన్నతాసనాలపై కూర్చున్నారు. వందల వేల కొద్దీ విప్రులు గంగాతీరంలో శోక వ్యాకులుడయిన ధర్మరాజును ఓదారుస్తూ, అతనిచుట్టూ కూర్చున్నారు. అపుడు వ్యాసాది మహర్షులతో మాట్లాడి, నారదుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు.

"ధర్మజా ! నీ భుజపరాక్రమంతోనూ, కృష్ణుని అనుగ్రహంతోనూ, ఈ భూమిని అంతటిని ధార్మికంగా జయించావు. లోకభయంకరమైన ఈ యుద్ధంనుండి దైవవశాత్తు విముక్తి పొందావు. రాజ ధర్మం మీద ఆసక్తితో ఉన్నా, నీకిది ఏమయినా సంతోషం కలిగిస్తోందా ? శత్రువులందరూ చనిపోయారు. మిత్రులను సంతోష పరచగలవు. ఈ రాజ్యసంపదను పొందావు. నీకే శోకమూ లేదు కదా !" యుధిష్ఠిరుడు అన్నాడు. "కృష్ణుని

ఆశ్రయంతోనూ, విప్రుల అనుగ్రహంతోనూ, భీమార్జునుల బలంతోనూ భూమి అంతా జయింప బడింది. కాని నిత్యమూ, నా కొక మహాదుఃఖం మనసును పీడిస్తోంది. మిక్కిలి లోభంతో ఈ నా జ్ఞాతుల నందరినీ చంపుకొన్నానని. అభిమన్యుని, ఉపపాండవులను, ప్రియమైన పుత్రులను చంపుకొన్న నాకు, ఈ విజయం విజయం అనిపించటంలేదు. ఇక్కడ నుండి తిరిగి వెళ్లిన కృష్ణునితో ద్వారకా నగరంలో ఉన్న మాయింటి కోడలు సుభద్ర ఏం అంటుందో? (అభిమన్యుని గురించి).ఈ ద్రౌపది పుత్రులంతా చనిపోయారు. బంధువులందరూ మరణించారు. దీనావస్థలో ఉంది. అయినా మాకు ప్రియమూ, హితమూ చెయ్యాలనుకొంటోంది. ఈ విషయం నన్ను మరింత బాధిస్తోంది. ఇంకో విషయం మహర్షీ ! నీకు చెప్పాలి. కుంతీదేవి ఇప్పటిదాకా దాచిపెట్టిన విషయం ఒకటి నన్ను మరింత బాధిస్తోంది. కుంతికి రహస్యంగా పుట్టిన వాడట కర్ణుడు. మాకతడు అన్న అవుతాడు - పదివేల ఏనుగుల బలం కలవాడు - యుద్ధంలో ఎదురులేని వీరుడు. సింహంలా చలాకీగా నడుస్తాడు. కరుణాపరుడు, దాత, నియమశీలుడు, ధృతరాష్ట్రుని పుత్రులకు ఆశ్రయం, అభిమాని, తీవ్ర పరాక్రమం కలవాడు, నిత్యమూ మాపై యుద్ధానికి కాలుదువ్వుతూ ఉండేవాడు. వేగంగా అస్త్రాలు ప్రయోగిస్తూ, చిత్రంగా యుద్ధంచేసేవాడు. క్రియాపరుడు. అద్భుత పరాక్రమం కలవాడు. ఉదక ప్రదానం చేసే సమయంలో మా అమ్మ తనకూ, సూర్యునికీ కల్గిన పుత్రుడు కర్ణుడని చెప్పింది. సర్వగుణోపేతుడయిన కొడుకును ఎపుడో నీళ్లలో వదిలి వేసిందిట. పెట్టెలో పెట్టి గంగానదిలో ముంచేసిందిట. వానిని సూతపుత్రుడని, రాధాపుత్రుడనీ ఈ లోకం అనుకొంది. నిజానికతడు కుంతి పెద్దకొడుకు - మాకు అన్నగారు. అది తెలియక, తమ్ముడనయిన నేనే రాజ్యలోభంతో చంపుకొన్నాను. దూదిపింజలను దహించే అగ్నిలాగా, ఈ విషయం నా శరీరమంతటినీ దహించి వేస్తోంది. ఈ విషయం అర్జునునికి తెలియదు. భీమునికి తెలియదు. నకులసహదేవులకు తెలియదు. కాని నియమశీలుడయిన కర్ణునికి తెలుసు. మాకు యుద్ధం రాకుండా ఉండాలని, నీవు నా పుత్రుడ వని చెప్పటానికి మాతల్లి అతని దగ్గరకు వెళ్లిందని విన్నాను. కాని ఆ మహాత్ముడు కుంతీమాత కోరిక తీర్చలేదట. పైగా తల్లి కుంతితో ఇలా అన్నాడని కూడా విన్నాను. "ఈ యుద్ధంలో నేను దుర్యోధనుని విడవలేను. అది నా పట్ల దుర్జనత్వమూ, క్రూరత్వమూ, కృతఘ్నత కలిగిస్తుంది. నీ ఇష్టప్రకారం ధర్మరాజుతో నేను కలిస్తే, యుద్ధంలో అర్జునునికి భయపడి ఇలా చేశా"నని అనుకొంటారు ప్రజలు. అందుచేత యుద్ధంలో కృష్ణ సహితుడైన అర్జునుని జయించి, తరువాత ధర్మరాజుతో సంధి చేసుకొంటాను" అని కూడా అన్నాడట. అపుడు పెద్దమనసున్న

కర్ణుని కుంతి ఇలా అడిగిందిట - "నీవు నీయిష్టం వచ్చినట్లు అర్జునునితో యుద్ధం చెయ్యి, కాని మిగిలిన నల్గురికీ అభయం ఇయ్యి." వణికి పోయే తల్లికి నమస్కరించి అతడిలా అన్నాడు. "దేవీ ! మిగిలిన నీ కొడుకులు నలుగురినీ చంపను - నీకు ఎపుడయినా కాని అయిదుగురే కొడుకులు - కర్ణుడు చనిపోతే అర్జునునితో అయిదుగురు - అర్జునుడే చనిపోతే కర్ణునితో అయిదుగురు. "

పుత్రహితాన్ని కోరే కుంతి ఇంకా కర్ణునితో ఇలా అంది. "నీవు శుభం కోరే నీ తమ్ములకు మేలు చెయ్యి." ఇలా చెప్పి కుంతి కర్ణుని విడిచి యింటికి వెళ్లింది. వీరసోదరుడయిన కర్ణుడు అర్జునునిచేత చనిపోయాడేకాని తనకు, కుంతికీ మధ్య జరిగిన రహస్య విషయాన్ని బయట పెట్టలేదు. మహాధనుర్ధారి అయిన కర్ణుడు అర్జునుని చేత చనిపోయాడు. తరువాత ఇపుడు కుంతీదేవి మాటలవల్ల నాకు కర్ణుడు అన్నగారని తెలుసుకొన్నాను. అందుచేత సోదరుని చంపుకొన్నందుకు నా మనస్సు ఎంతగానో పరితపిస్తోంది. కర్ణార్జునుల సహాయమే ఉంటే నేను ఇంద్రునయినా జయిస్తాను. దుర్మార్గులయిన కౌరవులవల్ల సభలో బాధ చెందుతున్నపుడు, నాకు ఒక్కసారిగా వచ్చిన కోపం ఎందుకో కర్ణుని చూసి తగ్గిపోయేది. దుర్యోధనుని హితం కోసం, ద్యూతసభలో కర్ణుని కటువైన మాటలు విన్నపుడు కల్గిన కోపం, వాని పాదాలు చూసిన వెంటనే మాయమై పోయేది. ఆ కర్ణుని పాదాలు అచ్చంగా కుంతి పాదాలులాగే ఉండేవి - అనుకొనేవాడిని. కుంతికీ, కర్ణునికీ ఈ సమాన పాదాలు ఎలా వచ్చాయా ? అని ఎంత ఆలోచించినా కారణం తెలిసేదికాదు. నారదా ! అసలు అతని యుద్ధంలో భూమిలో రథచక్రం ఎలా దించుకుపోయింది ? నా సోదరుడు భూదేవి శాపాన్ని ఎలా పొందాడో నాకు మీరే చెప్పదగినవారు. భగవన్ ! మీరు అన్నీ తెలిసినవారు. జరిగినవి, జరగబోయేవి కూడా మీకు తెలుసు. మీ నుండి ఉన్నదున్నట్టు అంతా వినాలని అనుకొంటున్నాను."

2. కర్ణునికి కలిగిన విప్రశాపము.

మహాభక్త అయిన నారదుడు కర్ణుడెలా శపింపబడ్డాడో అంతా చెప్పనారంభించాడు. "మహాభుజా ! నీవన్నట్లుగానే కర్ణార్జును లిద్దరికీ యుద్ధంలో (తట్టుకో) సాధింప లేని విషయమే లేదు. ఈ విషయం దేవరహస్యం. అది పూర్వం ఎలా జరిగిందో నీకు చెపుతాను విను. లోకంలోని క్షత్రియ సముదాయమంతా, శస్త్రఘాతాలతో పవిత్రమై, స్వర్గానికి ఎలా చేరుతుందా అని ఆలోచించి దేవతలంతా కర్ణుని సృష్టింపజేశారు. సంఘర్షణకు మూలమతడే. ఆ బాలుడు మిక్కిలి తేజస్సుతో సూతపుత్రు డయ్యాడు. అతడు ద్రోణుని

నుండి ధనుర్వేదం అభ్యసించాడు. రాజా ! అతడు భీముని బలాన్ని, అర్జునుని నేర్పరితనాన్ని, నీ తెలివినీ, కవలల వినయాన్నీ, చిన్నతనంలో అర్జునునికి కృష్ణునికిగల స్నేహాన్ని, మీకు గల ప్రజల అనురాగాన్ని తలచుకొని కుతకుతలాడి పోయేవాడు. దుర్యోధనునితో అతడు చిన్నతనంలో స్నేహం చేశాడు. మిమ్మల్ని నిత్యమూ ద్వేషించేవాడు. ఈ రెండు-ఒకటి దైవంవల్ల, రెండవది స్వభావం వల్లనూ కలిగాయి. విలువిద్యలో అర్జునుని పరాక్రమం చూసి, కర్ణుడు ద్రోణుని దగ్గరకు వెళ్లి రహస్యంగా ఇలా అన్నాడు. "బ్రహ్మాస్త్రం యొక్క ప్రయోగాన్నీ, ఉపసంహారాన్నీ రహస్యంతో సహా తెలుసుకోవాలనుకొంటున్నాను. నేను అర్జునునితో సమానంగా యుద్ధం చేయాలని నా ఉద్దేశ్యం. మీ ప్రేమ శిష్యుల మీద, పుత్రునిమీద సమానంగా ఉంటుంది అనే మాట నిశ్చయం. ధనుర్విద్యా విశారదులు మీ అనుగ్రహంతో, నన్ను అస్త్రాలు నేర్వని వాడు అని అనుకోకూడదు." అర్జునునితో సమానం కావాలనే మాటలోని కర్ణుని దుష్టబుద్ధిని తెలుసుకొని ద్రోణుడు ఇలా అన్నాడు. "యథావిధిగా నియమశీలుడయిన (బ్రహ్మచర్యం చేసిన) బ్రాహ్మణుడు కాని, తపస్వి అయిన క్షత్రియుడు కాని బ్రహ్మాస్త్రం పొందాలి. ఇతరులు ఏ విధంగానూ పొందరాదు."

ద్రోణుని ఆ మాటలు విని, కర్ణుడు అతనికి నమస్కారం చేసి, అతని నుండి వెంటనే మహేంద్రపర్వతం మీద ఉన్న పరశురాముని దగ్గరకు వెళ్లాడు. అతడు పరశురాముని చేరి, శిరసువంచి నమస్కరించి, 'నేను భృగువంశంలో పుట్టిన బ్రాహ్మణుడను' అని చెప్పుకొని అతనిని చేరాడు. పరశురాముడు అతని గోత్రాదికమంతా అడిగి, తెలిసికొని, ఎంతో ప్రీతి చెంది, "సరే ! నీకు స్వాగతం - ఇక్కడే ఉండు" అని కర్ణుని (శిష్యునిగా) గ్రహించాడు. స్వర్గసమానమైన మహేంద్ర పర్వతం మీద ఉన్నపుడే, కర్ణునికి దేవతలతో, రాక్షసులతో, యక్షులతో, గంధర్వులతో కలయిక ఏర్పడింది. కర్ణుడు అక్కడే పరశురాముని నుండి యథావిధిగా ధనుర్వేదం అభ్యసించాడు. దేవదానవులకూ, రాక్షసులకూ మిక్కిలి ప్రియుడయ్యాడు.

అతడు ఒకనాడు సముద్రతీరంలోని ఆశ్రమ సమీపంలో, ఒక్కడూ కత్తిని, ధనుస్సును గ్రహించి తిరుగుతున్నాడు. అనుకోకుండా అతడు, అగ్నిహోత్రం చేసుకొనే ఒక బ్రాహ్మణుని హోమధేనువును తెలియక చంపాడు. తెలియక చంపానని తెలుసుకొని ఆ విషయం ఆ బ్రాహ్మణునికి చెప్పాడు. కర్ణుడు ఆ బ్రాహ్మణుని వేడుకొంటూ ఇలా అన్నాడు. "భగవన్ ! మీధేనువని తెలియక చంపాను. నన్ను అనుగ్రహించండి" అంటూ పదే పదే బ్రతిమలాడాడు. ఆ బ్రాహ్మణుడు కోపించి, మాటలతోనే బెదిరిస్తున్నట్లు ఇలా అన్నాడు. "దురాచారా ! నీవు చంపదగినవాడవు. దీనికి తగిన ఫలం పొందుతావు. నీవు

ఎవరితో నిత్యమూ పోటీపడుతున్నావో, ఏ పని కోసం సదా ప్రయత్నిస్తున్నావో, (ఎవరిని జయించాలనుకొంటున్నావో) అతనితో యుద్ధం చేసేటప్పుడు నీ రథచక్రం భూమిలో దిగబడి పోతుంది. నీ రథచక్రం భూమిలో దిగబడిపోయి ఏం చెయ్యాలో తెలియని నీ శిరస్సును, నీశత్రువు విక్రమించి పడగొడతాడు. పో ! నరాధమా ! ఈ నాధేనువును ప్రమత్తుడవై నీవు చంపావు. అలాగే ప్రమత్తుడవైన నీ యొక్క శిరస్సును నీ శత్రువు పడగొడతాడు. " ఇలా శపింపబడిన తరువాత కర్ణుడు ఆ బ్రాహ్మణునికి ఆవులూ, ధనమూ, రత్నాలూ ఇచ్చి సంతోష పెట్టాడు. అపుడా బ్రాహ్మణుడు మళ్లీ ఇలా అన్నాడు. "లోకాలన్నీ ఏకమయినా నామాటను అసత్యం చేయలేవు. ఉంటే ఉండు - వెళితే వెళ్లు - నీయిష్టం వచ్చినట్లు చేసుకో !" బ్రాహ్మణుని ఆ మాటలు విని, కర్ణుడు దీనంగా తల వంచుకొని, ఆ విషయమే మనసులో తలచుకొంటూ భయంతో పరశురాముని దగ్గరకు వెళ్లాడు."

3. కర్ణునికి కలిగిన పరశురామశాపము.

నారదుడు ఇలా చెప్పాడు. "కర్ణుని భుజపరాక్రమంతోనూ, భక్తితోనూ, ఇంద్రియ నిగ్రహంతోనూ, గురు శుశ్రూషతోనూ పరశురాముడు సంతృప్తి చెందాడు. తరువాత తపస్వి అయిన పరశురాముడు, తపస్వి అయిన కర్ణునికి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగోపసంహారాలతో సహా, యథావిధిగా ఏకాగ్రతతో చెప్పాడు. బ్రహ్మాస్త్రం తెలిసిన కర్ణుడు పరశురాముని ఆశ్రమంలో ఉంటూ, ధనుర్వేదంలో అద్భుతమయిన పరిశ్రమ చేశాడు. ఒకరోజు పరశురాముడు కర్ణునితో సహా, ఆశ్రమ సమీపంలో తిరిగాడు. ఆ రోజున ఉపవాస దీక్షలో ఉండి బాగా అలసిపోయాడు. సాన్నిహిత్యం వల్ల కలిగిన సౌహార్దంతో, పరశురాముడు కర్ణుని తొడ మీద తలపెట్టుకొని అలసటతో నిద్రించాడు. అపుడు శ్లేష్మ మేదస్సులనూ, రక్తమాంసాలనూ తినే కృమి ఒకటి, కర్ణుని సమీపానికి వచ్చింది - దాని స్పర్శయే చాలా దారుణంగా ఉంటుంది. రక్తంత్రాగే ఆ పురుగు కర్ణునితొడ దగ్గరచేరి తొడ కొరికింది. గురువుగారు మేల్కొంటారేమో అనే భయంతో, కర్ణునికి దానిని విదలించటానికిగాని, చంపటానికి కాని చేత కాలేదు. ఆ పురుగు తొడను కొరికి రక్తం త్రాగుతున్నా సరే, గురువుగారు లేస్తారేమో అని శంకించి, ఆ పురుగును కర్ణుడు ఉపేక్షించాడు. కర్ణుడు పరశురాముని కదలించకుండా, వ్యథపెట్టకుండా సహింపరాని ఆ బాధను ధైర్యంగా తట్టుకొని భరించాడు. కర్ణుని తొడనుండి కారే రక్తం తన శరీరానికి తగిలేసరికి, తేజస్వి అయిన భార్గవుడు భయపడి లేచి, ఇలా అన్నాడు. "ఏమిటిది? ఇలా రక్తంతో అశుచినయ్యా నేమిటి ? ఏం

చేస్తున్నావు ? నిర్భయంగా ఉన్నదున్నట్లు నాకు చెప్పు" అన్నాడు. అపుడు కర్ణుడు 'తన తొడను ఒకపురుగు కొరుకుతోంది' అని చెప్పాడు. వెంటనే భార్గవుడు ఆ కృమిని చూశాడు. అది పంది వలె ఉంది. ఎనిమిది కాళ్లు, వాడి కోరలు, కలిగి సూదుల వంటి వెంట్రుకలతో కప్పబడిన శరీరం కల అలర్క మనే పురుగును చూశాడు భార్గవుడు.

పరశురాముడు దాన్ని చూడగానే ఆ పురుగు ప్రాణాలు పోయాయి. అది మాత్రం ఆ రక్తంతో తడిసి ఉంది. అది చాలా ఆశ్చర్య మనిపించింది. అంతలో, అంతరిక్షంలో పెద్ద రూపంతో మేఘం ఎక్కి ఒక రాక్షసుడు కనిపించాడు. వాడు నల్లగా ఉన్నాడు. మెడ మాత్రం ఎర్రగా ఉంది. అతడు రామునికి అంజలించి నిండుమనసుతో ఇలా పలికాడు. "భృగువంశోత్తమా ! నీకు శుభం కలుగుగాక. ఎలా వచ్చానో అలా వెళ్లి పోతాను. మీవల్ల నేను ఈ నరకం నుండి బయటపడ్డాను. మీకు శుభమస్తు - నమస్కారం - నాకు మీరు ప్రియం చేశారు." అపుడు పరశురాముడు ఇలా అడిగాడు. "నీ వెవరివి ? నరకం ఎందుకు పొందావు ? చెప్పు అదేమిటో !" అన్నాడు. అపుడు అతడు చెపుతున్నాడు. "నేను పూర్వం దంశుడనే రాక్షసుడిని. పూర్వపు దేవయుగంలో, భృగునితో సమాన వయస్సు కలవాడిని. నేను భృగువు యొక్క ప్రియపత్నిని బలవంతాన అపహరించాను. అపుడు మహర్షిశాపంతో కృమినై భూమి మీద పడ్డాను. నీ ముత్తాత అయిన భృగుమహర్షి క్రోధంతో ఇలా శపించాడు. "పాపీ ! నీవు మూత్ర శ్లేష్మాలు తింటూ నరకం అనుభవిస్తావు".

వారిని నేను ఈ శాపానికి అంతం ఎపుడు కలుగుతుందో చెప్పమని ప్రార్థించాను. అపుడు భృగుమహర్షి 'భార్గవరాముని వల్ల జరుగుతుంది' అని చెప్పారు. ఈ నరకం నాకు అలా ప్రాప్తించింది. మహాత్మా ! నిన్ను చేరడం వల్ల నాకు ఆ నీచజన్మ నుండి విముక్తి లభించింది." ఇలా చెప్పి ఆ రాక్షసుడు రామునికి నమస్కరించి వెళ్లిపోయాడు.

పరశురాముడు క్రోధంతో కర్ణునితో ఇలా అన్నాడు. 'మూఢా ! మిక్కిలి దుఃఖం కలిగించే ఈ పని బ్రాహ్మణుడెవడూ ఎన్నడూ సహించలేడు. నీ ధైర్యం క్షత్రియ సంబంధిగా ఉంది. మంచిమనసుతో నిజం చెప్పు.' కర్ణుడు మహర్షిశాపానికి భయపడి, వేడుకొంటూ, రామునితో ఇలా అన్నాడు. "బ్రాహ్మణ క్షత్రియులకంటె ఇతరమైన సూతజాతిలో పుట్టిన వాడిని. రాధేయుడనీ, కర్ణుడనీ నన్ను ప్రజలు అంటూ ఉంటారు. అస్త్రలోభంతో నేనీపని చేశాను. నన్ను అనుగ్రహించండి. వేద విద్యాప్రదాత అయిన గురువూ, తండ్రీ ఇద్దరూ సమానులే - సందేహం లేదు - అందుచేత భార్గవా ! నాగోత్రం భార్గవ గోత్రం అని మీ దగ్గర చెప్పాను." అని కర్ణుడు వణికి పోతూ, అంజలిస్తూ పాదాభివందనం చేశాడు. భార్గవుడు ఎంతో క్రోధంతో దహించి వేసేటట్లు చూస్తూ, కర్ణునితో ఇలా

అన్నాడు. "మూఢా ! అస్త్రం మీది అత్యాశతో అసత్యంగా, కపటంగా ప్రవర్తించావు. అందుచేత నీకు సమానుని వల్ల మరణకాలం వచ్చేవరకూ మాత్రమే, ఈ బ్రహ్మాస్త్రం గుర్తుఉంటుంది. వధసమయానికి గుర్తుఉండదు. అబ్రాహ్మణుని దగ్గర బ్రహ్మాస్త్రం ఎన్నడూ స్థిరంగా ఉండదు. ఇక్కడి నుండి ఇపుడే పో ! అసత్యం పలికిన నీకు ఇక్కడ స్థానం లేదు. కాని నీతో యుద్ధంలో సమానుడైన క్షత్రియుడు భూమి మీదే పుట్టడు." పరశురాముడు ఇలా చెప్పిన తరువాత, కర్ణుడు యథావిధిగా నమస్కరించి వెళ్లిపోయాడు. దుర్యోధనుని చేరి 'అస్త్రజ్ఞానం పొందాను' అని కూడా చెప్పాడు."

4. కర్ణుని సాయముతో దుర్యోధనుడు కళింగకన్యను అపహరించుట.

"రాజా ! పరశురాముని దగ్గర ఈ విధంగా అస్త్రం పొంది, కర్ణుడు దుర్యోధనునితో కలిసి సంతోషంగా ఉన్నాడు. ఒకసారి కళింగదేశంలో రాజయిన చిత్రాంగదుని పురంలో స్వయంవరానికి రాజులంతా వచ్చారు. ఆ నగరం పేరు శ్రీమద్రాజపురం. రాజులంతా అక్కడికి వచ్చారని దుర్యోధనుడు విని, బంగారు రథం ఎక్కి కర్ణునితో సహా వెళ్లాడు. శిశుపాలుడు, జరాసంధుడు, భీష్మకుడు, వక్రుడు, కపోతరోముడు, నీలుడు, రుక్మి, స్త్రీ రాజ్యానికి అధిపతి అయిన శృగాలుడు, అశోకుడు, శతధన్వుడు, భోజుడు, వీరుడు వచ్చారు. ఇంకా ఎందరో దక్షిణదేశాల రాజులూ, వచ్చారు. తూర్పు, ఉత్తర దిక్కుల రాజులూ, మ్లేచ్ఛులూ, ఆర్యులు కూడా వచ్చారు. అందరూ బంగారు భుజకీర్తులు ధరించారు. మేలిమి బంగారు కాంతితో ప్రకాశించే శరీరాలతో ఉన్నారు. అంతా బలిష్ఠులై పెద్ద పులులవలె ఉన్నారు. ఆ రాజులందరూ కూర్చున్నాక దాదులతోనూ, షండులతోనూ కూడిన రాజకన్య రంగంలో ప్రవేశించింది. ఇంకా పరిచయ పూర్వకంగా రాజుల పేర్లు వినవస్తూనే ఉన్నాయి. అపుడే రాజకన్య దుర్యోధనుని దాటి ముందుకు వెళ్లిపోయింది. ఆమె అలా తనను దాటి వెళ్లిపోవడం దుర్యోధనుడు సహించలేకపోయాడు. రాజులను కించపరుస్తూ ఆమెను అడ్డుకొన్నాడు. భీష్మద్రోణుల ఆశ్రయంతోనూ, బలగర్వంతోనూ ఉన్మత్తుడయిన రాజు దుర్యోధనుడు ఆ కన్యను రథ మెక్కించి తీసుకొని పోయాడు. కర్ణుడు ఖడ్గం, తలత్రమూ అంగుళిత్రాలూ ధరించి, రథమెక్కి దుర్యోధనుని అనుసరించాడు. వెంటనే "కవచాలు ధరించి, రథాలు సిద్ధం చేసి యుద్ధానికి బయలుదేరండి" అనే రాజుల సమ్మర్దం ఎక్కువయింది. ఆ రాజులు క్రోధంతో కర్ణ దుర్యోధనులపై శరవర్షం కురిపిస్తూ వెంటపడ్డారు. మేఘాలు పర్వతాల మీద వర్షం కురిపించినట్లుంది ఆ శరవర్షం. మీదపడే ఆ రాజుల ధనుస్సులనూ, బాణాలనూ ఒక్కొక్క బాణంతో కర్ణుడు నేల

మీద పడగొట్టాడు. దానితో కొంతమందికి ధనుస్సులు విరిగిపోయాయి - కొంతమంది ధనుస్సులు ఎక్కుపెట్టుకొంటున్నారు - కొంతమంది బాణాలనూ, రథ, శక్తి గదలనూ కర్ణుడు తన నైపుణ్యంతో విరుగగొట్టి వ్యాకులపరిచాడు - మరికొంతమంది సారథులను చంపి, రాజులందరినీ జయించాడు. ఆ రాజులు స్వయంగా అశ్వాలను నడుపుకొంటూ, 'రక్షించండి, రక్షించండి' అని కేకలు వేస్తూ, భగ్నమనోరథులై యుద్ధం విడిచి పారిపోయారు. దుర్యోధనుడు మాత్రం కర్ణుని రక్షణతో, సంతోషంతో రాజకన్యను తీసికొని హస్తినాపురానికి వెళ్లి పోయాడు."

5. కర్ణుని పరాక్రమము.

నారదుడు ఇలా చెప్పాడు. "కర్ణుని బలం ప్రకటింప బడటం విని మగధ రాజయిన జరాసంధుడు కర్ణుని *ద్వైరథయుద్ధానికి పిలిచాడు. దివ్యాస్త్ర వేత్తలయిన కర్ణజరాసంధులకు యుద్ధం జరిగింది. అనేక విధాలయిన అస్త్రశస్త్రాలను ఇద్దరూ ఒకరిపై మరొకరు వర్షించుకొన్నారు. కొంతసేపటికి ఇరువురి బాణాలూ అయిపోయాయి. ధనుస్సులు విరిగి పోయాయి. కత్తులు విరిగి నేల మీదకు చేరారు - ఇద్దరూ బలిష్ఠులే - బాహుయుద్ధానికి సిద్ధపడ్డారు. కర్ణుడు జరాసంధునితో బాహుయుద్ధం చేస్తూ, జర రాక్షసి సంధించిన జరాసంధుని దేహ సంధులను విరగ గొట్టాడు. విరిగిన కీళ్లతో ఉన్న తన శరీరం చూసుకొని, జరాసంధుడు కర్ణునితో వైరం విడిచి "ప్రీతోఽస్మి" ((ప్రీతి చెందాను సెబాస్) అన్నాడు. ప్రీతితో కర్ణునికి మాలినీ నగరాన్ని ఇచ్చాడు - శత్రువిజేత అయిన కర్ణుడు అంగరాజ్యానికి రాజయ్యాడు. చంపారణ్యాన్నీ, ఆ నగరాన్నీ దుర్యోధనుని అనుమతితో పరిపాలించాడు. ఆ విషయం నీకూ తెలుసును కదా ! ఈ విధంగా కర్ణుడు తన శస్త్ర ప్రతాపంతో, భూమండలంలో ప్రసిద్ధుడయ్యాడు. నీ హితం కోసం ఇంద్రుడు అతని కవచకుండలాలు కూడా యాచించాడు కదా ! అతడు దేవమాయతో మోహితుడై, దివ్యమయిన తన సహజ కవచకుండలాలను దేవేంద్రునికి సమర్పించాడు. సహజమైన కవచ కుండలాలు పోవడంతో, వాసుదేవుడు చూస్తూ ఉండగా, అర్జునుని చేత యుద్ధంలో చంపబడినాడు. 1. బ్రాహ్మణ శాపంచేత, 2. పరశురాముని శాపంచేత, 3. కుంతికిచ్చిన వరంచేత, 4. ఇంద్రుని మాయచేత, 5. అర్ధరథుడని యుద్ధానికి ముందు భీష్ముడు అవమానించడంచేత, 6. శల్యుడు చేసిన తేజోవధచేత, 7. కృష్ణుని నీతి చేత .... రుద్రుడూ, ఇంద్ర, యమ, వరుణ, కుబేరులూ, ద్రోణ, కృపులూ ఇచ్చిన దివ్యాస్త్రాలను గ్రహించిన

* *వి॥ ద్వైరథము - ఒకేరథంతో (ఇరువురికీ కూడ) ఇతరుల సాయం లేకుండా ఇద్దరే యుద్ధం చేయడం.*

అర్జునుని చేత సూర్యసమ తేజస్వి అయిన కర్ణుడు చంపబడినాడు. ఇలా నీ అన్న కర్ణుడు చాలామందిచేత వంచితుడైనాడు. మానవోత్తముడై యుద్ధంలో చనిపోయిన వాడతడు. అంతేకాని శోకింపదగినవాడు మాత్రంకాదు.

6. ధర్మరాజు స్త్రీలను శపించుట.

వైశంపాయనుడు ఇలా చెప్పాడు. "దేవర్షి అయిన నారదుడు ఇంతవరకూ చెప్పి విరమించాడు. ధర్మరాజు శోకంలో మునిగిపోయి చింతిస్తున్నాడు. దీన మనస్వి అయిన ధర్మజుడు శోకవ్యాకులు డయ్యాడు. పాములా బుసలు కొడుతూ నిట్టూరుస్తూ కనుల నీరు నింపుకొన్నాడు. అపుడు కుంతి, శోకంతో దుఃఖంతో నిండిన మనసుతో అర్థవంతంగా, సమయోచితంగా, మధురంగా ఇలా అంది. "ధర్మజా ! వానికోసం నీవు శోకింపరాదు. నీవు మహాప్రాజ్ఞుడవు. శోకం విడు. నామాట విను. నీవు వాని సోదరుడ వని తెలిపేందుకు వాని దగ్గరకు వెళ్లాను. దేవుడయిన సూర్యుడు కూడా వెళ్లాడు. హితంకోరే స్నేహితుడు చెప్పినట్లు, సూర్యుడు కర్ణుని స్వప్నంలో చెప్పాడు. అంతేకాదు నా ఎదుట కూడా చెప్పాడు. సూర్యుడు కాని, నేను కాని స్నేహకారణంగా వానిని తీసుకురావటానికి గాని, మీతో కలపటానికి గాని శక్యం కాలేదు. అతడు కాలవశుడనీ, వైరం పెంచా లనుకొంటున్నాడనీ, మీకు వ్యతిరేకి అనీ నేను ఊరుకొన్నాను." కుంతి ఇలా చెపితే ధర్మాత్ముడు బాష్పనయనాలతో శోకిస్తూ "అమ్మా నీవిలా రహస్యం దాచడం నాకు చాలా బాధ కలిగిస్తోంది" అన్నాడు. **ఆ దుఃఖంతో ధర్మరాజు "అన్ని లోకాలలోనూ స్త్రీలు రహస్యాన్ని దాచకుందురు గాక" అని శపించాడు.** ఆ ధర్మరాజు అలా శపించి, పుత్రులనూ, పౌత్రులనూ, సంబంధులనూ, స్నేహితులనూ తలచుకొని ఉద్విగ్ను డయ్యాడు. అతని మనసంతా వ్యాకుల మయిపోయింది. సంతాపంతో, శోకంతో నిండిన మనసుతో ధర్మరాజు పాగతో నిండిన అగ్నివలె, నిర్వేదం పొందాడు."

7. తనకు రాజ్యమక్కరలేదనియు, వనములకు పోవుదుననియు ధర్మరాజు చెప్పుట.

వైశంపాయనుడు ఇలా చెప్పాడు. "ధర్మాత్ముడయిన ధర్మజుడు శోకంతో వ్యాకులుడై, మహారథుడైన కర్ణుని తలచుకొని, మరింత దుఃఖంతో విలపించాడు. దుఃఖంతో శోకంతో నిండిపోయి, పదేపదే నిట్టూరుస్తూ అర్జునుని చూసి ఇలా అన్నాడు. "వృష్ణి, అంధకవంశాల పురమయిన ద్వారకలో భిక్షమెత్తుకొని ఉంటే, ఇలా జ్ఞాతులందరినీ

చంపి ఈ దుర్గతిని పొందే వారమే కాదు. మన శత్రువుల కోరిక తీరింది. కౌరవుల ప్రయోజనమూ తీరిందికదా ! తమను తాము చంపుకొన్నాక ఇంకా ధర్మఫలం ఏమి పొందుతాం ? క్షత్రియుల ప్రవర్తన, పౌరుషమూ, కోపమూ ఎందుకూ పనికిరావు. వీని వల్లనే మనకీ ఆపద వచ్చింది. **క్షమ, దమం, శౌచం, వైరాగ్యం, మాత్సర్యం లేకపోవటం, అహింస, సత్యవాక్కు, (వీడూ) ఇవి వనవాసులకు నిత్యమూ ఉండవలసినవి.** మనం లోభంతో, మోహంతో, రాజ్యాన్ని అనుభవించాలనే కోరికతో, దంభాన్ని అభిమానాన్ని, ఆశ్రయించి ఈ దురవస్థ పాలయ్యాం. బంధువులందరూ చనిపోయినట్లు చూసికూడా, భూమి నంతటినీ జయించాలనే కోరికతో ఉన్న మనల్ని, మూడు లోకాల రాజ్యమిచ్చినా ఎవడూ సంతోష పెట్టలేడు. అటువంటి మనం భూమి కారణంగా అవధ్యులయిన రాజులను కూడా చంపి, అందరినీ వదలి బంధువులు పోయిన దరిద్రులవలె జీవించుదాం. మాంసం కోసం కాట్లాడు కోవటం కుక్కలకు అశుభం కలిగిస్తుంది. అలాగే మాంసం వంటి రాజ్యం మాకు ఇష్టంకాదు. దాన్ని విసర్జించడమే ఇష్టం. భూమినంతా ఇచ్చినా, బంగారు రాసులిచ్చినా, గోవులను, గుర్రాలనూ ఇచ్చినా, చనిపోయిన మన బంధువులు విడువదగినవారు కారు. వారంతా కామంతో, కోపంతో నిండి, క్రోధంతో, రోషంతో కూడి, మృత్యు వనే వాహనం ఎక్కి యమపురికి వెళ్లిపోయారు.

తమ పుత్రులకు ఎన్నో శుభాలు కలగాలని తలిదండ్రులు కోరుకొంటారు. తపస్సు, బ్రహ్మచర్యం, సత్యం, సహనం మొ॥ వానితో పుత్రులకు సద్గుణాలు కలగాలని కోరుకొంటారు. ఉపవాసాలు, యజ్ఞాలు, వ్రతాలు, కౌతుకమంగళ కృత్యాలు మొదలగు వానితో గర్భం ధరించి తల్లులు పది మాసాలు మోస్తారు. చక్కని సంతానం కలుగుతుందో లేదో అని, చక్కని ఆయువుతో జీవిస్తారో లేదో అని, వారు తమకు, ఇహ, పరసుఖాలు కలిగిస్తారో లేదో అని తల్లులు కోరుకొని దీనంగా బ్రతుకుతారు. మేలిమి బంగారు కుండలాలు దాల్చిన యువకులంతా ఇహలోకభోగాలు అనుభవించకుండా, పితృఋణం. దేవఋణం తీర్చుకోకుండానే చనిపోయారు - దీనితో తల్లుల కాంక్షలు నిష్ఫలా లయిపోయాయి. సంపదల విషయమై తలిదండ్రులకు కోరికలు పుట్టగానే, అమ్మా ! ఈ రాజకుమారులంతా చనిపోయారు. (అమ్మా! అని కుంతికి సంబోధనం.) కోరికలు, దైన్యం, క్రోధం, హర్షం, వీనితో అనుచితంగా ప్రవర్తించేవారు, విజయఫలాన్ని ఎన్నడూ ఏ మాత్రమూ పొందలేరు. పాంచాలురలో, కౌరవులలో పోయినవారు పోనే పోయారు. లేకపోతే ఈ లోకం వారందరినీ వారి చేష్టలతో చూసి ఉండేది కదా ! ఈ వినాశానికి మనమే కారణమని లోకానికి అనిపించవచ్చు. కాని అదంతా ధృతరాష్ట్రపుత్రులకే చెందుతుంది.

ఆ ధృతరాష్ట్రుడు వంచనలో తెలివైనవాడు - మాయలమారి బ్రతుకు వానిది. మనల్ని ద్వేషించేవాడు. ఏ అపకారమూ చేయని మనపట్ల సదా దొంగవినయం ప్రదర్శించేవాడు. మనకుకాని, వారికి కాని కోరికలు తీరనూలేదు. ఎవరమూ జయించనూ లేదు - వారు భూమిని అనుభవించనూలేదు. స్త్రీ భోగాలు కాని, గీతాదుల ఆస్వాదం కాని లభించనూ లేదు. మంత్రుల మాటగాని, స్నేహితుల మాట కాని, జ్ఞానుల మాటకాని వినలేదు - విలువైన రత్నాలుకాని, భూమికాని, ధనసంపదలుకాని అనుభవింపలేదు. మనమీది ద్వేషంతో ఎక్కువ కుమిలి పోయేవాడు. ఏమాత్రమూ సుఖాన్ని పొందలేకపోయాడు. సమృద్ధమైన మన సంపదను చూసి ఓర్వలేక కృశించి పాలిపోయాడు (ఇది రాజసూయం నాటి పరిస్థితి) ధృతరాష్ట్ర మహారాజు కూడా శకుని మాట విని, పుత్రవ్యామోహంతో అవినీతికి తలయొగ్గి, ఆ దుర్యోధనుని (కపటద్యూతానికి) అనుమతించాడు. తండ్రియయిన భీష్మునికాని, విదురునికాని లెక్కచేయలేదు. అందుకే రాజు వినాశం పాలయ్యాడు. నేనిప్పుడున్నట్లు. కల్మషుడు, లోభిఅయి, ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించే కొడుకును అదుపులో పెట్టకుండా చక్కని కీర్తినుండి పతితుడయ్యాడు.

పాపాత్ముడయిన ఆ దుర్యోధనుడు మా మీది ద్వేషంతో, ఈ వృద్ధులను దుఃఖాగ్నిలో త్రోసి వెళ్లిపోయాడు. సత్కులంలో పుట్టిన చుట్టం ఎవరయినా, కృష్ణుని ఎదుట (యుద్ధంకోసం) దుర్యోధనుడు మాట్లాడినట్లు మాట్లాడుతాడా ? దిక్కులన్నీ వెలిగింప గలిగే తేజస్సు కలిగి కూడా, తన దోషంతో శాశ్వతంగా నశించాం. వైరపురుషుడయిన ఆ దుర్మార్గుడు కట్టుబడ్డాడు కాని, వాడివల్ల మన ఈ వంశమంతా కూలిపోయింది. అవధ్యులయిన రాజులను చంపి మనం నిందల పాలయ్యాం. దుష్టబుద్ధి, పాపి, కులనాశకుడూ అయిన దుర్యోధనుని రాజును చేసి, ధృతరాష్ట్రుడు ఇపుడు విలపిస్తున్నాడు. వీరులంతా చచ్చిపోయారు. పాపం జరిగిపోయింది. మన ప్రయోజనం మనమే పాడు చేసుకొన్నాం. శత్రువులను చంపితే కోపం పోయింది కాని, ఈ దుఃఖం నన్ను కోసేస్తోంది. (బాధిస్తోంది నిరంతరంగా). **అర్జునా ! చేసిన పాపం ఒక మంచిపని చేస్తే పోతుంది. పైకి (అందరికీ తెలిసేట్లు) చెప్పుకొంటే పోతుంది. అలాగే పరితాపం చెందితే, దానం చేస్తే, తపస్సు చేస్తే కూడా పోతుంది. నివృత్తి మార్గం అనుసరించితే, తీర్థయాత్రలు చేస్తే, వేదాధ్యయనం చేస్తే, శాస్త్రజపం చేస్తే చేసిన పాపం తగ్గిపోతుంది.*** త్యాగం

---

* ధనంజయ కృతం పాపం కల్యాణేనోపహన్యతే ॥ 36
ఖ్యాపనేనానుతాపేన దానేన తపసాపి వా ।
నివృత్త్యా తీర్థగమనాత్ శ్రుతిస్మృతిజపేన వా ॥ 37

చేసినవాడు మళ్లీ పాపం చేయలేడని వేదం చెపుతోంది. అలాగే త్యాగి జనన మరణాలు పొందడనీ చెపుతోంది. చక్కని (మోక్ష) మార్గం అనుసరించి బుద్ధిని దృఢపరచుకొన్నవాడు, ద్వంద్వాలకు అతీతుడైన ముని, జ్ఞానయుక్తుడయి పరబ్రహ్మమును పొందుతాడు. అర్జునా ! నేను మిమ్మందరినీ విడిచి అడవికి వెళతాను. పరిగ్రహం కలవాడు కృత్స్నతమమయిన ధర్మం పొందలేడని వేదం చెపుతోంది - అది ఇపుడు నాకు కనిపిస్తోంది. పరిగ్రహం (రాజ్యమూ సంపద) కోరి నేను పాపం చేశాను. ఆ పరిగ్రహం జనన మరణాలకు కారణం. పరిగ్రహం వల్ల జనన మరణాలు కలుగుతాయని వేదం చెపుతోంది. నేను పరిగ్రహం విడిచి, (సంసారం విడిచి) రాజ్యమూ, సుఖాలూ విడిచి, బంధవిముక్తి పొంది, శోకం మమకారం లేకుండా ఎచటికయినా వెళ్లిపోతాను. నిష్కంటకమై, క్షేమకరమయిన ఈ భూమిని నీవు పరిపాలించు. నాకీ రాజ్యం వల్లకాని, భోగాలతో కానీ ప్రయోజనం లేదు." కురురాజయిన ధర్మరాజు ఇలా అని విరమించాడు. అపుడు కుంతిచిన్నకొడుకైన అర్జునుడు ఇలా అన్నాడు."

8. ధనప్రయోజనమును చెప్పి అర్జునుడు ధర్మజుని యజ్ఞము చేయుమనుట.

"అయ్యో ! ఎంత కష్టం ! ఎంత దుఃఖం ! ఎంత మూఢత్వం! మానవులు చేయలేని పని చేసి, ఇపుడు ఉత్తమ సంపదను విడిచి పెట్టేస్తున్నావు. శత్రువులను సంహరించి, స్వధర్మంతో రాజ్యం పొందావు. తెలివితక్కువతనంతో ఇపుడు అంతా ఎలా వదిలివేస్తా నంటున్నావు ? చచ్చిపోతాననే భయం కల నపుంసకునికి రాజ్యం ఎక్కడినుండి వస్తుంది ? అలాగే తెగని ఆలోచనలున్న దీర్ఘసూత్రునికీ రాదు - మరి ఎందుకు క్రోధంతో రాజు లందరినీ చంపావు ? దురదృష్టవంతుడు (చెడిపోయిన శుభాలు కలవాడు), దరిద్రుడు, లోకంలో అనామకుడూ, పుత్రులూ పశుసంపదా లేనివాడూ, బిచ్చమెత్తుకొని బ్రతకాలి తప్ప, పౌరుషంతో సంపదలు సంపాదించాలి అనుకోకూడదు. (అన్ని ఉండి కూడా నీవు బిచ్చమెత్తుకొనాలని అనుకొంటున్నావు) సర్వసమృద్ధ మయిన రాజ్యం వదిలి, పాపిష్ఠమైన భిక్షావృత్తిని చేపట్టి జీవించే నిన్ను చూసి లోకం ఏమంటుంది ? ప్రభూ ! సర్వార్థాలనూ వదలి శుభాలులేక, దరిద్రుడవై, మూడునివలె బిచ్చమెత్తటానికి నీవు ఎందువలన కోరుతున్నావు ? (ఖ్యాతివహించిన) ఈ రాజ వంశంలో పుట్టి, భూమినంతా జయించాక, ధర్మార్థాలన్నీ వదలి మూఢుడవై అడవికి వెడతావా ? నీవు రాజ్యం విడిచి వెళ్లిపోతే, దుష్టులు ఈ హవిస్సులను పాడుచేస్తారు. అపుడు ఆ పాపం నీకే కలుగుతుంది. 'మునులకు

దారిద్ర్యం రాజ్యం కంటె గొప్పది' అని నహుషుడు అన్నాడు. అతడే మళ్లీ క్రూరకృత్యం చేసి రాజ్యం కోల్పోయాక "ఛీ ! ఈ దారిద్ర్యం చాలా కష్టమైనది" అన్నాడు. 'రేపటికి ఉంచుకోరాదు' అనేది బుషులకు మాత్రమే. ఇది నీకు తెలుసును. ధర్మం అనేది ధనంవల్లనే కొన సాగుతుంది. ఒకడు ఒకని ధనం దొంగిలించాడంటే, ధర్మం అపహరించినట్లే అవుతుంది. ఆ ధనాన్ని లాక్కుపోతూ ఉంటే మనం ఎవరిని క్షమించాలి. ప్రక్కనే ఉన్న దరిద్రుని, లోకులు తప్పు చేసినవాడిని చూసినట్లు చూస్తారు. దారిద్ర్యం లోకంలో మహాపాపం. దాన్ని ఎవరూ ప్రశంసింపరాదు.

రాజా ! పతితుని చూసి లోకం జాలిపడుతుంది. ధనం లేనివాడిని చూసికూడ జాలి పడుతుంది. ఇద్దరికీ తేడా ఏమీ నాకు తోచటంలేదు. పర్వతాల నుండి నదులు సాగుతాయి. అలాగే కూడబెట్టడం వలన పెరిగే ధనం వల్లనే, పనులన్నీ జరుగుతూ ఉంటాయి. రాజా ! అర్థం వల్లనే ధర్మమూ, కామమూ, స్వర్గమూ, సిద్ధిస్తున్నాయి. ధనం లేకపోతే, ప్రాణయాత్ర కూడా మానవునికి సాగదు. ధనంలేని తెలివితక్కువవాని పనులన్నీ, ఎండకాలంలో వాగుల్లాగా ఎండి పోతాయి. **ధనం ఉన్నవానికే మిత్రులుంటారు. వానికే బంధువులుంటారు. ధనం ఉన్నవాడే మగవాడు. వాడే పండితుడు.*** నిర్ధనుడు ధనం లేకుండా ఏ కార్యమూ సాధింపలేడు. ఏనుగులే మహాగజాలను బంధించినట్లు, ధనమే ధనాన్ని బంధిస్తుంది. **రాజా ! ధర్మం, కామం, స్వర్గం, హర్షం, క్రోధం, వేదాధ్యయనం, దమం - ఇవి అన్నీ ధనంతోనే జరుగుతాయి.** ధనం వల్లనే కులం ఏర్పడుతుంది. ధనంవల్లనే ధర్మం వృద్ధిచెందుతుంది. ధనరహితునికి ఈ లోకమూ లేదు, పరలోకమూ లేదు. ధనంలేనివాడు ధర్మకార్యాలను యథావిధిగా చేయలేడు. పర్వతం మీద నుంచి క్రమంగా నది ప్రవహించినట్లు, ధనంవల్లనే ధర్మం స్రవిస్తుంది. **రాజా ! ధనం, గోపులు, సేవకులు, అతిథులు - వీరు కృశించిన వాడే నిజంగా కృశుడు. కేవలం శరీరం కృశించినంత మాత్రంచేత, వానిని చిక్కిపోయిన వాడు అనరు.**

రాజా ! న్యాయం పరిశీలించు - దేవతలు, రాక్షసుల విషయం చూడు. ఇతర జాతుల వారిని వధించడం కంటె దేవతలు కోరుతున్నదేమిటి ? ఇతరుల (ప్రజల) ధనం గ్రహింపక పోతే, రాజు ధర్మాన్ని ఎలా నడుపుతాడు? దీన్నే కదా వేదాల్లో మనీషులు నిశ్చయించారు. వివేకవంతుడు నిత్యమూ వేదాలను అధ్యయనం చెయ్యాలి. వేదం చెప్పినట్లు

---

* **యస్యార్థాస్తస్య మిత్రాణి యస్యార్థాస్తస్య బాంధవాః ।**
యస్యార్థాః స పుమాన్ లోకే యస్యార్థాః స చ పండితః ॥ 19

నడచుకోవాలి. ఎన్నో విధాలుగా ధనం సంపాదించాలి. ప్రయత్నపరుడై యజ్ఞాలు చెయ్యాలి. ద్రోహం చేసే స్వర్గ స్థానాలను దేవతలు పొందారు. ద్రోహంతో కాక జ్ఞాతుల ధనాన్ని మరే విధంగా కాంక్షిస్తున్నారు ? ఇలా దేవతలు నిశ్చయించారు. ఇలాగే వేదాలు శాశ్వతంగా నిలిచాయి - పఠన పాఠనాలు జరుగుతున్నాయి. యజ్ఞాలు చేస్తున్నారు - చేయిస్తున్నారు - ప్రజల నుండి గ్రహించిన ధనమే రాజుకు మేలైనది. అపకారం చేయని ధనం కొంచెమైనా మనం చూడలేం. ఇలాగే రాజులు (పూర్వంనుండీ) భూయజ్ఞం కొనసాగిస్తున్నారు. తండ్రియొక్క సొమ్మును కొడుకులు 'నాది' అన్నట్లు, రాజులు జయించి 'ఈ భూమి నాది' అంటున్నారు. నీ పూర్వులయిన రాజర్షు లందరూ స్వర్గానికి వెళ్లిపోయారు - వారిది ధర్మం అని చెప్పబడుతోంది. నిండిన సముద్రం నుండి (మేఘం ద్వారా) నీరు పది దిక్కులకూ ప్రవహించినట్లు, రాజకులం నుండి ధనం భూమికి ప్రవహిస్తుంది / చేరుతుంది. ఈ భూమి పూర్వకాలంలో దిలీపునిది, నృగునిది, నహుషునిది, అంబరీషునిది, మాంధాతది. ఇపుడు నీకు సంక్రమించింది. అన్ని దక్షిణలతో కూడిన ద్రవ్యాత్మక యజ్ఞం నిన్ను చేరింది. **రాజా ! దాన్ని నీవు పక్రమంగా యజ్ఞార్థమై వినియోగించకపోతే, నీకు రాజ్యపాపం సంక్రమించినట్లే - ఎవరి రాజు భూరి దక్షిణ లిచ్చి అశ్వమేధయాగం చేసి అవభృథ స్నానం చేశాడో, ఆ అవభృథంలో పాల్గొన్నవారంతా పవిత్రులవుతారు.** విశ్వవ్యాప్తమయిన రూపాలన్నీ తానే అయిన మహాదేవుడు, సర్వాన్నీ హోమం చేసే మహా యజ్ఞంలో సర్వభూతాలను హోమం చేశాడు. తన్ను తానుకూడా హోమం చేసుకొన్నాడు. ఈ ఐశ్వర్య రూపమయిన మార్గం శాశ్వత మయినది. దీనికి అంతంలేదని వింటున్నాం. ఇది దాశరథమనే మార్గం. ఇది చాలా సన్మార్గం. రాజా ! చెడుదారి పట్టకు."

9. వానప్రస్థ, సన్యాస జీవనములు మంచివని ధర్మజుడు చెప్పుట.

ధర్మరాజిట్లన్నాడు. "ఒక్కక్షణం ఏకాగ్రంగా మనస్సునూ, చెవులనూ (ఇంద్రియాలనూ) అంతరాత్మలో నిల్పుకొని, నా మాట విని దీనిని ఇష్టపడు. నేను ఇంద్రియ సుఖాలు విడిచి, సజ్జనులు నడిచే మార్గంలో వెళతాను - నీ కోసం ఆ రాజ్యం గ్రహించను. సదా క్షేమంకరమయి, ఏకాకిగా వెళ్ల దగిన మార్గం ఏముంది ? అని నన్ను అడుగు - అలా అడగవా ? అడగక పోయినా చెపుతాను విను. గ్రామ్యసుఖాలూ, అలవాట్లూ విడిచి తపస్సు చేస్తాను - అడవిలో పళ్లూ, దుంపలూ తింటాను - మృగాలతో కలిసి సంచరిస్తాను. సకాలంలో అగ్నిహోత్రం చేస్తూ, రెండు కాలాల్లోనూ ఉపాసిస్తాను. మితంగా ఆహారం తిని, శరీరం కృశింపజేస్తాను. చర్మం కాని, నారబట్టలు కాని ధరిస్తాను.

జడలు ధరిస్తాను. చలినీ, ఎండనూ సహిస్తాను. ఆకలి దప్పు లనే బాధలు తట్టుకొంటాను. యథావిధిగా తపస్సు చేస్తూ, శరీరం శుష్కింప జేసుకొంటాను. అడవుల్లో సంతోషంగా బ్రతికే మృగ, పక్షుల అరుపులూ, కూతలూ సదా శ్రవణ సుఖంగా, మనోరంజకంగా వింటూ ఉంటాను. వికసించిన చెట్లూ, తీగలూ విరజిమ్మే రమణీయ సుగంధాలను ఆఘ్రాణిస్తూ, ఎన్నో రూపాలు కల అడవి జంతువులను (వనవాసులను) చూస్తూ అడవిలో గడుపుతాను. వానప్రస్థులను దర్శిస్తాను. గురుకుల వాసులకు ఎన్నడూ అప్రియ కృత్యాలు చేయను. ఇక గ్రామవాసుల విషయం చెప్పనవసరంలేదు. ఏకాంతంగా ఉండి, ఆధ్యాత్మికంగా నిత్యానిత్య విచారం చేస్తాను. ఉడికిందా ? లేదా ? అనే విచారం చెయ్యను. వన్య ఫలాలతో, మంచి వాక్కులతో, నీళ్లతో పితరులకూ, దేవతలకూ తర్పణాలు చేస్తాను. ఇలా వానప్రస్థుల శాస్త్రాల్లో ఉగ్రమూ, ఉగ్రతరమూ అయిన విధులను క్రమంగా సేవిస్తూ, ఈ శరీర సమాప్తికోసం నిరీక్షిస్తూ ఉంటాను. లేదా నేను ఒక్కడినీ రోజుకు ఒక చెట్టుదగ్గర భిక్షమెత్తుకొంటాను. మునినై బోడితలతో శరీరం శుష్కింప జేసుకొంటాను. ఒళ్లంతా దుమ్ముకొట్టుకొని పోయినా, ఇల్లూ వాకిలీ లేకపోయినా, చెట్టు మొదట్లోనే నివసిస్తాను. ప్రియాప్రియాలు వదిలేస్తాను. నిందించినా, ప్రశంసించినా దుఃఖం లేదు, సంతోషం లేదు. దేని మీదా ఆశ కాని మమకారం కాని, లేకుండా ద్వంద్వాలు లేకుండా, ఏమీ దానం పట్టక గడుపుతాను.

ఆత్మయందే రమిస్తూ, ప్రసన్నతతో జడునివలె, గ్రుడ్డివానివలె, చెవిటివానివలె ఉంటూ, ఎవరితోనూ మాట్లాడక కాలక్షేపం చేస్తాను. నాలుగు విధాలయిన స్థావర జంగమాలను వేటినీ హింసించను. తమ తమ ధర్మాల్లో నడుచుకొనే ప్రజలనూ, ప్రాణులనూ సమదృష్టితో చూస్తాను. ఎవరినీ అవహేళన చెయ్యను. ఎవరినీ కోపపడను. సదా ప్రసన్నముఖంతో, ఇంద్రియాలన్నిటినీ అదుపులో పెట్టుకొని మెలగుతాను. ఎవరినీ మార్గం అడగను. ఏదో ఒక మార్గం పట్టి పోతాను. ఈ దేశం వెళ్లాలని కాని, ఈ దిక్కులకు పోవాలని కాని కోరకుండా సంచరిస్తాను. ప్రయాణంలో ఎవరి అపేక్ష అక్కరలేదు. వెనుకకు చూడకుండా, ఋజువుగా (కామక్రోధాదులు లేకుండా) అంతర్ముఖుడనై వెడతాను. లింగ శరీరం మీదకాని, స్థూల శరీరం మీదకాని అభిమానం లేకుండా వెళుతూ ఉంటాను. స్వభావం ముందు నడుస్తూ ఉంటుంది. భోజనాలు వాటంతట అవే వస్తూఉంటాయి. విరుద్ధాలైన ద్వంద్వాలను లెక్కచేయక గడుపుకు పోతాను. కొంచెం దొరికినా, రుచిలేనిది దొరికినా తినదగినదే అని తింటాను. మొదటి ఇంట్లో దొరకకపోతే మరొక ఇంటికి పోతాను. ఇలా ఏడిళ్లు మాత్రమే తిరుగుతాను. **1. పొగలేని ఇంటికి - (వంటపూర్తి అయినదని**

గుర్తు) 2. రోకలిని ప్రక్కకు పెట్టినవేళ (దంచుట మొ॥ పనులు పూర్తి అయ్యాక) 3. బొగ్గులు ఆర్పివ తరువాత (వంట అయిందని) 4. ఇంటి వారు భుజించాక 5. పాత్రల కదలికలు ముగిసివ తర్వాత (వడ్డనలు అయ్యాక) భిక్షుకులు లేనిచోట (ఇంకా భిక్షుకులుంటే గృహస్థు ఇబ్బంది పడతాడు) అటువంటి చోట ఒక చోట మాత్రమే భిక్ష చేస్తాను. మూడు, లేదా రెండు లేదా అయిదు ఇళ్లు తిరుగుతాను. ఎక్కడా ఆసక్తి పెట్టుకోను. ఇలా సంచరిస్తాను.

(అన్నం) దొరికినా, దొరకకపోయినా, ఒకే మాదిరిగా వ్యవహరిస్తా. మహాతపస్విగా ఉంటాను. జీవించాలని లేని వాడి వలెనూ, చావాలని లేని వాడివలెనూ ప్రవర్తిస్తాను. జీవితాన్ని అభినందించను. మరణాన్ని ద్వేషించను. నా చేతిని బాడితతో చెక్కుతున్న వాడికీ అమంగళం కోరను. మరో చేతికి చందనం పూసే వాడికి మంగళం కోరను. దేనినీ పట్టించుకోను. బ్రతికి ఉంటే చేయగలిగిన అభ్యుదయ క్రియలన్నీ పూర్తిగా వదిలివేస్తాను. తెప్పపాటులు, అన్నపానాలు మొ॥ అత్యవసరమైన పనులు చేసుకొంటూ కాలం గడుపుతాను. వాటిలోకూడా నిత్యమూ నిరాసక్తంగా ఉంటాను. ఇంద్రియ కృత్యాలన్నీ వదలివేస్తాను. ఆదుపు తప్పని సంకల్పాలతో, బుద్ధిదోషాలన్నీ కడిగి, వేస్తూ ప్రవర్తిస్తాను. అన్ని సంగాలనుండి విడివడుతాను. పాశాలన్నీ తెగకోస్తాను. ఎవనికీ వశంకాను. వాయువుతో సమాన ధర్మం కలిగి ప్రవర్తిస్తాను. ఇలా రాగం విడిచి, శాశ్వతమైన సంతోషం పొందుతాను. నా తెలివితక్కువతనం వల్ల, ఆశ నాచేత మహాపాపం చేయించింది. కొంతమంది మూఢులు మేలు కీళ్లతో కూడిన పనులు చేస్తారు. ఆ పనులలో తగుల్కొన్న వారిని తనవారిగా భావిస్తూ, భరిస్తూ ఉంటారు. ఈ శరీరాన్ని వదలి ప్రాణాలు పోయే సమయంలో జీవుడు ఆ పాపం గ్రహిస్తాడు. అదే కర్త యొక్క కర్మఫలం. రథచక్రంవలె, ఈ సంసారచక్రం త్రిప్పబడుతోంది. అదే సమయంలో కర్మ ఫలాలతో కూడిన భూత సముదాయం, భూత సముదాయంతో సంయోగం పొందుతోంది. (అనగా పాంచభౌతికమైన శరీరం ఏర్పడుతోంది) జనన మరణాలతోను, జరావ్యాధులతోను, వేదనలతోను కూడినది ఈ సంసారం. ఇది అంతం లేనిదిగా, భ్రాంతి చేత ఆత్మయందు కనపడుతుంది. అటువంటి సంసారం విడిచిపెట్టేవాడు సుఖపడతాడు. దేవతలు స్వర్గం నుండి పడిపోతున్నారు. మహర్షులు ఉత్తమస్థానాలనుండి పడిపోతున్నారు. అటువంటప్పుడు అవిద్యాతత్త్వం తెలిసిన వాడెవడయినా స్వర్గం కోరుకుంటాడా ? భిన్న లక్షణాలు కల వివిధకర్మలు చేసిన రాజును, సామంతులు స్వల్పకారణాలవల్ల సామదానాది ఉపాయాలతో బంధిస్తున్నారు. (చాలామంది కలిసి ఒకనిని బంధిస్తున్నారు.) అందుచేత ఎంతోకాలానికి నాకీ తెలివి అనే

అమృతం లభించింది. దాన్ని పొంది, స్థిరమైన, తరగని శాశ్వతమయిన స్థానం కోరుతాను. ఈ ధైర్యంతో సదా ఇలా ప్రవర్తిస్తూ, జనన మరణాలూ, జరావ్యాధులూ, వేదనలూ క్రమ్మిన శరీరాన్ని నిర్భయమైన మార్గంలో నిలిచి అంతం చేస్తాను."

10. భీమసేనుని మాటలు.

తరువాత భీముడు ఇలా అన్నాడు. "రాజా ! తెలివితక్కువతనమూ, అవివేకమూ కల శ్రోత్రియుని బుద్ధి, వేదాలు వల్లెవేసి వేసి మొద్దు బారినట్లు, నీ బుద్ధికూడ తత్త్వార్థం తెలుసుకోలేక పోతోంది. అలసత్వానికి అలవాటు పడిన నీ మనస్సు రాజధర్మాలకు అసూయపడుతోంది. (పరమార్థం తెలియటం లేదు). ధృతరాష్ట్రుని కుమారుల మరణాన్ని గురించి ఇప్పుడు విచారిస్తే ఏం ఫలితం ? నీవు తప్ప క్షత్రియ ధర్మం పాటించే మరెవ్వరూ బంధువులమీద కూడ క్షమ, దయ, జాలి, అక్రూరత చూపించడు. నీ ఈ బుద్ధి మాకు మొదట్లోనే తెలిస్తే, అసలు ఆయుధమే పట్టేవాళ్లం కాదు. ఎవరినీ చంపేవాళ్లమూ కాదు. శరీరం నిలుపుకొనేందుకు భిక్షమెత్తుకొనే వాళ్లం. రాజులకు ఇంత దారుణమైన యుద్ధం వచ్చేది కాదు. 'ఈ అన్నమంతా ప్రాణానికే' అని మేధావులు తెలుసుకొన్నారు. స్థావరంకాని, జంగమం కాని అంతా ప్రాణానికే భోజనం. 'రాజ్యం గ్రహించేవానికి ఎవరయినా శత్రువులుంటే, వారు సంహరింపదగిన వారే' అని ప్రాజ్ఞులయిన క్షత్రియ ధర్మవేత్త లెరుగుదురు. వారు మనపట్ల దోషమాచరించినవారు. మన రాజ్యానికి శత్రువులు. వారిని ధర్మమార్గంలో చంపావు. ధర్మజా ! నీవు ఈ భూమిని అనుభవించు. నూతిని త్రవ్వి, నీటిని తీసుకోకుండా, బురద అంతా శరీరానికి పూసుకొని తిరిగి వచ్చేవాడి పనిలా ఉంది మనపని. పెద్ద చెట్టు ఎక్కి తేనె తీసుకొని, దాన్ని త్రాగకుండానే చచ్చిపోయినట్లు ఉంది మన పరిస్థితి. ఆశతో రాజమార్గం ఎక్కి వెళ్లుతూ, మధ్యలో నిరాశచెంది వెనుదిరిగిన వాడిపనితో సమానంగా ఉంది ఈ పని. శత్రువులను చంపించిన వాడు చివరకు తన్ను తాను చంపుకొన్నట్లుంది మనపని. ఆకలి వేస్తున్నప్పుడు అన్నం దొరికితే తిననివాని విధంగా ఉంది మనపని. ప్రయత్నించి కామినిని సంపాదించి, అనుభవింపని కాముకుని వలె ఉంది మన పరిస్థితి.

రాజా ! మందబుద్ధి అయిన నిన్ను పెద్ద వాడవని అనుకొని, నీ వెంటపడుతున్న మేమే అసలు నిందింపదగిన వాళ్లం. మేము భుజబలం కలవాళ్లం. విద్యావంతులం. అభిమానవంతులం. అయినా అశక్తులవలె నపుంసకుడ వయిన నీ మాట పట్టుకు తిరుగుతున్నాం. దిక్కులేని వారికి దిక్కు మనం. అయినా సర్వస్వం మనం పోగొట్టుకొన్నాం.

అర్థసాధన విషయమై ప్రజలు మనల్ని సందేహించకుండా ఎలా ఉంటారు ? ఇది ఎలా ఉందో నీవే చూడు ? ఆపత్కాలంలో కాని, ముసలితనం పైబడినవానికి గాని, శత్రువులచేత దుర్గతి పాలయిన వానికి గాని సన్యాసం కర్తవ్యం అని శాస్త్రం చెపుతోంది. అందుచేత తెలివిగలవారు ఇక్కడ సన్యాసాన్ని ప్రశంసింపరు. సూక్ష్మంగా ఆలోచించేవారు దీన్ని ధర్మోల్లంఘనమని కూడా భావిస్తారు. ఆ (క్షత్రియ) జాతిలో పుట్టి, దాని మీది ఆసక్తితో దాన్నే ఆశ్రయించి, ఉన్న మనం, దాన్ని ఎలా నిందిస్తాము ? బ్రహ్మ విధించినది సహజం కనుక ఆ బ్రహ్మకూడా నిందిపందగినవాడు కాడు. విద్యాధనాలు లేని నాస్తికులు, సత్యంలా భాసించే అసత్య రూపమయిన వేద వాదవిజ్ఞానం ప్రచారం చేశారు. మౌనం వహించుకొని, ధర్మం అనే నెపంతో దేహాన్ని తనకుతానే నియంత్రించుకొనే వాడు చస్తాడు కాని బ్రతుకలేడు.

పుత్రులు, పౌత్రులు, దేవతలు, ఋషులు, అతిథులు, పితృదేవతలు వీరెవరినీ పోషింప నవసరంలేని ఒంటరివాడు మాత్రమే అరణ్యాల్లో బ్రతుక గల్గుతాడు. అడవుల్లోని మృగాలూ, పందులూ, పక్షులూ స్వర్గం పొందలేదే ! ఇంకో విధంగా చెప్పాలంటే అటువంటి వానిని ప్రజలు ఉత్తముడని చెప్పటం లేదు. ఒక వేళ (సన్యాసం చేతనే) కర్మలువిడచి నంతమాత్రాన ఏరాజయినా సిద్ధిపొందితే, పర్వతాలూ, చెట్లూ కూడా వెంటనే సిద్ధిపొంది ఉండాలికదా ! ఎందుచేతనంటే.. ఈ పర్వతాదులు నిత్యమూ సన్యాసాన్నే స్వీకరించి ఉన్నాయి. ఉపద్రవాలు లేకుండా ఉన్నాయి. ఎవరి దగ్గరా ఏమీ పుచ్చుకోవు. నిత్య బ్రహ్మచారులు. మానవుడు తన సంపదల విషయంలో ఇతరుల సిద్ధిని పొందలేక పోయినపుడు, కర్మమే కర్తవ్యం. కర్మ చేయని వానికి సిద్ధి లభింపదు. (ముముక్షువులకు శరీర పోషణను మించిన కర్మ అవసరం లేదంటే) చేపలు, రాళ్లు, మొదలయిన జంతువులు కూడ సిద్ధి పొందాలి. ఎందుచేతనంటే అవి తమను తామే పోషించుకోవాలి కాని ఎవరూ వాటిని పోషింపరు గదా ! చూడు ! ఈ లోకమంతా వారివారి కర్మలతోనే నిండి ఉంది. అందుచేత కర్మలనే ఆచరించాలి. కర్మలు విడిచిన వానికి సిద్ధి / మోక్షం లేదు."

11. అర్జునుడు గృహస్థధర్మమును సమర్థించుట.

వెంటనే అర్జునుడు ఇట్లన్నాడు. "భరతోత్తమా ! ఈ విషయంలో ప్రాచీనమయిన ఇతిహాసం ఒకటి ఉదాహరిస్తారు. ఇంద్రునకు తాపసులతో జరిగిన సంవాదం అది. సద్వంశంలో పుట్టిన బ్రాహ్మణ బాలకులు (మీసం కూడా రాని వయసులో) ఇళ్లు విడిచి, మళ్లీ ఇంటికి రాకూడదనుకొని అడవులకు వెళ్లారు. ఏ లోపమూలేని సంపన్న బ్రహ్మచారులు

'ఇదే ధర్మం' అని భావించి, సోదరులను, తలిదండ్రులనూ విడిచి వెళ్లారు. వారిని చూస్తే ఇంద్రుడికి జాలి కలిగింది. ఇంద్రుడు బంగరు పక్షి రూపంలో వచ్చి, వారితో ఇలా అన్నాడు. 'విఘసం* తినే మనుష్యులు చేసేపని ఇతరు లెవరూ చేయలేరు. ఈ కర్మ చాలా పుణ్యప్రదమయినది. ధర్మం మీద శ్రద్ధతో సిద్ధార్థులయినవారు సద్గతి పొందారు. వారిజీవితం ప్రశస్త మయినది.' అపుడు బుషులు ఇలా అన్నారు. " ఓహో ! ఈ పక్షి విఘసాశులను ప్రశంసిస్తోంది. నిజంగా ఇది మనకు బోధచేస్తోంది. మనం విఘసాశులమే కదా !" అపుడా పక్షి ఇలా అంది. "బురద పూసికొని, రజోగుణంతో ఎంగిలి కూడు తినే బుద్ధిహీనులు మీరు. నేను మిమ్మల్ని ప్రశంసించటం లేదు. విఘసాశులు వేరే ఉన్నారు." బుషులు ఇలా అన్నారు. "ఇదే అన్నిటికంటె శ్రేయఃప్రదమని అనుకొని ఉపాసిస్తున్నాము. పక్షీ ! ఇంతకంటె గొప్పశ్రేయస్కరమైనది ఏదో చెప్పు. శ్రద్ధగా నీ మాటను పాటిస్తాము." అపుడా పక్షి ఇలా అంది. "ఆత్మను ఆత్మతో (మిమ్మల్ని - నన్ను) వేరుచేసి, నన్ను శంకించకపోతే, నేను మీకు ఉన్నదున్నట్లు హితమయిన మాట చెపుతాను." బుషులు ఇట్లా అన్నారు. "నీ మాట వింటాం. నీ పద్ధతులు తెలుసును. ధర్మాత్మా! నీ మాట మీద నిలబడతాము. మమ్మల్ని ఆజ్ఞాపించు."

అపుడు పక్షి ఇలా అంది.

"నాలుగు కాళ్లున్న ప్రాణుల్లో ఆవు ఉత్తమమయినది. లోహాల్లో బంగారం, శబ్దాలలో మంత్రం ఉత్తమ మయినవి. (రెండుకాళ్లున్న) మానవుల్లో బ్రాహ్మణుడు ఉత్తముడు.** బ్రాహ్మణునికి ఈ మంత్రం జాతకర్మనుండి విధింపబడుతుంది. జీవించి యున్నంత కాలమే కాకుండా, శ్మశానం చేరే దాకా ఆయా కాలాల్లో వర్తిస్తుంది. (మంత్ర సంస్కారం వర్తిస్తుంది).

వేదం చెప్పిన కర్మలు ఆచరించడం మానవునికి స్వర్గం కలిగించే ఉత్తమ మార్గం. అలా కాకపోతే మంత్ర సిద్ధాలయిన కర్మలన్నీ నాపూర్వులు ఎందుకు చేశారు ? దృఢనిశ్చయం కలవాడు ఆత్మను పొందుతాడు. అలాగే ఇతర సిద్ధినీ పొందుతాడు. ఇతర సిద్ధులు మూడు విధాలు. నెలలు, పక్షాలు, ఋతువులు, సూర్యుడు, చంద్రుడు, తారకలు అని పూర్వులు చేసిన విభాగం ఆ సిద్ధుల కోసమే. కర్మ లనే పేరుతో, ఈ మూడు సిద్ధులనూ సర్వభూతాలూ కోరుతూ ఉంటాయి. అటువంటి కర్మలకు సిద్ధిక్షేత్రమూ,

---

* వి॥ వ విఘసము యజ్ఞంలో మిగిలిన అన్నం. అది తినే వారు విఘసాశులు.

****చతుష్పదాం గౌః ప్రవరా లోహానాం కాంచనం వరమ్ ।**
శబ్దానాం ప్రవరో మంత్రః బ్రాహ్మణో ద్విపదాం వరః ॥ 10

పుణ్యప్రదమూ అయిన గృహస్థాశ్రమమే గొప్పది. అలా కాకుండా కర్మను నిందిస్తూ, చెడు మార్గంలో వెళ్లి, మూఢులై ప్రయోజనాలు పొందని వారికి పాపమే మిగులుతుంది. **మూఢులు దేవమార్గాలూ, పితృమార్గాలూ, శాశ్వతాలయిన బ్రహ్మమార్గాలూ విడిచి తిరుగుతారు. దానితో వారు వేద విరుద్ధమార్గంలో పడిపోతారు.** 'తపస్సుతో కూడినది కర్మమార్గం, ఇది మీకు కలుగుగాక' అని 'దదామి' మొదలయిన మంత్రం తెలుపుతోంది. అందుచేత ఆ మార్గాలలో ఉండటమే తపస్సుల యొక్క తపస్సు అని చెప్పబడుతోంది. దేవమార్గం, పితృమార్గం, బ్రహ్మమార్గం. ఇలా మూడు విధాలుగా ఉన్న కర్మమునూ, గురువుగారి పరిచర్యనూ రెండిటినీ విభజించుకొని ఆచరించటమే దుష్కరమయిన తపస్సు అంటారు. ఇటువంటి దుష్కర తపస్సు చేసియే దేవతలు ఉత్తమ స్థితిని పొందారు. అందుచేత గృహస్థధర్మాన్ని చక్కగా నిర్వహించడమే దుష్కరమని మీకు చెపుతున్నాను. ఈ గృహస్థంలోనే అంతా ఇమిడి ఉంది. ఈ గృహస్థ విధితో చేసే కర్మ రూప మయిన తపస్సే ప్రజలకు మూలం. శ్రేష్ఠం కూడ - ఇందులో సందేహం లేదు. సుఖ దుఃఖాదులైన ద్వంద్వాలకు లోను కాని, మత్సర రహితులయిన జ్ఞానులు దీన్నే తపస్సు అంటారు. బ్రహ్మ చర్యం మొదలయిన వ్రతాలను లోకంలో మధ్యమ తపస్సు అంటారు. విఘసాన్ని తినేవారు ఎవరూ కదల్పలేని, తిరస్కరింపలేని పదవిని పొందుతారు. ఉదయమూ, సాయంకాలమూ తన కుటుంబంలో యథావిధిగా అతిథులకూ, దేవతలకూ, పితృదేవతలకు, తన వారికి విభజించిపెట్టి మిగిలిన దానిని తినేవారిని విఘసాశులు అని అంటారు. అందుచేత స్వధర్మాచరణం చేస్తూ, చక్కని వ్రతా లాచరించే సత్యభాషణులు సంశయాలు నశించి లోకానికి గురువు లవుతారు. దుష్కరమైన ఇటువంటి తపస్సు చేసేవారు ఇంద్రలోకం చేరి, మాత్సర్య రహితులై అక్కడ చాలా సంవత్సరాలు నివసిస్తారు.'

అర్జునుడు ఇలా అన్నాడు. ధర్మార్థ సహితమైన ఆ హిత వాక్యాలు విని బాలకులు గృహస్థాశ్రమం కంటె ఇతరాశ్రమాల్లో సిద్ధిలేదని తలచి గృహస్థాశ్రమాన్ని ఆశ్రయించారు. సర్వజ్ఞా ! నరోత్తమా ! స్థిరమైన ధైర్యం వహించి శత్రురహితమైన ఈ భూమి నంతటినీ పాలించు.

12. నకులుడు గృహస్థధర్మమును ప్రశంసించుట.

"అర్జునుని మాటవిని, ధార్మిక శ్రేష్ఠుడయిన ధర్మరాజును చూసి విశాల వక్షఃస్థలమూ, పెద్దపెద్ద చేతులూ, ఎఱ్ఱని ముఖమూ కల మితభాషి, మహామేధావి అయిన నకులుడు అన్నమనసును అనుసరిస్తూనే ఇలా అన్నాడు. "మహారాజా ! విశాఖయూప

క్షేత్రంలో దేవతలంతా అగ్నిని ఆరాధించారు. అందుచేత దేవతలు కర్మఫలాన్ని నమ్మేవారు అని తెలుసుకో. ఆస్తిక భావంలేని భూతాలకు కూడా, ప్రాణాలిచ్చే పితరులు కూడా విధిని పరిశీలించి కర్మనే చేస్తూ ఉంటారు. వేద నాదాలను విసర్జించిన వారినే పూర్తి నాస్తికులంటారు. అన్ని కర్మలలోను వేదం చెప్పిన దాన్ని విడిచిన విప్రుడు, దేవయానం ద్వారా బ్రహ్మలోకాన్ని పొందలేడు. ఆశ్రమాలన్నింటినీ మించినదీ గృహస్థాశ్రమం అని, వేదం మీద నిశ్చితబుద్ధి కలవారు చెప్పారు. వేద మెరిగిన బ్రాహ్మణులున్నారు. వారినుండి ఈ విషయం తెలుసుకో. ధర్మమార్గంలో పొందిన ధనాన్ని యజ్ఞాల్లో సమర్పించే సుకృతాత్ముడే సాత్త్వికు డయిన త్యాగి అవుతాడు. గృహస్థసుఖాన్ని చూడక వానప్రస్థసన్యాసాలలో ఆసక్తి కల్గి ఆత్మత్యాగం చేసే వానిని తామసత్యాగి అని అంటారు. కుంతీపుత్రా ! ఇల్లు లేకుండా బిచ్చమెత్తుతూ, ఏ చెట్టు మొదట్లోనో కూర్చుని, ముని వృత్తితో వంట చేసుకోకుండా ఎప్పుడూ యోగంతో ఉండే భిక్షుకుడే త్యాగి అనబడతాడు. కోపం కాని, సంతోషం కాని లేకుండా ముఖ్యంగా లోభం (పిసినారి తనం) విడిచి, వేదం అధ్యయనం చేసే బ్రాహ్మణుడే త్యాగి అనబడతాడు. ఒకవైపు గృహస్థాశ్రమం ఒక దానిని మరొకవైపు మిగిలిన బ్రహ్మచర్య, వానప్రస్థ, సన్యాసాశ్రమాలను మూడింటినీ త్రాసులో వేసి, తూచారని ప్రాజ్ఞులు చెపుతారు. **అలా తూచి, గృహస్థాశ్రమంలోనే కామమూ, స్వర్గమూ ఉన్నట్లు తెలిసికొని మహర్షులు ఇదే సన్మార్గం అని భావించారు. లోకం తెలిసిన వారు ఇలాగే వడుస్తారు.** ఈ విషయమంతా తెలిసికొని, ఫలాపేక్ష లేకుండా ప్రవర్తించే వాడే త్యాగి. ఈ విషయం తెలియకుండా, మూడునివలె ఇల్లు విడిచి (సంసారం వదలి) అడవులకు వెళ్లేవాడు త్యాగికాడు. ధర్మం అనే ధ్వజం ధరించిన వాడు కోరికలపై మనసు పెట్టితే, వాడి మెడకు యముడు మృత్యుపాశం తగిలిస్తాడు. అభిమానంతో (నేను చేస్తున్నాను అనే భావంతో) చేసే పని ఫలితం ఇవ్వదు. రాజా ! త్యాగంతో (అభిమానం విడిచి) చేసినదంతా మహాఫలం ఇస్తుంది. శమం, దమం, ధైర్యం, సత్యం, శుచిత్వం, ఆర్జవం, యజ్ఞం, స్థిరత, ధర్మం - వీటితో కూడిన ప్రవర్తన మహర్షులకు హితమయినది. ఈ గృహస్థ ధర్మంలో పితరులకు, దేవతలకు, అతిథులకు చేసే పనులే ప్రశంసార్హాలు. మహారాజా ! ఇందులో ధర్మ, అర్థ, కామాలు మూడూ మాత్రమే ఫలాలు. నిషేధింపబడిన ఈ గృహస్థ ధర్మంలో ప్రవర్తించే త్యాగికి ఎన్నడూ భ్రష్టత కలగదు.

నిష్కల్మషుడై, ధర్మాత్ముడయిన ప్రజాపతి, భూరి దక్షిణలతో నన్ను పూజిస్తారని కదా ప్రజలను సృష్టించాడు. తీగలు, చెట్లు, ఓషధులు, మేధ్యములయిన పశువులు, వీనినన్నిటిని యజ్ఞంకోసమైన హవిస్సులుగా బ్రహ్మ సృష్టించాడు. గృహస్థాశ్రమంలో ఉన్నవానికి,

ఆ యజ్ఞకర్మ సంకెళ్లవలె ఊడదీయలేనిది. అందుచేత గృహస్థధర్మం చాలా కష్టమైనది. పొందరానిది. ఆ ధర్మాన్ని పొందిన గృహస్థులు పశువులూ, ధన ధాన్యాలను సంపాదించుకొని కూడా, యజ్ఞాలు చేయకపోతే వారికి శాశ్వతంగా పాపఫలం నిలుస్తుంది. కొందరు బుషులు వేదాధ్యయన మనే యజ్ఞం చేస్తారు. మరికొందరు జ్ఞానయజ్ఞం చేస్తారు. ఇంకా కొందరు మహా యజ్ఞాలను మానసికంగానే చేస్తారు. ఇలా మనసును స్థిరపరచుకొని, కర్మమార్గంలో ఉండి, బ్రహ్మభూతుడయిన ద్విజుని దేవతలు కూడ ఇష్టపడతారు. చిత్ర విచిత్రాలయిన రత్నాలు ఆయాప్రదేశాల నుండి తెచ్చి, యజ్ఞాల్లో వాటిని దాన మివ్వకుండా నాస్తికవచనాలు చెపుతున్నావు. రాజా ! కుటుంబ వ్యవస్థలో నిలిచామంటే త్యాగం అనేదే కనపడదని నా అభిప్రాయం. ఆ త్యాగం రాజసూయం, అశ్వమేధం మొదలయిన యజ్ఞాలలో మాత్రమే కనిపిస్తుంది. రాజా ! ఇంకా ఏవయినా విప్రులు చేసే మంచి యజ్ఞాలను ఇంద్రునివలె చెయ్యి. **రాజు పారబడితే ప్రజలను దొంగలు దోచుకొంటారు. ప్రజలను రక్షించవి ఆ రాజునే 'కలి పురుషుడు' అంటారు.** గుర్రాలు, ఆవులు, దాసీలు, ఏనుగులు, గ్రామాలు, జనపదాలు, భూములు, గృహాలు మొదలయినవి ద్విజాతులకు దానం చెయ్యకుండా, వారి మీద అసూయపడితే మనం రాజ రూపంలో ఉన్న కలి పురుషులం అవుతాం. దాన మివ్వకుండా, దీనులను రక్షించకుండా, రాజ పాపాలను మూట గట్టుకుంటే మనం దుఃఖాలే అనుభవిస్తాం కాని సుఖభోగాలు ఎన్నడూ అనుభవించం.

రాజా ! యజ్ఞాలు చెయ్యకుండా, పితృదేవతలను తృప్తిపరచకుండా, పుణ్యతీర్థాల్లో స్నానమాడకుండా సన్యాసం స్వీకరిస్తే, గాలికి చెదిరిపోయిన మేఘంలా ముక్కలైపోతావు. ఈ లోకానికీ, పైలోకానికీ కూడా భ్రష్టుడవై మధ్యలో వ్రేళ్లాడతావు. లోపలి, వెలుపలి వ్యాసంగాలకు కారణమయిన మనస్సును విడిచిన వాడే త్యాగి. ఊరకే సంసారం విడిచి పారిపోతే వాడు త్యాగి కాడు. ఏ ఆటంకమూ లేని ఈ గృహస్థ ధర్మంలో ఉంటే బ్రాహ్మణునకు ఏ వినాశమూ ఎప్పుడూ కలగదు. దేవేంద్రుడు రాక్షససైన్యాన్ని చంపినట్లు, సంపన్నులయిన శత్రువులను యుద్ధంలో సంహరించావు. కాని ఇపుడు దుఃఖిస్తున్నావు. పూర్వులంతా ఇష్టపడేదీ, పాటించేదీ అయిన స్వధర్మం మీద శ్రద్ధ కలవాడెవడయినా ఇలా శోకిస్తాడా ? మహారాజా ! క్షత్రియ ధర్మమయిన పరాక్రమంతో భూమిని జయించి, మంత్రవేత్తలకు అర్పించి, నీవు బ్రహ్మలోకానికి వెడతావు. ఇక ఇపుడు నీవు శోకింప వలసిన పనిలేదు."

13. సహదేవ వాక్యము.

వెంటనే సహదేవుడు ఇలా అన్నాడు. "బాహ్యద్రవ్యం వదిలినంత మాత్రాన సిద్ధి కలగదు. శరీరంలో మనసు కల్పించే ద్రవ్యం వదిలితే సిద్ధి కలుగుతుంది. లేదా కలగక పోవచ్చుకూడ. బాహ్యద్రవ్యం విడిచి కోరికలు చావని వారికి కలిగే ధర్మమో సుఖమో, మన శత్రువులకు కలుగుగాక ! శరీర సంబంధమయిన ద్రవ్యం వదిలి, భూమిని పరిపాలించే వానికి కలిగే ధర్మమూ, సుఖమూ మన మిత్రులకు కలగాలి. **రెండక్షరాలు.... మృత్యువు. మూడుక్షరాలు శాశ్వతమైన బ్రహ్మము, 'మమ' (నాది) అనేది మృత్యువు. 'న మమ' అనేది శాశ్వత బ్రహ్మము.* రాజా ! అందుచేత బ్రహ్మము - మృత్యువు ఆత్మనే ఆశ్రయించి ఉంటాయి. కనపడకుండా ఉండి, భూతాలను కలహించుకొనేటట్లు చేస్తున్నాయి. ఇందులో సందేహంలేదు.** ఈ సత్యానికి (జీవాత్మకు) నాశంలేదని నిశ్చయమైతే, అపుడు ప్రాణుల శరీరాన్ని అంతం చేసిన వాడు హింసను పొందడు. అలా కాకుండా సత్యానికి ఉత్పత్తీ, ప్రళయమూ తోబుట్టువులయితే, శరీరం పోతే ఆత్మకూడా నశించాలి. అపుడు వైదిక మయిన కర్మమార్గమే వ్యర్థమై పోతుంది. అందుచేత ఏదోఒక మార్గం పట్టుకొని వ్రేలాడకుండా, తెలివైనవాడు పూర్వులు నడిచిన మార్గంలో ప్రవర్తించాలి.

ఈ గృహస్థ ధర్మం అధమమార్గం అయితే, స్వాయం భువ మనువు, ఇతర చక్రవర్తులూ ఈ మార్గాన్ని ఎందుకు అవలంబించారు ? రాజా ! ఆ చక్రవర్తులు ఉత్తమగుణాలు కల కృత త్రేతాది యుగాలు ఎన్నో భూమిని పాలించారు / అనుభవించారు.

చరాచరాలతో నిండిన ఈ భూమి నంతా సంపాదించి కూడా సరిగా అనుభవించని రాజు యొక్క జీవితం వ్యర్థం. లేదా - అడవిలో నివసిస్తూ, అడవిలోని పదార్థాలతోనే బ్రతుకుతూ, ఆ పదార్థాల మీద మమకారం కలిగి ఉంటే అపుడయినా వాడు మృత్యువు నోట్లో ఉన్నట్లే. భారతా ! అన్నిప్రాణుల లోపల, వెలుపల ఉండే స్వభావాన్ని చూడు - ఎవరు ఆ ఆత్మరూపమయిన దాన్ని చూస్తారో, వారే మహాభయం నుండి విముక్తు లవుతారు. నీవే తండ్రివి, తల్లివి, సోదరుడవు - గురువువు. దుఃఖంతో ఏవో వాగాను - దాన్ని నీవే క్షమించాలి. నేను వాగినది నిజమో అబద్ధమో, కాని భక్తితో మాత్రం చెప్పానని నీకు తెలియాలి మహారాజా !"

---

* **ద్వ్యక్షరస్తు భవేన్మృత్యుః త్ర్యక్షరం బ్రహ్మ శాశ్వతమ్ ।**
మమేతి చ భవేన్మృత్యుః న మమేతి చ శాశ్వతమ్ ॥ 4

14. ద్రౌపది దండనీతిని గురించి తెలుపుట.

"తమ్ముళ్లు అలా వేద ధర్మాలను చెపుతూ ఉంటే, కుంతీకుమారుడు ధర్మరాజు ఏమీ మాట్లాడకుండా కూర్చున్నాడు. అపుడు తమ్ముళ్లు చుట్టూరా ఉన్నారు. సింహాలతో, పెద్దపులులతో మదపుటేనుగులతో చుట్టి ఉన్న గజపతిలా ఉన్నాడు ధర్మరాజు. ద్రౌపది అభిమానవతి. విశేషించి ధర్మరాజు ఎదుట. రాజుచేత సదా లాలింపబడుతుంది. ధర్మ మెరిగినది. ధర్మసూక్ష్మం దర్శించగలది. అటువంటి ద్రౌపది ధర్మరాజు నుద్దేశించి ఎంతో మృదువుగా అనునయిస్తూ ఇలా అంది. "ధర్మజా ! ఈ నీ తమ్ముళ్లు చాతక పక్షులవలె నీరసించి పోతున్నారు - ఇంకా ఇంకా కుమిలిపోతూ ఉన్నారు - నీవేమో వారిని ఏమాత్రమూ అభినందించవు. ఏనుగులవంటి నీ తమ్ముళ్లు సదా దుఃఖిస్తున్నారు. సముచితంగా సంభాషించి వారిని సంతోషపెట్టు. రాజా ! పూర్వం ద్వైతవనంలో చలికి, గాలికి, ఎండకు కృశించిన నీ తమ్ములతో నీవు ఇలా ఎలా చెప్పావు ? "జయకాంక్షతో మనం యుద్ధంలో దుర్యోధనుని సంహరించి, పూర్ణమయిన ఈ భూమినంతా పరిపాలించుదాం. రథికుల యొక్క రథాలను విరుగ గొట్టి, ఏనుగులను చంపుదాం. పడిన సారథులతో కూడిన రథాలతో భూమి నంతటినీ నింపుదాం. యోగ్యులకు భూరి దక్షిణలిచ్చి ఎన్నో యజ్ఞాలు చేద్దాం - ఈ వనవాస దుఃఖం మనకు భవిష్యత్తులో సుఖం కలిగిస్తుంది" అని నీవే స్వయంగా అపుడు చెప్పి మళ్లీ ఇపుడు ఎలా మా మనస్సులను హింసిస్తున్నావు ? నిర్వీర్యుడు భూమిని పాలించలేడు. ధనం పొందలేడు. వానియింట్లో బురదలో చేపలవలె, పుత్రులు కూడ మనలేరు. దండనీతి లేని క్షత్రియుడు రాణించడు - భూమిని పొందలేడు. దండనీతిలేని రాజాయొక్క ప్రజలు సుఖపడలేరు. సర్వ ప్రాణుల మీదా మైత్రి, దానమూ, అధ్యయనమూ, తపస్సూ అనేవి బ్రాహ్మణుని ధర్మాలు కాని రాజధర్మాలు కావు. దుర్జనులను శిక్షించటం, సుజనులను రక్షించటం, యుద్ధంలో పారిపోకపోవటం - ఇవి రాజుకు ముఖ్య ధర్మాలు. సహనం - క్రోధం, ఇవ్వడం - పుచ్చుకోవడం, భయం - నిర్భయం, నిగ్రహం - అనుగ్రహం ఈ జంటలు తగురీతిలో ఉండే వాడిని 'ధర్మవేత్త' అంటారు. పాండిత్యం చేత కాని, దానగుణం చేత కాని, బ్రతిమాలటం చేత కాని, యజ్ఞాలు చేసినందువల్ల కాని, భిక్షాటనంచేత కాని నీకీ రాజ్యం లభించలేదు.

నీ శత్రువులసేన పరాక్రమంతో విజృంభించింది. ఏనుగులూ, గుర్రాలూ, రథాలతో నిండిఉంది. ప్రభు, మంత్ర, ఉత్సాహశక్తులతో శ్రేష్ఠమయి కనిపిస్తోంది. కృప, ద్రోణ, కర్ణ, అశ్వత్థామలతో రక్షింపబడుతోంది. అరుత గొప్పదయిన సేనను నీవు సంహరించావు.

అందుచేత ఈ భూమిని అనుభవించు. రాజా ! ఎన్నో జనపదాలతో నిండిన జంబూద్వీపం అంతా నీవు దండంతో జయించావు. రాజా ! జంబూద్వీపంతో సమాన మయినది క్రౌంచద్వీపం - అది మేరువుకు పశ్చిమంగా ఉంది. దాన్ని నీవు దండంతో జయించావు. క్రౌంచద్వీపంతో సమానమైనది శాకద్వీపం. మేరువుకు తూర్పున ఉంది. దాన్ని నీవు దండంతో చూర్ణంచేశావు. మేరువుకు ఉత్తరాన శాకద్వీపంతో సమానమైన భద్రాశ్వద్వీపం కూడా నీవు దండంతో జయించావు. ఎన్నో గ్రామాలున్న ద్వీపాలూ, ద్వీపాంతరాలూ నీవు సాగరంలోకి చొరబడి దండం చేతనే జయించావు. ఇలా ఎన్నో ఘన కార్యాలు చేశావు. ద్విజులంతా నిన్ను పూజిస్తున్నారు. అయినా నీకు తృప్తిలేదు. మదించే వృషభాల వలె, ఘీంకరించే ఏనుగుల వలె ఉన్న నీ తమ్ముళ్లను చూసి అభినందించు రాజా ! వీరంతా దేవతా సమానులు - శత్రుంజయులు - వీరిలో ప్రతీ ఒక్కడూ నాకు సుఖము చేకూర్చగల వాడే అని నా భావం. ఆటువంటి నరోత్తములు అయిదుగురు నా భర్తలు - ఇక వేరే చెప్పాలా ? శరీర చైతన్యానికి ఇంద్రియాల వలె ఉన్నారు.

మా అత్త కుంతి ఎన్నడూ అబద్ధం ఎరుగదు. సర్వజ్ఞురాలు, చక్కగా దర్శిస్తుంది. ఆమె నాతో ఒకసారి "పాంచాలీ ! ధర్మరాజు చురుకైన పరాక్రమంతో వేల కొద్దీ రాజులను సంహరించి నిన్ను ఎంతో సుఖపెడతాడు" అంది. కాని నీ ఈ అజ్ఞానం వల్ల అదంతా వ్యర్థమైన మాటే అనిపిస్తోంది. మహారాజా ! పెద్ద అన్న గొప్ప వెర్రివాడు. మిగిలిన తమ్ముళ్లంతా వానినే అనుసరిస్తారు. నీ వెర్రితనంతో పాండవులంతా వెర్రి వాళ్లయ్యారు. నీ తమ్ముళ్లు అలా వెర్రి వాళ్లు కాకపోతే రాజా ! నాస్తికులతో పాటు నిన్నూ బంధించి భూమినంతా పాలించి ఉండేవారు. ఇలాగే మూడుడు తనకు శ్రేయస్సును పొందడు. ఇలా తప్పుత్రోవపట్టిన వానికి ధూపాలతో, కాటుకలతో, నస్యకర్మలతో చికిత్స చెయ్యాలి. నేను లోకంలో స్త్రీలలో అందరికంటె అధమురాల నయ్యాను. పుత్ర సమానులచేత అవమానింపబడ్డాను. అయినా ఇంకా జీవించా లనుకొంటున్నాను. నీ కోసం ప్రయత్నించే నీ సోదరులందరినీ కాదని, నీవు భూమినంతటినీ వదలి, స్వయంగా ఆపద కొని తెచ్చుకొంటున్నావు. ఇపుడు నామాట అసత్యం కాదు. రాజు లందరికీ ఇష్టులై పూర్వం మాంధాత, అంబరీషుడు భూమిమీదవెలుగొందినట్లే నీవూ వెలుగొందుతున్నావు. ప్రజలందరినీ ధర్మంతో రక్షిస్తూ పర్వతాలూ, వనాలూ, ద్వీపాలతో కూడిన భూదేవిని పరిపాలించు, మనసు పాడు చేసుకోకు. రాజోత్తమా ! వివిధ యజ్ఞాలు చెయ్యి. శత్రువులను జయించు. ధనాలు, భోగాలు, వస్త్రాలు విప్రులకు సమర్పించు."

15. రాజదండమును గురించి అర్జునుడు వివరించుట.

"ద్రౌపది మాటలు విని అర్జునుడు మహాభుజుడు, స్థిరుడు అయిన ధర్మరాజు మీది గౌరవంతో ఇలా అన్నాడు. "దండం ప్రజలను శాసిస్తుంది. దండమే పూర్ణ రక్షణ నిస్తుంది. దండం నిద్రించిన వారిపట్ల (కూడ) మేల్కొని ఉంటుంది. దండమే ధర్మం అని పండితులకు తెలుసు. రాజా ! దండం ధర్మాన్ని రక్షిస్తుంది. అలాగే సంపదనూ రక్షిస్తుంది. దండం కామాన్నీ రక్షిస్తుంది. అందుచేత త్రివర్గమంటే దండమే. దండమే ధాన్యాన్ని రక్షిస్తుంది. ధనాన్నీ రక్షిస్తుంది. అందుచేత విద్వాంసుడా ! దండం ధరించు. లోకవ్యవహారం పరిశీలించు. కొంతమంది పాపులు రాజదండభయంవల్ల పాపం చేయటం లేదు. యమదండభయంవల్ల కొందరు, పరలోక భయం వల్ల కొందరు, పరస్పరభయంవల్ల కొందరూ పాపం చేయటం లేదు - ఇలా స్వభావ సిద్ధమయిన లోకంలో అంతా దండంలోనే నిలిచి ఉంది. దండం వల్ల భయంతోనే కొంతమంది ఒకరి నొకరు పీక్కుతినటం లేదు. దండమే రక్షింపకపోతే ప్రజలంతా గాఢాంధకారంలో మునిగి పోతారు. లొంగని వారిని లొంగదీసుకొంటుంది. దుష్టులను దండిస్తుంది. దమనమూ, దండనమూ చేస్తుంది కనుకనే దండమయిందని పండితు లంటారు. బ్రాహ్మణులకు కఠినమైన మాటయే దండం. క్షత్రియులకు జీతం తగ్గించటమే దండం. వైశ్యులకు పన్ను ఎక్కువ వేయటమే దండం. ఇక శూద్రునకు దండమే లేదు. రాజా ! మానవులు మత్తెక్కి ప్రవర్తింపకుండాను, సంపదలను రక్షించడం కోసమూ, దండమనే పేరుతో లోకంలో మర్యాద ఏర్పాటు చేయబడింది. దండ పురుషుడు తిరిగే చోట, నాయకుడు అపరాధులపై దృష్టి సారిస్తే ప్రజలు ఎన్నడూ ప్రమాదపడరు. బ్రహ్మచారి, గృహస్థుడు, వానప్రస్థుడు, సన్యాసి - వీరంతా దండ భయంతోనే సక్రమ మార్గంలో ప్రవర్తిస్తున్నారు. (దండ) భయంలేని మానవుడు యజ్ఞం చెయ్యడు. దానం చెయ్యాలని భావించడు. మాటమీద నిలవడు. శత్రువుల మర్మస్థానాలను ఛేదించకుండా, కష్టమైన పని చేయకుండా, బెస్తవానివలె ఇతరులను చంపకుండా, మహాసంపదలను ఎవడూ పొందడు. శత్రువును హింసించని వానికి కీర్తి లేదు. ధనం లేదు. ప్రజలు లేరు. వృత్రాసురుని సంహరించటం చేతనే, ఇంద్రుడు మహేంద్రు డయ్యాడు. కొట్టే (దండంతో) దేవతలనే లోకం బాగా పూజిస్తోంది. రుద్రుడు. కుమారస్వామి, ఇంద్రుడు, అగ్ని, వరుణుడు, యముడు, కాలుడు, వాయువు, మృత్యువు, కుబేరుడు, సూర్యుడు, వసువులు, మరుత్తులు, సాధ్యులు విశ్వేదేవతలు - వీరందరి ప్రతాపానికి భయపడి ప్రజలు వీరిని పూజిస్తున్నారు. అంతేకాని బ్రహ్మనుకాని, ద్వాదశాదిత్యులలోని ధాతనుకాని, పూషను కాని ఎన్నడూ పూజించరు. సర్వభూతాలపట్ల

మధ్యస్థులయి, శమ, దమ పరాయణులయిన వారిని ప్రశాంతులయిన కొందరు అన్ని కర్మలలోనూ పూజిస్తారు. అహింసతోనే జీవించే వాడు ఒక్కడయినా నాకు కనపడడు. జంతువులు జంతువులను తిని, బ్రతుకుతున్నాయి. బలహీనులను తిని, బలవంతులు బ్రతుకుతున్నారు. ముంగిస ఎలుకలను తింటుంది. పిల్లి ముంగిసను తింటుంది. కుక్కపిల్లిని తింటుంది. పులి కుక్కను తింటుంది. మానవుడు వీటన్నిటిని తింటున్నాడు. చూడు. కాల మెట్లా అయిందో - చరాచరాత్మక మయిన ఈ ప్రపంచ మంతా ప్రాణానికి ఆహారమవుతోంది. ఈ విధాన మంతా దైవం ఏర్పరచింది. వివేకం కలవాడు ఈ విషయంలో పొరబడడు. రాజా ! దైవం నిన్ను ఎందుకు సృష్టించాడో అలాగే నీవు ప్రవర్తించాలి. కోపమూ, సంతోషమూ రెండూ విడిచి అడవికి పోయిన తపస్వులు కూడ, ప్రాణులను వధించకుండా ప్రాణాలు నిలుపుకోలేరు. నీటిలో ఎన్నో ప్రాణులున్నాయి. భూమిలో, పళ్లలో ఎన్నో జీవులున్నాయి. వాటిని చంపని వాడు ఒక్కడయినా లేడు. ప్రాణాలను నిలుపుకొనడం కంటె వేరేముంది ? కొన్ని ప్రాణాలు చాలా సూక్ష్మశరీరం కలవి. కొన్ని ఊహిస్తేనే తెలుస్తాయి. ఱెప్పపాటు మాత్రాన అవి చచ్చిపోతాయి. క్రోధమూ, మాత్సర్యమూ వదలి గ్రామం విడిచిన మునులుకూడా, అరణ్యంలో మోహవశులై కుటుంబ ధర్మానికి లోబడినట్లు కనిపిస్తోంది. భూమి బ్రద్దలు చేసి, ఓషధీలతలను నరికివేసి, చెట్లనూ పశుపక్ష్యాదులనూ చంపి, మానవులు యజ్ఞాలు చేస్తున్నారు. వారు స్వర్గం పొందుతున్నారు కూడ. దండనీతిని అమలు చేస్తే సర్వ ప్రాణుల పనులూ సమకూరుతాయి. ఇందులో నాకు సంశయం లేదు.

లోకంలో దండం లేకపోతే ఈ జనులంతా చనిపోయి ఉండేవారు. నీళ్లలో పెద్దచేపలు చిన్నచేపలను చంపితిన్నట్లుగా, బలవంతులు బలహీనులను మ్రింగి వేసేవారు. చక్కగా ప్రయోగించిన దండం ప్రజలను రక్షిస్తుంది. బ్రహ్మ పూర్వం చెప్పినది సత్యమే. ఆరిపోయిన నిప్పులు కూడా, మళ్లీ ఊదితే, దండానికి భయపడి మళ్లీ మండుతాయి. మంచి - చెడులను విభజించే దండమే లేకపోతే లోకమంతా అంధకారమే అయిపోతుంది. కొద్దిగా కూడా ఏమీ తెలియకపోతుంది. మర్యాదలు / హద్దులు లేని నాస్తికులు, వేదనిందకులు కూడా దండం వెంటనే అనుభవించి మర్యాదలు పాటిస్తారు. లోకమంతా దండం వల్లనే నడుస్తోంది. దండభయం వల్ల కాకుండా, సహజంగానే స్వచ్ఛంగా ప్రవర్తించే వాడు లేడు. దండ భయం వల్లనే మానవుడు పాపాలు చేయకుండా ప్రవర్తిస్తాడు. నాలుగు వర్ణాలూ సంతోషించడానికి; చక్కని నీతిని తీసికొనిరావటానికి; భూమిపై ధర్మాన్ని, అర్థాన్ని రక్షించటానికి బ్రహ్మ ఈ దండం ఏర్పాటు చేశాడు. దండం వల్ల భయపడక పోతే

పక్షులూ, క్రూరమృగాలు పశువులనూ, మనుష్యులనూ, యజ్ఞం కోసమైన హవిర్భవ్యాలను తినేసేవి. దండనీతి రక్షించకపోతే, విద్యార్థి అధ్యయనం చెయ్యడు. ఈనిన ఆవును పాలు పితకరు. కన్యలకు పెళ్లిళ్లు కావు. దండమే రక్షింపబడకపోతే, అంతటా లోపమే తాండవిస్తుంది. (సర్వమూ నాశనమగును). మర్యాదలు, హద్దులు తెగిపోతాయి. మమకారం అనేదే తెలియదు. (ధర్మయుతమయిన మమకారం తెలియకుండా పోతుంది). దండమే లేకపోతే, ఏండ్ల తరబడి సాగే సత్రయాగాలు, విధిపూర్వకమయిన దక్షిణలు సాగవు. అనగా భయం లేకుండా సంచరిస్తారు.

దండమే లేకపోతే, మానవులు ధర్మశాస్త్రానుసారంగా ఆశ్రమ ధర్మాలు పాటింపరు. ఏ ఒక్కడూ విద్యను అధ్యయనం చెయ్యడు. దండమే లేకపోతే... ఒంటెలు, ఎద్దులూ, గుర్రాలూ, కంచర గాడిదలూ వాహనాలను లాగవు. దండమే లేకపోతే, సేవకులు మాట వినరు. పిల్లలు కూడా ఎన్నడూ మాట వినిపించుకోరు. వయసులో ఉన్నయువతి ధర్మం మీద నిలవదు. జనులంతా దండంమీదే నిలుస్తారు. దండం వల్లనే భయం ఏర్పడుతుందని పండితు లంటారు. ఈ లోకమూ, స్వర్గలోకమూ కూడా దండం మీదనే నిలుస్తాయి. శత్రునాశకమయిన దండం చక్కగా అమలు పరిస్తే, అక్కడ అసత్యం కాని, పాపం కాని, మోసం కాని కనపడదు. దండ మెత్తి నిలబడకపోతే కుక్క హవిస్సును నాకి పోతుంది. దండంతో రక్షించకపోతే కాకి పురోడాశాన్ని ఎత్తుకు పోతుంది. ఈ రాజ్యం ధర్మంతో లభించినా, అధర్మంతో లభించినా శోకించడం కాదు చేయవలసినది. భోగాలు అనుభవించు, యజ్ఞాలు చెయ్యి. శ్రీమంతులు పరిశుద్ధ వస్త్రాలు ధరించి, ఫలదానాలు ఇస్తూ, ఉత్తమ మయిన అన్నం తింటూ సుఖంగా ధర్మం ఆచరిస్తున్నారు. పనులన్నీ ధనానికి వశమై ఉన్నాయి. సందేహం లేదు. ఆ ధనం దండానికి వశమై ఉంది. చూడు దండం గౌరవం ఎంతటిదో ! **లోకయాత్ర కోసమే ధర్మం ప్రవచించారు. అహింస, అసాధుహింస ఏది చెయ్యాలి ? అప్పుడు ధర్మ సూక్ష్మం పరిగ్రహించి నిర్ణయించాలి.*** మిక్కిలిగా గుణాలే కలిగినదీ, మిక్కిలిగా గుణాలు లేనిదీ ఏపనీ కనిపించదు. అన్నిపనులలోనూ మంచీ, చెడూ రెండూ కనిపిస్తాయి. వ్యవసాయులు చితకగొట్టి, కొమ్ములు విరగగొట్టి మానవులు ఎద్దులను వశపరుచుకొంటున్నారు. దానితో అవి బరువులు మోస్తున్నాయి. ఈ విధంగా వ్యాకులమయిన లోకమంతా దండం చేత చక్కగా నలిగింది. అందుచేత రాజా ! ఆయా న్యాయాలతో ప్రాచీన ధర్మాన్ని చక్కగా ఆచరించు. కుంతీపుత్రా ! యజ్ఞాలు చెయ్యి.

---

* **లోకయాత్రార్థమేవేహ ధర్మప్రవచనం కృతమ్ ।**
అహింసా సాధుహింసా చ శ్రేయాన్ధర్మపరిగ్రహః ॥ 49

దానాలియ్యి. ప్రజలను రక్షించు, ధర్మం చక్కగా పాలించు, శత్రువులను సంహరించు, మిత్రులను రక్షించు. శత్రువులను చంపేటప్పుడు నీకు జాలి కలుగకుండుగాక! పాపులయిన శత్రువులను చంపినపుడు, కర్తకు ఏ మాత్రమూ పాపం కలుగదు. ఆయుధం ధరించి తన్ను చంపటానికి వచ్చేవానిని, ఆయుధం దాల్చి చంపే వాడు ఏమీ భ్రూణహత్యచేసిన వాడు కాడు. ఆ కోపాన్ని ఈ కోపం పూర్తిగా మింగివేస్తుంది. ప్రాణులన్నిటిలో ఉన్న ఆత్మ చంపరానిది. ఆత్మయే చంపలేని దయినపుడు ఎవడు ఎవని చేత వధ్యుడవుతాడు? ఆత్మచంపదు - చంపబడదని భావం. మానవుడు కొత్తయింట్లో ప్రవేశించినట్లు, జీవుడు ఆయా శరీరాలను పొందుతూ ఉంటాడు. జీవుడు పాత శరీరాలను విడిచి కొత్త శరీరాలను పొందుతున్నాడు. తత్వం తెలిసిన వారు దీనినే 'మృత్యువు' అంటున్నారు."

16. రాజ్యము చేపట్టి యజ్ఞములు చేయుమని భీముడు ధర్మరాజును ప్రోత్సహించుట.

"అర్జునుని మాటలు విని క్రోధమూ, తేజస్సూ కల భీముడు ధైర్యం తెచ్చుకొని ధర్మరాజుతో ఇలా అన్నాడు. రాజా ! నీవు ధర్మాలు తెలిసినవాడవు. నీకు తెలియనిది ఏదీ లేదు. నీ ప్రవర్తనను తెలుసుకొంటున్నాం కాని అలా ఆచరింపలేకపోతున్నాం. చెప్పకూడదు, చెప్పకూడదు అని అనుకొంటున్నాను కాని దుఃఖం ఆపుకోలేక చెపుతున్నాను. అది తెలుసుకో రాజా ! నీ మోహం చేత అంతా సందేహంలో పడింది. మా తనువులూ, మనసులూ వ్యాకులమయి, దుర్బలమయ్యాయి. నీవు లోకానికి రాజువు - సర్వ శాస్త్రాలూ తెలిసినవాడవు. దీనత్వంతో అల్పమానవునివలె ఎలా మోహం పొందుతున్నావు ? పూర్వమూ, ఇప్పుడూ కూడా లోకంయొక్క మంచి మార్గమూ, చెడుమార్గమూ కూడా నీకు తెలుసు. నీకు తెలియని దేదీ లేదు. ఇటువంటి వాడవు కాబట్టే రాజ్యం పాలించడానికి తగిన యుక్తిని చెపుతున్నాను. ఏకాగ్రతతో విను.

వ్యాధి అనేది రెండు విధాలుగా పుడుతుంది. ఒకటి శరీరానికి, మరొకటి మనస్సుకూ సంబంధించినవి - అవి రెండూ ఒక దానితో ఒకటి సంబంధించే పుడతాయి - విడివిడిగా పుట్టవు. శరీర రోగం వల్ల మనస్సుకూ, మానసిక రోగంవల్ల శరీరానికి రోగం కలుగుతూ ఉంటుంది. ఇది నిశ్చయం. **జరిగిపోయిన శారీర మానసిక దుఃఖాలను తలచుకొని ఏడ్చేవానికి, ఒక దుఃఖం చేత మరో దుఃఖం కలుగుతుంది. ఇలా రెండు అనర్థాలు పొందుతాడు.** శీతము, ఉష్ణము, వాయువు అనేవి శరీరంలో పుట్టే మూడు గుణాలు. ఆ గుణాలు సమమైన పాళ్లలో ఉండటమే ఆరోగ్యవంతుని లక్షణం. ఈ మూడింటిలో ఒకటి ప్రకోపిస్తే, దాన్ని తగ్గించటానికి తగిన విధానం చెప్పబడుతోంది.

వేడి వల్ల శ్లేష్మమూ, శీతం వల్ల పైత్యమూ (సమమయి) స్వస్థమవుతాయి. సత్త్వం, రజస్సు, తమస్సు అని మనోగుణాలు మూడు. వాని సమత్వమే ఆరోగ్యవంతుని లక్షణం. వాటిలో ఏదో ఒకటి ప్రకోపిస్తే, తగిన చికిత్స చెపుతున్నాడు. హర్షం శోకాన్ని, శోకం హర్షాన్ని బాధించి చక్కబరుస్తాయి. ఒక్కొక్కడు సుఖపడుతూ దుఃఖాన్ని స్మరిస్తాడు - మరొకడు దుఃఖిస్తూ సుఖాన్ని స్మరిస్తాడు. కాని నీవు దుఃఖాతిశయంతో దుఃఖపడటమూ లేదు. సుఖాతిరేకంతో సుఖపడటమూ లేదు. పోనీ సుఖపడుతూ దుఃఖాన్ని స్మరించటమూ లేదు. దుఃఖిస్తూ సుఖాన్నీ స్మరించటం లేదు. రాజా ! అందుకే దైవం బలీయమయింది. లేదా నీ స్వభావం దుఃఖించటమే ఏమో ! అందుకే విలపిస్తున్నావేమో !

లేకపోతే ద్రౌపది ఒకే వస్త్రం ధరించి రజస్వల అయి సభలోకి పాండవులంతా చూస్తూఉండగా వచ్చింది. కదా ! ఆ దుఃఖాన్ని ఎందుకు తలుచుకోవు ? నగరం నుండి వెడలగొట్టడమూ, మృగ చర్మాలతో పంపడమూ, అరణ్యాల్లో నివాసమూ వీటిని ఎందుకు తలచుకోవు? జటాసురుని వల్ల పొందిన కష్టమూ, చిత్రసేనునితో యుద్ధమూ, సైంధవుని వల్ల పడిన కష్టమూ - వీటిని ఎలా మరిచి పోయావు ? ఇంకా, అజ్ఞాతవాసంలో రాజపుత్రి అయిన ద్రౌపదిని కీచకుడు కాలితో తన్నడం ఎలా మరిచిపోయావు ?

రాజా ! మనం బలవంతులం. దేవతలకు కూడ జయింపశక్యం కాని వాళ్లం - కాని విరాట నగరంలో సేవా వృత్తిని ఎందుకు స్వీకరించామో ఒక్కసారి గుర్తు చేసుకో.

నీకు ద్రోణ భీష్ములతో జరిగిన యుద్ధం వంటిదే ఇపుడు నీవు నీ మనసుతో చేయవలసి ఉంది. అది ఇపుడు సమీపించింది. ఈ యుద్ధం బాణాలతో చేసేది కాదు. మిత్రులతో బంధువులతో చేసేది కాదు. ఒక్క ఆత్మతోనే చెయ్యాలి. ఆ యుద్ధం ఇపుడు వచ్చింది. ఈ యుద్ధంలో మనస్సును జయించకుండా నీవు ప్రాణాలు విడిచి పెడితే, మరో శరీరం ధరించి మళ్లీ ఆ శత్రువుతోనే యుద్ధంచెయ్యాలి. అందుచేత కనిపించే స్థూలదేహాన్ని వదలి, తెలియని రూపం కల మనస్సుకు శత్రువులాంటి దయిన ఏకాత్మతను ఇపుడే పొందాలి. దానికి ఇపుడే యుద్ధం చెయ్యి. ఆ యుద్ధంలో గెలవకపోతే ఏ అవస్థ పొందుతావో ! అయినా మహారాజా ! దీన్ని జయించి కృతకృత్యుడవు అవుతావు. ఈ బుద్ధిని స్థిరపరచుకొని, ప్రాణుల జనన మరణాలను తెలిసి, తండ్రి తాతల ప్రవర్తనతో తగినట్లు రాజ్యం పాలించు. సహచరులందరితో దుర్యోధనుడు యుద్ధంలో అదృష్టవశాన చచ్చిపోయాడు. అలాగే ద్రౌపది జుట్టు ముడివేసుకొంది. ఆ అదృష్టంవలన నీవు రాజపదవిని పొందావు. యథావిధిగా దక్షిణలిచ్చి అశ్వమేధం చెయ్యి - మేము నీ సేవకులం. వాసుదేవుడు కూడ నీకు సాయపడతాడు."

17. భీముని మాట కాదని ధర్మరాజు మునివృత్తిని ప్రశంసించుట.

ధర్మరాజు ఇట్లన్నాడు. "అసంతోషం, ప్రమాదం, మదం, రాగం, ప్రశాంతత లేకపోవడం, బలం, మోహం, అభిమానం, అన్నిటా ఆవేశమూ – ఈ పాపాలు ఆవేశించి నీవు రాజ్యం కోరుతున్నావు. సకామకర్మలు, బంధనాలు త్రెంచుకొని ప్రశాంతుడవై సుఖపడు. ఈ భూమినంతా పరిపాలించే మహారాజుకు కూడా ఒకటే పొట్ట ఉంటుంది. దీని నెందుకు ప్రశంసిస్తావు. కోరిక అనేది ఒక రోజులో తీర్చలేము. నెలలకొద్దీ నింపినా నిండదు. ఆయువు ఉన్నంతకాలం నింపినా అదితీరదు. రగులు కొల్పితే అగ్ని మండుతుంది. రగుల్కొల్పకపోతే చల్లారిపోతుంది. అందుచేత ప్రజ్వరిల్లే జఠరాగ్నిని కొద్ది అన్నంతో చల్లార్చు. తెలివితక్కువవాడు, అప్రాజ్ఞుడు తన పొట్టకోసం చాలా అన్నం వండుకొంటున్నాడు. అందుచేత ముందు పొట్టను జయించు. తరువాత పృథివిని జయించడం చేత ఈ లోకంతో పాటు పరలోకమూ జయింపబడుతోంది. మానవసంబంధమయిన కామభోగాలనూ, ఐశ్వర్యాన్ని ప్రశంసిస్తున్నావు. భోగాలు వదిలి, తపస్సుచేత దుర్బలులయిన వారు సర్వోత్తమ స్థానం పొందుతున్నారు. రాష్ట్రం యొక్క యోగక్షేమాలు, ధర్మాధర్మాలు నీ మీద ఆధారపడి ఉన్నాయి. ఆ మహాభారం నుండి విముక్తి పొందు. త్యాగాన్నే ఆశ్రయించు.

ఒక్క పొట్ట కోసం, పెద్దపులి ఎంతో తిండి కూడ బెడుతుంది. లోభానికి వశమైన ఇతరమృగాలు దాన్ని ఆశ్రయించుకొని జీవిస్తూ ఉంటాయి. ప్రయత్నపరుడయిన సాధకుడు విషయ పరిత్యాగం చేసి సన్యాసం స్వీకరిస్తాడు. అపుడతడు సంతుష్టుడవుతాడు. కాని విషయోపభోగం చేసేరాజు ఎన్నడూ సంతుష్టుడు కాడు. చూడు ఇద్దరి ఆలోచనల్లో ఎంత తేడా ఉందో ! ఆకులు మాత్రం తినేవారు, గింజలు దంచుకొని తినేవారు – దంతాలే రోళ్లుగా చేసుకొనేవారు, నీరు మాత్రం త్రాగేవారు, వాయువే తినే వారు – వీరు నరకం జయిస్తారు. **రాజు ఈ భూమినంతా పరిపాలింపవచ్చు – కాని కృతార్థుడంటే రాతిని బంగారాన్ని సమబుద్ధితో చూసేవాడే – అంతేకాని రాజు కాదు.** సంకల్పాలు విడిచిపెట్టు, ఆశ, మమకారం విడిచిపెట్టు. ఇహపరాల్లో తరగని, శోకరహితమైన స్థానం పొందు. ఏ ఆశ లేనివారు దుఃఖించరు. కాని నీవెందుకు ఆశను గురించి దుఃఖిస్తున్నావు ? ఆశ, లోభం మొత్తం విడిచిపెడితే, అపనింద నుండి బయటపడతావు. పితృయానం – దేవయానం అని రెండు ప్రసిద్ధ మార్గాలున్నాయి – యజ్ఞాదులు చేసే వారు పితృయానాన్ని, మోక్షార్థులు దేవయానాన్ని అనుసరిస్తారు. తపస్సు, బ్రహ్మచర్యం, వేదాధ్యయనం, వీనితో మహర్షులు శరీరం విడిచి, మృత్యువుకు లోబడకుండా వెడతున్నారు.

లోకంలో బంధనం అనేది ఒక ఆకర్షణ. ఐహికమయిన కర్మ మరో

ఆకర్షణ. ఈ రెండు పాపాల నుండి విముక్తుడయితేనే పరమపదం పొందుతాడు. రాగద్వేషాలు మొ॥ ద్వంద్వాలు విడిచి విముక్తుడై, మోక్షం చక్కగా దర్శించిన జనక మహారాజు పూర్వం పలికిన గాథను ఒక దానిని ప్రజలు ఇలా చెప్పుకొంటారు. ఆహా ! నాకు అంతులేని ధనం ఉంది. కాని కొద్దిగా కూడా నాకు లేదు - మిథిలానగరం కాలిపోతోంది. కాని నాధనం కొద్దిగా కూడా కాలడం లేదు. ప్రజ్ఞ అనే ఎత్తయిన భవనం ఎక్కినవాడు లోకంలో దుఃఖించేవారిని చూసి, మందబుద్ధులవలె తానూ దుఃఖించరాదు. కొండమీద ఉన్నవాడు నేల మీదివారిని చూసినట్లే చూడాలి. **దృశ్యాన్ని చక్కగా చూడగల్గినవాడే కన్నులున్నవాడు, బుద్ధిమంతుడు. తెలియని దానిని తెలియజెప్పి నిర్ణయించేదే బుద్ధి అవబడుతుంది.** బ్రహ్మభావం పొంది, భావితాత్ములయిన విద్వాంసుల వాక్యం మాత్రమే తెలిసిన వాడు గౌరవం పొందుతాడు. **చాలా భూతముల వేర్వేరు స్థితిగతులను ఒకే చోట ఉన్నట్లు చూడగలిగినప్పుడూ, ఒకే చోటినుండి అన్నిచోట్లకు విస్తరించాయని గమనించినపుడూ ఆ జీవుడు బ్రహ్మమే అవుతాడు. అట్టివారే అటువంటి ఉత్తమగతి పొందుతారు. విద్వాంసులుకానిఅల్పబుద్ధులూ, బుద్ధిరహితులూ, అతపస్వులూ ఆ ఉత్తమగతిని పొందలేరు - అంతా బుద్ధిలోనే ప్రతిష్ఠితమై ఉంది."***

18. అర్జునుడు జనకుని కథ చెప్పుట.

వైశంపాయనుడు ఇలా చెపుతున్నాడు. "అలా అని ధర్మరాజు ఊరకున్నాడు. అతని మాటల ములుకులకు శోకాన్ని, దుఃఖాన్ని పొందిన అర్జునుడు ధర్మరాజుతో మళ్లీ ఇలా అన్నాడు. "పూర్వం జరిగిన ఈ ఇతిహాసాన్ని ప్రజలు చెప్పుకొంటూ ఉంటారు. విదేహరాజయిన జనకునకు భార్యతో జరిగిన సంభాషణ ఇది: రాజ్యం విడిచి, భిక్షాటనం చేసుకోవాలని నిశ్చయించుకొన్న రాజుతో అతని భార్య అన్నది. సంపదలూ, సంతానమూ, భార్య, అనేకరత్నాలూ, పవిత్ర మార్గమూ విడిచి జనకుడు మూఢుడయ్యాడు. అతడు నిర్ధనుడై, కోరికలు విడిచి, భిక్షావృత్తి చేసుకోవాలని, అభిమానం కూడా విడిచి ధానాముష్టిని

---

* యదా భూతపృథగ్భావమ్ ఏకస్థమనుపశ్యతి ।
తత ఏవ చ విస్తారం బ్రహ్మ సంపద్యతే తదా ॥ 23
తే జనాస్తాం గతిం యాంతి నావిద్వాంసోఽల్పచేతసః ।
నాబుద్ధయో నాతపసః పర్వం బుద్ధౌ ప్రతిష్ఠితమ్ ॥ 24

A C No 96364

గ్రహించి కూర్చున్నాడు. అపుడు అతని భార్య వచ్చి, ఏకాంతంలో నిర్భయంగా, అభిమానంతో, కోపంతో హేతుబద్ధంగా ఇలా అంది. "ధనధాన్య సంపన్నమయిన నీ రాజ్యం వదలి, భిక్షావృత్తిని, అవలబించి ధానాముష్టి చేపట్టడం నీకు మంచిది కాదు. రాజా ! నీవు చెప్పిన మాట ఒకటి. చేస్తున్న పని మరొకటి. గొప్పదయిన రాజ్యం వదలుకొని, స్వల్పమయిన దానితో తృప్తిపడుతున్నావు. ఇపుడిక నీవు అతిథులను, దేవతలను, మహర్షులను, పితృదేవతలను అర్చింపలేవు. నీ శ్రమ అంతా వ్యర్థమైనట్లే. నీ విపుడు నిష్క్రియుడవు. దేవతలు, అతిథులు, పితృదేవతలు అందరూ నిన్ను విడిచిపెట్టారు. అందుకే సన్యాసం స్వీకరిస్తున్నావు. ఇప్పటిదాకా నీవు లోకానికి ప్రభువువై, వేదత్రయమూర్తు లయిన బ్రాహ్మణులను వేలకొద్దీ పోషించావు. ఇపుడు వారి వల్లనే పోషింపబడాలి అనుకొంటున్నావు. ఉజ్జ్వలమైన సంపదను విడిచి, నీవు ఇపుడు కుక్కవలె కనపడుతున్నావు. నీతల్లికి ఇపుడు కొడుకు లేడు. ఈ కౌసల్యకు భర్తలేడు. ఈ క్షత్రియులంతా ధర్మకాములై నిన్ను సేవిస్తున్నారు. నీ మీద ఎన్నో ఆశలు పెట్టుకొన్నారు. వారిపుడు ఫలకాంక్షులై, దీనులై ఉన్నారు.

రాజా ! శరీరధారులందరూ పరతంత్రులే. మోక్షం అనేది వారి అధీనంలో లేనిది. అందుచేత సంశయమే. అటువంటప్పుడు వీరందరినీ నిష్ఫలులను చేసి నీ వే లోకానికి వెళ్లగలవు ? ధర్మపత్ని అయిన భార్యను విడిచి బ్రతకాలను కొంటున్నావు. ఇటువంటి పాపకర్మునికి పరలోకమూ లేదు, ఇహ లోకమూ లేదు. సువాసనా భరితమైన పూలమాలలు, అలంకారాలు, రకరకాల వస్త్రాలు - అన్నీ వదలి, నిష్క్రియుడవై (సోమరివై) దేనికోసం సన్యసిస్తున్నావు ? అన్ని ప్రాణుల దాహార్తిని తీర్చేపెద్దపవిత్రమైన మడుగు (జలాశయం) లా ఉన్నావు. ఎన్నో ప్రాణులకు ఆశ్రయమిచ్చి, ఫలసంపన్నమయిన మహావృక్షం వలె ఉన్న నీవు, ఇతరులను ఇపుడు ఎలా సేవించగలవు ? అన్ని పనులూ విడిచి, పడియున్న ఏనుగును చిన్న చిన్న జంతువులూ, పురుగులూ తినివేస్తాయి - ఏ పురుషార్థమూ లేని నిన్నూ తింటాయని మళ్లీ చెప్పాలా ? ఎవరో ఒకరు ఈ కమండలువును పగులగొట్టవచ్చు, ఈ దండం దొంగిలించవచ్చు, నీ వస్త్రాన్ని కూడా పట్టుకొనిపోవచ్చు. అపుడు నీమనసు ఎలా ఉంటుంది ? ఇపుడు సర్వమూ విడిచి ధానాముష్టిని గ్రహించావు అనగా అన్నీ గ్రహించి నట్లేకదా ! ఇది నీకు తక్కువతనం కాదా - దిగజారిపోవటం కాదా ! ధానాముష్టి గ్రహించడం కేవలం దేహయాత్ర సాగించటం కోసం అంటే.... నీ ప్రతిజ్ఞ చెడిపోయినట్లే (సర్వ సంగపరిత్యాగం అనేది ప్రతిజ్ఞ). ఇక నీకు నేను ఏమవుతాను ? నాకు నీవు ఏమవుతావు ? నాయందు నీకు అనుగ్రహం ఏమిటి ?

నీకు నిజంగా (మామీద) అనుగ్రహమే ఉంటే ఈ భూమినంతనూ పాలించు. ఈ రాజభవనం, తల్పం, వాహనం, వస్త్రాలు, ఆభరణాలు అన్నీ గ్రహించు. సంపదలు పోయినవారు, నిర్ధనులు, మిత్రులు వదలివేసిన వారు, దరిద్రులు, సంన్యాసులు సంపాదించిన కమండలువు మొదలయిన వాటిని త్యాగం చేస్తే, అది రాజ్యత్యాగం వంటి దవుతుందా ? ఒక్కడు సదా పరిగ్రహిస్తూనే ఉంటాడు. ఒకడు సదా ఇస్తూనే ఉంటాడు. వీరిద్దరికీ తేడా తెలుసుకో. వారిలో ఉత్తముడెవరు ? సదా యాచించేవారికిచ్చినదీ, గొప్పకోసం వేషం వేసిన సన్యాసి కిచ్చినదీ (రెండూ), దావాగ్నిలో పడిన హోమద్రవ్యమే అవుతుంది. దుర్భుతమే అవుతుంది. అగ్నిహోత్రుడు పూర్తిగా కాల్చకుండా చల్లారడు. అలాగే సన్యాసి అయిన ద్విజుడు, క్లేశాలన్నిటినీ కాల్చివేసి (అనుభవించి) ఉపశమిస్తాడు. సజ్జనులకు రాజు అన్నం పెడితే, లోకంలో సన్యాసుల జీవితమూ, వ్యవస్థ చెడకుండా ఉంటుంది. రాజే దాత కాకపోతే, మోక్షం కోరుకొనే వారు ఎక్కడ ఉంటారు ? (ఉండరని భావం) (రాజు గృహస్థుల ద్వారా సన్యాసులకు దానం చేస్తే మోక్షకాంక్షులను పెంచిన వాడవుతాడు) ఈ లోకంలో అన్నం వల్లనే గృహస్థులు ఏర్పడుతారు. వారివల్లనే భిక్షుకులు బ్రతుకుతున్నారు. అన్నం నుండి ప్రాణం కలుగుతోంది. అందుచేత అన్నం పెట్టినవాడే ప్రాణం ఇచ్చినవాడు. సన్యాసులు గృహస్థుల నుండియే ఏర్పడుతున్నారు. గృహస్థులనే ఆశ్రయిస్తున్నారు. ఇలా దమం గల సన్యాసుల ప్రభవమూ, స్థితీ గృహస్థుల వల్లనే కల్గుతోంది.

కేవలం అన్నీ వదలినంత మాత్రాన, అతనిని సన్యాసి అనుకోరాదు. మూడత్వం లేనంత మాత్రాన, భిక్షాటనం చేసినంత మాత్రాన సన్యాసి అనుకోరాదు. మనసా, వాచా, కర్మణా అర్థం త్యజించి, సుఖాపేక్షలేని వానినే సన్యాసి అనుకోవాలి. ఆసక్తి లేకపోయినా, ఉన్నవానివలె నడుస్తూ ఉంటాడు. మమకారం ఉండదు. బంధనాలన్నీ విడిపోతాయి. శత్రువునందూ, మిత్రుని యందూ సమంగా ప్రవర్తిస్తాడు. రాజా ! అతడే ముక్తుడు. **అలాకాక కొంతమంది దానం గ్రహించడం కోసం సన్యసిస్తారు. బోడి తలలు వహిస్తారు. కాషాయవస్త్రాలు ధరిస్తారు. కాని ఎన్నో రకాలయిన పాశాలకు కట్టుబడతారు. వృథాగా ధనం ప్రోగు చేస్తారు.** వేదమూ, వార్తావిద్య, పుత్రులూ – వీటిని విడిచిపోయే తెలివి తక్కువవారే దండమూ, కాషాయమూ ధరిస్తారు. **రాగాది దోషాలను విడిచి పెట్టకపోతే, వారి కాషాయం కోరికలకోసమే అని తెలుసుకో. లోకవంచనకోసం, ధర్మం ధ్వజంగా పెట్టుకొన్న ఆ బోడి వారికి, కాషాయం కేవలం జీవనోపాధి అని నా అభిప్రాయం.** మహారాజా ! కాషాయవస్త్రాలతో, జింక చర్మాలతో, నారచీరలతో శరీరం కప్పుకొనే బోడి తలల వారినీ, అలాగే జటాధారులను, సాధుసన్యాసులనూ పోషించు,

జితేంద్రియుడవై లోకాలను జయించు. గురువులకోసం అగ్నిని కూర్చి (విద్యాభ్యాసం చక్కగా నిర్వహించి), తరువాత గృహస్థు అయి, చక్కని దక్షిణలిచ్చి, యజ్ఞాలను నిత్యమూ నిర్వహించే వాని కంటె ధర్మాసక్తికలవాడెనడు ?" అర్జునుడు ఇలా అన్నాడు. "జనకమహారాజు ఈ లోకంలో గొప్పతత్త్వవేత్త అని కీర్తింపబడతాడు. అంతటివాడు మోహానికి వశమయ్యాడు. నీవు అలా మోహం పొందకు. ఇలా ధర్మాన్ని ఆచరిస్తూ, దానమూ, తపస్సూ చేస్తూ, దయాగుణం కలిగి, కామక్రోధాలు విడిచి, ప్రజా రక్షణలో శ్రద్ధవహించి, ఉత్తమదానం చేస్తూ, గురువులు, పెద్దలు వీరిమనసులను సంతోషపెడుతూ ఇష్ట లోకాలను పొందుదాం. దేవతలను, అతిథులను, ప్రాణులను, యథాశాస్త్రంగా తృప్తిపరుస్తూ, సత్యమే పలుకుతూ, బ్రహ్మనిష్ఠులమై కోరిన స్థానం పొందుదాం."

19. ధర్మరాజు తన అభిప్రాయమును సమర్థించుకొనుట.

ధర్మరాజు ఇలా పలికాడు. "నేను ధర్మశాస్త్రాలూ, వేదాంత శాస్త్రాలూ రెండూ ఎరుగుదును. కర్మ చేయుమని, కర్మవదలుమని రెండూ వేదాలలోని వాక్యాలే. శాస్త్రాలన్నీ కలిసిపోయి కలగాపులగంగా ఉంటాయి. కాని హేతు పూర్వకంగా భావించవచ్చు. అందుచేత ఏమంత్రానికి ఏ అర్థమో నాకు యథావిధిగా తెలుసును. నీకు మంత్రాలు మాత్రమే తెలుసును. వీరవ్రతం ఆచరిస్తావు. శాస్త్రార్థం తత్త్వసహితంగా నీవు తెలుసుకోలేవు. శాస్త్రార్థాన్ని సూక్ష్మంగా దర్శించగల, ధర్మం నిశ్చయించగల పండితుడు కూడ నన్ను ఇలా అనలేడు. ధర్మాన్ని చక్కగా చూడ గల్గితే నీకే తెలుస్తుంది. అర్జునా ! సోదర ప్రేమతో నీవన్నమాట న్యాయ సహితమే. తగినదే. నీమాట నాకు ప్రీతి నిచ్చింది. యుద్ధ ధర్మాలన్నిటిలోనూ, నిపుణంగా పనులు చేయటంలోనూ, నీతో సమానుడు ముల్లోకాల్లోనూ లేడు. అర్జునా ! ధర్మం చాలా సూక్ష్మంగా చెప్పాలి. అందులో నీవు పారంగతుడవు కావు. నా బుద్ధిని నీవు శంకింపలేవు. నీవు యుద్ధశాస్త్రం మాత్రమే తెలిసిన వాడవు. పెద్దల శుశ్రూష చేయలేదు. వారికి శాస్త్రంలోని అర్థాలు సంక్షేపంగానూ, విస్తరంగానూ కూడా తెలుసును. వారి నిశ్చయం నీకు తెలియదు. తపస్సు, త్యాగం, అవిధి అని బుద్ధిమంతుల నిశ్చయం. ఇవి మూడూ ఒకదాన్ని మించినది మరొకటి అని బుద్ధిమంతులు నిశ్చయించారు. (పూర్వం కంటే పరం గొప్పది)

ధనం కంటె గొప్పది లేదని నీవు అనుకొంటున్నావు. ఆ ధనం ఎలా ప్రధానం కాదో చెపుతాను. ధార్మికు లయిన ప్రజలు తపస్సు, వేదాధ్యయనమూ చేస్తూ కనిపిస్తున్నారు కదా ! తపస్సు చేసే బుషులున్నారు. వారికి సనాతన లోకాలు కలుగుతున్నాయి కదా !

కొంతమంది ధీరులకు శత్రువులే ఉండరు. అలాగే వనవాసు లున్నారు. అలా అరణ్యంలోనే, ఎంతోమంది వేదాధ్యయనంతోనే స్వర్గం పొందిన వారున్నారు. ఆర్యులు కొందరు విషయాసక్తిని నిగ్రహించుకొని, ఉత్తర మార్గం గ్రహించి, తెలివితక్కువతనం వల్ల కలిగిన అజ్ఞానం విడిచిపెట్టి త్యాగశీలుల లోకాలు పొందారు. వెలిగిపోతోందని చెప్పే దక్షిణ మార్గం గ్రహించినవారికి క్రియాపరుల లోకాలు లభించాయి. వారు శ్మశానానికి చేరారు. మోక్షాసక్తి కలవారు చూసే మార్గం నిర్దేశించి చెప్పరానిది. అది జీవాత్మపరమాత్మల యోగం (కలయిక). అది ప్రధానం. ఇష్టం కూడ. అది నీకు తెలియజెప్పటం కష్టం. మేధావులు శాస్త్రాలను ఆకళింపు చేసుకొని, సారం ఇందులో ఉందా ? లేక అందులో ఉందా అని సారాసారాలను పరీక్షించి నిర్ణయిస్తారు. ఆ మేధావులు వేదవాదాలనూ, శాస్త్రాలనూ, ఆరణ్యకాలనూ (అరణ్యాల్లో గురుశిష్యసంభాషణ రూపంలో ఉన్న వేదాంత గ్రంథాలను) దాటిపోయి, అరటి బోదెను చీల్చారు కాని సారం చూడలేక పోయారు. ఏకాంతం వదలిపెట్టి కొందరు "పంచభూతాలతో కూడిన ఈ శరీరంలో ఆత్మ కొన్ని గుర్తులతో - ఇచ్ఛ, ద్వేషం మొదలయిన వానితో - కూడి ఉంది" అన్నారు.

ఆ బ్రహ్మతత్త్వం కంటికి కనపడదు. దాన్ని మాటలతో నిర్దేశించ లేము. కర్మకు కారణమైన మాయను ముందు పెట్టుకొని, ప్రాణులలో మార్పు చెందుతుంది. జీవ రూపంగా మారుతుంది. (అది ఆత్మఅని భావం). మానవుడు మనసును ఆత్మపదార్థం వైపు త్రిప్పుకోవాలి. కోరికలన్నీ నిగ్రహించుకోవాలి. కర్మల సముదాయాన్ని విడిచిపెట్టాలి. ఏ మాత్రమూ అహంకారం మిగల నివ్వకూడదు. అపుడు అతడు సుఖి అవుతాడు. సజ్జనులందరూ ఇలాంటి సూక్ష్మగమ్యమయిన మార్గాన్ని సేవించారు. అటువంటప్పుడు అనర్థాలతో కూడిన ధనాన్ని నీవెలా గొప్పదని చెపుతున్నావు అర్జునా ? నిత్యమూ కర్మ కాండలలోను, దానయజ్ఞాలలోనూ శ్రద్ధకల పూర్వమీమాంసా పండితులు కూడా ఈ ధనాన్ని కీడుకలిగించేదిగా భావిస్తూనే ఉన్నారు. చక్కని కార్యకారణ విజ్ఞానం కల పండితులు, దృఢమైన పూర్వజన్మ సంస్కారం కలిగికూడా, ఈ సిద్ధాంతాన్ని గ్రహించలేకపోతున్నారు. ఆత్మ అనేది లేదని వాదిస్తూ, మూఢులై ఉన్నారు. అసత్యం భావిస్తూ, ప్రజల సభలలో ప్రసంగిస్తూ, శ్రుతపాండిత్యం కల వాగుడుకాయలు భూమి అంతటా సంచరిస్తున్నారు. అర్జునా ! సామాన్యమయిన లౌకికవిషయాలను మనమే సరిగా తెలుసుకోలేకపోతున్నాం. ఇక సామాన్యులెలా తెలుసుకోగలరు ? ఇలా ప్రాజ్ఞులై శాస్త్రం తెలిసిన వారు కొద్దిగా ఉన్నారు. తత్త్వం తెలిసినవాడు తపస్సుతో వైరాగ్యం పొందుతాడు. బుద్ధి బలంతో మహత్త్వం, పరబ్రహ్మం పొందుతాడు. త్యాగంతో సుఖం పొందుతాడు."

20. యజ్ఞము చేయుమని దేవస్థానుడు ధర్మరాజును పురికొల్పుట.

ఈ మాటల సందర్భంలో తపస్వియైన దేవస్థానుడు యుక్తియుక్తంగా ధర్మరాజుతో ఇలా అన్నాడు. "ధనాన్ని మించినది లేదని అర్జునుడు చెప్పిన విషయమై వివరిస్తాను. ఏకాగ్ర చిత్తంతో విను. ధర్మరాజా ! నీవు ధర్మంతో భూమినంతటినీ జయించావు. అలా జయించి, ఇపుడు వృథాగా వదలిపెట్టకూడదు. నాలుగు మెట్లు ఉన్న నిచ్చెన బ్రహ్మము నందే ప్రతిష్ఠింపబడింది. రాజా ! దానిని క్రమంతో యథావిధిగా జయించు. అందుచేత భూరిదక్షిణలిచ్చి, మహాయజ్ఞాలతో ఆరాధించు. ఋషులకు స్వాధ్యాయమే యజ్ఞం. మరికొందరికి జ్ఞానమే యజ్ఞం. వైఖానసుల మాటల ననుసరించి, కర్మములందు నిష్ఠ కలవారిని, తపస్సు నందు నిష్ఠ కలవారిని చక్కగా తెలిసికో! యజ్ఞం కోసం ధనం కావాలనుకొంటే, అంతకంటె అసలు ధనాశ విడవటం మంచిది. అటువంటి ధనాన్ని ఆశ్రయించే వానికి దోషం పెరుగుతుంది. కొందరు ధనంకోసం, ఎంతో కష్టపడి ద్రవ్యసంచయం చేస్తారు. ఆ ధనదాహంతో తెలివి లేక భ్రూణహత్యను కూడా తెలుసుకొనలేక పోతున్నారు. సామాన్యంగా మానవుడు అనర్హునికే దానంచేస్తాడు. అర్హునికి ఇవ్వడు. అర్హత, అనర్హతలు తెలియకపోవడం వల్ల ధర్మంకూడ చేయడం కష్టమవుతోంది. బ్రహ్మ ధనాలను యజ్ఞం కోసమే సృష్టించాడు. యజ్ఞంకోసమే పురుషుడు ఉద్దేశింపబడ్డాడు. అతడే యజ్ఞానికి రక్షకుడు కూడ - అందుచేత ఉన్న ధనమంతా యజ్ఞంలోనే ఉపయోగించాలి. ఆ యజ్ఞం తరువాతనే కామం. రత్నాలతో వివిధ యజ్ఞాలు చేసి, ఎంతో తేజస్సు కల్గిన ఇంద్రుడు దేవతలందరినీ మించి పోయాడు. దానివల్ల అతడు దేవేంద్రపదవితో విరాజిల్లుతున్నాడు. అందుచేత యజ్ఞంలో సర్వమూ ఉపయోగించాలి. గజచర్మధారి అయిన మహాదేవుడు సర్వయజ్ఞంలో, తన్నుతాను హోమంచేసుకొని దేవదేవు డయ్యాడు. లోకాలన్నీ వ్యాపించి కీర్తితో, తేజస్సుతో ప్రకాశిస్తున్నాడు. అవిక్షితుని కొడుకయిన మరుత్తుడు తన గొప్పతనంతో దేవేంద్రుని జయించాడు. అతడు చేసిన యజ్ఞంలో, లక్ష్మీదేవి స్వయంగా వచ్చి నిలిచింది. ఆ యజ్ఞంలోని పాత్రలన్నీ బంగారంతో చేసినవే. మహారాజయిన హరిశ్చంద్రుని గురించి వినే ఉంటావు. యజ్ఞాలు చేసి, పుణ్యం సంపాదించి, శోకరహితు డయ్యాడు. మానవుడై యుండి సంపన్నుడై, ఇంద్రుని జయించాడు. అందుచేత యజ్ఞంలోనే సర్వమూ ఉపయోగించాలి."

21. ధర్మ, యజ్ఞాదులు ఆచరింపుమని దేవస్థానుడు ధర్మజునికి బోధించుట.

దేవస్థానుడు ఇలా చెపుతున్నాడు. "ఈ సందర్భంలో ప్రాచీన మయిన ఈ కథను ఉదాహరిస్తారు. ఒకసారి ఇంద్రుడు అడిగితే బృహస్పతి దీన్ని చెప్పాడు. **సంతోషమే గొప్ప స్వర్గం. సంతోషమే పరమసుఖం. సంతోషం / తృప్తి కంటె గొప్పది ఏదీలేదు. అది చక్కగా కుదురుకొంటుంది. తాబేలు తన అవయవాలను లోపలకు లాగుకొన్నట్లు, కోరికలన్నిటిని బయటకు ప్రసరింపకుండా, ఆత్మజ్యోతి త్వరగా ఆత్మయందే (ఏకమై) ప్రసన్న మవుతుంది. తాను భయపడకుండా, తన వలన లోకం భయపడకుండా ప్రవర్తిస్తూ, కామాన్నీ, ద్వేషాన్నీ జయించినవాడు ఆత్మను చూడగలడు. చేష్టతో, మనసుతో, మాటతో (త్రికరణ శుద్ధిగా) ఏ ప్రాణికీ ద్రోహం చేయక పోయినవుడూ, తానేమీ కోరనపుడూ అతడు బ్రహ్మమే అవుతాడు.** ఇలా ప్రాణులు / మానవులు ఆయా ధర్మాలను ఆయారీతిలో తాదాత్మ్యంతో / స్వానుభవంతో చూస్తారు. అందుచేత నీవు చక్కగా తెలిసికో ! కొందరు సామాన్ని ((ప్రీతిని) ప్రశంసిస్తారు. మరికొందరు వ్యాయామం ((ప్రయత్నం) ప్రశంసిస్తారు. వేరేకొందరు ఇంకొక దానిని ప్రశంసింపరని లేదు. అలాగే ఇతరులు రెంటినీ ప్రశంసింపరని కూడ చెప్పలేము. కొందరు యజ్ఞాన్నే ప్రశంసిస్తారు. ఇతరులు సంన్యాసాన్ని, కొందరు దానాన్ని, కొందరు ప్రతిగ్రహాన్ని ప్రశంసిస్తారు. కొందరు అన్నీ విడిచి ఊరకే ధ్యానిస్తూ ఉంటారు. కొందరు చీల్చిచెండాడి అయినా సరే ప్రజాపరిపాలన రూపమయిన రాజ్యాన్నే ప్రశంసిస్తారు. మరి కొంతమంది ఏకాంతంలో ధ్యాన శీలాన్నే ప్రశంసిస్తారు. **ఇదంతా పరిశీలించిన పండితుల నిశ్చయం ఇది. ప్రాణులకు ద్రోహం చేయకుండా ఉండేదే ధర్మం. అదే సజ్జనులకు ఇష్టమైనది. ఏ ప్రాణికీ ద్రోహం చేయకపోవడం, సత్యం మాట్లాడటం, దానం, దయ, దమం, తన భార్యయందే సంతానం పొందటం, మృదుత్వం, లజ్జ, చపలత్వం లేకపోవటం - ఇటువంటి ప్రవర్తన ప్రధానమూ, ఇష్టమూ కావడమే ధర్మం అని స్వాయంభువ మనువు చెప్పాడు.**

అందుచేత ఈ ధర్మాన్ని ప్రయత్నించి సాధించు. రాజ్యం చేసే క్షత్రియుడు ఎల్లపుడు నిగ్రహం కల్గిఉండాలి. ప్రియం, అప్రియం రెండూ సమంగా భావించాలి. యజ్ఞశేషం భుజించాలి. శాస్త్రార్థాల తత్త్వం తెలుసుకోవాలి. దుష్టశిక్షణ, సాధుసంరక్షణ పట్ల ఆసక్తికలిగి ఉండాలి. ప్రజలను ధర్మమార్గంలో పెట్టి, ధార్మికంగా ప్రవర్తించాలి. పుత్రులకు సంపదలన్నీ ఇచ్చి, వనాలకు వెళ్లి, వన్యపదార్థాలతో జీవిస్తూ, శాస్త్రంలో విన్న

నియమాలతో అలసట ఎరుగకుండా కర్మలను ఆచరించాలి. ఇలా ప్రవర్తించే రాజే ధర్మపరుడు. అటువంటి రాజునకు ఫలాభివృద్ధితో కూడిన ఇహ - పరలోకాలు రెండూ సిద్ధిస్తాయి. (నిజానికి) నిర్వాణం చాలా శ్రమపడి సాధించాలి. ఆ సాధనలో ఎన్నో విఘ్నాలు ఉంటాయి. అయినా సరే పైలక్షణాలు కలవానికి నిర్వాణం కూడా సిద్ధిస్తుందని నా అభిప్రాయం. ఇలా ధర్మాచరణం చేసిన వారూ, సత్యం, దానం, తపస్సు - వీటిపై శ్రద్ధకలిగి, దయా ప్రధాన మయిన గుణాలు, కలిగిన వారూ, కామక్రోధాలు లేనివారూ, ఉత్తమ ధర్మం ఆచరిస్తూ ప్రజలను రక్షిస్తూ, గోబ్రాహ్మణుల కోసం యుద్ధంచేస్తూ ఉండే రాజులు ఉత్తమ గతిని పొందారు. ఇలా రుద్రులూ, వసువులూ, ఆదిత్యులూ, సాధ్యులూ, రాజర్షులు ధర్మాన్ని ఆశ్రయించుకొని, ఏమాత్రమూ పొరబడకుండా పుణ్యకర్మలతో స్వర్గం పొందారు."

22. అర్జునుడు క్షేత్రధర్మప్రశంసతో ధర్మజుని ప్రబోధించుట.

వైశంపాయనుడు ఇలా చెపుతున్నాడు. "ఆ సమయంలో నిర్వేదంతో నిండి, పట్టువదలని ధర్మరాజుతో అర్జునుడు మళ్లీ ఇలా అన్నాడు. "ధర్మమెరిగిన రాజా ! దుర్లభమైన రాజ్యాన్ని, క్షత్రియ ధర్మంతో శత్రువులను గెలిచి పొందావు. ఇపుడు నీవు పరితపించవలసిన పనేమిటి ? యుద్ధంలో మరణించడం క్షత్రియులకు ఇష్టమైనది. చాలాయజ్ఞాలతో సమానమై విశిష్టమైన క్షత్రియ ధర్మాన్ని స్మరించు. తపస్సు, త్యాగం బ్రాహ్మణులకు ధర్మం. అది పరలోకమందు ఫలిస్తుంది. అలాగే క్షత్రియులకు యుద్ధంలో మరణించడం ధర్మంగా విధింపబడింది. క్షత్రియధర్మం చాలా భయంకరమైనది. అందులో నిత్యమూ శస్త్రంతోనే పని. కాలం ఆసన్నమయితే యుద్ధంలో ఆ శస్త్రం తోనే మరణిస్తాడు - అది ధర్మం. క్షత్రధర్మంతో జీవిస్తే, బ్రాహ్మణుని జీవితం కూడా ప్రశస్తమవుతుంది. క్షత్రియ జాతి బ్రహ్మజాతి నుండి పుట్టినదే కదా ! త్యాగం, ఆత్మయజ్ఞం, తపస్సు, ఇతరుల సొమ్ముతో బ్రతకటం. ఇవి క్షత్రియునకు విధింపబడలేదు. నీవు సర్వధర్మాలు తెలిసిన వాడవు, ధర్మాత్ముడవు, రాజువు, బుద్ధిమంతుడవు, నేర్పరివి, నీవు లోకంలోని అభ్యుదయ పతనాలను చూసినవాడవు. సంతాపం వల్ల కలిగిన శోకం విడిచి, కర్తవ్య నిర్వహణకు సన్నద్ధుడవు కమ్ము. విశేషించి క్షత్రియుని మనస్సు వజ్రంతో సమానమైనది. క్షత్రియ ధర్మంతో శత్రువులను జయించి, నిష్కంటకమైన రాజ్యం పొంది, మనసును వశపరచుకొని, యజ్ఞకర్తవు, దానశీలివి కమ్ము. ఇంద్రుడు (కశ్యప) బ్రహ్మపుత్రుడు. కర్మచేత క్షత్రియుడయ్యాడు. ఒక్కొక్క గణానికి తొంబది మంది చొప్పున ఉన్న తొమ్మిది

గణాలను (90x9=810) పాపవర్తనులయిన జ్ఞాతులను చంపివేశాడు. అతడు చేసిన ఆ పని పూజ్యమని, ప్రశస్తమని, దానివల్లనే అతడు దేవతలకు ఇంద్రుడయ్యాడని విన్నాము. మహారాజా ! ఆ యింద్రుని వలెనే, నీవూ సంతాపం విడిచి, భూరి దక్షిణలిచ్చి యజ్ఞాలు చేయుము. ఇలా ఉన్న నీవు ఏమాత్రమూ శోకింపరాదు. క్షత్రధర్మంతో, ఆయుధాలతో పవిత్రులయిన పూర్వులు పరమగతిని పొందారు. జరిగినదంతా అలా జరుగవలసి ఉంది కనుక జరిగింది. రాజోత్తమా ! దైవాన్ని అతిక్రమించటం ఎవరికీ శక్యం కాదు."

23. వ్యాసుడు శంఖలిఖితుల కథ చెప్పుట.

వైశంపాయనుడు అన్నాడు. అర్జునుడు ఇలా చెప్పితే ధర్మరాజు ఏమీ మాట్లాడకుండా ఊరుకొన్నాడు. అపుడు వ్యాసమహర్షి ఇలా చెప్పాడు. "ధర్మజా ! అర్జునుడు చెప్పినది నిజం. గృహస్థును ఆశ్రయించిన ఈ ధర్మం, శాస్త్రంలో చెప్పబడిన పరమధర్మంగా నిలిచింది. శాస్త్రాన్ని, విధానక్రమాన్ని అనుసరించి స్వధర్మాన్ని ఆచరించు. గృహస్థధర్మం విడిచి సంన్యాసం నీకు విధింపబడలేదు. దేవతలు, పితృదేవతలు, అతిథులు, సేవకులు గృహస్థుని ఆశ్రయించి జీవిస్తారు. రాజా ! వారిని భరించు / పోషించు. పక్షులూ, పశువులూ, ఇతర ప్రాణులూ గృహస్థుల చేతనే పోషింపబడుతున్నాయి. అందుచేత నీవు ఇపుడు ఆ గృహస్థ ధర్మం పాటించు. నాలుగు ఆశ్రమాలలోను, గృహస్థాశ్రమం కష్టపడి ఆచరింప వలసినది. ఇంద్రియ పాటవం తగ్గినవారు గృహస్థధర్మం ఆచరించలేరు. అందుచేత నీవు ఇపుడు ఆ గృహస్థధర్మం పాటించు. నీకు వేదజ్ఞానం పూర్తిగా ఉంది. గొప్పతపస్సు చేశావు. తండ్రితాతల నుండి వచ్చిన రాజ్యాన్ని ధర్మంగా భావించి వహింప దగినవాడవు. తపస్సు, యజ్ఞం, ఆత్మవిద్య, భిక్షాటనం, ఇంద్రియ నిగ్రహం, ధ్యానం, ఏకాంతశీలం, తృప్తి, జ్ఞానాలను శక్తికొలది సంపాదించడం, ఈ చేష్టలు బ్రాహ్మణులకు సిద్ధిని చేకూరుస్తాయి. నీకు తెలిసినా మళ్లీ క్షత్రియుల ధర్మాలు చెపుతాను. యజ్ఞం, విద్య, పనులలో ఉత్సాహం, సంపదలపట్ల తృప్తిచెందకపోవటం, దండధారణం, తీవ్రత, ప్రజలను పరిపాలించడం, వేదజ్ఞానం, నిండు తపస్సు, సత్ప్రవర్తన, ఎక్కువ ధనం సంపాదించటం, పాత్రునికి దానం చేయటం. ఇవి రాజు చేయవలసిన పనులు. వీటిని చక్కగా ఆచరిస్తే ఇహలోకమునూ, పరలోకమునూ సాధిస్తాయి అని విన్నాం. ధర్మజా ! వీటిలో దండాన్ని నిర్వహించడం మిగిలిన వాని కంటె గొప్పది. క్షత్రియునిలో బలం నిత్యమూ క్షీణింపకుండా ఉంటుంది. బలంలోనే దండం స్థిరంగా నిలుస్తుంది. రాజా ! ఈ విద్యలు క్షత్రియులకు సిద్ధినిస్తాయి. ఈ విషయమై బృహస్పతి ఈ గాథను గానం చేశాడు. పాము ఎలుకలను మ్రింగి

వేసినట్లు భూమి 1. విరోధింపనిరాజును, ఇల్లూ ఊరూ వదలని బ్రాహ్మణుని – (ఇద్దరినీ) మ్రింగి వేస్తుంది. ప్రచేతసుని కుమారుడయిన దక్షుడు సిద్ధి పొందినట్లు, రాజర్షి అయిన సుద్యుమ్నుడు చక్కగా దండం ధరించటం చేత పరమసిద్ధిని పొందినట్లు వింటున్నాం.

అపుడు ధర్మరాజు ఇలా అన్నాడు. "ప్రచేతసుని కుమారుడయిన దక్షుడు సిద్ధి పొందినట్లు రాజయిన సుద్యుమ్నుడు ఏ పని వలన పరమసిద్ధిని పొందాడు? ఆ రాజును గూర్చి వినాలని కోరుతున్నాను." వ్యాసుడిలా చెప్పాడు. "ఈ విషయంలో కూడా ఒక పురాతనమైన ఇతిహాసం ఉదాహరిస్తారు. దృఢమైన వ్రతనిష్ఠకల అన్నదమ్ములు శంఖుడు, లిఖితుడు అనేవారు ఉండేవారు. వారికి వేర్వేరుగా అందమయిన రెండు ఆశ్రమాలు ఉన్నాయి. నిత్యమూ పూలతో, పండ్లతో కూడి ఆశ్రమాలు బాహుదా నది ఒడ్డున ఉన్నాయి. ఒకనాడు లిఖితుడు శంఖుని ఆశ్రమానికి వచ్చాడు. శంఖుడు అపుడు ఆశ్రమంనుండి అనుకోకుండా బయటకు వెళ్లాడు. లిఖితుడు అన్నయైన శంఖుని ఆశ్రమానికి వచ్చి, బాగా పండిన పళ్లను రాల్చుకొన్నాడు. వాటిని తీసికొని ఆ బ్రహ్మణుడు నిశ్చింతగా తిన్నాడు. అలా తింటూఉండగానే శంఖుడు ఆశ్రమంలోకి వచ్చాడు. పండ్లుతింటున్న తమ్ముని చూసి శంఖుడు ఇలా అడిగాడు. "ఈ పళ్లు ఎక్కడి నుండి వచ్చాయి ? ఎందుకు తింటున్నావు" ? అపుడా లిఖితుడు అన్నకు నమస్కరించి నవ్వుతూ "ఇక్కడ నుండే కోసుకొన్నాను" అన్నాడు. అపుడు శంఖుడు చాలాకోపంతో ఇలా అన్నాడు. "స్వయంగా (అడగకుండా) నీవు పళ్లు కోసుకొని దొంగతనం చేశావు. **వెళ్లు ! రాజు దగ్గరకు వెళ్లి నీవుచేసిన పనిని చెప్పు. 'రాజా నేను ఎవరూ ఇవ్వకుండానే ఈ ఫలాలు తీసుకొన్నాను. నన్ను దొంగగా తెలుసుకొని నీ ధర్మం నీవు చెయ్యి. రాజా! దొంగనైన నాకు వెంటనే దండం విధించు' అని చెప్పు.**" ఆ మాటలు విని దృఢవ్రతుడయిన లిఖితుడు రాజయిన సుద్యుమ్నుని దగ్గరకు వెళ్లాడు. లిఖితుడు వచ్చాడని ద్వారపాలకులు సుద్యుమ్ననకు చెప్పారు. వెంటనే అమాత్యులతో సహా రాజు నడచి వచ్చి లిఖితునికి ఎదురు వచ్చాడు. ధర్మవేత్తలలో ఉత్తముడయిన లిఖితునితో ఆ రాజు "మహాత్మా! మీ రాకకు కారణం చెప్పండి. ఆ పని అయిపోయినట్లే" అన్నాడు. రాజుమాటలు విని లిఖితుడు సుద్యుమ్నునితో ఇలా అన్నాడు. "చేస్తానని మాట ఇచ్చావు. దానిని తప్పక చెయ్యాలి రాజా ! అన్నగారు ఇవ్వకుండానే వాని పండ్లను తిన్నాను. వెంటనే నన్ను శిక్షించు" అన్నాడు.

అపుడు సుద్యుమ్నుడు ఇలా అన్నాడు. 'విప్రోత్తమా ! నిన్ను దండించే విషయంలో రాజు ప్రమాణమయితే నీకు అనుజ్ఞ ఇవ్వటానికి కూడా రాజు ప్రమాణమే కదా ! నీవు దోషరహితుడవు. దృఢవ్రతుడవు. అని నేను అనుజ్ఞ ఇస్తున్నాను. దీని కంటె ఇతరమయిన

కోరికలుంటే చెప్పు. నీ మాటలు చేస్తాను." 'మహాత్ముడయిన రాజు ఎంత బ్రతిమాలినా ఆ బ్రహ్మర్షి దండనం తప్ప మరో వరం కోరలేదు. అపుడు ఆ రాజు లిఖితుని రెండు చేతులను నరికించివేశాడు. ఆ దండనం పొంది లిఖితుడు వెళ్లిపోయాడు. అతడు ఆర్తుడై శంఖుని దగ్గరకు వెళ్లి "నేను దుర్బుద్ధిని, శిక్ష అనుభవిస్తున్నాను. అందుచేత నన్ను నీవు క్షమించాలి" అన్నాడు. అపుడు శంఖుడు ఇలా అన్నాడు. "ధర్మమెరిగిన సోదరా! నాకు నీ మీద కోపం లేదు. నీవు నన్ను దూషింపకు. (ఈ లోకంలో మన కులం నిర్మలమయినదని పేరుకెక్కింది) నీవు ధర్మాన్ని అతిక్రమించావు. దానికి ప్రాయశ్చిత్తం చేసుకొన్నావు. శీఘ్రమే బాహుదా నదికి వెళ్లి యథావిధిగా దేవతలకు, ఋషులకు, పితరులకు తర్పణం చెయ్యి. అధర్మం మీద మనసు పెట్టకు." శంఖుని ఆ మాటలు విని, లిఖితుడు నదిలో స్నానం చేసి, ఉదక కృత్యాలు చేయడం మొదలు పెట్టాడు. వెంటనే అతనికి పద్మాల వంటి చేతులు వచ్చాయి. అతడు చాలా ఆశ్చర్యపడి, అన్నకు తన చేతులు చూపించాడు. అపుడు శంఖుడు తమ్మునితో "దీనిని తపస్సుతో నేనే చేశాను. నీకు సందేహం అవసరం లేదు. ఈ విధంగా దైవవిధానం సఫలమయింది." లిఖితుడు వెంటనే ఇలా అన్నాడు. "మహాతేజస్వీ ! నీ తపశ్శక్తి ఇంతటి దయితే ముందే నన్ను నీవు ఎందుకు పవిత్రుని చేయలేదు ?" శంఖుడు ఇలా సమాధానం చెప్పాడు. "నేను అలా చేయవచ్చు. కాని నీకు దండం విధింపవలసినవాడను నేను కాదు. (దీనివల్ల) ఆ రాజూ పవిత్రు డయ్యాడు. నీవూ పితృదేవతలతో పాటు పవిత్రుడ వయ్యావు." వ్యాసుడు చెప్పాడు. "పాండవోత్తమా ! తాను చేసిన పనితో రాజు శ్రేష్ఠు డయ్యాడు. ప్రాచేతసు డయిన దక్షునివలె పరమసిద్ధిని పొందాడు. ప్రజలను పరిపాలించడం క్షత్రియుల ధర్మం. మిగిలిన దేదయినా తప్పుడు దారియే. శోకించకు. ధర్మజ్ఞా ! నీ సోదరుని హితవాక్యం వినుు. రాజా ! క్షత్రియ ధర్మం దండమేకాని ముండనం కాదు. (ఇచట ముండన మంటే తల గొరిగించుకొని సంన్యాసి అవడం)"

24. వ్యాసుడు ధర్మరాజును రాజ్యపాలనకై ప్రేరణ చేయుట.

వైశంపాయనుడు చెపుతున్నాడు. "వ్యాసమహర్షి ఇంకా ధర్మరాజుతో ఈ మాటలు పలికాడు. "నాయనా ! యుధిష్ఠిరా ! అభిమానపరులయిన నీ తమ్ములకు, అరణ్యంలో నివసిస్తున్నపుడు చాలా కోరికలు ఉండేవి. మహారథులయిన వీరు ఇపు డవి తీర్చు కొందురుగాక. కుంతీకుమారా ! నహుషుని కుమారుడయిన యయాతి వలె నీవు భూమిని పరిపాలించు. ఈ తపస్సులు అడవులలో చాలా దుఃఖకర మయిన నివాసం

చేశారు. ఇపుడు దుఃఖం తీరింది. సుఖాలు అనుభవిస్తారు. తమ్ముళ్లతో కలిసి ధర్మం, అర్థం, కామం అనే పురుషార్థాలు అనుభవించి, తరువాత వానప్రస్థానికి వెళ్లుదువుగాని. ముందుగా యాచకులకు, పితృదేవతలకు, దేవతలకు ఋణం తీర్చుకో. ధర్మజా ! తరువాత అంతా చేద్దువుగాని. సర్వమేధం, అశ్వమేధం అనే యజ్ఞాలు చెయ్యి. తరువాత పరమగతి పొందుదువుగాని. తమ్ముళ్లనందరినీ, భూరిదక్షిణ లిచ్చిన యజ్ఞాలలో నియోగించి, సాటిలేని కీర్తిని పొందు. పురుషశ్రేష్ఠా ! నీమాట ఏమిటో మాకు తెలుసును. అయినా ఈ మా మాట వినుము. వింటే ధర్మం నుండి జారిపోవు. రాజా ! సమభావంకల ధర్మనిపుణులు పరుల ధనాన్ని లాక్కొనే వానిని జయించి, వానిని అదుపులో ఉంచుకొని చక్కని పరిస్థితిని నెలకొల్పుతారు.

ప్రత్యక్షం, అనుమానం, ఉపమానం, ఆగమం, అర్థాపత్తి, ఐతిహ్యం, సంశయం, నిర్ణయం, ఆకృతి, సంకేతం, గతి, చేష్ట, ప్రతిజ్ఞ, హేతువు, ఉదాహరణం, ఉపనయం, ఉక్తి, నిగమనం, వాని ప్రమేయం, ప్రయోజనం అనేవి ఎన్నో విషయాలు సిద్ధించటానికి సాధనాలు. ఇవన్నీ కలగటానికి ప్రత్యక్షం, అనుమానం రెండూ కారణాలు. వివేకంతో ప్రమాణాలు తెలుసుకోగలిగిన వాడు దండం చక్కగా ప్రయోగింపగలుగుతాడు. ప్రమాణాలు తెలియని వాడు ప్రయోగించిన దండం రాజును దెబ్బకొడుతుంది / చంపుతుంది.

దేశం, కాలంకోసం నిరీక్షిస్తూ, శాస్త్రబుద్ధితో దొంగలను కూడ చంపని రాజుకు పాపం అంటదు. ఆరవ భాగం పన్నుగా తీసుకొంటూ కూడా, రాష్ట్రాన్ని రక్షింపని రాజు ఆ పాపంలో నాలుగోవంతు పొందుతాడు. కామక్రోధాలు విడిచి, తండ్రివలె సమదృష్టితో వ్యవహరిస్తూ, ధర్మంమీద గట్టిగా నిలబడితే, ఆ రాజు ధర్మశాస్త్ర పద్ధతులను ఎప్పుడయినా పాటింపకపోయినా, ఆ అధర్మం కారణంగా పతితుడు కాడు. క్రమంగా వాటి ననుసరిస్తూ నిర్భయు డవుతాడు తెలుసుకో. కార్యం చేస్తున్నపుడు, రాజు దైవవశాత్తు దెబ్బతిని, ఆ పనిని సాధింపలేకపోతే, దాన్ని ధర్మాతిక్రమణంగా పరిగణించరు. బుద్ధిని ఉపయోగించి, త్వరగా శత్రువులను అదుపుచెయ్యాలి. పాపాత్ములతో కలవకూడదు. రాజ్యం అంగడిలో అమ్ముకోరాదు. ధర్మరాజా ! శూరులను, ఆర్యులను, పండితులను రాజు సత్కరించాలి. ముఖ్యంగా వేదవిద్వాంసులను, ధనవంతులను రక్షించాలి.

చాలా విద్యలెరిగిన వారిని ధర్మకార్యాలలో నియోగించాలి. ప్రమాణాలను తెలిసినవారిని, న్యాయశాస్త్రం పాటించేవారిని, తర్క శాస్త్రజ్ఞులను ఆలోచనలోను, వ్యవహారంలోను రాజు తెలిసి నియోగించాలి. తర్కశాస్త్రం, ధర్మశాస్త్రం, దండ నీతిశాస్త్రం (రాజనీతి) ఈ మూడింటితోనూ కూడిన బుద్ధి మూడులోకాలను సాధిస్తుంది. వేదతత్త్వజ్ఞులు, వేద శాస్త్రాలు రెంటినీ ఎరిగిన నద్బుద్ధులను యజ్ఞకార్యాల్లో నియోగించాలి.

అన్వీక్షకి, త్రయి, వార్త, దండనీతి - అనే వానిలో పారంగతులై, బుద్ధి పరిపక్వమైన వారిని అన్ని విషయాల్లోనూ నియోగించవచ్చు. ఎంత గుణవంతుడయినా విచక్షణ కలవాడు ఒక్కని మీద మాత్రమే నమ్మకం పెట్టుకోరాదు. రక్షించనివాడు, నీతిరహితుడు, తాను గొప్పవాడ ననుకొనేవాడు, స్తబ్ధుడు, అసూయాపరుడు అయిన రాజు పాపం మూటగట్టుకొంటాడు. అట్టివాడిని దుర్దాంతుడు అంటారు. రాజు చేత రక్షింపబడుతూనే, ప్రజలు దైవంచేతను, దొంగలచేతనూ చెడిపోతూ ఉంటే, అది అంతా రాజుయొక్క పాపమే అవుతుంది. చక్కగా ఆలోచించి, నీతితో, అందరూ ప్రతిపాదించిన ఒక పనిని రాజు చేస్తే, దానివల్ల జనులు నష్టపోతే ఆ అధర్మం రాజుకు అంటదు. ప్రారంభించిన పనులు ఒకొక్కప్పుడు దైవవశాత్తు చెడి పోతూ ఉంటాయి. ఒక్కొక సారి ఫలిస్తూ ఉంటాయి. పురుష ప్రయత్నం చక్కగా చేసినపుడు రాజుకు పాపం అంటదు.

ఈ విషయంలో ప్రాచీనమయిన రాజర్షి అయిన హయగ్రీవుని కథ చెపుతాను. ధర్మజా ! అతడు శూరుడు. నిపుణంగా పనులు చేసేవాడు. అతడు యుద్ధంలో శత్రువులందరినీ చంపాడు. కాని అసహాయుడై యుద్ధంలో చనిపోయాడు. శత్రువులను అదుపుచేయటానికి తగినపని చేసి, ప్రజల పరిపాలనంలో ముందు నిలిచి, యుద్ధం చేసి, కీర్తిని పొంది ఆ హయగ్రీవుడు స్వర్గలోకంలో ఆనందిస్తున్నాడు. హయగ్రీవునికి యుద్ధాసక్తికల్గిన, దుడుకుతనం ఉంది. చివరకు అతనిని దొంగలు ఆయుధాలతో చీల్చి చంపారు. అతడు కర్మశీలి, మహాత్ముడు. అతని ప్రయోజనాలు నెరవేరాయి. అతడు స్వర్గంలో ఆనందిస్తున్నాడు. అతడొక యజ్ఞం చేశాడు. ఆ యజ్ఞంలో ధనుస్సే యూపస్తంభం. వింటినారియే యజ్ఞపశువును కట్టే త్రాడు. బాణమే స్రుక్కు. కత్తి స్రువం. రక్తమే నెయ్యి. రథం వేది. క్రోధంతోకూడిన యుద్ధమే అగ్ని. రథాలు, గుర్రాలు, ఏనుగులు, పదాతిదళాలు ఈ సముదాయం చాతుర్హోత్రం.

ఇటువంటి యజ్ఞం అనే అగ్నిలో హయగ్రీవుడు శత్రువులను హోమంచేసి, పాపవిముక్తు డయ్యాడు. యుద్ధమనే అవభృథంలో ప్రాణాలను వ్రేల్చి, దేవలోకంలో ఆనందిస్తున్నాడు. బుద్ధిపూర్వకంగా నీతితో రాష్ట్రాన్ని రక్షిస్తూ, అహంకారం విడిచిపెట్టి, యజ్ఞశీలుడయి, మంచిమనసున్న మహాత్ముడై, కీర్తితో లోకాలన్నీ వ్యాపించి దేవలోకంలో ఆనందిస్తున్నాడు. హయగ్రీవుడు యోగంతో, న్యాసంతో దైవీసిద్ధిని, మానుష సిద్ధిని పొందాడు. దండనీతితో భూమిని పాలించాడు. ధర్మశీలుడై, మహాత్ముడై దేవలోకంలో ఆనందిస్తున్నాడు. అతడు విద్వాంసుడు, త్యాగి, శ్రద్ధాళువు, కృతజ్ఞుడు. మానుషకర్మం ఆచరించాడు. మానవలోకం వదలి, పుణ్యక్షేత్రాలలో ఇష్టంతో శరీరత్యాగం చేసే మేధావుల పుణ్యలోకాలు పొంది (ఆనందిస్తున్నాడు) చక్కగా వేదాలను, శాస్త్రాలను అధ్యయనం చేసి, హయగ్రీవుడు

చక్కగా రాజ్యపాలనం చేశాడు. నాలుగువర్ణాల వారిని తమతమ ధర్మాలలో నిలిపి ఇపుడు దేవలోకంలో ఆనందిస్తున్నాడు. యుద్ధాలుచేసి జయించాడు. ప్రజలను రక్షించాడు. యజ్ఞాలుచేసి సోమం పుచ్చుకొన్నాడు. ద్విజులను సంతోషపెట్టాడు. దండం యుక్తితో ధరించాడు. యుద్ధంలో మరణించి దేవలోకంలో ఆనందిస్తున్నాడు. అతని ప్రవర్తన ప్రశంసింపదగినది. సజ్జనులు, విద్వాంసులు అర్హుడైన అతనిని పూజిస్తారు. ఆ మహాత్ముడు, పుణ్యకీర్తితో వీరస్వర్గం సాధించి సిద్ధిపొందాడు.

25. వ్యాసుడు యుధిష్ఠిరునకు సేనజిదుపాఖ్యానమును వివరించుట.

వైశంపాయనుడు చెపుతున్నాడు. "వ్యాసమహర్షిమాటలు విని అర్జునుడు కోపించాడు. అపుడు ధర్మరాజు వ్యాసునితో ఇలా బదులుపలికాడు. "భూమికి సంబంధించిన ఈ రాజ్యంకాని, వివిధాలైన ఈ భోగాలు కాని ఇపుడు నా మనసుకు ప్రీతి నివ్వడంలేదు. ఈ శోకం నన్ను అడ్డుపెడుతోంది. భర్తలను, పుత్రులను పోగొట్టుకొని దుఃఖంతో స్త్రీలందరు ఏడుస్తూ ఉంటే మహర్షీ ! నేను శాంతిని పొందలేకపోతున్నాను." ఆ మాటలకు యోగవేత్తలలో ఉత్తముడు, మహామేధావి, ధర్మజ్ఞుడు, వేదపారంగతుడూ అయిన వ్యాసుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. **"లోకంలో ఎవరూ తనకర్మలచేతగాని, చింతించి నందువల్లగాని ఏమీ పొందలేరు. మానవునికి దాత ఎవడూ లేడు. ఒకసారి అది - మరొకసారి ఇది అనే విధివిధానంతో, కాలానుసారంగా మానవుడు అన్నీ పొందుతూ ఉంటాడు.** బుద్ధిబలంతోకాని, శాస్త్రాధ్యయనంతోకాని మానవులు కానికాలంలో ఏమీ పొందలేరు. ఒక్కొక్కసారి మూర్ఖుడు కూడ కొన్ని ప్రయోజనాలు పొందుతూ ఉంటాడు. కార్యసిద్ధి విషయంలో కాలమే సామాన్యకారణం. కలిసిరాని కాలంలో శిల్పాలు, మంత్రాలు, ఔషధాలు ఫలితం ఇవ్వవు. కాలం కలిసివస్తే అవే సిద్ధిస్తాయి, వృద్ధిచెందుతాయి. కాలం చేతనే గాలి వేగంగా వీస్తుంది. కాలంచేతనే వర్షం మేఘాలను చేరుతుంది. కాలం చేతనే నీటిలో పద్మాలూ, కలువలూ పుడతాయి. కాలంచేతనే అడవులలో చెట్లు పెరుగుతున్నాయి. కాలం చేతనే నల్లని, తెల్లని రాత్రులు (కృష్ణపక్షం, శుక్లపక్షం) ఏర్పడుతున్నాయి. కాలంచేతనే చంద్రుడు పూర్ణబింబంతో కనిపిస్తున్నాడు. అకాలంలో చెట్లకు పుష్పాలూ, ఫలాలూ కల్గవు. అకాలంలో నదులకు ప్రవాహవేగం ఉండదు. పక్షులు, పాములు, లేళ్లు, ఏనుగులు, కొండ జంతువులు కానికాలంలో విజృంభించవు. అకాలంలో స్త్రీలకు గర్భంరాదు. అకాలంలో చలి, వేడి, వర్షం రావు. అకాలంలో మానవుడు చావడు, పుట్టడు. కాలం రాకుండా శిశువుకు మాటలు రావు. కాలం రాకుండా బాలునికి యౌవనం రాదు. కాలం రాకుండా

నాటిన విత్తనం మొలకెత్తదు. కాలం రాకుండా సూర్యుడు ఉదయించడు, అస్తమించడు. కాలం రానిదే చంద్రుడు వృద్ధి పొందడు, క్షీణించడు. అలాగే సముద్రుడు పోటెత్తడు, పాటునొందడు. ధర్మరాజా ! ఈ విషయంలో దుఃఖార్తుడైన సేనజిత్తు అనే రాజు చెప్పిన పురాతనమైన ఇతిహాసం ఒకటి ఉదాహరిస్తారు.

ఈ కాలగతి ఆపు లేనిది. మానవులందరినీ ఇది తాకుతుంది. రాజులందరు కాలంతో పరిపక్వత పొంది చనిపోతున్నారు. రాజా ! కొంతమంది ఇతర మానవులను చంపుతున్నారు. అలాగే వారు ఇతరులను చంపుతున్నారు. ఇది కేవలం లోకవ్యవహారం మాత్రమే. నిజానికి చంపేవాడూ లేడు, చంపబడేవాడూ లేడు. (ఎవడో) చంపుతున్నాడని ఒకడు భావిస్తాడు. (ఎవడూ) చంపడని ఇంకొకడు అనుకొంటాడు. నిజానికి ఈ జననమరణాలు ప్రాణులకు సహజంగా జరిగే కార్యాలు. ధనం పోయినా, భార్య కాని, పుత్రుడు కాని, తండ్రి కాని చనిపోయినా "అయ్యో ఎంత దుఃఖం వచ్చింది"! అని అనుకొంటూ దుఃఖం తగ్గించుకొంటున్నాడు. **మూఢుడవై ఎందుకు ఏడుస్తావు ? ఏడ్చేవారితో నీవూ ఎందుకు ఏడుస్తావు ? దుఃఖాలలో దుఃఖాలూ, భయాల్లో భయాలూ పెరుగుతాయి చూడు.** "ఈ శరీరం నాదికాదు. కాని భూమి అంతా నాదే. ఇదినాది ఎలాగో అలాగే ఇతరులదీ కూడా అని భావించేవాడు మోహం చెందడు/మోసపోడు. **వేలకొద్దీ శోకపరిస్థితులూ, వందలకొద్దీ సంతోషస్థితులూ ప్రతీ రోజూ మూఢునే ఆవేశిస్తాయి కాని పండితుని చేరవు.** ప్రియాలు, అప్రియాలూ కాలంచేత విభజింపబడుతున్నాయి. సుఖాలూ, దుఃఖాలూ జీవులలో అటూ ఇటూ తిరుగుతూ ఉన్నాయి. **(లోకంలో) దుఃఖమే ఉంది. సుఖం లేదు. అందుచేత ఆ ఉన్న దుఃఖమే లభ్యమవుతుంది. తృష్ణయొక్క పీడవల్ల దుఃఖం వీర్రవీగుతోంది. దుఃఖనాశంవల్ల సుఖం అనిపిస్తోంది. సుఖం తరువాత దుఃఖమూ, దుఃఖం వెనుక సుఖమూ కలుగుతూ ఉంటాయి. నిత్యమూ దుఃఖం కలుగదు. నిత్యమూ సుఖమూ లభించదు. దుఃఖం పోవడమే సుఖం. ఒక్కొక్కప్పుడు దుఃఖంవల్ల సుఖం కలుగుతుంది. అందుచేత శాశ్వతమైన సుఖం కోరేవాడు ఈ రెండిటినీ వదలాలి. సుఖం యొక్క చివర దుఃఖమూ, దుఃఖం వశించడం వల్ల సుఖమూ కలుగుతాయి.** దుఃఖం వల్ల వృద్ధి పొందే శోకం కాని, తాపం కాని దేనివల్ల కలుగుతున్నదో, ఆయాసానికి మూలమేదో అది తనలో ఒక అంగమయినా సరే ! వదలి వెయ్యాలి. **సుఖ మయినా దుఃఖ మయినా, ప్రియ మయినా అప్రియమయినా, మనసులో ఓడిపోయినట్లు భావించకుండా, వచ్చినదానిని వచ్చినట్లు అనుభవించాలి.** భార్యాపుత్రులకు ఏ కొంచెమైనా అప్రియాన్ని కలిగించి

చూడు. అప్పుడు ఎవరు, ఎవరికి, ఎందుకు, ఎలా చేస్తున్నారో తెలుస్తుంది. లోకంలో మిక్కిలి మూడులూ, బాగా తెలివైన వాళ్లూ సుఖపడుతున్నారు. మధ్యస్థులు బాధపడుతున్నారు. యుధిష్ఠిరా ! మహాప్రాజ్ఞుడు, లోకంలోని అభ్యుదయ పతనాలను తెలిసినవాడు, ధర్మవిదుడు, సుఖ దుఃఖాలు తెలిసినవాడు అయిన సేనజిత్తు ఇలా చెప్పాడు. **తనదో, ఇతరులదో ఏదో దుఃఖంతో దుఃఖపడేవాడు ఎన్నడూ సుఖపడలేడు. దుఃఖాలకు అంతం లేదు. ఒకదాని నుండి మరొకటి పుట్టుతూనే ఉంటాయి. సుఖమూ - దుఃఖమూ, కలిమి - లేమి, లాభం - నష్టం, చావు - బ్రతుకు వీటిని అందరూ ఒకదాని తరువాత మరొకటి పొందుతూనే ఉంటారు. అందుచేత ధీరుడు పొంగిపో వక్కరలేదు.** క్రుంగి పోనక్కరలేదు. రాజులకు యుద్ధదీక్షయే ధర్మమని చెపుతారు. రాజ్యయోగం, చక్కని దండనీతి, ధనం త్యాగం చేయటం, యజ్ఞాలలో భూరి దక్షిణ లివ్వడం. చక్కని దానం - ఇవి రాజులకు పవిత్రాలని తెలుసుకోవాలి. బుద్ధి పూర్వకంగా, నీతిమార్గంతో రాజ్యం రక్షిస్తూ, అహంకారం విడిచి, యజ్ఞశీలుడైన రాజు లోకులపట్ల ధర్మదృష్టితో ప్రవర్తిస్తూ శరీరం విడిచిన తరువాత దేవలోకంలో ఆనందిస్తాడు. యుద్ధాలలో జయించి, రాష్ట్రం రక్షించి, యజ్ఞాలలో సోమపానం చేసి, ప్రజావృద్ధి కావించి, నేర్పుగా దండం ధరించి, చివరకు యుద్ధంలో మరణించినా అతడు దేవలోకంలో ఆనందిస్తాడు. చక్కగా వేదాలు, శాస్త్రాలూ అధ్యయనం చేసి, చక్కగా రాజ్యం పాలించి, చతుర్వర్ణాల వారిని తమతమ ధర్మాలలో నిలిపి, పవిత్రుడయిన రాజు దేవలోకంలో ఆనందిస్తాడు. అతడు స్వర్గానికి వెళ్లిపోయినా, అతని పౌరులు, ప్రజలు, అమాత్యులూ అతని ప్రవర్తనకు నమస్కరిస్తూ ఉంటే అతడే రాజోత్తముడు."

26. యయాతిగాథను చెప్పి యుధిష్ఠిరుడు ధనసంపాదనము నిందించుట.

వైశంపాయనుడు చెప్పాడు. "ఈ సందర్భంలోనే ఉదారబుద్ధి అయిన ధర్మరాజు అర్జునునితో ఉత్తమరీతిలో ఇలా అన్నాడు. "అర్జునా ! ధనం కంటె గొప్పది లేదని నీవు అనుకొంటున్నావు. ధనం లేని వానికి స్వర్గంలేదు, సుఖంలేదు, ప్రయోజనంలేదు అనుకొంటున్నావు. అదంతా అబద్ధం. వేదాధ్యయనం చేసి, యజ్ఞాలు చేసి సిద్ధిపొంది, తపస్సుమీద శ్రద్ధచూపిన మునులు ఎంతో మంది కనిపిస్తున్నారు. వారిలోకాలు సనాతనమైనవి. ఋషిసంప్రదాయాన్ని ఆశ్రయించి దాన్ని సదా రక్షిస్తూ, సర్వ ధర్మాలను తెలిసిన దివ్యపురుషులను బ్రాహ్మణు లని అంటారు. స్వాధ్యాయమునందు శ్రద్ధకల వారిని, జ్ఞానమునందు నిష్ఠ కల ఇతర ఋషులను సతతమూ ధర్మనిష్ఠకలవారినిగా తెలుసుకోవాలి.

జ్ఞాననిష్ఠ కల మహాత్ముల పైనే రాజకార్యాలు ఉంచవలెనని వానప్రస్థులైన వైఖానసమహర్షుల వచనం ఉన్నట్లు మనకు తెలుసునుగదా ! అజులు, పృశ్నులు, సికతులు, అరుణులు, కేతువులు అనే బుషిగణాలు స్వాధ్యాయంచేతనే స్వర్గాన్ని చేరారు. అర్జునా ! వేదోక్త దానం, వేదాధ్యయనం, యజ్ఞం, కష్టసాధ్యమయిన నిగ్రహం, ఈ కర్మలు చేసి దక్షిణాయనంలో స్వర్గం చేరిన వారి లోకాలను గురించి పూర్వమే చెప్పాను. **సూర్యుని ఉత్తర మార్గాన్ని (ఉత్తరాయణం) నియమంవల్ల చూస్తున్నావు. అక్కడ సనాతనమైన లోకాలు ప్రకాశిస్తున్నాయి కదా ! అవి నిష్కామ యజ్ఞం చేసినవారు పొందిన లోకాలు.** పురాణవేత్తలు ఈ రెండింటిలో ఉత్తర మార్గాన్ని ప్రశంసిస్తారు. నిజానికి సంతోషమే గొప్పస్వర్గం. సంతోషమే పరమసుఖం. **సంతుష్టికంటె మించిన దేదీలేదు. అది చక్కగా, స్థిరంగా ఉంటుంది. సదా క్రోధాన్నీ, హర్షాన్నీ అదుపులో ఉంచుకొన్నవాడు పొందే సిద్ధి ఉత్తమమయింది.** ఈ విషయంలో యయాతి పాడిన ఈ గాథలను ఉదాహరిస్తారు. తాబేలు అన్నివైపుల నుండి తన అవయవాలను వెనుకకు లాగుకొన్నట్లు, ఈ గీతాల శ్రవణం చేత, మానవుడు కోరికలను వెనుకకు మరల్చుకొంటాడు.

ఎప్పుడు తాను భయపడడో, ఎప్పుడు అతనికి ఇతరులు భయపడరో, ఎపుడు ఏమీ కోరడో, ఎవరినీ ద్వేషింపడో అపుడు అతడు బ్రహ్మభావం పొందుతాడు. చేష్టలతో కాని, మనసుతో కాని, వాక్కుతో కాని ఏ ప్రాణికీ పాపకృత్యం చేయనపుడు అతడు పరబ్రహ్మ మౌతాడు. అభిమానాన్ని, మోహాన్ని అదుపులో ఉంచుకొని, సంగాలన్నీ విడిచిపెట్టి, ఆత్మయే జ్యోతిగా కల సాధువునకు మోక్షం లభిస్తుంది. అర్జునా ! ఇంద్రియాలను వశంలో ఉంచుకొని, నేను చెప్పేమాట విను. కొందరు ధర్మం కోరుకొంటారు. కొందరు శీలం కోరుకొంటారు. మరికొందరు ధనం కోరుకొంటారు. ధర్మంకోసం ధనం కోరడం కంటె కోరిక విడిచిపెట్టడం మంచిది. ధనం యొక్క దోషమే చాలా పెద్దది. దాన్ని ఆశ్రయించుకొన్న ధర్మమూ అంతటిదే అవుతుంది. నేను ప్రత్యక్షంగా చూస్తున్నాను. నీవూ చూడు. ధనం కాంక్షించే వానికి, విడిచిపెట్టవలసిన వాటిని విడిచిపెట్టడం చాలా కష్టం. ధనం వెంట పరుగులెత్తే వారిలో మంచితనం దుర్లభం. ద్రోహుల దగ్గరకే ధనం చేరుతుందంటారు. ఒక వేళ సద్బుద్ధిచే ధనం లభించినా అది విరుద్ధ ఫలాన్నే ఇస్తుంది. స్థిరమయిన ప్రవర్తన లేకుండా, దుఃఖం కలుగుతుందనే భయంలేని నరుడు, ఆశతో అల్పవిషయానికే ద్రోహబుద్ధి కలిగి, భ్రూణహత్యకు కూడా వెనుకాడడు. దుర్లభమయిన ధనం పొందిన లోభి, దాన్ని సేవకులకు ఇచ్చికూడా, దొంగభయంవల్ల నిత్యమూ పరితపిస్తూనే ఉన్నట్లు దుఃఖాన్నే పొందుతున్నాడు. ఆ ధనం పుచ్చుకొన్న సేవకులు కూడా దోషులవుతారు.

ధనంలేనివాడు ఎవని వల్లనూ మాట పడ నవసరం లేదు. ధనం విడిచినవాడు అన్ని విధాల సుఖపడతాడు. దేవుని సొమ్ము కూడబెట్టి ఆ ధనంతో ఏ మానవుడూ సుఖపడలేడు. ఈ విషయంలో వేదాశ్రితమయి, యజ్ఞసముదాయంలో చెప్పుకొనే ఒక గాథను పురాణవేత్తలు పాడుతూ ఉంటారు. యజ్ఞంకోసమే బ్రహ్మ సంపదలను సృష్టించాడు. యజ్ఞంకోసమే పురుషుని, రక్షకుని సృష్టించాడు. అందుచేత ధనమంతా యజ్ఞంలోనే ఉపయోగించాలి. కోరికలకోసంకాని ధనం మేలయినది. ప్రశస్తమయినది. అర్జునా ! స్వార్థంలోనూ, యజ్ఞంలోనూ వినియోగించే ధనాన్ని బ్రహ్మ మానవులకు యజ్ఞంకోసమే ఇస్తాడని తెలుసుకో ! అందుచేత ఆ ధనం ఏ ఒక్కరిదీ కాదని మానవులు ఎరుగుదురు. అందుచేత ధనాన్ని, శ్రద్ధతో దానం చేస్తూ ఉండాలి. ధనంతో యజ్ఞాలు చేస్తూ ఉండాలి. **లభించిన ధనాన్ని త్యాగం/దానం చెయ్యడమే మేలు. దాన్ని అనుభవించడం, కూడబెట్టడం మంచిది కాదు. ఇంతకంటె త్యాగమనే మహత్కార్యం తనముందు ఉండాలి. ఉన్నపుడు కూడబెట్టడం వల్ల ఏం ప్రయోజనం ?** అల్పబుద్ధులై, తమధర్మం విడిచిన వారికి ధనమిచ్చేవారు, మరణించిన తరువాత నూరు సంవత్సరాలు మలం తింటారు. (అనగా పాత్రత ఎరిగి దానం చెయ్యాలి). **అర్హత లేని వాడికి ఇవ్వడమూ, అర్హునికి ఇవ్వకపోవడమూ రెండూ పాపమే. అర్హత - అనర్హతలు తెలియకపోవడం వల్ల దానమనే ధర్మం ఆచరించడం కష్టమవుతోంది. లభించిన ధనాలకు రెండు విధాల కీడుకలుగుతుందని తెలుసుకోవాలి. అపాత్రులకు ఇవ్వడం ఒకటి. పాత్రులకు ఇవ్వకపోవడం మరొకటి."**

27. ప్రాణత్యాగమొనరింతు ననిన ధర్మరాజును వ్యాసుడు వారించుట.

ధర్మరాజు ఇలా అన్నాడు. "బాలుడయిన అభిమన్యుడు, ఉపపాండవులు, ధృష్టద్యుమ్నుడు, విరాటుడు, ద్రుపద మహారాజు, ధర్మజ్ఞుడయిన కర్ణుడు, ధృష్టకేతువు, ఇంకా వివిధ దేశాల రాజులను యుద్ధంలో చంపుకొని బాధ పడుతున్నాను. నేను రాజ్యకాముకుడను. పరమభయంకరుడను. వంశం నాశనం చేసుకొన్న నన్ను ఈ శోకం పీడిస్తోంది. చిన్నతనంలో ఎవని ఒడిలో ఆడుకొంటూ అటుఇటూ హాయిగా దొర్లానో, ఆ భీష్ముని, నేను రాజ్యలోభంతో యుద్ధంలో పడగొట్టాను. ఒకప్రక్క పితామహుడు పిడుగుల వంటి అర్జున బాణాలకు చలించిపోతున్నాడు. మరోప్రక్క శిఖండి చూస్తూ నిలుచున్నాడు. పితామహుడు ముసలి సింహంలా ఉన్నాడు. నరసింహు డతడు. ఒళ్లంతా బాణాలతో నిండి పోయింది. ఆ స్థితిలో పితామహుని చూసి నామనస్సు విలవిలలాడి పోయింది. శత్రురథాలను పిండి పిండి చేసి, తూర్పుముఖం కల్గి, రథం మీద నుండి పితామహుడు

పర్వతంలా సుడులు తిరుగుతూ పడిపోతుంటే, చూసి నా మనస్సు చలించి పోయింది. ధనుర్బాణాలు ధరించి భీష్ముడు పరశురామునితో కురుక్షేత్రంలో చాలా రోజులు పోరాడాడు.

భీష్ముడు కన్యలకోసం ఏకమయిన రాజులనందరినీ, ఒక్కరథంతో ఎదిరించాడు. ఎవరూ ఎదిరింపలేని ఉగ్రాయుధుడనే చక్రవర్తిని తన అస్త్రాలతో కాల్చివేశాడు.* అటువంటి పితామహుని నేను చంపుకొన్నాను. తనకు మృత్యువయిన శిఖండిని, బాణాలతో పడగొట్టకుండా రక్షిస్తున్న పితామహుడు అర్జునుని చేత పడిపోయాడు. మహర్షీ ! నెత్తుటితో తడిసి నేలపైపడిన తాతను చూసినప్పుడే అతితీవ్రమయిన జ్వరం నన్ను ఆవేశించింది. చిన్నతనంలో మమ్మి పెంచి, కాపాడిన మహాత్ము డతడు. నేను రాజ్యలోభిని. పాపిని. మూఢుడను. గురుహంతకుడిని. కొద్దిసేపు చేసే రాజ్యం కోసం చంపుకొన్నాను. ఇక గురువైన ద్రోణుడు గొప్పవిలుకాడు. రాజులందరిచేత పూజింపబడినవాడు. అటువంటి గురువుదగ్గరకు వెళ్లి, ఈ పాపి గురుపుత్రుని గురించి అబద్ధం చెప్పాడు. ఆ గురువుగారు నన్ను "రాజా ! నీవు నిజం చెప్పు, నాకొడుకు జీవించి ఉన్నాడా?" అని అడిగాడు. పాప మా బ్రాహ్మణుడు నన్ను సత్యవంతుడని నమ్మి అడిగాడు. ఏనుగును అడ్డం పెట్టుకొని నేను అబద్ధం చెప్పాను. నేను రాజ్యలోభంతో గురువును చంపిన పాపిని. సత్య మనే కంచుకం లాగివేసి, యుద్ధంలో అశ్వత్థామ చనిపోయా డని చెప్పాను. నిజానికి చనిపోయినది అశ్వత్థామ అనే ఏనుగు. ఇంత కూడని పని చేసి నేను ఏ లోకాలకు వెడతానో! యుద్ధాలలో పారిపోని నా అన్న కర్ణుని చంపించాను. నా కంటె పాపి మరొకడు ఎవడు ? కొండలలో పుట్టిన సింహం వంటి బాలుడయిన అభిమన్యుని, ద్రోణుడు రక్షించే సేనలోకి లోభంతో ప్రవేశపెట్టాను. అప్పటినుండి భ్రూణహత్యచేసిన పాపిలాగా, అర్జునుని కాని, పుండరీకాక్షు డయిన కృష్ణుని గాని చూడలేకపోతున్నాను. అయిదుగురు పుత్రులను పోగొట్టుకొని దుఃఖంతో ఆర్తురాలయిన ద్రౌపదిని, అయిదుకొండలు తరిగిన భూమాతవలె చూసి విలపిస్తున్నాను. ఇలా ద్రోహం చేసిన పాపిని నేను పృథివికి నాశనకారకుడను. నేను ఇలాగే కూర్చుండి ఈ శరీరాన్ని శుష్కింప జేసుకొంటాను. గురుహంతకుడ నయిన నేను ప్రాయోపవేశం చేస్తున్నాను. ఇలా వంశనాశకుడ నయిన నేను ఏ ఇతరజాతులలోనూ కూడా పుట్టకూడదు. ఏమయినా సరే ! అన్నం తినను, నీళ్లు త్రాగను. తపోధనులారా ! ఇక్కడే ఉండి, ప్రియమైన ప్రాణాలను శుష్కింప జేసుకొంటాను. మీరందరు యథేచ్ఛగా వెళ్లండి. మిమ్ములను ప్రసన్నులను చేసికొని అనుజ్ఞ కోరుతున్నాను. అందరూ నన్ను అనుమతించండి. ఈ

---

* *శంతనుడు చనిపోయాక, సత్యవతిని తనకిమ్మని ఉగ్రాయుధుడు దూతను పంపాడు. అపుడు భీష్ముడు మైలపోయిన తరువాత వానిని తన అస్త్రాలతో దగ్ధం చేశాడు.*

శరీరం విడిచి పెడతాను." వైశంపాయనుడు చెపుతున్నాడు. "ఇలా అంటూ బంధుశోకంతో విలవిల లాడి పోతున్న ధర్మరాజును వ్యాసుడు పట్టుకొని 'అలా కాదు' అన్నాడు. వ్యాసుడు చెపుతున్నాడు. "మహారాజా ! ఇంతగా నీవు దుఃఖించకూడదు. పునరుక్తి అయినా చెపుతున్నాను. ఇది అంతా విధి విధానం. **పుట్టిన జీవుల కలయికలు ఎడబాటుతో ముగుస్తాయి. ఇది తప్పదు. నీటి బుడగలవలె పుట్టుతూ ఉంటాయి, నశిస్తూ ఉంటాయి. సంపదలన్నీ వినాశంతో ముగుస్తాయి. అభివృద్ధులన్నీ పతనాలతో ముగుస్తాయి. సంయోగాలు వియోగాలతో ముగుస్తాయి. జీవితం మరణంతో ముగుస్తుంది. పోమరిసుఖం దుఃఖంతో ముగుస్తుంది. సమర్థుని దుఃఖం సుఖం కలిగిస్తుంది. ఐశ్వర్యం, లక్ష్మి, లజ్జ, ధైర్యం, కీర్తి అనేవి సమర్థునిలో ఉంటాయి. కాని పోమరిలో కాదు.** స్నేహితులు సుఖం ఇవ్వజాలరు. శత్రువులు దుఃఖం కలిగింపజాలరు. ప్రజలు ధనం ఇవ్వజాలరు. ధనం సుఖాలను ఇవ్వజాలదు. బ్రహ్మ నిన్ను ఎందుకు సృష్టించాడో ఆ పనులు చెయ్యి. వాని వల్లనే నీకు సిద్ధి కలుగుతుంది. కర్మలు విడిచిపెట్టటానికి నీకు హక్కు/స్వాతంత్ర్యం లేదు రాజా !"

28. అశ్మ జనక సంవాదము.

వైశంపాయనుడు చెపుతున్నాడు. "బంధుశోకంతో ప్రాణాలు వదలిపెట్టాలనుకొంటున్న ధర్మజుని శోకాన్ని వ్యాసుడు ఇలా తీసివేశాడు. వ్యాసుడు చెప్పాడు. "ధర్మజా ! ఈ విషయంలో పురాతన మయిన అశ్మగీతమనే ఇతిహాసం ఒకటి చెపుతూ ఉంటారు. దాన్ని విను. విదేహరాజయిన జనకునకు ఒకసారి దుఃఖశోకాలు కలిగాయి. అతడు బ్రహ్మజ్ఞాని అయిన అశ్మకుని ఒక సంశయం గురించి ఇలా అడిగాడు. "బంధువులూ, ధనమూ లభించినపుడు కాని, పోయినపుడు కాని, శుభకాంక్షి అయిన మానవుడు ఎటువంటి స్థితిని పొందాలి? / ఎలా ప్రవర్తించాలి" ? అశ్ముడు ఇలా అన్నాడు. "మానవుని ఈ శరీరం ఏర్పడిన వెంటనే ఆ దుఃఖాలూ, సుఖాలూ అనుసరించి వస్తున్నాయి. వానిలో (సుఖదుఃఖాల్లో) ఒకటి రాగానే, అది అతని చేతనను వెంటనే లాగివేస్తుంది. ఎలా అంటే వాయువు మేఘాన్ని లాగినట్లు. 1. నేను చక్కని పుట్టుక పుట్టాను 2. సిద్ధుడ నయ్యాను. 3. నేను సామాన్యమానవుడను కాను. ఈ మూడు కారణాలతో అతని చిత్తం తడిసి పట్టు తప్పుతుంది. బాగా ఆసక్తమైన మనస్సుతో తండ్రిసంపాదించిన ధనం ఖర్చుపెట్టి, పరుల సొమ్ములు గ్రహించడం మంచిదిగా భావిస్తాడు. హద్దులు మీరి అలా ధనం గ్రహించేవానిని, బోయవాళ్లు బాణాలతో మృగాలను కొట్టినట్లు, రాజులు తగిన పద్ధతిలో

అడ్డుకొంటారు. రాజా ! అటువంటి దొంగలు ఇరవై-ముప్పది ఏళ్ల వయసులోనే చనిపోతారు. నూరేళ్ల వరకు బ్రతకరు. ఎంతో దుఃఖం పొందే అటువంటి ప్రాణుల జీవితం చూసి ఇతరజనులు, బుద్ధితో ఆ రోగానికి అక్కడికక్కడే మందు వేసుకోవాలి. (అనగా అటువంటి పని చేయనని నిర్ణయం తీసుకోవాలి). మానసిక దుఃఖాలన్నిటికి మూలకారణం చిత్తవిభ్రమం. లేదా అనిష్టం వచ్చిపడటం. మూడవ కారణం ఉండదు. ఇలా ఎన్నోరకాల దుఃఖాలు మానవుని వెంటపడుతూ ఉంటాయి. అలాగే విషయాసక్తి వలన పుట్టే దుఃఖాలు కూడా ఉన్నాయి. ముసలితనం, మృత్యువు అనేవి ప్రాణులన్నిటిని తోడేళ్లవలె ముంగిటవేస్తాయి. వాటికి బలవంతుడు, బలహీనుడు అనేవి లేవు. పాట్టివాడు, పొడుగువాడు అనేవి కూడా లేవు. సముద్రమే సరిహద్దుగా కల భూమినంతటిని గెలిచిన వాడు కూడ ముసలితనాన్ని, మరణాన్ని తప్పించుకొనలేడు.

ప్రాణులకు వచ్చినది సుఖమయినా, దుఃఖమయినా అనుభవించితీరాలి. దాన్ని తప్పించుకొనే మార్గంలేదు. ఈ జరామరణాలు మరోవిధంగా ఉంటే బాగుండును అనుకొంటారు మానవులు. కాని బాల్యంలోనో, నడివయసులోనో, చివరి వయసులోనో అవి వచ్చిపడతాయి. అప్రియాలతో కలయిక, ప్రియమైనవానితో వియోగం, మేలు-కీడు, సుఖం-దుఃఖం ఇవి అదృష్టాన్ని అనుసరించి వస్తాయి. ప్రాణుల జననమరణాలు, లాభనష్టాలు, ఇవి అన్నీ అదృష్టం వల్లనే వస్తాయి. (పండ్లలోని) గంధం, రంగు, రుచి, స్పర్శ అనేవి స్వభావరీత్యానే తొలగిపోతాయి. అలాగే సుఖదుఃఖాలు వస్తాయి, పోతాయి. విద్వాంసుడు వాని ననుసరించి ప్రవర్తిస్తాడు. ఆసనం, శయనం, వాహనం/ప్రయాణం, ప్రయత్నం, పానం, భోజనం ఇవి ప్రాణులన్నిటికీ కాలాన్ని బట్టి ఏర్పడతాయి. వైద్యులు కూడా రోగు లవుతారు. బలవంతులు బలహీను లవుతారు. శ్రీమంతులు నపుంసకు లవుతారు. ఇలా కాలం తారుమారు కావడం విచిత్రంగా ఉంటుంది. మంచి వంశంలో పుట్టడం, వీర్యం, ఆరోగ్యం, రూపం, సౌభాగ్యం, సుఖం అనుభవించడం - ఇవి అదృష్టాన్ని బట్టి లభిస్తాయి. అక్కరలేదనుకొనే దరిద్రులకు చాలా మంది పుత్రులు కలుగుతారు. పుష్కలంగా ధన సంపన్నులకు ఒక్కకొడుకు కూడ కలగడు. విధి చేష్ట విచిత్రంగా ఉంటుంది. **రోగం, అగ్ని, జలం, ఆయుధం, ఆకలి, ఆపదలు, విషం, జ్వరం, మరణం, ఉచ్చస్థితి నుండి పడిపోవటం, ఇవి అన్నీ ప్రాణి నిర్మాణంలో అదృష్టరూపంలో ఉన్నవేతువు ద్వారా వడుస్తాయి. దానిని దాటి పోవడం కాని, బయటపడటం కాని కనపడదు. అదృష్టవశాత్తు ఒక్కొక్కడు దాన్ని అతిక్రమించి, ముక్తుడవటమూ కనిపిస్తోంది.** ధనవంతుడు యువకుడుగానే చనిపోవడం చూస్తున్నాం. దరిద్రుడు ఎంతోక్లేశం అనుభవిస్తూ

ముసలితనంతో నూరేళ్లు జీవించడం చూస్తున్నాం. దరిద్రులై చిరకాలం బ్రతుకుతున్నవారిని చూస్తున్నాం. సంపన్నవంశంలో పుట్టిన వారు మిడతల వలె చనిపోతున్నారు. **సాధారణంగా లోకంలో శ్రీమంతులకు తినేశక్తి ఉండదు. దరిద్రులకు కట్టెలు కూడా జీర్ణ మవుతాయి.*** కాలం ముందుకు గెంటుతూ ఉంటే దురాత్ముడు తనకిష్టమయిన దానిని "నేను దీనిని చేస్తున్నాను" అనుకొంటూ అసంతోషంతో పాపం చేస్తాడు. వేట, జూదం, స్త్రీవ్యసనం, మద్యపానం, వివాదాలు - వీటిని పండితులు నిందిస్తారు. కాని శాస్త్రవిద్వాంసులు కూడా వీనియందు ఆసక్తితో కనపడుతున్నారు. ఇలా కాలంచేత ఇష్టవిషయాలను, అనిష్టవిషయాలను సర్వప్రాణులూ స్పృశిస్తున్నాయి. కాని దీనికి కారణం కనిపించదు. వాయువు, ఆకాశం, అగ్ని, చంద్రుడు, సూర్యుడు, పగలు, రాత్రి, నక్షత్రాలు, నదులు, పర్వతాలు - వీటిని ఎవడు చేస్తున్నాడు? ఎవడు భరిస్తున్నాడు ? చలి, వేడిమి, వర్షం - ఇవి కాలాన్నిబట్టి మారుతున్నట్లే మనుష్యులకు సుఖదుఃఖాలు పర్యాయంగా వస్తూ ఉంటాయి. జరా,మరణాలతో కూడిన మానవుని మందులు, మంత్రాలు, హోమాలు, జపాలు కాపాడవు. మహాసాగరంలో కట్టె కట్టె కలిసికొంటాయి. కలసిమళ్లీ విడిపోతాయి. ప్రాణుల కలయిక కూడ ఇలాగే ఉంటుంది. స్త్రీలతోను, గీతవాద్యాలతోను కూడిన పురుషులపట్ల, దిక్కులేక, ఇతరులు పెట్టేకూడు తినేవారి పట్ల కాలం సమంగానే ప్రవర్తిస్తుంది. **ఎన్నో జన్మలలో, సంసారాలలో వేలకొద్దీ తలిదండ్రులను, వందల కొద్దీ పుత్రులను, భార్యలను పొందిఉన్నాం. వా రెవరివారు ? మన మెవ్వరివారం.** వీనికి ఎవ్వడూ ఏమికాడు. వీడు ఎవనికీ ఏమికాడు. భార్య, చుట్టం, స్నేహితులు మొదలగు వారితో కలయిక దారిలో ఇతరులతో కలయిక వంటిదే ! ఎక్కడ ఉన్నాను ? ఎక్కడికి వెళతాను ? ఎవడను ? ఇక్కడ ఎందుకు ఉన్నాను ? దేన్ని గురించి ఎందుకు విచారించాలి ? ఇలా ఆలోచించి మనసును నిలుపు కోవాలి. ఈ సంసారం అనిత్య మయినది. నివసించటానికి ప్రియ మయినది. చక్రంలా తిరుగుతూ ఉంటుంది. సోదరుడు, తల్లి, తండ్రి, స్నేహితుడు-వీరంతా దారిలో కలిసిన వారే. పూర్వం మనం పరలోకాన్ని చూడలేదు. ఇప్పుడది ప్రత్యక్షంగా కనపడదని పండితు లెరుగుదురు. కాని వేదాలను కాదనకుండా మేలుకోరేవాడు దానిని నమ్మాలి. విద్వాంసుడు పితృకార్యాలను, దైవకార్యాలను, యథావిధిగా చెయ్యాలి. ధర్మం అతిక్రమింపని కార్యాలను ఆచరించాలి. యజ్ఞాలు చెయ్యాలి. ధర్మార్థకామాలను నిష్ఠతో అనుష్ఠించాలి.

---

* ప్రాయేణ శ్రీమతాం లోకే భోక్తుం శక్తిర్న విద్యతే ।
కాష్ఠాన్యపి హి జీర్యంతే దరిద్రాణాం చ సర్వశః ॥ 29

కాలమనే ఈ సముద్రం లోతైనది. ఇందులో జరామృత్యువు లనే మొసళ్లు ఉన్నాయి. ఈ సముద్రంలో లోకమంతా మునిగి పోతోంది. కాని దీనిని ఎవడూ తెలుసుకొనటం లేదు. ఆయుర్వేదం చదివి, దానిపై చక్కని అధికారం ఉన్న వైద్యులు ఎందరో వ్యాధులతో మునిగితేలుతూ కనపడుతున్నారు. వారు ఎన్నోరకాల కషాయాలు, నేతులూ త్రాగుతున్నారు. కాని మహాసముద్రం చెలియలి కట్టను దాటలేనట్లు, మరణాన్ని దాటలేక పోతున్నారు. రసాయనవేత్తలై, చక్కగా రసాయనాలు సేవించిన వారు కూడా, బలిష్ఠమైన ఏనుగులు పొడిచిన ఏనుగుల వలె, ముసలి తనంతో సత్తువ చచ్చి కనిపిస్తున్నారు. అలాగే తపస్సు చేసి వేద పఠనాసక్తి కలవారు, దాతలు, యజ్ఞశీలులు కూడ జరామరణాలను దాటలేకపోతున్నారు. పుట్టిన ప్రాణులకు, పగళ్లు, నెలలు, సంవత్సరాలు, పక్షాలు, రాత్రులు మళ్లీ తిరిగి రావటం లేదు. స్థిరత్వం లేక వశం తప్పిన మానవుడు ప్రాణులన్నీ సేవించే విశాల మార్గాన్ని కాలంచేత పొందుతున్నాడు. జీవుని వల్ల దేహం కాని, దేహం వల్ల జీవుడు కాని ఏర్పడుతున్నాడు. ఆ మార్గంలో భార్యలు, ఇతర బంధువులతో కలయిక పొందుతున్నారు. తన శరీరంతో కూడా ఎవడూ, ఎప్పుడూ చెడని సహవాసం పొందటం లేదు. ఇక ఇతరాలతో సహవాసం గురించి చెప్పవలెనా ? రాజా ! ఇపుడు నీ తండ్రి ఎక్కడ ఉన్నాడు? నీతాత లెక్కడ ఉన్నారు? వారిని ఇపుడు నీవు చూడటంలేదు. వారూ నిన్ను చూడటం లేదు. మానవుడు స్వర్గాన్ని కాని, నరకాన్ని కాని చూడడు. సుజనులకు ఆగమమే కన్ను. రాజా ! దానిని బట్టి ప్రవర్తించు. బ్రహ్మచర్యం చక్కగా పాటించి, ఆ తరువాత సంతానం పొందాలి. యజ్ఞాలు చెయ్యాలి. పితృదేవతలకు, దేవతలకు, మనుష్యులకు అప్పు తీర్చటానికి ఇవన్నీ అసూయ లేకుండా ఆచరించాలి. మొదట బ్రహ్మచర్యప్రవృత్తి కలిగి, వివేకదృష్టి కలిగి, తరువాత యజ్ఞశీలుడై, సంతాన శ్రద్ధకలిగి, మనసులోని వెలితిని వదలి, ఈ లోకాన్ని కాని, స్వర్గాన్ని కాని ఆరాధించాలి. రాగేద్వేష రహితంగా ధర్మం ఆచరించేవాడు, న్యాయంగా ధనం, ద్రవ్యాలు సంపాదించేవాడు, ధర్మం చక్కగా నడిపేవాడు అయిన రాజు యొక్క కీర్తి చరాచరలోకాలన్నిటియందు వృద్ధి పొందుతుంది. జనకుడు సమగ్రమై పూర్ణహేతువులుకల ఈ వాక్యం తెలిసికొని, పరిశుద్ధమయిన బుద్ధితో అశ్మని వీడ్కొలిపి, శోకం శాంతించి ఇంటికి వెళ్లాడు. ధర్మజా ! అలాగే నీవూ శోకం విడిచిపెట్టు. లే ! సంతోషం పొందు. క్షత్రధర్మంతో నీవు భూమిని జయించావు. దాన్ని చక్కగా అనుభవించు. సందేహించకు."

29. షోడశమహారాజుల చరిత్రము.

వైశంపాయనుడు ఇలా అన్నాడు. "(వ్యాసుని మాటలు విని) ధర్మపుత్రుడయిన యుధిష్ఠిరుడు ఏమీ మాట్లాడలేదు. అపుడు అర్జునుడు శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. "మాధవా ! ఈ ధర్మజుడు బంధువులందరూ చనిపోవడం వలన శోకంతో పరితపిస్తూ, శోకసాగరంలో మునిగిపోయాడు. నీవు అతనిని ఓదార్చు. కృష్ణా ! మేమందరమూ మళ్లీ చాలా దిగులుతో ఉన్నాం. వీని శోకం నీవే పోగొట్టాలి." "అర్జునుడు కృష్ణునితో ఇలా అనగానే పుండరీకాక్షు డయిన అచ్యుతుడు ధర్మరాజువైపు తిరిగాడు. కృష్ణుడు ధర్మరాజుకు అతిక్రమింపరానివాడు. చిన్నప్పటినుండి ప్రీతి విషయంలో అర్జునుని కంటె ధర్మరాజుకు కృష్ణుడే అధికం. మహాబాహువయిన కృష్ణుడు రాతిస్తంభం వంటి ధర్మరాజు చేతిని దృఢంగా పట్టుకొని సరససల్లాపాలతో ఇలా అన్నాడు. చక్కని పలువరుస, అందమైన కనులు కల అతని వదనం సూర్యోదయానికి చక్కగా వికసించిన పద్మంవలె శోభిల్లింది.

వాసుదేవుడు అన్నాడు. "పురుషశ్రేష్ఠా ! శరీరాన్ని శుష్కింపజేసే శోకం నీవు పొందరాదు. ఈ యుద్ధ రంగంలో చనిపోయిన వారందరు మళ్లీ నీకు తిరిగి రారుకదా ! కలలో దొరికిన వన్నీ మెలకువరాగానే మాయమై పోతాయి. అలాగే మహాయుద్ధంలో వెళ్లిపోయిన రాజులందరు ఇక కనపడరు. ఆ వీరు లందరూ యుద్ధంలో ఎదురెదురుగా నిలిచి పోరాడారు. ఓడిపోయారు. వీరిలో ఒక్కరు కూడా వెన్నుపోటు పొడవలేదు. పారిపోతుంటే పడగొట్టలేదు. ఈ వీరులందరూ తమప్రాణాలు ఒడ్డి యుద్ధం చేశారు. శస్త్రాలతో పవిత్రులై స్వర్గానికి వెళ్లారు. వారిని గూర్చి విచారింప నవసరం లేదు. క్షత్రధర్మం మీద ఆసక్తికలవారు, వేదవేదాంగ పారగులు, శూరులు, పుణ్యప్రదమైన వీరుల గతిని పొందిన రాజులు ఎందరో ఉన్నారు. వారిని గూర్చి నీవు వినికూడా ఇలా విలపించడం తగదు. ఈ విషయంలో పుత్రశోకంతో ఆర్తుడయిన సృంజయునికి నారదుడు చెప్పిన ప్రాచీన ఇతిహాసం చెప్పుకొంటారు. "సృంజయా! నీవూ, నేనూ, ప్రజలందరూ సుఖదుఃఖాలు విడవకుండానే చచ్చిపోతాం. దానికి విలపించడం ఎందుకు? పూర్వం వెళ్లిపోయిన మహారాజుల మాహాత్మ్యం నేను కీర్తిస్తాను. విను. మనసు స్థిరపరచుకో. దానితో దుఃఖం వదలి పెడతావు. మహానుభావులై చనిపోయిన రాజులను గూర్చి విని, సంతాపాన్ని శమింపజేసుకో. విస్తారంగా చెపుతా విను. ఇది క్రూరగ్రహాలను శాంతింపజేస్తుంది. ఆయువును పెంచుతుంది. ఉత్తమమూ, మనోహరమూ అయినది. గ్రహింపదగింది. ఇది పూర్వమహారాజుల కథ. విను. సృంజయా! అవిక్షితుని పుత్రు డయిన **మరుత్తుని** గురించి వింటున్నాం. అతని యజ్ఞానికి ఇంద్రుడు, వరుణుడు, బృహస్పతి మొదలయిన దేవతలు స్వయంగా వచ్చారు. ఆ మరుత్తుడు

స్వర్గలో దేవేంద్రుని గెలిచాడు. ఇంద్రునికి ప్రియంకోరే బృహస్పతి ఆ మరుత్తుని యజ్ఞం చేయించ నన్నాడు. అపుడు బృహస్పతి తమ్ముడయిన సంవర్తుడు ఆ యజ్ఞం చేయించాడు. రాజోత్తమా! ఆ మహారాజు పాలనలో భూమి దున్నకపోయినా పంటలు పండేవి. భూమి నిండా యజ్ఞశాలలు పంక్తులు పంక్తులుగా ఉండేవి. మరుత్తుని యజ్ఞంలో విశ్వేదేవతలు, మరుద్గణాలు సభాసదులై అతని చుట్టూ కూర్చున్నారు. మరుత్తుని యజ్ఞంలో మరుద్గణాలు సోమపానం చేశారు. అతడిచ్చిన దక్షిణలు దేవతలు, మానవులు, గంధర్వులు పట్టుకొని వెళ్లలేకపోయారు. 1. ధర్మం, 2. జ్ఞానం, 3. వైరాగ్యం, 4. ఐశ్వర్యం. అనే నాలుగు భద్రాలూ అతనికి నీకంటె ఎక్కువగానే ఉన్నాయి. అయినా ఆ రాజు చనిపోయాడు. నీకొడుకు కంటె అతడు చాలా పుణ్యం చేశాడు. అందుచేత నీ పుత్రుని గురించి పరితపించకు.

సృంజయా! అలాగే అతిథి అని పేరుకెక్కిన **సుహోత్రుని** రాజ్యంలో దేవేంద్రుడు సంవత్సరమంతా బంగారం వాన కురిపించాడు. ఆ రాజును పొంది 'వసుమతి' సార్థకనామ అయింది. అతని రాజ్యంలో నదులు బంగారంతో ప్రవహించాయి. లోకపూజితుడైన దేవేంద్రుడు బంగారు తాబేళ్లను, పీతలను, మొసళ్లను, పెద్దచేపలను, శిశుకాలనే చేపలను నదులలో పడవేశాడు. వందలకొద్దీ, వేలకొద్దీ బంగారు చేపలు, మొసళ్లు, తాబేళ్లు పడటం చూసి, అతిథి ఆశ్చర్యపడ్డాడు. అంతులేకుండా కురుజాంగలమంతా వ్యాపించిన ఆ బంగారాన్ని, మహాయజ్ఞంలో సుహోత్రుడు బ్రాహ్మణులకు సమర్పించాడు. సృంజయా! నాలుగు భద్రాలలోను నీకంటె అధికుడయి, నీకుమారునికంటె ఎక్కువ పుణ్యం చేసిన సుహోత్రుడే మరణించాడు గదా! దక్షిణలు ఇవ్వని, యజ్ఞం చేయని నీ కుమారుని గురించి నీవు విలపించరాదు. తెలుసుకో! శాంతిపొందు.

సృంజయా! అంగరాజయిన **బృహద్రథుడు** కూడ చనిపోయాడని విన్నాం కదా! ఆ రాజు యజ్ఞంలో దక్షిణగా వేయివేల తెల్లని గుర్రాలను, బంగారు ఆభరణాలతో అంతమంది కన్యలను ఇచ్చాడు. అతడు యజ్ఞంలో బంగారు పద్మాల మాలలు ధరించిన వేయివేల ఏనుగులను దక్షిణగా ఇచ్చాడు. అలాగే బంగారు మాలికలు ధరించిన వేలకొలది ఆవుల వెంటనడిచే ఎద్దులను దక్షిణగా ఇచ్చాడు. విష్ణుపదమనే పర్వతం మీద అంగుడు యజ్ఞం చేసినపుడు ఇంద్రుడు సోమపానంతోనూ, బ్రాహ్మణులు దక్షిణలతోను మదించిపోయారు. అంగుడు వందలకొద్దీ యజ్ఞాలు చేశాడు. అపు డత డిచ్చిన దక్షిణలు దేవతలను, మనుష్యులను, గంధర్వులను మించిపోయాయి. సోమయాగాలు ఏడు. 1. అగ్నిష్టోమం, 2. అత్యగ్నిష్టోమం, 3. ఉక్థ్యం, 4. షోడశి, 5. వాజపేయం, 6. అతిరాత్రం,

7. ఆప్తోర్యామం.

అంగుడు చేసిన సోమయాగాలు ఏడింటిలోను ఇచ్చిన ధనంతో సమానంగా ధనం ఇచ్చేవాడు ఇంతవరకూ లేడు. ఇకముందు పుట్టడు. సృంజయా! నాలుగు భద్రాలలోను నిన్ను మించినవాడు, నీ కుమారునికంటె మిక్కిలి పుణ్యంకల అంగుడే మరణించాడంటే, నీకుమారుని గూర్చి నీవు విచారించడం ఎందుకు? విచారించకు.

సృంజయా! ఉశీనరుని పుత్రుడయిన **శిబిచక్రవర్తి** కూడా మరణించాడు. అతడు ఈ భూమినంతటిని చర్మంవలె కప్పివేశాడు. పెద్ద రథఘోషతో భూమి అంతా ప్రతిధ్వనింపజేస్తూ, ఒకే రథంతో భూమినంతటిని జయించి, ఏకచ్ఛత్రంగా పరిపాలించాడు. అడవి పశువులతో పాటు తనగోవులను, గుర్రాలను అన్నింటిని యజ్ఞంలో ఇచ్చివేశాడు. అతనిభారం మోసేవాడు మరొకడు లేడని ప్రజాపతి అనుకొనేవాడు. సృంజయా! శిబి రాజర్షి. ఇంద్రునితో సమానమైన విక్రమం కలవాడు. అతనిని మించిన రాజు పుట్టలేదు. పుట్టబోడు. నీ కొడుకు అలా దక్షిణలూ ఇవ్వలేదు. యజ్ఞాలూ చెయ్యలేదు. అట్టివానిని గూర్చి దుఃఖించకు. నాలుగు భద్రాలలో నీకంటె గొప్పవాడు, నీ కొడుకును మించిన పుణ్యాత్ముడు అయిన శిబియే మరణిస్తే నీ కొడుకు గూర్చి ఇంకా విలపిస్తావెందుకు?

సృంజయా! శకుంతలా దుష్యంతుల పుత్రుడు, ఎంతోధనం సంపాదించినవాడు, మహాత్ముడు **భరతుడు**. అతడే చనిపోయాడని విన్నాం కదా! ఆరాజు యమునా తీరంలో మూడువందల గుర్రాలను, సరస్వతీ తీరంలో ఇరువదింటిని, గంగాతీరంలో పదునాల్గింటిని కట్టి, వేయి అశ్వమేధాలూ, వంద రాజసూయాలూ చేశాడు. ఆ భరతుడు గొప్ప తేజస్వి. మానవులు ఆకాశాన్ని చేతులతో అందుకోలేరు. అలాగే భరతుని ఈ మహత్కార్యాన్ని రాజులు ఎవరూ అనుసరింపలేకపోయారు. భరతుడు వేయికిపైగా గుర్రాలను, యజ్ఞ వేదికలను ఏర్పరచి, వేయి పద్మాల ధనం కణ్వునకు దానమిచ్చాడు. సృంజయా! నాలుగు భద్రాలలోను నిన్ను మించినవాడు, నీ కుమారుని కంటె పుణ్యాత్ముడు అయిన ఆ రాజే మరణించాడు. అందుచేత నీ కొడుకును గూర్చి పరితపించకు.

సృంజయా! ప్రజలను కన్నబిడ్డలవలె రక్షించిన దశరథ కుమారుడు **రాముడే** వెళ్లిపోయాడు అని విన్నాం. అతడు పాలించేటప్పుడు విధవలు లేరు. అనాథలు లేరు. అతడు సదా ప్రజలకు తండ్రివలె వ్యవహరించాడు. **అతని రాజ్యంలో సకాలంలో వర్షాలు పడేవి. పంటలు సమృద్ధిగా పండేవి. ఎల్లప్పుడు అతని రాజ్యం సుభిక్షంగా ఉండేది. రాముడు రాజ్యం చేస్తున్నపుడు, ప్రాణులు నీటిలో మునిగి చనిపోలేదు. అగ్నిలోపడి చనిపోయిన వారూ లేరు. రోగభయం లేదు. రాముడు రాజ్యం**

చేస్తున్నపుడు, స్త్రీలూ, పురుషులూ రోగరహితులై కోరికలు తీరి, వేల సంవత్సరాలు జీవించారు. రాముడు రాజ్యం చేస్తున్నపుడు, స్త్రీలకు కూడా వివాదం వీర్పడేది కాదు. ఇక పురుషులకు ఎక్కడిది? ప్రజలంతా నిత్యమూ ధర్మపరులై ఉండేవారు. రాముడు రాజ్యం చేస్తున్నపుడు, ప్రజలందరు సంతృప్తితో కోరికలు తీరి, సత్యవ్రతులై నిర్భయంగా, స్వేచ్ఛగా తిరిగేవారు. రాముడు రాజ్యం చేస్తున్నపుడు, వృక్షాలు సర్వకాలాల్లోనూ పుష్పాలతో, పండ్లతోను ఏ ఉపద్రవాలు లేకుండా పెరిగాయి. ఆవులన్నీ కుండల కొద్దీ పాలిచ్చేవి. మహాతపస్వి అయిన రాముడు పదునాలుగు సంవత్సరాలు వనవాసం చేశాడు. అందరూ ప్రశంసించేటట్లు అడ్డులేకుండా పది అశ్వమేధాలు చేశాడు. రాముడు నీలవర్ణపు శరీరమూ, ఎర్రని కనులూ కల యువకుడు. గజయూథానికి రాజులా సంచరించేవాడు. ఆజానుబాహువు, అందమైన ముఖం, సింహం మూపు వంటిమూపు. పొడవైన చేతులు కలిగినవాడు రాముడు. పదకొండువేల సంవత్సరాలు అయోధ్యకు అధిపతియై రాముడు రాజ్యం చేశాడు. నాలుగు భద్రాలలోను నీకంటె అధికుడై, నీ కొడుకును మించిన పుణ్యాత్ముడైన రాముడే మరణించాడు. ఇక నీవు నీ పుత్రుని గూర్చి శోకింపకు.

స్ృంజయా! భగీరథుడు కూడ చనిపోయాడని విన్నాం. అతడు చేసిన యజ్ఞంలో, ఇంద్రుడు సోమపానం చేసి మత్తిల్లిపోయాడు. వేలకొద్దీ రాక్షసులను తన భుజశక్తితో గెలిచాడు. గొప్ప యజ్ఞం చేస్తూ, అతడు బంగారు అలంకారాలతో కూడిన పదిలక్షల కన్యలను దక్షిణగా ఇచ్చాడు. ఆ కన్యలంతా రథాలపై వెళ్లారు. ఒక్కొక్క రథానికి నాలుగేసి గుర్రాలు. ఒక్కొక్క రథానికి పద్మాలు, బంగారు హారాలు కల నూరేసి ఏనుగులు ఉన్నాయి. ఒక్కొక్క ఏనుగు వెనుక వెయ్యి గుర్రాలు వెళ్లాయి. ఒక్కొక్క గుర్రానికి వెయ్యేసి గోవులు, ఒక్కొక్క ఆవుకు వెయ్యేసి మేకలు వెంట నడిచాయి. సమీపంలో నివసించే అతని ఒడిలో పూర్వం గంగ కూర్చుంది. అందుచేత ఆ గంగ భాగీరథి అయింది. 'ఊర్వశి' కూడా అయింది. యజ్ఞాలు చేస్తూ భూరిదక్షిణలిచ్చే భగీరథునికి, మూడు లోకాల్లో ప్రవహించిన గంగాదేవి కూతురు అయింది. స్ృంజయా! నాల్గుభద్రాలలో నీకంటె అధికుడు, నీ పుత్రుని కంటె పుణ్యాత్ముడు అయిన అతడు కూడ మరణించాడు. నీవు నీ కొడుకును గూర్చి శోకించకు.

స్ృంజయా! మహాత్ముడయిన దిలీపుని గురించి విన్నాం. అతని ఘనకార్యాలను విప్రులు చెప్పుకొంటారు. అతడూ చనిపోయాడు. అతడు ధనపూర్ణమయిన భూమినంతటిని, శుద్ధమనస్సుతో, మహాయజ్ఞంలో బ్రాహ్మణులకు దానం చేశాడు. అతడు చేసిన ప్రతియజ్ఞంలోనూ, పురోహితుడు బంగారంతో అలంకరింపబడిన వెయ్యేసి ఏనుగులను

దక్షిణగా ఇచ్చాడు. అతని యజ్ఞంలో పెద్దబంగారపు యూపస్తంభం కాంతులీనుతూ ఉండేది. ఇంద్రాది దేవతలు అతనికి పనులు చేస్తూ ఆశ్రయించి ఉండేవారు. బంగారుయూపస్తంభానికి పైన గుండ్రంగా కడియం మీద ఆరువేల మంది దేవగంధర్వులు నృత్యం చేశారు. విశ్వావసువు స్వయంగా వారిమధ్య సప్తస్వరాలతో వీణ వాయించాడు. సర్వభూతాలూ ఆ వాదనం తమ కోసమే అనుకొని తన్మయం చెందాయి. దిలీపుని ఏనుగులు బంగారు తొడుగులు దాల్చి, మత్తెక్కి, మార్గాలలోనే నిద్రించేవి. ఆయనను ఎవరూ అనుకరింప లేకపోయారు. ఒక్కవింటితో అతడు వందలకొద్దీ జనులను నిలువరించేవాడు. సత్యాన్నే పలికేవాడు. ఆయనను చూసిన వారు కూడా (ఆపుణ్యంతో) స్వర్గం చేరుకొనేవారు. వేదఘోష, వింటినారి ఘోష, 'దానం ఇవ్వండి' అనే శబ్దఘోష – ఈమూడు ధ్వనులూ దిలీపుని ఇంట్లో ఎప్పుడూ వినపడేవి. నాలుగు భద్రాలలో నీకంటె అధికుడై, నీకొడుకును మించిన పుణ్యాత్ముడయిన దిలీప మహారాజే చనిపోయాడంటే నీవు నీ పుత్రుని గురించి విలపించడం ఎందుకు?

యువనాశ్వని పుత్రుడు **మాంధాత** చనిపోయాడు. ఆదీ విన్నాం. గర్భరూపమయిన తండ్రి డొక్కలో నుండి దేవతలు అతనిని బయటకు తీశారు. అతడు (మాంధాత) యువనాశ్వని కడుపులో పెరిగాడు. పెరుగు, నెయ్యి కలిపిన పదార్థం వల్ల అతడు పుట్టాడు. అతడు శ్రీమంతుడై మూడు లోకాలనూ జయించాడు. దేవరూపుడై తండ్రి ఒడిలో పడుకొని ఉన్న పుత్రుని చూసి దేవతలు ఒకరినొకరు "ఇతడు ఎవరి పాలు త్రాగాలి" అన్నారు. 'నాదగ్గరే త్రాగుతాడు' అని ఇంద్రుడన్నాడు. అందుచేత అతనికి దేవేంద్రుడు 'మాంధాత' అని పేరుపెట్టాడు. అపుడు యౌవనాశ్వుడు పెరగటం కోసం ఇంద్రుని చేయి అతని నోట్లో పాలధారను కురిసింది. అలా ఇంద్రుని చేతినుండి పాలు త్రాగుతూ, రోజుకు వంద పలాల చొప్పున పెరిగాడు. పన్నెండురోజుల్లో పన్నెండు ఏళ్లవయసు వాడయ్యాడు. అతడు ధర్మాత్ముడు, మహాత్ముడు, యుద్ధంలో ఇంద్ర సమానుడూ అయ్యాడు. అతనికి ఒక్కరోజులో భూమి అంతా వశమయింది. మాంధాత అంగారుడనే రాజును, మరుత్తుని, అసితుని, గయుని, అంగరాజును, బృహద్రథుని యుద్ధంలో జయించాడు. మాంధాత అంగారునితో యుద్ధం చేస్తున్నపుడు, వింటినారి ధ్వనులతో ఆకాశం విరిగి పడిపోయిందని దేవతలు అనుకొన్నారు. సూర్యుడు ఉదయించిన చోటినుండి అస్తమించే చోటు దాకా ఉన్న భూమి అంతా మాంధాతదే అని చెప్పేవారు. అతడు నూరు అశ్వమేధాలు, నూరు రాజసూయాలూ చేసి ఒక యోజనం పొడవు, పదేసి యోజనాలు వెడల్పూ, కల బంగారు చేపలను విప్రులకు దానం చేశాడు. ఆ బ్రాహ్మణులు మోయలేని వాటిని

ఇతరులు విభజించుకొన్నారు. నాలుగు భద్రాలలోను నీకంటె అధికుడయి, నీ కొడుకును మించిన పుణ్యాత్ముడయిన మాంధాత కూడా మరణించాడు. నీకు దుఃఖమెందుకు? పుత్రశోకం పొందకు.

సృంజయా! నహుషుని కొడుకు **యయాతి** కూడ చనిపోయాడని విన్నాం కదా! ఇతడు సముద్రంతోసహా భూమినంతటినీ జయించాడు. శమ్యాపాతమంత దూరం యజ్ఞవేదులు నిర్మించి యజ్ఞాలు చేశాడు. చివరకు భూమిని విడిచి వెళ్లిపోయాడు. వేయి యజ్ఞాలూ, నూరు వాజపేయాలు చేసి విప్రులను మూడు బంగారుకొండలతో తృప్తిపరిచాడు. వ్యూహాలతో కూడిన యుద్ధంలో దైత్యులను, దానవులను చంపాడు. భూమినంతటినీ యయాతి తనకేమీ ఉంచుకోకుండా పంచి పెట్టాడు. యదువు, ద్రుహ్యుడు మొదలయిన కొడుకులను రాజ్యపు చివరి భాగాల్లో ఉంచి, పూరుని రాజ్యంలో అభిషేకించి, భార్యతో సహా వనానికి వెళ్లిపోయాడు. సృంజయా! నాలుగు భద్రాలలోను నీకంటె అధికుడు, నీకొడుకును మించిన పుణ్యాత్ముడు అయిన యయాతియే మరణించాడు. నీవు పుత్రునికై శోకింపకు.

సృంజయా! నాభాగుని కొడుకయిన **అంబరీషుడు** కూడా మరణించాడని విన్నాం. పుణ్యాత్ముడు, రాజోత్తముడు అయిన అతనిని ప్రజలే రాజుగా / రక్షకుడుగా వరించారు. అతడు మహాయజ్ఞం చేశాడు. అందులో యజ్ఞాలు చేసిన వేలకొద్దీ రాజులను, బ్రాహ్మణుల ఆతిథ్యంకోసం నియమించాడు. 'ఈ పనిని ఎవరూ పూర్వం చేయలేదు. ఇకముందు ఎవరూ చెయ్యలేరు' అని సమర్థులు అంబరీషుని ప్రశంసించారు. చాలా వేలమంది రాజులు అశ్వమేధాలు చేసి, దక్షిణాయనం వెళ్లి ఉత్తరాయణం వచ్చాక బ్రహ్మలోకానికి వెళ్లారు. సృంజయా! చతుర్భద్రాలు నీకంటె అధికంగా కలిగి, నీ కొడుకును మించిన పుణ్యాత్ముడయిన అంబరీషుడు కూడ మరణించాడు. నీ పుత్రునికై శోకించకు.

సృంజయా! చిత్రరథుని కొడుకు **శశబిందుడు** కూడ మరణించాడని విన్నాం. అతనికి లక్షమంది భార్యలున్నారు. శశబిందునికి కుమారులు వేలకొద్దీ ఉన్నారు. ఆ పుత్రులందరూ బంగారు కవచాలు, ఉత్తమధనుస్సులు కలవారు. ఒక్కొక్క రాజకుమారుని వెనుక వందమంది చొప్పున కన్యకలు అనుసరించారు. ఒక్కొక్క కన్యను వంద ఏనుగులు, ఒక్కొక్క ఏనుగును వంద రథాలు అనుసరించాయి. ఒక్కొక్క రథానికి బంగారుమాలికలతో వంద గుర్రాలు, ఒక్కొక్క గుర్రానికి నూరు గోవులు. ఒక్కొక్క గోవును, వంద మేకలు, గొర్రెలు అనుసరించాయి. అంతులేని యీ సంపదనంతటినీ అశ్వమేధ మహాయజ్ఞంలో శశబిందుడు బ్రాహ్మణులకు సమర్పించాడు. సృంజయా! నాలుగు భద్రాలలోను నీకంటె

అధికుడూ, నీ కొడుకు కంటె పుణ్యాత్ముడూ అయిన శశబిందుడు వెళ్లిపోయాడు. నీవు నీ కొడుకుకోసం చింతించకు.

సృంజయా! అమూర్తరయసునిపుత్రుడు **గయుడు** కూడ మరణించాడు అని విన్నాం. అతడు నూరేండ్లపాటు యజ్ఞంలో హోమం చేయగా మిగిలిన దానినే తిన్నాడు. అగ్ని అతనికి వరాలిచ్చాడు. గయుడు అగ్నినుండి ఈ వరాలు కోరాడు. దానం చేసే సువర్ణ రూపమయిన నా ధనం అక్షయం అగుగాక ! నాకు ధర్మం మీద శ్రద్ధ వృద్ధి పొందుగాక ! హుతాశనా ! నీ అనుగ్రహం వలన నామనసు సత్యం మీదనే ఉండుగాక ! ఆ కోరికలన్నీ పొందాడని కూడ విన్నాం. దర్శ, పూర్ణమాసలనే యజ్ఞాలతోను, చాతుర్మాస్యాలతోను, పునః పునః వేయి సంవత్సరాలు పూర్తిగా అశ్వమేధయాగాలు చేశాడు. లక్ష గోవులను, నూరు కంచరగాడిదలను, పూర్తిగా వెయ్యేండ్లపాటు ఎంతో ఉత్సాహంతో దానం చేశాడు. ఆతడు సోమంతో దేవతలను, ధనంతో విప్రులను, స్వధాకారాలతో పితృదేవతలను, కోరికలతో స్త్రీలను సంతృప్తి పరచాడు. పదిబారల వెడల్పు, రెట్టింపు పొడవు కల బంగారు భూమిని తయారు చేసి అశ్వమేధ మహాయజ్ఞంలో ఆ రాజు దక్షిణగా ఇచ్చాడు. గంగానదిలోని ఇసుకరేణువులెన్ని ఉన్నాయో అన్ని గోవులను గయుడు దానం చేశాడు. సృంజయా! నాలుగు భద్రాలలో నీ కంటె అధికుడై, నీ కొడుకును మించిన పుణ్యాత్ముడైన గయుడు కూడ మరణించాడు. నీవు కుమారుని కోసం వ్యథ చెందకు.

సంకృతికి పుత్రుడయిన **రంతిదేవుడు** కూడ మరణించాడని విన్నాం. అతడు మహాతపస్వి. ఇంద్రుని ఆరాధించి అతని నుండి వరం పొందాడు. 'మాకు అన్నం అధికంగా లభించుగాక! చాలామంది అతిథులను పొందుదుము గాక! మాశ్రద్ధ తగ్గకుండును గాక! మేమెవ్వనిని యాచింపకుందుము గాక' అని ఆరాధించి దేవేంద్రుని నుండి వరాలు పొందాడు. శ్రద్ధతో వ్రతశీలుడయిన రంతిదేవుని దగ్గరకు గ్రామాల నుండి, అరణ్యాలనుండి పశువులు స్వయంగా "మమ్ము పితృ యజ్ఞకార్యాలలో ఉపయోగించండి" అని వచ్చి చేరేవి. ఆ గోవుల చర్మాల రాశివల్ల కలిగిన చెమ్మతో ఒక మహానది ప్రవహించింది. అదే తరువాత చర్మణ్వతి అని పేరు పొందింది. పెద్ద సదస్సులో ఆరాజు బ్రాహ్మణులతో 'మీకు నూరు బంగారు నాణెములిస్తా' నన్నాడు. అపుడు వారు 'అవి మేమే నీకు ఇవ్వగలం' అన్నారు. అపుడు ఆరాజు వారికి వెయ్యేసి నిష్కాలు ఇచ్చి బ్రాహ్మణులను సంపాదించుకొన్నాడు. నెలనెలా చేసే పితృకార్యంలో పనిముట్లు, పాత్రలు, ఉపకరణాలు, కుండలు, పాత్రలు, గుండిగలు, గిన్నెలు, డేగిశాలు, అన్నీ బంగారంతో చేసినవే

ఉపయోగించేవారు. రాత్రి తనయింట్లో నివసించిన వారికి రంతిదేవుడు ఇరవైవేల వంద గోవులను దానం చేసేవాడు. మణికుండలాలు ధరించిన వంటవారు "అయ్యా! సూపం సమృద్ధిగా తినండి. పూర్వం వలె ఇపుడు మాంసం లేదు" అని అరిచేవారు. సృంజయా! చతుర్భద్రాలలో నీకంటె అధికుడు, నీ పుత్రుని మించిన పుణ్యాత్ముడు అయిన అతడు (రంతిదేవుడు) కూడా మరణించాడు. నీవిక పుత్రునికోసం విలపించకు.

సృంజయా! మహాత్ముడయిన **సగరుడు** కూడ చనిపోయాడని విన్నాం కదా! అతడు ఇక్ష్వాకు వంశస్థుడు. అతిమానుషమైన పరాక్రమం కలవాడు. అతడు ముందు వెడుతూ ఉంటే, వెనుక అరవై వేల మంది కుమారులు వెంటనడిచేవారు. వర్షాకాలం వెళ్లాక, మేఘాలు లేని ఆకాశంలో చంద్రుని వెనుక నక్షత్రాలు వెడుతున్నట్లు ఉండేది. అతని పరాక్రమం వల్ల భూమి అంతా ఒక గొడుగు క్రిందికి వచ్చింది. అతడు వేయి అశ్వమేధాలతో దేవతలను సంతృప్తిపరచాడు. కమల పత్రనేత్రలయిన స్త్రీలు, తల్పాలు కల బంగారు స్తంభాల భవనాన్ని, అర్హులయిన బ్రాహ్మణులకు దానం చేశాడు. ఇంకా ఎన్నో కోరికలను తీర్చాడు.అతని ఆజ్ఞతో ఆ బ్రాహ్మణులు ఆ ధనాన్ని పంచుకొన్నారు. అతడు కోపంతో భూమినంతనూ త్రవ్వించి సాగరం చేశాడు. అతని వేరుతోనే (సగర పుత్రులు త్రవ్వడం చేతనే) సముద్రానికి సాగరమనే వేరు వచ్చింది. సృంజయా! చతుర్భద్రాలలో నీకంటె అధికుడై, నీ కొడుకును మించిన పుణ్యాత్ముడయిన సగరుడే వెళ్లిపోయాడు. నీ పుత్రునికై ఇక వగవకు.

సృంజయా! వేనుని కొడుకయిన **పృథువు** కూడ చనిపోయాడని విన్నాం. మహర్షు లందరును కలిసి మహారణ్యంలో అతనిని అభిషేకించారు. లోకాలను ప్రసిద్ధి పొందింపగలడని అతడు పృథు శబ్దంతో చెప్పబడ్డాడు. దెబ్బల నుండి రక్షిస్తాడు. కాబట్టి క్షత్రియు డయ్యాడు. పృథువును చూసి ప్రజలు 'మాకు నీ యందు అనురాగం కలిగింది" అన్నారు. అందుచేత ఆ అనురాగం వల్ల రాజు అనే పేరు వచ్చింది. అతడి రాజ్యంలో భూమి దున్నకుండానే పండేది - ఆకు ఆకున తేనె స్రవించేది. ఆవులన్నీ కుండల కొద్దీ పాలు ఇచ్చేవి. మానవులు తమ కోరికలు తీరి, నిర్భయులై, యథేచ్ఛగా తమ తమ క్షేత్రాలలోను, గృహాలలోను నివసించేవారు. సముద్రంలో కలిసిపోయే నీటిని నిలువరించేవాడు. అతనిపాలనలో నదులెన్నడూ ఎండిపోలేదు. యుద్ధంలో ఎన్నడూ ధ్వజం విరగలేదు (ఓడిపోలేదు). మూడు నల్వముల* పాడవుండే ఇరవై యొక్క బంగారు కొండలను అశ్వమేధ యజ్ఞంలో బ్రాహ్మణులకు దానం చేశాడు. సృంజయా! చతుర్భద్రాలలో నీకంటె

* నల్వము = నాలుగు వందల మూరలు

అధికుడై, నీ కొడుకును మించిన పుణ్యాత్ముడు పృథువు కూడా మరణించాడు. నీవింకను కొడుకుకై పరితపించకు.

సృంజయా! నీవు ఊరికే ఏదో పరధ్యానంగా ఉంటా వెందుకు? నా మాట వినవా? చచ్చిపోదామనుకొన్నవాడికి పథ్యం పెట్టినట్లు నా మాటలన్నీ వృథా అయ్యాయా?" సృంజయుడు ఇలా అన్నాడు. "నారదా! నీ మాట వినపడింది. పుణ్యమనే వాసన కల పూలదండలా ఉంది. విచిత్రమయిన అర్థాలు కలిగి ఉంది నీ మాట. పుణ్యాత్ములు, మహాత్ములు, కీర్తిమంతులు అయిన రాజుల పుణ్యవాసనలతో నిండి ఉంది. శోకం తుడిచిపెట్టేస్తోంది. మహర్షీ! నీ మాటలు వ్యర్థం కాలేదు. నిన్ను చూడటంతోనే నాకు శోకం పోయింది. బ్రహ్మవాదీ! నీ మాట వినాలనిపిస్తోంది. అమృతం ఎంత త్రాగినా తృప్తి కలగనట్లు నీ మాటలు ఇంకా వినాలనిపిస్తున్నాయి. సఫలమయిన దర్శనం కల నారదా! నేను సంతాపంతో దహించుకొనిపోయాను. నా మీద అనుగ్రహం కలిగితే నా పుత్రుని బ్రతికించు. నీ ప్రసాదం వల్ల నాకు మళ్లీ పుత్రసమాగమం కలుగుగాక." అపుడు నారదుడు అన్నాడు. "ఇపుడు మరణించిన నీ పుత్రుడు సువర్ణష్ఠీవిని ఒకనాడు పర్వతుడు నీకిచ్చాడు. వానిని మళ్ళీ నేను నీకిస్తాను. అతడు బంగారపు బొడ్డుతో వెయ్యేళ్లు జీవిస్తాడు."

30. నారదుడు ధర్మజునకు సువర్ణష్ఠీవి చరిత్ర చెప్పుట.

యుధిష్ఠిరుడు ఇలా అడిగాడు. "సువర్ణష్ఠీవి సృంజయుని కొడుకు ఎలా అయ్యాడు? పర్వతుడు అతనిని సృంజయుని కెందుకిచ్చాడు? సువర్ణష్ఠీవి ఎలా మరణించాడు? అతడు వెయ్యేండ్ల ఆయువుకలవా డయినపుడు, కౌమారదశ రాకుండానే ఎలా మరణించాడు? వానికి సువర్ణష్ఠీవి పేరు కేవలం నామమాత్రమేనా? లేక నిజంగా వాడు కాంచనష్ఠీవియేనా! ఇది తెలుసుకోవాలనుకొంటున్నాను." శ్రీకృష్ణుడు చెప్పాడు. "రాజా! జరిగినదంతా నీకు చెపుతాను. నారదుడు, పర్వతుడు అని ఇద్దరు మహర్షులు. ఇద్దరూ ఉత్తమ పురుషులే. వారు మేనమామ, మేనల్లుడూను. మానవలోకంలో సంతోషంతో విహరించుదామని, ఇద్దరూ దేవలోకంనుండి ఇక్కడకు వచ్చారు. హవిస్సుతో పవిత్రమైన భోజనంతోను, దేవభోజ్యమైన నేతితోను మామా అల్లుళ్లు - నారదపర్వతులు వచ్చారు. తపస్వులయిన వారిద్దరూ భూమిమీద సంచరిస్తూ, మానవభోగా లనుభవిస్తూ యథేచ్ఛగా విహరిస్తున్నారు. వారిద్దరు ప్రీతితో, సంతోషంతో ఒక నియమం చేసు కొన్నారు. ఆ నియమం ఇది. "శుభ మయినా అశుభ మయినా మనసులో కలిగిన సంకల్పం ఒకరికొకరు చెప్పుకోవాలి. అలాకాక తప్పితే శాపం అనుభవించాలి" అని. లోకపూజితులయిన మహర్షులిద్దరూ 'అలాగే' అని

ప్రతిజ్ఞ చేసుకొన్నారు. శ్వేతుని పుత్రుడయిన సృంజయుని దగ్గరకు వెళ్లి ఇలా అన్నారు. "మేము ఇద్దరమూ నీమేలు కోసం నీ యింట్లో కొంతకాలం నివసిస్తాం. మహారాజా! దానికి తగినట్లు మాకు నీవు అనుకూలుడవు కావాలి" అన్నారు. రాజు 'అలాగే' అని వారిద్దరినీ సత్కరించి సేవిస్తున్నాడు. ఒకనాడు మహాత్ములు, తపోధనులు అయిన వారిద్దరితో రాజు ప్రీతితో ఇలా అన్నాడు. "ఈమె నాకు ఒక్కతే పుత్రిక. ఈమె మీకు తగిన పరిచర్యలు చేస్తుంది. ఈమె చూడముచ్చట అయినది. నిర్దోషమయిన అవయవాలు; చక్కని శీలం, ప్రవర్తన కలది. పద్మకేసరాల వంటి కాంతికలది. పేరు సుకుమారి. 'చాలా బాగుంది' అన్నారు ఇద్దరూ. రాజు ఆమెను "అమ్మా! ఈ బ్రాహ్మణు లిద్దరినీ దేవతలవలె, తండ్రివలె సేవించు" అని శాసించాడు. ధర్మాచరణం చేసే ఆ కన్య తండ్రితో 'అలాగే' అని రాజు ఆజ్ఞ ననుసరించి వారిని సత్కరిస్తూ సేవలు చేస్తోంది.

ఆమె చేసే ఉపచారాల చేతనూ, ఆమె అందం చేతనూ వెంటనే నారదుని మన్మథుడు ఆదేశించాడు. నారదుని మనసులో శుక్లపక్షచంద్రునివలె మెల్లగా కామం పెరగసాగింది. ధర్మవిదుడయిన నారదుడు తన తీవ్ర కామానికి సిగ్గుపడుతూ, మహాత్ముడైన మేనల్లునకు చెప్పలేదు. కాని పర్వతుడు తన తపశ్శక్తితోను, నారదుని చేష్టలతోను, అతడు కామార్తు డయ్యాడని తెలుసుకొన్నాడు. కోపంతో నారదుని శపించాడు. 'శుభమయినా, అశుభమయినా మనసులో ఏ సంకల్పం కలిగినా, ఒకరితో ఒకరు చెప్పుకొందామని నాతో ప్రతిజ్ఞచేసి ఇపుడా మాట తప్పావు. అందుచేత నిన్ను శపిస్తున్నాను. సుకుమారి మీద నీలో కలిగిన కామభావం గురించి, నాకు ముందుగా చెప్పలేదు. అందుచేత ఇదిగో నిన్ను శపిస్తున్నాను. బ్రహ్మచారివి, పెద్దవాడవు, తపస్వివి, బ్రాహ్మణుడవు అయి కూడా, మనం చేసుకొన్న ప్రతిజ్ఞను భంగపరిచావు. అందుచేత నాకు చాలా కోపం వచ్చింది. నిన్ను శపిస్తాను. విను. సుకుమారి నీ భార్య అవుతుంది. సందేహం లేదు. వివాహమయినప్పటి నుండి నీకు కోతిరూపం వస్తుంది. స్వరూపం మారిపోయిన నిన్ను చూసి మానవులంతా హేళనగా చూస్తారు."

మేనమామ అయిన నారదుడు ఆ మాట విని మేనల్లుడయిన పర్వతుని కూడ కోపంతో ఇలా శపించాడు. "తపస్సు, బ్రహ్మచర్యం, సత్యం, ఇంద్రియనిగ్రహం అనే గుణాలుండి నిత్యధర్ముడ వయినా నీవు స్వర్గం పొందలేవు. అలా వారిద్దరూ క్రోధంతో ఒకరినొకరు శపించుకొని, కోపించిన ఏనుగులవలె తలొకదారిని వెళ్లిపోయారు. మహామతి అయిన పర్వతుడు తన తేజస్సు చేత యథోచితంగా గౌరవింపబడుతూ భూమి అంతా సంచరిస్తున్నాడు. విప్రోత్తముడైన నారదుడు సృంజయుని కుమార్తెను

దోషరహితయైన సుకుమారిని ధర్మపూర్వకంగా వివాహం చేసుకొన్నాడు. ఆ కన్య శాపాన్ని అనుసరించి కోతిరూపం కల నారదుని చూసింది. పాణిగ్రహణమంత్రాల నియమం వల్ల నారదుని చూసింది. కోతి ముఖం కలవాడయినా సుకుమారి అతనిని అవమానించలేదు. ప్రీతితోనే ఉంది. భర్తను చక్కగా సేవిస్తోంది. మరొకనిని మనసులో కూడా భావించలేదు. దేవుడో, మునియో, యక్షుడో పతి అయ్యాడు అని భర్తమీద ప్రేమభావం నింపుకొంది. తరువాత ఒకానొకప్పుడు పర్వతుడు అక్కడక్కడ తిరుగుతూ, నిర్జనమైన ఒక వనంలోకి వెళ్లి అక్కడ నారదుని చూశాడు. పర్వతుడు నారదుని చూసి నమస్కరించి ఇలా అన్నాడు. "ప్రభూ! నేను స్వర్గానికి పోవటానికి అనుగ్రహించు" అని ప్రార్థించాడు. చేతులు జోడించి దీనుడై కూర్చున్న పర్వతుని చూసి, ఇంకా దీనుడైన నారదుడు ఇలా అన్నాడు. 'నీవు వానరుడ వగు' మని ముందు నీవు నన్ను శపించావు. తరువాతనే మాత్సర్యంతో నేను "ఇప్పటి నుండి నీవు స్వర్గం వెళ్లలేవు" అని శపించాను. 'నీకిది తగనిది కాదులే. నీవు నాకు పుత్రుని వంటివాడవు' అన్నాడు నారదుడు. అపుడు ఆ ఇద్దరూ మునులూ ఒకరికొకరు శాపాలను నివారించారు. చక్కని శోభతో దేవరూపంతో నిలిచిన నారదుని చూసి, పరపురుషుడనుకొని సుకుమారి పరుగెత్తి పోయింది. అలా పరువెత్తిపోతున్న దోషరహిత అయిన సుకుమారిని చూసి, పర్వతుడు "ఇతడు నీ భర్తయే. విచారింపవలసిన పనిలేదు. ఇతడు మహర్షి, పరమధర్మాత్ముడు, భగవంతుడు, ప్రభువు అయిన నారదుడు. నీవీతని మనసు విరువకు. ఇందు నీకు సంశయించవలసిన పనిలేదు." ఇలా పర్వతుడు ఎన్నోవిధాల బ్రతిమలాడాడు. భర్త శాపదోషం విని, చివరకు ఆమె ప్రసన్నురాలయింది. పర్వతుడు స్వర్గానికి వెళ్లాడు." నారదుడు ఇంటికి వెళ్లాడు. వాసుదేవుడు చెప్పాడు. 'దీనికంతటికి ప్రత్యక్ష కర్త దేవర్షి అయిన నారదుడే. నీవడిగితే అతడే నీకు జరిగినదంతా చెపుతాడు రాజా!"

31. నారదుడు ధర్మరాజుకు సువర్ణష్ఠివి చరిత్ర చెప్పుట.

వైశంపాయనుడు చెపుతున్నాడు. "అపుడు ధర్మరాజు నారదునితో "భగవన్! సువర్ణష్ఠివి చరిత్ర వినాలనుకొంటున్నాను" అని అడిగాడు. ధర్మరాజు ఇలా అడగగానే నారదుడు సువర్ణష్ఠివిని గురించి జరిగినదంతా చెప్పాడు. "మహాబాహూ! కృష్ణుడు చెప్పినదంతా సత్యమే. మిగిలినది అడుగుతున్నావు. దాన్ని చెపుతాను విను. నేనూ, మా మేనల్లుడు పర్వతుడూ, సృంజయుని దగ్గర ఉండాలనే ఉద్దేశంతో అతని దగ్గరకు వెళ్లాం. అక్కడ మేమిద్దరమూ యథావిధిగా పూజింపబడ్డాం. మా కోరికలు తీరుతున్నాయి. అతని భవనంలో

నివసిస్తున్నాం. ఏళ్లు గడుస్తున్నాయి. మేము తిరిగి వెళ్లిపోవలసిన సమయం ఆసన్నమయింది. అపుడు పర్వతుడు అర్థవంతంగా నాతో ఇలా అన్నాడు. "మనమిద్దరమూ పరమపూజితులమై ఈ రాజు ఇంట్లో ఉన్నాం. ఇపుడు అతనికి ఏదయినా శుభం ఆలోచించు.' రాజా! అపుడు నేను శుభదృష్టికల పర్వతునితో ఇలా అన్నాను. "అల్లుడా! ఇది అంతా నీకు సముచితంగానే ఉంది. ఈ రాజుకు ఏదయినా వరం ఇద్దాం. ఏది కోరితే అదే ఇద్దాం. నీవు తలచుకొంటే, మన తపస్సుచేత ఆరాజు సిద్ధిపొందును గాక". దానికి సమ్మతించి పర్వతుడు సృంజయ మహారాజుతో ఇలా అన్నాడు. "నరోత్తమా! ఆర్జవంతో నీవు చేసిన సత్కారాలతో మాకు చాలా ప్రీతి కలిగింది. మేము అనుమతిస్తున్నాం. ఏదయినా వరం కోరుకో. దేవతలకు హింసింపరానిది, మానవులవల్ల నశించనిది అయిన వరం కోరుకో - మహారాజా! ఆ వరం మావల్ల పొందు. నీవు మాకు చాలా ఇష్టుడవు."

వెంటనే సృంజయు డన్నాడు. "మీకు నావల్ల ప్రీతి కలిగితే నాకదే చాలు. ఇదే మహాలాభం. నాకు మహాఫలం సిద్ధించినట్లే." ఇలా అంటున్న సృంజయునితో మళ్లీ పర్వతుడు ఇలా అన్నాడు. 'రాజా నీ చిరకాలవాంఛ ఏదయినా నీమనసులో ఉన్నది కోరుకో' అన్నాడు. అపుడు సృంజయుడు ఇలా అన్నాడు. "వీరుడు, బలవంతుడు, దృఢవ్రతుడు, పూర్ణాయుర్దాయం కలవాడు, పుణ్యాత్ముడు, ఇంద్రసమానమయిన తేజస్సు కలవాడు అయిన పుత్రుని కోరుతున్నాను." వెంటనే పర్వతుడు ఇలా అన్నాడు. "నీకోరిక తీరుతుంది. కాని ఆయుష్మంతుడు కాడు. దేవేంద్రుని పరాభవించాలని కదా నీసంకల్పం. సువర్ణష్ఠీవి అని ప్రసిద్ధికెక్కే కొడుకు నీకు కలుగుతాడు. ఇంద్ర సమానకాంతికల ఆ కుమారుని దేవేంద్రుని నుండి రక్షించుకోవాలి." మహాత్ముడయిన పర్వతుని మాట విని "ఇది ఏవిధంగానయినా కాకుండా అనుగ్రహించండి" అని ఇలా బ్రతిమాలాడు. "మునీ! నీ తపశ్శక్తితో నాపుత్రుడు ఆయుష్మంతుడు కావాలి" అన్నాడు - పర్వతుడు ఇంద్రుని దృష్టిలో పెట్టుకొని ఏమీ మాట్లాడలేదు. అలా దీనుడైన రాజుతో నేను ఇలా అన్నాను - "రాజా! నీవు నన్ను తలుచుకో - నేను నీకుమారుని చూపిస్తాను. యముడు తీసుకొనిపోయిన నీ ప్రియ పుత్రుని ఆ రూపంతోనే మళ్లీ నీకు ఇస్తాను. రాజా! విలపించకు." ఇలా ఆ రాజుతో చెప్పి, యథేచ్ఛగా మేము వెళ్లిపోయాం. కోరిక తీరిన సృంజయుడు తన మందిరంలో ప్రవేశించాడు. కొంతకాలానికి రాజర్షి అయిన సృంజయునికి బలమూ, తేజస్సూ కల కొడుకు పుట్టాడు. అతడు సరస్సులోని పెద్దకలువ లాగా, కాలానుగుణంగా పెరిగాడు. కాంచనష్ఠీవి అయ్యాడు. అతని పేరు సార్థకమయింది. (ఉమ్మివేస్తే బంగారం అయ్యేది)

అది లోకంలో ఆశ్చర్యకర విషయ మయింది. మహర్షి నుండి ఆ విధంగా వరం పొందినట్లు దేవేంద్రునికి తెలిసింది.

తనకు పరాభవం జరుగుతుందనే భయంతో, బృహస్పతి సలహాతో ఆ కుమారునిలో దోషం వెదకుతున్నాడు ఇంద్రుడు. రూపుదాల్చిన దివ్యాస్త్రమయిన వజ్రాన్ని, ఇంద్రుడు "వజ్రమా! పర్వతుడన్నట్లు ఈ సృంజయుని సుతుడు పెరిగితే తన వీర్యంతో నన్ను అవమానపరుస్తాడు. నీవు పులివై ఈ రాజకుమారుని చంపు"మని పంపించాడు. ఇంద్రుడు ఇలా చెపితే శత్రుపురాలను జయించే వజ్రం, అవకాశంకోసం నిరీక్షిస్తూ, రోజూ ఆ కుమారుని వెంట తిరుగుతోంది. సృజంయుడు ఇంద్రునివంటి కాంతికల కొడుకును పొంది, సంతోషంతో, అంతఃపురకాంతలతో సహా నిత్యమూ వనంలోనే ఉంటున్నాడు. ఒకనాడు గంగాతీరంలో నిర్జనవనంలో దాదితో కలిసి తిరుగుతూ, ఆ బాలుడు ఆటకోసం పరుగుపెట్టాడు. అయిదేళ్ల వాడు, ఏనుగు పరాక్రమం కలవాడు అయిన ఆ బాలుడు, తన మీదికి వచ్చిపడుతున్న పెద్దపులిని చూశాడు. వణికిపోయే రాజకుమారుని ఆ పులి పిండిపిండి చేసింది. వెంటనే అతడు ప్రాణాలు విడిచి నేలమీద పడ్డాడు. దాది వెంటనే అరిచింది. రాజకుమారుని చంపి ఆ పులి దేవేంద్రుని మాయవల్ల అక్కడే మాయమైపోయింది.

చాలా దుఃఖంతో ఏడుస్తున్న దాది ఆరుపు విని, మహారాజు స్వయంగా అక్కడకు పరుగెత్తివచ్చాడు. నేలమీద పడి ఉన్న కొడుకును చూశాడు - ప్రాణాలు లేవు - రక్తం పీల్చేసినట్లు కనిపిస్తున్నాడు. నింగి నుండి జారిపడిన కళా విహీనమయిన చంద్రునిలా ఉన్నాడు. రక్తంతో తడిసిన కుమారుని ఒడిలోకి తీసుకొని, ఎంతో బాధతో రాజు పెద్దగా విలపించాడు. తరువాత వాని తల్లులు దుఃఖంతో పెద్ద పెట్టున ఏడుస్తూ, సృంజయుడున్న చోటికి పరువెత్తివచ్చారు. అపుడా రాజు మనసులో నన్ను గుర్తు తెచ్చుకొన్నాడు. అతడు నన్ను తలచుకొంటున్నాడని తెలిసి నేనతని దగ్గరకు వెళ్లాను. రాజా! నీకిప్పుడు కృష్ణుడు చెప్పిన వాక్యాలను దుఃఖితుడైన ఆ రాజుకు వినిపించాను. ఇంద్రుని అనుమతితో అతడు పునర్జీవితు డయ్యాడు. అది అలా జరగవలసి ఉంది. మరొక విధంగా చేయడం ఎవరితరమూ కాదు. ఆపై మహాయశస్వి, వీర్యవంతుడు అయిన కుమారుడు సువర్ణష్ఠీవి తల్లిదండ్రుల మనసుకు సంతోషం కలిగించాడు. తండ్రి స్వర్గతుడయ్యాక సువర్ణష్ఠీవి పదకొండు వందల సంవత్సరాలు రాజ్యం చేశాడు. అతడు భూరి దక్షిణలిచ్చి, చాలా యజ్ఞాలతో దేవతలను, పితృదేవతలను సంతృప్తి పరచాడు. కులం ఉద్ధరించే చాలామంది కొడుకులను పొంది, చాలా కాలం తరువాత అతడు మరణించాడు. రాజేంద్రా! నీకు

కలిగిన శోకాన్ని కేశవుడు, వ్యాసమహర్షి చెప్పినట్లు తొలగించుకో. తండ్రి తాతల నుండి వచ్చిన రాజ్యం పొంది భరించు. పుణ్యప్రదాలయిన మహాయజ్ఞాలు చేసి ఇష్టమయిన లోకం పొందుతావు."

32. వ్యాసుడు ధర్మరాజుకు ప్రాయశ్చిత్తములు తెలుపుట.

వైశంపాయనుడు ఇలా చెపుతున్నాడు. "మాట్లాడకుండా తనలో తాను దుఃఖిస్తున్న ధర్మరాజుతో తపస్వియై, ధర్మతత్వం తెలిసిన వ్యాసమహర్షి ఇలా అన్నాడు. **"ధర్మజా! ప్రజలను రక్షించటమే రాజులకు ధర్మం. పదార్థయుతంగా ప్రవర్తించే లోకానికి ధర్మమే ప్రమాణం.** అందుచేత తండ్రి తాతల ద్వారా వచ్చిన ధర్మాన్ని ఆచరించు. బ్రాహ్మణులయందు తపస్సే ధర్మం. అది వేదం నిశ్చయించిన నిత్య ధర్మం. అది బ్రాహ్మణులకు శాశ్వతమైన ప్రమాణం. ఆ ధర్మమంతటికీ సంపూర్ణ రక్షకుడు క్షత్రియుడు. విషయాసక్తితో స్వయంగా శాసనాన్ని నాశనం చేసేవాడు, లోకయాత్రను నాశనం చేస్తాడు. వాని భుజాలు కట్టి పడవెయ్యాలి. ఎవడయినా మోహవశుడై ప్రమాణధర్మాన్ని అప్రమాణంగా చేస్తే, వాడు సేవకుడయినా, పుత్రుడయినా, తపస్వి అయినా సరే అటువంటి పాపాత్ములను అన్ని ఉపాయాలతోను అదుపు చెయ్యాలి. లేదా చంపివెయ్యాలి. అలా చేయకుండా రాజు మరొక విధంగా చేస్తే ఆ పాపం రాజును పొందుతుంది. ధర్మం నశిస్తున్నపుడు రక్షింపని రాజు ధర్మహంతకుడే అవుతాడు. అలా ధర్మాన్ని చంపిన పాపాత్ములను సేవకులతో సహా చంపివేశావు. ఇపుడు స్వధర్మంతో ప్రవర్తిస్తూ నీవు ఇంకా దుఃఖిస్తా వెందుకు? రాజు ధర్మద్రోహులను శిక్షించాలి. పాత్రులకు దానం చెయ్యాలి. ప్రజలను రక్షించాలి." అపుడు ధర్మరాజు ఇలా అడిగాడు. "తపోధనా! అన్ని ధర్మాలు తెలిసిన వారిలో నీవు ఉత్తముడవు. నీవు చెప్పే మాటను నేను శంకించడం లేదు. నీకు ధర్మస్వరూపం ప్రత్యక్షంగా కనిపిస్తుంది కదా! రాజ్యం కోసం నేను చంపతగని వారిని చాలా మందిని చంపివేశాను. ఆ పనులు నన్ను కాల్చివేస్తున్నాయి. శరీరాన్ని ఉడకబెడుతున్నాయి."

అపుడు వ్యాసుడు ఇలా అన్నాడు. **"ఏదయినా ఒకపని జరిగినపుడు కర్త 1) ఈశ్వరుడు అవుతాడా ? 2) లేదా చేసిన మానవుడు అవుతాడా? 3) లేదా హత స్వభావమా 4) లేదా పూర్వం చేసిన కర్మకు ఫలమా - ఈ నాల్గింటిలో కర్త ఏది ?** మంచో చెడో, మానవుడు ఈశ్వరుని నియోగం చేత (ఆజ్ఞ/ ప్రేరణ) చేస్తున్నాడని అంటే అపుడు దానిఫలం ఈశ్వరునికే చెందాలి. ఎలా అంటే... మానవుడు

అడవిలో చెట్టును గొడ్డలితో నరుకుతున్నాడు. అపుడు ఆ పాపం నరికేవాడిదే కాని గొడ్డలిది ఎన్నటికీ కాదు. అలా కాకుండా అతడు గ్రహించటం వలన కర్మఫలం తనంతట అదే పొందుతుందంటే దండం, శస్త్రం చేసిన పాపం మానవునిలో కనపడదు. కొంతేయా! ఒకడు చేసినదాని ఫలం ఇంకొకడు పొందటం నీకిష్టం కాకపోతే ఈశ్వరుని మీదనే దాన్ని పెట్టు. అలాకాక 'పుణ్యకర్మలకు పాపకర్మలకు మానవుడే కర్త - ఇతరులెవరూ లేరు' అంటే దానివల్ల కూడ నీవు చేసినది పుణ్యకర్మయే అవుతుంది. **రాజా! ఎవడూ, ఎన్నడూ అదృష్టాన్ని కాదనలేడు. అందుచేత దండమూ, శస్త్రమూ చేసిన పాపం మానవునిలో ఉండదు.** రాజా! ఒకవేళ చంపబడిన వానినే చంపే పనిని కర్మగా భావిస్తే, అప్పుడు కూడా అశుభమయిన కర్మ పూర్వంలో ఉన్నది కాదు. తరువాత ఉండేది కాదు. ఇక పుణ్యపాపాల ఉపపత్తిని నిర్ణయించాలి. లోకంలో దుష్టులను దండించటం అనేది ధర్మంగా శాస్త్రం అంగీకరించిన విషయం. అయినా లోకంలో (శాసించే రాజుకు) శుభాశుభ కర్మలు వచ్చిపడుతున్నాయి. అందుచేత రాజులు శుభఫలాలను, అశుభఫలాలను పొందుతూనే ఉంటారు అని నా అభిప్రాయం" అంటే... అలా అయినా కర్మ వలన ఫలరూప మయిన అశుభకర్మ ఏర్పడుతుంది అనుకో. ఆ కర్మను నీవు విడిచిపెట్టు. శోకించకు. అపవాదంతోకూడినదైనా, నీధర్మంలో నీవు ప్రవర్తిస్తున్నావు. అట్టి నీకు ఆత్మత్యాగం సముచితం కాదు. ఆయా కర్మలకు ప్రాయశ్చిత్తాలు విధించారు. మానవుడు వాటిని ఆచరించాలి. అంతేకాని శరీరం విడిచిపెట్టడం కర్తవ్యం కాదు. రాజా! అందుచేత, జీవించి ఉన్నావు కనుక ప్రాయశ్చిత్తం చేసుకొంటావు. ప్రాయశ్చిత్తం చేసుకోకపోతే చనిపోయాక పరితపిస్తావు."

33. వ్యాసుడు ధర్మజుని (ప్రాయశ్చిత్తరూపముగా) అశ్వమేధము చేయుటకు ప్రోత్సహించుట.

యుధిష్ఠిరుడు ఇలా అన్నాడు. "పితామహా! పుత్రులు, మనుమలు, సోదరులు, పితరులు, మామలు, గురువులు, మేనమామలు, తాతలు, మహాత్ములయిన రాజులు చుట్టాలు, స్నేహితులు, మేనల్లుళ్లు, జ్ఞాతులు - అందరూ చనిపోయారు. నానాదేశాల నుండి వచ్చిన చాలామంది రాజులను రాజ్యలోభంతో చంపాను. తపోధనా! నిత్యమూ ధార్మిక ప్రవర్తనతో, చాలాసార్లు సోమపానం చేసిన వీరులయిన రాజులను చంపి నేను పొందినది ఏమిటి ? పితామహా! అది తలచుకొంటేనే రాత్రింబవళ్లు నా ఒళ్లు దహించుకొని పోతోంది. రాజసింహులూ, శ్రీమంతులూ అయినా వారందరూ లేని ఈ భూమిని చూసి,

ఘోరమయిన జ్ఞాతివధను చూసి, వందల మీద కోట్లకొద్దీ చనిపోయిన ప్రజలను గురించి పరితపించిపోతున్నాను. పుత్రులు, భర్తలు, సోదరులను పోగొట్టుకొన్న ఆ ఉత్తమ స్త్రీల అవస్థ ఎలా ఉంటుందో కదా! అందరినీ చంపిన మమ్మల్నీ, వృష్ణివంశస్థులనూ తిట్టి పోస్తూ కృశించి, దీన లయిన ఆడవారందరూ నేలమీద కూలుతారు. తండ్రులను, సోదరులను, భర్తలను, కొడుకులను కానక ఆ స్త్రీలు అందరూ చనిపోతారు. విప్రోత్తమా! వారి మీది వాత్సల్యంతో చెపుతున్నాను. ఇందులో సందేహం నాకు లేదు. ధర్మసూక్ష్మతవల్ల మేము స్పష్టంగా 'స్త్రీ వధ' మహాపాపం పొందుతాం. స్నేహితులను చంపి, అంతులేని పాపం చేశాం. మేము తలక్రిందులుగా నరకంలో పడతాం. పితామహా! ఘోర తపస్సు చేసి శరీరాలు విడిచిపెడతాం. అందుచేత ఆశ్రమాలలోని విశేషాన్ని మాకు చెప్పండి." వైశంపాయనుడు చెపుతున్నాడు. "యుధిష్ఠిరుని మాట విని, వ్యాసమహర్షి నేర్పుగా బుద్ధితో పరికించి ధర్మరాజుతో ఇలా అన్నాడు. "రాజా! క్షత్రియ ధర్మాన్ని స్మరిస్తూ విషాదం పొందకు. ఈ క్షత్రియులందరూ స్వధర్మంచేతనే మరణించారు. సంపూర్ణసంపదను, భూమి మీద గొప్ప కీర్తిని కోరుతూ, యముని విధితో కూడి, కాలం వలన చనిపోయారు. చంపినవాడవు నీవు కాదు. భీముడు కాడు. అర్జునుడు కాడు. నకుల సహదేవులు కారు. కాలం, మరణ ధర్మంతో ప్రాణుల ప్రాణాలు గ్రహించింది. అతనికి తల్లిదండ్రులు లేరు. అనుగ్రహింపదగిన వాడు ఎవడూ లేడు. ప్రజలందరి కర్మలకు సాక్షీభూతు డయిన అతడే, వారినందరినీ తీసికొని పోయాడు. ఈ యుద్ధం అతనికి ఒక నిమిత్తం మాత్రమే. భూతాలతో భూతాలను ఆయన చంపుతూ ఉంటాడు. అది అతని ఈశ్వరీయమైన రూపం. నియంత లక్షణం.

జీవుని పుణ్యపాపకర్మల సాక్షి కాలం. కాలమే సుఖం, దుఃఖం అనే గుణాలకు ఫలం అయి కూడా కాలానుసారంగా కర్మల ఫలితం ఇస్తుంది. ఆ రాజుల కర్మలను కూడ నీవు ఆలోచించు. అన్నీ వినాశకారణాలే. వాని వల్లనే వారు నశించిపోయారు. 'ఇటువంటి (క్రూర) కర్మ విధికి వశమై చేశాను' అని నీవు అంటే, ఆత్మయొక్క నియతమైన వ్రతశాసనం ఎలా ఉంటుందో తెలుసుకో! (అంతా కాల మహిమ అని భావం) వడ్రంగి చేసిన యంత్రం, త్రిప్పేవాడి వశంలో ఉన్నట్లే కాలుడు ఏర్పరచిన కర్మంతోనే జగమంతా ప్రవర్తిస్తుంది. ఏ కారణమూ లేకుండానే మానవుని ఉత్పత్తి జరుగుతోంది. అలాగే యాదృచ్ఛికంగా వినాశం కూడా జరుగుతోంది. వీటికోసం శోకం, హర్షం పొందటం వ్యర్థం. నీకిపుడు కలిగిన చిత్తవికారం కూడ అసత్యమే / వట్టిదే. అయినా అది పోవాలంటే దానికి ప్రాయశ్చిత్తం ఉంది. దాన్ని ఆచరించు.

ధర్మజా! పూర్వం దేవాసుర యుద్ధంలో ఈ విషయం వినవచ్చింది. రాక్షసులు అన్నలు, దేవతలు తమ్ములు. వారికి కూడా సంపద నిమిత్తంగానే పెద్ద విరోధం ఏర్పడింది. ముప్పది రెండువేల సంవత్సరాలు యుద్ధం జరిగిందట. భూమినంతటినీ రక్తంతో తేలేటట్లుగా ఒకే సముద్రంగా చేసి, దేవతలు రాక్షసులను చంపివేసి, స్వర్గం సంపాదించారు. అలాగే భూమిని పొంది, వేదపారంగతులైన బ్రాహ్మణులు గర్వంతో మోహితులై, దానవులకు సాయం చేయడానికి పూనుకొన్నారు. వారు ఎనభై ఎనిమిది వేల మంది ఉన్నారు. శాలావృకులని మూడులోకాలలోను ప్రసిద్ధి వహించారు. వారు కూడా దేవతల చేత చనిపోయారు. **ధర్మనాశం కోరుతూ అధర్మం ప్రవర్తింపజేసే దురాత్ములను, పొగరెక్కిన దైత్యులను దేవతలు చంపినట్లు చంపాలి. కులంలో ఒకనిని చంపడం మిగిలిన వారికి సుఖకర మయితే అది ధర్మనాశకం కాదు. అలాగే ఒక కులాన్ని చంపితే మిగిలిన వారందరికీ సుఖకర మయితే అది ధర్మాన్ని చంపినట్లు కాదు.** రాజా! అధర్మం లాగా కనపడే ధర్మం ఒకటి ఉంది. అలాగే ధర్మంవలె కనపడే అధర్మం ఉంది. పండితుడు దాన్ని తెలుసుకోవాలి. అందుచేత మనసును నిలద్రొక్కుకో. చక్కగా చదువుకొన్నావు కదా! పూర్వం దేవతలు నడచిన మార్గంలో నడచిన వాడవు. ఇటువంటివారు నరకానికి వెళ్లరు. పాండవోత్తమా! నీ తమ్ములను, స్నేహితులను ఊరడించు. **పాపకృత్యం మొదలుపెట్టి, అదే భావం భావిస్తూ, సిగ్గులేకుండా ఆ పాపకృత్యం కొనసాగిస్తూ, పూర్తిచేసిన వానికి ఆపాపం అంతా చేరుతుందని శాస్త్రం చెపుతోంది. వానికి ప్రాయశ్చిత్తం లేదు. ఆ పాపకృత్యానికి తగ్గుదల లేదు.** నీవు స్వచ్ఛమయిన మనసు కలవాడవు. ఇతరుల దోషం నీ చేత ఈ పనిని చేయించింది. ఇష్టం లేకుండానే ఈ పనిచేసి ఇపుడు బాధపడుతున్నావు. దీనికి అశ్వమేధయాగం చెయ్యడమే ప్రాయశ్చిత్తంగా చెప్పబడింది. దాన్ని చెయ్యి, పాపరహితుడ వవుతావు. ఇంద్రుడు దేవతలతో కలిసి శత్రువులను జయించాడు. పట్టుకొకటిగా నూరుసార్లు యజ్ఞాలు చేసి శతక్రతుడు అయ్యాడు. పాపం తొలగి, స్వర్గం పొంది, సుఖకరమయిన లోకాలను పొంది, దేవగణాలతో కలిసి దిక్కులన్నీ ప్రకాశింపజేస్తూ ఉన్నాడు. స్వర్గలోకంలో అప్సరసలతో వెలుగొందే దేవేంద్రుని ఋషులూ, దేవతలూ సేవిస్తున్నారు. ఆ భూమి నీకు పరాక్రమం వల్ల వచ్చింది. రాజులందరు నీ విక్రమం చేత ఓడిపోయారు. స్నేహితులతో కలిసి నీవు ఆ పురాలకు, రాష్ట్రాలకు వెళ్లి, చనిపోయినవారి సోదరులను గాని, కొడుకులను గాని, మనుమలను గాని వారివారి రాజ్యంలో అభిషేకించు. కడుపులో ఉన్న సంతతిని కూడా తియ్యగా లాలిస్తూ, ప్రజల నందరినీ రంజింపజేస్తూ భూమిని రక్షించు. కొడుకులు లేకపోతే కూతుళ్లను అభిషేకించు. స్త్రీవర్గం కోరిక తీరుతుంది.

ఇలా నీశోకం తీరుతుంది. రాష్ట్రాలన్నిటా ఇలా ఓదార్చి, పూర్వం విజయుడైన ఇంద్రునివలె అశ్వమేధ యాగం చెయ్యి. నీవు మహాత్ములయిన క్షత్రియులను గూర్చి విచారించవలసిన పనిలేదు. వారందరు యముని బలం చేత మోహితులై, తాము చేసుకొన్న కర్మల చేత నశించిపోయారు. రాజా! నీకు క్షత్రియ ధర్మం లభించింది. శత్రురహితమైన రాజ్యం లభించింది. చనిపోయిన తరువాత కూడ శ్రేయస్కర మయిన ధర్మాన్ని రక్షించు."

34. మానవుని కర్తవ్యాకర్తవ్యములు.

యుధిష్ఠిరుడు ఇలా అడిగాడు. "పితామహా! ఏ పనులు చేస్తే నరుడు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి? ఏ పని చేసి ఆ పాపం నుండి విముక్తిపొందుతాడు? అవి నాకు చెప్పండి." వ్యాసుడు ఇలా చెప్పాడు. "చేయవలసిన పనులను చేయకపోయినా, నిషేధించిన పనులను చేసినా, కపటంగా ప్రవర్తించినా నరుడు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. బ్రహ్మచారి అయి ఉండి సూర్యోదయ సమయంలోను, అస్తమయసమయంలోను నిద్రించేవాడు, పుచ్చిన గోళ్లు, పిప్పిపళ్లు ఉన్నవాడు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. ముందుపెళ్లి అయిన తమ్ముడికి అన్న; అన్నకు పెళ్లికాకుండా పెళ్లి చేసుకొన్న తమ్ముడు; బ్రహ్మహత్య చేసినవాడు; నిందించేవాడు; చెల్లెలికి పెండ్లి అయిన తరువాత ఆమె అక్కను పెళ్లి చేసుకొన్నవాడు; పెళ్లికాని దాని చెల్లిలిని పెళ్లి చేసుకొన్నవాడు; వ్రతభంగం అయినవాడు, ద్విజులను వధించేవాడు; అర్హునికి దానం చేయనివాడు; జనసమూహాన్ని చంపేవాడు; మాంసాన్ని అమ్మేవాడు; అగ్నిహోత్రుని పూజింపని వాడు; జీతం పుచ్చుకొని వేదం బోధించేవాడు; స్త్రీలను శూద్రులను వధించేవాడు; నిందింపతగిన పనులు చేసేవారిలో మొదటివాడు; పశువులను చంపేవాడు; ఇళ్లకు నిప్పు పెట్టేవాడు; అబద్దాలు చెప్పి బ్రతికేవాడు; గురువులను అడ్డుకొనేవాడు; సదాచారాన్ని ఉల్లఘించేవాడు - వీరంతా ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. ఇవి అన్నీ పాపాలే. ఇక చేయరాని పనులను చెపుతాను. విను. అవి లోకానికి, వేదానికి విరుద్దాలు. ఏకాగ్రచిత్తంతో విను. తన ధర్మాన్ని వదలిపెట్టడం; ఇతరుల ధర్మాన్ని ఆచరించడం; యజ్ఞం చేయించదగని వాడిచేత యజ్ఞం చేయించడం; తినకూడని దానిని తినడం, శరణుచొచ్చిన వారిని విడిచిపెట్టడం; పోషింపవలసిన వారిని పోషించకపోవడం; (ఉప్పు బెల్లం మొ॥) రసద్రవ్యాలను అమ్మడం; పశువక్ష్యాదులను చంపడం; శక్తిమంతుడై ఉండి అగ్ని ఆధానం మొ॥ కృత్యాలు చేయకపోవడం; ప్రతిదినమూ ఇవ్వవలసిన వానిని పశుగ్రాసాదులు ఇవ్వకపోవడం; దక్షిణలు ఇవ్వకపోవడం; బ్రాహ్మణుల సొమ్మును అపహరించడం;...

ఈ పనులన్నీ చేయదగనివని ధర్మవేత్తలు అంటారు. తండ్రితో వివాదం పెట్టుకొనే పుత్రుడు; గురుపత్నిని పొందినవాడు; ఋతుకాలంలో భార్యతో సంతానాన్ని పొందనివాడు; అధార్మికు లనబడతారు. వీటిలో కొన్నిటిని విస్తారంగా, కొన్నింటిని సంక్షేపంగా చెప్పాను. చేయరాని వాటిని చేస్తూ, చేయవలసిన వాటిని చేయకుండా ఉండే నరుడు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి.

ఇపుడు కొన్ని కర్మములు చెపుతాను. అవి ఆయా సందర్భాల్లో చేసినా మానవులు పాపం పొందరు – వాటిని విను. యుద్ధంలో ఆయుధం తీసుకొని చంపటానికి వస్తున్నవాడు వేదాంతపారంగతుడైన విప్రు డయినా సరే వానిని చంపవచ్చును. దానివల్ల బ్రహ్మహత్యాదోషం రాదు. వేదాలలో దీన్ని గురించి ఒక మంత్రం కూడ చదువుతారు. వేదప్రమాణంతో చెప్పబడిన ధర్మం నీకు చెపుతున్నాను. తన ధర్మం విడచి, ఘోరకృత్యాలు చేసే బ్రాహ్మణుని చంపినవాడు, బ్రహ్మహత్య చేసినట్లు కాదు. ఆ క్రోధం శత్రువుక్రోధంలో చేరుతుంది. ప్రాణం పోయేసమయంలోను, అది మద్యం అని తెలియక, ధర్మపరులచేత ఆదేశింపబడి మద్యం సేవించితే, మళ్లీ ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. ధర్మరాజా! అంతా నీకు చెప్పాను. తినరాని దానిని తినటం అనేది ఈ ప్రాయశ్చిత్త విధానంతో శుద్ధి పొందుతుంది. గురువుగారి ఆజ్ఞతో గురువుకోసం గురుభార్యను పొందటం మానవుని చెడగొట్టదు. ఉద్దాలకుడు శిష్యుని వలన శ్వేతకేతుని పొందాడు. ఆపదలలో గురువుకోసం దొంగతనం చేయటం నిషిద్ధం కాదు. కాని అటువంటి సమయాల్లో తన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తింపరాదు. అపుడు బ్రాహ్మణుల సొమ్ము విడిచి ఇతరుల సొమ్ము తీసికొని, అందులో తానేమీ తీసుకోకపోతే పాపం అంటదు. తన ప్రాణం కాని, ఇతరుల ప్రాణం కాని రక్షించడంలోను, గురువుల విషయంలోను, స్త్రీల విషయంలోను, వివాహకార్యాలలోను అబద్ధం చెప్పవచ్చును. కలలో రేతఃస్ఖలనం అయితే మళ్లీ ఉపనయనం చేసుకోనవసరం లేదు. జ్వలించే అగ్నిలో నేతితో హోమం చేసుకోవడమే దీనికి ప్రాయశ్చిత్తంగా విధింపబడింది. అన్న పతితు డయినా, సన్యసించినా తమ్ముడు పెళ్లి చేసుకోవడం (అన్నకంటె ముందు) దోషం కాదు. ధర్మదృష్టితో పరవనిత తన్నుకోరినపుడు మాత్రం పొందటం అధర్మం కాదు. వృథాగా పశువులను చంపటం కాని, చంపించడం కాని చేయకూడదు. పశువులను అనుగ్రహించడమే సంస్కారం అని శాస్త్రం ప్రేరణ చేస్తోంది. తెలియక అయోగ్యుడయిన విప్రునకు దానం చెయ్యడం, అలాగే తెలియక తీర్థంలో యోగ్యునికి సత్కారం చేయకపోవడం దోషం కాదు. వ్యభిచారం చేసిన భార్యను విడవటం తప్పుకాదు. పైగా దానివలన ఆమె పరిశుద్ధురాలు అవుతుంది. భర్తకు దోషం అంటదు.

తత్వం తెలిసి పోమాన్ని అమ్మటం దోషం కాదు. అసమర్థుడయిన సేవకుని వదలివేయటం దోషం కాదు. గోవులకోసం అడవిని కాల్చినా దోషం కాదు. దోషం కలగని పనులేవో చెప్పాను. ధర్మజా! ఇక విస్తరించి ప్రాయశ్చిత్తాలు చెపుతాను."

35. పాపములకు ప్రాయశ్చిత్తములను చెప్పుట.

వ్యాసుడు చెపుతున్నాడు. "తపస్సు చేతను, కర్మ చేతను, దానం చేతను మళ్లీ ఆ పాపాలు చేయకపోతే మానవుడు ఆ పాపాలు శుద్ధి చేసుకొంటాడు. బ్రహ్మహత్య చేసినవాడు ఒంటిపూట భోజనం చెయ్యాలి. తన పనులు తానే చేసుకొంటూ భిక్షమెత్తుకోవాలి. కపాలం, మంచం కోడు పట్టుకొని, బ్రహ్మచారియై, సదాప్రయత్నపరుడై ప్రవర్తించాలి. అసూయ లేకుండా నేలమీద నిద్రించాలి. అలా తన పాపాన్ని లోకానికి తెలియజేస్తూ, పూర్తిగా పన్నెండేండ్లు గడిపితే, వాడు బ్రహ్మహత్యా పాతకం నుండి విముక్తి పొందుతాడు. బ్రహ్మహత్య చేసినవాడు ప్రాయశ్చిత్తం తెలిసిన విద్వాంసుల ఉపదేశాన్ని బట్టి కాని, తన యిష్టంతోకాని, ఆయుధందాల్చిన వారి ఎదుట నిలిచి దెబ్బలు తినాలి లేదా మండే అగ్నిలో పడాలి. లేదా - వేదం పఠిస్తూ తలవంచుకొని మూడుసార్లు వందయోజనాలు తిరిగి రావాలి. లేదా తనకున్న సంపదనంతటిని వేదవేత్త అయిన బ్రాహ్మణునకు ఇవ్వాలి. ఒక జీవితానికి సరిపడిన ధనం కాని, అన్నవస్త్రాలతో ఇంటిని కాని దానం చెయ్యాలి. గో, బ్రాహ్మణులను రక్షించాలి. అటువంటివాడు బ్రహ్మహత్యనుండి విముక్తి పొందుతాడు. ఆరేళ్లు కృచ్ఛ్రవ్రతం చేస్తే, బ్రహ్మహత్య చేసినవాడు పవిత్రుడవుతాడు. నెలకొకసారి భోజనం చేస్తూ మూడేళ్లు గడిపితే విముక్తి పొందుతాడు. *మాసాశి విధానంతో ఒక సంవత్సరంలో పవిత్రు డవుతాడు. ఉపవాస విధానంతో ఇంకా తక్కువ కాలంలోనే పవిత్రు డవుతాడు. అశ్వమేధయాగం చేతకూడా నిస్సంశయంగా పవిత్రు డవుతాడు. ఇటువంటివారు అవభృథస్నానం చేసి, పాపం పోగొట్టుకొంటారని శ్రుతి. బ్రాహ్మణుని కోసం యుద్ధంలో చనిపోయినవాడు కూడ బ్రహ్మహత్యాపాతకం నుండి విముక్తు డవుతాడు. అర్హులయినవారికి నూరువేల గోవులను దానం చేసిన బ్రహ్మహంత, సర్వపాపాల నుండీ కూడా విముక్తి పొందుతాడు. పాలిచ్చే ఇరవై అయిదు వేల కపిల గోవులను దానం

---

* కృచ్ఛ్రభోజి = మూడు రోజులు ప్రొద్దుట తినుట, మూడు దినములు సాయంకాలం తినుట, మూడు రోజులు అప్రయత్నంగా దొరికినది మాత్రమే తినుట, తరువాత మూడు రోజులు తినకుండుట ఇలా ఆరేళ్లు తినడం.

మాసాశి = ఒకనెల ప్రొద్దుట, ఒకనెల సాయంకాలం, ఒకనెల అయాచిత భోజనం, ఒక నెల ఉపవాసం - ఇలా సంవత్సరకాలం గడపాలి.

చేసినవాడు అన్ని పాపాల నుండి విముక్తుడవుతాడు. ప్రాణం పోతుందనుకొనే సమయంలో, సజ్జనులకు, దరిద్రులకు దూడలతో కూడిన వెయ్యి పాడి అవులను దానం చేస్తే పాపవిముక్తి కలుగుతుంది. నియమపరులయిన బ్రాహ్మణులకు నూరు కాంబోజ దేశపు గుర్రాలను దానమిస్తే వాడు పాపవిముక్తు డవుతాడు. ఒక్కనికయినా కోరిక తీర్చేవాడు పాప విముక్తి పొందుతాడు. ఆ ఇచ్చిన దాన్ని గురించి చెప్పుకోరాదు.

ఒక్కసారి మద్యం త్రాగినవాడు అగ్ని వర్ణం కల మద్యం త్రాగి ఇహపరాలు రెండిటా తన్ను పవిత్రం చేసుకొంటాడు. కొండకొన నుండి నీరులేని చోటికి దూకినా, నిప్పులలో ప్రవేశించినా, మహాప్రస్థానం చేసినా సర్వపాపాలూ పోతాయి. మద్యం త్రాగిన బ్రాహ్మణుడు బృహస్పతిసవనం చేసి, మళ్లీ బ్రాహ్మణుడుగా బ్రహ్మసభకు వెళ్లవచ్చునని శ్రుతి చెపుతోంది. **మద్యం త్రాగినవాడు మాత్సర్యం లేకుండా భూదానం చేసి, మళ్లీ మద్యం త్రాగకుండా ఉంటే సంస్కారవంతుడే - అతడు పవిత్రుడే. గురుతల్పం ఎక్కినవాడు కాలుతున్న రాతి మీద పడుకోవాలి. లింగం కోసివేసుకొని ఆకాశం చూస్తూ సన్యసించి, శరీరం విడిస్తే ఆ పాపఫలం నుండి విముక్తుడవుతాడు.** స్త్రీలయితే ఒక్క సంవత్సరం నియమంతో ఉంటే ఆ పాపం పోతుంది. *మహావ్రతం చేసినా, తనకున్నదంతా దానం చేసినా, గురువుకోసం యుద్ధంలో మరణించినా మానవుడు పాపవిముక్తి పొందుతాడు. అబద్ధాలతో బ్రతికేవాడు, గురువును అడ్డగించేవాడు. ఆ గురువుకు ప్రియమైన దిచ్చి ఆ పాపం నుండి ముక్తు డవుతాడు. **అపకీర్ణ పాపం పోవటానికి బ్రహ్మహత్యా ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. గోవు చర్మం వస్త్రంగా చేసుకొని ఆరునెలలు ఆ ప్రాయశ్చిత్తం చేసుకుంటే పాప విముక్తి కలుగుతుంది. **ఇతరుని భార్యను అపహరించినవాడు, ఇతరుల ధనం దొంగిలించిన వాడు సంవత్సరం వ్రతం చేసి పాపం నుండి విముక్తి పొందుతాడు. ఎవరిదైనా ధనం అపహరిస్తే, వారికి మళ్లీ అంతధనం ఇవ్వాలి. చాలా ఉపాయాలతో ఆ పాపానికి పరిహారం చేసుకొని విముక్తి పొందాలి.** పన్నెండు రాత్రుల కృచ్ఛ్రవ్రతంతో మనసు నిగ్రహించుకొని ఉంటే పరివేత్త కాని, పరివిత్తి కాని పవిత్రు డవుతాడు. పితృదేవతల నుద్ధరించాలంటే ఆ తమ్ముడు మళ్లీ వివాహం చేసుకోవాలి. ఆ స్త్రీ వల్ల అతనికి దోషం లేదు. ఆమెకూ దోషం లేదు. చాతుర్మాస్యంలో ఒక రోజు విడిచి ఒకరోజు భోజనం చేస్తే, స్త్రీలు శుద్ధి పొందుతారని ధర్మవేత్త లంటారు. వివేకం కలవాడు శంకిత స్త్రీలను పొందరాదు. బూడిద

---

* *వి॥సం॥ మహావ్రతము = ఒక నెల నీరు కూడ త్రాగకుండ ఉండే వ్రతం. (నీల)*

** *అపకీర్ణి = బ్రహ్మచర్యంలో స్త్రీతో సంగమించినవాడు.*

పాత్రను శుద్ధిచేసినట్లు రజస్సు వారిని శుద్ధి చేస్తుంది.

శూద్రుని ఎంగిలి తగిలిన పాత్రను, గోవు వాసన చూసిన పాత్రను, పుక్కిలించిన నీళ్లు పడిన పాత్రను *పది శుద్ధి క్రియలతో తోమాలి. బ్రాహ్మణునికి నాలుగు పాదాల ధర్మం విధింపబడింది. ఒక్కొక్క పాదం తగ్గుతూ వరుసగా రాజులకు, వైశ్యులకు, శూద్రులకు విధింపబడింది. ఇలా ప్రాయశ్చిత్తాదులలో హెచ్చు తగ్గులను నిశ్చయించుకోవాలి. పశుపక్ష్యాదులను వధించటం, చెట్టు చేమలను నరకటం చేసినవాడు తన పాపం అందరికీ చెప్పి మూడు రాత్రులు వాయుభక్షణంతో ఉండాలి. పొందరాని స్త్రీలను పొందినవానికి ప్రాయశ్చిత్తం ఇది. తడి బట్టతో ఆరునెలలు బూడిదలో పడుకోవాలి. వేదవిధిని బట్టి, దృష్టాంతపూర్వక మయిన ఆగమహేతువులను బట్టి అన్ని విధాలయిన పాపాలకూ ఇదే ప్రాయశ్చిత్తవిధి. పరిశుద్ధమైన చోట కూర్చుండి, అల్పంగా తింటూ, హింస చేయకుండా, జడునివలె మౌనవ్రతం పాటిస్తూ గాయత్రిని జపించాలి. దానితో పాపవిముక్తి పొందుతాడు. పగటిపూట ఆరుబయట నిలవాలి. రాత్రికూడ ఆరుబయటనే నిద్రించాలి. మూడు పగళ్లు, మూడు రాత్రులు బట్టలు ధరించి నీటిలో ఉండాలి. వ్రతంతో ఉండి స్త్రీతోకాని, శూద్రునితో కాని, పతితునితో కాని మాట్లాడరాదు. తెలియక పాపం చేసిన విప్రుడు ఇట్టివ్రతం చేస్తే పాపవిముక్తి కలుగుతుంది. భూతాల సాక్షిగా ఆయా కర్మలు మితిమీరి చేసేవాడు శుభాశుభఫలాలు పరలోకంలో పొందుతాడు. అశుభమైన పనులు చేసి, మితిమీరినట్లు దానం, తపస్సు, యజ్ఞం మొదలయినవి చేసి శుభఫలాలను వృద్ధి చేసుకోవాలి. శుభకర్మలు చెయ్యాలి. పాపకర్మ నుండి తొలగాలి. నిత్యమూ దానపరుడు కావాలి. అలా పాపవిముక్తి పొందాలి. పాపానికి అనుగుణమైన ప్రాయశ్చిత్తం చెప్పాను. మహాపాతకాలు విడిచి, మిగిలిన వానికే ప్రాయశ్చిత్తం విధింపబడింది. **తినదగినవి, తగనివి, మాట్లాడదగినవి, తగనివి, తెలియకచేసినది, తెలిసి చేసినది అనే వానిలో చేయదగినవానిని చక్కగా తెలిసి చెయ్యాలి. తెలిసినవాడు చేసిన పాపం ఎక్కువది అవుతుంది. తెలియక చేస్తే దోషం తక్కువ అవుతుంది. వానికి ప్రాయశ్చిత్తాలు విధించారు. చెప్పిన పద్ధతిని బట్టి పాపాన్ని తొలగించుకోవచ్చు. ఆస్తికునికి, శ్రద్ధ కలవానికి ఈ విధి ఆచరింపదగినది.** నాస్తికుల పట్ల, శ్రద్ధలేని వారిపట్ల, గర్వద్వేషాలు కలవారిపట్ల ఈ ప్రాయశ్చిత్త విధి వర్తించదు. **ధర్మజా! శిష్టుల ఆచారం, శిష్టధర్మం అనే వానిని ఈ లోకంలోను, పరలోకంలోను సుఖం కోరేవాడు సేవించాలి.** ప్రాణాలకోసమో, ధనం కోసమో, రాజధర్మం చేతనో ఈయుద్ధం జరిగింది. పూర్ణమైన ఆ హేతువు చేత నీవు

* *పదిశుద్ధిక్రియలు = పంచగవ్యం, మట్టి, నీరు, బూడిద, చింతపండు, నిప్పు*

పాపంనుండి ముక్తుడ వవుతావు. నీకే మాత్రమయినా జాలి ఉంటే ప్రాయశ్చిత్తం చేసుకో. అనవసరంగా వచ్చిన శోకంతో మరణించకు. వైశంపాయనుడు చెప్పాడు. "వ్యాసమహర్షి ఇలా చెపితే ధర్మరాజు ఒక్కముహూర్త కాలం ఆలోచించి తపోధనుడైన వ్యాసునితో ఇలా అన్నాడు.'

36. భక్ష్యాభక్ష్య, పాత్రాపాత్ర వివేకము.

"పితామహా! తినదగిన దేది? తినదగని దేది? ఇవ్వదగినవానిలో ఉత్తమమేది? పాత్రమేది ? అపాత్రమేది? నాకు చెప్పు." వ్యాసుడు ఇలా చెప్పాడు. "ఈ విషయంలో ఈ పురాతనమయిన ఇతిహాసం ఉదాహరిస్తారు. ఇది సిద్ధులకు, ప్రజాపతి అయిన మనువునకు జరిగిన సంవాదం. వ్రతనిష్ఠులయిన ఋషులు ఆదికాల ప్రజాపతి అయిన మనువు దగ్గరకు వెళ్లి ధర్మాన్ని గూర్చి ప్రశ్నించారు. 'ప్రజాపతీ! తినదగినది ఏది? పాత్రమేది? దానం, అధ్యయనం, తపస్సు అంటే ఏమిటి? చేయదగినది, తగనిది ఏది? అంతా మాకు చెప్పండి.' వీరు అలా అడగగానే స్వాయంభువ మనువు ఇలా చెప్పాడు. 'ధర్మం ఉన్నదున్నట్లు, విస్తరంగానూ, సంగ్రహంగానూ వినండి. దోషానికి ప్రాయశ్చిత్తం చెప్పని సందర్భాల్లో జపం, హోమం, ఉపవాసం, ఆత్మజ్ఞానం, పుణ్యనదులు, జపహోమాదులపై ఆసక్తి కలవారు పెద్ద సంఖ్యలో కల దేశం మానవుని పవిత్రుని చేస్తుంది. అలాగే పర్వతాలు, సువర్ణం కడుపులోనికి గ్రహించటం, రత్నస్నానం, దేవాలయాలకు వెళ్లటం, నేతిని లోనికి గ్రహించటం, అనే పుణ్యకార్యాలు కూడ మానవుని శీఘ్రంగా పవిత్రుని చేస్తాయి. సందేహం లేదు. ప్రాజ్ఞుడెన్నడూ గర్వపడరాదు. దీర్ఘాయువును కోరేవాడు గర్వపడితే, మూడు రాత్రులు తప్తకృచ్ఛ్రమనే ప్రాయశ్చిత్తం చేసుకొని ఉష్ణపుడు కావాలి. **ఇవ్వనిదానిని తీసుకొనకుండటం, దానం, అధ్యయనం, తపస్సు, అహింస, సత్యం, క్రోధంలేకపోవటం, యజ్ఞము లాచరించటం - ఇది ధర్మలక్షణం.** ఆ ధర్మమే దేశకాలాలను బట్టి అధర్మంగా నిలుస్తుంది. దొంగతనం, అసత్యం, హింస అనేవి అవస్థావిశేషాన్ని బట్టి ధర్మం కూడా అవుతాయి. తెలిసిన వారికి ఈ ధర్మాధర్మాలు రెండు విధాలుగా భాసిస్తాయి. లోకంలోను, వేదంలోను ప్రవృత్తి ఉండటం ఒకటి, లేకపోవడం ఒకటి - ఇలా రెండు విధాలు. ప్రవృత్తిలేకపోవడం వల్ల అమర్త్యత కలుగుతుంది - మర్త్య డవటం అనేది కర్మయొక్క ఫలం. (ప్రవృత్తి యొక్క ఫలం) అశుభకర్మకు పాపం ఫలం. శుభకర్మకు పుణ్యం ఫలం, లోకకర్మలు, వేద కర్మలు రెంటికిని అలా శుభాశుభ ఫలాలు ఏర్పడతాయి. దైవసంబంధం, దైవ సంయుక్తం, ప్రాణసంబంధం, ప్రాణాన్నిచ్చేది అనే నాల్గురకాల కర్మను అపేక్షతో

చేయటం వలన అశుభాలకు శుభఫలం కలుగుతుంది. పరలోకం ఉందా లేదా అనేది సందేహం. కాని ఈలోకంలో ఫలం ప్రత్యక్షంగా కనిపిస్తూనే ఉంది. అట్టి పనిని ఆసక్తితో చేస్తే ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. క్రోధమోహాల వల్ల చేసినదీ, మనస్సుకు ప్రియంకాని, అప్రియంకాని చేసేదీ అయిన కర్మ విషయంలో, శరీరం శుష్కింపజేయటమే ప్రాయశ్చిత్తం. ఆ పాపం ఔషధాల చేత, మంత్రాలచేత, ప్రాయశ్చిత్తాలచేత శమిస్తుంది. **తగిన శిక్ష వేయని రాజు ఒక రాత్రి ఉపవాసం చేయాలి. పురోహితు డయితే ఆత్మశుద్ధి కోసం మూడు రాత్రులు ఉపవాసం చేయాలి.** శోకం పోవటానికి ఆయుధాలతో గాయాలు చేసికొని, ఒకవేళ మరణించకపోతే అతడు మూడు రాత్రులు ఉపవసించాలి.

జాతిధర్మాలను, ఆశ్రమ ధర్మాలను, జన్మస్థల ధర్మాలను, కులధర్మాలను విడిచే వారికి ప్రాయశ్చిత్తమే లేదు. వారి దోషం నశింపదు. ప్రాయశ్చిత్త దోషం ఏర్పడితే, అపుడు ధర్మసందేహం కలిగితే... వేదశాస్త్రజ్ఞులు పదిమంది గాని, ధర్మపాఠకులు ముగ్గురు కాని చెప్పినదే ధర్మం (ప్రాయశ్చిత్తం) అవుతుంది. ఎద్దు, మట్టి, చిన్న చిన్న చీమలు, శ్లేష్మాతకం అనేవి విప్రులు తినరానివి. అది విషమే. బ్రాహ్మణులు చేపలను, జంతువులను, తాబేలును, కప్పలను ఇంకనూ నీటిలో పుట్టినవాటిని తినరాదు. రాబందులు, హంసలు, గ్రద్దలు, చక్రవాకాలు, నీటికాకులు, కొంగలు, కాకులు, మద్గువు (నీటిపక్షి), గృధ్రము, డేగ, గుడ్లగూబ... అనే వానిని బ్రాహ్మణులు తినరాదు. క్రూరమృగాలు, కోరలుండే మృగాలు, నాలుగు కాళ్లుండే జంతువులు, పక్షులు, రెండువైపులా దంతాలుండే జంతువులు, నాలుగు దంతాల జంతువులు వీటిని ఎన్నడూ తినరాదు. మేకలు, గుర్రాలు, గాడిదలు, ఒంటెలు, అపుడే ఈనిన ఆవులు, మానవస్త్రీలు, మృగాలు వీని పాలను బ్రాహ్మణుడు త్రాగరాదు. ప్రేతానికి పెట్టిన అన్నం, పురిటింటి వారి అన్నం, మృతాశౌచం కలవారి అన్నం తినరాదు. ఈని పది రోజులు కూడా దాటని ఆవుల పాలు త్రాగరాదు. రాజుల అన్నం తేజస్సును హరిస్తుంది. శూద్రుని అన్నం బ్రహ్మవర్చస్సును హరిస్తుంది. సువర్ణకారుని అన్నమూ, పతి పుత్రులు లేని స్త్రీ అన్నమూ ఆయువునే హరిస్తాయి.

అధర్మవడ్డీలు తీసుకొనేవాని అన్నం మలమే. వేశ్య అన్నమూ, స్త్రీలతో వచ్చే ఉపపతి అన్నమూ, స్త్రీ సాధించిన అన్నమూ శుక్రమే. అనగా వీర్యాన్ని హరిస్తుంది. దీక్షితుడు, లోభి, యజ్ఞంలోని ద్రవ్యాలను అమ్ముకొనేవాడు, వడ్రంగి, చర్మకారుడు, శీలరహిత అయిన స్త్రీ, చాకలి, వైద్యుడు, గ్రామపాలకుడు... వీరి అన్నం తినరాదు. **గణం నుండి, గ్రామం నుండి వెలివేయబడినవారు; రంగస్థలాన్ని, స్త్రీని ఆశ్రయించి జీవించేవారు; ముందు తమ్ముడికి పెళ్లి అయిన అన్న; బందీ అయినవాడు,**

ద్యూత విద్యలో నేర్పు కలవాడు - వీరి అన్నం తినరాదు. ఎడమచేతితో తెచ్చిన అన్నం, చద్ది అన్నం, మద్యంతో తెచ్చిన అన్నం, ఎంగిలి అన్నం, ఇంట్లో వారికి పెట్టకుండా దాచుకొన్న అన్నం, వీటిని తినరాదు. చాలాకాలం నిలువ ఉంచిన పిండి, చెరకు, కూరలు, పాలు, పేలపిండి, అటుకులు, పెరుగుతో కలిపిన పిండి - వీని పులిసిన పదార్థాలు ఉపయోగింపరాదు. **క్షీరాన్నం, నువ్వులు కలిపిన అన్నం, మాంసం, దైవ నివేదనకు కాకుండా వృథాగా చేసిన అప్పాలు - వీటిని గృహస్థులైన బ్రాహ్మణులు త్రాగరాదు, తినరాదు. గృహస్థు దేవతలను, ఋషులను, మనుష్యులను, పితృదేవతలను, గృహ దేవతలను పూజించి, తరువాత తాను భుజించాలి. గృహస్థు సన్యసించిన వాని వలె తన యింటిలో ఉండాలి. ఇటువంటి ప్రవర్తనతో భార్యతో కలిసి నివసిస్తూ ధర్మం పొందాలి. కీర్తికోసం కాని, భయంవల్లకాని, దానం చేయరాదు. ఉపకారం చేసినవానికి గాని, ఆటపాటలాడే వినోదకారులకు గాని ధార్మికుడు దానం చేయరాదు. మత్తుడు, పిచ్చివాడు, దొంగ, నిందించేవాడు, మాటలు రానివాడు, పాలిపోయినవాడు, అంగవికలుడు, మరుగుజ్జు, దుర్జనుడు, దుష్కులంలో పుట్టినవాడు, వ్రతాలతో సంస్కరింపబడనివాడు, వేదం విడిచినబ్రాహ్మణుడు - వీరికి దానం చేయరాదు.** చక్కని విధితో ధర్మబద్ధంగా చేయనిదానం, ప్రతిగ్రహమూ రెండూ దాతకూ, ప్రతిగ్రహీతకూ అనర్థాన్ని కలిగిస్తాయి. **చంద్రకర్రనో, రాతినో, మునిగిపోయే మరొకనినో పట్టుకొని సముద్రం దాటుతున్న వానివలె ఆ దాత, ప్రతిగ్రహీత కూడా మునిగిపోతారు. తడికట్టెలకు అంటించిన నిప్పు మండనట్లు తపస్సు, వేదాధ్యయనం, శీలం లేని ప్రతిగ్రహీత రాణించడు.** పుర్రెలోని నీరు, కుక్కతోలుతిత్తిలోని పాలు స్థానదోషం చేత చెడినట్లు సత్ప్రవర్తన లేని వానివిద్య కూడా చెడిపోతుంది.

వేదమంత్రాలు రాకపోయినా, వేదమార్గం మండి తప్పుకొన్నా, శాస్త్రజ్ఞానం లేకపోయినా అసూయలేనివానికీ, హీనుడికి, వ్రతాలు చేయనివాడికి దయతో దానం చేయవచ్చును. ఇతరులకు అపకారం చేసేవాడికి దీనుడయినా సరే, దయతో దానం చేయరాదు. ఇతడు ఆప్తు డనుకొని కానీ, అలా ఇవ్వడం ధర్మం అనుకొని కాని ఇవ్వరాదు. వేదం విడిచిపెట్టిన బ్రాహ్మణునికి ఇచ్చిన దానం, అపాత్రదోషంచేత నిష్ఫలమని భావింపబడింది. ఇందు విచారింపవలసిన దేమీలేదు. కొయ్య ఏనుగు, తోలు మృగం, వేదం చదవని బ్రాహ్మణుడు వీళ్లు ముగ్గురూ ఊరకే ఆపేరు ధరిస్తారు. స్త్రీలయందు నిష్ఫలు డయిన నపుంసకుడు, ఆవునందు సంతానఫలం ఇవ్వలేని ఆబోతు, రెక్కలు లేని పక్షి ఎట్టివో నిర్మంత్రు డయిన బ్రాహ్మణుడూ అట్టివాడే. ధాన్యం లేని గ్రామం,

నీరులేని నుయ్యి, అగ్నిలో పడని హోమద్రవ్యం-ఇవి ఎటువంటివో మూర్ఖునికి చేసిన దానం కూడ అటువంటిదే. దేవతల యొక్క, పితృదేవతల యొక్క హవ్య, కవ్యాలు నాశనం చేసేవాడు, శత్రువు, ధనం హరించేవాడు, మూర్ఖుడు ఉత్తమ లోకాలు పొందలేరు. ధర్మజా! ఉన్నది ఉన్నట్లు సంగ్రహంగా నీకు అంతా చెప్పాను. ఇది చాలా గొప్పది, శ్రావ్యమైనది."

37. యుధిష్ఠిరుడు పురప్రవేశము చేయుట.

యుధిష్ఠిరుడు ఇలా అడిగాడు. "మహర్షీ ! రాజ ధర్మాలన్నిటిని, చతుర్వర్ణాల ధర్మాలనుకూడా విస్తారంగా వినాలనుకొంటున్నాను. విప్రోత్తమా ! ఆపదలలో నీతిని ఎలా పాటించాలి ? ధర్మమార్గం దృష్టిలో పెట్టుకొని నేను ఎలా భూమిని జయించగలను ? భక్ష్యాలను అభక్ష్యాలను విడిచినది ఈ ప్రాయశ్చిత్త కథ. కుతూహలంతో కొనసాగే ఈ కథ నాకెంతో సంతోషం కలిగిస్తున్నట్లుంటుంది. ధర్మాచరణం - రాజ్యనిర్వహణ ఈ రెండూ నిత్యమూ విరోధపడుతూ ఉంటాయి. ఈ విషయం నిత్యమూ ఆలోచిస్తూ ఉంటాను కాని నిశ్చయింపలేకపోతున్నాను." అపుడు వైశంపాయనుడు ఇలా చెప్పాడు. "వేదవేత్తలలో ఉత్తముడయిన వ్యాసుడు, సర్వజ్ఞులలో పూర్వుడయిన నారదుని చూసి, అతనితో (ధర్మరాజుతో) ఇలా అన్నాడు. "రాజా ! ధర్మం పూర్తిగా వినాలనుకొంటే వృద్ధుడూ, కురుపితామహుడూ అయిన భీష్ముని దగ్గరకు వెళ్లు. అతడు నీమనసులోని ధర్మసందేహా లన్నిటినీ తీర్చగలడు. అతడు గంగాపుత్రుడు. సర్వజ్ఞుడు. అన్ని ధర్మాలూ తెలిసినవాడు. మూడు మార్గాల్లో/లోకాల్లో ప్రవహించిన దివ్యగంగానది అతనిని కన్నది. ఇంద్రాది దేవతలను అతడు సాక్షాత్తుగా చూశాడు. బృహస్పతి మొదలయిన దేవర్షులను ఎన్నో సార్లు సేవించి, తృప్తిపరచి, రాజనీతిని అధ్యయనం చేశాడు. శుక్రునికి, బృహస్పతికి తెలిసిన శాస్త్రమంతా, వ్యాఖ్యానంతో సహా ఆ కురుశ్రేష్ఠుడు నేర్చాడు. పరశురాముని దగ్గర, చ్యవనుని దగ్గర, వసిష్ఠుని దగ్గర భీష్ముడు శిష్యరికం చేసి, స్నాతకం చేసి, వేదాంగాలతో సహా వేదం అధ్యయనం చేశాడు. బ్రహ్మగారి పెద్దకొడుకు, తేజస్వి, అధ్యాత్మతత్త్వం తెలిసినవాడు అయిన సనత్కుమారుని దగ్గర పూర్వం ఇతడు శిక్షితు డయ్యాడు. ఈ పురుషశ్రేష్ఠుడు మార్కండేయ మహర్షి ముఖం నుండి యతిధర్మ మంతా పొందాడు. పరశురాముని నుండి, ఇంద్రుని నుండి కూడా అస్త్రాలను పొందాడు. మానవుల్లో పుట్టినా, ఇతడికి మృత్యువు తనయిష్టం వచ్చినపుడే కలుగుతుంది. సంతానం లేకపోయినా ఇతనికి పుణ్య లోకాలు కలుగుతాయని వింటున్నాం. పుణ్యాత్ము లయిన బ్రహ్మర్షులు నిత్యమూ

ఇతని సభలో ఉంటారు. జ్ఞానయజ్ఞాల్లో ఇతనికి తెలియనిది కొంచెమయినా లేదు. సూక్ష్మ ధర్మాల అర్థమూ, తత్త్వమూ తెలిసిన ధర్మజ్ఞుడు అతడు. అతడు నీకు చెపుతాడు. ఆ ధర్మవేత్త ప్రాణాలు విడవక ముందే అతనిని చేరుకో." వ్యాసుడు ఇలా చెపితే మంచి తెలివి, బుద్ధికల ధర్మరాజు ఉత్తమవక్త అయిన వ్యాసునితో ఇలా అన్నాడు. ధర్మరాజు అన్నాడు. "ఒళ్లు గగుర్పొడిచేటట్లు జ్ఞాతులను సంహరించాను. లోకానికంతకూ అపరాధం చేశాను. భూమికి నాశన కారకుడ నయ్యాను. కపటం లేకుండా యుద్ధం చేసే ఆ మహానుభావుని (శిఖండి), నెపంతో యుద్ధంలో పడగొట్టాను. ఇపుడాయన దగ్గరకు వెళ్లి ఎలా (ధర్మాలనుగురించి) ప్రశ్నించగలను?" వైశంపాయనుడు ఇలా అన్నాడు. "అపుడు మహాబాహువు, మహాబుద్ధి, అయిన శ్రీకృష్ణుడు చతుర్వర్ణాల వారికి హితం కలిగించాలని ధర్మరాజుతో ఇలా అన్నాడు. "రాజా ! నీవిపుడు శోకింపవలసిన సమయం కాదు. వ్యాసభగవానుడు చెప్పినట్లు చెయ్యి. మహాబాహూ ! బ్రాహ్మణులూ, శక్తిమంతులయిన నీ తమ్ములూ, గ్రీష్మబుతువు దాటిన తరువాత పర్జన్యుని కోరినట్లుగా నిన్ను ప్రార్థిస్తున్నారు. చావగా మిగిలిన రాజులూ, కురుజాంగల మనే నీ రాష్ట్రం నుండి నాలుగువర్ణాల వారూ, అంతా వచ్చి నిన్ను ప్రార్థిస్తున్నారు. మహాత్ములయిన ఈ విప్రుల ప్రీతికోసమూ, అమితతేజస్వి, గురువు, అయిన వ్యాసుని ఆజ్ఞవల్లనూ, నా వంటి స్నేహితులకూ, ద్రౌపదికీ ప్రీతి కలిగించు. లోకానికి హితం చేకూర్చు."

వైశంపాయనుడు ఇలా అన్నాడు. "కృష్ణుడిలా అనగానే కమలనయనుడై ధర్మరాజు, సర్వలోకానికీ హితం కలగాలనే పెద్దమనసుతో లేచాడు. సాక్షాత్తుగా విష్ణువు, వేదవ్యాసుడు, దేవస్థానుడు,అర్జునుడు, ఇంకా చాలమంది నచ్చచెప్పాక, ధర్మరాజు మనో దుఃఖాన్ని, సంతాపాన్ని విడిచిపెట్టాడు. వాక్యాలను విని, మనసున నిలుపుకొని, వినవలసినవన్నీ వినడంలో నేర్పుగల ధర్మరాజు, కర్తవ్యనిశ్చయం చేసుకొని మనసున శాంతించాడు. రాజు వారితో కలిసి, నక్షత్రాల్లో చంద్రుని వలె ప్రకాశిస్తూ, ధృతరాష్ట్రుని ముందుంచుకొని తన నగరం ప్రవేశించాడు. ప్రవేశించాలనే ఊహ రాగానే ధర్మమెరిగిన ధర్మరాజు, దేవతలను, వేలమంది బ్రాహ్మణులనూ ముందు పూజించాడు. తరువాత చంద్రుడు అమృతరథాన్ని ఎక్కినట్లు, నూతనమయిన రథం ఎక్కాడు. ఆ రథం శుభ్రమైన కంబళీలు పరిచిఉంది. శుభలక్షణాలు ఉన్న పదహారు తెల్లని ఎద్దులను పూన్చారు. పుణ్య మంత్రాలతో ఆ రథం పవిత్రం చేశారు. వందిమాగధులు స్తోత్రం చేస్తున్నారు. పురం ప్రవేశించేటప్పుడు భీముడు పగ్గాలు పట్టుకొన్నాడు. ప్రకాశించే వెల్లగొడుగు పట్టాడు అర్జునుడు. రథం శిరోభాగాన పట్టిన వెల్లగొడుగు, నక్షత్రాలతో నిండిన తెల్లని మేఘంవలె ఆకాశాన వెలిగి పోతోంది.

చక్కగా అలంకరించుకొని నకుల సహదేవులు చంద్రకిరణాలవంటి తెల్లని వింజామరలు పట్టారు. చక్కగా అలంకరించుకొన్న అయిదుగురు అన్నదమ్ములూ, రథంమీద పంచభూతాలూ ఒక చోట విలసిల్లినట్లు కనపడ్డారు. మనోవేగం కల గుర్రాలు పూన్చిన తెల్లని రథమెక్కి యుయుత్సుడు ధర్మజుని వెనుకనే అనుసరించాడు. శైబ్య సుగ్రీవాలు పూన్చిన స్వచ్ఛమైన బంగారు రథమెక్కి, కృష్ణుడు సాత్యకితో కురువంశజులను అనుసరించాడు. పెదతండ్రి అయిన ధృతరాష్ట్రుడు గాంధారితో నరయాన మనే రథం ఎక్కి, ధర్మరాజుకు ముందుభాగాన బయలు దేరాడు. కుంతీదేవి, ద్రౌపది మొదలయిన కురువంశస్త్రీలంతా విదురుని ముందుంచుకొని పెద్ద, చిన్న వాహనాల్లో బయలు దేరారు. తరువాత ఏనుగులూ, గుర్రాలూ పూన్చిన రథాలు బయలు దేరాయి. వాటి వెనుక పదాతి దళాలూ, గుర్రాలూ వెంట వెళ్లాయి. ఇలా వైతాళికులూ, సూతులూ, మాగధులూ, మొదలయిన స్తోత్రపాఠకులు స్తోత్రం చేస్తూఉండగా, హస్తిపురంలో ధర్మరాజు ప్రవేశించాడు. ధర్మజుని ఆ ప్రయాణం భూమిమీద సాటిలేని దయింది. ఉరకలు వేసే ఉత్సాహంతో, ప్రజలు ఆనంద సంతోషాలతో ఉప్పొంగి పోయారు. ధర్మరాజు వస్తున్నపుడు నగరప్రజలు అంతా నగరాన్ని, రాజమార్గాలను యథావిధిగా అలంకరించారు. తెల్లని పూలమాలలతో, జెండాలతో భూమి అంతా నిండిపోయింది. రాజమార్గం అంతా అలికి ముగ్గులు పెట్టారు. అగరు మొ॥ ధూపాలు సువాసనలు వెదజల్లుతున్నాయి. సుగంధ మిళితమైన పాడులతో, వివిధ పుష్పాలతో, మాలలతో రాజభవనం నిండి పోయింది. నగరద్వారం దగ్గర నీటితో నింపిన నూతన కలశాలు అక్కడక్కడా ఉంచారు. ఆ పూర్ణ కుంభాల మీద తెల్లని పూలు నిలిపారు. అలా అలంకరింపబడిన నగరంలో, మంగళవాక్యాలతో వందిమాగధులు స్తుతిస్తూ ఉండగా ధర్మరాజు స్నేహితులతో కలిసి ప్రవేశించాడు.

38. చార్వాకవధోపాఖ్యానము.

వైశంపాయనుడు ఇట్లు చెప్పాడు. "పాండవులు నగర ప్రవేశం చేస్తున్నపుడు పురజనులు ఆ దృశ్యాన్ని చూడవలెనని వేలకొద్దీ చేరుకొన్నారు. రాజమార్గంలో నాలుగు రోడ్ల మొగలన్నీ చక్కగా అలంకరించారు. రాజమార్గం, చంద్రోదయ సమయంలో పొంగే సముద్రంవలె ఉప్పొంగి పోతోంది. రాజమార్గంలోని ఇళ్లన్నీ రత్నపూర్ణాలయి, స్త్రీలతో నిండి, బరువెక్కి కంపించి పోతున్నట్లు ఉన్నాయి. ఆ స్త్రీలు ధర్మరాజును, భీమును, అర్జునుని, నకులసహదేవులను వినయంతో, సిగ్గుతో మెల్లగా ప్రశంసించారు. 'పాంచాలీ ! నీవు ధన్యురాలివి. పురుష సత్తములైన పాండవుల సేవలో నిమగ్నమయి ఉన్నావు. నీవలెనే

పూర్వం గౌతమ వంశంలో పుట్టిన 'జటిల' మహర్షులకు సేవచేసేది. నీ వ్రత దీక్ష, సేవాకర్మలూ అమోఘమయినవి.' ఇలా ఆ స్త్రీలు అంతా ద్రౌపదిని ప్రశంసించారు. ఇటువంటి ప్రశంసావాక్యాలతో, ఒకరికొకరు చెప్పుకొనే ప్రీతి పూర్వక మయిన మాటలతో పురమంతా సందడించిపోతోంది. ధర్మరాజు ఆ రాజమార్గాన్ని సముచితంగా దాటి వెళ్లి, అలంకరింపబడి శోభిల్లే రాజమందిరం చేరాడు. అక్కడ పౌరులూ, జానపదులూ అంతా చేరి, శ్రవణ సుఖంగా ఇలా మాట్లాడుకొంటున్నారు. 'రాజా ! మా అదృష్టవశాన శత్రువులను జయించావు. నీ ధర్మంతోనూ, బలంతోనూ, మా అదృష్టవశాన మళ్లీ రాజ్యం పొందావు. మహారాజా ! నిండు నూరేండ్లూ మాకు రాజువై పాలించు. ఇంద్రుడు స్వర్గం పాలించినట్లు, ప్రజలను ధర్మంతో పరిపాలించు.'

ఇలా రాజగృహద్వారం దగ్గర మంగళద్రవ్యాలతో, పూజలందుకొని బ్రాహ్మణుల ఆశీర్వాదాలను అంతటా గ్రహించాడు ధర్మరాజు. దేవేంద్ర భవనం వలె, శ్రద్ధా విజయాలతో నిండిన రాజమందిరద్వారం ప్రవేశించి, తరువాత రథం నుండి దిగాడు ధర్మరాజు. తరువాత ధర్మరాజు అభ్యంతర మందిరంలోకి ప్రవేశించి, రత్నాలతో, గంధమాల్యాది ఉపచారాలతో అంతటా ఉన్న దైవతాలను అర్చించాడు. తరువాత యశస్వి అయిన ధర్మరాజు మందిరం వెలుపలికి వచ్చి, మంగళ ద్రవ్యాలు పట్టుకొని వచ్చిన బ్రాహ్మణుల దర్శనం చేశాడు. విప్రులంతా చుట్టూరా ఉండి ఆశీర్వదిస్తూ ఉంటే, తారాగణంతో నిండిన చంద్రునివలె ధర్మరాజు ప్రకాశించాడు. గురువయిన ధౌమ్యుని, పెదతండ్రి ధృతరాష్ట్రునీ ముందుంచుకొని ధర్మరాజు ఆ విప్రులను యథావిధిగా పూజించాడు. పూలు, కుడుములూ, రత్నాలూ, చాలా బంగారం, ఆవులూ, వస్త్రాలూ ఏవి కావాలంటే అవి సేవకుల ద్వారా అడిగి తెలుసుకొని వారికి సత్కారం చేశాడు. తరువాత పుణ్యాహఘోష స్వర్గం దాకా వ్యాపించింది. ఆ పుణ్యఘోష మిత్రులకు ప్రీతి కలిగిస్తూ శ్రవణ సుఖంగా ఉంది. రాజా ! వేదవేత్తలయిన విప్రుల ఆ పుణ్యఘోషను పుష్కలమైన అర్థం కల పదాలు, అక్షరాలు కలిగిన దానిని హంసనాదంలా విన్నాడు ధర్మజుడు. దుందుభి ధ్వని, మనోహరమయిన శంఖనాదం, జయం పలికే జయజయ ధ్వనులూ వినిపించాయి. కొంతసేపటికి నిశ్శబ్దం ఏర్పడింది. అపుడు విప్రులలో కపటబ్రాహ్మణ రూపంలో ఉన్న చార్వాకుడనే రాక్షసుడు ఇలా అన్నాడు. అతడు దుర్యోధనుని మిత్రుడు. భిక్షుకుని రూపంలో దాగి ఉన్నాడు. రుద్రాక్షలు, పిలక ధరించిన త్రిదండి. సిగ్గులేని పాగరుబోతు. తపోనియమాలుకల వేలకొద్దీ విప్రులు రాజును ఆశీర్వదించటం కోసం వచ్చారు. వారి మధ్యలో ఆ చార్వాకుడు విప్రుల అనుమతి లేకుండానే, మహాత్ములయిన పాండవుల పాపాలను చెప్పాలని వచ్చి రాజుతో

ఇలా అన్నాడు. "ఈ విప్రులంతా నన్ను ఇలా చెప్పమన్నారు. "ఛీ ఈ రాజు దుష్టుడు. జ్ఞాతులనందరినీ చంపాడు. కుంతీకుమారా! ఇలా జాతినంతా వధించిన నీతో ఏ పని జరుగుతుంది? చుట్టాలనూ, గురువులనూ చంపిన నీకు బ్రతకడం కంటె చావడం మంచిది." దుష్టరాక్షసుని ఆ మాటలు విని బ్రాహ్మణులంతా భయపడ్డారు. వ్యథ చెందారు. ఆక్రోశించారు. రాజా ! అపుడా విప్రులందరూ, ధర్మరాజూ కూడా సిగ్గుపడిపోయారు. ఉద్వేగంతో నోటమాట రాక తెల్లబోయారు. అపుడు ధర్మరాజు ఇలా అన్నాడు. "వినయంతో యాచిస్తున్న నన్ను అనుగ్రహించండి. నా చేత దుఃఖితులయిన నా తమ్ములంతా నన్ను చుట్టి ఉన్నారు. వారికోసమే నా యీ రాజ్యభారం. నన్ను ధిక్కరించకండి!" వైశంపాయనుడు ఇలా అన్నాడు. "అపుడు ఆ విప్రులంతా రాజా ! ఇది మా మాటకాదు. రాజా ! నీకు సంపద కల్గుగాక !" అంతలో వేదవేత్తలూ, తపస్వులూ, మహాత్ములూ అయిన విప్రులు, జ్ఞానదృష్టితో వానినిగురించి వెంటనే తెలుసుకొన్నారు. బ్రాహ్మణులు ఇలా అన్నారు. వీడు దుర్యోధనుని స్నేహితుడు. చార్వాకుడనే రాక్షసుడు. సన్యాసి వేషంతో ఎలాగయినా దుర్యోధనునికి హితం చేకూర్చా లనుకొంటున్నాడు. ధర్మాత్మా ! మేమయితే ఇలా ఎన్నడూ అనం. నీకూ ఈ భయం నీకు తొలగుగాక ! నీతమ్ములకూ శుభమగుగాక !" వైశంపాయనుడు అన్నాడు. "అపుడు శుచులైన ఆ విప్రులంతా క్రోధంతో హుంకరిస్తూ, నిందిస్తూ ఆ పాప రాక్షసుని చంపేశారు. బ్రహ్మవేత్తలయిన వారి తేజస్సుచేత అతడు నేల గూలాడు. అది ఇంద్రుని వజ్రాయుధానికి మాడిపోయిన చెట్టువలె అనిపించింది. రాజు సత్కారాన్ని పొంది, విప్రులంతా రాజును అభినందించి వెళ్లిపోయారు. ధర్మరాజుకూడా మిత్రులందరితో కలిసి సంతోషం పొందాడు."

39. చార్వాకుని వరదానము గురించి శ్రీకృష్ణుడు చెప్పుట.

వైశంపాయనుడు చెపుతున్నాడు. "అపు డక్కడ తమ్ములతో కూర్చున్న ధర్మరాజుతో సర్వమూ చూడగల శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు. "నాకు ఈలోకంలో విప్రులు సదా పూజనీయులు. వారు భూమి మీద సంచరించే దేవతలు. వాక్కులో విషం కలవారు. అయినా ఎంతో ప్రసన్నత కూడా కలవారు. రాజా ! పూర్వం కృతయుగంలో చార్వాకుడనే రాక్షసుడు బదరీ వనంలో చాలా సంవత్సరాలు తపస్సు చేశాడు. వరం కోరుకొమ్మని బ్రహ్మ చాలాసార్లు అంటే, అపుడతడు 'సర్వభూతాల వలన తనకు భయం లేకుండేటట్లు' వరం కోరుకొన్నాడు. 'ద్విజులను అవమానించనంతకాలం నీకు సర్వభూతాల నుండీ భయం లేదు' అని, ఉత్తమమైన వరం జగత్పతి అయిన బ్రహ్మ అతనికి ఇచ్చాడు. అలా

వరం పొందిన ఆ పాపి మహాబలంతో అమిత పరాక్రమంతో, తీవ్రకృత్యాలు చేస్తూ దేవతలను పీడించసాగాడు. అతనిచే పీడింపబడిన దేవతలంతా కలిసివెళ్లి, బ్రహ్మతో ఆ రాక్షసుని వధింపుమని ప్రార్థించారు. అపుడు బ్రహ్మ "అతడి మరణం ఇప్పటికే నిశ్చయింపబడింది. త్వరలోనే అతడు మరణిస్తాడు" అని చెప్పాడు. 'మానవులలో దుర్యోధనుడనే రాజు ఇతనికి స్నేహితుడవుతాడు. అతని స్నేహానికి కట్టుబడి, ఇతడు బ్రాహ్మణులను అవమానిస్తాడు. అవమానం పొందిన విప్రులు కోపించి, వాగ్బలంతో ఈ పాపుని దహించి వేస్తారు. దానితో ఇతడు నశిస్తాడు.' చార్వాకు డనే ఆ రాక్షసుడు బ్రహ్మదండంచేత చనిపోయాడు. ధర్మజా ! దానికి నీవు శోకింపకు. రాజా ! క్షత్రియ ధర్మం అనుసరించిన వీర శ్రేష్ఠులయిన నీ జ్ఞాతులంతా చనిపోయి స్వర్గం చేరారు. అటువంటి నీవు నీ విధులను నెరవేర్చు. నీకు దుఃఖం కలుగదు. శత్రువులను జయించు. ప్రజలను రక్షించు. ద్విజులను పూజించు."

40. ధర్మజుని పట్టాభిషేకము.

వైశంపాయనుడు చెపుతున్నాడు. "కుంతీకుమారుడయిన ధర్మరాజు కోపతాపాలు విడిచి బంగరు సింహాసనం మీద, సంతోషంతో తూర్పు ముఖంగా కూర్చున్నాడు. కాంతులు ఈనే శుభమయిన బంగారు పీఠం మీద, శత్రుసంహారకులయిన సాత్యకి, వాసుదేవులు అతనికి అభిముఖంగా కూర్చున్నారు. ధర్మరాజును మధ్య పెట్టుకొని భీమార్జును లిరువురూ ఇరువైపులా కొంచెం ఎత్తు తక్కువైన మణిపీఠాల మీద కూర్చున్నారు. బంగారు పూలు పొదిగిన తెల్లని దంతపు సింహాసనం మీద, నకుల సహదేవులను చెరొకవైపున పెట్టుకొని కుంతీదేవి కూర్చుంది. సుధర్ముడు, (దుర్యోధనుని పురోహితుడు.) విదురుడు, ధౌమ్యుడు, ధృతరాష్ట్రుడు ప్రజ్వలించే కాంతులుగల వేరు వేరు ఆసనాల మీద కూర్చున్నారు. యుయుత్సుడు, సంజయుడు, యశస్విని అయిన గాంధారి – వీరంతా ధృతరాష్ట్రుని వైపు కూర్చున్నారు. సింహాసనం మీద కూర్చున్న ధర్మరాజు తెల్లని పువ్వులనూ, స్వస్తికాలనూ, అక్షతలనూ, భూమినీ, బంగారాన్ని, వెండిని, మణిని స్పృశించాడు. తరువాత ప్రజలంతా పురోహితుని ముందుంచుకొని, మంగళప్రదమయిన చాలా వస్తువులను తీసికొని వచ్చి ధర్మరాజును దర్శించారు. పుట్టమట్టి, బంగారం, వివిధ రత్నాలు, అభిషేకం చేసే కలశం – ఇలా అన్ని సంభారాలు సిద్ధం చేశారు. బంగారంతో, రాగితో, వెండితో, మట్టితో తయారు చేసిన పూర్ణకుంభాలు, పువ్వులు, పేలాలు, దర్భలు, ఆవుపాలు, సిద్ధం చేశారు. జమ్మి, పిప్పల, మోదుగ సమిధలు, తేనె, నెయ్యి, మేడికర్రతో

చేసిన స్రువమూ, బంగారం పొదిగిన శంఖమూ సిద్ధపరిచారు.

అపుడు పురోహితు డయిన ధౌమ్యుడు ముందుగా కృష్ణుని అనుమతి గ్రహించాడు. ఈశాన్యం వైపు పెరిగిన/చూసే వేదిక ఏర్పరిచి, లక్షణంగా ముగ్గుపెట్టాడు. పులిచర్మం పైభాగంలో తెల్లని దృఢమైన కోళ్లతో, అగ్నికాంతులు కల సర్వతోభద్రమనే ఆసనం మీద ధర్మరాజును ద్రౌపదిని కూర్చుండ బెట్టాడు. తరువాత యథావిధిగా మంత్రపూర్వకంగా ధీమంతుడయిన ధౌమ్యుడు అగ్నిలో హోమం చేశాడు. తరువాత కృష్ణుడు లేచి, పూజింపబడిన శంఖం తీసుకొని, కుంతీపుత్రుడయిన ధర్మరాజును, భూమికి రాజుగా అభిషేకించాడు. రాజర్షి అయిన ధృతరాష్ట్రుడూ, ప్రజలంతా ధర్మరాజును అభిషేకించారు. కృష్ణుని అనుమతితో, తమ్ములతో కూడిన ధర్మరాజు పాంచజన్యంతో అభిషిక్తుడయి, రాజయి, అమృతముఖు డయ్యాడు. తరువాత పణవాలు, ఆనకాలు, దుందుభులూ మొ॥ వాద్యాలను మ్రోగించారు. దానినంతటిని ధర్మరాజు తన ధర్మంగా/కర్తవ్యంగా స్వీకరించాడు. భూరి దక్షిణలతో వారినందరినీ ధర్మరాజు యథావిధిగా పూజించాడు. వేదాధ్యయన సంపన్నులై, ధైర్యసచ్ఛీలాలు గల బ్రాహ్మణులచే స్వస్తి వచనాలు స్వీకరించి, వారిని వేలకొలదీ నిష్కాలతో సత్కరించాడు. సంతుష్టులైన బ్రాహ్మణులు జయాన్ని, స్వస్తిని చెపుతూ హంసలవలె కలనాదాలు చేస్తూ ధర్మరాజును ప్రశంసించారు. యుధిష్ఠిరా ! అదృష్టవశాత్తు నీవు జయం పొందావు. మా భాగ్యవశాత్తు స్వధర్మం గ్రహించావు. మా భాగ్యవశాన భీమార్జునులూ, నకుల సహదేవులూ, నీవూ క్షేమంగా ఉన్నారు. వీరులందరూ చనిపోయిన ఆ యుద్ధం నుండి, మీరు శత్రువులను జయించి విముక్తులయ్యారు. ఆందుచేత అనంతర కృత్యాలన్నీ త్వరలో చేపట్టండి. సుజనులచేత పూజింపబడుతూ, స్నేహితులతో కలిసిన ధర్మరాజు మహారాజ్యాన్ని పొందాడు."

41. ధర్మజుడు భీమాదులకు కర్తవ్యములు నిర్ణయించుట.

వైశంపాయనుడు ఇట్లన్నాడు. "దేశకాలోచితమయిన ప్రజల వాక్యం విని, ధర్మరాజు ఇలా ప్రత్యుత్తరమిచ్చాడు. "నిజంగా పాండుపుత్రులు ధన్యులు. విప్రోత్తములంతా వచ్చి, ఉన్నవో, లేనివో వారి గుణాలను ప్రశంసించారు. మమ్మల్ని మీరు అనుగ్రహించవలసినదని నా అభిప్రాయం. ఏమాత్రమూ అసూయలేకుండా మమ్మల్ని సద్గుణవంతులుగా చెపుతున్నారు. నాకు నాతండ్రి ధృతరాష్ట్ర మహారాజే పరమదైవం. నాకు ఇష్టులంతా ఆయనకు ప్రీతి కల్గిస్తూ, ఆయన ఆజ్ఞ పాటిస్తూ ఉండాలి. జ్ఞాతులను వధించిన నేను దీనికోసమే బ్రతుకుతున్నాను. కొద్దిగా అయినా ఏమరకుండా నేను ఆయనకు సేవ చేస్తాను. స్నేహితులయిన మీరు నన్ను అనుగ్రహించాలనుకొంటే, ధృతరాష్ట్రుని పట్ల పూర్వం

వలెనే ప్రవర్తించండి. ఇతడు మీకూ, నాకూ, జగత్తుకంతటికి నాథుడు, ఈ భూమి అంతా ఆయనదే, పాండవులంతా కూడా ఆయనవారే. ఈ మాటను మీరు మనసున ఉంచుకొని నామాట పాటించండి." 'ఇక మీరు యథేచ్ఛగా వెళ్లవచ్చు' అని పౌరులను, జానపదులను అనుమతించి, భీముని యువరాజుగా నియమించాడు ధర్మరాజు. కార్యాలోచనం చేయడంలోను, నిశ్చయించడంలోను, షడ్గుణాలను గురించి ఆలోచించడంలోను బుద్ధి మంతుడయిన విదురుని సంతోషంతో ధర్మరాజు నియోగించాడు. చేసినపని – చేయవలసిన పని ఈ రెంటినీ తెలిసి కొనటానికీ, ఆదాయ వ్యయాలు ఆలోచించటానికీ సకల సద్గుణాలూ కల వృద్ధుడయిన సంజయుని నియోగించాడు. సైనికుల పరిమాణంలోను, ఆహారం, జీతం నిర్ణయించి యివ్వడంలోనూ, సైనికుల ఇతరకార్యాలు పర్యవేక్షించడంలోను నకులుని నియమించాడు. శత్రుసేనలను అడ్డుకొనటంలోను, దుష్టసంహారంలోను ధర్మరాజు అర్జునుని ఆదేశించాడు. ద్విజులకు సంబంధించిన దేవకార్యాలలోను, ఇతర కార్యాలలోను పురోహితులలో ఉత్తము డయిన ధౌమ్యుని నియమించాడు. నిత్యమూ తన దగ్గరే ఉండవలసినదిగా సహదేవుని ఆజ్ఞాపించాడు. సర్వకాల సర్వావస్థలలోనూ రాజును అతడే రక్షిస్తూ ఉండాలి. ఎవరెవరిని ఏయే పనుల్లో అర్హులని తాను భావించాడో, వారిని ఆయాపనుల్లోనే సంతోషంతో రాజు నియమించాడు. విదురునితోను, సంజయునితోను, బుద్ధిమంతుడయిన యుయుత్సునితోను ధర్మాత్ముడయిన ధర్మరాజు ఇలా అన్నాడు. 'ప్రతీరోజూ లేచి శ్రద్ధతో నాతండ్రి అయిన ధృతరాష్ట్రుని కార్యాలు మీరు పొరబడకుండా సముచితంగా చేస్తూ ఉండాలి. పౌర, జానపదుల కార్యాలన్నీ తెలియజెప్పి, ధృతరాష్ట్రుని అనుమతితో మీరు ఆచరించాలి."

42. ధర్మరాజు జ్ఞాతులకు శ్రాద్ధక్రియలు చేయించుట.

వైశంపాయనుడు ఇలా చెపుతున్నాడు. "తరువాత ఉదారబుద్ధికల ధర్మరాజు యుద్ధంలో చనిపోయిన జ్ఞాతు లందరికీ వేరువేరుగా శ్రాద్ధక్రియలు చేయించాడు. ధృతరాష్ట్రుడు తన పుత్రులకు పరలోక క్రియలు చేశాడు. కావలసినతీరులో కావలసినంత అన్నమూ, గోవూలూ, ధనమూ, విలువైన రత్నాలు ఇచ్చాడు. ద్రోణునికీ, కర్ణునికీ, ధృష్టద్యుమ్ననికీ, అభిమన్యునికీ, ఘటోత్కచునికీ, విరాటుడూ మొదలయిన వారికీ, యుద్ధంలో సహకరించిన వారికీ ద్రుపదునికీ, ఉపపాండవులకూ ద్రౌపదితో కలిసి ధర్మరాజు శ్రాద్ధ క్రియలు చేయించాడు. వేలకొలదిగా ఉన్న బ్రాహ్మణులలో ఒక్కొక్కరికీ వేరువేరుగా వేలకొద్దీ రత్నాలు, ఆవులూ, వస్త్రాలూ, సంపదలూ ఇచ్చాడు. మిత్రులు మిగలని రాజులను ఉద్దేశించి,

రాజే పరలోక క్రియలు చేశాడు. వారిపేరున సత్రాలు, చలివేంద్రాలు, చెరువులూ ఏర్పాటు చేశాడు. మిత్రులందరికీ పరలోక క్రియలు చేయించాడు. అతడు వారి ఋణం తీర్చి, లోకాల్లో నిందపడకుండా జనులను ధార్మికంగా పరిపాలిస్తూ చరితార్థు డయ్యాడు. ధృతరాష్ట్రునీ, గాంధారినీ, విదురునీ కురు వంశస్థులనూ, సేవకులనూ పూర్వం వలెనే గౌరవించేవాడు. పతులూ, సుతులూ పోయిన స్త్రీల నందరినీ, దయాళువయిన రాజు గౌరవంతో రక్షించేవాడు. దీనులకూ, అంధులకూ, దిక్కులేనివారికీ గృహాలు, వస్త్రాలు, భోజనాలు మొదలయినవి ఇచ్చి, ధర్మరాజు కరుణాపరుడై అనుగ్రహించేవాడు. శత్రువుల పట్ల ఋణ రహితుడై భూమినంతా గెలిచి, శత్రురహితుడై ధర్మరాజు విహరించేవాడు."

43. ధర్మరాజు కృష్ణుని స్తుతించుట.

వైశంపాయనుడు చెపుతున్నాడు. "పట్టాభిషిక్తుడయిన ధర్మరాజు రాజ్యం పొంది, శుచియై, అంజలి ఘటించి కృష్ణునితో ఇలా అన్నాడు. "కృష్ణా ! నీ అనుగ్రహంతో, నీతితో, బలంతో, తెలివితో, పరాక్రమంతో, నా యీ తండ్రి తాతల రాజ్యం మళ్లీ నాకు లభించింది. పుండరీకాక్షా ! నీకు మళ్లీ మళ్లీ నమస్కరిస్తున్నాను. నియమపరులయిన విప్రులు నిన్ను ఒక్కడినే 'పురుష' డని పిలుస్తారు. పరమాత్మవు, ఉపాసకులకు రక్షకుడవని ఎన్నోపేర్లు పెట్టి స్తుతిస్తారు. విశ్వకర్మా ! విశ్వాత్మా ! విశ్వసంభవా ! విష్ణూ ! జిష్ణూ! హరీ ! కృష్ణా ! వైకుంఠా ! పురుషోత్తమా ! నీకు నమస్కారం. ప్రాచీనుడవయిన నీవు అదితి గర్భంలో ఏడుగురిగా పుట్టావు. నీ వొకడివే పృశ్నిగర్భుడవు. త్రియుగుడ వని కూడా నిన్ను చెపుతారు. శుచిశ్రవుడు, హృషీకేశుడు, ఘృతార్చి, హంసుడు, త్రిచక్షుడు, శంభుడు, విభుడు, దామోదరుడు. అన్నీ నీ వొకడవే. వరాహుడు, అగ్ని, బృహద్భానుడు, వృషభుడు, తార్క్ష్య లక్షణుడు, అనీకసాహుడు, పురుషుడు, శిపివిష్టుడు, ఉరుక్రముడు అన్నీ నీవే. వరిష్ఠుడు, ఉగ్రసేనాని, సత్యుడు, వాజసని, గుహుడు, అచ్యుతుడు, చ్యావనుడు, సంస్కృతుడు, వికృతి, వృషుడు నీవే. కృష్ణధర్ముడు, ఆది, వృషదర్భుడు, వృషాకపి, సింధుడు, విధర్ముడు, త్రికకుప్పు, త్రిధాముడు, త్రిదివాచ్యుతుడు. ఇవి నీ నామాలు. సమ్రాట్టు, విరాట్టు, స్వరాట్టు, సురరాజు, భవోద్భవుడు, విభుడు, భూవు, అతిభూవు, కృష్ణుడు, కృష్ణవర్త్మ. అన్నీ నీవే. స్విష్టకృత్తు, భిషజావర్తుడు, కపిలుడు, వామనుడు, యజ్ఞుడు, ధ్రువుడు, పతంగుడు, యజ్ఞసేనుడు అని నీవే పిలువబడతావు. శిఖండి, నహుషుడు, బభ్రువు, దివస్పృక్కు, పునర్వసుడు, సుబభ్రువు, రుక్మయజ్ఞుడు, సుషేణుడు, దుందుభి - నీపేర్లు. గభస్తినేమి, శ్రీపద్ముడు, పుష్కరుడు, పుష్పధారణుడు, ఋభుడు,

విభుడు, సర్వసూక్ష్ముడు, చారిత్రం అని కూడా నీపేర్లే. నీవు సముద్రుడవు. బ్రహ్మవు, పవిత్రమయిన ధామం, ధామమును ఎరిగిన వాడవు. నిన్ను హిరణ్య గర్భుడని అంటారు. స్వధా, స్వాహా అనేవి కూడా నీవే. ఈ విశ్వాని కంతటికీ నీవే జన్మస్థానానివి. అలాగే ప్రళయం కూడా నీవే. ముందుగా ఈ విశ్వమంతటినీ నీవే సృష్టించావు. విశ్వయోనీ ! ఇదంతా నీ వశంలోనే ఉంది. శార్ఙ్గం, చక్రం, ఖడ్గం ధరించిన ప్రభూ ! నీకు నమస్కారం." ధర్మరాజు ఇలా స్తుతిస్తే ప్రీతి నొందిన కృష్ణుడు సభామధ్యంలో ధారాళమైన, సమగ్రమయిన వాక్కులతో ధర్మరాజును అభినందించాడు.

ధర్మరాజు చేత కీర్తింపబడిన ఈ వందవిష్ణునామాలను పఠించినా, విన్నా, అతడు సర్వపాపాలనుండి విముక్తు డవుతాడు.

44. గృహ విభాగము.

వైశంపాయనుడు చెపుతున్నాడు. "తరువాత ప్రజల నందరినీ రాజు వీడుకొలిపాడు. రాజు అనుమతిని పొంది, వారు తమ గృహాలలో ప్రవేశించారు. ఆపై ధర్మరాజు భీమపరాక్రమం కల భీమునీ, అర్జునునీ, నకుల సహదేవులనూ బుజ్జగిస్తూ ఇలా అన్నాడు. 'మీరంతా, మహాయుద్ధంలో శత్రువుల వివిధ శస్త్రాలతో గాయపడ్డారు. చాలా అలసి పోయారు. దుఃఖంతో, కోపంతో తపిస్తున్నారు. భరతవంశోత్తములయిన మీరందరూ నాకోసం, అశక్తులయిన నీచులవలె అడవిలో చాలా కష్టాలు పడ్డారు. సుఖంగా సంతృప్తిగా ఈ విజయాన్ని అనుభవించండి. విశ్రాంతి పొంది, మేల్కొన్న మిమ్మల్ని మళ్లీ రేపు కలుసుకొంటాను.' తరువాత, పెద్ద భవనాలతో శోభిల్లుతూ ఎన్నో రత్నాలతో, దాస దాసీ జనాలతో నిండిన దుర్యోధనుని గృహం ధృతరాష్ట్రుని అనుమతితో ధర్మరాజు భీమునికి ఇచ్చాడు. దేవేంద్రుని వలె వైభవంతో భీముడు ఆ మందిరంలో ప్రవేశించాడు. దుర్యోధనుని గృహం వంటిదే దుశ్శాసన గృహం కూడా. భవన పంక్తులూ, బంగారుతోరణాలతో, దాసదాసీ జనంతో, పుష్కలమైన ధన ధాన్యాలతో నిండుగా ఉంది. దాన్ని రాజ శాసనంతో అర్జునుడు పొందాడు. దుర్మర్షణుని భవనం దుశ్శాసన భవనం కంటె గొప్పది. కుబేరుని భవనంలా ఉంటుంది. బంగారంతో, మణులతో అలంకరింపబడి ఉంటుంది. అరణ్యంలో చాలా పాట్లు పడిన, వరార్హుడయిన నకులునికి ధర్మరాజు దాన్ని ప్రీతితో ఇచ్చాడు. విలువైన కనక భూషణాలతో నిండి, స్త్రీలశయనాలతో నిండిన దుర్ముఖుని ఇంటిని ధర్మరాజు తనకు సతతమూ ప్రియం చేసే సహదేవునికి ఇచ్చాడు. దాన్ని పొంది, కుబేరుడు కైలాసాన్ని పొందినంత సంతోషం పొందాడు సహదేవుడు. యుయుత్సుడు, విదురుడు, సంజయుడు,

సుధర్ముడు, ధౌమ్యుడు వారి వారి భవనాలనే పొందారు. పురుషోత్తముడయిన శ్రీ కృష్ణుడు సాత్యకితో సహా, కొండ గుహలో ప్రవేశించిన పెద్దపులి వలె అర్జునుని భవనంలో ప్రవేశించాడు. అక్కడ వారు భక్ష్యాలతో, అన్నపానీయాలతో సుఖించి, మరునాడు నిద్ర మేల్కొని ధర్మరాజును చేరారు."

45. ధ్యానాసక్తుడయిన శ్రీకృష్ణుని ధర్మరాజు ప్రశ్నించుట.

జనమేజయుడు అడిగాడు. "విప్రా ! ధర్మపుత్రుడయిన ధర్మరాజు రాజ్యం పొంది ఏమి చేశాడో నాకు చెప్పు. భగవంతుడు, మూడులోకాలకూ పరమగురువు, అయిన శ్రీకృష్ణుడు కూడ ఏమి చేశాడో దానినీ వివరంగా చెప్పు." వైశంపాయనుడు ఇలా చెప్పాడు. "రాజేంద్రా ! వాసుదేవుని ముందుంచుకొని పాండవులు ఏమి చేశారో చెపుతున్నాను. శ్రద్ధగా విను. రాజా ! కుంతీపుత్రుడయిన ధర్మరాజు రాజ్యం పొంది, నాలుగువర్ణాలనూ వారి వారి స్థానాలలో నిలిపాడు. స్నాతకవ్రతం చేసుకొన్న వేయిమంది విప్రులకు ధర్మరాజు వేయి నిష్కాల చొప్పున దానం చేయించాడు. అలాగే తన్ను అనుసరించి జీవించే సేవకులను, ఆశ్రయించుకొని ఉన్న అతిథులనూ, దీనులనూ, న్యాయసభసభ్యులనూ కోరినట్లు తృప్తి పరిచాడు. పురోహితుడైన ధౌమ్యునికి వేలకొద్దీ గోవులనూ, ధనాన్ని, బంగారాన్ని, వెండిని, ఎన్నో విధాలయిన వస్త్రాలనూ ఇచ్చాడు. రాజా ! కృపాచార్యునకు గురువృత్తి ఏర్పాటుచేశాడు. నియమశీలు డయిన ధర్మరాజు విదురుని కూడ పూజించాడు. దాతలలో ఉత్తము డయిన ధర్మరాజు రుచికరాలయిన అన్నపానాలతో, వివిధ వస్త్రాలతో, శయనాలతో, ఆసనాలతో అందరినీ సంతోషపెట్టాడు. యశశ్శాలి అయిన ధర్మజుడు తనకు లభించిన సంపదను సముచితంగా అందరికీ విభజించి, శాంతుడై, ధృతరాష్ట్ర పుత్రుడయిన యుయుత్సుని చక్కగా సత్కరించాడు. ధృతరాష్ట్రునికీ, గాంధారికీ, విదురునికీ రాజ్యాన్ని నివేదించి, ధర్మరాజు ప్రశాంతమనస్కుడై సుఖంగా ఉన్నాడు.

అలా నగరమంతటినీ సంతోషపెట్టి, ధర్మరాజు మహాత్ముడయిన కృష్ణుని దగ్గరకు నమస్కరిస్తూ వెళ్లాడు. మణులుపొదిగిన బంగరుతల్పంమీద నీలమేఘ కాంతితో కూర్చున్న శ్రీకృష్ణుని చూశాడు ధర్మరాజు. కృష్ణుడు దివ్యాభరణాలు ధరించి మెరిసిపోతున్నాడు. పచ్చని పట్టుబట్ట ధరించి, బంగారంలో పొదిగిన ఇంద్రనీలమణివలె వెలిగిపోతున్నాడు. వక్షఃస్థలంమీద కౌస్తుభరత్నం దాల్చి కృష్ణుడు, సూర్యునితో ప్రకాశిస్తున్న ఉదయ పర్వతంలా ఉన్నాడు. త్రిలోకాల్లోనూ అతనికి ఏమాత్రం పోలిక కన్పడదు. అట్టి పురుష విగ్రహం దాల్చిన విష్ణువును సమీపించి, ధర్మరాజు చిరునవ్వుతో మధురంగా ఇలా అన్నాడు.

"బుద్ధిమంతుడా ! నీకు రాత్రి సుఖంగా గడిచిందా ? అచ్యుతా ! నీకు జ్ఞానాలన్నీ ప్రసన్నంగా ఉన్నాయా ? అలాగే దివ్యమయిన బుద్ధి నీయందు ఉందా ? త్రివిక్రమా! నీ అనుగ్రహంవల్ల మేము రాజ్యం పొందాము. భూమండలం మా వశంలో ఉంది. విజయాన్నీ, కీర్తినీ పొందాము. అయినా ధర్మం నుండి వైదొలగలేదు. శత్రుమర్దనుడైన ధర్మరాజు ఇలా అంటూ ఉన్నా భగవానుడు ఏమీ మాట్లాడలేదు. ధ్యానంలో నిమగ్నుడయ్యాడు."

46. మహాపురుష స్తవోపాఖ్యానము.

ధర్మరాజు ఇలా అన్నాడు. "ఇదేమిటి ? చాలా ఆశ్చర్యంగా ఉంది. అమిత విక్రమా ! లోకపరాయణా ! నీవు ధ్యానించడ మేమిటి ? ముల్లోకాలకు శుభమేకదా ! పురుషోత్తమా ! నాల్గవదైన ధ్యానమార్గం అవలంబించి మూడు అవస్థలూ దాటి పోయావు. అందుచేత నామనస్సుకు ఆశ్చర్యం కలిగింది. శరీరంలో సంచరించే పంచవాయువులూ నిలిపి వేశావు. ప్రసన్న మయిన ఇంద్రియాలను మనసులో నిలిపావు. గోవిందా ! వాక్కు, మనస్సు నీ బుద్ధిలో నిలిపావు. నీ దేవ స్వరూపాలూ, గుణాలూ అన్నీ క్షేత్రజ్ఞునిలో / ప్రత్యగాత్మలో ప్రవేశపెట్టావు. నీ రోమాలు చలించడం లేదు. బుద్ధి, మనస్సూ కూడా స్థిరంగా ఉన్నాయి. మాధవా ! నీవు కర్రలాగా, గోడలాగా, రాయిలాగా చేష్టలుడిగి ఉన్నావు. దేవా ! గాలిలేని చోట ఉన్న దీపం వలె, నీవు నిశ్చలంగా ఉన్నావు. అయినా ప్రకాశిస్తున్నావు. రాయివలె నిశ్చలంగా ఉన్నావు. నేను వినదగినది అయితే, అది రహస్యం కాకపోతే ప్రపత్తితో యాచించే/అడిగే నా సందేహం తీర్చు. నీవే కర్తవు, వికర్తవు కూడా. అలాగే క్షరమూ, అక్షరమూ. ఆది, అంతము లేనివాడవు, పురుషోత్తమా ! ఆద్యుడవు నీవే. నీయందే ప్రపత్తి కల భక్తుడను. శిరసువంచి నమస్కరిస్తున్నాను. నీ ధ్యానంలోని నిజస్థితిని తెలుపు." అపుడు భగవానుడు మనస్సునూ, బుద్ధినీ, ఇంద్రియాలనూ తమ తమ స్థానాల్లో పెట్టి, చిరునవ్వుతో ఇలా అన్నాడు.

"అంపశయ్య మీద ఉన్న భీష్ముడు ఆరిపోయే అగ్ని హోత్రంలా ఉన్నాడు. అతడు నన్ను ధ్యానిస్తున్నాడు. అందుచేత నామనసు అతనిని చేరింది/తలచింది. అతని ధనుష్టంకారం పిడుగులు పడినట్లు అనిపిస్తుంది. దాన్ని దేవేంద్రుడు కూడా సహింపలేడు. అటువంటి భీష్ముడు నామనసులోకి వచ్చాడు. రాజసముదాయ మంతా జయించి, కాశిరాజ కన్యలను ముగ్గురినీ ఎత్తుకొని పోయిన భీష్ముని నా మనసున తలచాను. పరశురాముని తో ఇరవై మూడు రోజులు పోరాడినా, ఓడిపోని పరాక్రమవంతుని నామనసున ధ్యానించాను. ఇంద్రియాలన్నిటినీ ఒకటి చేసి, మనస్సును బుద్ధితో నిలిపి, నన్ను శరణు వేడిన భీష్ముని

నామనసు తలచింది. గంగాదేవి అతనిని గర్భంలో ధరించింది. అతడు వసిష్ఠుని దగ్గర విద్య నేర్చాడు. ఆ భీష్ముని నేను తలచాను. సాంగాలైన చతుర్వేదాలనూ, దివ్యాస్త్రాలనూ మహాతేజస్వి అయిన ఆ బుద్ధిమంతుడు ధారణ చేశాడు. అటువంటి భీష్ముని నేను మనసులో తలచాను. జమదగ్ని కొడుకైన పరశురామునికి ప్రియ శిష్యుడూ, సర్వవిద్యలకూ ఆధారమూ అయిన భీష్ముని మనసా భావించాను. అతడు భూత భవిష్యద్వర్తమానాలు తెలిసినవాడు. ధర్మం తెలిసిన వారిలో ఉత్తముడు. అతనిని మనసా ధ్యానించాను.

ఆ ఉత్తమ పురుషుడు తన కర్మలచేత స్వర్గానికి వెళ్లిపోతే ధర్మరాజా ! ఈ భూమి అంతా చంద్రుడు లేని రాత్రిలా అయిపోతుంది. అందువల్ల ధర్మరాజా ! భయంకర పరాక్రము డయిన ఆ గంగాపుత్రుని దగ్గరకు చేరి, పాదాభివందనం చేసి, నీమనసులో ఉన్న దాన్ని గూర్చి ప్రశ్నించు. నాలుగు విద్యలను, నాలుగు అగ్నిహోత్ర విధానాలను, నాలుగు ఆశ్రమ విశేషాలను, రాజధర్మాలన్నిటినీ గురించి రాజా ! ఆయనను అడిగి తెలుసుకో ! కురువంశభారం అంతా మోస్తున్న ఆ పెద్ద దిక్కు భీష్ముడు అస్తమిస్తే, జ్ఞానాలన్నీ అస్తమించి పోతాయి. అందుచేత నిన్ను ప్రేరేపిస్తున్నాను. ఉత్తమమూ, సత్యమూ అయిన కృష్ణునిమాట వినేసరికి ధర్మరాజుకు కన్నీటితో నోట మాటరాలేదు. ఎలాగో మెల్లగా ఇలా అన్నాడు.

'మాధవా ! భీష్ముని ప్రభావం గురించి నీవు చెప్పినదంతా సత్యమే. అందులో నాకు సందేహం లేదు. మహాతేజస్వీ ! భీష్ముని మహాభాగ్యాన్ని గురించి, ప్రభావం గురించి మహాత్ములయిన బ్రాహ్మణులు చెపుతూంటే నేను విన్నాను. నీవు లోకాలకు కర్తవు. నీవు చెప్పిన దాన్ని గురించి మళ్లీ ఆలోచించవలసిన పనిలేదు. మాధవా ! నామీద నీకు అనుగ్రహంతో కూడిన బుద్ధి ఉంటే, నిన్ను ముందుంచుకొని భీష్ముని మేము దర్శిస్తాం. ఉత్తరాయణం వస్తే అతడు పరలోకాలకు వెళ్లిపోతాడు. అందువల్ల ఆ కురువంశోత్తముడు నీ దర్శనం ఇపుడే పొందదగినవాడు. నీవు ఆద్యుడవు, దేవుడవు, క్షరుడవు, అక్షరుడవు. నీదర్శనం ఆయనకు లాభ మవుతుంది. నీవు బ్రహ్మమయమయిన నిధివి." వైశంపాయనుడు ఇలా చెపుతున్నాడు. 'ధర్మరాజు మాట విని కృష్ణుడు ప్రక్కనే ఉన్న సాత్యకితో 'నా రథం సిద్ధం చెయ్యి" అన్నాడు. కృష్ణుని దగ్గర నుండి సాత్యకి వెంటనే వెళ్లి, దారుకునితో 'కృష్ణుని రథం సిద్ధం చెయ్యి' అన్నాడు. సాత్యకి మాట విని, వెంటనే అతడు బంగారు రథాన్ని సిద్ధంచేశాడు. ఆ రథం మరకతమణులు, చంద్రకాంతమణులు, సూర్యకాంత మణులు పొదిగి ఉంది. చక్రాలకు బంగారపు తొడుగు లున్నాయి. ఆ రథం సూర్యకాంతి కలిగి వేగంగా వెళ్లేది. మధ్యమధ్యలో విచిత్రమైన

మణులెన్నో పొదిగారు. అపుడే ఉదయించిన సూర్యుని వలె వెలిగిపోతోంది. ధ్వజం మీద గరుత్మంతుడు రెపరెపలాడుతున్నాడు. సుగ్రీవం, శైబ్యం మొదలయిన గుర్రాలు పూన్చారు. అవి మనో వేగంతో పరుగెత్తగలవు. వాటికి బంగారు తొడవులు కూర్చారు. అటువంటి రథం సిద్ధంచేశానని చెప్పి దారుకుడు నమస్కరించి, నిలిచాడు."

47. భీష్మస్తవరాజము.

జనమేజయుడు అడుగుతున్నాడు. "భీష్ముడు అంపశయ్య మీద ఉంటూ ఏ యోగం ధరించాడు ? శరీరం ఎలా విడిచిపెట్టాడు ? వైశంపాయనుడు ఇలా అన్నాడు. "రాజా ! శుచివై, స్థిరమయిన మనసుతో, శ్రద్ధతో మహాత్ముడయిన భీష్ముని దేహ త్యాగం గురించి విను.

మాఘమాసంలో శుక్లపక్షంలో అష్టమినాడు రోహిణి నక్షత్రంలో మధ్యాహ్న సమయంలో విడిచాడు.

సూర్యుడు ఉత్తరాయణంలో ప్రవేశించినపుడు, స్థిరమయిన మనస్సుతో ఆత్మను ఆత్మయందు సమావేశపరచాడు. (జీవుడు పరమాత్మలో లీనమయ్యాడు) వందలకొద్దీ బాణాలు శరీరంలో గ్రుచ్చుకొని ఉన్నాయి. చుట్టూరా బ్రాహ్మణులు ఉన్నారు. అపుడు భీష్ముడు, నలువైపులా కిరణాలు ప్రసరించే సూర్యుని వలె, పరమశోభతో ప్రకాశించాడు. వ్యాసుడు, నారదుడు, దేవస్థానుడు, వాత్స్యుడు, అశ్మకసుమంతుడు, జైమిని, పైలుడు, శాండిల్యుడు, దేవలుడు, మైత్రేయుడు, అసితుడు, వసిష్ఠుడు, కౌశికుడు, హారీతుడు, లోమశుడు, ఆత్రేయుడు, బృహస్పతి, శుక్రుడు, చ్యవనుడు, సనత్కుమారుడు, కపిలుడు, వాల్మీకి, తుంబురుడు, కురుడు, మౌద్గల్యుడు, పరశురాముడు, తృణబిందుడు, పిప్పలాదుడు, వాయువు, సంవర్తుడు, పులహుడు, కచుడు, కాశ్యపుడు, పులస్త్యుడు, క్రతువు, దక్షుడు, పరాశరుడు, మరీచి, అంగిరసుడు, కాశ్యుడు, గౌతముడు, గాలవుడు, ధౌమ్యుడు, విభాండుడు, మాండవ్యుడు, ధౌమ్రుడు, కృష్ణానుభౌతికుడు, ఉలూకుడు, మార్కండేయుడు, భాస్కరి, పూరణుడు, కృష్ణుడు, సూతుడు, ఇంకా మహాభాగులు, మహాత్ములూ, శమదమాలు కల మునిగణాలతో, కూడి ఆ భీష్ముడు గ్రహాలతో పరివృతుడైన చంద్రునివలె ఉన్నాడు. భీష్ముడు శరతల్పం మీదనుండి అంజలి ఘటించి, త్రికరణ శుద్ధుడై (మనసుతో, మాటతో, చేష్టతో) కృష్ణుని ధ్యానించాడు. యోగేశ్వరుడూ, పద్మనాభుడూ, విష్ణుడూ, జిష్ణుడూ అయిన మధుసూదనుని ఆనందంతో పెరిగిన స్వరంతో స్తుతించాడు. వాక్కుల పరమార్థం తెలిసిన పరమ ధర్మాత్ముడైన భీష్ముడు అంజలిఘటించి వాసుదేవుని ఇలా

స్తుతించాడు. "కృష్ణుని ఆరాధించాలని నేను విస్తారమూ, సంక్షేపమూ అయిన వాక్కులతో స్తుతిస్తున్నాను. దానితో పురుషోత్తముడు ప్రీతి నొందుగాక. శుచి, శుచిపదుడు, హంసుడు, తత్ అనే పదంచేత చెప్పబడేవాడు, పరమేష్ఠి అయిన ప్రజాపతిని, సర్వాత్మనా ఆత్మను (మూడు దేహాలను) విడిచిపెట్టి శరణు వేడుతున్నాను. ఆయనకు ఆది-అంతమూ లేవు. పరబ్రహ్మ అతడే. దేవతలూ, బుషులూ కూడా ఆయనను తెలుసుకోలేరు. సృష్టికర్త నారాయణుడు అయిన హరి ఒక్కడే ఎరుగును. నారాయణుని వల్ల ఋషిగణాలు, సిద్ధులూ, మహానాగులూ, దేవతలు, దేవర్షులూ ఆయనను అవ్యయమయిన పరతత్త్వమని తెలుసుకొన్నారు. ఈతడెవరు ? ఈ భగవానుడు ఎక్కడివాడు ? అనే విషయాలు దేవ దానవులు కాని, గంధర్వులు కాని, యక్షరాక్షస పన్నగులు కాని తెలుసుకోలేరు. భూతాలన్నీ ఇతనిలోనే ఉన్నాయి. ఇతనిలోనికే చేరుకొంటాయి. భూతేశుడైన భగవంతునిలో ఇవి అప్రధానాలై, సూత్రంలో మణులగణాలవలె ఉన్నాయి. విశ్వమంతా శరీరమయిన వాడు అతడు. విశ్వమే అతని చేష్టలు. అతడు నిత్యుడు. ఈ విశ్వం దారంలో దండవలె అతనిలో నిలిచి ఉంది. అతనికి ఎన్నో తలలు, పాదాలు, కళ్లూ, చేతులూ, కిరీటాలూ, ముఖాలూ ఉన్నాయి. విశ్వానికి పరాయణంగా ఆ హరిని, నారాయణుని ప్రశంసిస్తారు. అతడు అణువులలో మరింత అణువు. పెద్దవాటిలో పెద్దవాడు. బరువైన వానిలో బాగా బరువైనవాడు. మేలయినవానిలో మేలయినవాడు అని ప్రశంసిస్తారు. అతనిని మంత్ర. బ్రాహ్మణాల్లోనూ, దేవతా జ్ఞానం కలిగించే వేద వాక్యాలలోనూ, ఉపనిషత్తులలోనూ, సత్యాలయిన సామల్లోను నిర్దోషునిగా, సత్యకర్మునిగా ధ్యానిస్తారు. నాలుగు రూపాలయిన ఆత్మకల వా డతడు. బుద్ధిలోనే తెలుస్తాడు. భక్తపాలకుడు. అటువంటి దేవుని, శ్రేష్ఠాలయిన నాలుగు గూఢ నామాలతో అర్చిస్తారు. తపస్సులన్నీ, నిత్యమూ అతనికోసమే చేయబడుతున్నాయి. ఆ తపస్సు ఉండడం వల్లనే, మన శరీరాల్లో అతడు నిలిచి ఉంటాడు. అతడు సర్వాత్ముడు, సకలమూ తెలిసిన వాడు. సర్వాన్నీ భావించేవాడు. అతనిని ఆరాధిస్తున్నాను.

వసుదేవుని వలన దేవకీదేవి అతనిని కన్నది. వేద, బ్రాహ్మణ, యజ్ఞాలను రక్షించటానికి, ప్రజ్వలించే అగ్నిని అరణి కన్నట్లుగా దేవకి కన్నది. అన్యభావన లేకుండా, కోరికలు విడిచిన సాధకుడు, కల్మష స్పర్శలేని గోవిందుని, సూక్ష్మ దృష్టితో మోక్షంకోసం ఆత్మలోనే దర్శిస్తాడు. వాయువును, ఇంద్రుని మించిన శక్తి కలిగి, సూర్యుని మించినతేజస్సు కలిగి, బుద్ధికీ, ఇంద్రియాలకూ, దేహానికీ మించిన స్థితీ కల ప్రజాపతిని శరణు వేడుతున్నాను. పురాణాల్లో పురుషుడనీ, యుగారంభంలో బ్రహ్మమనీ, యుగాంతంలో సంకర్షణుడనీ

పిలువబడే ఉపాస్యదైవాన్ని ఉపాసిస్తున్నాము. ఒకడే అయినా ఎన్నో రూపాలతో ఉద్భవించేవాడు. అధోక్షజుడు, అన్నికోరికలూ తీర్చేవాడు అని క్రియాపరులు అనన్య భక్తితో పూజిస్తారు. అతడు లోకానికి ధనాగారం, అతనిలోనే ప్రజలంతా ఉన్నారు. నీటిలో పక్షులవలె అతనిలో లోకాలన్నీ కదులుతూఉంటాయి. సత్యస్వరూపుడు. ప్రణవ స్వరూపుడు (ఓమ్). సత్తుకు, అసత్తుకూ పరమైనవాడు. ఆది మధ్యాంతాలు లేనివాడు. అతనిని దేవతలూ ఋషులూకూడా ఎరుగరు. ఆయనను దేవతలూ, రాక్షసులూ, గంధర్వులూ, సిద్ధులూ, ఋషులూ, ఉరగులూ నిత్యమూ దుఃఖమనే రోగానికి మందు వంటివాడని శ్రద్ధతో పూజిస్తారు. ఆది మధ్యాంతాలు లేనివాడు. స్వయంభువు, సనాతనుడు. ఎవరూ ఆయనను చూడలేరు. తెలుసుకోలేరు. హరి, నారాయణుడు, ప్రభువు. విశ్వానికి కర్త, నడిచే దానికీ, నిలిచిన దానికీ రక్షకుడు, జగత్తుకు అధ్యక్షుడు, అక్షరుడు, పరమపదం అని ఆయనను చెపుతారు. బంగారు వన్నెతో అదితిగర్భంనుండి దైత్యనాశకుడై, పన్నెండు రూపాలతో పుట్టిన సూర్యాత్మునకు నమస్కారం. శుక్లపక్షంలో దేవతలనూ, కృష్ణపక్షంలో పితృదేవతలనూ తృప్తిపరుస్తూ, ద్విజులకు రాజయిన చంద్రాత్మునకు నమస్కారం.

అగ్నిముఖులయిన దేవతలచే జగత్తంతా ధరింపబడుతోంది. అగ్నిలో వ్రేల్చబడిన హవిస్సుకు మొదటి భోక్త అయిన అగ్నిహోత్ర రూపునకు నమస్కారం.

గొప్ప పెనుచీకటికి ఆవల ప్రకాశిస్తా డతడు. అతనిని తెలుసుకొంటే మృత్యువును తరించవచ్చు. అటువంటి జ్ఞేయాత్మకుడైన పరమాత్మునకు నమస్సులు. మహాయజ్ఞాలలో, అగ్న్యాధానసమయంలో బహ్వృచములు ఆయనను చాలా పెద్దగా ప్రశంసిస్తాయి. విప్రసంఘాలు కీర్తించే ఆ వేదాత్మునకు నమస్కారం. ఆయనకు ఋక్కులు. యజుస్సులు, సామములు నిలయం. పంచవిధ హవిస్సులూ అతని రూపమే. సప్త తంతువులు కల యజ్ఞాత్మునకు నమస్కారం. 'ఆశ్రావయ' అనే నాలుగు అక్షరాలతో, అస్తు శ్రౌషట్ అనే నాలుగు అక్షరాలతో, 'యజ' అనే రెండక్షరాలతో, 'యే యజామహే' అనే అయిదు అక్షరాలతో, మళ్లీ 'వషట్' అనే రెండక్షరాలతో ఆయనకు హోమం చేస్తారు. ఆ హోమ స్వరూపునకు నమస్కారం. వేద పురుషుడు, సుపర్ణుడు, యజు వనీ అతని పేర్లు – గాయత్రి మొదలయిన ఛందస్సులు ఆయన అవయవాలు. త్రివృత్తు అతని శిరస్సు. రథంతరం, బృహత్తు అనే వేదభాగాలు అతనికి ప్రీతి కలిగిస్తాయి. అట్టి స్తోత్రరూపునకు నమస్కారం. విశ్వసృష్టికర్తలు చేసిన వెయ్యేళ్ల సత్రయాగంలో బంగరు రెక్కలతో పుట్టిన హంసరూపుడయిన ఋషికి నమస్కారం. పదసమూహం అంగాలుగా, సంధులు కణుపులుగా, స్వరాలు, వ్యంజనాలూ భూషణాలయి, దివ్యుడూ, అక్షరరూపుడూ అని ప్రశంసింపబడే వాగ్రూపునకు నమస్సులు. యజ్ఞ శరీరు

డయిన వరాహమై, లోకహితంకోసం భూమిని ఉద్ధరించిన వీర్యాత్మునకు నమస్కారం. పాములు అలంకారాలైన, వేయిపడగల శయనం మీద యోగం ధరించి నిద్రించిన యోగ నిద్రా స్వరూపునకు నమస్కారం.

విశ్వేదేవులు, మరుద్గణాలు, రుద్రులు, ఆదిత్యులు, అశ్వినీ దేవతలు, వసువులు, సిద్ధులు, సాధ్యులూ అందరూ ఆయన విభూతులే. అట్టి దేవ స్వరూపునకు నమస్సు. అవ్యక్తమయిన ప్రకృతి, బుద్ధి, అహంకారం, మనస్సు, జ్ఞానేంద్రియాలు, తన్మాత్రలు, వాని కార్యాలు, అన్నీ ఆయన స్వరూపాలే. అటువంటి తత్త్వమయునకు నమస్సులు. భూతం, వర్తమానం, భవిష్యత్తు అతడే. ప్రాణుల ఉత్పత్తి ప్రళయాలకు కారణం అతడే. భూతాలన్నింటికీ ముందుపుట్టిన వాడు అతడే. అటువంటి భూతాత్మకునికి నమస్కారం. సూక్ష్మతత్త్వం తెలిసిన జ్ఞానులు ఆయనను పరమ సూక్ష్మంగా భావిస్తారు. సూక్ష్మంకంటె మిక్కిలి సూక్ష్మమయినది బ్రహ్మము. ఆ సూక్ష్మ రూపునకు నమస్కారం. చేప రూపం దాల్చి రసాతలానికి వెళ్లి శీఘ్రంగా బ్రహ్మకు వేదాలను తీసికొని వచ్చి యిచ్చిన మత్స్యాత్మకునకు నమస్కారం. అమృత మంథన సమయంలో, కఠినమైన శరీరంతో మందర పర్వతం ధరించిన కూర్మావతారునికి నమస్కారం. వరాహరూపం దాల్చి, ఆడవులతో, పర్వతాలతో కూడిన భూమిని ఒకే కోరతో ఉద్ధరించిన వరాహావతారునకు నమస్సు. నరసింహశరీరం ధరించి, సర్వలోక భయంకరుడయిన హిరణ్యకశిపుని చంపిన నరసింహావతారునకు నమస్కారం. వామన రూపం దాల్చి, మాయతో బలిచక్రవర్తిని బంధించి, మూడు లోకాలనూ ఆక్రమించిన క్రాంతరూపునకు నమస్కారం. జమదగ్ని కొడుకయిన పరశురాముడై, శస్త్రధారులలో ఉత్తముడై భూమిని క్షత్రియరహితం చేసిన రామాత్మకునకు నమస్సు. ధర్మోల్లంఘనం చేసిన రాజులను యుద్ధంలో ఇరవై ఒక్క మారులు సంహరించిన క్రోధరూపుడయిన పరశురామునకు నమస్కారం. దశరథుని పుత్రుడై, పులస్త్యవంశంలో పుట్టిన రావణుని యుద్ధంలో చంపిన క్షత్రియ రూపుడయిన రామాత్మునకు నమస్కారం. నీలమైన వస్త్రం ధరించి, హలం, ముసలం ఆయుధాలయిన బలరామునికి భోగస్వరూపునికి నమస్కారం. శంఖం, చక్రం, శార్ఙ్గం, పట్టువస్త్రం, వనమాల ఇవన్నీ నిత్యమూ ధరించే కృష్ణునికి నమస్కారం. కంసుని చంపడంకోసం వసుదేవునికి కొడుకయి, నందగోకులంలో క్రీడించిన క్రీడాత్మకునకు నమస్కారం. యదువంశంలో పుట్టి, వాసుదేవత్వం పొంది, భూభారం తీర్చిన కృష్ణాత్మకునకు నమస్కారం. అర్జునునికి సారథ్యం చేస్తూ, మూడులోకాలకు ఉపకారం చేయడానికి గీతామృతాన్ని ఇచ్చిన పరబ్రహ్మ రూపునికి నమస్కారం. దానవులను వశంచేసుకొని, లోక సరంక్షణం కోసం మళ్లీ బుద్ధుడయిన బుద్ధాత్మకునకు నమస్కారం. కలియుగం వచ్చాక, మ్లేచ్ఛులను గుర్రమెక్కి చంపే ధర్మ సంస్థాపకుడయిన కల్క్యాత్మకునకు నమస్కారం. తారామయ యుద్ధంలో రాక్షసరాజయిన కాలనేమిని సంహరించి, ఇంద్రునికి రాజ్య మిచ్చిన ముఖ్యాత్మునకు నమస్కారం. సర్వప్రాణుల శరీరాలలోనూ సాక్షిభూతంగా నిలిచి, నశించిపోయే ప్రాణులలో అక్షరంగా నిలిచే సాక్షిరూప పరమాత్మకు నమస్సులు. మహాదేవా ! నమస్కారం. భక్తవత్సలా ! నమస్కారం. సుబ్రహ్మణ్యా ! నమస్సులు. పరమేశ్వరా ! అనుగ్రహించు. నీవు అవ్యక్త రూపంలోనూ, వ్యక్తరూపంలోనూ కూడ విశ్వమంతటా వ్యాపించి ఉన్నావు. నారాయణుడు,

సహస్రాక్షుడు, సర్వలోక మహేశ్వరుడు, హిరణ్యనాభుడు, యజ్ఞాంగ రూపుడు, అమృత స్వరూపుడు, విశ్వవ్యాప్తమయిన ముఖాలు కలవాడు అయిన పుండరీకాక్షుని, పురుషోత్తముని శరణుకోరుతున్నాను. మంగళ నిలయుడయిన హరి మనసులో ఉన్నవారికి అన్నిపనులలోనూ, ఎన్నడూ అమంగళం కలగదు. విష్ణువే మంగళరూపుడు - మధుసూదనుడే మంగళుడు. పుండరీకాక్షుడే శుభరూపుడు. గరుడధ్వజుడే శుభరూపుడు.

మోక్షకారణమయిన వేదోపాయంచేత, ధర్మార్థవ్యవహారా లనే అంగాలతో, సత్పురుషులకు సేతువు నిర్మించిన సత్యాత్మునకు నమస్సులు.

వేర్వేరు ధర్మపాదాలతో, వేర్వేరు ధర్మ స్వరూపాలతో, వేర్వేరు ధర్మఫలాలను కోరేవారు అర్చించే ధర్మస్వరూపునకు నమస్కారం. కామమయ శరీరాలు కలవారివల్ల ప్రాణులన్నీ జన్మిస్తున్నాయి. వాని వలననే సర్వభూతాలకూ ఉన్మాదం కలుగుతోంది. అటువంటి కామాత్మునకు నమస్కారం. మహర్షులు ఈ దేహంలోనే అవ్యక్తుని గుర్తిస్తారు. బుద్ధిలో నిలిచిన క్షేత్రజ్ఞుని తెలుసుకుంటారు. అటువంటి క్షేత్రాత్మునకు నమస్కారం. జాగ్రత్, స్వప్న, సుషుప్తులయందు స్వరూపంతో ఉన్నాకూడా, ఆత్మను పదహారు గుణాలతో చుట్టిన పదునేడవ స్వరూపంగా సాంఖ్యులు చెపుతారు. ఆ సాంఖ్యాత్మునకు నమస్సులు. నిద్రను జయించి, శ్వాసను నిలిపి, సత్త్వస్థులై ఇంద్రియాలను వశపరచుకొని, యోగనిర్వహణం చేస్తూ యోగులు చూసే జ్యోతిఃస్వరూపుడైన యోగాత్మునకు నమస్సులు. పాపపుణ్యాలు శమించి, పునర్జన్మ అనే భయంలేని శాంతులయిన సన్యాసులు ఎవనిని చేరుతారో ఆమోక్ష స్వరూపునికి నమస్కారం. వేల యుగాలు గడిచిన తర్వాత మంటలు మండుతూ అగ్నిరూపంలో భూతాల నన్నిటినీ అతడే భక్షిస్తాడు. ఆ ఘోరాత్మునికి నమస్కారం. అన్నిప్రాణులను భక్షించి, జగత్తు అంతా ఒకే సముద్రంగా చేసి, తానొక్కడూ బాలుడై నిద్రించే మాయాత్మునకు నమస్కారం. కమలాక్షుడయిన ఆవిష్ణుమూర్తి నాభికమలంలో విశ్వమంతా జన్మించింది. అందులోనే స్థిరంగా నిలిచింది. ఆ పద్మస్వరూపునకు నమస్కారం. అనంతమైన శిరసులు, పరిధులు లేని ఆత్మలూ కల్గి, నాల్గుసముద్రాలు ఏకార్ణవమైనపుడు యోగనిద్రను పొందే యోగనిద్రాత్మకునకు నమస్కారం.

అతని శిరసున మేఘాలూ, అన్ని అంగసంధులలో నదులు ఉన్నాయి. కడుపులో నాలుగు సముద్రాలు ఉన్నాయి. అట్టి తోయాత్మకునకు నమస్కారం. సృష్టి, ప్రళయ రూపమయిన వికారాలు అన్నీ అతని నుండియే పుడుతున్నాయి. అతనిలోనే లీనమై పోతున్నాయి. అటువంటి కారణరూపునకు నమస్కారం. అతడు రాత్రిపూట మేల్కొని ఉంటాడు. పగటిపూట సాక్షీభూతుడై నిలిచి ఉంటాడు. ఎల్లపుడూ ఇష్టానిష్టాలను చూస్తూ

ఉంటాడు. అటువంటి ద్రష్టరూపునకు నమస్సులు. సర్వ కార్యాలలోనూ అడ్డులేకుండా, ధర్మకార్యాలకోసం ప్రయత్నిస్తూ వైకుంఠరూపంకల కార్యాత్మునకు నమస్కారం. ధర్మ గౌరవం తొలగిన క్షత్రియ సముదాయాన్ని, ఇరవై ఒక్క మారులు క్రోధంతో యుద్ధంలో చంపిన వాడు పరశురాముడు. అట్టి క్రౌర్యాత్మునకు నమస్కారం. తనను అయిదు భాగాలుగా విభజించుకొని వాయువుగా అయి, శరీరంలో ఉండి సర్వప్రాణులనూ కదిలించే వాయురూపునకు నమస్కారం. మాసాలు, ఋతువులు, అయనాలు, సంవత్సరాలు అనే విభాగాలతో, ఆయా యుగాల్లో యోగబలంతో మళ్లీ మళ్లీ వస్తూ, సృష్టికీ ప్రళయానికీ కూడా తానే కర్త అయిన కాలాత్మునకు నమస్కారం. ఆయన ముఖాన్ని బ్రాహ్మణులు, భుజాలను క్షత్రియులు, పొట్ట, తొడలను వైశ్యులు, పాదాలను శూద్రులు ఆశ్రయించి ఉన్నారు. అట్టి వర్ణాత్మకునకు నమస్కారం. అతని ముఖమే అగ్ని, తల స్వర్గం, బొడ్డు ఆకాశం. పాదాలు భూమి. కన్ను సూర్యుడు. దిక్కులు చెవులు. అటువంటి లోక స్వరూపునకు నమస్కారం. అతడు కాలం కంటె పరుడు. యజ్ఞంకంటె పరుడు. పరంకంటె పరమయిన వాడు. అతనికి ఆదిలేదు. కాని విశ్వానికి అతడే ఆది. అటువంటి విశ్వాత్మునకు నమస్కారం.

అతడు మేఘంలో విద్యుత్తుగాను, ఉదరంలో జఠరాగ్నిగాను ఉన్నాడు. అందరినీ పవిత్రం చేస్తూ పావకుడు అనీ, శుద్ధిచేస్తూ శుచి అనీ పిలువబడుతున్నాడు. సర్వ పదార్థాలను దగ్ధం చేసేది అతడే. అటువంటి వహ్ని రూపునకు నమస్సులు.

అతడు విషయాల్లో ప్రవర్తించే వారిని అనాదరించి, విశేషగుణాలచేత విషయాన్ని రక్షిస్తాడని చెపుతారు. ఆ రక్షక రూపునకు నమస్కారం. అతడు అన్నం, నీరు అనే వాటిని ఇంధనాలుగా చేసుకొని, రసాన్ని, ప్రాణాన్ని వృద్ధిపొందిస్తూ సర్వభూతాలనూ ధరిస్తాడు. అటువంటి ప్రాణరూపునకు నమస్కారం. ప్రాణాలను రక్షించడానికి నాలుగు విధాలయిన అన్నం తింటూ, దేహంలో జఠరాగ్నియై, దాన్ని జీర్ణింపజేసే పాక రూపునకు నమస్సులు. పచ్చని రంగు కళ్లూ, జూలూ కలిగి, కోరలూ గోళ్లూ ఆయుధాలై రాక్షసరాజు హిరణ్యకశిపుని సంహరించే దృష్టరూపుడయిన నరసింహునికి నమస్కారం. ఆయనను దేవతలు కాని, గంధర్వులు కాని, దైత్య, దానవులు కాని తాత్త్వికంగా తెలుసుకోలేరు. అటువంటి సూక్ష్మరూపునకు నమస్కారం. సర్వవ్యాపకుడయిన భగవానుడు అనంతుని రూపంలో పాతాళానికి వెళ్లి, జగత్తునంతా ధరించాడు. ఆ వీర్య రూపునకు నమస్సులు. సృష్టి పరంపరను రక్షించడానికి, ప్రాణులన్నిటినీ స్నేహమనే పాశాలతో మోహపెట్టే మోహరూపునకు నమస్కారం. కోశాలు అయిదింటిలో ఉన్న ఈ జ్ఞానమునే ఆత్మజ్ఞానమని తెలిసికొని, విద్వాంసులు ఆ జ్ఞానంతోనే ఆయనను చేరుతున్నారు. అట్టిజ్ఞాన రూపునికి

నమస్కారం. ఊహకు కూడా అందనంత శరీరమూ, అంతటా వ్యాపించే బుద్ధి, ఇంద్రియాలూ ఉన్నాయి. అంతేకాదు. ఆయనకు అంతులేనన్ని శబ్దాది విషయాలున్నాయి. అటువంటి దివ్యాత్మునకు నమస్కారం.

అతడు సదా జడలు, దండం, వేలాడేంత పొట్టకల శరీరమూ ధరిస్తాడు. అతని కమండలువే అతనికి అమ్మల పొది. అటువంటి బ్రహ్మాత్మునకు నమస్కారం. శూలం ధరిస్తాడు. దేవతల ప్రభువు. మూడు కనులుకల మహాత్ముడు. భస్మం పూసుకొన్న శరీరమే చిహ్నంగా కలవాడు. అటువంటి రుద్రరూపునకు నమస్కారం. ఆయనకు అర్ధచంద్రుడు శిరసుమీద ఉన్నాడు. సర్పాలు యజ్ఞోపవీతంగా కలవాడు. పినాకమనే ధనుస్సునూ, శూలాన్నీ చేతిలో ధరించిన ఉగ్రరూపునకు నమస్కారం. సర్వప్రాణులకూ ఆత్మరూపు డతడు. ప్రాణుల జనన మరణాలకు కారణమైనవాడు. ఆయనలో క్రోధం కాని, ద్రోహం కాని, మోహం కాని లేవు. అటువంటి శాంతస్వరూపునకు నమస్కారం. సర్వమూ తనలోనే ఉన్నవాడు. అన్నీ తననుండే వస్తాయి. అన్నీ తానే. అంతటా తానే. సదా సర్వమయు డతడు. అటువంటి సర్వాత్మునికి నమస్కారం. విశ్వకర్మా ! నమస్కారం. విశ్వాత్మా ! విశ్వసంభవా ! నిత్యముక్త స్వరూపా ! పంచభూతాలకూ ఆవల ఉండే దేవునకు నమస్కారం. మూడులోకాల్లోనూ ఉండే నీకు నమస్సులు. మూడులోకాలకూ ఆవల ఉండే నీకు నమస్సులు. అన్ని దిక్కులలోను ఉంటావు. సర్వమయమైన నిధివి నీవు. నీకు నమస్కారం. విష్ణుభగవానుడా ! లోకాల ఉత్పత్తి వినాశాలకు కారణమైనవాడా ! హృషీకేశా ! నీవే కర్తవు, సంహర్తవు. పరాజయం ఎరుగని నీకు నమస్కారం.

మూడు లోకాల్లోనూ దివ్యమయిన నీ భావాన్ని చూడలేను. నీ సనాతన రూపం మాత్రం యథాతథంగా చూస్తున్నాను. నీ శిరస్సు ఆకాశాన్ని, పాదాలు భూమినీ, విక్రమం మూడులోకాలనూ ఆక్రమించింది. అట్టి సనాతన పురుషుడవు నీవు. నీ భుజాలే దిక్కులు, సూర్యుడు కన్ను, నీ వీర్యమందు శుక్రుడు నిలుస్తాడు. అమిత తేజస్సు కల వాయు స్వరూపుడవు నీవే అయి ఆ పైని ఏడు మార్గాలూ నీవు నిరోధించావు. అవిసె పువ్వు వంటి రంగు కలిగి, పట్టుబట్ట ధరించిన అచ్యుతునికి నమస్కరించే వారికి భయమనేది కలుగదు. కృష్ణునికి చేసిన ఒకే ఒక నమస్కారం, పది అశ్వమేధయాగాలు చేశాక అవభృథస్నానం చేసినంత ఫలితం ఇస్తుంది. కాని కృష్ణునికి చేసిన నమస్కారంలో ఒక విశేషం ఉంది. దశాశ్వమేధాలు చేసినవాడు మళ్లీ జన్మిస్తాడు. కాని కృష్ణునికి నమస్కరించినవాడు మళ్లీ జన్మ ఎత్తడు. కృష్ణ భక్తులై, నిద్రించినా లేచినా కృష్ణుని స్మరిస్తూ ఉండేవారు కృష్ణుని దేహం పొందుతారు. మంత్రంతో హోమం చేసిన నెయ్యివలె, కృష్ణదేహు లయి కృష్ణునిలో

ప్రవేశిస్తారు. నరకభయం కలిగిన వారికి కృష్ణుడు రక్షణ చక్రం ఏర్పరుస్తాడు. సంసారం అనే నదుల సుడులలో చిక్కుకొన్న వారికి చుక్కాని అయిన విష్ణువునకు నమస్సులు. బ్రహ్మణ్యులకు దేవుడూ, గోబ్రాహ్మణులకు హితుడూ అయి, లోకానికంతకూ హితంచేసే కృష్ణునకు, గోవిందునకు నమస్కారం. హరి అనే రెండక్షరాలు అడవిలో వెళ్లే ప్రాణులకు దారిలో ఖర్చు చేసికొనే ధనంవంటివి. సంసారమనే రోగాన్ని పొగొట్టే మందు. దుఃఖం నుండి, శోకం నుండి రక్షిస్తాయి. సత్యం విష్ణుమయ మయినట్లుగా, జగత్తు విష్ణుమయ మయినట్లుగా, సర్వమూ విష్ణుమయమే అయినట్లు నా పాపం కూడా అలాగే నశించుగాక. నిన్ను శరణువేడిన భక్తుడిని నేను. అభీష్టమయిన గతిని పొందాలని అనుకొంటున్నాను. నాకు ఏది శ్రేయస్కరమో దాన్ని నీవే ధ్యానించు కృష్ణా ! ఆయన విద్యకూ, తపస్సుకూ జన్మస్థానం కాని, ఆయనకు ఎవరూ జన్మనివ్వలేరు. ఆ విష్ణువు ఇపుడు వాక్కు అనే యజ్ఞంతో ఆరాధింప బడినాడు. నన్ను జనార్దనుడు అనుగ్రహించుగాక. నారాయణుడే పరబ్రహ్మ. తపస్సు అంతా నారాయణపర మయినది. నారాయణుడే పరమదైవం. సదా నారాయణుడే సర్వమూను." వైశంపాయనుడు చెపుతున్నాడు. ఇలా చెప్పి భీష్ముడు కృష్ణుని మనసులో నిలుపుకొని 'నమస్కారం' అని కృష్ణునికి నమస్కారం చేశాడు. భీష్ముని భక్తిని యోగమార్గంలో తెలుసుకొని కృష్ణుడు అతనిని యోగమార్గంలోనే చేరుకొని భీష్మునికి 'మూడులోకాలూ దర్శింపగల దివ్యజ్ఞానం' ఇచ్చి మళ్లీ తనలో తాను చేరాడు.

యోగులంతా ప్రాణం విడిచే సమయంలో, ప్రయత్నించి శ్రీహరిని చిత్తంలో ప్రవేశపెడతారు. కాని భీష్ముడు ఎదుటనే కృష్ణుని చూస్తూ ప్రాణాలను విడిచాడు. భీష్ముడికి మోక్షఫలం ఇపుడే దక్కింది.

భీష్ముడు మాట్లాడటం చాలించేసరికి, బ్రహ్మవాదు లందరికీ కళ్లలో నీళ్లు తిరిగాయి. కంఠాలు బొంగురు పోయాయి. అలాగే పూడి పోయిన కంఠాలతో మహామతి అయిన భీష్ముని ప్రశంసించారు. విప్రవరేణ్యులంతా పురుషోత్తముడయిన కేశవుని స్తుతించారు. పునఃపునః భీష్ముని అందరూ మెల్లగా ప్రశంసించారు. పురుషోత్తముడు భీష్ముని భక్తి యోగాన్ని యోగశక్తితోనే తెలిసికొని, సంతోషంతో వెంటనే రథ మెక్కాడు. కేశవుడూ, సాత్యకీ ఒకే రథం మీద వెళ్లారు. మరో రథం మీద ధర్మజుడూ, అర్జునుడూ వెళ్లారు. భీముడూ, నకుల సహదేవులూ ఒక రథం ఎక్కారు. కృపుడూ, యుయుత్సుడూ, సంజయుడూ మరొక రథమెక్కారు. పెద్ద నగరాల వంటి రథాలెక్కి, చక్రఘోషతో భూమిని దద్దరిల్లజేస్తూ, ఆ పురుషపుంగవులు బయలుదేరారు. త్రోవలో కృష్ణాదుల స్తోత్రాలతో నిండిన విప్రుల మాటలు ఆ కృష్ణుడు మంచి మనసుతో ఆలకించాడు. అంజలించి, నమస్కరించే

జనులను సంతోషించి, అభినందించాడు.

శార్ఙ్గ ధన్వుడయిన కృష్ణుని ఈ స్తోత్రాన్ని స్మరించినా, పఠించినా, విన్నా అతని పాపాలన్నీ కృష్ణుని చేత పోగొట్టబడతాయి. అతడు దేహాంతంలో జనార్దనునిలో ప్రవేశిస్తాడు. భీష్ముడు చెప్పిన, మహాపాతక నాశనమైన, అద్భుత కర్ముడయిన విష్ణుని కీర్తించే ఈ స్తవరాజం సమాప్తం. శుచియై మోక్షం కోరిన నరుడు పాపహర మయిన ఈ స్తవరాజం పఠిస్తే సనాతన మయిన పరిశుద్ధలోకాలను దాటి, మహాత్ముని మోక్షపదవిని పొందుతాడు."

48. పరశురామోపాఖ్యానము.

వైశంపాయనుడు ఇలా చెపుతున్నాడు. "తరువాత శ్రీకృష్ణుడూ, యుధిష్ఠిరుడు, కృపుడు మొ॥వారూ మిగిలిన నల్గురు పాండవులూ పతాకలతో, ధ్వజాలతో శోభిల్లే నగరాల వంటి రథాలతో, వేగంగా వెళ్లే గుర్రా లెక్కి కురుక్షేత్రానికి వెళ్లారు. వారంతా కురుక్షేత్రం దగ్గర రథాలు దిగి, నడుస్తూ వేగంగా వెళ్లారు. కురుక్షేత్రమంతా వెంట్రుకలతో, మజ్జతో, ఎముకలతో నిండి ఉంది. మహాత్ములయిన క్షత్రియు లెంతోమంది అక్కడ దేహత్యాగం చేశారు. గజాలు, గుర్రాల దేహాలు, ఎముకలు పర్వతాలవలె పడి ఉన్నాయి. మనుష్యుల తలలు శంఖాలవలె అంతటా వెదజల్లినట్లున్నాయి. వేలకొద్దీ చితులు, కవచాలు, ఆయుధాలు చిందర వందరగా పడిఉన్నాయి. తినేసి విడిచిన యముని పానశాలలా ఉంది. భూతసంచారం, రక్షోగణ సంచారం కల కురుక్షేత్రం చూస్తూ మహారథులు వెళ్లారు. వెళ్లుతూనే కృష్ణుడు పరశురాముని పరాక్రమం గురించి ధర్మరాజుకు ఇలా చెప్పాడు. "ధర్మజా ! దూరంగా కన్పిస్తున్న ఆ మడుగులను 'రామహ్రదాలు' అంటారు. పరశురాముడు క్షత్రియుల రక్తంతో తన పితృదేవతలకు తర్పణం చేశాడు. పరశురాముడు ఇరవై యొక్క మారులు భూమి మీద క్షత్రియులు లేకుండా చేశాక, అపుడు ఇక్కడే క్షత్రియవధ విరమించాడు." అపుడు ధర్మరాజు ఇలా అడిగాడు. "కృష్ణా ! పూర్వం పరశురాముడు ఇరవై ఒక్క సార్లు భూమి మీద రాజులు లేకుండా చేశాడు" అనికదా చెప్పావు. ఇక్కడ నాకు పెద్ద సందేహం ఉంది. యదుశ్రేష్ఠా ! రాముని చేత క్షత్రియ బీజం దగ్ధమైపోతే మళ్లీ క్షత్రియులు ఎలా పుట్టారు ? అసలు భగవంతుడయిన రాముడు క్షత్రియులను ఎందుకు ఎలా నాశనం చేశాడు ? మళ్లీ వారు ఎలా వృద్ధి చెందారు? గొప్ప రథయుద్ధంచేత కోట్ల కొద్దీ క్షత్రియులు చంపబడ్డారు. ఇపుడు ఆ భూమి మీద క్షత్రియజాతి విస్తరించి ఉంది గదా ? ఇది ఎలా జరిగింది ? అసలు పరశురామునిచేత క్షత్రియ జాతి అంతా ఈ కురుక్షేత్రంలో పూర్వం ఎందుకు చంపబడింది ? గరుడధ్వజా ! నా ఈ

సందేహాన్ని తీర్చు. నీ మాటను మించిన వేదం మాకు ఏదీ లేదు ఉపేంద్రా !" వైశంపాయనుడు అన్నాడు. అపుడు కృష్ణుడు ధర్మరాజుతో 'భూమి ఎలా మళ్లీ క్షత్రియులతో నిండిందో' యథాతథంగా ఇలా చెప్పాడు."

49. పరశురాముని చరిత్రము.

"ధర్మరాజా ! మహర్షులు చెపుతున్నపుడు నేను పరశురాముని ప్రభావమూ, పరాక్రమమూ, అతని జన్మ విన్నాను. అది అంతా చెపుతాను విను. పరశురాముడు కోట్ల కొద్దీ క్షత్రియులను ఎలా చంపాడో, రాజ వంశాల్లో మళ్లీ క్షత్రియులు ఎలా పుట్టారో, భారత యుద్ధంలో ఎలా మరణించారో చెపుతా విను. జహ్నుమహర్షి కొడుకు అజుడు - అతని కొడుకు బలాకాశ్వుడు. అతని కొడుకు ధర్మజ్ఞుడైన కుశికుడు. అతడు భూలోకంలో ఇంద్రునితో సమానుడు. త్రిలోక విజేత అయిన కొడుకును పొందాలని కుశికుడు గొప్పతపస్సు చేశాడు. ఉగ్రతపస్సు చేసే కుశికుని చూసి ఇంద్రుడు 'పుత్రుని పొందటానికి కుశికుడు అర్హుడని భావించి, తానే కుశికునికి గాధి అనే పేరుతో పుత్రుడయ్యాడు. అతనికి సత్యవతి అనే కన్య కలిగింది. గాధి ఆమెను భృగు పుత్రుడయిన ఋచీకునకు భార్యగా ఇచ్చాడు. ఆమె శుచిత్వానికి సంతుష్టుడై ఋచీకుడు ఆమెకూ, గాధికీ కూడా పుత్రులు కలగాలని రెండు చరువులు వండినాడు. ఋచీకుడు భార్యను పిలిచి 'ఈ చరువును నీవు ఉపయోగించు. ఈ చరువును నీ తల్లి భుజించాలి' అన్నాడు. 'లోకంలో ఏ క్షత్రియుడూ గెలవలేని తేజస్సు కల పుత్రుడు ఆమెకు పుడతాడు. అతడు క్షత్రియశ్రేష్ఠులను కూడ నాశనం చేయగలడు. కల్యాణీ ! నీకు కూడా ధైర్యం, శమం, తపస్సు కల బ్రాహ్మణోత్తముని ఈ చరువు కూర్చుతుంది.' భృగుపుత్రుడయిన ఋచీకుడు భార్యతో ఇలా చెప్పి, తపస్సు మీది ఆసక్తితో అడవులకు వెళ్లిపోయాడు.

ఇదే సమయంలో తీర్థయాత్రాపరుడై గాధి మహారాజు భార్యతో కలిసి ఋచీకుని ఆశ్రమానికి వచ్చాడు. సత్యవతి ఆ రెండు చరువులనూ తీసికొని సంతోషంతో భర్తమాటను తల్లికి చెప్పింది. తల్లి పొరపాటున కూతురికి తన చరువునిచ్చి, ఆమె చరువును తాను గ్రహించింది. అపుడు క్షత్రియులను అంతం చేసే గర్భాన్ని సత్యవతి ధరించింది. ఆమె గర్భం చూడటానికి భయంకరంగా ప్రకాశిస్తోంది. అపుడు ఋచీకుడు గర్భంలో ఉన్న బ్రాహ్మణుని చూసి, దేవరూపిణి అయిన భార్యతో ఇలా అన్నాడు. 'చరువులు తారుమారు చేసి నీ తల్లి నిన్ను మోసగించింది. నీ పుత్రుడు క్రూరకర్ముడూ క్రోధీ అవుతాడు. బ్రాహ్మణుడూ, తపస్వీ అయిన తమ్ముడు నీకు కలుగుతాడు. నీ చరువులో మహిమాన్వి

తమయిన బ్రహ్మమునంతా కూర్చాను. నీ తల్లి చరువులో క్షత్రవీర్యమంతా సమకూర్చాను. కాని ఇవి తారుమారు అయ్యాయి గనుక అలా జరుగదు. నీ తల్లికి బ్రాహ్మణుడూ, నీకు క్షత్రియుడూ పుడతారు.' భర్త ఇలా చెప్పగానే సత్యవతి శిరసువంచి అతని కాళ్లపై పడి వణుకుతూ భర్తతో ఇలా అంది. ప్రభూ ! 'బ్రాహ్మణాధముడైన పుత్రుని పొందుతావు' అనే మాట నాతో ఇప్పుడు చెప్పడం సముచితం కాదు.' అపుడు బుచీకుడు ఇలా అన్నాడు. "కల్యాణీ ! నీయందు ఇటువంటి కోరికను నేను సంకల్పించలేదు. చరువు మారినందువల్ల ఉగ్రకర్ముడు పుడుతున్నాడు." అపుడు సత్యవతి ఇలా అంది. "మహర్షీ ! మీరు తలచుకొంటే లోకాలను సహితం సృష్టిస్తారు. కుమారుడెంత ? ప్రభూ ! నాకు శాంత స్వరూపుడూ, సరళ స్వభావుడూ అయిన పుత్రుని అనుగ్రహించండి." బుచీకుడు ఇలా అన్నాడు. "కల్యాణీ ! నేను పరిహాసానికి కూడా ఎన్నడూ అసత్యం పలుకలేదు. మంత్రపూర్వకంగా అగ్నిని నిలిపి చరువు సాధించడంలో వేరే చెప్పాలా ? కల్యాణీ ! నేను ఇంతకుముందే ఈ విషయం తపస్సుచేత తెలుసుకొన్నాను. నీ తండ్రి వంశమంతా బ్రహ్మభూత మవుతుంది."

అపుడు సత్యవతి ఇలా అన్నది. "ప్రభూ ! ఇదే నీకు ఇష్టమయితే నా మనుమడు అటువంటివాడు కావచ్చు. నాకు మాత్రం ప్రశాంత చిత్తుడయిన పుత్రుడే కావాలి." బుచీకుడు అన్నాడు. "పుత్రునికీ మనుమనికీ పెద్దవిశేషం (భేదం) ఏమీ లేదులే. కల్యాణీ ! నీవన్నట్లే జరుగుతుందిలే." వాసుదేవుడన్నాడు. "తరువాత సత్యవతి తపస్సు మీద ఆసక్తి కల్గిన శాంత స్వభావుడూ, నియమశీలుడూ అయిన జమదగ్నిని పుత్రునిగా కన్నది. గాధి విశ్వామిత్రుని కన్నాడు. అతడు బ్రహ్మగుణాలన్నిటితో కూడినవాడు. అతడు తరువాత బ్రహ్మర్షి అయినాడు. బుచీకుడు తపోనిధి అయిన జమదగ్నిని కన్నాడు. ఆ జమదగ్ని భయంకరు డయిన పుత్రుని కన్నాడు. అతడు సర్వవిద్యాపారంగతుడు, ధనుర్వేదమంతా నేర్చినాడు. ప్రజ్వరిల్లే అగ్ని వంటి అతడు క్షత్రియులందరినీ సంహరించాడు. అతడే పరశురాముడు. అతడు గంధమాదన పర్వతం మీద మహాదేవుని తపస్సుతో సంతోషపరచి అస్త్రాలూ, కాంతిమంతమయిన పరశువునూ (గండ్రగొడ్డలిని) పొందాడు. ఆ పరశువు మొక్కవోని అంచులూ, మండుతున్న అగ్నితేజస్సూ, ఊహకు అందని శక్తీ కలిగినది. దానితో అతడు లోకాల్లో సాటిలేని వాడయ్యాడు.

ఇదే సమయంలో గొప్పతేజస్సూ బలమూ కల హైహయవంశపురాజు కృతవీర్యుని కుమారుడు అర్జునుడనే రాజు ఉండేవాడు. ఆ అర్జునునకు దత్తాత్రేయుని అనుగ్రహం వల్ల వెయ్యి చేతులు కలిగాయి. మహాతేజస్వి అయిన ఆ చక్రవర్తి బాహుబలంతోనూ,

అస్త్రబలంతోను ఏడు ద్వీపాలతో, పర్వతాలతో కూడిన భూమినంతా జయించాడు. అతడు ధర్మవేత్త కూడా - అతడు అశ్వమేధ యాగంచేసి తాను జయించిన భూమినంతటినీ విప్రులకు దానం చేశాడు. దప్పిక గొన్న అగ్ని అడిగితే, ఆయనకు సహస్రబాహుడు భిక్ష ఇచ్చాడు. అతడు గ్రామాలను, నగరాలనూ, రాష్ట్రాలనూ, గొల్లపల్లెలనూ భిక్ష ఇచ్చాడు. అగ్నిహోత్రుడు అతని బాణాగ్రాల నుండి ఉద్భవించి, జ్వలించాడు. ఆ పురుషశ్రేష్ఠుడయిన కార్తవీర్యుని ప్రభావంతో అగ్నిహోత్రుడు కొండలనూ, చెట్లనూ కాల్చివేశాడు. హైహయునితో కలిసి, అగ్ని గాలితో విజృంభించి, వసిష్ఠుని శూన్యమయిన ఆశ్రమాన్ని కాల్చివేశాడు. ఆశ్రమం కార్తవీర్యునిచే దగ్ధమయిపోతే, శక్తి సంపన్నుడయిన వసిష్ఠుడు అర్జునుని శపించాడు. "అర్జునా ! నా ఈ మహావనాన్ని కూడా విడవకుండా దగ్ధం చేశావు. అందుచేత పరశురాముడు యుద్ధంలో నీ బాహువులను నరికి వేయును గాక" అని శపించాడు. అర్జునుడు మహాతేజస్వి. బలవంతుడు. నిత్యమూ శమపరుడై ఉంటాడు. బ్రహ్మణ్యుడు. ఇతరులకు శరణ మయినవాడు. దాత. శూరుడూ కూడ. మహాత్ము డయిన వసిష్ఠుడిచ్చిన శాపం గురించి అతడు ఆలోచించనే లేదు. కాని బలవంతు లయిన అతని పుత్రులు, శాపంవల్ల తండ్రి మరణానికి కారకు లయ్యారు. క్రూరాత్ము లయిన కొడుకులు శాపనిమిత్తంగా మరింత పొగరెక్కి పోయారు. వారు జమదగ్ని హోమధేనువు యొక్క దూడను లాక్కు పోయారు. ధీమంతుడూ, హైహయరాజూ అయిన కార్తవీర్యునికి ఈ విషయం తెలియదు. ఈ కారణంగా మహాత్ము డయిన పరశురామునితో యుద్ధం జరిగింది. కోపంతో పరశురాముడు అర్జునుని చేతులను నరికి, అంతఃపురంలో తిరిగే ఆవుదూడను తన ఆశ్రమానికి తీసుకొని వచ్చాడు.

అర్జునుని కొడుకులంతా బుద్ధిహీనులు, మూర్ఖులు. వారంతా కలిసి మహాత్ము డయిన జమదగ్నియొక్క ఆశ్రమానికి వెళ్లారు. అపుడు రాముడు సమిధలు, దర్భలకోసం బయటకు వెళ్లాడు. అర్జునపుత్రులు మహాత్ముడయిన జమదగ్ని శిరస్సును భల్లాగ్రాలతో శరీరం నుండి నరికేశారు. తరువాత క్రోధి అయిన పరశురాముడు తండ్రి వధను తెలిసికొని, వెంటనే "భూమి మీద క్షత్రియులు లేకుండా చేస్తాను" అని ప్రతిజ్ఞచేసి, శస్త్రం పట్టాడు. వెంటనే పరశురాముడు పరాక్రమించి కార్తవీర్యుని పుత్రులనూ, మనుమలనూ అందరినీ సంహరించాడు. పరమక్రోధి అయిన పరశురాముడు వేలకొద్ది హైహయరాజులను సంహరించి, భూమి అంతా రక్తపు బురదతో నింపివేశాడు. ఇలా వెంటనే భూమిని క్షత్రియరహితం చేసి, పరశురాముడు మిక్కిలి కరుణ కలిగి వనానికి వెళ్లిపోయాడు. కొన్ని వేల ఏళ్లు గడిచాక సహజంగానే క్రోధి అయిన పరశురామునికి నింద కలిగింది. (రాముడు అశక్తుడని ప్రజలు నింద వేశారు.) విశ్వామిత్రుని పౌత్రుడూ, రైభ్యుని కొడుకూ,

మహాతపస్వి అయిన పరావసువు ప్రజల సమావేశంలో నిందిస్తూ ఇలా అన్నాడు. 'రామా ! యయాతి మహారాజు పడినప్పుడు యజ్ఞానికి వచ్చిన ప్రతర్దనుడు మొదలగు వారు క్షత్రియులు కారా ? నీ ప్రతిజ్ఞ చెడిపోయింది. ఇంకా నీవు జనసమావేశాల్లో గొప్పలు చెపుతున్నావు. క్షత్రియ వీరులకు భయపడి, కొండలను ఆశ్రయించావు. ఆ భూమి ఇపుడు అంతటా వందలమంది రాజులతో నిండి ఉంది.' పరావసుని మాటలు విని, పరశురాముడు మళ్లీ శస్త్రం పట్టాడు. పూర్వం అతడు విడిచిపెట్టిన రాజులు వందల కొద్దీ పెరిగి, బలవంతులై భూపతు లయ్యారు. అతడు మళ్లీ బాలురతో సహా అందరినీ చంపాడు. కాని గర్భంలో ఉన్నవారిని చంపలేదు. వారి పుట్టుకతో మళ్లీ క్షత్రియకులం వ్యాప్తిచెందింది. అపుడు రాముడు పుట్టిన వాళ్లను పుట్టినట్లుగా మళ్లీ చంపాడు. కాని కొంతమంది క్షత్రియస్త్రీలు తమ పిల్లలను కాపాడుకొన్నారు. ఇట్లా రాముడు ఇరవై ఒక్క సారులు భూమిని క్షత్రియరహితం చేసి, అశ్వమేధయాగం చేసి, ఆ యాగం చివర భూమినంతా కశ్యపునకు దక్షిణగా ఇచ్చాడు. స్రుక్కు పట్టిన చేతితో చూపిస్తూ కశ్యపుడు క్షత్రియులను మిగల్చడంకోసం రామునితో ఇలా అన్నాడు. 'మహామునీ ! దక్షిణ సముద్ర తీరానికి వెళ్లు. నా దేశంలో నీ వెప్పుడూ ఉండకూడదు' అన్నాడు. అపుడు సముద్రుడు పరశురాముని కోసం త్వరగా శూర్పారక దేశం నిర్మించాడు. అదే అపరాంత భూమి అని పిలువబడుతోంది. కశ్యపుడు తాను దానం పట్టిన భూమిని బ్రాహ్మణుల కిచ్చి అడవికి వెళ్లిపోయాడు.

తరువాత శూద్రులూ, వైశ్యులూ ఇష్టం వచ్చినట్లు విప్రోత్తముల భార్యలతో స్వేచ్ఛగా ప్రవర్తింపసాగారు. జీవలోక మంతా అరాజకమయిపోయింది. బలవంతులు బలహీనులను పీడింపసాగారు. విప్రు లెవరికీ ప్రభుత్వం లేకపోయింది. ఇలా దురాత్ములచేత పీడింప బడుతూ, కొంతకాలానికి ధర్మాన్ని యథావిధిగా రక్షించవలసిన క్షత్రియుల రక్షణలేక భూమి పాతాళానికి క్రుంగిపోయింది. భయంతో క్రుంగిపోయే భూమిని చూసి, మనసుకరిగి పెద్దమనసుతో కశ్యపుడు భూమిని తన తొడమీద ధరించాడు. అతడు ఊరువుమీద నిలిపాడు కాబట్టి భూమికి 'ఉర్వి' అని పేరు వచ్చింది. అపుడు భూమి తనకు రక్షణ కల్పించుమని కశ్యపుని ప్రార్థించింది. ఆమె కశ్యపుని ప్రసన్నుని చేసుకొని 'రాజు నిమ్ము' అని వేడుకొంది. పృథివి ఇలా అంది. "బ్రాహ్మణా ! హైహయవంశంలో పుట్టిన క్షత్రియ పుంగవులను నేను స్త్రీలలో దాచాను. మహర్షీ ! వారు నన్ను రక్షిస్తారు. ప్రభూ ! విదూరథుని పుత్రుడు పౌరవుని జ్ఞాతి ఒకడు ఉన్నాడు. అతనిని ఋక్ష పర్వతం మీద ఎలుగుబంట్లు రక్షించాయి. అలాగే బలవంతుడూ, యజ్వ అయిన పరాశరుడు

కరుణతో సౌదాసుని జ్ఞాతిని రక్షించాడు. ఆ ద్విజుడు, పరాశరునికి శూద్రుని వలె, అన్ని పనులూ చేసి పెట్టడం వలన "సర్వకర్ముడని" పేరు వచ్చింది. అతడు నన్ను రక్షించుగాక. అలాగే శిబిపుత్రుడు మహాతేజస్వి. అతడు అడవిలో ఆవులతో పాటు పెరిగాడు. వాని పేరు గోపతి. అతడు నన్ను రక్షించుగాక ! ప్రతర్దనుని కొడుకు వత్సుడని ఒకడున్నాడు. అతడు ఆవుదూడలతో కలిసి గోశాలలో పెరిగాడు. అతడు మహాబలుడు. ఆ రాజు నన్ను పరిపాలిస్తాడు. దధివాహనుని పౌత్రుడు, దివిరథుని పుత్రుడు ఒకడున్నాడు. గంగాతీరంలో గౌతముడు రహస్యంగా అతనిని రక్షించాడు. గొప్ప తేజస్సూ, సువర్ణ సంపద కల బృహద్రథు డున్నాడు. అతనిని గృధ్రకూట పర్వతంమీద కోతులు రక్షించాయి. మరుత్తుని వంశంలో కూడా క్షత్రియకుమారు లున్నారు. వారు పరాక్రమంలో ఇంద్రసమానులు. వారిని సముద్రుడు రక్షించాడు. ఈ క్షత్రియబాలకులంతా అక్కడక్కడ ఉన్నారు. శిల్పకార, సువర్ణకార జాతుల నాశ్రయించి ఉన్నారు. వీరు నన్ను రక్షిస్తే నేను నిశ్చలంగా నిలుస్తాను. వీరి తండ్రులూ, తాతలూ నాకోసమే రాముని చేత యుద్ధంలో చంపబడ్డారు. మహర్షీ ! నేను వారి ఋణం తీర్చుకోవాలి. అందుచేత ఆ వంశస్థులకు సత్కారం చెయ్యాలి. నేను కూడా ధర్మాతిక్రమణం చేసేవారి రక్షణ కోరను. ఉన్న దానితో సంతృప్తిపడతాను. అది వేగంగా చేకూర్చు." వాసుదేవుడు చెప్పాడు. "అపుడు భూదేవి చెప్పిన వారినందరినీ కశ్యపుడు తీసుకొని వచ్చి, మహావీర్య లయిన రాజులుగా అభిషేకించాడు. వారి పుత్రులూ, పౌత్రులే ఇపుడున్న రాజవంశాలు. ధర్మరాజా ! నీవడిగిన దాని పూర్వచరిత్ర ఇది. వైశంపాయనుడు చెప్పాడు. కృష్ణుడు ధర్మరాజుతో ఇలా చెపుతూ, సూర్యభగవానునివలె దిక్కులంతటా వెలుగులు నింపుతూ రథం మీద వెళ్లాడు."

50. శ్రీకృష్ణుడు భీష్ముని గుణప్రభావములను వర్ణించుట.

వైశంపాయనుడు చెప్పాడు. "పరశురాముని కృత్యాన్ని విని ధర్మరాజు చాలా ఆశ్చర్యపడి శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు. "కృష్ణా! మహాత్ముడయిన రాముని పరాక్రమం ఇంద్రుని పరాక్రమం వంటిది. అతడు క్రోధంతో భూమిని క్షత్రియ రహితం చేశాడు. పరశురాముని భయంతో ఉద్విగ్నులయిన క్షత్రియుల వంశాంకురాలను గోవులు, సముద్రం, కొండముచ్చులు, ఎలుగుబంట్లు, కోతులూ రక్షించాయి. ఆహా! మనుష్యలోకం ధన్యమైంది. నరులంతా భాగ్యశాలు లయ్యారు. ఆ కశ్యప బ్రాహ్మణుడు ఇటువంటి ధర్మకృత్యం చేశాడు గదా! ఇలా చెప్పుకొంటూ, కృష్ణధర్మజులు భీష్ముడున్న అంపశయ్య దగ్గరకు వెళ్లారు. అక్కడ అంపశయ్య మీద శయనించి ఉన్న భీష్ముని చూశారు. అపుడు భీష్ముడు

తన కిరణసమూహంతో ఆవరింపబడిన సాయంకాల సూర్యునివలె ఉన్నాడు. దేవతలు ఇంద్రుని కొలుస్తున్నట్లు, మునీశ్వరులు భీష్ముని సేవిస్తూ, ఓఘవతీ నదీ తీరంలో పరమధర్మిష్ఠమైన ప్రదేశంలో ఉన్నారు. కృష్ణుడూ, ధర్మరాజూ, మిగిలిన నలుగురు పాండవులూ, కృపాదులు దూరాన్నుంచే భీష్ముని చూశారు. తమ తమ వాహనాలు దిగారు. జారిపోయే మనసును బిగబట్టి, ఇంద్రియాలను ఒకచోటికి చేర్చి మహర్షులను సమీపించారు. గోవిందుడూ, సాత్యకి, ఇతర రాజన్యులూ వ్యాసాది మహర్షులకూ, భీష్మునికీ నమస్కరించారు. అలా శయనించి ఉన్న వృద్ధుడైన భీష్ముని, యాదవకౌరవ శ్రేష్ఠులంతా చూసి, అందరూ చుట్టూ చేరి, కూర్చున్నారు. అపుడు కృష్ణుడు కొద్ది దీనమనసుతో భీష్మునికి తన్నెరిగించుకొని, ఆరిపోయే అగ్నిహోత్రునివలె ఉన్న భీష్మునితో ఇలా అన్నాడు. 'ప్రవాచకోత్తమా! నీకు పూర్వం వలె జ్ఞాన విషయాలన్నీ ప్రసన్నంగా ఉన్నాయా? నీ బుద్ధి కలుషం కాకుండా ఉందా? బాణపు దెబ్బల బాధతో నీ దేహం నొప్పి పెట్టటం లేదు కదా? మనోదుఃఖం కంటె శరీరవేదన బలవత్తరమయినది గదా! ధర్మనిత్యుడు, తండ్రి అయిన శాంతనుడు ఇచ్చిన వరం వల్ల స్వచ్ఛంద మరణం పొందుతున్నావు. ఇది నీ తండ్రి వరదానమే కాని నాదేమీలేదు. (ఇట్టి స్వచ్ఛంద మరణమనే తండ్రి అనుగ్రహం నాకు కూడా లేదు) రాజా! శరీరంలో చిన్నములు దిగితేనే ఎంతో బాధ కలుగుతుంది. ఇన్ని బాణసమూహాలు గుచ్చుకొన్న నీ విషయం వేరే చెప్పాలా? ప్రాణుల జననమరణాలను గురించి అన్నీ నీవే ఎరుగుదువు. దేవతలకు కూడ చెప్పగలవు. అటువంటి నీకు మేము చెప్పనక్కరలేదు.

భీష్మా ! నీవు జ్ఞానవృద్ధుడవు. భూత, భవిష్య ద్వర్తమానాలన్నీ నీ బుద్ధిలో నిలిచాయి. ప్రాణుల వినాశమూ, ధర్మఫలం కలిగే సమయమూ అంతా నీకు తెలుసును. నీవు మహాప్రాజ్ఞుడవు. ధర్మమయ మయిన పెద్ద నిధివి. సమృద్ధమైన రాజ్యమందున్నట్లు, పరిపూర్ణమయిన అవయవాలతో, రోగం లేకుండా ఉన్నట్లు, వేలకొలదీ స్త్రీలతో నిండినా, ఊర్ధ్వరేతసునిగా (బ్రహ్మచారిగా) ఉన్న నిన్ను చూస్తే అనిపిస్తోంది నాకు. మూడులోకాల్లోనూ సత్యధర్ముడు, మహావీర్యుడు, శూరుడు, ధర్మైకతత్పరుడు, శరతల్పంమీద ఉన్నవానిని భీష్మునికంటె మరియొకనిని చూడలేదు. అతడు తపస్సుతో మరణాన్ని నిలిపి వేశాడు. సత్యం, తపస్సు, దానం, యజ్ఞం వీనిని ఆచరించడంలో; ధనుర్వేదం, వేదం, నీతి అనేవాని రక్షణంలోను, అనృశంసత, శుచిత్వం, నిగ్రహం, సర్వభూత దయ కలవారిలోను నీవంటి మహారథుని మరియొక్కనిని ఎవరినీ మేము వినలేదు. గంధర్వులను, దేవతలను, అసురులను, యక్షులను, రాక్షసులను ఎవరిసాయమూ లేకుండా ఒక్కరథంతో నీవు గెలవగలవు. సందేహం లేదు. అటువంటి నీవు వసువులలో వాసవునితో సమానుడవు.

వసువుల అంశలతో కూడిన తొమ్మిదవ వసువు వనీ, గుణాలచేత వారికి ఏమీ తగ్గని వాడ వనీ నిత్యమూ నిన్ను విప్రులు ప్రశంసిస్తారు. నేనూ నిన్ను బాగా ఎరుగుదును. నీవు పురుషులలో మంచివాడవు. దేవతలలోకూడ నీవు ప్రసిద్ధుడవు. శక్తిలో నీవు పురుషోత్తముడవు. మనుజేంద్రా! నీగుణాల వంటి గుణాలతో కూడిన పురుషుని, భూమి మీద ఎక్కడా మరొకనిని చూడలేదు, వినలేదు. రాజా! నీవు సర్వగుణాల్లోనూ దేవతలను కూడా మించిపోయావు. నీవు తపస్సుతో చరాచర లోకాలను కూడా సృష్టింపగలవు.

ఇక ఉత్తమగుణాలతో ఉత్తమలోకాలను సృష్టించుకోగలవని వేరే చెప్పవలెనా? అందుచేత భీష్మా! జ్ఞాతులంతా చనిపోవడంతో దుఃఖంతో కుమిలిపోతున్న ధర్మజుని శోకం తొలగించు. నాలుగు వర్ణాల వారికీ, నాలుగు ఆశ్రమాల వారికీ చెప్పబడిన ధర్మాలన్నీ నీకు తెలుసును. చతుర్విద్యలకూ, నాలుగు యజ్ఞాలకూ సంబంధించిన ధర్మాలన్నీ నీకు తెలుసును. యోగంలోను, సాంఖ్యంలోను నియతాలైన సనాతన ధర్మాలన్నీ నీవెరుగుదువు. నాలుగు వర్ణాల ధర్మాలూ మంచి వ్యాఖ్యానంతో అన్వయిస్తే, ఎలా పరస్పర విరుద్ధంగా ఉండవో నీకు తెలుసు. ప్రతిలోమంగా ఏర్పడిన వర్ణాల గురించి, వానిలో పుట్టిన వారిని గురించి, దేశజాతికులాల గురించిన ధర్మలక్షణం నీవు ఎరుగుదువు. వేదం చెప్పిన ధర్మమూ నీకు తెలుసు. శిష్టులు చెప్పిన ధర్మమూ నీకు తెలుసును. ఇతిహాసాల యొక్క, పురాణాల యొక్క అర్థం పూర్తిగా నీకు తెలుసు. ధర్మశాస్త్రం అంతా నిత్యమూ నీ మనసులోనే ఉంటుంది. లోకంలో ఉన్న సందేహాలన్నిటికీ నీవు తప్ప తీర్పరి మరొకడు లేడు. అంతటి నీవు ధర్మజుని మనసులో కలిగిన శోకాన్ని నీ బుద్ధి బలంతో తీసివేయుము. విస్తరించిన బుద్ధి వైభవం కల మీవంటి వాళ్లే మోహంలో పడిపోతున్న నరునికి శాంతి చేకూరుస్తారు.

51. శ్రీకృష్ణ వాక్యము.

వైశంపాయనుడన్నాడు. మంతుడయిన వాసుదేవుని మాటవిని, భీష్ముడు ముఖం కొద్దిగా పైకెత్తి అంజలిఘటించి ఇలా పలికాడు. భీష్ముడు పలికాడు. "భగవంతుడా! నమస్సు. కృష్ణా! లోకాల ఉత్పత్తి వినాశాలకు కారణమైనవాడా! నీకు నమస్కారం. హృషీకేశా! నీవే కర్తవు, సంహర్తవు. పరాజయం ఎరగనివాడవు. విశ్వకర్మా! విశ్వాత్మా, విశ్వసంభవా! నీకు నమస్కారం. పంచభూతాలకూ, సమస్త ప్రాణులకూ ఆవల ఉన్న నీవే వానికి మోక్షరూపుడవు. ముల్లోకాలలోపలనూ, వెలుపలా కూడా ఉన్నయోగేశ్వరునకు నమస్కారం. అందరికీ ఆధారం నీవే కదా! పురుషోత్తమా! అంతా నన్నే ఆశ్రయించి ఉందని నీవు

చెప్పావు కదా! అందుచేత మూడు మార్గాల్లోనూ నీ దివ్యభావాలనే చూస్తున్నాను. గోవిందా! ఆ నీ సనాతన రూపం కూడ నేను చూస్తున్నాను. అమితతేజస్సు గల వాయురూపంతో నీవు ఊర్ధ్వలోకాలను ఏడింటిని వ్యాపించిఉన్నావు. ఆకాశమంతా నీ శిరసుతో నిండిపోయింది. పాదాలతో భూదేవి నిండింది. భుజాలతో దిక్కులు నిండిపోయాయి. నీకు సూర్యుడు కన్ను అయ్యాడు. నీ వీర్యమందు శుక్రుడు నిలుప బడ్డాడు. నీరూపం అతసీపుష్పంతో సమానంగా ఉంది. పచ్చని వస్త్రం ధరించావు. చ్యుతి లేనిది నీ దేహం. దాన్ని మెరుపుతో కూడిన మేఘంలా భావిస్తున్నాం. పుండరీకాక్షా! నీదే భారమని నమ్మిన భక్తుడిని. ఉత్తమగతి పొందాలని భావిస్తున్నాను. నాకేది శ్రేయస్కరమో దానిని మనసా భావించు."

అపుడు వాసుదేవుడు ఇలా అన్నాడు. "పురుషపుంగవా! నాయందు ఉత్తమమైన భక్తి ఉంది. అందువల్లనే నాదివ్యదేహం నీకు చూపించాను. నాయందు భక్తిలేనివానికీ, భక్తుడయినా ఋజుస్వభావం లేనివానికీ, శాంతతలేని వానికీ నేను ఎన్నడూ దర్శన మివ్వను. నీవయితే నా భక్తుడవు. సదా ఋజుస్వభావం కలవాడవు. శమదమాలు, తపస్సు, సత్యం, దానం వీనిలో శ్రద్ధకల పవిత్రుడవు. భీష్మా! నీ తపస్సు చేతనే నీవు నన్ను చూడటానికి అర్హుడవు. పునరావృత్తి లేని లోకాలు నీకోసం సిద్ధంగా ఉన్నాయి. భీష్మా! నీ జీవితం ఇంకా అరవై అయిదు రోజులు మిగిలి ఉంది. తరువాత ఈ శరీరం వదిలి నీ శుభకర్మలకు తగిన ఉత్తమ లోకాలకు వెడతావు. వీరే దేవతలూ, వసువులూ అంతా అగ్ని సమానమైన తేజస్సుతో విమానాలెక్కి అదృశ్యరూపులై, నీ కోసమూ, ఉత్తర దిక్కుకు చేరే సూర్యుని కోసమూ ఎదురు చూస్తున్నారు. సూర్యభగవానుడు కాలానుసారంగా ఉత్తర దిక్కువైపు తిరిగితే (ఉత్తరాయణం వస్తే) భీష్మా! నీవు జ్ఞానివలె మరలిరాని లోకాలకు వెళ్లిపోతావు. (పునరావృత్తి లేని లోకాలకు వెడతావు) భీష్మా! నీవు ఈలోకం విడిచి వెళ్లిపోతే, జ్ఞానాలన్నీ ఒక్కసారిగా నశించిపోతాయి. అందుకే ధర్మం వివేచనాత్మకంగా తెలుసు కొనటానికి అందరూ నీదగ్గరకు చేరుకొన్నారు. జ్ఞాతిశోకంతో ధర్మజుని విజ్ఞానం తరిగిపోయింది. కాని అతడు సత్యదీక్ష కలవాడు. అతనికి ధర్మార్థాలతోనూ, యోగంతోనూ కూడిన సత్యాన్ని ఉపదేశించు. అతని శోకం తొలగించు."

52. యుధిష్ఠిరాదుల ఆగమనము.

వైశంపాయనుడు చెపుతున్నాడు. "ధర్మార్థాలతో కూడి, హితమయిన కృష్ణుని మాట విని, భీష్ముడు అంజలిఘటించి, ఇలా అన్నాడు. 'లోకనాథా! మహాబాహూ! శివా! నారాయణా! అచ్యుతా! నీ మాట విని ఆనందంలో తేలియాడుతున్నాను. ఆహా! నీ

ఎదుట నేను ఏం మాటలు చెప్పగలనయ్యా! ఎందుకంటే, వాక్కులలోని సారమంతా వేదమయ మయిన నీ వాక్కులలోనే నిలిచి ఉంది. అందరికీ ప్రియమైన పరలోకంలోనూ, ఈ లోకంలోనూ చేయదగినపని కాని, చేయబడుతున్న పని కాని అంతా జ్ఞానస్వరూపుడవయిన నీవల్లనే వెలువడుతోంది. ఇంద్రుని దగ్గర దేవలోకం గురించి చెప్పే సాహసం చేసేవాడే. నీ ముందు ధర్మ అర్థ కామ మోక్షాలను గురించి చెపుతాడు. కృష్ణా! బాణాలు గ్రుచ్చుకొని నా మనసు వ్యథ చెందింది. అవయవాలు శిథిలమయిపోతున్నాయి. బుద్ధి కూడా ప్రసన్నంగా లేదు. గోవిందా! విషయంతోనూ, అగ్నితోనూ సమానమైన బాణాలు నన్ను బాధిస్తున్నాయి. మాట్లాడేందుకు నాకు కొంచెం కూడా ప్రతిభ లేదు. నాకు బలం సన్నగిల్లిపోతోంది. ప్రాణాలు పోవటానికి త్వరపెడుతున్నాయి. ఆయువు పట్లు బాగా బాధిస్తున్నాయి. చిత్తంనిలుకడ పోతోంది. కృష్ణా! నా శరీరంలో బలహీనతచేత మాట కూడా తడబడుతోంది. నేను ఎలా చెప్పగలుగుతాను? నాయందు అనుగ్రహం చూపించు. అచ్యుతా! నను క్షమించు. కొద్దిగా కూడా మాట్లాడలేను. నీ ముందు మాట్లాడటానికి బృహస్పతి కూడా వెనుకాడుతాడు గదా! మధుసూదనా! నాకు దిక్కులు తెలియటం లేదు. ఆకాశం కాని భూమి కాని తెలియటం లేదు. కేవలం నీ ప్రభావంతో ఉన్నాను. అందుచేత ధర్మరాజుకు హితమైనది నీవే చెప్పదగును. వేదాలకే నీవు వేదానివి కదా! నిత్యుడవూ, లోకకర్తవూ అయిన నీవుండగా, నావంటివాడు ఎలా చెపుతాడు? గురువు ఎదుట శిష్యుడు చెప్పినట్లు ఉంటుంది."

ఆపుడు వాసుదేవుడు చెప్పాడు. "శారీర, మానసిక బలాలు రెండూ కలిగిన స్థిరుడై, సర్వార్థాలను దర్శింపగల భీష్మునికి ఇలా మాటాడటం తగినదే. గాంగేయా! బాణపు దెబ్బల బాధ గురించి నీవు నన్ను అడిగావు గదా! నా అనుగ్రహపూర్వకమయిన వరం గ్రహించు. గాంగేయా! నీకు అలసత కాని, మూర్ఛకాని, దాహం కాని, జ్వరం కాని, ఆకలి దప్పులు కాని కలుగవు. అనఘా! జ్ఞానాలన్నీ నీకు సమగ్రంగా స్ఫురిస్తాయి. నీ బుద్ధి ఎపుడూ క్షీణించదు. మేఘాలు తొలగిన చంద్రునివలె, నీ మనస్సు రజస్తమోగుణాలు తొలగిన సత్త్వగుణంలోనే సదా స్థిరంగా నిలుస్తుంది. ధర్మ, అర్థసహితమైన విషయాన్ని నీవు చింతించినపుడు నీ బుద్ధి ముందుగా, త్వరగా అందుకొంటుంది. సమగ్రంగా నిలుస్తుంది. రాజశార్దూలా! నాల్గు విధాలయిన ప్రాణి సముదాయాన్ని ఈ దివ్య దృష్టితో చక్కగా చూడగలుగుతావు. నడుస్తున్న ప్రజాసముదాయాన్నంతటినీ, నిర్మలమైన నీటిలో చేపను చూసినట్లు, జ్ఞాననేత్రంతో తత్త్వంతో సహా చూడగలవు."

వైశంపాయనుడు ఇలా చెప్పాడు. "తరువాత వ్యాసునితో సహా మహర్షులందరూ ఋగ్యజుస్సామవేద సహితాలైన వాక్కులతో కృష్ణుని అర్చించారు. తరువాత కృష్ణుడూ,

భీష్ముడూ, పాండవులూ ఉన్నచోట అన్ని ఋతువులలో పూసే దివ్యమయిన పూల వాన ఆకాశం నుండి కురిసింది. అప్సరసల సమూహాలు సర్వవాద్యాలతో పాటలు పాడారు. అక్కడ ఎవరికీ అహితంకాని, అనిష్టం కాని కొంచెమయినా కనిపించలేదు. అన్ని సువాసనలతో నిండి, శుచియై శుభంకరమూ, సుఖకరమూ అయిన వాయువు వీచింది. దిక్కులు ప్రశాంతమయ్యాయి. ప్రశాంతంగా మృగాలూ, పక్షులూ విహరించాయి. కొద్దిసేపటిలో, సహస్ర కిరణుడయిన సూర్యుడు ఒంటరిగా అడవిని దహిస్తున్నాడా అన్నట్లు పడమటి దిక్కున కనిపించాడు (ఎర్రగా కనపడ్డాడు). వెంటనే మహర్షులంతా లేచి జనార్దనునికి, భీష్మునికి, ధర్మరాజుకూ 'వెళ్లివస్తాం' అని చెప్పారు. అపుడు పాండవులతో సహా కృష్ణుడూ, సాత్యకి, సంజయుడు, కృపుడు ఆ మహర్షులకు ప్రణామం చేశారు. ధర్మాసక్తి కల ఋషులందరూ పాండవులచే పూజింపబడి "రేపు కలుద్దాం" అని చెప్పి త్వరగా, యథేచ్ఛగా వెళ్ళారు. అలాగే కృష్ణుడూ, పాండవులూ వెళ్లి వస్తామని భీష్మునికి చెప్పి, భీష్మునికి ప్రదక్షిణంగా తిరిగి శుభప్రదమైన రథాలెక్కారు. విచిత్ర కూబరాలు కలిగి, కొండలవంటి రథాలతో, మదపుటేనుగులతో, గరుత్మంతునివలె వేగంగా వెళ్లే గుర్రాలతో, శరాసనాలు దాల్చిన కాల్బలంతో వారంతా బయలుదేరారు.

రథాలకు ముందూ, వెనుకా పొడవుగా వెళ్లే ఆసేన ఋక్షవంతమనే పర్వతానికి ముందూ, వెనుకా ప్రవహించే నర్మదా నదివలె కనపడింది. సూర్యుడు త్రాగివేసిన రసం కల ఓషధీలతకు మళ్లీ జీవం పోస్తూ, ఆ సేనలకు ఆనందం చేకూరుస్తూ చంద్రుడు ఉదయించాడు. శ్రీకృష్ణుడూ, పాండవులూ ఇంద్రనగరంలాంటి వెలుగులున్న తమ పట్టణంలో ప్రవేశించి, శ్రమించిన సింహాలు గుహల్లో ప్రవేశించినట్లు తమ తమ భవనాల్లో ప్రవేశించారు.

53. కృష్ణాదులు భీష్ముని కడకు చేరుట.

వైశంపాయనుడు చెపుతున్నాడు. "తరువాత కృష్ణుడు తల్ప మెక్కి నిద్రించాడు. అరజాములో తెల్లవారుతుం దనగా మేల్కొన్నాడు. మాధవుడు ధ్యానమార్గంలో ప్రవేశించి, జ్ఞానాలన్నీ పరిశీలించి, తరువాత సనాతన బ్రహ్మమును ధ్యానించాడు. పిమ్మట స్తుతి, పురాణాలు తెలిసి సుశిక్షితులైన స్తోత్రపాఠకులు విశ్వకర్మ, ప్రజాపతీ అయిన వాసుదేవుని చక్కని కంఠంతో స్తుతించారు. వైతాళికులు (చేతితో తాళం వేస్తూ పాడేవారు) మేలుకొలుపు స్తోత్ర పాఠం చేస్తున్నారు. గాయకులు పాడుతున్నారు. వేలకొద్దీ శంఖాలను, మృదంగాలను మ్రోగిస్తున్నారు. వీణలు, పణవాలు, వేణువుల స్వరాలు, నవ్వుల వలె మనోహర స్వరాలు కృష్ణుని భవనంలో వ్యాపించాయి. తరువాత ధర్మజుని భవనంలో

కూడా, మంగళపాఠాలతో కూడిన గీతవాద్యాల ధ్వనులు మధురంగా విజృంభించాయి. కృష్ణుడు లేచి, స్నానంచేసి, అంజలించి, మౌనంగా మంత్రజపం చేసి, అగ్నికార్యం చేశాడు. తరువాత చతుర్వేదాలు తెలిసిన విప్రులకు వేయిమందికి, ఒక్కొక్కరికి వేయి ఆవుల చొప్పున శ్రీకృష్ణుడు చదివించాడు. మంగళద్రవ్యాలు స్పృశించి, అద్దంలో తన ముఖం చూసుకొని కృష్ణుడు సాత్యకితో ఇలా అన్నాడు. "సాత్యకీ! రాజభవనానికి వెళ్లి ధర్మరాజు భీష్ముని దర్శించటానికి సిద్ధంగా ఉన్నాడో, లేదో తెలుసుకో." కృష్ణుని మాట విని సాత్యకి త్వరగా వెళ్లి, ధర్మరాజును చేరి, ఇలా అన్నాడు. "ధీమంతుడయిన కృష్ణుని రథం సిద్ధమయింది. కృష్ణుడు భీష్ముని దగ్గరకు బయలుదేరుతున్నాడు. ధర్మరాజా! కృష్ణుడు నీకోసం ఎదురుచూస్తున్నాడు. తరువాతి పని మీరు చేయవచ్చును." ఈ మాట విని ధర్మరాజు ఇలా అన్నాడు.

"అర్జునా! శ్రేష్ఠమయిన నా రథం సిద్ధం చెయ్యి. సైనికులతో వద్దు. మనమే వెడదాం. ధార్మికుడయిన భీష్ముని మనం ఇబ్బంది పెట్టకూడదు. అందుచేత మనముందు నడిచే పరివారాన్ని కూడా వెనుకకు మళ్లించు. ఈనాటి నుండి భీష్ముడు ధర్మరహస్యాలు చెపుతాడు. అందుచేత వివిధ జనులు రావడం నా కిష్టం లేదు." వైశంపాయనుడు చెప్పాడు. "ధర్మజుని మాట విని అర్జునుడు 'రథం సిద్ధం చేయబడింది' అని చెప్పాడు. వెంటనే ధర్మరాజు, కవలలు, భీమార్జునులూ పంచభూతాల్లా కృష్ణుని భవనానికి వెళ్లారు. పాండవులు రాగానే, కృష్ణుడు సాత్యకితో సహా రథ మెక్కాడు. రథాల మీద నుంచే, వారంతా పరస్పరం రాత్రి సుఖంగా గడిచిందా అని పలుకరించుకొన్నారు. మేఘధ్వని వంటి ధ్వని చేసే రథాల మీద వారంతా బయలు దేరారు. వలాహకం, మేఘపుష్పం, శైబ్యం, సుగ్రీవం అనే వాసుదేవుని గుర్రాలను దారుకుడు తోలుతున్నాడు. ఆ గుర్రాలు దారుకునిచే తోలబడుతూ, గిట్టలచివరలతో భూమిని స్పృశిస్తూ వెడుతున్నాయి. అవి ఆకాశాన్ని మ్రింగుతున్నాయా అన్నంత వేగంగా వెళ్లి, ధర్మాని కంతకూ క్షేత్రమయిన కురుక్షేత్రానికి వచ్చి ఆగాయి. తరువాత వారందరూ, శరతల్పగతుడై మహర్షులతో పరివేష్టింపబడియున్న భీష్ముని చేరారు. అతడు దేవగణాలతో పరివృతుడైన బ్రహ్మదేవుని వలె ఉన్నాడు. అపుడు గోవిందుడు, ధర్మరాజు, భీముడు, అర్జునుడు, కవలలు, సాత్యకి రథాలు దిగి, కుడిచేతులెత్తి ఋషులను పూజించారు. నక్షత్ర పరివృతుడయిన చంద్రుని వలె, ధర్మరాజు వారందరితో కలిసి, ఇంద్రుడు బ్రహ్మదేవుని చేరినట్లు భీష్ముని దగ్గరకు వచ్చాడు. క్రిందకు పడిన సూర్యుని వలె అంపశయ్య మీద శయనించి ఉన్న భీష్ముని ధర్మరాజు భయంతో తత్తరపడుతూ దర్శించాడు."

54. భీష్మ శ్రీకృష్ణుల సంభాషణము.

జనమేజయుడు ఇలా ప్రశ్నించాడు. "ధర్మాత్ముడు, శక్తి సంపన్నుడూ, సత్యసంధుడు, జితాత్ముడూ అయిన భీష్ముడు శరతల్పం అనే వీరశయనం మీద పవళించి, పాండవుల సేవలు స్వీకరిస్తూ ఉన్నాడు గదా! గంగాశంతనుల పుత్రుడయిన భీష్ముడు ఆ వీరులతో సమావేశమై, సర్వసైన్యాలూ నశించిన ఆ ప్రదేశంలో ఏవీ విశేషాలు జరిగాయో మహర్షీ ! నాకు చెప్పుం." వైశంపాయనుడు చెపుతున్నాడు. "కురుశ్రేష్ఠుడయిన భీష్ముడు అంపశయ్యపై ఉన్నపుడు, నారదుడు మొదలయిన మహర్షులూ, సిద్ధులూ వచ్చారు. చావగా మిగిలిన రాజులు, ధర్మరాజు, ధృతరాష్ట్రుడు, కృష్ణుడు, భీమార్జున నకుల సహదేవులూ వచ్చి, నేలపై పడిన సూర్యునివలె పడి ఉన్న భీష్ముని చేరి, శోకించారు. కొద్దిసేపు మౌనం వహించి దేవర్షి అయిన నారదుడు పాండవులతో, హతశేషులయిన రాజులతో ఇలా అన్నాడు. "ధర్మజా! ఇప్పటికి తగిన కర్తవ్యం చెపుతున్నాను. భీష్ముని నీవు (ధర్మము - బ్రహ్మము గురించి) పరిప్రశ్న చెయ్యి. ఈ గంగా పుత్రుడు సూర్యభగవానునివలె అస్తమిస్తున్నాడు. ఈయన ప్రాణాలను విడిచిపెట్టాలనుకొంటున్నాడు. మీరంతా అడగవలసినవి అడగండి. చతుర్వర్ణాలకు సంబంధించిన ధర్మాలన్నీ ఇతడు పూర్తిగా ఎరుగును. ఇతడు పెద్దవాడు, శరీరం విడిచి పరలోకాలకు వెడుతున్నాడు. మీ మనసులోని సంశయాలన్నీ, వెంటనే అడిగి తీర్చుకోండి." వైశంపాయనుడు అన్నాడు. "నారదుడు ఇలా అనగానే రాజులందరూ, భీష్మునికి దగ్గరగా వచ్చారు కాని ఆయనను ఏమీ అడగలేకపోయారు. ఒకరి మొగాలు ఒకరు చూసుకొంటూ నిలిచారు.

అపుడు ధర్మరాజు కృష్ణునితో ఇలా అన్నాడు. "పితామహుని ప్రశ్నించటానికి దేవకీ పుత్రుడు కృష్ణుడు తప్ప మరెవరూ సమర్థులు కారు ? మధుసూదనా! నీవే ముందుగా మాట్లాడు. మా అందరిలో సర్వధర్మాలూ తెలిసినవాడవు నీవే కదా!" ధర్మరాజు ఇలా అనగానే కేశవుడు, మహాతేజస్సుతో దరి చేరరానట్లున్న భీష్ముని దగ్గరకు వెళ్లి ఇలా పలికాడు. వాసుదేవుడు ఇలా పలికాడు. "రాజసత్తమా! రాత్రి నీకు సుఖంగా గడిచిందా? విస్పష్టలక్షణ అయిన బుద్ధి నీకు సంక్రమించిందా? పుణ్యాత్మా! నీకు సర్వజ్ఞానాలూ భాసిస్తున్నాయా? హృదయం అలసిపోలేదు కదా! మనస్సు వ్యాకులంగా లేదు కదా!" అపుడు భీష్ముడు ఇలా అన్నాడు. "కృష్ణా! దాహం, మోహం, శ్రమ, అలసట, గ్లాని, రోగం - అన్నీ నీ దయవల్ల నా నుండి వెంటనే తిరిగి వెళ్లిపోయాయి. భూత, భవిష్యద్, వర్తమానాలన్నీ అరచేతిలో పండువలె కనిపిస్తున్నాయి. (కరతలామలకంలా ఉన్నాయి) నీవరం వల్ల వేదధర్మాలూ, వేదాంత ధర్మాలూ అన్నీ చూడగల్గుతున్నాను. కృష్ణా! శిష్టులు

చెప్పిన ధర్మం కూడా నా మనసులో మెదులుతోంది. దేశ, జాతి, కుల ధర్మాలన్నీ నాకు తెలిశాయి. కేశవా! నాలుగు ఆశ్రమాలకు చెందిన ధర్మాల అర్థం అంతా నా మనసులో నిలిచింది. రాజధర్మాలన్నీ నాకు గుర్తుకు వచ్చాయి. జనార్దనా! ఎక్కడ ఏది చెప్పాలో అది చెపుతాను. నీ అనుగ్రహం వల్ల నా మనసున శుభబుద్ధి ఆవేశించింది. జనార్దనా! నిన్ను సతతమూ ధ్యానం చేయడంవల్ల పుంజుకొని యువకుని వలె తయారయ్యాను. నీ అనుగ్రహం వల్ల శ్రేయస్సును గురించి చెప్పటానికి శక్తుడ నయ్యాను. మాధవా? స్వయంగా నీవే ధర్మరాజుకు శ్రేయస్కరమైన దానిని ఎందుకు ఉపదేశింపవు? ఇందులో నీవు ఏం ఆశించావు? అదేదో చెప్పు!"

వాసుదేవుడు చెప్పాడు. "యశస్సుకూ, శ్రేయస్సుకూ కూడా మూలం నేనే అని తెలుసుకో. భీష్మా ! సత్తు, అసత్తు రెండింటికీ సంబంధించిన భావాలన్నీ నానుండే ఉద్భవిస్తాయి. చల్లని కిరణాలు కలవాడు చంద్రుడు అని చెపితే ఎవడు ఆశ్చర్యపడతాడు? అలాగే యశః పూర్ణుడు కృష్ణుడంటే ఎవరికీ విస్మయం కలగదు. మహాతేజస్వీ! నీకు నేను యశస్సు కలిగించవలసి ఉంది. అందుచేత నా విశాలబుద్ధిని నీలో ప్రవేశపెట్టాను. రాజా! ఈ భూమి నిశ్చలంగా నిలిచినంతకాలం నీకీర్తి అక్షయమై లోకాలన్నిటా వ్యాపిస్తుంది. భీష్మా! అతడు అడిగినపుడు, ధర్మరాజుకు నీవు చెప్పేదంతా భూమిపై వేదవాక్కులా స్థిరంగా నిలుస్తుంది. ఎవరయినా ఈ స్థాయిలో ఆత్మను బుద్ధిలో ప్రవేశపెట్టి ప్రవర్తిస్తే, అతడు మరణించాక సర్వపుణ్యాల ఫలాన్నీ అనుభవిస్తారు. భీష్మా! నీ కీర్తిని మళ్లీ ఎలా విస్తరింప జేయాలా అని ఆలోచించాను. ఈ కారణంతో నీలో నా దివ్యబుద్ధిని నిలిపాను. మానవుని కీర్తి భూమిమీద ఎంతకాలం నిలుస్తుందో అంతకాలం అతనికి అక్షయమైన స్థానం లభిస్తుందని నిశ్చయం. రాజా! హతశేషులయిన రాజులు నీ చుట్టూ చేరి ఉన్నారు. నిన్ను ధర్మాలను గూర్చి ప్రశ్నించా లనుకొంటున్నారు. ఆ ధర్మాలు వారికి చెప్పు. నీవు వయసులో పెద్దవాడవు. శాస్త్రమూ, ఆచారమూ తెలిసినవాడవు. రాజధర్మాల్లోనూ, ఇతర ధర్మా లన్నిటిలోనూ నేర్పరివి. పుట్టినది మొదలు, నీలో ఒక్కపాపం కూడా కనపడలేదు. సర్వధర్మాలూ నీకు తెలుసునని రాజులంతా ఎరుగుదురు. తండ్రి కొడుకులకు చెప్పినట్లు వారికి పరమధర్మం చెప్పు. నీవు నిత్యమూ ఋషులనూ, దేవతలనూ ఉపాసిస్తావు. అందుచేత నీవు మిగలకుండా తప్పక చెప్పాలి. ధర్మం వినాలని ఎవరయినా అడిగితే, ముఖ్యంగా వారు సత్పురుషులయితే తప్పక చెప్పడమే ధర్మం అని బుద్ధిమంతులు చెపుతారు. అలా చెప్పని వానికి దోషం కలుగుతుంది. అందుచేత కురూత్తమా! తెలుసుకోవాలనే కోరికతో పుత్రులూ, పౌత్రులూ అడిగినపుడు సనాతన ధర్మాలన్నిటినీ నీవు ఉపదేశించు."

55. భీష్ముడు యుధిష్ఠిరుని ఊరడించుట.

వైశంపాయనుడు చెపుతున్నాడు. "మహాతేజస్వి అయిన భీష్ముడు ఇలా చెప్పాడు. గోవిందా! నీ అనుగ్రహం వల్ల ధర్మాలను చెపుతాను. నా మాటా, మనసూ దృఢంగా ఉన్నాయి. నీవు సర్వ ప్రాణులకు ఆత్మవు. శాశ్వతుడవు. ధర్మాత్ముడయిన ధర్మరాజు నన్ను ధర్మాలను గురించి వరుసగా అడగవచ్చు. ఇలా నేను ప్రీతి చెందుతాను. అన్ని ధర్మాలూ చెపుతాను. ధర్మాత్ముడూ, మహాత్ముడూ అయిన ఏ రాజు జన్మిస్తే మహర్షులంతా సంతోషించారో ఆ ధర్మరాజు నన్ను అడగవచ్చును. ఉజ్జ్వలమైన కీర్తి, ధర్మప్రవర్తన కల కురువంశం వారిలో అతనికి సాటి ఎవడూ లేడు. అటువంటి ధర్మరాజు నన్ను ప్రశ్నించుగాక. ధైర్యమూ, దమమూ, బ్రహ్మచర్యమూ, క్షమ, ధర్మమూ, ఓజస్సు, తేజస్సూ అతనిలో శాశ్వతంగా ఉంటాయి. అట్టి ధర్మరాజు నన్ను ప్రశ్నించుగాక. బంధువులనూ, అతిథులనూ, సేవకులనూ, ఆశ్రితులనూ మిక్కిలిగా సమ్మానించే ధర్మరాజు నన్ను అడగవచ్చు. సత్యమూ, దానమూ, తపస్సూ, శౌర్యమూ, శాంతీ, సామర్థ్యమూ, స్థిరత్వమూ – ఈ గుణాలన్నీ కల ధర్మరాజు నన్ను అడగవచ్చు. కామం వల్లగానీ, తొందరపాటు వల్ల గానీ, భయం వల్ల కానీ, అర్థం వల్ల కానీ అధర్మం ఆచరించని ధర్మరాజు నన్ను అడుగవచ్చు. ఎవనిలో సత్యమూ, క్షమా, జ్ఞానమూ నిత్యమూ ఉంటాయో, ఎవడు అతిథిప్రియుడో, సజ్జనులకు ఎవడు నిత్యమూ దానం చేస్తాడో అతడు నన్ను అడగవచ్చు. యజ్ఞం, వేదాధ్యయనం, ధర్మం అనే వానిపై నిత్యశ్రద్ధ కల్గి, శాంతుడై, విద్యారహస్యాలు విన్న ధర్మరాజు నన్ను అడుగవచ్చు."

అపుడు వాసుదేవుడు ఇలా అన్నాడు. "మిక్కిలి సిగ్గుతోకూడిన ధర్మరాజు (లోకనింద కలుగుతోందని) అభిశాపభయంతో నిన్ను చేరలేకపోతున్నాడు. ఈరాజు లోకులందరితో పోరాడి, ఇపుడు లోకనిందకు వెరచి నీ దగ్గరకు రాలేకపోతున్నాడు. పూజ్యాలనూ, గౌరవార్యులనూ, భక్తులనూ, గురువులనూ, చుట్టాలనూ – ఇలా పూజ్యాలను బాణాలతో కొట్టి ఇపుడు నీ దగ్గరకు రాలేకపోతున్నాడు." అపుడు భీష్ముడు ఇలా అన్నాడు. "కృష్ణా! దానం, అధ్యయనం, తపస్సు బ్రాహ్మణులకు ధర్మమయినట్లే, క్షత్రియులకు యుద్ధంలో దేహం విడవటం ధర్మం. తండ్రులు, తాతలు, సోదరులు, గురువులు, బంధువులు – ఎవరయినా సరే ! చెడుమార్గంలో నడిస్తే, వారిని యుద్ధంలో చంపవచ్చును. అది ధర్మమే. ప్రతిజ్ఞ చేసి ఆచరించనివారిని, పరమ లోభులను, పాపులను, గురువులయినా సరే క్షత్రియుడు యుద్ధంలో సంహరిస్తాడు. అలా చంపే క్షత్రియుడు ధర్మ మెరిగినవాడు. సనాతనమయిన ధర్మసేతువును, లోభం వల్ల పరిశీలింపని వానిని క్షత్రియుడు యుద్ధంలో

చంపుతాడు. అతడు ధర్మవిదుడే. యుద్ధాల్లో భూమిని రక్తపునీటితో, కేశా లనే గడ్డిపరకలతో, గజా లనే పర్వతాలతో, ధ్వజా లనే చెట్లతో నింపే క్షత్రియుడు ధర్మవేత్తయే. శత్రువు యుద్ధానికి పిలిస్తే, క్షత్రియుడు తప్పని సరిగా యుద్ధం చెయ్యాలి. యుద్ధం ధర్మాన్ని, స్వర్గాన్ని, లోకాన్నీ సాధిస్తుందని మనువు చెప్పాడు." వైశంపాయనుడు అన్నాడు. "భీష్ముడు ఇలా చెప్పాక ధర్మరాజు వినయంతో భీష్ముని చూపుకు అందేటంత దూరంలో ముందుగా నిలిచాడు. ధర్మజుడు భీష్ముని పాదాలంటి నమస్కరించాడు. భీష్ముడూ అతనిని చూసి ఎంతో సంతోషించాడు. ధర్మజుని తల మూర్కొని 'కూర్చో' అన్నాడు. విలుకాండ్రలో ఉత్తముడయిన భీష్ముడు 'నాయనా! భయం లేకుండా నన్ను అడుగు' అన్నాడు ధర్మరాజుతో."

56. భీష్ముడు ధర్మజునికి ధర్మ ముపదేశించుట.

వైశంపాయనుడు చెపుతున్నాడు. "కృష్ణునికి నమస్కరించి, పితామహునికి 'అహం భో అభివాదయే' అని నమస్కరించి, గురువులందరినీ గౌరవించి, ధర్మరాజు ఇలా ప్రశ్నించాడు. "రాజా! ధర్మవేత్తలు 'రాజులకు ధర్మమే అన్నిటికంటె గొప్పది' అంటారు. ఆ ధర్మం చాలా భార మయిన దని కూడా నేను భావిస్తున్నాను. దీన్ని గురించి చెప్పు. పితామహా! రాజధర్మాలను గూర్చి విశేషంగా చెప్పు. జీవలోకాని కంతటికీ రాజధర్మమే గతి - పరాయణం. కురూత్తమా! రాజధర్మాల్లో ధర్మం, అర్థం, కామం అనేవి ఉన్నాయి. స్పష్టంగా మోక్షధర్మం అంతా ఇందులోనే ఉంది. గుర్రానికి పగ్గాలవలె, ఏనుగుకు అంకుశం వలె, లోకానికి ధర్మం చెప్పబడింది. (రాజధర్మం లోకులను సన్మార్గంలో నడిపిస్తుంది). రాజర్షులు ఆచరించిన ఆ ధర్మంలో రాజు ఏమాత్రం పొరబడినా లోక పరిస్థితే మిగలదు. (వ్యవస్థ చెడిపోతుంది) అంతా వ్యాకులమై పోతుంది. ఉదయిస్తూనే సూర్యుడు అశుభంకరమైన చీకటిని నశింపజేస్తాడు. అలాగే రాజధర్మాలు లోకాన్ని బాధించే పాపాన్ని దూరం చేస్తాయి. పితామహా! అందుచేత ముందుగా నాకోసం రాజధర్మాలను ఉపదేశించు. ధర్మాచరణం చేసేవారిలో నీవు ఉత్తముడవు. పరంతపా! మాకు అందరికీ నీనుండే ఉత్తమ జ్ఞానం లభిస్తుంది. వాసుదేవుడు బుద్ధిలో నిన్నే ఉత్తమునిగా భావిస్తాడు." అపుడు భీష్ముడు ఇలా ప్రారంభించాడు. **"గొప్పదైన ధర్మానికి నమస్కారం. సృష్టికర్తయైన కృష్ణునకు నమస్కారం. బ్రహ్మతత్వం తెలిసిన బ్రాహ్మణులకు నమస్కరించి శాశ్వతాలయిన ధర్మాలను చెపుతాను.*** ధర్మజా! నేను చెప్పే రాజధర్మాలను సంపూర్ణంగా దీక్షతో

---

* నమో ధర్మాయ మహతే నమః కృష్ణాయ వేధసే ।
బ్రాహ్మణేభ్యో నమస్కృత్య ధర్మాన్వక్ష్యామి శాశ్వతాన్ ॥ 10

విను. ఇంకా నీవు ఏది కోరినా చెపుతాను విను. ముమ్మందుగా రాజు ప్రజలను సంతృప్తి పరిచే బుద్ధి కలిగించుకొని, దేవతల పట్ల, ద్విజాతులపట్ల యథావిధిగా ప్రవర్తించాలి. రాజు దైవతములనూ, బ్రాహ్మణులనూ పూజించి ధర్మఋణం తీర్చుకొన్నవా డవుతాడు. లోకమంతా అపుడు అతనిని పూజిస్తుంది. **నాయనా! ధర్మజ్ఞా! కార్యసిద్ధికి ఎప్పుడూ పురుషకారం (పురుషప్రయత్నం)తో ప్రయత్నించు. పురుషప్రయత్నం లేకుండా దైవం రాజుల ప్రయోజనాలను తీర్చదు. మానవ ప్రయత్నమూ, దైవమూ రెండూ సమానమే - రెంటిలో మానవ ప్రయత్నమే గొప్పదని నేను భావిస్తాను. దైవం నిశ్చితమని పిలుస్తారు. ఆరంభించిన పని మధ్యలో చెడిపోతే సంతాపం చెందకు. నిత్యమూ దానిని మళ్లీ కూర్చడానికి ప్రయత్నించు. రాజులకు ఇది ఉత్తమమయిన చివరి నీతి.** రాజులకు సత్యాన్ని మించి సిద్ధిని కూర్చేది మరేదీ లేదు. సత్యం మీద ఆసక్తి కల రాజు, ఇహపరాలు రెండిటా ఆనందం పొందుతాడు. **రాజేంద్రా! ఋషులకు కూడా సత్యమే శ్రేష్ఠమయిన ధనం. రాజుకు సత్యం కంటె విశ్వాసకారణం మరొకటి లేదు.*** గుణశీలాలు కలవాడు, చపలత లేని మృదుస్వభావుడు, ధార్మికుడు, ఇంద్రియ నిగ్రహం కలవాడు, దర్శనీయుడు, పెద్ద పెద్ద లక్ష్యాలున్నవాడు అయిన రాజు ఎన్నటికీ సంపదలనుండి జారిపోడు. కురునందనా! అన్ని కార్యాలలోనూ ఆర్జవం పాటించు. ఆ సరళస్వభావాన్ని నీతి విచారంతోనూ, వేదాలతోను రక్షించుకో. ఎల్లప్పుడూ మృదువుగా ప్రవర్తించే రాజును అంతటా ఉల్లంఘిస్తారు. తీవ్రంగా ఉంటే లోకం భయపడుతుంది. అందుచేత సమయానుకూలంగా రాజు రెండువిధాలనూ అనుసరించాలి. పుత్రా! విద్యావేత్తలయిన విప్రులు దండింపదగనివారు. బ్రాహ్మణుడంటే లోకంలో ఉత్తమప్రాణి.

రాజేంద్రా! మహాత్ముడయిన మనువు రెండు శ్లోకాలు పఠించాడు. ధర్మజ్ఞా! స్వధర్మాల్లో వాటిని మనసులో పెట్టుకో. **నీళ్లనుండి అగ్ని పుట్టింది. బ్రాహ్మణుల నుండి క్షత్రియజాతి పుట్టింది. రాతి నుండి లోహం పుట్టింది. అన్నిటా ప్రసరించే వాటి తేజస్సు, తమ తమ జన్మస్థానాల్లో మాత్రం అణగిపోతుంది.** ఎప్పుడు ఇనుము రాతిని నశింపజేస్తుందో, ఎప్పుడు అగ్ని నీటిని నశింపజేస్తుందో, ఎప్పుడు క్షత్రియుడు బ్రాహ్మణులను ద్వేషిస్తాడో అప్పుడే ఆ మూడూ (ఇనుము, అగ్ని, క్షత్రియుడూ) నశిస్తాయి. అందుచేత మహారాజా! బ్రాహ్మణులు నీకు నమస్కరింపదగినవారు. సమర్చితులయిన బ్రాహ్మణులు, భూమి మీద బ్రహ్మమును ధరింపజేస్తున్నారు. నరోత్తమా! ముల్లోకాలనూ

---

* అద్భ్యోఽగ్నిర్బ్రహ్మతః క్షత్రమ్ అశ్మనో లోహముత్థితమ్ ।
తేషాం సర్వత్రగం తేజః స్వాసు యోనిషు శామ్యతి ॥ 24

నాశనం చేసే వారినీ ఇంకా అటువంటి పనులు చేసేవారినీ, నీ భుజబలంతో అణచి వెయ్యాలి. మహారాజా! పూర్వం శుక్రాచార్యుడు రెండు శ్లోకాలు చెప్పాడు. వాటిని ఏకాగ్రచిత్తంతో విని, తెలుసుకో. ఆయుధం ఎత్తి పట్టుకొని వస్తున్నవాడు ఎంత వేదాంతవేత్త అయినా సరే, రాజు వానిని స్వధర్మంతో నిగ్రహించాలి. నశించిపోతున్న ధర్మాన్ని రక్షించినవాడే ధర్మవేత్త. అలా రక్షించడంలో హింసచేసినా ధర్మహాని జరుగదు. ఆ క్రోధం క్రోధాన్నే పొందుతుంది. అలా అయినా ద్విజాతులు రక్షింపదగిన వారే. వారు దోషులయితే దేశబహిష్కరణం చెయ్యాలి. దోషం నిరూపింపబడినా వానిని దయదలచాలి. వాడు బ్రహ్మహత్య చేసినా, గురుభార్యను పొందినా, భ్రూణ హత్యచేసినా, రాజద్రోహం చేసినా ఆ విప్రునికి దేశబహిష్కారం విధించాలి కాని ఎన్నడూ శరీరదండనం విధించరాదు. బ్రహ్మవేత్తల యందు భక్తికల మానవులు రాజులకు ప్రియులు. అట్టివారిని సంపాదించుకోవడాన్ని మించిన కోశాగారం రాజులకు మరొకటి లేదు. శాస్త్రంలో చెప్పబడిన ఆరుదుర్గాల్లోనూ నరదుర్గం దాట శక్యం కానిదని అందరూ భావిస్తారు. అందుచేత వివేకం గల రాజు చతుర్వర్ణాల వారినీ దయతో చూడాలి. ధర్మాత్ముడై, సత్యం పలికే రాజు ప్రజలను రంజింపజేస్తాడు. పుత్రా! అలా అని అన్నివేళలా అన్ని చోట్లా సహనం పాటింపరాదు. అన్నిటినీ సహిస్తూ, ఏనుగువలె మృదువుగా ఉండేరాజు ధర్మవిరోధి అవుతాడు. ఈ విషయమై బృహస్పతిచెప్పిన శాస్త్రంలో ఒక శ్లోకం ఉంది. దాన్ని చెపుతా విను. నిత్యమూ క్షమించే రాజును నీచుడు అవమానిస్తాడు. ఏనుగు ఎప్పుడూ సహిస్తుంటే, మావటీడు శిరసు మీది కెక్కుతాడు. అందుచేత రాజు నిత్యమూ మృదువూ కాకూడదు, తీవ్రంగానూ ఉండకూడదు. వసంత ఋతువులో సూర్యునివలె చల్లగానూ కాకుండా, వేడిగానూ గాకుండా ఉండాలి. అపుడా రాజు సంపన్నుడవుతాడు. ప్రత్యక్షం, అనుమానం, ఉపమానం, ఆగమం అనేవాటిచేత తన విషయంలోనూ, పరుల విషయంలోనూ నిత్యమూ పరీక్షించాలి. వ్యసనాలన్నిటినీ విడిచిపెట్టు. అలా అని ఇతరులపై ప్రయోగింపరాదని కాదు. వ్యసనాల మీద ఆసక్తిని విడవాలి. వ్యసనాలకు లోబడిన రాజును లోకం పరాభవిస్తుంది. మిక్కిలి ద్వేషం కల రాజు లోకులకు ఉద్వేగం కలిగిస్తాడు. రాజు సదా గర్భవతి వలె ప్రవర్తించాలి. ఎందుకో కారణం చెపుతా విను. గర్భవతి తాను మనసుపడే ప్రియాన్ని వదలి, కడుపులోని బిడ్డకు హితం కలిగేటట్లు ప్రవర్తిస్తుంది. రాజు కూడా అలాగే ప్రవర్తించాలి. కురూత్తమా! రాజు ఎల్లపుడూ ధర్మాన్ని అనుసరించి ప్రవర్తించాలి. తన యిష్టం విడిచిపెట్టి, లోకహితం కలిగించేటట్లు ప్రవర్తించాలి. ఎన్నడూ ధైర్యం మాత్రం నీవు విడవరాదు. తన దండనీతి లోకానికి స్పష్టంగా తెలిసేటట్లు ప్రవర్తించే రాజుకు ఎక్కడా భయం కలగదు.

సేవకులతో పరిహాసం కూడదు. దీనిలోని దోషం చెపుతా విను. **మరీ సన్నిహితంగా ఉంటే రాజుమ ప్రజలు అవమానిస్తారు. వారి వారి స్థానాలలో వసుల్లో ఉండరు. రాజు మాటలను ఉల్లంఘిస్తారు కూడా. అప్పగించిన వనులలో సంశయాలు ప్రకటిస్తూ ఉంటారు. రాజరహస్యాలు వెల్లడిస్తారు. అడగకూడనివి అడుగుతారు. రాజు తినే ఆహారం తింటూ ఉంటారు.** రాజుపై కోపతాపాలు పెంచుకొంటారు. లంచాలతో, మోసాలతో కార్యాలు చెడగొట్టుతారు. దొంగ శాసనాలతో దేశం శిథిలం చేస్తారు. అంతఃపుర రక్షకులతో స్నేహం చేసి, వారితో సమానవేషాలు వేస్తారు. రాజు ఎదుటనే కక్కుతారు. ఉమ్మివేస్తారు. రాజు చెప్పిన రహస్యం అంతటా చెపుతారు. రాజు పరిహాస ప్రియుడయితే, మెత్తనివాడు అయితే సేవకులు రాజును లెక్కచేయక గుట్టమో, రథమో, ఏనుగో ఎక్కుతారు. 'రాజా ! ఇది నీకు దుష్కరమైనది. ఇది నీవు చేసిన తప్పుపని' – ఇలా సభలో మిత్రుని వలె సేవకులు చెపుతారు. రాజు కోపించినా నవ్వుతారు. పూజించినా తృప్తిపడరు. పరస్పర కారణాలతో సంఘర్షశీలులై ఉంటారు. రాజరహస్యాలోచన బయటపెడతారు. చెడ్డపనిని బయటపెడతారు. రాజశాసనం లెక్కలేనితనంతో అవమాన పరుస్తారు. అలంకారంలో, భోజనంలో, స్నానంలో, అనులేపనంలో రాజువింటూ ఉండగానే నిర్భయంగా వెక్కిరిస్తారు. తమ అధికారాలను నిందిస్తారు. కర్తవ్యాలు వదలివేస్తారు. తమ వృత్తితో తృప్తిపడరు. రాజు సొమ్మును హరిస్తారు. త్రాడుకట్టిన పక్షితో ఆడినట్లు, రాజుతో క్రీడింపగోరుతారు. మేము చెప్పినట్లు రాజు వింటాడని లోకంలో చెప్పుకొంటారు. ధర్మజా! రాజు మృదుశీలియై, పరిహాస ప్రియుడయితే ఇంకా చాలా దోషాలు కూడా పుట్టుకొని వస్తాయి.

57. రాజుయొక్క ధర్మానుకూల ప్రవర్తన.

భీష్ముడిట్లు చెప్పాడు. "ధర్మజా! రాజు ఎల్లపుడూ ప్రయత్నపరుడై ఉండాలి. ఉద్యమించని రాజు స్త్రీవలె ప్రశంసింపబడడు. ఈ విషయమై శుక్రుడు ఒక శ్లోకం చెప్పాడు. రాజా! ఏకాగ్రతతో విను చెపుతాను. **పుట్టలోని చీమలను పాము తిన్నట్లు విరోధం లేని రాజునూ, ఇల్లు విడవని బ్రాహ్మణునీ భూమి మ్రింగివేస్తుంది.*** అందుచేత నరోత్తమా! ఇదంతా నీ మనసులో పెట్టుకో ! సంధి చేసుకోవలసిన వారితో సంధి చేసుకో ! విరోధింప వలసిన వారితో విరోధించు. ఏడు అంగాలు కల రాజ్యానికి

* ద్వావిమౌ గ్రసతే భూమిః సర్పో బిలశయానివ ।
రాజానం చావిరోద్ధారం బ్రాహ్మణం చాప్రవాసినమ్ ॥ 13

ప్రతికూలంగా ఆచరించేవాడు గురు వయినా, మిత్రు డయినా సరే సంహరింపదగినవాడే. బృహస్పతిమతంగా రాజ్యాధికారానికి సంబంధించిన శ్లోకం మరుత్తుడనే రాజు పాడినది ఒకటి ఉంది. **కార్యాకార్యాలు తెలియక, గర్వంతో చెడు మార్గం పట్టినవాడు గురువయినా అతనిని శాశ్వతంగా దండించవలసినదే.*** బాహుపుత్రుడైన సగరమహారాజు తన పెద్దకొడుకయిన అసమంజసుని పౌరులహితం కోసం పరిత్యజించాడు. అసమంజసుడు సరయూనదిలో పౌరుల బాలకులను ముంచివేసేవాడు. అందుచేత తండ్రి సగరుడు కొడుకును తిట్టి, దేశబహిష్కారం చేశాడు. ఉద్దాలక మహర్షి కూడా తన ప్రియసుతు డయిన శ్వేతకేతువును బ్రాహ్మణులను కపటంగా సేవిస్తున్నాడనే కారణంతో విడిచిపెట్టాడు. అందుచేత లోకులను రంజింపజేయటమే రాజుల సనాతన ధర్మం. సత్యాన్ని రక్షించటమూ, వ్యవహారంలో సారళ్యమూ రాజధర్మం. ఇతరుల సంపదలను పాడు చేయరాదు. ఇవ్వవలసిన దాన్ని సకాలంలో ఇవ్వాలి. సత్యవాక్కు, క్షమ కల్గి పరాక్రమించే రాజు ఎన్నడూ శుభమార్గం నుండి తొలగడు.

రాజు ఆత్మవంతుడు కావాలి. క్రోధాన్ని జయించాలి. రాజుకు శాస్త్రవిషయాల్లో చక్కని నిశ్చయబుద్ధి ఉండాలి. ధర్మార్థకామ మోక్షాల్లో ఆసక్తి ఉండాలి. వేదం మీద కూడా ఆసక్తి ఉండాలి. ఆలోచనలను రహస్యంగా ఉంచగలవాడే రాజు కాగలడు. రాజకార్యాల్లో రహస్యం దాచలేకపోవటాన్ని మించిన కష్టం రాజుకు మరొకటి ఉండదు. నాలుగు వర్ణాల వారి ధర్మాలనూ రాజు రక్షించాలి. ధర్మం సంకరమయి పోకుండా ప్రజలను రక్షించడం కూడా రాజుల సనాతన ధర్మం. రాజు ఎవరినీ నమ్మరాదు. ఒకవేళ నమ్మినా ఎక్కువగా నమ్మకూడదు. షాడ్గుణ్యంలో ఉండే గుణదోషాలను బుద్ధితో సదా పరీక్షిస్తూ ఉండాలి. శత్రువుల లోపాలను కనిపెట్టగల రాజు నిత్యమూ ప్రశంసింపబడతాడు. ధర్మార్థకామాల విషయంలో నిశ్చితజ్ఞానం కలిగి, గూఢచారుల రహస్యాన్ని కనిపెట్టే రాజు ప్రశంసింపబడతాడు. రాజు తన ధనాగారం పెంపొందించుకొనే విషయంలో యమునిలా, కుబేరునిలా ప్రవర్తించాలి. స్థానవృద్ధిక్షయాలకు కారణమైన దశవర్గం చక్కగా తెలుసుకోవాలి. పోషణలేనివారికి రాజు పోషణ ఇవ్వాలి. పోషణ కలవారిని పరీక్షిస్తూ ఉండాలి. రాజు చిరునవ్వు నవ్వుతూ సుముఖంగా ముందు మాట్లాడుతూ ఉండాలి. వృద్ధులను సేవించాలి. అలసత లేకుండా ప్రవర్తించాలి. లేకితనం ఉండకూడదు. సత్ప్రవర్తన మీద స్థిరబుద్ధి ఉండాలి. సంతోషం పొందాలి. చూడముచ్చటగా ఉండాలి. సజ్జనులచేతి నుండి ఎన్నడూ ధనం గ్రహించరాదు. దుర్జనుల

---

* గురోరవ్యవలిప్తస్య కార్యాకార్యమజానతః ।
ఉత్పథప్రతిపన్నస్య దండో భవతి శాశ్వతః ॥ 7

నుండి తీసుకొని అది సజ్జనులకు ఇవ్వాలి. రాజు స్వయంగా ప్రహరించాలి. దాత కావాలి. మనసు వశంలో ఉండాలి. రమ్యమయిన సాధనాలు ఉండాలి. సకాలంలో దానం చెయ్యాలి. భుజించాలి. పరిశుద్ధమైన ఆచారాలు కలిగి ఉండాలి. శూరులు, భక్తులు, ఇతరుల ప్రలోభాలకు లొంగనివారు, సత్కులంలో పుట్టినవారు, రోగాలు లేనివారు, శిష్టులు, శిష్టులతో సంబంధాలు కలవారు, ఆత్మగౌరవం కలవారు, అవమానం చేయని/పొందనివారు. విద్యావేత్తలు, లోకవ్యవహారాలు తెలిసినవారు, పరలోకం గురించి తెలుసుకొనేవారు, ధర్మనిరతులు, పర్వతం వలె చలింపని సాధు స్వభావం కలవారు - వీరిని ఐశ్వర్య పురస్కృతుడయిన రాజు సహాయులుగా చేసుకోవాలి. భోగాల విషయంలో వారితో సమానంగా అనుభవించాలి. ఒక్క ఛత్రమూ, ఆజ్ఞ ఈ రెండూ మాత్రమే వారికంటె రాజుకు అధికం అనేటట్లు ఉండాలి. అందరి ఎదుటనూ, చాటుగానూ కూడా ఒకేవిధమయిన నడవడి ఉండాలి. ఇలా చేసే రాజు దుఃఖం పొందడు. అందరినీ అనుమానించేవాడు, అన్నీ హరించేవాడు, సూటిగా ఉండనివాడు, లోభి అయిన రాజు కొద్దికాలంలోనే తనవారి చేతనే బంధింపబడుతాడు. శుచియై, లోకుల మనసులను ఆకర్షింపగల రాజు శత్రువులకు చిక్కినా పతనం చెందడు. ఒకవేళ పడినా మళ్లీ నిలద్రొక్కుకొంటాడు. క్రోధం లేనివాడు, వ్యసనాలు లేనివాడు, మృదువైన దండం ప్రయోగించేవాడు, జితేంద్రియుడూ అయిన రాజు ప్రాణులకు హిమవంతుని వలె, విశ్వసింపదగిన వాడవుతాడు.

ప్రజ్ఞ కలవాడు, త్యాగగుణంతో కూడినవాడు, శత్రువుల దోషాలు తెలుసుకోగలవాడు, అన్ని వర్ణాల వారికి చూడదగినవాడు, నీతి - అవనీతి తెలిసినవాడు, చురుకుగా పనులు చేసేవాడు, క్రోధాన్ని జయించినవాడు, ప్రసన్నుడు, మహాబుద్ధికలవాడు, రోషస్వభావం లేనివాడు, యోగ్యుడు, క్రియాపరుడు, తన్ను తాను పొగడుకోనివాడు, మొదలుపెట్టిన పనులు చక్కగా పూర్తిచేసే రాజు రాజులలో ఉత్తముడనబడతాడు. నిర్భయంగా తండ్రి యింట్లో పుత్రుడు ప్రవర్తించినట్లు, ఎవని దేశంలో ప్రజలు సంచరిస్తారో ఆ రాజు రాజోత్తముడు. ఎవని రాజ్యంలో పౌరులు తమ సంపదలను రహస్యంగా ఉంచుకోరో, నీతి - అవనీతులను తెలిసి ప్రవర్తిస్తారో ఆ రాజు రాజోత్తముడు. ఎవని దేశంలో ప్రజలు తమతమ విధుల్లో శ్రద్ధ కలిగి ఉంటారో, దేహంమీద కాకుండా ధర్మం మీద ఆసక్తి కల్గి, యథావిధిగా రక్షింపబడతారో, రాజునకు వశులై, ఆతని అధీనంలో నడుస్తారో, సంఘర్షణ లేకుండా విధేయులై ఉంటారో, దానగుణం కలిగిఉంటారో ఆ దేశపు రాజే ఉత్తముడు. ఏ రాజు దేశంలో కల్ల, కపటం, మాయ, మత్సరం ఉండవో ఆ రాజు యొక్క ధర్మమే సనాతన ధర్మం. జ్ఞానులను సత్కరించేవాడు,

తెలియదగిన దానిలోను, పరహితంలోనూ ప్రీతి కలవాడు, సజ్జనుల మార్గంలో నడిచేవాడు, త్యాగి అయిన రాజు రాజ్యానికి అర్హుడు. ఎవని గూఢచారులూ, రహస్యాలోచనలూ నిత్యమూ ప్రయోగించినా, ప్రయోగించనట్లు శత్రువులకు తెలియకుండా ఉంటాయో ఆ రాజు రాజ్యార్హుడు. మహాత్ముడయిన పరశురాముడు రామ చరితం చెపుతూ పూర్వం ఒక శ్లోకం రాజును గురించి వినిపించాడు. **మొదట రాజును పొందాలి. తరువాత భార్యను, తరువాత ధనమునూ పొందాలి. రాజే లేకపోతే లోకులకు భార్య ఎందుకు? ధనమెందుకు?*** రాజ్యం కాంక్షించేవారికి స్పష్టమైన ప్రజారక్షణ కాక సనాతన ధర్మం మరియొకటి లేదు. రక్షయే లోకానికి **పట్టుగొమ్మ/ ఆధారం.** రాజధర్మాల గురించి ప్రాచేతసుడు(మనువు) రెండు శ్లోకాలు చెప్పాడు. ఏకాగ్రతతో వాటిని విను. **సముద్రంలో పగిలిపోయిన పడవను విడిచివేసినట్లు ఈ ఆరుగురినీ వెంటనే విడిచిపెట్టాలి. (1) ప్రవచనం చెయ్యని ఆచార్యుడు (2) వేదం చదవని ఋత్విజుడు (3) రక్షించని రాజు (4) అప్రియంగా మాట్లాడే భార్య (5) గ్రామంలో ఉండాలనుకొనే గోవుల కాపరి (6) అడవిలో ఉండాలనుకొనే మంగలి - వీరంతా ఎందుకూ పనికిరానివారు."**

58. రాజ్యరక్షా సాధనములు భీష్ముడు చెప్పుట - ప్రథమదివస సమాప్తి.

భీష్ముడిలా చెప్పాడు. "ధర్మజా! ప్రజా రక్షణమే రాజధర్మాలలో నవనీతం వంటిది. బృహస్పతి దీనిని న్యాయ పూర్వకమయిన ధర్మ మని ప్రశంసిస్తాడు. విశాలాక్షుడు, మహాతపస్వి శుక్రుడు, సహస్రాక్షు డయిన ఇంద్రుడు, ప్రాచేతసుడనే మనువు, భరద్వాజమహర్షి, గౌర శిరుడనే మహర్షి - ఈ బ్రహ్మణ్య లందరూ రాజనీతి శాస్త్రం రచించినవారు. వీరందరూ రాజులకు ప్రజారక్షణమే మహాధర్మం అని చెపుతారు. ధర్మజా! దీనికి సాధనం (యుక్తి-మార్గం) చెపుతాను. విను. గూఢచారి, ప్రణిధి, తగిన సమయంలో మాత్సర్యం లేకుండా దానం చేయడం, యుక్తితో గ్రహించడం, సజ్జనులను ఆదరించటం, శౌర్యం, సమర్థత, సత్యం, ప్రజాహితం, కపటంగా కాని, సూటిగా కాని శత్రుపక్షాన్ని ఛేదించటం, పాతబడి పాడైపోయే ఇళ్లను పరిశీలించడం, రెండు విధాలయిన దండమూ సమయోచితంగా ప్రయోగించడం, సజ్జనులను విడవకుండటం, సత్కులీనులను ఆదరించడం, కూడబెట్టదగిన ధాన్యాదులను కూర్చుకోవడం, బుద్ధిమంతులను సేవించడం, సైన్యాన్ని సంతోషపరచడం,

---

* రాజానం ప్రథమం విందేత్ తతో భార్యాం తతో ధనమ్ ।
రాజన్యసతి లోకస్య కుతో భార్యా కుతో ధనమ్ ॥ 41

నిత్యమూ ప్రజలను పరిశీలించడం, పనులలో దుఃఖపడకపోవడం, ధనాగారం పెంచుకోవడం, నగర రక్షణం, పురజనుల (రూపంలో ఉన్న శత్రు) సంఘాలను చీల్చడం, శత్రువులు, మిత్రులు, మధ్యస్థులు వీరిని యథోచితంగా పరికిస్తూ ఉండటం, తమ సేవకులు శత్రువులలో కలియకుండా చూడటం, తన నగరాన్ని పరిశీలించడం, సేవకులపై పూర్తి నమ్మకం ఉంచకపోవడం, స్వయంగా పరులను ఓదార్చడం, నీతిని, ధర్మాన్ని అనుసరించటం, సదా ప్రయత్నశీలియై ఉండటం, శత్రువును చులకనగా భావించకపోవటం, సదా దుష్టులను దూరంగా ఉంచడం - ఇవన్నీ ప్రజారక్షణ విషయంలో సాధనాలు, మెలకువలు. ఉత్థానమే(ప్రయత్నం) రాజధర్మాలకు మూలం అని బృహస్పతి చెప్పాడు. ఈ విషయమై కొన్ని శ్లోకాలున్నాయి. విను. **ప్రయత్నంతోనే అమృతం లభించింది. ప్రయత్నంతోనే రాక్షసులు హతులయ్యారు. స్వర్గంలోను భూమిమీద మహేంద్రుడు శ్రేష్ఠతను సంపాదించినది ఉత్థానంతోనే. ప్రయత్న వీరుడయిన పురుషుడు వాగ్వీరులను (పండితులను) మించి నిలుస్తాడు. ఆ వాగ్వీరులు ప్రయత్నవీరులను సంతోషంతో సేవిస్తారు. నిత్యప్రయత్నం లేని రాజు ఎంత తెలివికలవాడయినా, విషంలేని పాములాగా శత్రువులకు చులకన అయి, కొట్టబడతాడు.**

తానెంత బలవంతుడయినా, శత్రువు ఎంత దుర్బలుడయినా వానిని కించపరచరాదు. కొంచెమున్నా అగ్ని దహించివేస్తుంది. కొద్దిపాటి దయినా విషం చంపుతుంది. నాలుగు అంగాలలో ఒక అంగంలోనే వృద్ధిపొంది నా దుర్గంలో ఉన్న శత్రురాజు, రాజు సర్వాంగాలు సమృద్ధిగా కల దేశమంతటినీ, రాజునూ తపింపజేస్తాడు. (దుర్గంలో ఉండటం వల్ల) రాజరహస్యం ఏదయినా ఉంటే.... అది శత్రుజయం కోసం కావచ్చు, లోకరక్షణకు సంబంధించినది కావచ్చు, ఏదో కారణం చేత రాజు మనసులో ఉన్న కుటిలత కావచ్చు. పాపకృత్యం కావచ్చు - దానిని నిష్కపటంగా మనసులోనే ఉంచుకోవాలి. లోకవిడంబన మయినా ధార్మికమయిన కృత్యమే చెయ్యాలి. రాజ్యమనేది చాలా గొప్ప తంత్రం. దాన్ని సంస్కారం లేనివాళ్లు (క్రూరులు) మోయలేరు. మృదుహృదయం కలవాళ్లు కూడా మోయలేరు. అది ఎంతో ఆయాసపెట్టుతుంది. రాజ్యం అందరికీ భోగ్యవస్తువే. (అందరూ పొందాలని చూస్తారు) దాన్ని ఆర్జవం కలవాడే ధరింపగలడు. అందుచేత ధర్మజా! ఎల్లపుడూ మిశ్రమమార్గంలో వెళ్లాలి. (క్రూరత-మృదుత్వము రెండూ కలిసిన మార్గం) ప్రజలను రక్షించేటప్పుడు రాజుకు ఏదైనా ఆపద కలిగినా అది కూడా అతని విస్తృత ధర్మంలో ఒకభాగమే అనుకోవాలి. రాజులకు ఇటువంటి ప్రవర్తన ఉండాలి. కురువంశోత్తమా! ఈ చెప్పినది రాజధర్మాల్లో చిన్నభాగం. ఎక్కడయినా సందేహం ఉంటే

మళ్లీ అడుగు." వైశంపాయనుడు చెప్పాడు. "తరువాత వ్యాసుడు, దేవస్థానుడు, అశ్మకుడు, వాసుదేవుడు, కృపుడు, సాత్యకి, సంజయుడు సంతోషంతో వికసించిన ముఖాలతో 'బాగుంది బాగుంది' అంటూ ఉప్పొంగిపోతూ ధార్మికోత్తము డయిన భీష్ముని ప్రశంసించారు. తరువాత దీనమనస్సుతో, నీరు నిండిన కనులతో మెల్లగా భీష్ముని పాదాలు తాకి ధర్మరాజు ఇలా అన్నాడు.

"పితామహా! రేపు నా సందేహం గురించి నిన్ను అడుగుతాను. భూమి మీది రసం గ్రహించి సూర్యుడు అస్తమిస్తున్నాడు. కృష్ణుడు, కృపుడు, ధర్మరాజాదులూ భీష్మునికి ప్రదక్షిణం చేసి, బ్రాహ్మణులకు నమస్కరించి, సంతోషంతో రథాలు ఎక్కారు. ఆ సువ్రతులందరూ దృషద్వతీ నదిలో స్నానం చేసి, సూర్యునకు అర్ఘ్యమిచ్చి, జపాది మంగళ క్రియలు చేసి, యథావిధిగా సంధ్యావందనం చేసి, హస్తినాపురం ప్రవేశించారు."

59. నీతిశాస్త్ర చరిత్ర - పృథుచక్రవర్తి.

వైశంపాయనుడు ఇట్లు చెప్పాడు. "పాండవులూ, యాదవులూ ఉదయమే లేచి ఉదయ సంధ్యాది కృత్యాలు నిర్వహించి, నగరాల వంటి రథాలమీద బయలుదేరారు. కురుక్షేత్రం చేరి భీష్ముని దగ్గరకు వెళ్లి, 'రాత్రి సుఖంగా గడిచిందా' అని భీష్ముని అడిగారు. వ్యాసుడు మొదలయిన మహర్షులందరికీ అభివాదం చేశారు. వారి అభినందనలు గ్రహించి, అందరూ భీష్ముని చుట్టూ చేరి కూర్చున్నారు. మహాతేజస్వి అయిన ధర్మరాజు భీష్మునికి నమస్కరించి, పూజించి, ఇలా అన్నాడు. ధర్మరాజు అడిగాడు. "రాజా! ఈ రాజు అనే శబ్దం వినిపిస్తోందే ! అది ఎలా పుట్టింది? చెప్పండి. మనుష్యులందరికీ ఉన్నట్లుగానే రాజుకూ కాళ్లూ చేతులు, కంఠం, బుద్ధి, ఇంద్రియాలు, ఆత్మ, సుఖదుఃఖాలు, పృష్ఠం, ముఖం, ఉదరం, శుక్రం, ఎముకలు, మజ్జ, మాంసం, రక్తం, ఉచ్ఛ్వాసనిఃశ్వాసాలు, ప్రాణం, శరీరం, జనన మరణాలు సమానంగా ఉన్నాయి. అలాగే గుణాల విషయంలో కూడా అతడు ఇతరులతో సమానంగానే ఉన్నాడు. తెలివిగల శూరులను సయితం అతడు ఎలా మీరి ఉన్నాడు? శూరులు, వీరులు, ఆర్యులతో కూడిన భూమినంతటినీ రాజు ఒక్కడూ ఎలా రక్షించగలుగుతున్నాడు? లోకులు అతని యెడల ప్రసన్నులై ఉండాలని ఎలా అనుకొంటాడు? ఒక్క రాజు ప్రసన్నుడయితే, లోకమంతా ప్రసన్నత పొందుతోంది. రాజు ఒక్కడే కలతపడితే, రాజ్యమంతా కలత పడుతోంది. ఇది నిజం. భరతోత్తమా! దీనిలోని తత్త్వం వినాలని కోరుతున్నాను. దీని తత్త్వం అంతా చెప్పు. దైవం ముందువలె ఒక్క రాజు ముందు జగత్తంతా శిరసు వంచుతోంది అంటే దీనికి

కారణం చిన్నదై ఉండదు.

భీష్ముడు చెప్పనారంభించాడు. "నరోత్తమా! మొదట కృతయుగంలో రాజ్యం అనేది ఎలా ఏర్పడిందో అంతా మిగల్చకుండా చెపుతాను. శ్రద్ధగా విను. మొదట రాజ్యమూ లేదు. రాజూ లేడు. దండం లేదు. దండించే వాడు లేడు - ప్రజలందరూ ధర్మంతోనే ఒకరినొకరు రక్షించుకొనే వారు. నరులంతా ధర్మంతో అలా పరస్పరమూ రక్షించుకొంటూనే, కొంతకాలానికి చాలా దుఃఖం పొందారు. వారికి మోహం ఆవేశించింది. మోహవశులయిన ఆ మానవులలో సరి అయిన జ్ఞానం పోయింది. దానితో వారిలో ధర్మం నశించింది. జ్ఞానం నశించి, మోహ పరవశులయిన నరులు అందరూ లోభానికి వశులయ్యారు. దానితో మానవులు లభించని దానిని పొందడంకోసం ఎగబడ్డారు. దాని వల్ల కామం అనేది మరొకటి ఏర్పడింది వారిలో. అలా కామవశులయిన వారిని రాగం అనేది మరొకటి స్పృశించింది. రాగం ఆవేశించడంతో ప్రజలకు కార్యాకార్యాలు తెలియలేదు. (కార్యం = చేయదగినది. అకార్యం = చేయదగనిది) రాజా! దానితో ప్రజలు పొందరాని స్త్రీలను పొందేవారు. ఇది మాట్లాడవచ్చును, ఇది మాట్లాడరాదు అనే వేర్పాటు లేకుండా అన్నీ మాట్లాడేవారు. అలాగే తినదగినవి - తినదగనివి అనే భేదం లేకుండా పోయింది. ఇది తప్పు - ఇది ఒప్పు అనే భేదం కూడా లేకుండా అన్నీ చేయడం మొదలు పెట్టారు. ఇట్లా సమాజం అంతా అల్లకల్లోలం అయిపోయింది. అపుడు వేదం నశించిపోయింది. వేదవిజ్ఞానం నశించడంతో, ధర్మం కూడా నశించింది. వేదమూ, ధర్మమూ నశించడంతో, దేవతలకు భయం కలిగింది. దేవతలంతా బ్రహ్మ శరణు చొచ్చారు. పితామహుడయిన బ్రహ్మకు నమస్కరించి ఆయన అనుగ్రహం పొంది వారంతా దుఃఖభారంతో ఇలా అన్నారు. దేవా! మనుష్యలోకంలోని సనాతనవేదాన్ని లోభమోహాది భావాలు మింగేశాయి. దానితో మాకు భయం కలిగింది. ఆ వేద వినాశంతో ధర్మం కూడా నశించి పోయింది. దానితో మేమంతా మానవులతో సమానుల మయ్యాము. సహజంగా నరులు (యజ్ఞాదులలో మాకు హోమాదులు చేసి) మాకు అన్నం పైకి వర్షిస్తారు. మేము వారికి అన్నం (సస్యాదుల రూపంలో) క్రిందికి వర్షిస్తాము- ఇపుడు మానవుల హోమాదులు లేకుండా పోయాయి. దానితో మాకు సంశయం ఏర్పడింది. పితామహా! ఇపుడు మాకు ఏది శ్రేయస్కరమో దాన్ని భావించు. నీ ప్రభావంతో కలిగేది, మా యీ సంశయ భావాన్ని నశింపజేస్తుంది. అపుడు స్వయంభువు అయిన బ్రహ్మ దేవతలతో "దేవతలారా! మీ శ్రేయస్సును గురించి ఆలోచిస్తాను. మీ భయం పోవుగాక" అన్నాడు.

తరువాత బ్రహ్మ తన బుద్ధి నుండి లక్ష అధ్యాయాల శాస్త్రం రచించాడు.

అందులోనే ధర్మం, అర్థం, కామం, వర్ణింపబడ్డాయి - ఈ మూడే త్రివర్గం అని ప్రసిద్ధి చెందాయి. ఈ త్రివర్గం కంటే వేరయిన ఫలమూ, వేరయిన గుణమూ కలది మోక్షం. దాన్ని నాల్గవ దాన్నిగా చెప్పారు. మోక్షానికి మరో త్రివర్గం చెప్పబడింది - అవి సత్త్వం, రజస్సు, తమస్సు అనేవి - దండం వల్ల పుట్టిన త్రివర్గం మరొకటి ఉంది. అవి స్థానం, వృద్ధి, క్షయం అనేవి. ఆత్మ, దేశం, కాలం, ఉపాయం, కార్యం (ప్రయోజనం), సహాయులు - ఈ ఆరూ నీతివల్ల పుట్టిన షడ్వర్గం. త్రయి, ఆన్వీక్షకి, వార్త, దండనీతి అనే విద్యలు నాలుగూ నీతి శాస్త్రంలో విస్తారంగా నిరూపింపబడ్డాయి. బ్రహ్మ చెప్పిన నీతి శాస్త్రంలో (1) మంత్రుల రక్షణ (2) ప్రణిధి (రాజదూత) (3) రాజపుత్రుని లక్షణం (4) గూఢచారుల విచారణకు వివిధోపాయాలు (5) వేర్వేరు స్థానాల్లో, వేర్వేరు పద్ధతుల్లో గూఢచారులను నియమించడం చెప్పబడ్డాయి. సామం, భేదం, దానం, దండం, ఉపేక్ష అనే అయిదు ఉపాయాలూ సంపూర్ణంగా చెప్పబడ్డాయి. మంత్రమంతా పూర్తిగా (రాజ రహస్యాలోచనం) ఇందులో వర్ణింపబడింది. భేదోపాయం యొక్క ప్రయోగం, ప్రయోజనం, మంత్రం యొక్క సిద్ధి, అసిద్ధి, వాని ఫలితమూ అన్నీ ఈ గ్రంథంలో బ్రహ్మ వివరించాడు. హీన, మధ్యమ, ఉత్తమ సంధులు మూడూ చెప్పబడ్డాయి. భయంతో చేసుకొనేది హీనసంధి, సత్కారం చేసి చేసుకొనేది మధ్యమ సంధి. ధనం పుచ్చుకొని చేసుకొనేది ఉత్తమ సంధి. ఇవి అన్నీ సంపూర్ణంగా ఆ నీతి శాస్త్రంలో వర్ణింపబడ్డాయి. శత్రువుల మీదికి దండెత్తే యాత్రా సమయాలు నాలుగింటి వివరణ, అందులో ధర్మవిజయం, అర్థవిజయం, ఆసుర విజయం అనే త్రివర్గమూ విస్తారంగా పూర్తిగా వర్ణింపబడ్డాయి. పంచవర్గలక్షణమూ, దానిలోని మూడువిధాలూ వర్ణింపబడ్డాయి. ప్రకాశమని, అప్రకాశమని దండం రెండువిధాలు, అందులో ప్రకాశం ఎనిమిది విధాలు - అప్రకాశం చాలా విస్తారమయింది. రథాలు, ఏనుగులు, గుర్రాలు, పదాతిదళాలు, విష్టి, నౌకాబలం, చారబలం, దేశికబలం - ఈ ఎనిమిది అంగాలూ ప్రకాశ బలాలు. తేళ్లు మొ॥ జంగమాలు, పాము విషం మొ॥ స్థావరాలు, చూర్ణాలు, స్పర్శ వలన, విషాలు తినడం వలన - ఇలా అప్రకాశాలు చాలా రకాలు. శత్రువులు, మిత్రులు, ఉదాసీనులు అనేవారిని గూర్చి కూడా చెప్పబడింది. మార్గగుణాలన్నీ, భూమిగుణాలు, ఆత్మరక్షణ, ఆశ్వాసం, సర్గాల (రథాదుల) పర్యవేక్షణ అనేవి వివరింపబడ్డాయి. వివిధ కల్పనలు, వేరు వేరు పేర్లు కల చతురంగ బలాల వ్యూహాలు, విచిత్రములయిన యుద్ధాలలో నేర్పు, ఉత్పాతాలు, నిపాతాలు, సుయుద్ధం, సుపలాయితం, శస్త్రాల సంరక్షణం ఇందులో చెప్పబడ్డాయి. సేన ఆపదలో పడటం,

అలాగే ఆ సేనకు సంతోషం చేకూర్చటం, సేనకు ఆపత్కాలం, పత్తి మొ॥ సేనావిభాగాల విజ్ఞానం అంతా ఆ గ్రంథంలో ఉంది.

అలాగే అగడ్తలు (గోతులు) త్రవ్వే పద్ధతి, సేనను యుద్ధానికి సిద్ధం చేయడం, సేనను నడిపించటం, దొంగల చేత, క్రూరులైన ఆటవికుల చేత శత్రుదేశాలను పీడించడం, నిప్పుపెట్టేవారి చేత, విషం పెట్టేవారిచేత, మారువేషాల్లో తిరిగి మోసగించేవారిచేత, సేనాధ్యక్షులను శత్రుపక్షం నుండి విడదీయడం చేత, పాదలను నరకడం చేత, ఏనుగులను తరిమివేయడం చేత, భయం కలిగించడం చేత, భక్తులను ఆరాధించి విశ్వాసం కలిగించడం చేత, శత్రుదేశాన్ని పీడించే విధానాలు ఆ గ్రంథంలో ఉన్నాయి. సప్తాంగాలున్న రాజ్యం యొక్క తగ్గుదల, పెరుగుదల, సమత్వం; దూతల సామర్థ్యం వల్ల రాష్ట్రం పెరగడం, అరి, మధ్యస్థ, మిత్రులను గూర్చి చక్కగా వివరించడం, తనకంటె బలం కలవారిని అణచే విధానాలు, అడ్డగించే పద్ధతులూ అందులో ఉన్నాయి. సూక్ష్మంగా వ్యవహరించే తీరు, ప్రమాదం కలిగించే వారిని వెతికి పట్టుకోవడం, మల్లక్రీడ, ఆయుధ ప్రయోగం, త్యాగం, ధనం కూడబెట్టడం (ఆ గ్రంథంలో ఉన్నాయి) బ్రతుకు తెరువులేనివారిని భరించడం, సేవకులను కనిపెట్టిఉండటం, తగిన సమయంలో దానం చెయ్యడం, వ్యసనాల్లో చిక్కుకొనకపోవడం... (ఆ గ్రంథంలో ఉన్నాయి) అలా రాజగుణాలు, సేనాపతిగుణాలు, త్రివర్గానికి కారణాలు, త్రివర్గ గుణాలు, త్రివర్గ దోషాలు... (ఉన్నాయి) సేవకుల చెడ్డపనులు, వేర్వేరు వృత్తులు, వాటిననుసరించే వారిని అనుమానించటం, ప్రమాదాన్ని తొలగించుకోవడం, లభింపని దానిని పొందటం, పొందిన దానిని వృద్ధిపరచుకోవడం, అలా పెంపొందించుకొన్న దాన్ని పాత్రులయిన వారికి యథావిధిగా దానం చెయ్యడం, ధర్మార్థకామాలకోసం ధనం ఖర్చు చేసే విధానమూ, అలాగే కష్టాలను తొలగించుకోవడం కోసం ధనం ఖర్చుచేసే విధానమూ..... ఆ గ్రంథంలో వివరింపబడింది. క్రోధం వల్ల (4) కామం వల్ల (6) పుట్టిన భయంకర వ్యసనాలు పది చెప్పారు. వేట, జూదం, మద్యపానం, స్త్రీ ఈ నాలుగు వ్యసనాలూ కామజా లని బ్రహ్మ చెప్పాడు. వాక్పారుష్యం, ఉగ్రత్వం, కఠోరంగా దండం ప్రయోగించడం, ఆత్మనిగ్రహం (శరీరాన్ని పీడించడం), పనికిమాలిన వాడికి ఇవ్వడం, ధనం నిష్ప్రయోజనంగా ఖర్చు చేయడం ఈ ఆరూ క్రోధజాలైన వ్యసనాలు. వివిధ యంత్రాలు, వాటి పనులు, శత్రుపీడనం, శత్రునిరోధం, బెండాలను కూల్చడం... అన్నీ చెప్పాడు. చైత్యవృక్షాలను కూల్చివేయటం, కృషి శిల్పాది కర్మలకు అవరోధం చేసే విధానాలు, రథావయవాలు, కవచాలు తయారుచేసే ఉపాయాలు వర్ణింపబడ్డాయి. పణవం,

ఆనకం, శంఖం, భేరులు మొదలయిన యుద్ధ వాద్యాలు మ్రోగించడం; మణులు, పశువులు, భూమి, వస్త్రం, దాసీజనం, సువర్ణం అనే ఆరు ద్రవ్యాలను సేకరించటం; శత్రుద్రవ్యాలను నాశనం చెయ్యడం వర్ణించబడినాయి. తమ అధికారంలోకి వచ్చిన ప్రదేశంలో శాంతి నెలకొల్పడం, సజ్జనులను పూజించడం, విద్వాంసులతో ఏకీభవించడం, దానం, హోమం వీని విధులు తెలుసుకోవడం, మంగళద్రవ్యాలు స్పృశించడం, శరీరాలంకరణం, ఆహార వ్యవస్థ, సదా ఆస్తిక్య బుద్ధి నెలకొల్పడం... ఇవన్నీ ఆ గ్రంథంలో ఉన్నాయి.

ఒక్కడే అయినా ప్రయత్నించే తీరు, సత్యత్వం, మధురమైన మాటలు, ఉత్సవాలలో ధ్వజారోహణాది క్రియలు అన్నీ చెప్పబడినవి. ప్రజలంతా చేరి కూర్చుండే ప్రదేశాల్లో నిత్యమూ ప్రత్యక్షంగాను, పరోక్షంగాను పరీక్షించడం. విప్రుల దండింపరానితనం, యుక్తితో దండించడం, జాతులను బట్టి, గుణాలను బట్టి సేవకుల ఎంపిక.... పౌరుల రక్షణ, రాష్ట్రం అభివృద్ధి పరచడం, ఒక్కొక్క మండలంలో 12 మంది రాజులను నిలపడం.... డెబ్బది రెండు చికిత్సావిధానాలు, దేశ, జాతి, కులాల ధర్మాలు వర్ణించాడు. ధర్మార్థకామ మోక్షాలు వర్ణితా లయ్యాయి. వాని సాధించే ఉపాయాలు, ధనం సంపాదించే పద్ధతులూ చెప్పబడ్డాయి. కోశాగారం వృద్ధి పొందించుకొనే పద్ధతి, ఇంద్రజాలం, ప్రవాహాల గుణదోషాలు వర్ణితాలయ్యాయి. లోకమంతా సన్మార్గం నుండి చలింపకుండా నిలిచే ఉపాయాలన్నీ, ఆ నీతిశాస్త్రంలో బ్రహ్మ వర్ణించాడు. మంగళప్రదమయిన ఈ శాస్త్రం రచించి బ్రహ్మ సంతృప్తితో ఇంద్రాది దేవతలతో ఇలా అన్నాడు. "లోకహితం కోసం త్రివర్గ (ధర్మార్థకామాల) స్థాపనం కోసం సరస్వతీ దేవి ఈ నా బుద్ధిని ప్రభావితం చేసింది. ఈ బుద్ధి దండనీతితో కూడినది. లోకాన్ని రక్షిస్తుంది. నిగ్రహానుగ్రహాలతో కూడి లోకాలను కాపాడుతుంది. ఈ జగత్తు దండంచేత నడపబడుతోంది. లేదా దండాన్నే ప్రవర్తింపజేస్తుంది. అందుచేత ఇది 'దండనీతి' అని ప్రసిద్ధికెక్కింది. ఇది ముల్లోకాలలోను వ్యాపించింది. ఇది షాడ్గుణ్యసారం - మహాత్ముల ముందు నిలుస్తుంది. ధర్మం, అర్థం, కామం, మోక్షం అన్నీ ఇందులో తెల్పబడ్డాయి.

తరువాత ఆ నీతిని మొదటగా శంకరుడు గ్రహించాడు. అతడు బహురూపాలు కలవాడు, విశాలమైన కనులు కలవాడు, మంగళప్రదుడు, స్థిరుడు - ఉమాపతి. ప్రజల ఆయువు తగ్గిపోతుందని తెలిసికొని శివుడు బ్రహ్మచేసిన ఆ శాస్త్రాన్ని సంగ్రహంగా వ్రాశాడు. దానిపేరు వైశాలాక్షం. దాన్ని ఇంద్రుడు గ్రహించాడు. పదివేల అధ్యాయాలున్న ఆ మహాశాస్త్రాన్ని ఇంద్రుడు అయిదువేల అధ్యాయాలలో సంక్షేపించాడు. దానిపేరు

'బాహుదంతకం'. బృహస్పతి ఆ శాస్త్రాన్ని మూడువేల అధ్యాయాలతో సంక్షేపించాడు - దానిపేరు 'బార్హస్పత్యం'. యోగాచార్యుడు, మహాయశస్వి అయిన శుక్రుడు అమితమైన ప్రజ్ఞతో, దాన్ని వేయి అధ్యాయాలతో సంగ్రహం చేశాడు. ఇలా లోకస్థితిని బట్టి, మహర్షులు మర్త్యుల ఆయువు తగ్గిపోవటం తెలుసుకొని సంక్షేపించారు. అపుడు దేవతలంతా వచ్చి విష్ణుమూర్తితో "మానవులందరికంటె శ్రేష్ఠ డయిన ఒక్కనిని మాకు అధిపతిగా ఇమ్ము" అని అడిగారు. భగవంతుడయిన నారాయణుడు ఆలోచించి, తేజోరూపుడయిన విరజుడనే మానసపుత్రుని సృష్టించాడు. కాని విరజుడు ప్రభుత్వం గ్రహించటానికి ఇష్టపడలేదు. అతని బుద్ధి సన్యాసం తీసుకోవాలని నిశ్చయించింది. అతనికి కీర్తిమంతుడు పుత్రుడు. అతనికీ విషయ ప్రీతి లేదు. అతని కొడుకు కర్దముడు. అతడూ తపస్సుకే వెళ్లిపోయి గొప్ప తపస్సు చేశాడు. కర్దమ ప్రజాపతికి అనంగుడనే కొడుకు పుట్టాడు. అతడు సాధువు. ప్రజలకు రక్షకుడు. దండనీతి విశారదుడు. అనంగుని పుత్రుడు అతిబలుడు. నీతిమంతుడు. అతడు రాజ్యం పొందాడు. ఇంద్రియాలకు అతడు వశు డయ్యాడు. మృత్యువు యొక్క మానసపుత్రిక సునీథ. ఆమె మూడులోకాల్లోనూ ప్రసిద్ధికెక్కింది. ఆమె వేనుని కన్నది. ప్రజల్లో అధర్మపరుడూ, రాగద్వేషవశుడు అయిన వేనుని బ్రహ్మవాదులయిన మహర్షులు మంత్రపూతాలైన దర్భలతో చంపివేశారు. మంత్రపూర్వకంగా మహర్షులు వేనుని కుడితొడను మథించారు. దానినుండి వికార రూపంతో, పొట్టి అవయవాలతో ఒక పురుషుడు పుట్టాడు. అతడు కాలిన ఇనుప బొమ్మలా ఉన్నాడు. ఎఱ్ఱని కన్నులు, నల్లని వెంట్రుకలు - వానిని చూసి, బ్రహ్మవేత్తలయిన ఋషులు 'నిషీద' (నిలువుము) అని అన్నారు. అందుచేత వానివలన నిషాదులు పుట్టారు. వారు క్రూరులు. అడవులూ, పర్వతాలూ పట్టి తిరిగేవారు - ఇంకా కొంతమంది వింధ్య పర్వతం నిలయంగా కల మ్లేచ్ఛులు వందలు వేలు పుట్టారు.

మహర్షులు మళ్ళీ వేనుని కుడిచేతిని మథించారు. అపుడు ఇంద్రుని వంటి రూపంకల పురుషుడు పుట్టాడు. అతడు కవచం, ఖడ్గం, బాణాలు, ధనుస్సు ధరించి ఉన్నాడు. వేద వేదాంగాలు తెలిసిన ధనుర్వేద పండితు డతడు. రాజా! ఆ నరోత్తముని దండనీతి అంతా ఆశ్రయించింది. అతడు అంజలి ఘటించి, మహర్షులతో ఇలా అన్నాడు. 'నా బుద్ధి చాలా సూక్ష్మమైనది. ధర్మమునూ, అర్థమునూ దర్శింపగలదు. దీనితో నేను ఏం చెయ్యాలో తత్త్వపూర్వకంగా చెప్పండి. ప్రయోజనంతో కూడిన కార్యం ఏదయినా నాకు మీరు చెపితే దాన్ని తప్పక చేస్తాను. ఆలోచింపనక్కరలేదు.' అపుడు దేవతలూ, మహర్షులూ అతనితో 'ఎక్కడ నియతమైన ధర్మం ఉందో దాన్ని నిశ్శంకంగా ఆచరించు.

ప్రియమూ, అప్రియమూ అనేవి విడచి, సర్వప్రాణుల మీద సమబుద్ధి కలిగి, కామం, క్రోధం, లోభం, మానం దూరంగా వదలి ధర్మం ఆచరించు. సదా ధర్మరక్షణం చేస్తున్నపుడు ఎవడయినా మానవుడు ధర్మం నుండి తొలగితే, నీ చేతులతోనే వానిని (దండించు) నిగ్రహించు. మనసుతో, చేష్టతో, మాటతో (త్రికరణ శుద్ధిగా) "భూమి మీది ఈ బ్రహ్మమును / వేదమును రక్షిస్తాను" అని చాలాసార్లు ప్రతిజ్ఞ చెయ్యి. "దండనీతిని ఆశ్రయించిన నిత్యమైన ధర్మాన్ని నిశ్శంకంగా నిర్వహిస్తాను. ఎన్నడూ ఇంద్రియాలకు వశం కాను" అని ప్రతిజ్ఞ చెయ్యి. ప్రభూ! "ద్విజులు నాకు దండింపదగనివారు. లోకాన్నంతా సంకరం నుండి రక్షిస్తాను" అని ప్రతిజ్ఞ చెయ్యి.' అపుడు వైన్యుడు (వేనుని కొడుకు) దేవతలతో ఋషులతో "పురుష శ్రేష్ఠులయిన బ్రాహ్మణులు నాకు నమస్కరింపదగినవారు" అన్నాడు. బ్రహ్మవేత్తలయిన వారందరు "అట్లే అగుగాక" అని వైన్యునితో అన్నారు. బ్రహ్మనిధి అయిన శుక్రుడు అతనికి పురోహితుడయ్యాడు. వాలఖిల్యులూ, సారస్వతులనే మహర్షిగణమూ అతనికి మంత్రులయ్యారు. గర్గమహర్షి అతనికి జ్యోతిషపండితు డయ్యాడు.

మానవులలో ఇతడు (పృథుడు) తనతో ఎనిమిదవ వాడని వేదం చెపుతోంది. అతని కంటె పూర్వమే సూతుడు, మాగధుడు అని ఇద్దరు స్తోత్రపాఠకులు పుట్టారు. వేనుని కుమారుడైన పృథుమహారాజు వారికి ప్రీతుడై, సూతుడికి అనూపదేశమూ, మాగధునకు మగధదేశమూ ఇచ్చాడు. అతడు భూమి మీద సమత్వం ఏర్పరిచాడు. అంతకు ముందు భూమి ఎగుడు దిగుళ్లుగా ఉండేదని మేము విన్నాం. **మన్వంతరాలన్నిటిలోనూ భూమికి ఎగుడు దిగుళ్లు / ఎత్తుపల్లాలు ఏర్పడుతూ ఉంటాయి. అందుచేత పృథువు తన వింటికొప్పుతో రాళ్లసముదాయాలను పైకి ఎత్తాడు. దానితో పర్వతాలు వృద్ధిపొందాయి.** విష్ణువు, ఇంద్రుడు, దేవతలు, మహర్షులు, ప్రజాపాలకులు, బ్రాహ్మణులూ అంతా పృథువుకు రాజ్యాభిషేకం చేశారు. భూదేవి స్వయంగా రత్నాలు తీసికొని వచ్చి అతనిని సేవించింది. నదీ భర్త అయిన సముద్రుడూ, పర్వతరాజయిన హిమవంతుడూ, ఇంద్రుడూ అతనికి అక్షయమైన ధనం ఇచ్చారు. బంగరుకొండ మేరువు స్వయంగా వచ్చి బంగారం ఇచ్చాడు. యక్షరాక్షసులకు ప్రభువయిన కుబేరుడు ధర్మార్థకామాలు నిర్వహించడానికి ధనమిచ్చాడు. గుర్రాలూ, రథాలూ, ఏనుగులూ, కోట్లకొలదీ భటులూ, పృథువుకు తలచిన వెంటనే వచ్చి చేరాయి. **ఆ రాజు రక్షణ వల్ల రాజ్యంలో ఎవరికీ ముసలితనం లేదు. కరువులేదు. మనోవ్యాధి లేదు - రోగం లేదు. సర్పాల వల్ల కాని దొంగలవల్ల కాని భయం లేదు. మానవుల్లో పరస్పరం భయం లేదు.** సముద్రంలోకి వెళ్లే నీరు కూడా ఆగిపోయింది (సస్యాలకు ప్రవహించేది). పర్వతాలు

కూడా మార్గం ఇచ్చేవి. అతని ధ్వజాలు ఎన్నడూ వాలిపోలేదు. భూమి పృథువుకు కోరినవన్నీ ఇచ్చింది. పదిహేడు రకాల పంటలు ఇచ్చింది. యక్షులు, రాక్షసులు, నాగులు కోర్కెలన్నిటినీ తీర్చేవారు. ఈ లోకమంతటినీ పృథుమహారాజు ధర్మోత్తరం చేశాడు. ప్రజలందరినీ రంజింప చేశాడు. అందుచేత అతడు రాజశబ్దంతో పిలువబడ్డాడు.

బ్రాహ్మణులను క్షతముల (బాధలనుండి)నుండి త్రాణం (రక్షణం) చేశాడు. అందుకే క్షత్రియ శబ్దం అతని పట్ల సార్థకమయింది. పృథువు చేసిన ధర్మపరిపాలన వల్ల, భూమికి పృథివి అనే పేరు వచ్చిందని చాలామంది అన్నారు. సనాతనుడైన విష్ణువు స్వయంగా 'రాజా! నిన్ను ఎవరూ మించిపోలే'రని ఒక స్థాపనం చేశాడు. పృథువు చేసిన తపస్సు చేత, విష్ణువు అతనిలో ఆవేశించాడు. అందుచేత మానవులూ, దేవతలూ కూడా దేవునికి నమస్కరించినట్లు రాజుకు నమస్కరించేవారు. రాజా! రాజ్యాన్ని దండనీతితో సతతమూ రక్షించాలి. గూఢచారులు చూస్తూ ఉంటారు కాబట్టి రాజ్యాన్ని ఎవరూ చెడగొట్టలేరు. మనసూ, చేష్టలూ సమానంగా ఉన్న రాజు చేసే శుభకృత్యాలు శుభఫలాన్నే ఇస్తాయి. అందుచేత లోకమంతా అతని వశంలో ఉంటుంది. దానికి దైవం కంటె వేరే కారణం ఉండదు. అపుడు విష్ణువు నుదుటినుండి బంగారు కమలం పుట్టింది. దాని నుండి లక్ష్మీదేవి జన్మించింది. ఆమె ధర్మానికి పత్ని అయింది. ధర్మం వల్ల లక్ష్మికి అర్థం పుట్టింది. దానితో ధర్మం, అర్థం, లక్ష్మి అతని రాజ్యంలో ప్రతిష్ఠింపబడ్డాయి. నాయనా! ధర్మజా! పుణ్యం నశించి, దివి నుండి భువికి వచ్చిన పుణ్యాత్ముడు దండనీతిలో పండితుడవుతాడు. విష్ణుమహిమతో కూడి రాజుగా పుడతాడు. మంచిబుద్ధి కలిగి గొప్పతనం పొందుతాడు. తరువాత దేవతలు కూడా రాజ్యప్రతిష్ఠితుని చేశాక ఆయన ఆజ్ఞను ఎవరూ అతిక్రమించరు. అలా ఒకని వశంలో జగత్తు అంతా నిలుస్తోంది. అతనిని జగత్తు నియమింపలేదు. శుభమైన కర్మ శుభఫలాన్నే ఇస్తుంది. రాజు మిగిలిన మనుష్యులతో సమానుడయినా, లోకమంతా అతని మాటమీద నిలుస్తుంది. సౌమ్యమయిన రాజు ముఖం చూస్తే అతడు అందం, అర్థం, రూపమూ కలవాడుగా కనిపిస్తాడు. నరులు అతనిని చూసి అతనికి వశులై ప్రవర్తిస్తారు. దండం గొప్ప మహిమ కలది. దానితో నీతికి స్పష్టమైన లక్షణం ఏర్పడింది. నీతి యొక్క ప్రచారం చాలా విస్తృతమైనది. దానితోనే ఈ లోకమంతా వ్యాపించి ఉంది. పురాణాల ఉత్పత్తి, మహర్షుల పుట్టుక, తీర్థవంశం, నక్షత్రవంశం, చతురాశ్రమాలు, చాతుర్హోత్రం, నాలుగు వర్ణాలు, నాలుగు విద్యలూ ఇలా అన్ని విషయాలను ఈ గ్రంథం వివరిస్తుంది. ఇతిహాసాలు, వేదాలు, సమగ్రమైన న్యాయం, తపస్సు, జ్ఞానం, అహింస, సత్యాసత్యాలు, ఉత్తమనీతి, వృద్ధులను సేవించే విధానం, దానం, శౌచం,

ప్రయత్నం, సర్వభూతదయ అన్నీ ఇందులో చెప్పబడ్డాయి. భూమిమీద పాతాళంలోనూ కూడా ఉన్నదంతా ఈ పితామహుని నీతిశాస్త్రంలో ఉంది. ధర్మజా! దానిలో సంశయం లేదు. అందువల్లనే దేవతలు, రాజులు సమానులు అని పండితు లంటారు. ధర్మజా! రాజుల మహత్త్వం గురించి సర్వమూ పూర్తిగా చెప్పాను. ఇంక మరొకటి ఏముంది? ఏమిలేదని భావం."

60. వర్ణ ధర్మముల వర్ణనము.

వైశంపాయనుడు ఇలా చెపుతున్నాడు. "తరువాత పితామహునికి నమస్కరించి, ధర్మరాజు శ్రద్ధతో ఇలా ప్రశ్నించాడు. నాలుగు వర్ణాలవారికి సామాన్య ధర్మాలేవి? వేరు వేరు ధర్మాలేవి? నాలుగు వర్ణాల వారి ఆశ్రమ ధర్మాలు ఏవి? రాజధర్మాలు ఏవి? దేనిచేత రాష్ట్రం అభివృద్ధి పొందుతుంది? రాజు దేనిచేత వృద్ధి పొందుతాడు? పౌరులు, సేవకులు దేనివల్ల వృద్ధి పొందుతారు? ధనాగారం, దండం, దుర్గం, సహాయకులు, మంత్రులు, ఋత్విక్కులు, పురోహితులు, ఆచార్యులు - వీరిలో ఎటువంటి వారిని రాజు వదలి వెయ్యాలి? ఆపదలో రాజు ఎవరిని నమ్మాలి? ఎవని నుండి తనను రాజు దృఢంగా రక్షించుకోవాలి? తాతా! అది నాకు చెప్పు."

భీష్ముడు చెపుతున్నాడు. "మహాధర్మానికి నమస్కారం. సృష్టికర్తయైన కృష్ణునకు నమస్కారం. బ్రాహ్మణులకు నమస్కరించి శాశ్వత ధర్మాలను చెపుతాను. **క్రోధం లేకపోవడం, సత్యం పలకడం, పంచుకొని అనుభవించడం, క్షమ, తన భార్య యందు సంతానం పొందటం, శుచిత్వం, ద్రోహబుద్ధి లేకపోవడం, ఋజుస్వభావం, సేవకులను భరించడం - ఈ తొమ్మిదీ అన్ని వర్ణాలవారికీ, సామాన్య ధర్మాలు. ఇక కేవలం బ్రాహ్మణుని ధర్మాలు చెపుతాను** విను. మహారాజా! ఇంద్రియనిగ్రహమే పురాతన ధర్మం అని చెపుతారు. తన వేదం అభ్యసించడం. వీనితోనే అతని కర్మ సమాప్త మవుతుంది. విహిత కర్మలు చేస్తూ, శాంతి, జ్ఞానవిజ్ఞానాలతో తృప్తుడై, ఉన్న బ్రాహ్మణునికి ఆపత్కర్మ చేయకుండా ధనం లభిస్తే, వివాహం చేసుకొని సంతానం పొందాలి. ఆ ధనంతో యజ్ఞమైనా చెయ్యాలి. లేదా సంతానానికి ఇవ్వవచ్చు. విభజించుకొని సజ్జనులతో కలిసి అనుభవించాలి అని చెప్పబడుతోంది. **బ్రాహ్మణుడు కేవల వేదాధ్యయనంతోనే కృతకృత్యుడవుతాడు. ఇతరమైనవి చేసినా, చేయకపోయినా బ్రాహ్మణుని 'మైత్రుడు' అంటారు. ఇక క్షత్రియుని ధర్మం కూడా చెపుతాను. క్షత్రియుడు దాన మివ్వాలి.**

కాని యాచింపకూడదు. యజ్ఞం చెయ్యాలి కాని చేయించరాదు. వేదం పాఠం చెప్పకూడదు. చదువు (నేర్చు)కోవచ్చు. ప్రజలను పరిపాలించాలి. దొంగలను వధించడంలో నిత్యమూ సిద్ధంగా ఉండాలి. యుద్ధంలో పరాక్రమం చూపించాలి. యజ్ఞాలు చేసేవారూ, వేదశాస్త్రజ్ఞానం కలవారూ, యుద్ధాలు చేసి గెలిచే రాజులే లోకాలను జయించేవారిలో ఉత్తములు. క్షత్రియుడు దెబ్బతినని శరీరంతో యుద్ధం నుండి వెనుదిరిగి వస్తే, ధర్మమెరిగినవారు ఆ పనిని ప్రశంసింపరు. ముఖ్యంగా ఇటువంటి పనిని క్షత్రబంధువుల పద్ధతి అంటారు. దొంగలను అణచివేయడం కంటె రాజులకు ఉత్తమకార్యం లేదు. దానం, అధ్యయనం, యజ్ఞం ఇవన్నీ రాజుకు క్షేమం కలిగించేవే అయినా, ధర్మం కాంక్షించే రాజు ముఖ్యంగా యుద్ధం చెయ్యాలి. రాజు ప్రజలందరినీ వారి వారి ధర్మాలలో నిలపాలి. ధర్మంతో శాంతిపూర్వకంగా అన్నిపనులూ చేయించాలి. రాజు మరోపని చేసినా, చేయకపోయినా చక్కని పరిపాలన వల్లనే కార్యాలన్నీ చక్కబరచగలడు - ఆ రాజును ఐంద్రుడని అంటారు. **వైశ్యుని శాశ్వత ధర్మం ఏమిటో నీకు చెపుతాను. దానం, అధ్యయనం, యజ్ఞం, శుచిగా ధనం సంపాదించడమూ శాశ్వత ధర్మాలు. శ్రద్ధతో పశువులను అన్నిటినీ తండ్రివలె రక్షించాలి. మరోపని చేస్తే అది సత్కర్మకాదు - వికర్మ అవుతుంది. పశురక్షణం వల్ల పరమసుఖం పొందుతాడు. ప్రజాపతి పశువులను సృష్టించి వైశ్యుని కిచ్చాడు.** బ్రాహ్మణునకూ, రాజుకూ ప్రజల నందరినీ ఇచ్చాడు (ప్రజాపతి). వైశ్యుని వృత్తిని, జీవన విధానాన్ని చెపుతాను. ఆరు ఆవులను రక్షిస్తూంటే ఒక ఆవుపాలు వైశ్యుడు జీతంగా తీసుకోవచ్చు. నూరు ఆవులను రక్షిస్తూంటే ఒక ఆవునూ, ఎద్దునూ జీతంగా తీసుకోవచ్చును. ఎద్దుకొమ్ముల వ్యాపారంలో ఏడవభాగమూ, గిట్టల వ్యాపారంలో పదహారవ భాగమూ గ్రహించవచ్చు. అన్ని ధాన్యాల పంటలలోనూ కూడా ఏడవ భాగమే సంవత్సరానికి జీతం - 'నేను పశువులను రక్షించను' అనే భావం ఎన్నడూ వైశ్యునకు రాకూడదు. వైశ్యుడు గోరక్షణ చేయడానికి ఇష్టపడినంతకాలం, గోవులను ఇతరులెవరూ ఏవిధంగానూ రక్షింపరాదు. ఇక శూద్రుని ధర్మం చెపుతాను.

ప్రజాపతి వర్ణాలకు దాసునిగా శూద్రుని కల్పించాడు. అందుచేత శూద్రునికి ఇతర వర్ణాల వారి పరిచర్యయే విధింపబడింది. శూద్రుడు మూడు వర్ణాల వారికీ పరిచరించాలి. వారి శుశ్రూషణం వలన అతడు ఎంతో సుఖం పొందుతాడు. శూద్రుడు ఎన్నడూ ధనం కూడబెట్టరాదు. అలా కూడబెట్టి పాపం మూటగట్టుకొంటాడు. చివరకు ధనవంతుల పాలు చేస్తాడు. రాజు అనుజ్ఞ పొంది శూద్రుడు తనకిష్టమైన ధార్మిక కార్యం చేయవచ్చు. ఇక అతని వృత్తిని, జీవన విధానాన్ని చెపుతాను. మిగిలిన వర్ణాలవారు శూద్రుని తప్పక

భరించాలి. గొడుగు, తలపాగ, ఆసనం, చెప్పులు, విసరుకర్రలు - తాము వాడుకొనేవి - పరిచర్యచేసే శూద్రునకు ఇవ్వాలి. ద్విజాతులు తాము ధరించే వస్త్రాలను శూద్రునకే ఇవ్వాలి. అది వానికి ధర్మ ధనం. ద్విజాతులకు శుశ్రూష చేయటానికి శూద్రుడు వస్తే, తప్పక అతనికి వారు వృత్తి కల్పించాలని ధర్మవేత్తలు అంటారు. సంతానం లేని శూద్రునకు స్వామి అన్నం పెట్టాలి. వృద్ధులను, దుర్బలులను భరించాలి. ఆపదలలో ఉన్న స్వామిని శూద్రుడు విడచి వెళ్లరాదు. పైగా మరింత ఆదరంతో చూడాలి. శూద్రునకు వేరుగా 'సామ్మ్' లేదు. అతడే స్వామికి సామ్మ్ కదా! మూడు వర్ణాల వారి యజ్ఞమే అతనికి యజ్ఞం. స్వాహాకారం, వషట్కారం, మంత్రమూ శూద్రునిలో ఉండవు. అందుచేత శూద్రుడు వైదిక వ్రత దీక్ష పొందకుండా పాకయజ్ఞాల ద్వారా యజ్ఞం చెయ్యాలి. పాకయజ్ఞం యొక్క దక్షిణను పూర్ణపాత్రములు అంటారు. పైజవనుడనే శూద్రుడు ఐంద్రాగ్నమనే విధానంతో యజ్ఞం చేసి, దక్షిణగా లక్షపూర్ణపాత్ర లిచ్చాడని మేము విన్నాం.

బ్రాహ్మణాది మూడు వర్ణాలకూ యజ్ఞం ఎలా విధింపబడిందో, అలాగే వారికి శ్రద్ధగా సేవచేయడమే శూద్రునకు యజ్ఞం అని విధింపబడింది. అన్ని యజ్ఞాలకూ ముందు ఈ శ్రద్ధాయజ్ఞం విధింపబడింది. శ్రద్ధ అనేది గొప్పదైవం- యజ్ఞం చేసేవారిని పవిత్రం చేస్తుంది శ్రద్ధ. ఆయా సేవలతో శూద్రునకు విప్రులు పరమదైవాలు. బ్రాహ్మణులతో కలిసిపోయి వారు కోరికలతో కూడికొని సత్రయాగాలు చేశారు. వారు మూడు వర్ణాలలోను సంతానం పొందారు. బ్రాహ్మణులు దేవతలకు కూడ దేవతలు. వారు నీకు పరమహితాన్ని బోధిస్తారు. అందుచేత యజ్ఞాలన్నీ అన్ని వర్ణాలకు సంబంధించినవే. ఇవి విధిగా చెయ్యాలి. ఇష్టాన్ని బట్టి కాదు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం ఈ మూడింటిని తెలిసిన ద్విజుడు దైవంవలె సర్వదా పూజ్యుడు. ఋగ్యజుస్సామాలు లేని శూద్రుడు ప్రాజాపత్యుడు (ప్రజాపతియే దేవతగా కలవాడు). అందుచేత యజ్ఞం అన్ని వర్ణాలలోను బుద్ధిచేత నెలకొల్పబడింది. **ఈ మానవ యజ్ఞం చేసే వాని యజ్ఞ భాగాన్ని దేవతలు, ఇతర జనులు తప్పకుండా కోరుతారు. అందుచేత అన్నివర్ణాల వారికి శ్రద్ధాయజ్ఞం విధింపబడింది.** బ్రాహ్మణుడు మిగిలిన వర్ణాల వారికి దైవం. వారు అతనికి తనవారే. తనవారి చేత యజ్ఞాలు అతడు తప్పక చేయించాలి. వైశ్యసంసృష్టమయిన వితానాగ్ని తక్కువ గుణం కలది. అయినా బ్రాహ్మణుడు మూడు వర్ణాలవారికీ యజ్ఞం నిర్మించాలి.

అందుచేత యజ్ఞసంబంధం వలన వర్ణాలన్నీ సాధువులే. కర్మల చేత బ్రాహ్మణుడే క్షత్రియాదు లయ్యాడు. వారందరూ బ్రాహ్మణునకు జ్ఞాతులే. అకార రూపమయిన అక్షరమే సామముగా, యజుస్సుగా, ఋక్కుగా అయినట్లు బ్రాహ్మణుడే అన్ని వర్ణాలుగా

ఆయ్యాడు. యజ్ఞం చేయాలనుకొన్న వైఖానసులనే మునుల యజ్ఞగీత లనే గాథలను పురాణవిదులు చెప్పుకొంటూ ఉంటారు. సూర్యోదయం తరువాత కాని, ముందు కాని శ్రద్ధకల జితేంద్రియుడు ధర్మబుద్ధితో అగ్నిని అర్చిస్తాడు. అపుడు కారణం వాని శ్రద్ధయే. హోమసంబంధి విషయాల్లో మొదటిది స్కన్నం. (కొంచెం జారుపాటు గలది) అస్కన్నం శ్రేష్ఠం. యజ్ఞరూపాలు చాలా ఉన్నాయి. అవి నానా కర్మల ఫలరూపాలు. ఆ యజ్ఞా లన్నిటిని జ్ఞాన నిశ్చయంతో తెలిసికొన్న విప్రుడు శ్రద్ధతో వాటిని చేయటాని కర్హు డవుతాడు. దొంగ కానీ, పాపాత్ముడు కానీ, ఇంకా మహాపాపి కానీ యజ్ఞం చేయాలనుకొన్నవానిని సాధువుగానే చెపుతారు. వానిని ఋషులు ప్రశంసిస్తారు. అది మేలయినది. సందేహం లేదు. అందుచేత అందరు యజ్ఞాలు చేయాలని నిర్ణయం. యజ్ఞంతో సమానమయినది ముల్లోకాలలోను లేదు. అందుచేత అసూయలేకుండా మానవుడు శ్రద్ధా పవిత్రతలతో శక్తికి తగినట్లు యథేచ్ఛగా యజ్ఞం చేయాలని చెపుతారు."

61. భీష్ముడు ఆశ్రమ ధర్మములను వివరించుట.

భీష్ముడిలా చెప్పాడు. "ధర్మజా! నాలుగు ఆశ్రమాల ధర్మాలూ, వాని కర్మములూ చెపుతాను విను. బ్రహ్మచర్యం, మహాశ్రమమైన గార్హస్థ్యం, వానప్రస్థం, భైక్షచర్యం (సంన్యాసం) అని నాలుగు ఆశ్రమాలు. ఇందులో నాల్గవదైన సంన్యాసం బ్రాహ్మణులు స్వీకరించారు. ఉపనయన సంస్కారంతో, బ్రాహ్మణత్వం పొంది, అగ్న్యాధానాది కర్మలకు అర్హత పొంది, వేదం అధ్యయనం చేసి భార్యతో కాని, లేకుండా కాని ఇంద్రియ నిగ్రహంతో ఆత్మనిష్ఠ కలిగి, కృతకృత్యుడై, గృహస్థాశ్రమం నుండి వాన ప్రస్థాశ్రమానికి వెళ్లాలి. అక్కడ ఆరణ్యక శాస్త్రాలన్నీ చదివి ధర్మవేత్త కావాలి. అక్కడ ఊర్ధ్వరేతసుడై (బ్రహ్మచర్యంతో) ఉండాలి. అపుడు సంన్యాసం స్వీకరించి మోక్షం పొందాలి. ఊర్ధ్వరేతసులయిన మునుల ఈ సాధనాలే పండితుడయిన విప్రునికి ముందుగా చేయవలసిన కర్తవ్యాలు. రాజా! చక్కగా బ్రహ్మచర్యాశ్రమం పాటించాక, మోక్షకాంక్ష కల విప్రునికి భిక్షాచరణం (సంన్యాసం) మీద అధికారం ఉంది. అది ప్రశస్తం కూడా. **ఎక్కడ సూర్యుడస్తమిస్తే అక్కడే శయనించాలి. కోరికలు, గృహమూ ఉండరాదు. ఏది దొరికితే అది తినాలి. మునియై ఇంద్రియ నిగ్రహం కలిగి ఉండాలి.** ఏ ఆశలూ ఉండరాదు. అన్నిటినీ, అందరినీ సమంగా చూడగలగాలి. భోగాలు ఉండరాదు. వికార రహితుడైన విప్రుడు, క్షేమాశ్రమయిన సంన్యాసాశ్రమం పొంది మోక్షం పొందుతాడు. వేదాలు అధ్యయనం చేసి, పనులన్నీ (బాధ్యతలన్నీ) తీరి, సంతానం పొంది, సుఖాలు అనుభవించి, ముని ధర్మాలతో

కూడిన గృహస్థధర్మం ఆచరిస్తూ, యోగాన్ని అభ్యాసం చేయాలి. ఇలా యోగయుక్తుడై గృహస్థాశ్రమంలో ఉండాలి. వాడు మోక్షం పొందుతాడు. అలా యోగయుక్తుడు కాలేకపోతే గృహస్థాశ్రమంలో ఉన్నవాడు తన భార్యతో తృప్తిపడాలి. ఋతుకాలాల్లోనే సంసారం చేయాలి. వేద శాస్త్ర ధర్మాలను ఆచరిస్తూ ఉండాలి. ధూర్తత కాని, కుటిలత కానీ ఉండరాదు. మితంగా భుజించేవాడు కావాలి. దేవతలను ఆరాధించే ఆసక్తి ఉండాలి. కృతజ్ఞుడై ఉండాలి. సత్యం పలకాలి. మృదువుగా, క్రూరత్వం లేకుండా సహనశీలియై ఉండాలి. ఇంద్రియ సంయమనం కలిగి ఉండాలి. గురుజనులకూ, శాస్త్రాలకూ విధేయుడై ఉండాలి. హవ్యమూ, కవ్యమూ పట్ల శ్రద్ధ ఉండాలి. సదా ద్విజులకు అన్నం పెట్టాలి. మాత్సర్యం ఉండరాదు. బ్రహ్మచర్యాది అన్ని ఆశ్రమాల్లో ఉన్నవారికీ దానం చెయ్యాలి. వేదవిహిత కర్మలలో నిష్ఠ కల్గి ఉండాలి. ఈ లక్షణాలున్నా మోక్షం లభిస్తుంది.

నాయనా! ఈ విషయంలో మహానుభావులయిన మహర్షులు నారాయణ గీతను చెపుతారు. అది ఎంతో ఆర్థవంతమయినది. ఎంతో తపః ఫలితంగా ఏర్పడినది. దాన్ని నేను చెపుతున్నాను విను. **సత్యం, ఋజుత్వం, అతిథులను సత్కరించడం, ధర్మార్థాల పట్ల శ్రద్ధ, తన భార్య యందు మాత్రమే ఆసక్తి - ఇహలోక, పరలోక సుఖాలు అనుభవించడం - ఇది నామతం.*** పుత్రులను, భార్యను, వేదాలను పోషించడం - ఇవి ఉన్న గృహస్థాశ్రమం శ్రేష్ఠమయినదని మహర్షులంటారు. ఇలా యజ్ఞశీలుడయిన బ్రాహ్మణుడు యథాశాస్త్రీయంగా గృహస్థాశ్రమం ఆచరించి, గృహస్థప్రవృత్తిని శోధించి స్వర్గంలో విశుద్ధమైన ఫలం పొందుతాడు. ఆ గృహస్థుడు దేహపరిత్యాగం చేశాక, ఇష్టమై తరగని కామాలు, అనంతస్థితికోసం వచ్చి చేరుతాయి. ఆ కామాలకు అన్ని దిక్కులలోను కన్నులు, శిరస్సులు, ముఖాలు ఉంటాయి. బ్రహ్మచారి మోక్షం పొందే విధానం ఇలా ఉంటుంది. స్మరణము, జపమూ అన్నిటినీ ఏకాంతంగా చేస్తూ, ఒకే గురువుకు శుశ్రూష చేస్తూ, శరీరశుభ్రత కూడా మరిచిపోయి ప్రవర్తించాలి. నిత్యమూ వ్రత, దీక్షలాచరిస్తూ, ఇంద్రియ వశంతో ఏకాగ్రతతో పరిచర్య చేయాలి. అలాగే సదా అధ్యయనం కూడా చేయాలి. గురుశుశ్రూష సతతమూ చేస్తూ పాదాభివందనం చెయ్యాలి. ఫలాపేక్ష లేకుండా షట్కర్మలూ చెయ్యాలి. దేనిమీదా ఆసక్తి ఉండరాదు. ఏ పనీ రాగద్వేషాలతో చేయరాదు. ఎవరిమీదా శత్రుత్వం ఉండరాదు. ఇది బ్రహ్మచర్య లక్షణం.

---

* **సత్యార్జవం చాతిథిపూజనం చ ధర్మస్తథార్థశ్చ రతిః స్వదారైః ।**
నిషేవితవ్యాని సుఖాని లోకే హ్యస్మిన్పరే చైవ మతం మమైతత్ ॥ 14

62. బ్రాహ్మణ ధర్మములు - కర్తవ్య పాలనము.

ధర్మరాజు ఇలా ప్రశ్నించాడు. "శుభం, సుఖం, సత్ఫలం ఇచ్చేవి; హింస లేనివి; లోకసమ్మతాలు, తేలికగా ఆచరింపగలవి; నావంటి వారికి సుఖప్రదాలు అయిన ధర్మాలు నాకు ఉపదేశించు." భీష్ముడు ఇలా చెప్పాడు. "బ్రాహ్మణునకు మాత్రమే నాలుగు ఆశ్రమాలు విధింపబడ్డాయి. మిగిలిన వర్ణాలవారు వాటిని (నాలుగు ఆశ్రమాల విధానం) అనుసరించరు. స్వర్గాన్నిచ్చే రాజసంబంధి కర్మలు చాలా చెప్పబడ్డాయి. కాని నీ ప్రశ్నకు సమాధానాలు కావు. క్షత్రియత్వంలోనే అంతా నిలిచి ఉంది. నివృత్తి పరుడు కావలసిన బ్రాహ్మణుడు, ప్రవృత్తిపరాలైన క్షత్రియ, వైశ్య, శూద్ర కర్మలు ఆచరిస్తే ఆ మందబుద్ధి ఈ లోకంలో నిందనూ, పరలోకంలో నరకమునూ పొందుతాడు. లోకంలో దాసునికీ, కుక్కకూ, తోడేలుకూ పశువుకూ ఏ (చులకనైన) పేరు ఉంటుందో, తనకు విరుద్ధమైన కర్మ ఆచరించే విప్రునికి కూడా అదే పేరు ఉంటుంది. షట్కర్మలూ ఆచరిస్తూ, నాలుగు ఆశ్రమాలలోనూ వర్తిస్తూ, సర్వధర్మమయిన అహింసను పాటిస్తూ, ధర్మకవచంతో కప్పబడి, వశమయిన మనస్సుతో శుద్ధుడై, తపస్సులో ప్రీతి కలిగి, ఆశలు లేని వదాన్యుడయి, విశుద్ధుడైన బ్రాహ్మణునకు అక్షయలోకాలు సిద్ధిస్తాయి. ఏ పురుషుడు ఏ అవస్థలో, ఏ ప్రదేశంలో, ఏకాలంలో, ఎటువంటి పనిని, ఏ ఉద్దేశంతో చేశాడో అదే భావంతో అదే ఫలాన్ని అతడు పొందుతాడు. **వడ్డీవ్యాపారం, వ్యవసాయం, వ్యాపారం, వేట - వీటితో సమానమే వేదాభ్యాసం కూడా అని తెలుసుకో.** కాలంతో ప్రేరేపింపబడిన లోకులు కాలగమనం చేత వశం తప్పి, ఉత్తమ - మధ్యమ - అధమాలయిన పనులు చేస్తారు. పూర్వజన్మలలో చేసిన కర్మలు శుభాలయినా, అశుభాలయినా ఈ జన్మలో అంతమవుతాయి. అవి కూడా అనుభవిస్తేనే అంతం అవుతాయి. అంతే కాదు ఈ జీవుడు చాలా స్వతంత్రుడు. అందుచేత వేరే మళ్లీ తన ఇష్టం వచ్చిన కర్మలు చేస్తాడు. వాటిని మళ్లీ అనుభవిస్తేనే కాని నశించవు. అందుచేతనే కర్మలకు విధినిషేధాలు ఏర్పడ్డాయి. అనగా స్వేచ్ఛాప్రవృత్తిని అడ్డగించేందుకే శాస్త్రమూ, విధినిషేధాలూ వచ్చాయి."

63. వర్ణాశ్రమధర్మములలో రాజధర్మ వైశిష్ట్యము.

భీష్ముడిలా చెప్పాడు. "వింటినారిని లాగడం, శత్రుసంహారం, కృషి, వాణిజ్యం, పశుపాలనం, ధనంకోసం సేవచెయ్యడం, ఇవన్నీ ఎన్నడూ బ్రాహ్మణుడు చేయకూడని పనులు. ఇక చేయవలసిన పనులివి. తెలివిగల గృహస్థు వేదాన్ని, షట్కర్మలను సేవించాలి. ఇలా గృహస్థధర్మంతో చేసే పనులు పూర్తిచేసి, అరణ్యంలో నివసించడం విప్రునికి మేలు

చేకూరుస్తుంది. రాజసేవ, వ్యవసాయంతో ధనం సంపాదించడం, వ్యాపారంతో బ్రతకటం, మోసం, వ్యభిచారం, వడ్డీవ్యాపారం అనేవి విప్రుడు విడిచిపెట్టాలి. జన్మతః బ్రాహ్మణుడై దుష్ప్రవర్తన కలవాడు, ధర్మం తప్పినవాడు, శూద్రస్త్రీని వివాహం చేసుకొన్నవాడు, పిసినారి, నటకుడు, రాజసేవకుడు, విపరీత కృత్యాలు చేసేవాడు బ్రాహ్మణత్వం కోల్పోతాడు. ఇటువంటి పనులు చేసేవాడు వేదాలు చదివినా చదవకపోయినా శూద్రసమానుడే. వానికి శిష్టులతో పంక్తిభోజనం లేదు. దేవకార్యాలలో వానిని విడిచిపెట్టాలి. మర్యాదలు, శుచి శుభ్రతలు పాటింపనివాడు, క్రూర ప్రవర్తన కలవాడు, హింసాపరుడు, తన ధర్మం విడిచినవాడు అయిన విప్రునికి హవ్యం, కవ్యం ఇంకా ఇతరమయినవీ ఇవ్వకూడదు. అందుకే బ్రాహ్మణునకు దమం, శుచిత్వం, ఋజుత్వం మొదలయిన ధర్మాలు విధించారు. అలాగే బ్రహ్మ సర్వాశ్రమాలనూ విప్రునికి ఏర్పరిచాడు. ఇంద్రియనిగ్రహం కలవాడు, యజ్ఞంలో సోమరసం త్రాగేవాడు, చక్కని శీలం కలవాడు, దయ, సహనం కలిగి ఆశలు లేనివాడు, సత్ప్రవర్తన కలిగి మెత్తనైనవాడు, క్రూరత లేకుండా సహనం కలవాడు మాత్రమే విప్రుడు. పాపకర్మలు చేసే ఇతరుడు ఎన్నడూ విప్రుడు కాడు. ధర్మకాంక్ష కల లోకులందరూ శూద్రునీ, వైశ్యునీ, రాజపుత్రునీ ఆశ్రయిస్తారు. శాంతి ధర్మాల మీద ఆసక్తి లేని వర్ణాల వారిని విష్ణుమూర్తి ఇష్టపడడు. అపుడు (విష్ణువు ఇష్టపడకపోతే) ఈ లోకానికంతటికీ ఈ చాతుర్వర్ణ్య వ్యవస్థ ఉండదు. వేద ప్రసంగమే ఉండదు. యజ్ఞాలు, సర్వ లౌకిక వ్యవహారాలు, ఆశ్రమ ధర్మాలూ, అన్నీ నశించిపోతాయి. మూడు వర్ణాల వారికి (బ్రాహ్మణ వైశ్య శూద్రులకు) ఆశ్రమ ధర్మాలు కావాలని కోరే రాజ వినవలసిన నాలుగు ఆశ్రమాల్లోనూ ఉండే ధర్మాలు చెపుతాను విను. **శుశ్రూష చేత కృతార్థుడయినవాడు, సంతానం గలవాడు, రాజానుమతి పొందినవాడు, ఆచారనిష్ఠతో పైవర్ణాలవారి స్థాయికి ఎదిగినవాడు, లేదా మనువు చెప్పిన పది ధర్మాలు ఆచరించే శూద్రుడు శాంతి, దాంతి మొదలగు గుణాలు సహజంగా లేకపోయినా సామర్థ్యంతో సాధించుకొన్న శూద్రుడు ఆశ్రమాలు అన్నీ సేవింపదగును. స్వధర్మం చక్కగా ఆచరించిన శూద్రునకు సంన్యాసం తగినదే అని ధర్మజ్ఞులు చెపుతారు. అలాగే వైశ్యునకు, రాజపుత్రునకు ఆశ్రయింపతగినదే.*** బాధ్యలు తీరినవాడు, వృద్ధుడు, రాజకార్యాలు నిర్వహించినవాడు

★ *విసం॥ దశధర్మాలు : 1. ధైర్యం, 2. ఓర్పు, 3. ఇంద్రియనిగ్రహం, 4. పరద్రవ్యాలు అపహరించకపోవటం, 5. ఆచారం, 6. మనోనిగ్రహం, 7 జ్ఞానం, 8. విద్యలను ఆర్జించటం, 9. సత్యవచనం, 10. కోపం విడనాటడం - ఇవి మనువు చెప్పాడు.(నీల)*

అయిన వైశ్యుడు రాజు అనుమతితో సంన్యాసాశ్రమాన్ని స్వీకరింపవచ్చు. ధర్మపూర్వకంగా వేదాలు అధ్యయనం చేసి, రాజశాస్త్రాలు నేర్చి, సంతానం పొంది, యజ్ఞం చేసి, ధార్మికంగా ప్రజలను పాలించి, రాజసూయం, అశ్వమేధం మొదలయిన యజ్ఞాలు చేసి, బ్రాహ్మణులకు దక్షిణలిచ్చి, చిన్న యుద్ధంలో అయినా విజయం పొంది, పుత్రుని రాజ్యంలో నిలిపి, ఒకవేళ పుత్రులు లేనిచో, ఉత్తముడైన అన్యగోత్రుని రాజును చేసి, పితృయజ్ఞాలతో పితరులను పూజించి, దేవతలను యజ్ఞాలతో అర్చించి, వేదాలతో ఋషులను అర్చించి, అంత్యకాలం వచ్చాక ఇతర ఆశ్రమాలు పొందాలి అనిపిస్తే వానిని క్రమంతో పొందాలి.

రాజేంద్రా! రాజు రాజర్షిగా భిక్షాటనం చేయాలి. అంతేగాని సేవావృత్తిగా కాదు. గృహస్థ ధర్మం విడిచిన తరువాత జీవించాలి కనుక భిక్షాటనం చేయాలి. క్షత్రియులు మొదలగు మువ్వురికీ భిక్షావృత్తి నిత్యం కాదు. కామ్యమే. అలా కామ్యమవటం నాలుగు ఆశ్రమాల వారికీ అని చెపుతారు. లోకశ్రేష్ఠమైన ధర్మం ఆచరిస్తున్న క్షత్రియులచేత, మానవుల ధర్మాలన్నీ తమ భుజాలపై నిలుపబడ్డాయి. మిగిలిన మూడు వర్ణాలవారి ధర్మాలు, ఉపధర్మాలూ కూడా రాజధర్మం వల్లనే జరుగుతున్నాయని వేదం వల్ల వింటున్నాను. రాజా! ఏనుగు అడుగులో అన్ని జంతువుల అడుగులూ ఇమిడి పోయినట్లు, రాజధర్మాల్లో అన్ని దశలతో కూడిన ధర్మాలూ చక్కగా లీనమై పోయాయని తెలుసుకో. ఇతర ధర్మాలన్నీ అల్పుల ఆశ్రయమూ, అల్పమైన ఫలమూ కలవి అని ధర్మవేత్తలు చెపుతారు. రాజధర్మాన్ని మహాశ్రయం కలిగినదనీ చాలా కల్యాణఫలాలు కలిగినదనీ చెపుతారు. ఇతర ధర్మం దేనినీ అలా చెప్పరు. ధర్మాలన్నిటిలో రాజధర్మమే ప్రధాన మయినది. వర్ణాలన్నిటినీ రాజులే పాలిస్తున్నారు. త్యాగమంతా రాజధర్మంలోనే కలుస్తుంది. త్యాగం అన్నిటికంటె ప్రాచీనమైన ధర్మం అని చెపుతారు. పురాతనమయిన ఈ రాజధర్మాన్ని క్షత్రియుడు వదలివేస్తే దండనీతి నశించి త్రయీ (వేదం) ధర్మం మునిగిపోతుంది. అన్ని ధర్మాలూ, ఆశ్రమధర్మాలూ చచ్చిపోతాయి. సర్వత్యాగాలూ రాజధర్మాలలోనే కనిపిస్తాయి. సర్వదీక్షలూ రాజధర్మాలలోనే చెప్పారు. సర్వవిద్యలూ రాజధర్మాలలోనే కలిసి ఉన్నాయి. సర్వలోకాలూ రాజధర్మంలోనే ప్రవేశిస్తాయి. నీచులు పశువులను/మృగాలను చంపుతూ ఉంటారు. అది ధర్మం తెలిసినవారికి, పాటించేవారికీ బాధ కలిగిస్తుంది. రాజధర్మాలు నశిస్తే వాటిని మళ్లీ నిలపటానికి ధార్మికులు ఒక్కొక్కప్పుడు స్వధర్మాన్ని కూడా ఆదరించలేరు."

64. వర్ణాశ్రమ ధర్మములు.

వైశంపాయనుడిట్లు చెప్పాడు. "చతురాశ్రమధర్మాలూ, యతిధర్మాలూ, లౌకిక ధర్మాలూ, వైదిక ధర్మాలూ క్షత్రియ ధర్మంలోనే కలిసి ఉన్నాయి. అన్ని కర్మలూ క్షత్రధర్మంలోనే ఉన్నాయి. క్షత్రధర్మంలో అవ్యవస్థ ఏర్పడితే, ప్రాణిలోకమంతటికీ అసలు ఏ ఆశ ఉండదు. ఆశ్రమవాసుల సనాతన ధర్మం, అనేక ద్వారాలున్నా ప్రత్యక్షంగా కనపడదు. విద్వాంసుడు శాస్త్రాల ద్వారా దాని స్వరూపాన్ని నిర్ణయిస్తాడు. ఇతరులు కొంతమంది వక్తలు ధర్మతత్త్వం తెలుసుకోలేక చక్కని యుక్తులతో, మాటలతో లోకుల విశ్వాసం నష్టపరుస్తారు. అపుడు శ్రోతలు ప్రత్యక్షమైన ఉదాహరణం కనపడక పరలోకంలో భ్రష్టులవుతారు. **ప్రత్యక్షంగా కనపడేది, సుఖంతో నిండినది, ఆత్మయే సాక్షిగా కలది, మోసం లేనిది, సర్వలోకానికీ హితమైనది - ఇటువంటి ధర్మం క్షత్రియులలో ఉంది.** మూడువర్ణాల ధర్మాలూ క్షత్రియ ధర్మంలో అంతర్భవించినట్లు, బ్రహ్మచర్య, వానప్రస్థ, యత్యాశ్రమాలు బ్రాహ్మణుని గృహస్థ ధర్మంలో అంతర్భవిస్తాయి. ఉత్తమ చరిత కల లోకమంతా రాజధర్మంలో అంతర్భూతమైనది. ఇది పూర్వం నీకు చెప్పాను. మిక్కిలిశక్తి కలవాడు, సర్వభూతేశ్వరుడు అయిన నారాయణుని ఒకసారి చాలామంది శూరులయిన రాజులు దండనీతిని పొందటానికి ఆశ్రయించారు. తమ తమ ఆశ్రమ కృత్యాలన్నీ ఒక్కొక్కటీ త్రాసులో తూచి, రాజులు న్యాయనిర్ణయం కోసం వేచి చూస్తూ విష్ణువును సేవిస్తున్నారు. అపుడా ఆదిదేవుడు సాధ్యులనూ, వసువులనూ, అశ్వినీదేవతలను, రుద్రులను, విశ్వేదేవతలనూ, మరుద్గణాలను, సిద్ధులనూ సృష్టించాడు. అందులో సిద్ధులు క్షత్రియధర్మంలో ప్రవర్తించేవారు. ఈ విషయంలో ధర్మమయమయిన అర్థనిశ్చయం చేయటానికి ముందు ఒక ఇతిహాసం చెపుతాను. పూర్వం ఒకసారి ప్రపంచమంతా దానవులతో నిండి మర్యాదలు లేకుండా పోయింది. అపుడు వీర్యవంతుడయిన మాంధాత రాజయ్యాడు. అతడు ఆది మధ్యాంతాలు లేని నారాయణుని చూడాలనే కోరికతో యజ్ఞం చేశాడు. రాజోత్తముడైన మాంధాత ఆ యజ్ఞంలో విష్ణువు యొక్క పాదాలను శిరసుతో స్పృశించి, నమస్కరించాడు. అపుడు విష్ణువు ఇంద్రుని రూపం ధరించి మాంధాతకు దర్శనమిచ్చాడు.

మాంధాత ఉత్తములైన రాజులతో కలిసి ఆ ప్రభువును అర్చించాడు. ఆ మహాత్మునకూ, మాంధాతకూ జరిగిన విష్ణువును గూర్చిన పెద్ద సంవాదం ఇది (వినుము). ఇంద్రుడు అన్నాడు. "అప్రమేయుడు, మాయా సహితుడు, మంత్ర శక్తి కల ఆదిదేవుడు, పురాణుడు అయిన నారాయణుని చూడా లనుకొంటున్నావు కదా. అసలు నీకోరిక

ఏమిటి? ఆ దేవుడు విశ్వరూపుడు. అయినా అతడు సాక్షాత్తుగా బ్రహ్మకు కూడ చూడటానికి శక్యం కాడు. నీ కింకా మనసులో ఇతరమైన కోరికలు ఉంటే వాటిని తీరుస్తాను. నీవు మానవుల్లో రాజువు గదా! నీవు సత్యనిష్ఠకల ధర్మపరుడవు, జితేంద్రియుడవు, శూరుడవు. బుద్ధితోనూ, భక్తితోను, ఉత్తమ శ్రద్ధతోనూ దేవతలపట్ల నీకు దృఢమైన ప్రీతి ఉంది. అందుచేత నీకిష్టమైన వరాలు ఇస్తాను." అపుడు మాంధాత ఇలా అన్నాడు. "భగవంతుడా! నీపాదాల మీద శిరసుపెట్టి ఆదిదేవుడైన నిన్ను నిస్సంశయంగా చూస్తాను. కేవలం ధర్మకాముడనై, మిగిలిన కోరికలన్నీ విడిచి, లోకానికంతకూ కనపడే సన్మార్గమైన అరణ్యానికి వెళ్లాలనుకొంటున్నాను. ఊహకందనంత విశాలమైన క్షత్రియధర్మం వల్ల నాకు లోకాలన్నీ ప్రాప్తించాయి. నాయశస్సు సుస్థిరమైనది. ఆదిదేవుడు ప్రవర్తింపజేసిన, లోకశ్రేష్ఠమైన ఈ ధర్మాన్ని ఎలా ఆచరించాలో తెలియటం లేదు." అపుడు ఇంద్రుడు ఇలా అన్నాడు. "రాజులు కానివారు ధర్మపరులయినా, ధర్మాన్ని పరమగతికి చేర్చలేరు. ఎందుచేతనంటే క్షాత్రధర్మం ఆదిదేవుడు ప్రవర్తింపజేసినది. మిగిలిన ధర్మాలన్నీ తరువాత వచ్చినవీ - శేషభూతాలున్నూ (అనగా అంగములైనవి). శేష ధర్మాలను కూడా భగవంతుడే సృష్టించాడు. కాని శేషధర్మాలు అసంఖ్యాకాలు. నశించే ఫలితం కలవి. క్షాత్రధర్మంలో ఇవన్నీ ఇమిడిపోతాయి. అందుకే క్షాత్రధర్మం శ్రేష్ఠమయినది అని చెపుతారు. పూర్వకాలంలో అమితతేజస్వి అయిన విష్ణువు క్షత్రియధర్మంతో శత్రువులను అణచి, ఋషులను, దేవతలను రక్షించాడు. అప్రమేయుడైన విష్ణువు శత్రువులైన రాక్షసులందరినీ చంపకపోతే బ్రాహ్మణులు లేరు. లోకానికి ఆదికర్త బ్రహ్మ లేడు. ఆది ధర్మమైన ఈ క్షత్రియ ధర్మమూ లేదు. ఆది దేవుడయిన విష్ణువు తన పరాక్రమంతో రాక్షసులను జయించి, భూమిని రక్షింపకపోతే, అసలు బ్రాహ్మణులు మిగిలేవారే కాదు. దానితో చాతుర్వర్ణ్యాలూ లేవు, చతురాశ్రమ ధర్మాలు ఉండేవి కావు. ఎన్నోవిధాలుగా నష్టమైపోయిన శాశ్వత ధర్మాలన్నీ క్షాత్రధర్మంతో మళ్లీ వృద్ధి పొందాయి. ఇలా ప్రతియుగంలోనూ ఆది ధర్మాలు ప్రవర్తిస్తున్నాయి. అందుకే లోకంలో క్షత్రియ ధర్మం శ్రేష్ఠమయినదని చెపుతూ ఉంటారు. యుద్ధంలో శరీరం విడవటం, సర్వప్రాణుల మీద దయ, లోకజ్ఞానం, ప్రజారక్షణం, దుఃఖితులకు పీడితులకు బాధలనుండి మోక్షం కలిగించడం - ఇవి క్షత్రియ ధర్మంలో కనపడే లక్షణాలు. మర్యాదా రహితులు, కామక్రోధాలతో ప్రవర్తించేవారు కూడా రాజభయం ఉంటే పాపం చెయ్యరు, పొందరు. ఇతరులు ధర్మాలన్నిటినీ పొంది, సదాచారాలు కల శిష్టులవుతారు. అందుకే ఈ ధర్మం మంచిదని చెపుతారు. **రాజులు రాజధర్మంతో ప్రజలను కన్న బిడ్డలవలె**

రక్షిస్తూ ఉంటే, లోకంలో సర్వభూతాలు / ప్రాణులూ చక్కగా వడచుకొంటాయి. సందేహం లేదు.* ఇలా క్షత్రియధర్మం అన్ని ధర్మాలకంటె ఉత్తమ మయినది. మేలయినది. సనాతన మయినది. సర్వతోముఖ మయినది. మోక్షపర్యంతం అక్షయంగా నిలుస్తుంది."

65. ఇంద్ర (రూపుడయిన విష్ణువు) మాంధాతల సంవాదము.

ఇంద్రుడు ఇలా చెప్పాడు. "రాజధర్మం ఇంత శక్తిమంతమయినది. సర్వధర్మాల విజ్ఞానంతో నిండినది. అన్నిధర్మాలలోను ఉత్తమమయినది. లోకహితంకోరే మీవంటి ఉదారులు దీన్ని రక్షించాలి. అలా కాకపోతే ప్రజలకు ఉనికియే మిగలదు. పంటలు పండించడం, యాగాదులతో తన్ను సంస్కరించుకోవడం, భిక్షమెత్తకపోవడం, ప్రజలను పాలించడం రాజధర్మాలు. అతనికి సర్వభూత దయ ఉండాలి. యుద్ధంలో దేహం విడవటం రాజుకు ముఖ్యధర్మం. త్యాగం శ్రేష్ఠమని మును లంటారు. రాజధర్మాసక్తి కల రాజులు, నిత్యమూ శరీరాన్ని వదలుతున్నారు. ఇది మనం ప్రత్యక్షంగా చూస్తున్నాం. అందుకే ఇది అన్నిటిలోనూ శ్రేష్ఠమైనది. చాలా శాస్త్రాలు చదవటం, గురు శుశ్రూష, యుద్ధంలో పరస్పరం చంపుకొనటం, అనే వాటితో క్షత్రియుడు బ్రహ్మచారియై ఆశ్రమధర్మం ఆచరిస్తున్నాడని చెపుతారు. సమాన ప్రయోజనం కల వ్యవహారం నడుస్తున్నపుడే, ప్రియాప్రియాలను ప్రయత్నంతో విడిచిపెడుతూనే చాతుర్వర్ణ్య వ్యవస్థను రక్షించాలి. అలాగే ఆయా యోగాలతో, నియమాలతో, పరాక్రమాలతోను, అన్ని ప్రయత్నాలతోనూ ఆశ్రమ ధర్మాలు రక్షించాలి. అందుచేతనే సర్వధర్మాలతో నిండిన రాజధర్మం శ్రేష్ఠమయినది. ఈ రాజధర్మం కలిసి ఉంటేనే, ఇతర వర్ణధర్మాలు, ఆశ్రమధర్మాలు సక్రమంగా పాలింపబడతాయి. ఈ రాజధర్మమే లేకపోతే, ఆయా వర్ణాశ్రమ ధర్మాలకు విపరీతార్థాలు చెపుతారు. **మర్యాదలు లేకుండా, సతతము ధనంమీదనే మనసు ప్రసరించేవారిని పశువులు అంటారు. అటువంటి వారికి, రాజధర్మం అర్థయోగంతోపాటు నీతిని కూడా పొందిస్తుంది. అందుచేత ఆశ్రమధర్మం కంటె కూడా క్షత్రియ ధర్మం శ్రేయస్కరమైనది.** తమకు గతి / పరాయణమైన వేదాధ్యయనం చేయడం. తనకు తగిన ఆశ్రమాలను పొందడం బ్రాహ్మణుని ముఖ్య కర్తవ్యాలు. ఇతరకర్మలు చేస్తే, ఆ బ్రాహ్మణుడు శూద్రునివలె శాస్త్రంతో వధార్హుడు అవుతాడు. రాజా! నాలుగు ఆశ్రమధర్మాలనూ,

---

* పుత్రవత్పాల్యమానాని రాజధర్మేణ పార్థివైః ।
లోకే భూతాని సర్వాణి చరంతే నాత్ర సంశయః ॥ 29

వేదధర్మాలనూ బ్రాహ్మణుడు అనుసరించవచ్చును. ఇతరులెవరూ ఎన్నడూ అనుసరింపరాదు. మరొకవిధంగా ప్రవర్తించేవానికి బ్రాహ్మణవృత్తి కల్పింపబడదు. కర్మచేతనే ధర్మం వృద్ధిపొందుతుంది. ధర్మాన్ని మానవుడు ఎలా వృద్ధిపరుస్తాడో అలాగే అతడూ వృద్ధిపొందుతాడు. తనకు విరుద్ధమైన కర్మం ఆచరించే బ్రాహ్మణుడు గౌరవార్హుడు కాడు. తన ధర్మకర్మను ఆచరింపని వానిని నమ్మదగనివా డని అంటారు. ఈ ధర్మాలన్నీ అన్ని వర్ణాలలోను కలిసి పోయాయి. వాటిని క్షత్రియుడే ఉద్ధరించాలి. అది క్షత్రియ ధర్మం. అందుకే రాజధర్మాలు ఉత్తమాలు. ఇతరాలు కావు - నా మతంలో క్షత్రియ ధర్మంలో బల పరాక్రమాలు ప్రధానాలు."

మాంధాత చెప్పాడు. "యవనులు, కిరాతులు, గాంధారులు, చీనులు, శబరులు, బర్బరులు, శకులు, తుషారులు, కంకులు, పహ్లవులు, ఆంధ్రులు, మద్రకులు, పౌండ్రులు, పులిందులు, రమఠులు, కాంబోజులు, బ్రాహ్మణ క్షత్రియజాతులు, వైశ్యులు, శూద్రులు అన్ని దేశాల్లో ఉన్న మానవులూ, ధర్మాలు ఎలా ఆచరిస్తారు? అందరూ దొంగతనంతో జీవించేవారే కదా! వారిని నావంటి వారు ఎలా నిలద్రొక్కుతారు ? దీనిని వినాలనుకొంటున్నాను. నాకు చెప్పు. ఇంద్రా! నీవు మా క్షత్రియులకు చుట్టానివి." అపుడు ఇంద్రుడు ఇలా అన్నాడు. "(నీవు చెప్పిన) దొంగలందరూ కూడా తల్లిదండ్రుల సేవ చెయ్యాలి. ఆచార్యులను, గురువులను, ఆశ్రమవాసులను సేవించాలి. దొంగలందరికీ రాజులను సేవించడం కర్తవ్యం. వేద ధర్మక్రియలన్నీ ఆచరించడం వారికి విహితమైన ధర్మం. పితృయజ్ఞాలు చెయ్యాలి. నూతులు త్రవ్వించాలి. చలివేంద్రాలు ఏర్పరచాలి. ధర్మశాలలు నిర్మించాలి. తగిన సమయాల్లో విప్రులకు దానాలు ఇవ్వాలి. అహింస, సత్యం, క్రోధం లేకుండా ప్రవర్తించటం, వృత్తుల వారి ఆదాయాలను రక్షించడం, పుత్రులను, భార్యను పోషించడం, శుచిత్వం, ఎవరికీ ద్రోహం చేయకపోవడం - ఇవన్నీ దొంగలకు కూడా ధర్మాలే. ఐశ్వర్యకాములు యజ్ఞాలన్నిటిలోనూ దక్షిణ లివ్వాలి. దస్యులందరూ పాకయజ్ఞాల్లో కూడా పాల్గొని దక్షిణ ఇవ్వాలి. ఇలా దొంగ జాతులకు కూడ పూర్వమే (బ్రహ్మచేత) విధింపబడ్డాయి. ఇవి సర్వలోకానికీ కర్తవ్యాలు."

అపుడు మాంధాత అన్నాడు. "మర్త్యలోకంలో అన్ని వర్ణాలలోను దొంగలు కనిపిస్తారు. నాలుగు ఆశ్రమాల్లోనూ కూడా, వేర్వేరు రూపాల్లో దొంగలు కనిపిస్తారు గదా!" ఇంద్రుడు అపుడు అన్నాడు. "దండనీతి నశించి, రాజధర్మం నిర్వర్తింపబడకపోతే, రాజుయొక్క దుష్టత్వంతో భూతాలన్నీ, ప్రాణులన్నీ మోహం పొందుతాయి. ఈ కృతయుగం వెళ్లిపోతే, భిక్షువులు వేరు వేరు వేషాల్లో అసంఖ్యాకంగా సంచరిస్తారు. లోకులు కామక్రోధాలతో

ప్రేరితులై చెడుమార్గంలో ప్రవర్తిస్తారు. పురాణాల, ధర్మాల పరమగతులను వినక తప్పుదారి పట్టుతారు. మహాత్ముల దండనీతిచేత పాపం తొలగిపోయినపుడు, పరమోత్కృష్టమైన సనాతన ధర్మం క్షీణించిపోదు. స్థిరపడుతుంది. సర్వలోకగురువయిన రాజును అవమానించే వాడు చేసిన దానం, హోమం, శ్రాద్ధం ఎన్నడూ ఫలించవు. మనుష్యులకు అధిపతి, సనాతనుడు, ధర్మంకోరే దైవ స్వరూపుడయిన రాజును దేవతలు కూడ అవమానింపరు. భగవంతుడయిన ప్రజాపతి ఈలోకమంతా సృజించాడు. ధర్మాల ప్రవృత్తి నివృత్తులకోసం క్షత్రియజాతిని సృష్టించాడు. అలా సాగుతున్న ధర్మగమనాన్ని బుద్ధితో స్మరించేవాడు నాకు గౌరవింపదగినవాడు. పూజింపదగినవాడు. ఆ విషయంలోనే క్షత్రియజాతి ప్రతిష్ఠింపబడింది." భీష్ముడు ఇలా అన్నాడు. "ఇలా అని ఆ ప్రభువు దేవగణాలతో, అక్షరమూ, శాశ్వతమూ అయిన విష్ణుని భవనానికి వెళ్లిపోయాడు. ఈ విధంగా ప్రాచీన కాలంలో విష్ణుమూర్తి రాజధర్మాన్ని ప్రవర్తింపజేశాడు. దాన్ని సత్పురుషులు ఆచరించారు. అటువంటి పరిస్థితిలో మనసున్న పండితుడు ఎవడైనా క్షత్రియధర్మాన్ని అవమానిస్తాడా ? ప్రవృత్తి పరాలు, నివృత్తి పరాలు అయిన ధర్మాలు అన్యాయంతో మధ్యలోనే నశించిపోతాయి. గ్రుడ్డివాడు మార్గమధ్యంలోనే పడిపోతాడు కదా! అందుచేత పురుషశ్రేష్ఠా! బ్రహ్మ మొదటగా ప్రవర్తింపచేసిన, ప్రాచీనులకు గతియైన ధర్మచక్రాన్ని నీవిపుడు ప్రవర్తింప జెయ్యి. దానికి నీవు సమర్థుడవని నాకు తెలుసు."

66. రాజధర్మము - ఆశ్రమధర్మాలు.

ధర్మరాజు ఇలా అడిగాడు. "నాలుగు ఆశ్రమాలను గురించి యింతకుముందు నాకు చెప్పావు. వాటినే మళ్లీ వ్యాఖ్యానపూర్వకంగా వివరించి చెప్పు." భీష్ముడు చెపుతున్నాడు. "ధర్మజా! సాధు సమ్మతాలైన ధర్మాలన్నీ నాకు తెలిసినట్లే నీకూ తెలిశాయి. ధార్మిక శ్రేష్ఠా! నీవు నన్ను సూక్ష్మ రూపమయిన ధర్మాన్ని గురించి అడుగుతున్నావు. చెపుతాను విను. చతురాశ్రమ ధర్మాలను పాటించే సదాచార ప్రవృత్తికల వారికి ఈ ఫలితాలన్నీ కలుగుతాయి. రాగద్వేషాలు లేకుండా దండనీతిని ప్రవర్తింపజేసే రాజుకూ ఈ ఫలితాలు కలుగుతాయి. రాజు అందరిపట్ల సమదృష్టి కలిగి ఉంటే సన్యాసాశ్రమ ఫలం (బ్రహ్మలోకప్రాప్తి) కూడా లభిస్తుంది. జ్ఞానం, త్యాగం, ఇంద్రియ నిగ్రహం, సర్వప్రాణులపట్ల దయ కలిగి, శాస్త్రం చెప్పినట్లు నడచుకొనే ధీరునకు (రాజునకు) గృహస్థాశ్రమ ఫలితం కూడా లభిస్తుంది. యోగ్యులను పూజిస్తూ, అన్నిటా నిత్యమూ సంవిభాగంతో ప్రవర్తించే రాజుకు బ్రహ్మచర్యాశ్రమ ఫలం కూడా లభిస్తుంది. జ్ఞాతులను, బంధువులను, మిత్రులను ఆపత్సమయాల్లో ఆదుకొని

ఉద్దరించే రాజుకు దీక్షాశ్రమ గృహస్థాశ్రమ ఫలం దక్కుతుంది. లోకంలో ఉత్తములనూ, ఆయా ఆశ్రమాల్లో శ్రేష్ఠులనూ, తరచుగా సత్కరించే రాజుకు వానప్రస్థాశ్రమ ఫలం దక్కుతుంది. రోజూ చేయవలసిన సంధ్యావందనాదులూ, పితృయజ్ఞాలూ, భూతయజ్ఞాలూ, మనుష్యయజ్ఞాలూ తరచుగా చేసే వానికి వానప్రస్థాశ్రమ ఫలం లభిస్తుంది. భూతాల సంవిభాగం తెలిసి వైశ్వదేవాది యజ్ఞాలనూ, అతిథి సత్కారాలనూ, దేవయజ్ఞాలనూ (తపస్సుతో) చేసే రాజుకు వానప్రస్థాశ్రమ ఫలం లభిస్తుంది. శిష్టుల రక్షణకోసం పరరాష్ట్రాలను మర్దించే రాజుకు వానప్రస్థాశ్రమ ఫలం లభిస్తుంది. సర్వప్రాణులనూ రక్షిస్తూ, తన రాష్ట్రాన్ని పరిపాలిస్తూ, బహువిధాలయిన దీక్షలు పాటిస్తూ ఉండే వానికి సన్యాసాశ్రమ ఫలం లభిస్తుంది. నిత్యమూ వేదాధ్యయనం చేయడం, సహనంతో మెలగడం, ఆచార్యులను పూజించడం, గురుశుశ్రూష – చేసే వానికి సన్యాసాశ్రమ ఫలం లభిస్తుంది. విధిగా నిత్యమూ చేయవలసిన జపాదులు చేస్తూ, సదా దేవపూజ చేస్తూ, ధర్మాచరణం చేసేవానికి గృహస్థాశ్రమ ఫలం లభిస్తుంది. 'మరణమో రక్షణమో' ఏదయినా సరే అనే నిశ్చయంతో ప్రాణద్యూతం/ యుద్ధం చేసే వానికి బ్రహ్మాశ్రమ ఫలితం లభిస్తుంది. సదా అన్నిప్రాణుల పట్ల కపటం లేని, క్రూరత లేని పద్ధతిలో నడచుకొనే వానికి బ్రహ్మాశ్రమపదం లభిస్తుంది. వానప్రస్థులు, వేదాధ్యయన సంపన్నులయిన విప్రులు – వీరికి ఎక్కువగా ధనా లిచ్చే వానికి వానప్రస్థాశ్రమ పదం దక్కుతుంది. **సర్వప్రాణుల మీద దయ చూపిస్తూ, అక్రూరంగా ప్రవర్తించే వానికి అన్ని ఆశ్రమాలవారు పొందే ఫలితం కలుగుతుంది.*** ధర్మజా! బాలురను, వృద్ధులను, సర్వావస్థలలోను దయా పూర్వకంగా సేవించే వానికి సర్వాశ్రమాల ఫలితం కలుగుతుంది. ఇతరుల బలాత్కారానికి లోనైన ప్రాణులనూ, శరణుకోరి వచ్చిన వారినీ సంరక్షించే వారు గృహస్థాశ్రమ ఫలం పొందుతారు. చరాచరాలైన సర్వభూతాలనూ రక్షించడం, ఆయా శ్రేష్ఠులకు యథార్హమైన పూజ చేయటం వీనివల్ల గృహస్థాశ్రమ ఫలం చేకూరుతుంది. అన్నదమ్ముల భార్యలను, అన్నదమ్ములను, కొడుకులను, మనుమలను, ముని మనుమలను సమయోచితంగా కోప అనుగ్రహాలతో చక్కదిద్దేవాడు గృహస్థాశ్రమ ఫలం పొందుతాడు – తపస్సు అంటే అదే. పూజింపదగిన సజ్జనులను పూజించడం, ఆత్మజ్ఞానం కలవారిని రక్షించడం చేసేవారికి గృహస్థాశ్రమ పదం లభిస్తుంది. వేర్వేరు ఆశ్రమాల్లో ఉన్న ప్రాణులకు తనయింట్లో భోజనం పెట్టి, ఆదరించే వానిదే గృహస్థ

* సర్వభూతేష్వనుక్రోశం కుర్వతస్తస్య భారత ।
ఆనృశంస్యప్రవృత్తస్య సర్వావస్థం పదం భవేత్ ॥ 19

ధర్మం. బ్రహ్మసృష్టించిన ధర్మంలో త్రికరణ శుద్ధిగా వర్తించేవాడు అన్ని ఆశ్రమాల సత్ఫలితాలను పొందుతాడు.

ధర్మజా ! ఎవనిలో ఈ చక్కని లక్షణాలు నశించి పోకుండా సదా ఉంటాయో ఆతనిని ఆశ్రమంలో ఉన్న వాడనే అంటారు. స్నానం, కులం, వయస్సులకు తగిన గౌరవమిచ్చి ప్రవర్తించే రాజు (నాలుగు) అన్ని ఆశ్రమాల్లోనూ ఉన్నట్లే. దేశ ధర్మాలనూ, కులధర్మాలను అన్ని విధాలా రక్షించే రాజు సర్వాశ్రమాల ఫలమూ పొందినట్లే. సర్వభూతాలకూ సకాలంలో వైభవాన్ని, కానుకలను సమకూర్చే రాజు సాధువుల ఆశ్రమంలో ఉన్నట్లే. దశ ధర్మాలను పాటిస్తూన్నా సర్వలోకానికీ సంబంధించిన ధర్మం మీద దృష్టిపెట్టిన రాజు సర్వాశ్రమాలలో ఉన్న ఫలితాన్ని పొందుతాడు. **ధర్మ నిపుణతతో లోకంలో ధర్మాచరణ చేసేవారు తన రాజ్యంలో ఉన్నారంటే, ఆ రాజు ఆ ధర్మఫలంలో భాగం పొందుతాడు. పాలితుల ధర్మాచరణాన్ని పాలకుడు రక్షించాలని భావం.** ధర్మం మీద శ్రద్ధగల ధర్మనిలయులను రక్షింపని రాజుకు ఆ పాపం సంక్రమిస్తుంది. ధర్మరక్షణం చేసే రాజులకు సహాయకులుగా ఉండే వారు కూడా, ఇతరులు చేసిన ధర్మంయొక్క ఫలంలో భాగస్వాములవుతారు. మన మందరమూ ఆచరించే గృహస్థాశ్రమం ఆశ్రమాలన్నింటిలో శ్రేష్ఠ మయినది. పవిత్ర మయినది. సర్వప్రాణులను తనతో సమానంగా చూసుకొనేవాడు, దండం లేకుండా క్రోధం విడిచిపెట్టిన వాడు ఇహపరాల్లో సుఖం పొందుతాడు. రాజధర్మం అనేది ఒక నావ. అది ధర్మం అనే సముద్రం మీద ఉంది. సత్త్వ గుణం దాన్ని నడిపించే బలం. ధర్మశాస్త్రం దాని లంగరు/కట్టుత్రాడు. అది త్యాగం అనే గాలి ప్రేరణతో వేగంగా వెడుతుంది. ఆ నౌక రాజును తరింపజేస్తుంది. **తన హృదయంలో ఉన్న కోరికలన్నీ విపత్తి అయితే అపుడు మానవుడు సత్త్వంలో నిష్ఠ కలిగి పరబ్రహ్మమును పొందుతాడు.** భావం చేతనూ, యోగం చేతనూ ప్రసన్నత కల రాజు ప్రజారక్షణం మీద ఆసక్తితో ధర్మఫలాన్ని పొందుతాడు. వేదాధ్యయనం చేస్తూ, సత్కర్మాచరణం చేసే విప్రులను పాలించే ప్రయత్నం చెయ్యి. అలాగే సర్వలోకాన్నీ పాలించు. **మానవులు వనాల్లోనూ, ఆశ్రమాల్లోనూ ఉండి ఆచరించే దాని వల్ల సాధించే ఫలితం కంటె మూరురెట్ల ఫలితాన్ని రాజు ప్రజారక్షణ ధర్మం పాటించి పొందుతాడు.** ఇలా వివిధ రూపాలయిన ధర్మం నీకు వివరించాను. అనాదిగా, పరంపరగా వచ్చే ఆ ధర్మాన్ని నీవు ఆచరించు. ధర్మజ్ఞా! ప్రజారక్షణం మీద ప్రీతి కలిగి ఉంటే, చతురాశ్రమాలకూ, చాతుర్వర్ణ్యానికి సంబంధించిన ధర్మాన్ని, ధర్మ ఫలితాన్ని పొందుతావు."

67. రాష్ట్ర ప్రజల కర్తవ్యము.

ధర్మరాజు ప్రశ్నించాడు. "పితామహా ! నాలుగు ఆశ్రమాల, వర్ణాల ధర్మాలూ చెప్పావు. రాష్ట్ర ప్రజల ముఖ్యకర్తవ్యాన్ని తెలుపుము." భీష్ముడు చెపుతున్నాడు. "రాష్ట్రం యొక్క ముఖ్య కర్తవ్యం రాజును అభిషేకించటమే. పాలకుడు లేకపోతే దుర్బలమైన రాజ్యాన్ని దొంగలు కొల్ల గొడతారు. రాజులేని రాష్ట్రాల్లో ధర్మం నిలవదు. ప్రజలు పరస్పరం తినేస్తారు. రాజులేని రాష్ట్రం ఛీ ! పరమనీచం. 'ఇంద్రుడినే రాజుగా వరించు' నని వేదం. అందుచేత శుభం కోరేవాడు ఇంద్రునివలె రాజును పూజించాలి. రాజులేని రాష్ట్రాల్లో నివసించరాదని నా అభిప్రాయం. రాజులేని రాష్ట్రాల్లో అగ్నిహోత్రుడు కూడ హవ్యాలను స్వీకరించడు. అరాజకాలైన రాష్ట్రాలను, రాజ్యకాంక్షతో బలీయుడెవడైనా ఆక్రమించాలని వస్తే, ఆ రాజును రాష్ట్ర ప్రజలు ఎదురేగి సత్కరించాలి. ఆ సమయంలో ఇదే మంచి ఆలోచన. ఎందుచేతనంటే అరాజకం కంటె మించిన పాపం మరొకటి ఏదీ లేదు. ఆ బలీయుడు చక్కగా పాలిస్తే, రాజ్యమంతా కుశలంగా/క్షేమంగా ఉంటుంది. కోపిస్తే రాజ్యం అంతా నిశ్శేష మయిపోతుంది. ఏమీ మిగలదు. పాలు పితికే వాడిని కష్టపెట్టే ఆవు చాలా బాధలు పడాలి. సుఖంగా పితకనిస్తే దాన్ని గోటితో కూడా గిల్లరు. కాల్చకుండానే మెత్తబడి వంగే దాన్ని ఎవరూ కాల్చరు. స్వయంగా వంగే కర్రను లోకులు వంచరు. ఈ పోలిక ననుసరించి బలవంతుని దగ్గర వంగి ఉండాలి. బలవంతుడికి వంగి నమస్కరిస్తే, ఇంద్రునికి నమస్కరించి నట్లే. అందుచేత అభ్యుదయం కోరేవాడు, రాజుగా బలవంతునే చేయాలి. రాజు లేకపోతే ధనం వల్లగాని, భార్యవల్ల గాని ఏ ప్రయోజనమూ ఉండదు / రెండూ దక్కవు. అరాజక మయిన దేశంలో పాపాత్ముడు పరులధనాన్ని హరించి ప్రీతి పొందుతాడు. ఇతరులు వాడిసొమ్మునంతా హరించివేస్తే అపుడు వాడు 'రాజు తప్పక ఉండాలి' అంటాడు. అరాజకమయిన దేశంలో పాపాత్ములు కూడ ఎప్పుడూ క్షేమంగా ఉండరు. ఒకనిని ఇద్దరు దోచుకొంటే, ఆయిద్దరినీ చాలామంది కలిసి దోచుకొంటారు. దాసుడు కాని వానిని దాసునిగా చేసుకొంటారు. బలవంతంగా స్త్రీలను ఎత్తుకొనిపోతారు. ఈ కారణం చేతనే దేవతలు ప్రజాపాలకులను సృజించారు. ఈ లోకంలో దండం ధరించిన రాజు లేకపోతే, నీటిలో చిన్నచేపలను పెద్ద చేపలు మ్రింగేసినట్లు, దుర్బలులను బలవంతులు మ్రింగివేస్తారు. ఇలాగే పూర్వం చేపలవలె అరాజకమయిన రాజ్యంలోని ప్రజలు ఒకరి నొకరు చంపుకొని తినివేశారని విన్నాం.

అపుడు ప్రజలంతా ఒకచోట చేరి కొన్ని కట్టుబాట్లు చేసుకొన్నారని విన్నాం.

పరుషంగా మాట్లాడేవాడు, కఠినంగా శిక్షించేవాడు, ఇతరుల భార్యలను చెరిచేవాడు, ఇతరుల ధనం అపహరించేవాడు, ఇంకా అటువంటి పనులు చేసేవారు, వీరందరినీ వెలివెయ్యాలి - అని ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాటు అన్ని వర్ణాల వారికీ నమ్మకం కలగటానికి చేసుకొన్నారు. కాని దానిని నిలుపుకోలేకపోయారు. అపుడు వారంతా దుఃఖంతో పితామహుని దగ్గరకు వెళ్లి ఇలా అడిగారు. "ప్రభూ ! మేము రాజు లేక చచ్చిపోతున్నాం. మాకొక రాజును ఇమ్ము - మేమంతా కలిసి వానిని పూజిస్తాం. అతడు మమ్మల్ని పరిపాలిస్తాడు" అన్నారు. అపుడు బ్రహ్మ వారికి మనువును ఇచ్చాడు. కాని మనువు వారికోరిక అంగీకరించలేదు. మనువు అన్నాడు. "నేను ఈ పాపకృత్యానికి భయపడుతున్నాను. రాజ్యం చాలా కష్టమైనది. అందులోనూ సదా కపటప్రవర్తనం కల మనుష్యులలో మరీ కష్టం." భీష్ముడు అన్నాడు. "అపుడు ప్రజలంతా మనువుతో "భయపడకు, పాపం కర్తలనే పొందుతుంది. ఏబది పశువులకు ఒకటి చొప్పున, బంగారంలోనూ అదే విధంగా, ధాన్యంలో పదవభాగమూ నీకోశవృద్ధి కోసం ఇస్తాం. వివాహానికి సిద్ధంగా ఉన్న కన్యలలో అందమైన కన్యను నీకు భార్యగా ఇస్తాం. ముందు భాగాన ఆయుధం, వాహనం దాల్చిన ప్రధాన పురుషులు, ఇంద్రునిముందు దేవతలవలె వస్తారు. అపుడు బలవంతుడవై ఇతరులకు ఎదిరింపశక్యంకాని పరాక్రమవంతుడవు అవుతావు. కుబేరుడు యక్షులను, రాక్షసులను వలె మమ్మందరినీ సుఖంగా భరిస్తావు. రాజరక్షణ కలిగి, ధర్మం చక్కగా ఆచరించే ప్రజలు తమ ధర్మఫలంలో నాల్గవ భాగం నీకు ఇస్తారు. సుఖంగా పొందిన ఆ మహాధర్మబలంతో శక్తి పొంది, ఇంద్రుడు దేవతలను రక్షించినట్లు మమ్మల్ని నీవు కాపాడ గలవు. వెలిగిపోయే సూర్యునివలె విజయం చెయ్యి - శత్రువుల గర్వం నశింపజెయ్యి - నీకు సర్వదా జయం కల్గుగాక"!! అన్నారు. అపుడు మహాతేజస్వి అయిన అతడు బలవంతుడై, మహాజన సముదాయంతో ప్రకాశిస్తూ బయలు దేరాడు. మహేంద్రుని చూసిన దేవతలవలె, ప్రజలంతా వాని మహత్త్వం చూసి భయపడి, తమ ధర్మం మీద మనసు నిలిపారు. అపుడు వర్షం కురిసే పర్జన్యునివలె, పాపాలను నశింపజేస్తూ, అందరినీ తమ పనులలో నిలిపి, భూమి అంతా పర్యటించాడు.

ఇలా శుభాలూ, సంపదలూ కోరే మానవులంతా, ప్రజానుగ్రహం కలగటం కోసం ముందుగా రాజును ఏర్పరచు కోవాలి. శిష్యులు గురువుకూ, దేవతలు దేవేంద్రునకూ నమస్కరించి నట్లు ప్రజలందరూ రాజుకు భక్తితో నమస్కరించాలి. తనవారు గౌరవిస్తే, వానిని ఇతరులు కూడా గొప్పగా భావిస్తారు. తనవారు పరాభవిస్తే, ఇతరులు కూడా

వానిని పరాభవిస్తారు. ఇతరులు రాజును పరాభవిస్తే అది అందరికీ దుఃఖం కలిగిస్తుంది. అందుచేత ఛత్రం, వాహనం, వస్త్రాలు, ఆభరణాలు, భోజనాలు, పానీయాలు, గృహాలు, ఆసనాలు, శయ్యలు - ఇలా అన్నిరకాల ఉపకరణాలు - రాజుకు ఇవ్వాలి. అందుచేత రక్షకుడు ఎవరికీ ఎదిరింపరాని వాడు అవుతాడు. చిరునవ్వుతో ముందుగా రాజు పలుకరించాలి. ప్రతి సంభాషణం మధురంగా చెయ్యాలి. రాజు కృతజ్ఞుడై, దృఢమయిన భక్తికలిగి, పంచుకొని తినే వాడయి ఇంద్రియ నిగ్రహం కలిగి ఉండాలి. మెత్తగా, శుభంగా, చక్కగా ప్రజలచేత చూడబడాలి. అలాగే ప్రజలపట్ల రాజుకూడా ప్రవర్తించాలి."

68. బృహస్పతి వసుమను సంవాదము.

ధర్మరాజు ఇలా ప్రశ్నించాడు. "మానవాధిపతియైన రాజును విప్రులు దైవత మని ఎందుకు అంటారు? పితామహా ! నాకు చెప్పు." భీష్ముడు చెపుతున్నాడు. "ఈ విషయంలో వసుమను డనే రాజు బృహస్పతిని అడిగిన పురాతనమైన ఇతిహాసం ఉదాహరిస్తారు. బుద్ధిమంతులలో ఉత్తము డయిన వసుమనుడనే కోసల దేశపు రాజు బృహస్పతిని ఇలా అడిగాడు. వినయజ్ఞుడైన రాజు వినయపూర్వకంగా బృహస్పతికి యథావిధిగా ప్రదక్షిణ నమస్కారాలు చేశాడు. రాజ్యానికీ, సర్వలోకానికీ హితం, సుఖం, చేకూర్చాలని ధర్మశీలు డయిన బృహస్పతితో రాజ్యవిధిని గురించి ఇలా అన్నాడు. "మహాప్రాజ్ఞా ! దేనివలన ప్రాణులు వృద్ధి పొందుతున్నాయి ? దేనివలన నశిస్తున్నాయి ? ఎవనిని అర్చించి, సుఖపడుతున్నాయి ?" శక్తిమంతుడయిన కోసలరాజు వసుమనుడు ఇలా అడిగితే బృహస్పతి అతనికి రాజసత్కారం గురించి ఇలా చెప్పాడు.

"లోక ధర్మానికి రాజే మూలంగా కనపడుతున్నాడు. రాజ భయం చేతనే, ప్రజలు ఒకరినొకరు తినివేయకుండా ఉంటున్నారు. హద్దులు దాటి, ఇతరుల సంపదలపై ఆసక్తికల లోకాన్ని అంతటినీ రాజే దండనీతి అనే ధర్మంతో చక్కదిద్దుతున్నాడు. రాజా ! సూర్యుడూ, చంద్రుడూ ఉదయించక పోతే ప్రాణులన్నీ ఒకరినొకరు చూడలేక, కారు చీకటిలో మునిగిపోతాయి. నీరు తరిగిపోయిన చెరువులో చేపలూ, హింసిస్తారనే భయంలేనపుడు పక్షులూ, ఇష్టంవచ్చినట్లు అడ్డూ ఆపూ లేకుండా విహరిస్తాయి. ఒక దాని నొకటి రోజూ చంపుకొంటాయి. హద్దులు మీరి ప్రవర్తిస్తాయి. త్వరలో నశించి పోతాయి. సందేహం లేదు. అలాగే రాజు లేకపోతే ఈ ప్రజలంతా పశువుల కాపరి లేని పశువులవలె గాఢాంధకారంలో మునిగి చచ్చిపోతారు. బలవంతులు బలహీనుల సంపదలను దోచుకొంటారు. ఎవరయినా అడ్డుపడి రక్షించుకొంటూ ఉంటే వారిని చంపివేస్తారు. ఇదంతా రక్షించే రాజు లేకపోతే

జరిగే పని. రాజే ప్రజలను రక్షింపకపోతే 'ఇది నాది' అని చెప్పుకొనే ఆస్తి ఉండదు. భార్యలేదు - పుత్రుడు లేడు - ధనంలేదు - ఇల్లూ లేదు, వాకిలీ లేదు. దేశమంతటా అన్నిటికీ లోపమేకాని సమృద్ధి ఉండదు. పాపాత్ములు వాహనాలను, వస్త్రాలను, అలంకారాలను, రత్నాలను-ఇలా అన్నిటినీ ఒక్కసారిగా దోచుకుంటారు. రాజు రక్షింపకపోతే ధార్మికంగా బ్రతికే వారిమెడ మీద కూడా ఎన్నో విధాలయిన ఆయుధాలు పడతాయి. అందరూ అపుడు అధర్మాన్ని ఆశ్రయిస్తారు. రాజు పరిపాలన చేయకపోతే తల్లినీ, తండ్రినీ, వృద్ధులనూ, ఆచార్యునీ, అతిథులనూ, గురువునూ అందరినీ బాధిస్తారు, చంపేస్తారు. రాజు రక్షణ చేయకపోతే నిత్యమూ ధనవంతులకు చావులూ, బంధనాలూ, ఇతర బాధలూ తప్పవు. మమకారం అనేది ప్రజలకు తెలియకుండా పోతుంది. అందరికీ అకాల మరణాలే కలుగుతాయి. లోకమంతా దొంగలమయ మవుతుంది. ఘోర నరకంలో పడిపోతుంది. ఇదంతా రాజు లేకపోతే జరిగే పరిస్థితి. రాజ రక్షణే లేకపోతే వ్యభిచారం దోషం కాదు. ఎవడూ కృషి చెయ్యడు. వ్యాపారం చెయ్యడు. వేద ధర్మం నశించి పోతుంది. రాజు పరిపాలన చేయకపోతే, యథావిధి దక్షిణలతో యజ్ఞాలే జరగవు. వివాహాలు జరగవు. ఆరోగ్యకరమైన సమాజమే ఉండదు. రాజు రక్షించక పోతే, ఎద్దులు ఆవులతో కలియవు. పెరుగుకుండలు చిలకరు, గొల్లపల్లెలు/ఆవుల మందలు నశించి పోతాయి. రాజు రక్షించకపోతే, భయంతో అందరి మనసులూ విలవిల లాడిపోతాయి. హాహాకారాలు చెలరేగుతాయి. అంతా అచేతనమై క్షణంలో నశించి పోతుంది. రాజు రక్షించకపోతే విధిపూర్వకమైన దక్షిణలతో నిర్భయంగా దీర్ఘసత్రయాగాలు సాగవు. రాజు రక్షించకపోతే బ్రాహ్మణులు నాలుగు వేదాలను అధ్యయనం చెయ్యరు. విద్యలలో కాని, వ్రతాల్లోకాని స్నాతకులు తయారుకారు. రాజు రక్షించకపోతే ప్రజలు ఒకరినొకరు చంపుకొంటారు. దానితో ధర్మసంగతి కలగదు. దొంగ పారిపోవలసిన అవసరం లేకుండా, స్వస్థచిత్తంతో దొంగతనం చేసి దర్జాగా పోతాడు. రాజు రక్షించకపోతే చేతిలో దాన్ని చేతిలోనే కొట్టేస్తారు. అన్ని కట్టడులు కూలిపోతాయి. లోకమంతా భయంతో పరుగులు తీస్తుంది. రాజు రక్షించకపోతే నీతిలేనివారు విచ్చల విడిగా సంచరిస్తారు. వర్ణాలన్నీ సంకరమైపోతాయి. రాష్ట్రం అంతటా కరువు ఏర్పడుతుంది.

రాజు ప్రజలను చక్కగా రక్షిస్తూ ఉంటే, ప్రజల ఇంటి తలుపులు తీసుకొని నిర్భయులై యథేచ్ఛగా నిద్రపోతారు. రాజు ధార్మికుడై చక్కగా భూమిని రక్షిస్తూ ఉండకపోతే జనులు పరస్పరం తిట్టుకొంటారు. దొంగతనాలు చెప్పనే అక్కరలేదు. రాజు చక్కగా రక్షిస్తే పురుషుల సాయంలేక పోయినా స్త్రీలు సర్వాలంకారాలు పెట్టుకొని నిర్భయంగా

వీథుల్లో సంచరిస్తారు. రాజు చక్కగా రక్షిస్తే, ప్రజలు ధర్మాన్నే ఆచరిస్తారు. ఒకరినొకరు హింసించుకోరు. ఒకరికొకరు ఉపకారం చేసుకొంటారు. రాజు చక్కగా రక్షిస్తే మూడు వర్ణాలవారూ వేర్వేరు మహాయజ్ఞాలు చేస్తూ ఉంటారు. ఏకాగ్రతతో విద్యలను అధ్యయనం చేస్తారు. ఈ లోకమంతా వార్త మీద నిలుస్తుంది. వేదం దాన్ని ధరిస్తుంది. రాజు చక్కగా పాలిస్తే అంతా చక్కగా నడుస్తుంది. రాజు బలంతో శ్రేష్ఠమైన భారం భుజాని కెత్తుకొని, ప్రజలను భరించేటప్పుడు లోకమంతా ప్రసన్నంగా ఉంటుంది. రాజు లేకపోతే సర్వభూతాలూ స్తంభించిపోతాయి. అత డుంటేనే నిత్యమూ చక్కగా ప్రవర్తిస్తాయి. అటువంటి రాజును పూజింపకుండా ఎవరు ఉంటారు ? సర్వలోకానికీ భయావహమయిన భారం మోసే రాజు యొక్క ప్రియాన్ని, హితాన్ని చూసే మానవుడు రెండు లోకాలను జయిస్తాడు. అటువంటి రాజును గురించి మనసులో అయినా పాపంగా ఆలోచించే వాడు ఇహలోకంలో క్లేశం అనుభవించి, చనిపోయాక నరకం పొందుతాడు.

సామాన్యమానవు డని రాజును ఎన్నడూ కించ పరచరాదు. అతడు నరరూపంలో నిలిచిన ఒక మహా దేవతాస్వరూపం. రాజు ఆ యా సమయాలకు తగినట్లు అగ్ని, సూర్యుడు, మృత్యువు, కుబేరుడు, యముడు అనే అయిదు రూపాలు పొందుతాడు. వంచింపబడిన రాజు తన సమీపంలో ఉన్న పాపాల్ని కాల్చివేస్తున్నపుడు అగ్ని రూపం ధరిస్తాడు. గూఢచారులతో సర్వప్రాణుల ప్రవృత్తులను చూసేటప్పుడు, ప్రజలకు క్షేమం కలిగించేటప్పుడు, సూర్యుని రూపం ధరిస్తాడు. శుచిత్వం లేని ప్రజలను కోపంతో వందలకొద్దీ పుత్రపౌత్రులతో, అమాత్యులతో సహా చంపేటప్పుడు మృత్యువు రూపం ధరిస్తాడు. అధార్మికు లందరినీ తీవ్ర దండాలతో శిక్షిస్తున్నపుడూ, ధార్మికులను అనుగ్రహించేటప్పుడూ యముని రూపం ధరిస్తాడు. ఉపకారులను ధనధారలతో తృప్తిపరుస్తున్నపుడూ, అపకారుల నుండి వివిధ రత్నాలూ లాక్కునేటప్పుడూ, ఒకనికి ధనమిచ్చేటప్పుడూ, ఒకని నుండి ధనం లాక్కునేటప్పుడూ రాజు కుబేరుని రూపం ధరిస్తాడు. సమర్థుడూ, నిపుణంగా కార్యం నిర్వహించే వాడూ, లోకాన్ని ధర్మ సహితంగా కాంక్షించే అసూయలేని రాజుకు వ్యతిరేకంగా నిలువరాదు. పుత్రుడు, సోదరుడు, స్నేహితుడూ, చివరకు ఆత్మసముడైనా సరే రాజుకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే వాడు సుఖపడలేడు. మండిన అగ్ని ఎక్కడో కొంచెమైనా మిగుల్చుతాడు. కాని రాజు యొక్క తిరస్కారం పొందినవానికి మిగలడం అనేది ఎక్కడా ఉండదు. రాజు యొక్క రక్షణీయ వస్తువులన్నిటికీ మానవుడు దూరంగా ఉండాలి. రాజు యొక్క సొమ్మును హరించటాన్ని మృత్యువులె దూరంగా ఉంచాలి. అసహ్యించుకోవాలి.

మృగం బోనును/మారణ యంత్రాన్ని తాకితే వెంటనే నశిస్తుంది. అలాగే రాజు సొమ్మును తాకితే అతడు వెంటనే నశిస్తాడు. తెలివైన వాడు రాజధనాన్ని తన ధనంవలె రక్షించాలి. **రాజధనం అపహరించినవారు ఘోరమైన నరకంలో చాలా కాలం పడి ఉంటారు. ఆ నరకం చైతన్య రహితం చేస్తూ నిలకడలేనిది అయిఉంటుంది.*** భోజుడు, విరాట్టు, సమ్రాట్టు, క్షత్రియుడు, భూపతి, నృపుడు - ఈ పదాలతో స్తుతులనందే రాజును ఎవరైనా పూజిస్తారు. అందుచేత చక్కగా బ్రతకాలనుకొనే వాడు నియమవంతుడు, మనస్సును జయించి ఇంద్రియ నిగ్రహం కలవాడు, మేధావి, జ్ఞాపకశక్తిగలవాడు సమర్థుడూ అయి రాజును ఆశ్రయించాలి. కృతజ్ఞుడు, ప్రాజ్ఞుడు, నీచ బుద్ధి లేనివాడు, దృఢభక్తి కలిగిన జితేంద్రియుడు, ధర్మనిత్యుడు, నీతికి నిలబడే వాడు అయిన మంత్రిని రాజు పూజించాలి. దృఢ భక్తి కలిగిన ప్రజ్ఞాశాలి, ధర్మజ్ఞుడు, ఇంద్రియ నిగ్రహం కలవాడు, శూరుడు, నీచపు పనులు చేయనివాడు, ఒక్కడూ చక్కగా పనులు నిర్వహించగల వానిని రాజు ఆశ్రయించాలి. రాజు మనుష్యుని బలవంతునిగా చేస్తాడు. రాజే బలహీనునిగా కూడా చేస్తాడు. రాజును తిరస్కరించిన వానికి సుఖం ఉండదు. తనను ఆశ్రయించిన వానికి రాజు సుఖం చేకూరుస్తాడు.

రాజుకు ప్రజలు మొదటి శరీరం - ప్రజలే రాజుకు సాటిలేని దేహం - రాజు లేకపోతే దేశాలు నిలవవు - దేశాలు లేకపోతే రాజులే లేరు.

రాజు ప్రజల యొక్క ఉత్తమ హృదయం. గతి, ప్రతిష్ఠ, ఉత్తమ సుఖమూను. రాజా ! రాజును ఆశ్రయించిన పురుషులు ఈ లోకాన్ని, పరలోకాన్ని కూడా జయిస్తారు. ఇంద్రియ నిగ్రహంతో, సత్యంతో, మైత్రితో, రాజు భూమిని పాలించి, గొప్ప యజ్ఞాలు చేసి, కీర్తి పొంది, స్వర్గంలో శాశ్వత స్థానం పొందుతాడు." అంగిరసుడు ఇలా చెపితే వసుమనుడు శ్రద్ధతో ప్రజా పరిపాలనం చేశాడు."

69. రాజుయొక్క విశేష కర్తవ్యములు.

ధర్మరాజు ఇలా ప్రశ్నించాడు. "రాజు విశేషంగా చేయవలసిన కార్యం ఏది మిగిలింది ? రాష్ట్రాన్ని రాజు ఎలా రక్షించాలి ? శత్రువులను ఎలా జయించాలి ? రాజు గూఢచారులను ఎలా ప్రయోగించాలి ? ఆయా వర్ణాల వారి విశ్వాసం ఎలా పొందాలి ?

---

* **మహాంతం వరకం ఘోరమ్ అప్రతిష్ఠమచేతనమ్ ।**
పతంతి చిరరాత్రాయ రాజవిత్తాపహారిణః ॥ 53

సేవకులనూ, భార్యనూ, పుత్రులనూ ఎలా ఆదరించాలి ? అపుడు భీష్ముడు ఇలా అన్నాడు. రాజా ! రాజుకాని, రాజ్యాధికారి కాని చేయవలసిన రాజకార్యాలను వివరిస్తాను. ఏకాగ్రతతో అంతా విను. రాజు ఎల్లపుడూ తన చిత్తాన్ని గెలవాలి. తరువాత శత్రువులను జయించాలి. చిత్తాన్నే జయించనివాడు శత్రువులను ఎలా జయిస్తాడు ? ఆత్మ విజయమంటే పంచేంద్రియాలను నిగ్రహించడమే. జితేంద్రియుడైన రాజే శత్రువులను బాధింపగలడు. దుర్గాలలోను, రాష్ట్రం సరిహద్దులలోను, నగర సమీపాల్లోను, పురాల ఉద్యానాల్లోను రక్షకులను నియమించాలి. సంస్థానాల్లోనూ, అన్ని పురాల్లోను, నగరాల్లోను, అంతఃపురంలోను, రాజ భవనంలోను రక్షకులను నియమించాలి. తరువాత జడులు, అంధులు, చెవిటి వారి ఆకారాలు కలవారినీ, ప్రజ్ఞావంతులను, ఆకలి దప్పులను శ్రమను భరించగలవారినీ, పరీక్షించి గూఢచారులుగా నియమించాలి. మంత్రులు, మిత్రులు, కుమారులు మొదలగు వారి మీద కూడ గూఢచారులను మెలకువతో నియమించాలి. పురంలో, రాష్ట్రంలో, సామంతరాజులలో, ఒకరి కొకరు తెలియకుండా గూఢచారులను నియమించాలి. **వ్యాపార ప్రదేశాల్లో, క్రీడా ప్రదేశాల్లో, సమాజాల్లో, భిక్షుకులలో, తోటల్లో, ఉద్యానవనాల్లో, పండిత సభలలో, వివిధ ప్రదేశాల్లో, నాలుగు రోడ్లకూడళ్లలో, ధనవంతుల గృహాల దగ్గర శత్రువులు పంపిన గూఢచారులను గుర్తించాలి.** ధర్మజా ! ఇలా శత్రువుల గూఢచారులను విచక్షణతో వెదకి పట్టుకోవాలి. ముందుగా గూఢచారులు తెలిస్తే తరువాత మేలు కలుగుతుంది. తాను బలహీను డని రాజు భావిస్తే మంత్రులతో ఆలోచించి, బలవంతు డయిన శత్రువుతో సంధి చేసుకోవాలి.

విద్వాంసులయిన క్షత్రియులు, వైశ్యులు, చాలా శాస్త్రాలు చదివిన బ్రాహ్మణులు, దండనీతి తెలిసిన వారు మంత్రులుగా ఉండాలి. ముందుగా నీతిశాస్త్రం యొక్క తత్వం తెలిసిన బ్రాహ్మణుని అడగాలి. తరువాత నీతికోవిదుడయిన రాజును అడగాలి. ఆ తరువాత శాస్త్రమెరిగి హితం చేసే వైశ్య శూద్రులను అడగాలి.

తన బలహీనత బయట పడకముందే శత్రువుతో సంధి చేసుకోవాలి. ఏదయినా ప్రయోజనం కోరినపుడు కూడా విచక్షణుడైన రాజు త్వరపడి సంధిచేసుకోవాలి. రాష్ట్రాన్ని ధర్మపూర్వకంగా పరిపాలిస్తూ గుణవంతులూ, ఉత్సాహవంతులూ, ధర్మజ్ఞులూ, సాధువులయిన వారి ద్వారా రాజు శత్రువులతో సంధి చేసుకోవాలి. తెలివైన రాజు తన్నుగెంటివేయాలనుకొనే శత్రువులను తెలిసికొని వారిని, పూర్వం అపకారం చేసిన వారిని, లోకం చేత ద్వేషింపబడే వారిని చంపివేయాలి. ఉపకారం కాని అపకారం కాని చేయలేని వానినీ, పెకలించి వేయటానికి శక్యంకాని శత్రువునూ ఉపేక్షించాలి. వీరుడు,

యుద్ధకళానిపుణుడు, బలవంతుడు, కష్టాలు లేనివాడు అయిన రాజు ముందు నగర రక్షణం చేసుకోవాలి. తరువాత యాత్రావిధానానికి సంబంధించి రక్షణ చేసుకోవాలి. అపుడు యాత్రకు ఆజ్ఞాపించాలి. యుద్ధయాత్రకు ఎవని మీదకు వెడుతున్నాడో ఆ శత్రురాజు స్వభావం ముందు తెలుసుకోవాలి. వానికి మిత్రులు, బంధువులు ఉండకూడదు. ఇతరులతో యుద్ధంలో ఉన్నవాడు కావాలి. ఒళ్లు తెలియకుండా ఉండేవాడు కావాలి (స్త్రీ మద్యాదులతో). దుర్బలుడని తెలుసుకోవాలి. ఇవన్నీ తెలిసిన తర్వాతనే యుద్ధయాత్రకు బయలుదేరాలి. పరాక్రమం కలరాజు హీనునికి ఎన్నడూ వశమైపోరాదు. గూఢంగా అతని బల పౌరుషాలను తగ్గింప జేసే ప్రయత్నం చేస్తూ ఉండాలి. శస్త్రాలతో, అగ్నితో, విషంతో, అతని రాష్ట్రాన్ని పీడించాలి. శత్రువు యొక్క మంత్రులకూ, ప్రియవ్యక్తులకూ పరస్పరం వివాదాలు సృష్టించాలి. రాజ్యం కోరే తెలివైన రాజు యుద్ధాన్ని విడిచి పెట్టాలి. మూడు ఉపాయాలతో రాజ్యం లాగుకోవలెనని బృహస్పతి చెప్పాడు. మొదట సామోపాయంతోనూ, తరువాత కొంతదానం చేసి, ఆ తరువాత వాని మిత్రులలో భేదం పెట్టి -- ఇలా ఉపాయాలతోనే రాజ్యం పొంది, తృప్తిపడాలి. అతడే పండితుడు. **ధర్మజా ! ప్రాజ్ఞుడైన రాజు ప్రజల నుండి ఆరవభాగం మాత్రమే పన్ను గ్రహించాలి. అది కూడా ప్రజల రక్షణకోసమే గ్రహించాలి.** పది విధాలుగా దండింపదగిన మత్తులు మొదలయిన వారి నుండి కూడ పౌరుల రక్షణ కోసమే చాలా తక్కువ పన్ను గ్రహించాలి. **పుత్రులను మమమలను చూసినట్లు ప్రజలను చూడాలి. కాని ధర్మనిర్ణయాది వ్యవహారంలో మాత్రం పక్షపాతం చూపరాదు.*** న్యాయ పరిష్కారాలలో వినటానికి సర్వప్రయోజనాలూ దర్శింపగల ప్రాజ్ఞులను నియమించాలి. ఈ వ్యవహారాల్లోనే రాజ్యప్రతిష్ఠ వెల్లడి అవుతుంది. **టంకశాల, ఉప్పుపాలాలు, ధాన్యవిక్రయకేంద్రాలు, రేవులు, గజసైన్యం దగ్గర రాజు తనకు ఆప్తులను, హితులను మంత్రులుగా చేయాలి.** సరి అయిన దండనీతిని ప్రవర్తింప జేసేరాజు ధర్మం పొందుతాడు. రాజు యొక్క సతత దండమే చక్కని ధర్మమని ప్రశంసింపబడింది. రాజు వేదాలు, వేదాంగాలు తెలిసిన ప్రాజ్ఞుడు, తపస్వి, దానశీలుడు, యజ్ఞశీలుడు అయి ఉండాలి. ఈ గుణాలన్నీ రాజులో సతతమూ స్థిరంగా ఉండాలి. ఈ వ్యవహారం లోపిస్తే రాజుకు స్వర్గంలేదు, కీర్తిలేదు.

బలీయుడైన రాజు చేత పీడింపబడితే తెలివైన రాజు దుర్గాన్ని ఆశ్రయించాలి. సమయం చూసి మిత్రుల సహాయం పొంది, రక్షణ విధానం ఏర్పరచుకోవాలి. సామ

---

* **యథా పుత్రాస్తథా పౌత్రాః ద్రష్టవ్యాస్తే న సంశయః ।**
భక్షిశ్చైషాం న కర్తవ్యా వ్యవహారే ప్రదర్శితే ॥ 27

భేదోపాయాలు కానీ, యుద్ధం కానీ - విధాననిశ్చయం చేసుకోవాలి. మార్గాల్లో గోశాలలు నిర్మించాలి. గ్రామాలను తీర్చి దిద్దాలి. వాటిల్లోనూ, శాఖానగరాల్లోనూ మిత్రులను ప్రవేశపెట్టాలి. ధనవంతులూ, బలవంతులూ అయిన వారిని రహస్యంగా దుర్గాలలోను, దేశాల్లోను బ్రతిమాలి అయినా ప్రవేశపెట్టాలి. అవసరమయితే రాజు స్వయంగానే తన పాలాలను కోయించాలి. అది సాధ్యపడకపోతే అగ్నితో కాల్చివేయాలి. (శత్రువుకు ఆహారం దొరకకుండా చేయాలి.) శత్రువు యొక్క పాలాల్లో ఉండే పంటలను కాపాడే ప్రజలను భేదించాలి. లేదా తనబలగంతో ఆ పంటలన్నీ నాశనం చెయ్యాలి. నదుల మీద, రోడ్ల మీద ఉన్న వంతెనలను కూల్చివేయాలి. చెరువులలోని నీటిని వదిలెయ్యాలి. అది కుదరకపోతే ఆ జలాన్ని విషంతో కలుషితం చెయ్యాలి. అప్పుడు కాని, తర్వాత కాని మిత్రకార్యం చేయవలసి ఉన్నాసరే వదలి పెట్టి, యుద్ధంలో తన శత్రువును చంపగల పొరుగు దేశపురాజును ఆశ్రయించి ఉండాలి. రాజు తన చిన్నదుర్గాలను మొదలంట నాశనం చెయ్యాలి. చిన్న చిన్న చెట్ల నన్నిటినీ నరికివేయాలి. అందులో రచ్చబండ చెట్లను వదలివేయాలి. **పెద్ద పెద్ద చెట్ల కొమ్మలను మాత్రమే వరకాలి. రచ్చబండల మీద చెట్ల ఆకులను కూడ కోయరాదు.** ప్రగండు లను ఆకాశ జననులను నిర్మించాలి. మేకులు, మొసళ్లు, పెద్ద చేపలతో పరిఘను నింపాలి. ప్రమాద సందర్భాలలో పురజనులు పారిపోవటానికి దొడ్డిదారులను ఏర్పరచాలి. వాటికి రాజద్వారానికి వలె అన్ని విధాల రక్షణ ఏర్పరచాలి. ద్వారాలలో పెద్దపెద్ద యంత్రాలు నిర్మించాలి. శతఘ్నులను నిలపాలి. అవి అన్నీ తనకు వశమై యుండాలి.

వంటకట్టెలను సరిపడ తెచ్చుకోవాలి. అలాగే నూతులను త్రవ్వించాలి. పూర్వమే త్రవ్విన నూతులను పరీక్షించి వాడుకోవాలి. గడ్డికప్పిన ఇండ్ల మీద బురదపూత పెట్టాలి. చైత్రమాసంలో అగ్ని భయం వల్ల గడ్డిని తీసివెయ్యాలి. రాత్రులయందే రాజు అన్నం వండించాలి. పగటిపూట అగ్ని జ్వలింపరాదు. ఒక్క అగ్ని కార్యంలో తప్ప. కమ్మరి శాలల్లోనూ, పురిటిళ్లలోను మంచి రక్షణతో అగ్నిని ఏర్పాటు చెయ్యాలి. గృహాల్లోని అగ్నులను కప్పి ఉంచాలి. పగటిపూట అగ్ని ప్రజ్వరిల్లితే ఆయింటి వానికి వధయే శిక్ష అని చాటించాలి. నగర రక్షణకోసం ఇలా చెయ్యాలి. **భిక్షుకులను, బండ్లవాళ్లను, పేడివాళ్లను, పిచ్చివాళ్లను, నటులను నగరాలకు వెలుపలనే నిలపాలి. లేకపోతే వారి వల్ల చాలా దోషాలు కలుగుతాయి.** నాలుగు వీధుల కూడళ్లలోను, మంత్రులు మొ॥ ప్రధానుల ఇళ్లదగ్గర, కార్యాలయాల దగ్గర, పెద్ద పెద్ద భవనాల దగ్గర అందరి మనసులనూ తెలుసుకోగల

గూఢచారులను నియోగించాలి. రాజమార్గాలన్నీ విశాలంగా నిర్మించాలి. ఆయా ప్రదేశాల్లో చలివేంద్రాలు, దుకాణాలను ఏర్పాటు చెయ్యాలి. అలాగే కోశాగారాలను, ఆయుధశాలలను, యోధశాలలను, అశ్వశాలలను, ఏనుగులశాలలను, సైన్యశిబిరాలను తగినచోట్ల నిలపాలి. పరిఖలను, మార్గాలను, ఉద్యానవనాలను నిర్మించాలి. వీనిని శత్రువులు గమనింపలేనట్లు రహస్యంగా ఉంచాలి. శత్రుబలం వల్ల భయం కలుగుతుందని ధనాన్ని కూడబెట్టాలి. నూనె, వస, తేనె, నేయి, ఔషధాలు, ఎక్కువగా సేకరించాలి. బొగ్గులు, దర్భలు, ముంజ గడ్డి, మోదుగకర్రలు, లేఖకులు, రెల్లు గడ్డి, గడ్డి, కట్టెలు, విషబాణాలు ఎక్కువగా నిలువచెయ్యాలి. శక్తి, ఈటె, కవచం - మొ॥ అన్ని ఆయుధాలను పెద్ద సంఖ్యలో సేకరించాలి. అన్ని రకాల మందులను, మూలికలను, పండ్లను, నాలుగు రకాల వైద్యులను, విశేషంగా సేకరించాలి. నటులు, నర్తకులు, మల్లులు, ఇంద్రజాల విద్యల వారిని ఆహ్వానించి, వారి విద్యలతో అందరినీ సంతోష పెట్టాలి. సేవకుడు, మంత్రి, పౌరులు మొ॥ వారి విషయంలో రాజుకు అనుమానం కలిగితే వెంటనే వారిని అదుపులోకి తీసుకోవాలి. సేవకాదులు చక్కగా పని నిర్వహించినపుడు రాజు ధనాలతో సత్కరించాలి. తగిన ధనంతో, మంచిగా ప్రసన్నంగా మాట్లాడటంతో, ఇలా ఎన్నో రకాలుగా సత్కరించాలి. ఒకవేళ పొరపాటున రాజు సేవకుని దుఃఖ పెట్టినా, చంపినా శాస్త్రోక్తంగా వాని ఋణం తీర్చుకోవాలి.

రాజు ఏడింటిని తప్పక రక్షించుకోవాలి. 1. తాను 2. మంత్రులు 3. కోశాగారాలు, 4. దండం 5. మిత్రులు 6. జానపదులు 7. పురం. ఈ ఏడింటి సమూహమైన రాజ్యాన్ని ప్రయత్నించి కాపాడుకోవాలి. 1. షాడ్గుణ్యం 2. త్రివర్గం 3. త్రివర్గపరమం - ఈ మూడింటిని చక్కగా తెలిసిన రాజు ఈ భూమిని అనుభవిస్తాడు. ధర్మజా ! షాడ్గుణ్యమంటే చెపుతాను విను. 1. సంధానాసనం 2. యాత్రాసంధానం 3. విరోధించి ఉండుట 4. ద్వైధీభావం 5. యాత్రా పరిగ్రహ్యాసనం 6. ఇతరులను ఆశ్రయించుట. త్రివర్గమని చెప్పబడిన దాన్ని గురించి చెపుతాను శ్రద్ధగా విను. 1. క్షయం 2. స్థానం 3. వృద్ధి = వీటిని త్రివర్గం అంటారు. ఇక త్రివర్గ పరమమంటే 1. ధర్మం 2. అర్థం 3. కామం. వీనిని సమయానికి తగినట్లు సేవించిన రాజు చాలాకాలం భూమిని పరిపాలిస్తాడు. ఈ విషయమై బృహస్పతి చెప్పిన రెండు శ్లోకాలు చెపుతాను విను. నీకు మేలు కలుగుతుంది. అన్ని కర్తవ్యాలు పూర్తి చేసుకొని, భూమిని చక్కగా పరిపాలించి, ప్రజలందరినీ రక్షించిన రాజు పరమందు చాలా సుఖపడతాడు. చక్కగా ప్రజలను రక్షించిన రాజుకు తపస్సుతో పని యేమిటి ? యజ్ఞాలతో పనేమిటి ? సర్వ ధర్మాలూ తెలిసిన వాడు అతడే.

ఈ విషయమై శుక్రుడు చెప్పిన శ్లోకాలు విను. వాటి భావం ఇది. ఇది దండనీతికి, త్రివర్గానికి మూలం. భార్గవాంగి రసకర్మ, షోడశాంగాలు కల బలం, విషం, మాయ, దైవ పౌరుషాలు - ఇవన్నీ అర్థసిద్ధికి కారణాలు. రాజు ఈశాన్యం వైపు పల్లంగా ఉన్న దుర్గాన్ని ఆశ్రయించి త్రివర్గాల(త్రయాన్ని సంపూర్ణంగా గ్రహించి వానిని ఉద్ధరించవచ్చును. **షడ్వర్గాన్ని, పంచవర్గాన్ని, దశదోషాలను లేదా అష్ట దోషాలను జయించి, త్రివర్గంతో కూడి, దశవర్గ జ్ఞానం కల రాజును దేవతలు కూడ జయింపలేరు. స్త్రీలు, మూర్ఖులు, దైవోపహతులు, వేదజ్ఞాన రహితులు - వీరి సలహాలు** ఎన్నడూ రాజు స్వీకరింపరాదు. **వారి బుద్ధి నీతికి పెడమొగమై ఉంటుంది. స్త్రీ మాట మీద నడిచే రాజ్యాలు, విద్వాంసులు లేనివి, మూర్ఖులయిన మంత్రులతో వరితపించే రాజ్యాలు నీటి బిందువులవలె ఆవిరయి పోతాయి.** ప్రఖ్యాత విద్వాంసులు, అన్ని పనులలోను ఆప్తులు, ఎన్నో యుద్ధాలు చూసిన వారు - వీరి మాటలను రాజు వినాలి. దైవం, పురుష కారం, త్రివర్గం, వీటిని ఆశ్రయించి, దైవానికీ, విప్రులకూ నమస్కరించి యుద్ధయాత్రకు వెళ్ళేరాజు విజయం పొందుతాడు.

ధర్మరాజు ఇలా అన్నాడు. దండనీతి, రాజు ఇవి రెండూ కలిసీ ఉంటాయి. విడి విడిగానూ ఉంటాయి. అది ఎవరికి ఏం చేస్తే సిద్ధిస్తుంది ? తాతా ! చెప్పు. అపుడు భీష్ముడు ఇలా చెప్పాడు. రాజా ! దండనీతి యొక్క మహాభాగ్యం ఎటువంటిదో సహేతుకమైన శబ్దాలతో చెపుతాను. విను. **చక్కగా ప్రయోగించిన దండనీతి చతుర్వర్ణాల వారినీ తమ ధర్మసాధనకు నియమిస్తుంది. అధర్మాల నుండి రక్షిస్తుంది. / నిరోధిస్తుంది.** చతుర్వర్ణాల వారూ తమతమ కర్మలలో నిలిచి, హద్దులు సంకరమై పోకుండా దండనీతివల్ల క్షేమం కలుగుతుంది. దానితో ప్రజలు నిర్భయంగా ఉంటారు. అపుడు మూడు వర్ణాల వారూ యథావిధిగా తమ విధులను నిర్వర్తిస్తారు. దానితోనే మనుష్యులకు సుఖం కలుగుతుందని తెలుసుకో. రాజుకు కాలం కారణమా ? లేక రాజే కాలానికి కారణమా అని నీకు సందేహం వద్దు. రాజే కాలానికి కారణం. దండనీతితో రాజు చక్కగా, సమగ్రంగా ప్రవర్తిస్తే అపుడు కృతయుగం అనే కాలం సృష్టింపబడుతుంది. కృతయుగంలో ధర్మమే ఉంటుంది. అధర్మం ఎక్కడా ఉండదు. అన్ని వర్ణాలవారి మనసులూ అధర్మం మీద ఆసక్తి చూపవు. ప్రజలకు యోగక్షేమాలు చక్కగా ప్రవర్తిస్తాయి. సందేహం లేదు. వైదిక గుణాలన్నీ నడుస్తాయి. ఋతువు లన్నీ సుఖకరంగానూ, రోగరహితాలు గానూ ఉంటాయి. మానవుల స్వరాలూ, వర్ణాలూ, మనస్సులూ ప్రసన్నంగా ఉంటాయి. **కృతయుగంలో రోగాలు రావు. తక్కువ ఆయుర్దాయం కల మానవుడు కనపడడు. విధవస్త్రీలు ఉండరు. కృపణుడు/దీనుడు/దుఃఖితుడూ పుట్టనే పుట్టడు. భూమి దున్నకుండానే పండుతుంది. ఓషధులు తమంత తామే వీర్పడతాయి. చెట్ల బెరడులు, ఆకులు,**

ఫలాలు, వేళ్లు ఎంతో శక్తిమంతాలై ఉంటాయి. ధర్మజా ! అపుడు అధర్మం ఉండదు. కేవలం ధర్మమే ఉంటుంది. ఇవి కృతయుగ ధర్మా లని తెలుసుకో. వాలుగవ వంతు భాగం వదలి మూడు భాగాలు మాత్రమే దండనీతిలో ఆచరించినపుడు త్రేతాయుగం వచ్చినట్లు. అధర్మం యొక్క నాలుగవ భాగం మిగిలిన మూడు భాగాలతో కలుస్తుంది. భూమి దున్నితేనే పండుతుంది. ఓషధులు కూడ అలాగే పురుష ప్రయత్నంతోనే ఫలిస్తాయి. సగం భాగం వదలి, సగం నీతిని రాజు అనుసరిస్తే అపుడు ద్వాపరయుగం అనే కాలం వస్తుంది. అధర్మం యొక్క సగభాగం మిగిలిన ధర్మం యొక్క సగభాగంతో కలుస్తుంది. దానితో దున్నిన భూమి కూడా సగం ఫలమే ఇస్తుంది. రాజు దండనీతిని పూర్తిగా వదలిపెట్టి, అయోగ్యమయిన ఉపాయాలతో ప్రజలను బాధించినపుడు కలి ప్రవర్తిస్తుంది. కలియుగంలో అధర్మం ఎక్కువ. ధర్మం ఎక్కడా కనపడదు. అన్ని వర్ణాల వారి మనసూ స్వధర్మం నుండి జారిపోతుంది. శూద్రులు సంన్యాసం తీసుకొని జీవిస్తారు. బ్రాహ్మణులు ఇతరులకు సేవచేసి బ్రతుకుతారు. యోగ క్షేమాలు నశించిపోతాయి. వర్ణ సంకరం ఏర్పడుతుంది. వైదిక కర్మలన్నీ విరుద్ధగుణాలుగా కనిపిస్తాయి. ఋతువులన్నీ సుఖకరంగా ఉండవు. రోగ సహితాలు అవుతాయి. మనుష్యుల స్వరాలు, వర్ణాలు, మనస్సులూ ముడుచుకు పోతాయి. రోగాలు వస్తాయి. మానవులు త్వరగా కాలంతీరి చచ్చిపోతారు. విధవలు ఏర్పడుతారు. ప్రజలు క్రూరు లవుతారు. ఒక చోట మేఘం వర్షం కురుస్తుంది. ఒక చోట పంటలు పండుతాయి. దండనీతితో ప్రజలను చక్కగా రక్షించాలని రాజు భావించకపోతే అపుడే సర్వరసాలూ క్షీణించి పోతాయి. కృతయుగానికీ, త్రేతాయుగానికీ, ద్వాపరయుగానికీ, కలియుగానికి కూడా రాజే కారణమవుతాడు. కృతయుగాన్ని సృష్టించడంచేత రాజు సంపూర్ణంగా స్వర్గఫలం పొందుతాడు. త్రేతాయుగ సృష్టితో స్వర్గం పూర్తిగా అనుభవించడు. ద్వాపరయుగం ప్రవర్తిస్తే యథాభాగంగా (సగం) పొందుతాడు. కలియుగ ప్రవర్తనతో రాజు ఎంతో పాపం పొందుతాడు. ఆ దుష్కర్ముడు నరకంలో శాశ్వతంగా నివసిస్తాడు. ప్రజల పాపాల్లో మునిగిపోయి అపకీర్తినీ, పాపాన్నీ పొందుతాడు. అందుచేత క్షత్రియుడు దండనీతిని పురస్కరించుకొని చక్కగా తెలిసి, లభించని దాన్ని పొందాలి. పొందిన దాన్ని రక్షించుకోవాలి. (ఇదే యోగక్షేమాలు పొందడం) ప్రజల యోగ క్షేమాలు ప్రవర్తిస్తాయి. సందేహంలేదు. దండనీతి లోకాన్ని చక్కగా నడుపుతుంది. లోకంకోరే మర్యాద దండనీతిని

చక్కగా నడిపితే తల్లీ, తండ్రీ లాగా కాపాడుతుంది. ప్రాణులన్నీ దండనీతిలోనే సుఖిస్తాయి ధర్మజా ! తెలుసుకో. దండనీతి వల్లనే రాజు రాజు అనిపించుకొంటాడు. ఇదే రాజుయొక్క పరమధర్మం. అందుచేత ధర్మజా ! నీతిమంతుడవై ప్రజలను ధర్మంతో పరిపాలించు. ఇలా ప్రజలను రక్షించి దుర్జయమైన స్వర్గం పొందు.

70. రాజుకు ఉండవలసిన ముప్పదిఆరు గుణాలు.

ధర్మరాజు ప్రశ్నించాడు. 'రాజు ఎటువంటి ప్రవర్తనతో ఇహపరాల్లో సుఖోదర్కాలయిన ఫలాలు పొందుతాడు ?' అపుడు భీష్ముడిలా చెప్పాడు. 'ఇవి ముప్పది ఆరు గుణాలు – గుణవంతుడయిన రాజు ఈ గుణాలతో కూడి సద్గుణు డనిపించుకొంటాడు. 1. రాగద్వేష రహితుడై ధర్మా లాచరించాలి. 2. ఆస్తికుడై స్నేహం విడువరాదు 3. క్రూరత లేకుండా ధనం ఆర్జించాలి 4. ఉద్ధతుడు కాకుండా కామాన్ని సాధించాలి. 5. దైన్యం లేకుండా ప్రియం పలకాలి. 6. శూరుడై కూడా ఆత్మస్తుతి చేసుకోరాదు. 7. దానం చెయ్యాలి. కాని అపాత్రులకు కాదు. 8. ప్రతిభకలవాడవ్వాలి కాని కఠినుడు కారాదు. 9. దుష్టులతో కలియ కూడదు 10. బంధువులతో విడిపోరాదు 11. రాజభక్తిలేని వాని చేత గూఢచారి పని చేయింపరాదు 12. పీడించకుండా పని చెయ్యాలి. 13. ఇష్టమైన దాన్ని దుష్టుల దగ్గర చెప్పకూడదు. 14. తనగుణాలు తాను చెప్పుకోరాదు 15. సజ్జనుల నుండి ధనం గ్రహింపరాదు 16. దుష్టుని ఆశ్రయింపరాదు. 17. పరీక్షించకుండా దండింప కూడదు. 18. రహస్యాలు బయట పెట్టరాదు 19. పిసినారులకు ధనం ఇవ్వరాదు. 20. అపకారులను నమ్మరాదు. 21. అసూయ లేకుండా భార్యను రక్షించాలి. 22. శుద్ధమనుసుండాలి కాని శిక్షవిషంలో నిర్దయుడు కావాలి. 23. స్త్రీలను అతిగా సేవింపరాదు. 24. స్వాదువయిన భోజనమే కాని అహితమైనది తినరాదు. 25. స్తబ్ధతలేకుండా/వినయంతో మాన్యులను పూజించాలి. 26. గురువులను కపటం లేకుండా సేవించాలి 27. ఆర్భాటం లేకుండా దైవాన్ని ఆరాధించాలి. 28. అనిందిత మయిన ధనం కోరుకోవాలి. 29. ప్రేమతో సేవించాలి. 30. సమయం తెలిసి కార్యాచరణానికి పూనుకోవాలి. 31. మృదుత్వం ఉండాలి కాని విడిచి పారెయ్యటానికి కాదు. 32. అనుగ్రహిస్తూ ఆక్షేపించరాదు. 33. తెలుసుకోకుండా దండింపరాదు 34. శత్రువును చంపినా వారి బంధువులను దుఃఖపెట్టరాదు 35. అకస్మాత్తుగా కోపం పొందకూడదు. 36. అపకారుల పట్ల మృదుత్వం పనికిరాదు. రాజ్యస్థుడవై, శ్రేయోభిలాషి వయితే ఇలా ప్రవర్తించాలి.

మరొక విధంగా ప్రవర్తించేరాజు ఎంతో భయం పొందుతాడు. ఈ గుణాలను చెప్పినట్లు పాటించేవారు ఇహమందు శుభం పొంది, స్వర్గంలో మహిమను పొందుతారు.' వైశంపాయనుడు అన్నాడు. 'భీష్ముని ఈ మాటలను శ్రద్ధగా విని, పాండవులతో కలిసి ధర్మరాజు పితామహునికి నమస్కరించి, ఆతడు చెప్పినది అంతా ఆచరించాడు.'

71. రాజ్యపాలనమునకు ప్రధాన విషయము.

ధర్మరాజు ఇలా ప్రశ్నించాడు. పితామహా ! ప్రజలను రక్షించే రాజుకు మనోవ్యథ ఎలా కలుగకుండా ఉంటుంది ? ధర్మం విషయమై తప్పు చేయకుండా ఎలా ఉండ గలుగుతాడు ? నాకు చెప్పు. భీష్ముడు చెప్పాడు. 'రాజా ! శాశ్వతధర్మాలను గూర్చి నీకు సంక్షిప్తంగానే చెపుతాను. విస్తారంగా చెపితే వాటికి అంతం ఉండదు. ధర్మనిష్ఠకల శాస్త్ర పారంగతులను, వేదవ్రత శీలులను, గుణవంతులయిన ద్విజులను అర్చించి, ఇంటిలో ఉంచుకో. వారిని ఎదురేగి తీసికొనివచ్చి, పాదాభివందనం చేసి పురోహితునితో కలిసి, కార్యాలన్నీ నిర్వహించు. ముందు సంధ్యాది ధర్మ కృత్యాలు నిర్వర్తించి, మంగళప్రదమైన వస్తువులు దర్శించి, అర్థసిద్ధిని, జయాన్ని కలిగించే విప్రాశీర్వాదాలు పొందు. త్రికరణ శుద్ధి కలిగి, ధృతితో, బుద్ధితో యథార్థం గ్రహించాలి. కామక్రోధాలు విడిచిపెట్టాలి. రాజు కామక్రోధాలతో ఏపని చేసినా అతడు ధర్మం కాని, అర్థం కాని గ్రహింపలేడు. అర్థకామాల విషయంలో లోభులను కాని, మూర్ఖులను కాని నియోగింపకూడదు. లోభం లేని వారినీ, బుద్ధిమంతులను అన్ని పనులలోను నియోగించాలి. కార్యజ్ఞానం లేని మూర్ఖుని ఏవిషయంలో నియోగించినా అతడు కామక్రోధవశుడై కార్యదీక్ష లేకుండా ప్రజలను బాధిస్తాడు. పంటలలో కప్పమైన ఆరవభాగంతోను, అపరాధులు చెల్లించే ధనంతోను, శాస్త్ర నిర్ణీతమైన వేతనంతోను రాబడిని పొందు. ధర్మయుక్త మయిన పన్ను గ్రహించి రాజు నీతితో, శ్రద్ధతో, ప్రజలకు యోగక్షేమాలు కల్పించాలి. రక్షణ ఇస్తూ, దాతయై, ధర్మం తప్పకుండా, అలసట లేకుండా, రాగద్వేషాలకు లోబడకుండా ఉండే రాజుపట్ల ప్రజలు అనురాగం కలిగి ఉంటారు. లోభంతో కాని, అధర్మంగా కాని ధనం రావాలని భావించకు. శాస్త్రం మీద శ్రద్ధలేని వానికి ధర్మం, అర్థం స్థిరంగా ఉండవు. శాస్త్రానికి వ్యతిరేకంగా వర్తించేరాజు ధర్మార్థాలను పొందలేడు. ఒకవేళ ధనం పొందినా అది అస్థానంలో ఉండటం చేత సర్వధనాన్నీ నశింపజేస్తుంది. ధనమే ముఖ్యం అని భావించేవాడు శాస్త్రంలో లేని పన్నులతో ప్రజలను మభ్యపెట్టి, పీడిస్తూ చివరకు తన్నుతాను హింసించుకొంటాడు. పాలు కావలసినవాడు ఆవుపొదుగు కోస్తే పాలు రావు. అలాగే తప్పుడు పద్ధతితో రాజు ప్రజలను పీడిస్తే ఆ రాష్ట్రం వృద్ధిచెందదు.

పాలిచ్చే ఆవును నిత్యమూ సేవించేవాడు పాలు పొందుతాడు. అలాగే ఉపాయంతో రాష్ట్రాన్ని అనుభవించేవాడు ఫలం పొందుతాడు. ధర్మజా ! ఉపాయంతో రాష్ట్రాన్ని అనుభవిస్తూ చక్కగా రక్షించేరాజు ధనాగారం నిత్యం వృద్ధిచేసుకొంటాడు. తృప్తి చెందిన తల్లి పిల్లలకు సమృద్ధిగా పాలు ఇస్తుంది. అలాగే రాజు రక్షించిన భూమి తన వారివల్ల, పరులవల్ల కూడా ధన ధాన్యాలను ఇస్తుంది. రాజా! మాలకరి వంటి వాడివి అగుము. బొగ్గులు చేసేవాడివి కాకు. అలా అయితే చాలా కాలం రాజ్యం పాలింపగలవు. శత్రువులపై దండయాత్రలతో నీధనం అయిపోతే అబ్రాహ్మణుల నుండి సామోయంతో మళ్లీ ధనం పొందు. ధనవంతు డయిన బ్రాహ్మణుని చూసి నీమనస్సు చలింపరాదు. చివరి దశలో బలిస్తే ప్రయోజనం ఏమిటి? యథాశక్తిగా వారి యోగ్యతనను సరించి బ్రాహ్మణులకు ధనాలు ఇమ్ము. వారిని అనునయిస్తూ రక్షిస్తూ దుర్జయమయిన స్వర్గం పొందుతావు. ఇలా ధర్మ ప్రవర్తనతో నీవు ప్రజలను రక్షించు. దానితో సుఖపర్యవసానం కలపుణ్యమూ, నిత్యమైన కీర్తినీ పొందుతావు. ధర్మప్రవృత్తితో ప్రజలను పాలించు. దాని వలన నీకు మనోవ్యథ కలగదు ధర్మజా ! రాజుకు ప్రజలను రక్షించడమే పరమధర్మం. ప్రాణుల పట్ల దయ చూపటమే రక్షణం. ఇదే పరమధర్మం అని ధర్మజ్ఞులైన పండితులు భావిస్తారు. రక్షణం చేసే రాజు ప్రాణులపై దయ చూపుతాడు. అదే మహాధర్మం. **భయం నుండి ప్రజలను ఒక్కదినం రక్షించక పోయినా రాజు ఆ పాపఫలం వెయ్యేళ్లు అనుభవిస్తాడు.*** ప్రజలను ధర్మంతో రక్షిస్తూ, ఒక్కరోజు పుణ్యం చేసినా ఆరోజు ఫలం పదివేల యేళ్లు స్వర్గంలో అనుభవిస్తాడు. యజ్ఞాలు చేసినవాడు, చక్కగా వేదాధ్యయనం చేసినవాడు, చక్కగా తపస్సు చేసినవాడు ఎంతకాలమో చేస్తేనే పుణ్యలోకాలు పొందుతారు. కాని ప్రజలను ధర్మంతో రక్షించే రాజు ఆ పుణ్యలోకాలు క్షణంలో పొందుతాడు. ధర్మజా ! ఇలా ప్రయత్నంతో ధర్మాన్ని రక్షించు. దానితో పుణ్యఫలం పొందుతావు. మనోవ్యథలో చిక్కుకొనవు. స్వర్గలోకంలో మిక్కిలి గొప్ప సంపద పొందుతావు. రాజులు కాని వారిలో ఈ ధర్మాలు అసంభవం. అందుచేత రాజే ధర్మం పొందుతాడు. ఇతరుడు కాడు. అటువంటి రాజువైన నీవు ధైర్యంతో, ధర్మంతో రాజ్యరక్షణం చెయ్యి. సోమంతో ఇంద్రుని తృప్తిపరచు. కోరికలు తీర్చి మిత్రులను తృప్తి పరచు.

---

* **యదహ్నో కురుతే పాపమ్ అరక్షన్ భయతః ప్రజాః ।**
రాజా వర్షసహస్రేణ తస్యాంతమధిగచ్ఛతి ॥ 28

72. రాజ పురోహిత లక్షణములు.

భీష్ముడు చెపుతున్నాడు. 'రాజా ! సజ్జనులను రక్షింపగలవానిని, దుష్కార్యాల నుండి మరలింపగలవానిని రాజు తనపురోహితునిగా చేసుకోవాలి. ఈ సందర్భంలో ఇలుని పుత్రుడయిన పురూరవునకూ, వాయువునకూ జరిగిన సంవాదమనే పూర్వ కథను ఉదాహరిస్తారు.' పురూరవుడు అడిగాడు. 'బ్రాహ్మణుడు దేనినుండి పుట్టాడు ? మిగిలిన మూడు వర్ణాలూ ఎక్కడ నుండి పుట్టాయి ? దేనివల్ల మానవుడు శ్రేష్ఠ డవుతాడు? వివరించి చెప్పు.' వాయువు ఇలా చెప్పాడు. 'రాజా ! బ్రహ్మముఖం నుండి బ్రాహ్మణుడూ, బాహువుల నుండి క్షత్రియుడు, తొడల నుండి వైశ్యుడు పుట్టారు. ఈ మూడు వర్ణాల పరిచర్యకోసం నాలుగవ వర్ణ మయిన శూద్రుడు పాదాల నుండి పుట్టాడు. బ్రాహ్మణుడు పుడుతూనే భూమి మీద ధర్మకోశాన్ని రక్షించడం కోసం సర్వప్రాణులకు ఈశ్వరుడుగా నిలిచాడు. తరువాత బ్రహ్మ పృథివిని శాసించటానికి, దండధారణంలో సమర్థమైన రెండవ వర్ణుడయిన క్షత్రియుని ప్రజా సంరక్షణ కోసం నియోగించాడు. వైశ్యుడు ధనధాన్యాలతో మూడు వర్ణాలను పోషించాలని, శూద్రుడు ఈ మూడు వర్ణాలకూ పరిచర్యచేయాలని బ్రహ్మ ఆదేశించాడు.' అపుడు ఐలుడు ఇలా అడిగాడు. 'వాయుదేవా ! ధన ధాన్యసహితమైన ఈ భూమి ధర్మాన్ని బట్టి ఎవరిది ? బ్రాహ్మణునిదా ? క్షత్రియునిదా ? నాకు చక్కగా చెప్పు.'

వాయువు ఇలా సమాధానం చెప్పాడు. 'విప్రుడు జ్యేష్ఠుడుగా పుట్టినందువల్ల జగత్తునందున్న సర్వమూ విప్రునిదే' - అని ధర్మనిపుణులు ఎరుగుదురు. బ్రాహ్మణుడు తనంతతాను భుజిస్తాడు. నివసిస్తాడు. ఇస్తాడు. అన్ని వర్ణాలకు అతడు గురువు. జ్యేష్ఠుడు. శ్రేష్ఠుడు. పతిలేనపుడు స్త్రీ దేవరుని పతిగాచేసుకొన్నట్లు, ఆనంతర్య ధర్మంవల్ల భూమి క్షత్రియుని పతిగా చేసుకొంటుంది. ఇది ప్రథమ పద్ధతి. ఆపత్కాలంలో మరొకడు కావచ్చును. స్వర్గం పరమ మయిన స్థానం కదా ! స్వధర్మ పాలన ఫలంగా స్వర్గాన్ని భావిస్తే ఈ గెలిచిన భూమి నంతటినీ ఇయ్యి. అతడు విద్యాశీలాలు కలిగి ధర్మజ్ఞుడైన తపస్వి అయిఉండాలి. స్వధర్మంతో తృప్తిపడినవాడై ధనాశలేనివాడు కావాలి. అట్టి విప్రునకు దానం చెయ్యి. తన పరిపూర్ణ బుద్ధితో రాజును నడపగలవాడు, సద్వంశంలో పుట్టిన బ్రాహ్మణుడై, చక్కని ప్రజ్ఞకల వినయపరుడై, చిత్రమైన వాక్కులు పలుకుతూ రాజును సన్మార్గంలో నడిపిస్తాడు. ఆ బ్రాహ్మణుడు నిర్దేశించిన ధర్మమే రాజు ఆచరణలో పెడతాడు. ధర్మాలను శ్రద్ధగా వినాలనుకొనేవాడు, అహంకార వాక్యాలు పలుకని వాడు, క్షత్రియధర్మం

మీద నిష్కలవాడు అయిన రాజు బ్రాహ్మణుడు చెప్పిన ధర్మాన్ని ఆచరిస్తే గౌరవం పొంది, చాలా కీర్తి పొందుతాడు. ఆ రాజు ఆచరించే ధర్మంలో పురోహితునికి భాగం ఉంటుంది. ఇలా ప్రజలందరూ రాజాశ్రయంలో సత్ప్రవర్తనతో తమ తమ ధర్మాలయందు నిష్ఠ కలిగి ఉంటే ఎన్నడూ వారికి భయం కలగదు. ఇలా రాజు రక్షణలో ఉన్న రాష్ట్ర ప్రజలు ఆచరించే ధర్మంలో నాలుగవభాగం రాజు పొందుతాడు. దేవతలు, మానవులు, పితరులు, గంధర్వులు, ఉరగులు, రాక్షసులు – వీరందరూ యజ్ఞాన్నే ఆధారం చేసుకొని బ్రతుకుతున్నారు. ఆ యజ్ఞం రాజులేని దేశంలో ఉండదు. ఇహ లోకంలో వారు ఇచ్చిన దానితోనే దేవతలు, పితృ దేవతలు బ్రతుకుతున్నారు. ఈ ధర్మంయొక్క యోగక్షేమాలు రాజు మీదే ఆధారపడి ఉన్నాయి. వేసవిలో వేడిగా ఉన్నపుడు నీడలోను, నీళ్లలోను, చల్లని గాలిలోను సుఖం పొందుతాడు. శీతకాలంలో చలిగా ఉన్నపుడు, అగ్నివలన, దుప్పటి వలన, సూర్యుని వలన సుఖం పొందుతాడు. **శబ్దం, స్పర్శ, రూపం, రసం, గంధం అనే వాటిలో మనస్సు సుఖపడుతుంది. ఈ భోగాలన్నీ ఉన్నా భయపడినవాడు సుఖం పొందలేడు. వానికి అభయం ఇచ్చేవాడిదే గొప్పఫలం. ప్రాణదానంతో సమానమైన దానం మూడులోకాల్లోనూ లేదు.** అలా అభయమిచ్చే రాజే ఇంద్రుడు. ఆ రాజే యముడు. ఆ రాజే ధర్మం. రాజే ఇన్ని రూపాలూ ధరిస్తున్నాడు. అందుచేత రాజే ఇదంతా ధరిస్తున్నాడు.

73. ఐల కశ్యప సంవాదము.

భీష్ముడు చెపుతున్నాడు. 'ధర్మార్థాల గతి చాలా గహనమైనదని తెలిసి, రాజు విద్వాంసుడై బహు విద్యలు నేర్చిన వానిని పురోహితునిగా చేసుకోవాలి. రాజా ! రాజపురోహితుడు ధర్మబుద్ధి కలిగి, మంత్రవేత్త కావాలి. రాజుకు కూడా అటువంటి గుణాలే ఉంటే వాని ప్రజలకు అన్ని విధాలా క్షేమం కలుగుతుంది.

వారికి అర్థమూ, కామమూ, ధర్మమూ నిశ్చయంగా సిద్ధిస్తాయి. ఈ విషయంలో శుక్రుడు చెప్పిన శ్లోకాలు వినుము. పురోహితుడు లేని రాజు అపవిత్రుడూ, విడువదగినవాడు అవుతాడు. పురోహితుడు లేని రాజు రాక్షసులకు, అసురులకు, పిశాచాలకు, నాగులకు, వక్షులకు, శత్రువులకు వధ్యుడవుతాడు. పెద్ద పెద్ద ఉత్పాతాల గురించి, శుభ ప్రదమయిన కృత్యాల గురించి, అంతఃపుర సంబంధి విషయాల గురించి పురోహితుడు రాజుకు సదా చెపుతూ ఉండాలి. రాజుకు ఇష్టమైన గీత, నృత్తాధికారాలలో చేయదగిన కర్తవ్యం నిర్దేశించాలి. బలి వైశ్వదేవ కర్మలు కూడ నడిపించాలి. జన్మను బట్టి రాజుకు ఏ నక్షత్రం అనుకూలంగా ఉంటుందో చెప్పాలి. రాజనీతి శాస్త్రంలో పండితుడై రాజశ్రేయస్సును రాజ

పురోహితుడు కాంక్షించాలి. ఇతరమైన వాటికి కారణాలను, ఉత్పాతాల వివరాలను తెలిసినవాడు కావాలి. శత్రుపక్షం ఎలా నశిస్తుందో తెలిసికొనే పురోహితుడు ఉండటం రాజుకు శ్రేయస్కరం.

ప్రజలను, దేవతలను, పుత్రులను, తండ్రులను వృద్ధిపరుస్తూ ధర్మం మీద ఆసక్తి కలిగి రాజూ, పురోహితుడూ ఉండాలి. అపుడా ఇద్దరూ తపస్సులై విశ్వసింపదగిన వారవుతారు. పరస్పర స్నేహంతో, సమబుద్ధులు కలిగి, హితులై రాజూ, పురోహితుడూ ఉంటే ప్రజలు సుఖపడతారు. వారిద్దరూ పరస్పరం ద్వేషించుకొంటే ప్రజలు నశించిపోతారు. బ్రాహ్మణ క్షత్రియుల కలయికయే అన్ని వర్ణాలకు స్థిరంగా, శుభంగా ఉండటానికి మూలం.

ధర్మజా ! ఈ విషయంలో ఐలకశ్యప సంవాదం అనే పురాతనమైన ఇతిహాసం ఉదాహరిస్తారు. చెపుతా విను.' ఐలుడు అడిగాడు. 'ఎపుడయినా బ్రాహ్మణుడు రాజును విడిచి పెట్టినా, రాజు బ్రాహ్మణుని (పురోహితుని) విడిచిపెట్టినా ఇతరవర్ణాలవారు వీరిద్దరిలో ఎవరి ఆశ్రయం కోరుతారు ? వీరిద్దరిలో ఎవరు ఇతరవర్ణాలకు ఆశ్రయమిస్తారు ?' కశ్యపుడు చెప్పాడు. 'బ్రాహ్మణ క్షత్రియులు పరస్పరం విరోధం పొందితే క్షత్రియుని రాజ్యం చిన్నాభిన్నం అయిపోతుంది. రాజు బలాన్ని, ఇతర వర్ణాలను దొంగలు పొందుతారు. క్షత్రియుడు బ్రాహ్మణుని విడిచిపెడితే రాష్ట్రంలో బ్రాహ్మణులు వృద్ధిపొందరు. వారి పుత్రులు వృద్ధిపొందరు. వారి చల్లకవ్వం తిరగదు (పాడి ఉండదు). యజ్ఞాలు చెయ్యరు. వారి పుత్రులు వేదాలు చదవరు. వారి యింట్లో సంపద పెరగదు. వారి సంతానం వేదం చదవరు. యజ్ఞాలు చెయ్యరు. పదవీభ్రష్టులైన బ్రాహ్మణులు దస్యులై పోతారు. అందుచేత వీరిద్దరూ ఒకరితోనొకరు కలిసి, ఉంటే పరస్పర రక్షకులు అవుతారు. క్షత్రియుడు బ్రాహ్మణుని ఉన్నతికి ఆధారం. బ్రాహ్మణుడు క్షత్రియుని ఉన్నతికి ఆధారం. వీరిద్దరూ నిత్యమూ ఒకరినొకరు రక్షించుకొంటే చక్కని ప్రతిష్ఠ పొందుతారు. పూర్వకాలం నుండీ వచ్చే ఆ మైత్రి చెడిపోతే జగత్తు అంతా దిక్కుతోచని దవుతుంది. మహాసముద్రం నుండి ఒడ్డుకు చేరే నావ భగ్నమయితే ఒడ్డుకు చేరలేదు. అలాగే చాతుర్వర్ణ్య వ్యవస్థ చెడిపోతే ప్రజలు మూఢులై దిక్కుతోచకుండా పోతారు. ప్రజలు ప్రళయంలో చిక్కుకొంటారు. బ్రాహ్మణ రూపమయిన వృక్షాన్ని రక్షించుకొంటే వారికి అది ఆనందమనే తేనెనూ, సువర్ణాన్నీ వర్షిస్తుంది. రక్షించుకొనకపోతే సదా కన్నీటిని, పాపాన్ని వర్షిస్తుంది. బ్రాహ్మణుడైన బ్రహ్మచారి దస్యులనుండి వేద విషయమై రక్షణకోరితే దేవు డక్కడ ఆశ్చర్యకరంగా వర్షిస్తాడు. అచట సహింపరాని దుర్భిక్షాది ఉపద్రవాలు సంభవిస్తాయి. స్త్రీని కాని, బ్రాహ్మణుని

కాని, చంపి పాపాత్ముడు సభలో ప్రశంసింపబడినా, లేదా అతడు రాజు ఎదుట భయపడక పోయినా ఆ రాజుకు భయం కలుగుతుంది. పాపులు పాపాలు చేస్తూ ఉంటే రుద్రరూపుడయిన దేవుడు ఉద్భవిస్తాడు. పాపాత్ములు చేసిన పాపాల చేత (కలి) రుద్రుని పుట్టిస్తాడు. అతడు మంచి వారినీ, చెడ్డవారినీ అందరినీ హింసిస్తాడు.' ఐలుడిలా అడిగాడు. 'ఆ రుద్రు డెక్కడివాడు ? ఎటువంటి వాడు ? లోకంలో ఒకప్రాణిని ఇతరప్రాణులు చంపుతుంటే చూస్తున్నాము. కశ్యపా ! ఇదంతా నాకు చెప్పు. అసలీ రుద్రదేవుడు ఎక్కడి నుండి పుడతాడు ?' కశ్యపుడు చెపుతున్నాడు. 'మానవుల హృదయాల్లో ఉండే ఆత్మయే రుద్రుడు. అతడు తనదేహాన్నీ, పరుల దేహాన్నీ కూడా హింసిస్తాడు. తుఫానుగాలి, ఉత్పాతాలతో సమానుడు రుద్రు డని చెపుతారు. దేవతలను, మేఘాలను పోలి అతని రూపం ఉంటుంది.' అపుడు ఐలుడిలా అడిగాడు. 'వాయువు ఎవరినీ చుట్టుకోవటంలేదు. మేఘం వర్షం కురవటంలేదు. అలాగే దేవుడూను. అటువంటి పరిస్థితే మానవులలో కనిపిస్తుంది. కాని మానవుడు కామంతో, ద్వేషంతో బంధింపబడుతున్నాడు - మోహపడుతున్నాడు.' కశ్యపుడు చెప్పాడు. 'ఒక యింటిలో పుట్టిన అగ్ని గ్రామం అంతటినీకాని, వీథుల కూడలిని గాని కాల్చివేస్తుంది. అలాగే ఈ దేవుడే మానవుల మనస్సులలో మోహం కలిగిస్తాడు. దానితో పుణ్యపాపాలతో అంతా అంటుకొంటుంది.' పురూరవుడు అడిగాడు. 'దండం పుణ్యపాపాలు లేని ఆత్మను తాకితే, ఎక్కువ పాపం చేస్తున్నపుడు పాపాన్ని తాకితే ఇక ఎందుకు మానవుడు పుణ్యం చెయ్యాలి ? పాపం చెయ్యకుండా ఎందుకు ఉండాలి ?' కశ్యపుడు ఇలా చెప్పాడు. 'కలిసి ఉండటం వల్ల సంయోగం లేకపోయినా, పాపులను, పాపరహితులను సమానమయిన దండం స్పృశిస్తోంది. ఎండిన దానితో కలిసి ఉండటం వలన తడిసిన వస్తువు కాలిపోతోంది. పాపులతో కలియని వాడు ఎప్పుడూ దండం పొందడు.' ఐలుడు అన్నాడు. 'ఈ భూమి సజ్జనులనూ, దుర్జనులనూ కూడా భరిస్తోంది. సూర్యుడు సుజనులనూ, దుర్జనులనూ తపింపజేస్తున్నాడు. గాలి సజ్జనులకూ, దుర్జనులకూ వీస్తోంది. అలాగే నీరు సుజన దుర్జనులను పవిత్రం చేస్తోంది.'

కశ్యపుడు చెప్పాడు. 'రాజకుమారా ! నీవు చెప్పినది ఈలోకంలోనే కనిపిస్తుంది / వర్తిస్తుంది. కాని పరలోకంలో కనపడదు. ఈ రెంటికి తేడా మరణించిన తరువాతనే ఏర్పడుతుంది. పుణ్యం చేసినవాడు, పాపం చేసిన వాడు అచట వేర్వేరు స్వభావాలతో సంచరిస్తారు. పుణ్యాత్ముని లోకం తేనెతో, నేతివత్తుల వెలుగులతో నిండి ఉంటుంది. బంగారుకాంతులతో అమృత నిలయంగా ఉంటుంది. బ్రహ్మచారి మరణించాక పరలోకం

చేరితే అక్కడ చావు, ముసలితనం, దుఃఖం ఉండవు. పాపులలోకం నరకం. వెలుగు ఉండదు. నిత్యమూ శోకమూ, దుఃఖమూ నిండుగా ఉంటాయి. పాపకర్మ చేసిన వాడు అక్కడ తన్ను గురించి చాలా ఏళ్లు పరితపిస్తూ, శోకిస్తూ అస్థిరుడై ఉంటాడు. బ్రాహ్మణ క్షత్రియులకు పరస్పరం పడకపోతే ప్రజలను సహింపరాని దుఃఖం ఆవేశిస్తుంది. ఇది తెలిసికొని రాజు చాలా విద్యలలో నిపుణుడైన వానిని పురోహితునిగా చేసుకోవాలి. పురోహితుని ముందుగా గ్రహించి తరువాతనే రాజు అభిషిక్తుడు కావాలి. ఇది ధర్మం. అందరికీ ముందు ఉండవలసినవాడు బ్రాహ్మణుడే అని ధర్మశాస్త్రం చెపుతోంది. మొదట జరిగినది బ్రాహ్మణ సృష్టి. ఈ విషయం వేదవేత్తలు ఎరుగుదురు. జ్యేష్ఠుడుగా పుట్టడం వలన అతనికి ప్రథమస్థానం లభించింది. అందుచేత బ్రాహ్మణుడు మాన్యుడు, పూజ్యుడు, అగ్రపూజ పొందదగినవాడు. ధర్మాన్ని బట్టి శ్రేష్ఠమూ, విశిష్టమూ అయిన దంతా అతనికి ముందుగా నివేదించాలి. రాజు బలవంతుడయినా కూడా తప్పకుండా పురోహితుని ఏర్పరచుకోవాలి. బ్రాహ్మణ వంశం క్షత్రియ వంశాన్ని వృద్ధిచేస్తుంది. క్షత్రియ కులం బ్రాహ్మణ కులాన్ని వృద్ధిచేస్తుంది. ఇలా రాజులకు బ్రాహ్మణులు సదా పూజ్యులు.

రాజుకూ, ఇతరులందరికీ రాజపురోహితుడు స్వామి.

74. ముచుకుందోపాఖ్యానము.

భీష్ముడిలా చెపుతున్నాడు. 'రాష్ట్రం యొక్క యోగక్షేమాలు రాజు అధీనంలో ఉంటాయి. రాజు యొక్క యోగక్షేమాలు పురోహితుని అధీనంలో ఉంటాయి. ప్రజలకు కనపడని భయాలను పురోహితుడు శమింపజేస్తాడు. కనబడే భయాన్ని బాహువులతో రాజు శమింపజేయాలి. అలా ఉంటే ఆ రాజ్యంలోని ప్రజలు సుఖపడతారు. ఈ విషయంలో ముచుకుందునికీ, కుబేరునికీ జరిగిన సంవాదమనే ప్రాచీనమైన ఇతిహాసాన్ని ఉదాహరిస్తారు. ముచుకుందు డనే రాజు భూమినంతా గెలిచి, తన బలం తెలుసుకోవాలని అలకాధిపుడయిన కుబేరునిపై దండెత్తాడు. అపుడు కుబేరుడు రాక్షసులను ఆజ్ఞాపించి పంపాడు. రాక్షసులు ముచుకుందుని సైన్యాలను నుగ్గు నుగ్గు చేశారు. తన సైనికులు చనిపోతుంటే ముచుకుందుడు తన పురోహితుని నిందించాడు. అపుడు ధర్మవేత్త అయిన వసిష్ఠుడు ఉగ్ర తపస్సు చేసి, కుబేరుని రాక్షసులను చంపి, రాజు జయించే మార్గం కనుగొన్నాడు. అపుడు కుబేరుడు ముచుకుందుని దర్శించి, సైన్యం చనిపోతుంటే ఇలా అన్నాడు. కుబేరుడు ఇలా అన్నాడు. 'నీకు పూర్వం ఉన్న రాజులు పురోహితులు కలవారే. బలవంతులే. అయినా నీ విపుడు ప్రవర్తించినట్లు ప్రవర్తింప లేదే ! వారంతా అస్త్రవిద్యా నిపుణులు. బలవంతులయిన రాజులు.

వారంతా ప్రభువైన నా దగ్గరకు వచ్చి సుఖదుఃఖాల్లో నన్ను సేవించే వారు. నీకు భుజపరాక్రమం ఉంటే దాన్ని ప్రదర్శించు. అంతేకాని బ్రాహ్మణబలంతో ఎక్కువగా ప్రవర్తిస్తా వేమిటి ?'

ఈ మాటలకు కోపించి ముచుకుందుడు కుబేరుని ఇలా అన్నాడు. 'నీ మాటలు న్యాయపూర్వకంగా, తొందర పాటు, తొట్రుపాటు లేకుండా ఉన్నాయి. బ్రాహ్మణ క్షత్రియజాతులు రెంటినీ బ్రహ్మ ఒకే గర్భంనుండి సృష్టించాడు. వేరువేరుగా ఆ బలాలు రెండూ లోకాన్ని పరిపాలించలేవు. తపోబలమూ, మంత్రబలమూ బ్రాహ్మణులలో నిత్యమూ ఉంటుంది. అస్త్రబలమూ, బాహుబలమూ నిత్యమూ క్షత్రియులలో ఉంటుంది. కుబేరా ! వారిద్దరూ కలిసి ప్రజలను పరిపాలించాలి. అలా ప్రవర్తించే నన్ను నిందిస్తా వెందుకు ?' అపుడు పురోహిత సహితుడైన రాజుతో కుబేరుడు ఇలా అన్నాడు. 'నేను ఈశ్వరుని అనుమతి లేనిదే రాజ్యం ఎవరికీ ఇవ్వను. ఈశ్వరాజ్ఞ లేనిదే ఎవరి రాజ్యమూ గ్రహించను. తెలుసుకో రాజా ! నేనిచ్చిన ఈ రాజ్యమంతా పాలించు అన్నాడు.' అపుడు ముచుకుందుడు ఇలా అన్నాడు. 'నీవిచ్చిన రాజ్యం నేను అనుభవింపదలచుకోలేదు. నా భుజబలంతో సంపాదించుకొన్న రాజ్యాన్నే అనుభవించా లనుకొంటున్నాను.' భీష్ముడు చెపుతున్నాడు. 'అపుడు క్షత్రియధర్మంలో స్థిరంగా నిలిచిన ముచుకుందుని చూసి, కుబేరుడు చాలా ఆశ్చర్యపడ్డాడు. క్షత్రియ ధర్మం అనుసరించే ముచుకుందుడు తన భుజబలంతో పొందిన భూమిని చక్కగా పాలించాడు. ఇలా ధర్మజ్ఞుడైన రాజు బ్రాహ్మణుని ఆశ్రయంతో రాజకార్యాలను చక్కదిద్దుకొంటాడు. అంతకు ముందు జయించని భూమిని జయిస్తాడు. గొప్పకీర్తిని కూడా పొందుతాడు. బ్రాహ్మణుడు నిత్యమూ స్నానసంధ్యాద్యనుష్ఠానాలు చెయ్యాలి. క్షత్రియుడు నిత్యమూ శస్త్ర విద్యాభ్యాసం చెయ్యాలి. అలా కలిసి ఉంటే జగత్తులో ఉన్నదంతా వారిద్దరికీ వశమవుతుంది.'

75. రాజకర్తవ్యమును భీష్ముడు చెప్పుట.

ధర్మరాజు ఇలా అన్నాడు. 'రాజు ఎటువంటి ప్రవర్తనతో మానవులను వృద్ధిపొందిస్తాడు ? దేని వలన పుణ్యలోకాలను సాధిస్తాడు ? పితామహా ! నాకు చెప్పు.' భీష్ముడు చెపుతున్నాడు. 'రాజు దానశీలుడు, యజ్ఞశీలుడు, ఉపవాస తపశ్శీలుడు, ప్రజల రక్షణమందు తత్పరుడు కావాలి. రాజు ప్రజలందరినీ నిత్యమూ ధర్మంతో పాలిస్తూ, ప్రయత్నపరుడై, దానాలతో ధార్మికులను పూజించాలి. రాజు ధర్మాన్ని పూజిస్తే అందరూ, అంతటా పూజిస్తారు. రాజు ఆచరించినదే వాని ప్రజలకు కూడ ఇష్ట మవుతుంది. రాజు సదా దండం ఎత్తిపట్టుకొని శత్రువుల పట్ల మృత్యువులా వ్యవహరించాలి. దొంగలను

అన్నివైపుల నుండి సంహరించాలి. స్వార్థంతో ఒక్క దుష్టుని కూడా క్షమించ కూడదు. రాజుచేత ప్రజలు చక్కగా రక్షింపబడుతూ ఉంటే ఆ ప్రజల ధర్మాచరణంనుండి నాలుగవభాగం రాజు పొందుతాడు. రాజు ప్రజలను ధర్మంతో రక్షిస్తూఉంటే ఆ రాజు ప్రజల అధ్యయనం నుండి, దానం నుండి, హోమం నుండి, అర్చన నుండి నాలుగవ భాగం పొందుతాడు. రాజు రక్షించే రాజ్యంలో ఎక్కడయినా ప్రజల క్షేమానికి భంగం కలిగితే ఆ పాపంలో నాలుగవవంతు రాజు పొందుతాడు. కొంతమంది ఆ పాపం అంతా రాజు పొందుతాడని అంటారు. మరికొందరు సగం పొందుతాడని నిశ్చయించారు. కర్మను బట్టి క్రూరుడు, అసత్యవాది అయినపుడూ కూడా ఇదే ఫలితం వర్తిస్తుంది. ఆ పాపంనుండి రాజు విముక్తి పొందేమార్గం చెపుతాను. విను. దొంగలు అపహరించిన సొమ్ము తిరిగి వారి నుండి తీసుకొనటానికి సాధ్యం కాకపోతే ఆ ధనం దొంగలను అణచలేని రాజు తనకోశాగారం నుండి ఇవ్వాలి. అన్ని వర్ణాల వారూ బ్రాహ్మణుని రక్షించి నట్లే వాని ధనం కూడా రక్షించాలి. బ్రాహ్మణులకు అపకారం చేసే రాజు రాజ్యంలో ఉండరాదు. బ్రాహ్మణుని సొమ్ము రక్షింపబడితే అంతా రక్షింపబడినట్లే. ఆ బ్రాహ్మణానుగ్రహంతో రాజు కృతకృత్యుడవుతాడు. ప్రాణులన్నీ పర్జన్యుని, పక్షులన్నీ పెద్ద వృక్షాన్ని ఆశ్రయించి బ్రతుకుతాయి. అలాగే సర్వప్రయోజనాలు సాధించే రాజును ఆశ్రయించి ప్రజలంతా జీవిస్తారు. కామాత్ముడు, కామబుద్ధి, క్రూరుడు, లుబ్ధుడు అయిన రాజు ప్రజలను పాలింపలేడు.'

అపుడు ధర్మరాజు ఇలా అన్నాడు. 'నేను రాజ్యసుఖం మీద ఆశకలవాడను కాను. ఒక్కక్షణం కూడా రాజ్యం కోరను. ధర్మం కోసమే రాజ్యం ఇష్టపడతాను. కాని ఇందులో ధర్మం కనపడటం లేదు. ధర్మం లేని రాజ్యం నా కవసరంలేదు. ధర్మసాధన చెయ్యాలని అడవికే వెళతాను. అక్కడ పవిత్రారణ్యాలలో దండం విడిచి, ఇంద్రియ నిగ్రహంతో, కందమూల ఫలాలు తింటూ మునినై, ధర్మం ఆరాధిస్తాను.' ఆ మాటలకు భీష్ముడు ఇలా అన్నాడు. 'నాకు తెలుసు. నీ బుద్ధి దయా స్వభావం కలది. శుద్ధమైన దయా స్వభావంతో రాజ్యం చేయటం శక్యంకాదు. మెత్తని బుద్ధి, అధిక పూజ్యత, అతిధార్మికత, దయా ధర్మాలు మిక్కిలిగా కలిగిన నిన్ను నపుంసకునివలె లోకం మన్నించదు. తండ్రి, తాతల నుండి వచ్చిన కులధర్మం పరిశీలించు. నీవు ఉండాలనుకొనే ప్రవృత్తి రాజుల ప్రవృత్తి కాదు. వైక్లబ్యంతో కూడిన దయా స్వభావం కల నీవు ప్రజా పరిపాలన వల్ల కలిగే ధర్మఫలం పొందలేవు. పాండురాజుకాని, కుంతికాని ఇటువంటి ఆశీస్సు కోరలేదు. ఇపుడీ ప్రజ్ఞతో కూడిన నీ ప్రవర్తన నీ పితరులు కోరినది కాదు. నీతండ్రి

ఎప్పుడూ శౌర్యం, బలం, సత్యం వీటిని గురించి చెప్పేవాడు. నీ తల్లి కుంతి నీ మహిమను, ఔదార్యాన్ని కోరేది. దేవతలు, పితృదేవతలూ తమ సంతానంనుండి స్వాహాకారాలు, స్వధాకారాలు ఆశిస్తూ ఉంటారు. దానం, వేదాధ్యయనం, యజ్ఞం, ప్రజలను పరిపాలించడం. ఇవి ధర్మమైనా, అధర్మమైనా నీకు జన్మతోనే వచ్చాయి. తగిన కాలంలో అర్హుల మీద ఒక భారం పెడితే, అది వహించడం కష్టమయినా వాని కీర్తి మాత్రం తగ్గదు. చిరస్థాయిగా ఉంటుంది. ఇంద్రియాలు పూర్తిగా అదుపులో ఉన్నవాడు ఏ జారుపాటు లేకుండా కార్యభారం వహిస్తాడు. అది దోషరహితమై ఉంటుంది. శాస్త్రంలో చెప్పబడిన కర్మవచనం వల్లనే కర్మ సిద్ధిస్తుంది. ధర్మ నిర్వహణం చేసేవాడు గృహస్థు కానీ, రాజు కానీ, బ్రహ్మచారి కానీ ఎవరయినా సంపూర్ణంగా ధర్మాచరణం నేర్పుతో చేయలేడు. సారభూయిష్ఠ మైన చెడ్డ పని కూడా ఉదారమే అవుతుంది. కర్మ మానడం కంటె చెయ్యడమే మంచిది. కర్తవ్యం మానినవానికంటె పాపి ఎవడూ లేడు. ఉత్తమ కులసంజాతుడు, ధర్మజ్ఞుడు రాజోద్యోగం పొందితే, రాజు యోగక్షేమాలు తనమేలుకు కూడ ఉపకరిస్తాయి. ఒకడిని దానంతో, ఒకడిని బలంతో, ఒకడిని సత్యవాక్యంతో - ఇలా వివిధ రూపాల్లో రాజ్యం పొందిన ధార్మికుడు అందరినీ వశపరచుకోవాలి. ఉత్తమ వంశంలో పుట్టిన విద్వాంసులు బ్రతుకు తెరువు లేక భయంతో అల్లాడి పోతూఉంటే రాజు వారిని చేరదీసి సుప్రతిష్ఠితులను చేస్తే అంతకు మించిన ధర్మం ఏముంటుంది ?'

ఆ మాటలకు ధర్మరాజు ఇలా అన్నాడు. పితామహా ! స్వర్గానికి చేర్చే ఉత్తమకార్యం ఏది ? దాని వలన కలిగే ప్రీతి ఎలా ఉంటుంది ? దానిని మించిన ఐశ్వర్యం ఏది ? నీవు చూసిఉంటే చెప్పు. భీష్ముడు ఇలా చెప్పాడు. 'భయంతో అల్లాడి పోయే వాడు ఎవని రక్షణలో నిర్భయత్వం, క్షేమం పొందుతాడో వాడు స్వర్గం పొందుతాడు. ఇది నిజమని చెపుతున్నాను. అందుచేత ధర్మజా ! కురువంశస్థులలో నీవే ప్రీతి కలవాడవు. నీవు రాజువు అగుము. సుజనులను రక్షించు. దుర్జనులను సంహరించు. ప్రజలభయం పోగొట్టి స్వర్గం జయించు. రుచికరాలయిన పళ్లు కల చెట్టును పక్షులన్నీ చేరుతాయి. ప్రాణులన్నీ పర్జన్యుని / మేఘుని ఆశ్రయిస్తాయి. అలాగే స్నేహితులూ, సజ్జనులూ నిన్ను ఆశ్రయించి జీవింతురుగాక ! నిర్భయుడూ, శూరుడు, శిక్షింపగల నిపుణుడు, కరుణాపరుడు, జితేంద్రియుడు, ప్రజలపై వాత్సల్యం కలవాడు, వివేకం కలిగినవాడు అయిన రాజును చేరి ప్రజలు బ్రతుకుతారు.'

76. బ్రాహ్మణ ధర్మకథనము.

ధర్మరాజు అడిగాడు. పితామహా ! బ్రాహ్మణులలో కొందరు వర్ణోచిత కర్మము నందు నిష్ఠ కలిగి ఉంటారు. కొందరు విరుద్ధ కర్మలు ఆచరిస్తారు. వారి విశేషాలను తెలుపు.' భీష్ముడిలా చెపుతున్నాడు. 'విద్య, ఉత్తమలక్షణాలు కలిగి, అంతటా సమదృష్టితో ఉంటారు. వారు బ్రహ్మసమానులై బ్రాహ్మణులని పేరు పొందుతారు. ఋక్ - యజుస్సామ వేదాలలో ప్రజ్ఞ కలిగి, తమ తమ కర్మలలో నిలిచిన బ్రాహ్మణులు దేవసమానులు. జన్మకు తగని కుత్సిత కర్మలు చేస్తూ, బ్రహ్మ బంధువులయినవారు శూద్రసమానులు. శ్రోత్రియులు కాని వారిచేత, ఆహితాగ్నులు కాని వారిచేత ధార్మికుడైన రాజు కప్పాలు పొందాలి. వెట్టిచాకిరి చేయించుకోవాలి. న్యాయాలయానికి పిలుచుకొనివచ్చేపని చేసేవారు, జీతం తీసుకొని దేవపూజలు చేసేవారు, ధనం తీసుకొని నక్షత్రఫలాలు చెప్పేవారు, గ్రామపురోహితులు, వ్యాపారం కోసం నావలపై వెళ్లేవారు బ్రాహ్మణులలో చండాలురు.

పాపులు నివసించే మ్లేచ్ఛ దేశాలకు వెళ్లిన బ్రాహ్మణుడు ఇక్కడ చండాలతుల్యుడై, పరలోకంలో అధోగతి పాలవుతాడు. సంస్కారభ్రష్టులకు, మ్లేచ్ఛులకు, శూద్రులకు యజ్ఞాలు చేయించిన ద్విజాధముడు ఇక్కడ అపకీర్తిని, పరమందు నరకాన్ని పొందుతాడు. ఋగ్యజుస్సామాలను చదవకుండా మూఢుడైన బ్రాహ్మణుడు ఒక కల్ప కాలం కృమియై పుడతాడు.

యజ్ఞం చేయించేవాడు, పురోహితుడు, మంత్రి, దూత, వార్తలు సేకరించేవాడు - వీరంతా బ్రాహ్మణులలో క్షత్రియ సమానులు. యుద్ధాల్లో అశ్వాలు, గజాలు, రథాలు ఎక్కేవారు, పదాతులు బ్రాహ్మణులలో వైశ్యసమానులు. బ్రహ్మసములను, దేవసములను వదలి మిగిలిన వారి నుండి రాజు కోశాగారం తగ్గినపుడు పన్నులు స్వీకరింపవచ్చు. అబ్రాహ్మణుల ధనానికీ, కర్మభ్రష్టులైన బ్రాహ్మణుల ధనానికీ స్వామి రాజే అని వేదవాక్యం. విరుద్ధ కర్మలాచరించే విప్రులను రాజు ఉపేక్షించరాదు. ధర్మం రక్షించాలి కనుక అటువంటి వారిని శిక్షించాలి లేదా విభజించాలి (వెలివేయాలి). రాజా ! ఎవని రాజ్యంలో ద్విజుడు దొంగ అవుతాడో ఆ అపరాధం రాజుదే అని విద్వాంసులు భావిస్తారు. బ్రతుకు తెరువు లేక వేదవేత్త అయిన స్నాతకుడు దొంగ అయితే రాజే వానిని భరించాలి అని వేదవేత్త లంటారు. బ్రతుకుతెరువు చూపించినా అతడు మారకపోతే వానిని బంధువులతో సహా దేశబహిష్కారం చెయ్యాలి.

యజ్ఞం, వేదాధ్యయనం, నేరాలు చెప్పకుండుట, అహింస, అతిథిపూజ, దమం, సత్యం, తపస్సు, దానం ఇవి బ్రాహ్మణ లక్షణాలు.

77. కైకయోపాఖ్యానము.

యుధిష్ఠిరుడు ఇలా అడిగాడు. 'రాజు ఎవరి ధనానికి స్వామి అవుతాడు ? రాజు ఎటువంటి ప్రవర్తన కలిగిఉండాలి ? పితామహా ! నాకు చెప్పు. భీష్ముడు చెపుతున్నాడు. 'అబ్రాహ్మణుల ధనానికి స్వామి రాజు అని వేదవచనం. అలాగే బ్రాహ్మణులలో కర్మభ్రష్టులయిన వారి సొమ్ముకు కూడా రాజే స్వామి. కర్మభ్రష్టులయిన విప్రులను రాజు ఎన్నడూ ఉపేక్షించరాదని సజ్జనులు ప్రాచీన రాజుల ప్రవర్తనను గురించి చెపుతారు. ఏ రాజు రాజ్యంలో ద్విజుడు దొంగ అవుతాడో, ఆ అపరాధం రాజుదే అనీ, అది పాపం అనీ భావిస్తారు. తాము బ్రాహ్మణులను రక్షింపకపోతే తాము అభిశంసన పొందినట్లు రాజులు భావిస్తారు. అందుచేత రాజర్షు లంతా బ్రాహ్మణులను చక్కగా రక్షించారు. దీని విషయంలో ప్రాచీనేతిహాసం ఒకటి ఉదాహరిస్తారు. రాక్షసుడు ఎత్తుకొని పోతూంటే కైకయరాజు దీనిని పాడాడు. వేదాధ్యయనం చేసుకొంటూ వ్రతశీలి అయిన కేకయ రాజును క్రూరుడైన రాక్షసుడు ఒకడు పట్టుకొన్నాడు. అపుడు రాజు ఇలా అన్నాడు. 'నా గ్రామాల్లో దొంగ, లోభి, మద్యంత్రాగేవాడు, ఆహితాగ్ని కానివాడు, యజ్ఞం చేయనివాడు లేడు. నీవెందుకు నాలో ఆవేశించావు ? విద్వాంసుడు కాని బ్రాహ్మణుడు, వ్రతనిష్ఠ లేనివాడు, సోమపానం చెయ్యనివాడు, ఆహితాగ్ని కానివాడు, యజ్ఞం చెయ్యనివాడు నా రాజ్యంలో లేడు. నీవేమో నాలో ప్రవేశించావు. నా రాజ్యంలో ద్విజులందరూ భూరిదక్షిణలతో యజ్ఞాలు చేస్తున్నారు. వేదం చదవని వాడుకాని, వ్రతశీలి కానివాడు కాని ఎవడూ నా రాజ్యంలో లేడు. అయినా నాలో నీవు ప్రవేశించావు. నా దేశంలో బ్రాహ్మణులు షట్కర్మలలో నిల్చిఉన్నారు. వేదం చదువుతారు, చదివిస్తారు. యజ్ఞం చేస్తారు, చేయిస్తారు. దానం చేస్తారు, ప్రతిగ్రహిస్తారు. నా బ్రాహ్మణులు పూజింపబడతారు. వివేకం, మార్దవం కలవారు. సత్యం పలుకుతారు. స్వకర్మశీలురు. నీవేమో నాలో ప్రవేశించావు. నా రాజ్యంలో క్షత్రియులు యాచింపరు. దానం ఇస్తారు. సత్యధర్మ విశారదులు. వేదాలు చదువుకొంటారు కాని చదివింపరు. యజ్ఞాలు చేస్తారు కాని చేయించరు. బ్రాహ్మణులను రక్షిస్తారు. యుద్ధంలో పారిపోరు. ఇలా నా క్షత్రియులందరూ స్వకర్మనిరతులు - నీవేమో నాలో ప్రవేశించావు. నా రాజ్యంలోని వైశ్యులు వ్యవసాయం, పశుపాలనం, వాణిజ్యం వీనితో నిష్కపటంగా జీవిస్తారు. మత్తులు కారు, క్రియాపరులు, వ్రతశీలురు, సత్యం మాట్లాడుతారు. వివేకం, ఇంద్రియనిగ్రహం, శుచిత్వం, స్నేహం, ఎన్నడూ వదలరు. తమ విధులను వదలరు. నాలో నీవు ప్రవేశించావు. నాదేశంలోని శూద్రులు, అసూయలేకుండా, స్వకర్మ నిరతులై

మూడు వర్ణాల వారిని ఆశ్రయించి జీవిస్తున్నారు. నీవేమో నన్ను ఆవేశించావు. దీనులు, అనాథులు, వృద్ధులు, దుర్బలులు, రోగులు, స్త్రీలు– వీరందరిపట్ల వివేకంతో ప్రవర్తిస్తాను. నీవు నాలో ప్రవేశించావు. ప్రసిద్ధమైన కులధర్మాలు, దేశధర్మాలు విచ్ఛిన్నం కాకుండా రక్షిస్తున్నాను. నీవు నాలో ప్రవేశించావు. నారాజ్యంలో తపస్సులు పూజింపబడతారు. రక్షింపబడతారు. వారిని సత్కరించి ప్రత్యేకంగా గౌరవిస్తాను. నాలో నీవు ప్రవేశించావు. ఇతరులకు పంచి ఇవ్వకుండా భుజింపను. పరస్త్రీని తలవను. స్వతంత్రంగా ఎన్నడూ క్రీడించను. నాలో నీవు ప్రవేశించావు. నారాజ్యంలో బ్రహ్మచారి కానివాడు భిక్షాటనం చెయ్యడు. సంన్యాసి అయితే బ్రహ్మచర్యం పాటిస్తాడు. బుత్విక్కు కాకుండా హుతం చెయ్యడు. నాలో నీవు ప్రవేశించావు.

నారాజ్యం అంతా నేను కర్తవ్యపాలన దృష్టితోనే చేశాను. ఎన్నడూ సత్యం నుండి వైదొలగలేదు. నీవు నన్ను ఆవేశించావు.

ఎన్నడూ నేను విద్వాంసులను, వృద్ధులను, తపస్సులను అవమానించలేదు. రాష్ట్రంలోనే నిద్రించాను, రాష్ట్రంలోనే మేల్కొన్నాను. నీవేమో నన్ను ఆవేశించావు.

నా పనుల్లో చాటుమాటు లేదు. నాకు దుర్గతి కలుగుతుందనే భయంలేదు. ధర్మచారిని, గృహస్థును. నన్నునీవు ఆవేశించావు.

నా పురోహితుడు ఆత్మవిజ్ఞాన సంపన్నుడు, తపస్వి, సర్వధర్మవేత్త. రాష్ట్రానికంతటికీ ఆ ధీమంతుడే స్వామి. దానంతో విద్యను వాంఛిస్తాను. సత్యంతో ధనం వాంఛిస్తాను. బ్రాహ్మణులను రక్షింపగోరుతాను. సేవించి గురువులను పొందుతాను. నాకు రాక్షసులవల్ల భయంలేదు. నా రాష్ట్రంలో విధవలేదు. చెడిన విప్రుడు లేడు. జూదరియైన విప్రుడు లేడు. దొంగలేడు. అనధికారిచేత యజ్ఞం చేయించే వాడు లేడు. పాపకర్ముడు లేడు. నాకు రాక్షసుల వల్ల భయంలేదు. ధర్మంకోసం పోరాడే నా దేహంలో గాయపడని భాగం అంగులం కూడా లేదు. నా దేహంలో నీవు ప్రవేశించావు. గో, బ్రాహ్మణ, యజ్ఞాలవల్ల నాప్రజలు నాకు సర్వశుభాలూ కోరుతూ ఉంటారు. నీవు నాలో ప్రవేశించావు.

అపుడు రాక్షసుడు ఇలా అన్నాడు. 'స్త్రీల వ్యభిచారం వలన, రాజుల అన్యాయం వలన, విప్రుల కర్మదోషం వలన ప్రజలకు భయం కలుగుతుంది. *అటువంటి రాజు రాజ్యంలో, వర్షాలు పడవు. చనిపోయే రోగాలు, సతతమూ ఆకలి భయాలు, యుద్ధాలు, అన్నీ దారుణాలు సంభవిస్తాయి. విప్రులు సంయమనంతో ఉన్న రాజ్యంలో యక్షరక్షః పిశాచాల వల్లను, అసురుల వల్లనూ భయం కలగదు.*

నీవు సర్వావస్థలలోను ధర్మాన్నే దృష్టిలో పెట్టుకొంటావు. అందుచేత కైకయ

మహారాజా నీవు ఇంటికి వెళ్లు. నీకు స్వస్తి. నేను వెళ్లివస్తా. గోబ్రాహ్మణులను, ప్రజలను రక్షించే రాజుకు రాక్షసులవల్లనే భయంలేదు. ఇక అగ్ని భయం ఎక్కడిది ? ఎవరి ముందు విప్రులు నడుస్తారో, ఎవరికి బ్రాహ్మణుడు ముఖ్యమైన బలమో, ఎవరి పౌరులంతా అతిథి ప్రియు లయి ఉంటారో ఆ రాజులు స్వర్గాన్ని జయిస్తారు.' భీష్ముడన్నాడు. 'అందుచేత బ్రాహ్మణులను రక్షించాలి. రక్షితులైన బ్రాహ్మణులు రాజులను రక్షిస్తారు. ఇది రాజులకు ఆశీస్సు. చక్కగా నడచుకో. అందువల్ల రాజు బ్రాహ్మణానుగ్రహంకోసమే కర్మభ్రష్టులను దండించాలి. వారిని విడగొట్టాలి. పౌర, జానపదుల పట్ల ఇలా ప్రవర్తించే రాజు ఇహలోకంలో శుభాలు పొంది, ఇంద్రునితో సమాన లోకాన్ని పొందుతాడు.'

78. బ్రాహ్మణుని వైశ్యధర్మ జీవనము.

ధర్మరాజు ఇలా అడిగాడు. 'రాజధర్మాలతో ఆపదల్లో బ్రతికే తీరు చెప్పావు. అలాగే బ్రాహ్మణుడు వైశ్యధర్మంతో జీవించ వచ్చునా? లేదా?' భీష్ముడు చెపుతున్నాడు. 'క్షత్రియధర్మంతో బ్రతకలేకపోతే వైశ్యధర్మంతో ప్రవర్తింపవచ్చును. కృషి, గోరక్షణమూ చేసుకొంటూ ఉండవచ్చును. ఇది బ్రతుకు తెరువు చెడిపోయిన ఆపదలోనే.' ధర్మరాజు అడిగాడు. 'బ్రాహ్మణుడు వైశ్యధర్మంతో వర్తిస్తూ ఏ వస్తువుల వర్తకం చేస్తే స్వర్గం చెడదు ?' **భీష్ముడు చెపుతున్నాడు. 'మద్యం, ఉప్పు, నువ్వులు, గుర్రాలు, ఎద్దులు, మధువు, మాంసం, వండిన అన్నం వీటిని ఎన్నడూ అమ్మరాదు. వీటిని అమ్మితే బ్రాహ్మణుడు నరకానికి పోతాడు.** అగ్నిస్వరూపమైన మేక, వరుణ స్వరూపమైన పొట్టేలు, సూర్య స్వరూపమైన గుర్రం, విరాట్ స్వరూపమయిన భూమి, యజ్ఞరూపాలయిన ఆవు, సోమం ఎన్నడూ అమ్మకూడదు. వండిన పదార్థంతో వండని పదార్థం మార్చుకోవడాన్ని సజ్జనులు ప్రశంసించరు. కాని భోజనం కోసమయితే పక్వాన్నంతో వండనిది మార్చుకోవచ్చును. "మేము వండినది తింటాము. మీరు ఇవి తీసుకొని వండుకొనండి" ఇలా చెప్పుకొని మార్చుకొంటే అధర్మం అందులో ఎన్నడూ ఉండదు. ధర్మజా ! ఇక్కడ సనాతన ధర్మవ్యవహారానికి సంబంధించిన వారి విశేషం ఒకటి చెపుతాను విను. **మీకు నేను దీనిని ఇస్తున్నాను. మీరు దీనిని ఇవ్వండి. అని ఇష్టపడి ద్రవ్యవినిమయం (మార్పు) చేసుకొంటే ధర్మమే. బలవంతంగా చేస్తే ధర్మంకాదు.** ఇటువంటి వ్యవహారాలు పూర్వం నుండీ ఋషులకూ, ఇతరులకూ కూడా సాగుతూ ఉన్నాయి. ఆ పద్ధతి మంచిది. సందేహం లేదు.'

ధర్మరాజు అపుడు ఇలా అన్నాడు. 'పితామహా ! ప్రజలంతా ఆయుధాలు పట్టితే తమధర్మాలు నుండి తొలగిన వారే అవుతారు. అపుడు క్షత్రియబలం తగ్గుతుంది కదా ! అపుడు రాజు లోకాన్ని ఎలా రక్షిస్తాడు ? ప్రజలకు ఎలా అభయం ఇస్తాడు ?ఈ నా సంశయాన్ని విస్తరించి తీర్చండి.' భీష్ముడు ఇలా అన్నాడు. 'దానం, తపస్సు, యజ్ఞం, ద్రోహం చేయకపోవడం, దమం. వీటితో బ్రాహ్మణులు మొ॥ వర్ణాలు తమ క్షేమాన్ని కోరుతారు. వారిలో వేదమే బలంగా కలవారు సదా కనిపెట్టి ఉండి, దేవతలు ఇంద్రుని బలాన్ని పెంపొందించినట్లు రాజు బలాన్ని పెంపొందించాలి. శక్తి తరిగిపోయే రాజుకు బ్రాహ్మణుడే శరణ్యం. అందుచేత తెలివితో రాజు బ్రహ్మబలంతోనే పైకి పెరగాలి. జయించిన రాజు ప్రజలకు క్షేమం కలిగించాలని కోరితే అపుడు అన్ని వర్ణాలవారూ యథాధర్మంగా ప్రవర్తించాలి. మర్యాదలు ఉల్లంఘించి ప్రవర్తించే దస్యుల వల్ల వర్ణసాంకర్యం ఏర్పడితే అపుడు వర్ణాలన్నీ శస్త్రాలు ధరిస్తే చెడిపోరు. అది తప్పుకాదు. ధర్మరాజు ఇలా అన్నాడు. 'ఒకవేళ క్షత్రియులంతా బ్రాహ్మణులపై ద్వేషంతో ఉంటే అపుడు ఏ బ్రాహ్మణుడు రక్షకు డవుతాడు ? ధర్మం ఏమిటి? గతి ఏమిటి ?' భీష్ముడు అన్నాడు. 'అపుడు తపస్సుతో, బ్రహ్మచర్యంతో, ఆయుధంతో, బలంతో, ఆర్జవంతోనూ, అవసరమైతే మాయతోను బ్రాహ్మణుడు క్షత్రియుని అదుపులో పెట్టాలి. క్షత్రియుడు హద్దు మీరి ప్రవర్తిస్తే అందునా బ్రాహ్మణుని విషయంలో అలాచేస్తే బ్రాహ్మణులే క్షత్రియుని నియంత్రించాలి. క్షత్రవంశం బ్రహ్మవంశం వల్ల పుట్టింది కదా ! నీటి నుండి అగ్ని పుట్టింది. బ్రాహ్మణవర్ణం నుండి క్షత్రియ వంశం పుట్టింది. రాతి నుండి లోహం పుట్టింది. ఇతరత్ర వాటితేజస్సు ప్రసరిస్తుంది కాని తమ జన్మకారకాల దగ్గర అవి అణగిపోతాయి. రాతిని కోస్తే ఇనుము నశిస్తుంది. నీటిని చేరితే అగ్ని నశిస్తుంది. బ్రాహ్మణుని ద్వేషిస్తే క్షత్రియుడు నశిస్తాడు. అందుచేత బ్రాహ్మణుని దగ్గర అజేయాలైన క్షత్రియుల తేజస్సులు, బలాలు శమించిపోతాయి. బ్రాహ్మణ శక్తి, క్షత్రియశక్తి సన్నబడితే సర్వవర్ణాలవారు బ్రాహ్మణుల పట్ల అన్ని విధాల దుష్టులయితే, ప్రాణాలకు తెగించి యుద్ధం చేసేవారు బ్రాహ్మణులను, ధర్మాన్ని, తమను కాపాడుకొంటూ, మనసున్న పుణ్యచరితు లవుతారు. బ్రాహ్మణులకోసం అందరూ ఆయుధం పట్టడం మంచిదే. అతిమాత్రంగా యజ్ఞాలు, వేదాధ్యయనం, తపస్సు, ఉపవాసవ్రతాలు, అగ్ని ప్రవేశం చేసేవారు పొందే లోకాలను బ్రాహ్మణుని కోసం ప్రాణాలర్పించే శూరుడు పొందుతాడు. బ్రాహ్మణుడు మూడు వర్ణాల వారి రక్షణకోసం శస్త్రం పట్టినా దోషంకాదు. ఇలాగే యుద్ధంలో ఆత్మత్యాగం చేయడంకంటె ధర్మం లేదని విద్వాంసులంటారు.

బ్రహ్మద్వేషులను నియంత్రిస్తూ తమ శరీరాలను హోమంచేసేవారికి నమస్కారం. భద్రమగుగాక. మాకు వారితో సమానలోకం కలుగుగాక ! బ్రహ్మలోకం, స్వర్గలోకం, పొందిన వీరులను గురించి మనువు ఇలా చెప్పాడు. దుర్మార్గులు ఆయుధంతో యుద్ధంలో చనిపోయినా అశ్వమేధయాగంలో అవభృథస్నానం చేసిన వారివలె పవిత్రు లవుతారు. దేశకాలాలను బట్టి అధర్మం ధర్మం అవుతుంది. ధర్మం అధర్మం అవుతుంది. దేశకాలాలు అటువంటివి. అందరితో మైత్రికల మహాపురుషులు (ఉత్తంకుడు, పరాశరుడు మొ॥ వారు) సజ్జన రక్షణకోసం క్రూర కృత్యాలు చేసినా వారికి స్వర్గం లభిస్తుంది. ధర్మాత్ములు పాపాలు చేసినా పరమగతిని పొందుతారు. (ఇది దేశప్రభావం). ఆత్మరక్షణలో, వర్ణసాంకర్యం నుండి రక్షించడంలో, అణచలేనివారిని అణచడంలో, బ్రాహ్మణుడు ఈ మూడు సమయాల్లోనూ ఆయుధం పట్టినా దోషం కలగదు. (ఇది కాలప్రభావం.)

ధర్మరాజు ఇలా అన్నాడు. 'దోపిడీ దారులు విజృంభిస్తున్నపుడు, ప్రజారక్షణ విషయమై వర్ణసంకరం ఏర్పడినపుడు, వర్ణములవారంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నపుడు, ఇతర రాజు బలవంతుడై అవమానిస్తున్నపుడు, (ఈ సందర్భాల్లో) బ్రాహ్మణుడయినా, వైశ్యుడయినా, శూద్రుడయినా ధర్మంతో దండం ధరించి దోపిడీ దారుల నుండి ప్రజలను రక్షించాలా ? అక్కరలేదా? దండంతో వారించాలా ? అక్కరలేదా ? ఆ నీచక్షత్రియుని కంటె అన్యుడు శస్త్రాన్ని గ్రహించవచ్చా ?' అపుడు భీష్ముడు ఇలా చెప్పాడు. 'అంతులేని సముద్ర మధ్యంలో ఒడ్డులా ఆదుకొన్నవాడు, నావలే లేని చోట నావగా అయినవాడు శూద్రుడయినా సరే, ఇతరుడయినా సరే అన్ని విధాలా గౌరవింపదగినవాడే. అనాథులయి, దొంగలచే కొట్టబడి పరితపించే ప్రజలు ఎవని నాశ్రయించి సుఖపడతారో వానినే ఆత్మబంధువునువలె పూజిస్తారు. భయరహితుడైన అతడు సమ్మానం పొందటానికి అర్హుడు. బరువు మోయని ఎద్దులతో, పాలివ్వని ఆవుతో, గొడ్రాలయిన భార్యతో, రక్షణ చేయని రాజుతో ప్రయోజనం ఏముంటుంది ? కొయ్య ఏనుగు, తోలు మృగం, నపుంసకుడు, పంటపండని చవిటి భూమి ఎలా నిరర్థకాలో అలాగే వేదం చదువుకొనని విప్రుడు, రక్షించని రాజు, వాన కురవని మేఘం– ఇవన్నీ అన్నివిధాలా వ్యర్థాలు. నిత్యమూ సజ్జనులను రక్షించేవానినే, దుర్జనులను పారద్రోలేవానినే రాజుగా చెయ్యాలి. అతడే దీన్ని అంతనూ ధరిస్తాడు.'

79. ఋత్విక్కుల లక్షణము - తపో విశేషము.

ధర్మరాజు ఇలా అడిగాడు. పితామహా ! ఋత్విక్కులు ఎలా ఉద్భవించారు ? ఎటువంటివారు ? ఏవిధంగా ప్రవర్తిస్తారు ? నాకు చెప్పు.' భీష్ముడు చెపుతున్నాడు. 'ప్రయోగశుద్ధి, శ్రద్ధాచరణం అనునవి వారివిధులు. ఛందస్సు, సామం, శ్రుతాలను ఋత్విక్కు తెలుసుకోవాలి. ఋత్విక్కులు నిత్యమూ ఒకే యజమానిపై ఆసక్తి కలిగి, ధీరులై, ప్రియంగా మాట్లాడాలి. ఒకరికొకరు స్నేహితులై అంతటా సంపూర్ణమైన సమదృష్టి కలిగి ఉండాలి. దయ, సత్యం కలవారై ఉండాలి. వడ్డీ వ్యాపారం చేయనివారు, సరళస్వభావులు అయిఉండాలి. ద్రోహం చెయ్యనివాడు, అహంకార రహితుడు, లజ్జ, ఓర్పు, దమం, శమం ఇవి ఉన్నవాడు పురోహితుడు. బుద్ధిమంతుడు, సత్యధారణ చేసేవాడు, ఇంద్రియ నిగ్రహం కలవాడు, ప్రాణులను హింసింపని వాడు, రాగద్వేషాలు లేనివాడు; విద్య, ప్రవర్తన, వంశం ఈ మూడూ స్వచ్ఛమయిన వాడు, హింసా భావమే లేనివాడు, జ్ఞానంతో తృప్తి కలవాడు - ఈ లక్షణాలు కలవాడు బ్రహ్మాసనానికి అర్హుడు. వీరు మహాఋత్విక్కులు - అర్హతల ననుసరించి అందరూ గౌరవార్హులు.' యుధిష్ఠిరుడు అన్నాడు. "ఇది ఇవ్వాలి' 'ఇది ఇవ్వాలి' అని దక్షిణల విషయమై వేదవచనం కనిపిస్తోంది. దీనికెక్కడా అంతు, వ్యవస్థ కనపడటం లేదు. ఈ శాస్త్రం ధనానికి సంబంధించినది కాదు. ఆపద్ధర్మశాస్త్రాన్ని అనుసరించినది. ఈ శాస్త్ర విధి చాలా ఘోర మయినది. (ఎందుకంటే).. ఇది ఇచ్చేవాని శక్తిని చూడటంలేదు. 'శ్రద్ధ కలవాడు యజ్ఞం చెయ్యాలి' అని వేదవచనం. మిథ్యాచారంతో కూడిన యజ్ఞానికి శ్రద్ధ ఏమి చేస్తుంది ?'

భీష్ముడు ఇలా అన్నాడు. 'వేదాలను అవమానిస్తే, మొండితనం వహిస్తే, మాయలు పన్నితే ఎవడూ గొప్పవాడు కాడు. నీ కిట్టి బుద్ధి కలుగరాదు. నాయనా ! దక్షిణ అనేది యజ్ఞంలో ఒక అంగం అని వేదం చెపుతోంది. దక్షిణలేని యజ్ఞాలు ఏవిధంగానూ తరింపజెయ్యవు. శక్తి అనేది పూర్ణ పాత్రతో పోలినది. కాని దానికి సమం కాదు. మూడు వర్ణాలవారూ యథావిధిగా, శక్తిననుసరించి తప్పకుండా యజ్ఞం చెయ్యాలి. బ్రాహ్మణులకు సోమరసమే రాజు అని వేదంలో ఉంది. దానిని అమ్మటానికి కూడ ఇష్టపడతారు. కాని వ్యర్థమైన బ్రతుకు తెరువును ఇష్టపడరు. సోమం అమ్మిన యజ్ఞంతో యజ్ఞం వృద్ధి చెందుతోంది. ధర్మాచరణం చేసే ఋషులు అలా భావించారు. పురుషుడు, యజ్ఞం, సోమం - ఈ మూడూ న్యాయపూర్ణాలయితే పురుషుడు తనకూ, ఇతరునికీ అన్యాయం చేసినవాడు కాడు. శరీర నిర్వహణకోసం మహాత్ములయిన బ్రాహ్మణులు

రూపొందించిన యజ్ఞాలు అంత చక్కగా కూర్చినవి కావని వేద వాక్యం వినిపిస్తోంది. తపస్సు యజ్ఞం కంటె శ్రేష్ఠమయినదని వేదం వినపడుతోంది. అందుచేత తపస్సును గురించి చెపుతాను. అది కూడా విను. **అహింస, సత్యవాక్కు, క్రూరత్వం లేకపోవుట, దమం, జాలి, - ఇవి తపస్సు అంటే. అంతేకాని శరీరాన్ని శుష్కింపజేసుకోవటం కాదు.** వేదాలు ప్రమాణం కాదనే భావన, శాస్త్రనియమాలను ఉల్లంఘించడం, అంతటా అవ్యవస్థ - ఇదే ఆత్మ వినాశం. ధర్మజా ! దశహోత్ర విధానం ఎటువంటిదో తెలుసుకో - చిత్తియే స్రుక్కు. చిత్తమే ఆజ్యం. ఉత్తమజ్ఞానమే పవిత్రం. **కుటిలత అంతా మృత్యుస్థానం. ఆర్జవం బ్రహ్మపదం. ఇదే జ్ఞానవిషయం. మిగిలిన దంతా ప్రలాపం. దాని వల్ల లాభం లేదు.'**

80. సచివ లక్షణము.

యుధిష్ఠిరుడు ఇలా అడిగాడు. పితామహా ! చాలా చిన్నపని కూడా సహాయం లేకుండా ఒక్కడూ చేయడం కష్టం - ఇక రాజు సంగతి చెప్పవలెనా ? ఎటువంటి స్వభావం, ప్రవర్తన కలవాడు రాజుకు మంత్రికావాలి ? ఎటువంటి వానిని రాజు నమ్మాలి ? ఎటువంటి వానిని నమ్మకూడదు ?' భీష్ముడు చెపుతున్నాడు. 'రాజా ! రాజులకు నాలుగురకాల మిత్రులుంటారు. 1. సహార్థుడు 2. భజమానుడు 3. సహజుడు 4. కృత్రిముడు. ధర్మాత్ముడనే అయిదవ మిత్రుడు కూడ ఉంటాడు.కాని అతడు ఏ ఒకరికో, ఇద్దరికో సంబంధించి ఉండడు. ధర్మం ఉన్నవైపున ఉంటాడు. లేదా ధర్మస్థుడున్నవైపున అయినా ఉంటాడు. అతనికి ఇష్టంకాని విషయాన్ని అతనికి చెప్పరాదు. జయంకోసం రాజులు ధర్మంతోనూ, అధర్మం తోనూ కూడా ప్రవర్తిస్తారు. పైని చెప్పిన నలుగురిలోనూ మధ్యములు ఇద్దరూ (భజమానుడు, సహజుడు) శ్రేష్ఠులు. మిగిలినవారు నిత్యమూ శంకింపదగినవారు. తన పనికి సంబంధించినంతవరకు అందరూ అన్నివేళలా శంకింపదగినవారే. మిత్రులను రక్షించే విషయంలో రాజు ఎన్నడూ పొరబడకూడదు. అలా పొరబడే రాజును లోకులు అవమానిస్తారు. దుర్జనుడు సజ్జనుడు కావచ్చు. సజ్జనుడు దుర్జనుడు కావచ్చు. శత్రువు మిత్రు డవుతాడు. మిత్రుడు కూడ శత్రువు కావచ్చు. మానవుని మనస్సు నిత్యమూ ఒకేవిధంగా ఉండదు. అటువంటి వానిని ఎవడు నమ్ముతాడు ? అందుచేత ప్రధానమైన పనిని రాజు ప్రత్యక్షంగా చేసుకోవాలి. (స్వీయరక్షణం కోశరక్షణం మొ॥) పూర్తిగా నమ్మితే మొత్తం ధర్మార్థాలు రెండూ నశించి పోవచ్చు. ఎవరినీ నమ్మకుండా ఉంటే అది మృత్యువును

మించినది. **పూర్తివిశ్వాసం అకాల మృత్యువే. అలా నమ్మితే ఆపదల్లో పడినట్లే. ఎవరయినా ఒకని మీద విశ్వాసం ఉంచితే వాడి ఇష్టం వచ్చినట్లు రాజు బ్రతకాలి.** అందుచేత నాయనా ! కొందరిని నమ్మాలి. కొందరిని అనుమానించాలి. (ఒకప్పుడు నమ్మాలి మరొకప్పుడు శంకించాలి). ఇది నీతిమార్గం. ప్రాచీన కాలం నుండీ చూస్తున్న దిది. 'నేను లేకపోతే ఈ సంపద అంతా వీనికి చెందుతుంది' అని ఎవనిని గురించి అనుకొంటావో వానిని నిత్యమూ శంకించాలి. వాడు శత్రు వని పండితు లంటారు. ఒకని పాలంలో నుండి మరొకని పాలంలోకి నీరు పోవలసి ఉంటే పై వాడు కోరకపోయినా కట్టలన్నీ తెగకుండా భద్రంగా ఉంటాయి. అలాగే ఎక్కువ నీరు తనపాలంలో ఉంటే పంటపాడవుతుందనే భయం కలవాడు కట్టను తీసివేయాలను కొంటాడు. ఈ లక్షణం కలవానిని శత్రువని తెలుసుకోవాలి. తన వృద్ధిచేత తృప్తిపడనివాడూ, క్షీణత చేత మిక్కిలి దుఃఖపడే వాడూ ఉత్తమ మిత్రు డని చెపుతారు. 'నేను లేకపోతే వీడు లేడు' అని ఎవనిని గురించి భావిస్తావో వాని మీద తండ్రిమీద ఉంచినట్లు విశ్వాసం ఉంచవచ్చు.

శక్తితో తాను వృద్ధి పొందుతూ వానిని అన్నివైపుల నుండి వృద్ధి పొందించాలి. ధర్మకర్మలలో కూడా లోపం జరగకుండా వారించే వానిని కూడా వృద్ధి పొందించాలి. రాజుకు కలిగే దెబ్బకు భయపడటమే మిత్రుని లక్షణం - రాజుకు దెబ్బతగలాలి అని కోరేవారు శత్రువులు అని గుర్తించారు. తన (రాజు యొక్క) కష్టానికి సదా భయపడకుండా, తన సమృద్ధివలన చెడు భావాలు రాని మిత్రుడు తనతో సమానుడని చెప్పబడుతాడు. చక్కని రూపం, రంగు, కంఠస్వరం, ఓర్పు, కలిగినవాడు అసూయలేనివాడు, సద్వంశంలో పుట్టిన వాడు, శీలసంపన్నుడు అయిన మిత్రుడు తన తరువాత నిలువదగినవాడు. బుద్ధికుశలత, జ్ఞాపకశక్తి, దయా స్వభావం కలవాడై; గౌరవించినా గౌరవించకపోయినా ఎన్నడూ దుష్టభావంలేని ఋత్విజుడు కాని, ఆచార్యుడు కాని, ప్రశంసలు పొందిన వాడు కాని నీ గృహంలో మంత్రిగా ఉండదగును. అతడు ఉత్తమపూజితుడు కావచ్చును. అతడు నీ ఆలోచననలను, రహస్యాలను, అర్థ ధర్మాలను, పౌర స్వభావాలను చక్కగా తెలిసి ఉండాలి. అపుడు అతని మీద నీకు తండ్రిమీద ఉన్నట్లుగా విశ్వాసం కలుగుతుంది. **ఒకే పనిలో ఇద్దరినీ, ముగ్గురినీ, ఒకరివొకరు సహింపలేని వారిని నియమించకూడదు. ప్రాణులకు ఒకే పనిలో ప్రవర్తిస్తున్నపుడే భేదం ఎప్పుడూ కలుగుతుంది.**

కీర్తియే ముఖ్యం అనుకొనేవాడు, మాట మీద నీతిమీద నిలిచేవాడు, సమర్థులను ద్వేషించనివాడు, అనర్థాలయిన పనులు చెయ్యని వాడు, భయంవలన కాని, కామంవలన

కాని, లోభంవలన కాని ధర్మం వదలని వాడు, సమర్థుడు, సముచితంగా మాట్లాడేవాడు నీకు మంత్రిగాదగినవాడు. సత్కులంలో పుట్టినవాడు, చక్కని ప్రవర్తనతో కష్టాలు సహింపగలవాడు, తన్నుతాను పొగడుకొననివాడు, శూరుడు, ఆర్యుడు, విద్వాంసుడు, కార్యాకార్యాలు తెలిసినవాడు – వీరిని మంత్రులుగా చేసుకోవాలి. వారు అన్ని పనులలో నేర్పుకలిగి, పూజితులై, ప్రత్యేకతలు కలిగి సహాయపడుతూ కార్య నిర్వహణం చేయగలుగుతారు. వీరిని పూర్తిగా తగిన పనుల్లో నియమిస్తే, ఆ మహాకార్యాలు చక్కగా నిర్వహించి శ్రేయస్సులను కలిగిస్తారు. వీరు ఒకరితో ఒకరు పోటీపడి ఆ కార్యప్రయోజనాన్ని గురించి కూడబలుకుకొంటూ రాచకార్యాలను రాజుకు అనుకూలంగా చేస్తూ ఉంటారు.

మృత్యువువల్ల భయం ఉన్నట్లే రాజుకు జ్ఞాతులవలన కూడ భయం ఉంటుందని తెలుసుకో. సామంతరాజువలె కూడా రాజుయొక్క ఉన్నతిని జ్ఞాతి సహించలేడు. ఋజుత్వం, మార్దవం, వదాన్యత, లజ్జ, సత్యవాదిత్వం కల రాజు యొక్క వినాశనాన్ని జ్ఞాతి తప్ప మరెవడూ అభినందింపడు. జ్ఞాతులు లేనివారు సుఖపడతారని చెప్పలేము. పైగా వారిని అవహేళన చేయకూడదు. జ్ఞాతులు లేనివారిని ఇతరులు పరాభవిస్తారు. ఇతరుల చేత అవహేళన పొందిన జ్ఞాతికి మళ్లీ జ్ఞాతియే దిక్కు. జ్ఞాతి కీడును జ్ఞాతిని మించి ఇతరులు పట్టించుకోరు. బంధువుల చేత అవహేళన పొందిన బంధువును చూసి తానే ఆహేళన పొందినట్లు తలుస్తాడు. జ్ఞాతులలో గుణాలూ ఉన్నాయి. గుణాలు లేకపోవటమూ ఉంది. జ్ఞాతి కానివాడు అనుగ్రహించ డని కాని నమస్కరింపడనికాని చెప్పలేము. మంచి చెడులు రెండూ జ్ఞాతులవర్గాలలో కనిపిస్తాయి. జ్ఞాతులను నిత్యమూ మంచి మాటలతోను, మంచి పనులతోను మన్నిస్తూ ఉండాలి. ప్రియం చేస్తూ ఉండాలి. ఏమాత్రమూ అప్రియం చేయరాదు. నమ్మకం లేకపోయినా ఉన్నట్లు జ్ఞాతులతో వ్యవహరించాలి. ఇది దోషం, ఇది గుణం అని నిరూపించి చెప్పతగింది వారిలో కనపడదు. ఇలా పొరబడకుండా ప్రవర్తించే వానికి శత్రువులు తగ్గిపోతారు. అలాగే మిత్రులు కూడా అవుతారు. జ్ఞాతులు, చుట్టాలలో ఇలా నిత్యమూ ప్రవర్తించేవాడు మిత్రులలోను, శత్రువులలోను, మధ్యస్థులలోను చిరకీర్తి పొందుతాడు.

81. వాసుదేవ నారద సంవాదము.

యుధిష్ఠిరుడు ఇలా అడిగాడు. 'జ్ఞాతులు, బంధువుల సముదాయాన్ని గ్రహించడం శక్యం కాకపోతే మిత్రులు, అమిత్రుల పట్ల ఏ భావం కార్యసాధక మవుతుంది ?' భీష్ముడు చెపుతున్నాడు. "ఈ విషయమై వాసుదేవ నారద సంవాదమని ఒక పురాతనమైన ఇతిహాసం ఉదాహరిస్తారు. వాసుదేవుడు చెప్పాడు. 'శత్రువు శ్రేష్ఠమైన ఆలోచనను

తెలుసుకోరాదు. పండితుడు కాని మిత్రుడు, పండితు డయినా ఆత్మీయుడుకానివాడు మంత్రాన్ని తెలియరాదు. దేవర్షీ ! మైత్రిని పురస్కరించుకొని నీతో కొంచెం మాట్లాడుతున్నాను. నీ బుద్ధిబలం అంతా ఉపయోగించి చెప్పు. ఐశ్వర్యం ప్రకటించు కొనేందుకు జ్ఞాతులకు దాస్యం చెయ్యను. భోగాలలో సగం అనుభవిస్తాను. జ్ఞాతుల దుర్వాక్యాలను మాత్రం క్షమిస్తాను. అగ్ని కావలసినవాడు అరణులను మథిస్తాడు. అలా వాడు పలికిన చెడ్డమాటలు నా హృదయాన్ని మథించి వేస్తున్నాయి. ఆ విషయం నన్ను కాల్చి వేస్తోంది. బలరామునిలో బలం ఉంది. గదునిలో సౌకుమార్యం ఉంది. ప్రద్యుమునిలో రూపం ఉంది. కాని నారదా ! అటువంటి నేను అసహాయుడ నయ్యాను. నారదా ! ఇతరులైన అంధకులు, వృష్ణులు, బలవంతులు, చెడ్డ ఉత్సాహం కలవారు. నిత్య సంసిద్ధతతో కూడినవారు. తనకు ఎవరూ లేనివాడు లేనివాడే. ఎవనికి అండగా కొంతమంది ఉంటారో వానికి అన్నీ ఉన్నట్లే. నన్ను ఆ ఇద్దరూ పొమ్మన్నారు. నేను వారిలో ఒకరిని ఎన్నుకోలేను. ఆహుకుడూ, అక్రూరుడూ మరొకని వాళ్లయితే అంతకు మించిన దుఃఖంలేదు. వారిద్దరూ నా వారు కాకపోయినా అంతే. నేను ఇద్దరు జూదరుల తల్లివలె ఆ ఇద్దరిలో ఒకరికి విజయాన్ని, మరొకనికి అపజయం లేకపోవటాన్ని కోరుతున్నాను. ఇలా నేను ఆ ఇద్దరి మధ్య నలిగి పోతున్నాను. నా జ్ఞాతులకు నేను ఏది చేస్తే నాకు శ్రేయస్కరమో చెప్పు.'

నారదుడు అన్నాడు. "కృష్ణా ! ఆపదలు రెండు రకాలు - బాహ్యమూ, ఆభ్యంతరము అని. అవి స్వయంకృతా లయినా అన్యకృతా లయినా సరే ! ఇపుడు నీ ఆపద స్వకర్మ వలన నీలో ఏర్పడినది. అక్రూరుడు, ఆభీరుడు అనే వారి వల్ల వచ్చింది. వీరు ఆ వంశంలో వాళ్లేకదా ! నీకు లభించిన ఐశ్వర్యం ప్రయోజన దృష్ట్యా కాని, ఇష్టంతో కాని, పరుష వాక్కుతో కాని ఎలాగో అలాగ (ఆహుకునికి) ఇతరులకు ఇవ్వబడింది. ఇపుడా జ్ఞాతి బృందం వేళ్లు పాతుకొంది. అందుచేత క్రక్కిన అన్నం వలె నీవు దానిని తిరిగి పొందటం సాధ్యంకాదు. బభ్రుడు, ఉగ్రసేనుడు అనే వారి రాజ్యాన్ని, జ్ఞాతి భేదం కలుగుతుందనే భయం వలన నీవు గ్రహించడం సాధ్యపడదు. చాలా గొప్ప ప్రయత్నంతో, దుష్కరమైన కార్యం చేస్తే సిద్ధింపవచ్చు. కాని మహావినాశమో, తరుగుదలయో వస్తుంది. మెత్తగా హృదయాన్ని చీల్చే, ఇనుముతో చేయని శస్త్రంతో ఆ అందరి నాలుకలు పీకి వెయ్యి. తరువాత నోరు మూసి, తుడిచి, అనురాగం ప్రకటించు.' అపుడు కృష్ణుడు ఇలా అన్నాడు. 'నారదా ! తుడిచివేసి, అనురాగం చూపించి, నాలుకపెకలించగల మెత్తనికత్తి అందులోను ఇనుముతో చేయనిది నాకెలా దొరుకుతుంది ?

నారదు డన్నాడు. శక్తి కొద్దీ అన్నం పెట్టడం, కష్టాలు సహించడం, ఆర్జవం, మృదువైన రీతిలో అర్థమైన మన్నన - ఇది ఇనుముతో చేయని మెత్తని కత్తియే. బాణాల వంటి మాటలు మాట్లాడే జ్ఞాతుల హృదయాన్ని, వాక్కునూ, మనస్సునూ నీవు కేవలం మాటతోనే శమింపజెయ్యి. మహాపురుషుడూ, వశీకృతుడూ, సహాయ సంపన్నుడూ ఎవడో ఒకడు తప్ప ఇంత పెద్దభారం ఎవరూ మోయలేడు. నీవు నీ తొమ్మిపై భరించు. సమమైన నేల మీద ఏ ఎద్దు అయినా పెద్దబరువును మోస్తుంది. ఎగుడు దిగుడు దారిలో మంచి ఎద్దు మాత్రమే వహింపరాని భారం మోస్తుంది. సంఘాలు భేదిల్లితే వినాశం వస్తుంది. నీవు సంఘంలో ముఖ్యుడవు. నిన్ను పొంది ఈ సంఘం నశింపకుండా చెయ్యి. బుద్ధి, ఓర్పు, ఇంద్రియ నిగ్రహం, ధనత్యాగం లేనిచోట ఏ గణమూ ప్రాజ్ఞుని అధీనంలో ఉండదు. ధన్యం, కీర్తికరం, ఆయుర్వృద్ధికరం, స్వపక్షవృద్ధి, జ్ఞాతుల అవినాశం దృష్టిలో ఉంచుకొని ఎలా చెయ్యాలో అలా చెయ్యి కృష్ణా ! వర్తమానంలో కాని, భవిష్యత్తులో కాని నీకు తెలియనిది లేదు. షాడ్గుణ్య విధానంతో యాత్రలు, ప్రయాణవిధులు అనేవానిలో కూడ అంతే. (నీకు తెలియనిది లేదు). యాదవులు, కురురులు, భోజులు, అంధకులు, వృష్ణులు అందరూ, లోకాలు, లోకేశ్వరులూ నీ మీద ఆసక్తితో ఉన్నారు కృష్ణా ! నీవు సర్వప్రాణులకు గురువువు. భూత భవిష్యత్తులు నీకు తెలుసు. నిన్ను చేరి యాదవులంతా సుఖపడతారు.

82. కాలకవృక్షీయోపాఖ్యానము.

భీష్ముడు చెపుతున్నాడు. 'ధర్మజా ! ఇది ప్రథమ వృత్తి. రెండవది విను. ఎవరయినా రాజు యొక్క ధనం వృద్ధిచేస్తే రాజు వానిని సదా రక్షించాలి. రాజు యొక్క ధనాన్ని మంత్రి అపహరిస్తూ ఉండటం సేవకుడో, మరొకడో చూసి రాజుకు చెపితే అది రాజు రహస్యంగా వినాలి. వెంటనే అతనిని మంత్రినుండి రక్షించాలి. మంత్రి, ఇంకా అపహరించే వాళ్లూ కలిసి ఈ చెప్పిన వానిని చంపేస్తారు. అలాగే కోశాధికారిని కూడ రక్షించాలి. అతనిని రక్షించకపోతే రాజధనం అపహరించే వాళ్లంతా కలిసి కోశాధికారిని బాధిస్తారు. ఈ విషయంలో ప్రాచీనమైన, జరిగిన కథను చెపుతారు. అది కాలకవృక్షీయుడనే ముని కోసలరాజుతో చెప్పినది. కోసల రాజ్యాల ఆధిపత్యం క్షేమదర్శికి సంక్రమించింది. అపుడు క్షేమదర్శి దగ్గరకు కాలకవృక్షీయముని వచ్చాడు. అతడు ఒక కాకిని పంజరంలో బంధించి, ఒక పని కోసం క్షేమదర్శియొక్క రాజ్యంలో ఘాటిమాటికి తిరుగుతున్నాడు.

అయ్యా ! ఈ కాకి విద్యను నేర్చుకోండి. నా కాకులు భూత భవిష్యద్వర్తమానాలు చెపుతాయి. ఇలా చెపుతూ ఇంకా చాలామందితో కలిసి రాష్ట్రం అంతా తిరుగుతూ రాజుద్యోగుల చెడ్డపనులన్నీ చూశాడు. అతడు రాష్ట్రంలో జరిగే అన్ని పనులూ తెలుసుకొన్నాడు. రాజోద్యోగులు చేసే దొంగపనులన్నీ తెలుసుకొని తర్వాత కాకిని తీసుకొని రాజును చూడటానికి వచ్చాడు. "నేను సర్వజ్ఞుడను" అని ఆ ముని చెప్పుకొంటూ రాజును చేరాడు. కోసలరాజును చేరి అలంకారాలు ధరించిన మంత్రి ఎదుట కాకిమాటగా "నీవు ఇది దొంగిలించావు" అన్నాడు. "నీవు రాజు కోశాగారం దొంగిలించావు. వీడు ఎరుగును - వీడు ఎరుగును" అని ఈ కాకి చెపుతోంది. అందుచేత వెంటనే దీన్ని గురించి ఆలోచించు, అన్నాడు. అలాగే రాజధనం అపహరించిన ఇతరుల గూర్చి కూడ చెప్పాడు. అతని మాటలో ఏ మాత్రమూ అసత్యం వినపడలేదు. వానిచేత తిరస్కరింపబడిన రాజోద్యోగులు చీకట్లో నిద్రిస్తున్న అతని కాకిని పంజరంలోనే బాణాలతో పొడిచి చంపారు. బాణాలతో పొడువబడిన పంజరంలోని కాకిని చూసి, ప్రొద్దునే బ్రాహ్మణుడు (కాలకవృక్షీయుడు) రాజుతో ఇలా అన్నాడు. రాజా ! నాప్రాణాలకు, ధనానికీ నీవే ప్రభువువు. నిన్ను నేను అభయమివ్వ మని కోరుతున్నాను. నీవు అనుమతిస్తే నీకు ఒక మంచి మాట చెపుతాను. మిత్రుని విషయమై చాలా బాధపడి నేను నీ దగ్గరకు మనఃస్ఫూర్తిగా వచ్చాను. నీ నష్టాన్ని తెలిసి సహించలేని వీడు (నేను) వాడెవడైనా నీ మీదిమైత్రితో మంచిగుర్రాన్ని సారథిలాగా నిన్ను మేల్కొల్పటానికి వస్తే అతడు వీడు కోపం కలిగించే ప్రసంగం చేసినా, నీకు హితాన్ని కలిగిస్తున్నాడు కాబట్టి ఐశ్వర్యకాముకుడవైన నీవు దాన్ని తెలిసికొని ఆ మిత్రుని క్షమించాలి.' అపుడు రాజు అతనితో ఇలా అన్నాడు. "నీ వేది చెప్పినా నా మేలు కోరి చెపుతావు. నిన్ను ఎందుకు క్షమించను ? బ్రాహ్మణా ! ఒట్టువేసి చెపుతున్నాను. నీవు చెప్పేది స్పష్టంగా చెప్పు. నీవు చెప్పినది నేను తప్పక చేస్తాను."

అపుడు ముని అన్నాడు. పాపాత్ములను, పాపరహితులను చక్కగా తెలిసికొని, నీ సేవకుల వల్లనే నీకు కలిగే భయాలను గుర్తించి, నీకు చెప్పటానికే భక్తితో నీ దగ్గరకు వచ్చాను. రాజును సేవించేవారి ఇటువంటి దోషాలను గురించి గురువులు నీకు ముందే చెప్పారు. నీ సేవకుల యీ పాపబుద్ధి వారికి ఇంకో గతిలేక ఏర్పడినది. రాజులతో స్నేహం త్రాచుపాములతో స్నేహం వంటిది. రాజుకు చాలామంది స్నేహితులుంటారు. అలాగే చాలా మంది శత్రువు లుంటారు. రాజసేవకులకు వారందరి వల్లనూ భయం కలుగుతూనే ఉంటుంది. ఒక్కొక్కప్పుడు రాజు వల్లనే క్షణంలో భయం కలగవచ్చు.

రాజు విషయంలో పొరబడకుండా ఒకే విధంగా సేవ చేయడం అసాధ్యం. అభివృద్ధికోరేవాడు ఎన్నడూ పొరపాటు చేయకూడదు. సేవకుని పొరపాటు వల్ల రాజు జారిపడితే ఇక ఆ సేవకునికి జీవితమే లేదు. నిపుణుడైన సేవకుడు మండే అగ్నిని సమీపించినట్లు రాజును సమీపించాలి. తన ధనానికీ, ప్రాణానికీ ప్రభువు రాజు. బుసకొట్టే పామును చేరినట్లు ఎంతో జాగరూకుడై "నేను లేను" అనుకొంటూ సదా ప్రయత్నంతో సేవించాలి. (ఆ ప్రవర్తన, ప్రయత్నం ఎలా ఉండాలో చెపుతున్నాడు.) చిన్నతప్పు మాట మాట్లాడినా, తప్పు పని చేసినా, కాని చోట కూర్చున్నా, నిలచినా, గ్రహింపరాని దాన్ని గ్రహించినా, చివరకు మనసులో తప్పుడు భావం కలిగినా, తప్పుగా శరీరావయవాల కదలికలు చూసినా రాజు సేవకుని శంకిస్తాడు. 'రాజుకు అనుగ్రహం కలిగితే దేవతవలె సర్వప్రయోజనాలూ చేకూరుస్తాడు. కోపిస్తే అగ్ని లాగా వ్రేళ్లతో సహా బూడిద చేస్తాడు.' అని, యముడు చెప్పాడు రాజా ! అలాగే జరుగుతోంది కూడా. నీకు మళ్లీ మళ్లీ చాలా మేలు చేస్తాను. నా వంటి అమాత్యుడు ఆపదలలో బుద్ధి సహాయం చేస్తాడు. ఈ నా కాకి కూడ నీ కార్యమునందే లగ్నమయింది. (కాని చనిపోయింది). మమ్ముకాని, మీ ప్రియులను కాని నేను ఇపుడు నిందింపను. హితు లెవరో, శత్రువు లెవరో తెలుసుకొనండి. ప్రత్యక్షబుద్ధి కలిగి తెలుసుకోండి. పరోక్షబుద్ధి వద్దు.

నీ భవనంలో ఉండి నీ నుండి దొంగిలించే వారిని గురించి అటువంటి వారిని ఉద్దేశించి చెపుతున్నాను. వారు ప్రజల ఐశ్వర్యాన్ని కోరరు. నీ వినాశం చేత నీ తరువాత రాజ్యం కోరే వాడుంటే నీ ఆంతరంగికుల వల్లనే ఆ వినాశం సిద్ధిస్తుంది. మరో విధంగా సాధ్యపడదు. రాజా ! వారి వల్ల భయంతో నేను మరో ఆశ్రమానికి వెళతాను. వారు నా మీదకు సంధించిన బాణం పాపం ! కాకి మీద పడింది. వంచింపగోరినవారు ఏమీ ఎరుగని కాకిని చంపారు. రాజా ! ఈ విషయం నా తపో దృష్టితో నాకు తెలిసింది. ఎన్నో మొసళ్లు, చేపలతో, తిమింగిలాల సముదాయంతో కూడిన ఈ నదిని అమాయకమైన ఈ కాకిచేత నేను (ఇప్పటికి) దాటాను. బండరాళ్లు, గులకరాళ్లు, ముళ్లు కల ఆ నది హిమవత్పర్వత గుహవంటిది. అందులోకి ప్రవేశింపలేము. ప్రవేశిస్తే సహింపలేము. అందులో సింహాలు పెద్దపులుల్లూ ఉంటాయి. దాన్ని ఈ కాకి సాయంతో (ఎలాగో) దాటాను. చీకటి దుర్గాన్ని దీపంతో దాటవచ్చు. జలదుర్గాన్ని నావతో దాటవచ్చు. కాని రాజదుర్గం దాటే ఉపాయం పండితులకే తెలియదు. నీ రాజ్యం కారు చీకటితో ప్రవేశింప శక్యం కాకుండా ఉంది. ఇక్కడ నీవే ఎవరినీ నమ్మలేని పరిస్థితి ఉంది. ఇక నా మాట

చెప్పాలా ? ఇక్కడ మంచీ, చెడ్డా రెండూ ఉన్నాయి. అందుచేత ఇది మంచి నివాసం కాదు. మంచి పనికీ, చెడ్డ పనికీ కూడ వధ ఒక్కటే ఫలం ఇక్కడ. ఇందులో సందేహం లేదు. న్యాయంగా తప్పు చేసిన వాడిమీదనే దెబ్బపడాలి. మంచి చేసిన వాడిమీద ఎన్నడూ పడరాదు. అందుచేత ఇక్కడ స్థిరంగా ఉండటం తగదు. తెలివైన వాడు వేగంగా పారిపోవాలి. రాజా ! ఈ నది పేరు సీత. ఇందులో పడవ కూడ మునిగి పోతుంది. ఎన్నో సుడిగుండాలతో ఇది అందరినీ చంపే దానిలా ఉంది అని భావిస్తున్నా. మీరు తేనె ప్రవాహం వంటివారు. కాని మీరు పెట్టే భోజనం విషంతో కూడినది. దుర్జనుల మనసులా ఉంది కాని సజ్జనుల మనసులా లేదు. నీవు పాములతో చుట్టుకొని ఉన్న నూతిలాగా ఉన్నావు. దిగటానికి వీలు లేని రేవులు, పెద్దగట్టులు, ముళ్లపొదలు, వెదురు పొదలతో కూడిన నదిలో తియ్యని నీరు ఉన్నట్లు నీవు ఉన్నావు.

కుక్కలు, గ్రద్దలు, నక్కలతో కూడిన రాజహంస లాంటి వాడవు నీవు. ఒక పెద్ద చెట్టును ఆశ్రయించుకొని పొద పెరుగుతుంది. కొంతకాలానికి ఆ పొద పెరిగి వృక్షం కనపడనంతగా అల్లుకుపోతుంది. ఆ పొదయే చివరకు ఇంధనంగామారి దావాగ్ని విజృంభించడంతో వృక్షాన్ని బూడిద చేస్తుంది. రాజా ! నీ మంత్రులు ఆ పొద లాంటివారు. వారిని పరిశోధించు. వారిని నీవే నియమించావు. నీవే పరిపాలిస్తున్నావు. కాని నిన్ను వారు మోసగించి నీకు ప్రియమయినదానిని మ్రింగి వేద్దామనుకొంటున్నారు. ప్రమాదం నుండి రక్షించాలనుకొన్నాను. కాని నేను పామున్న ఇంటిలో ఉన్నట్లు, వీరపత్ని ఇంటిలో ఉన్న జారుని వలె ప్రాణ భయంతో ఉన్నాను. అసలు నేను రాజు శీలాన్ని, ఉద్యోగుల శీలాన్ని తెలుసుకోవాలి అనుకొన్నాను. ఈ రాజు ఇంద్రియాలను గెలిచినవాడా ? తన ఉద్యోగులు తన వశంలో ఉన్నారా ? ప్రజలకు రాజు ప్రియమైన వాడా? రాజుకు ప్రజలు ప్రియులా ? ఈ విషయాలు తెలుసుకోవాలని నీ దగ్గరకు వచ్చాను. ఆకలిగా ఉన్నవానికి భోజనం నచ్చినట్లు నాకు నీవు నచ్చావు. కాని దప్పిలేని వానికి నీరులాగా నీ మంత్రులు నాకు నచ్చలేదు. నేను మీ ప్రయోజనం సిద్ధింపజేశానని నాకు వారు ద్రోహం చేశారు. ఇంతకు మించిన కారణం కనపడదు. ఇందులో సందేహం లేదు. నేను వారికి ద్రోహం చేయలేదు. అయినా నాలో వారికి దోషం కనపడింది. శత్రువుకు భయపడిన దాని కంటె దుర్మార్గునికి ఎక్కువగా భయపడాలి. ఎలా అంటే తోక త్రొక్కిన త్రాచుపాముకు భయపడినట్లు.' అపుడు రాజు ఇలా అన్నాడు. 'విప్రోత్తమా ! నీకు నేను అధికంగా నష్టపరిహారం చెల్లిస్తాను. అలాగే సత్కరిస్తాను. నాచే పూజింపబడి నాయింట్లో ఉండు. నిన్ను ఇష్టపడని వారు

నాయింటిలో ఉండరు. తరువాత వారిని ఏం చెయ్యాలో నీకే తెలుసు. నేను దండాన్ని చక్కగా ధరించేటట్లు, పుణ్యకార్యం చేసేటట్లు నన్ను మేలయిన పనిలో నియోగించు.'

వెంటనే ముని ఇలా అన్నాడు. 'ఈ దోషం చూపించకుండా ఒక్కొక్కనినీ దుర్బలుని చెయ్యి. తరువాత కారణం తెలిసికొని ఒక్కొక్కనినీ క్రమంగా జయించు/ సంహరించు. ఒకే దోషం కల చాలామంది కూడి ముళ్లవంటి వారిని కూడా నలిపి వేస్తారు. రహస్యం బయట పడిందన్న భయంతో - అందువల్ల ఇలా చెపుతున్నాను. మేము బ్రాహ్మణులం. మృదువుగా దండిస్తాం. దయా పరులం. మాకువలెనే, నీకూ ఇతరులకూ శుభం కోరుతాం. రాజా ! నేను నీవాడను. నీకు చుట్టాన్ని. కాలకవృక్షీయుడని నాపేరు. అందుకే నీకిలా చెపుతున్నాను. నేను నీ తండ్రికి ప్రాణమిత్రుడను. ఇష్టుడను. సత్యవాదిని. నీ తండ్రి మరణించాక కోరికలన్నీ విడిచి తపస్సు చేసుకొంటున్నాను. నీ మీది స్నేహంతో నీకిటువంటి కష్టం రాకూడదని ఇలా చెపుతున్నాను. సుఖదుఃఖాలు రెంటినీ చూశావు. ప్రయత్నం లేకుండారాజ్యం పొందావు. మంత్రుల చేతిలో రాజ్యం పెట్టి ఎలా ప్రమాద పడుతున్నావు ? తరువాత రాజభవనంలోనూ, పురోహిత గృహంలోనూ బ్రాహ్మణశ్రేష్ఠుడు లభించడంతో నాందీ మంగళ వాద్యాలు మ్రోగాయి. భూమినంతటినీ కోసలరాజు ఒకే ఛత్రం క్రిందికి సాధించాడు. కాలకవృక్షీయముని శ్రేష్ఠమయిన యజ్ఞాలు చేయించాడు. హితకరమయిన అతని మాట విని కోసలరాజు భూమిని జయించాడు. ఆ ముని చెప్పినట్లు రాజు చేశాడు.

83. సభ్యుల లక్షణములు చెప్పుట.

యుధిష్ఠిరుడు అడిగాడు. పితామహా ! సభాసదులు, సహాయకులు, స్నేహితులు, సేనాధిపతులు, మంత్రులు ఎటువంటివారు ఉండాలి ?' భీష్ముడు చెపుతున్నాడు. 'లజ్జాశీలురు, జితేంద్రియులు, సత్యము త్రికరణశుద్ధి కలవారు. న్యాయాన్యాయాలు చక్కగా చెప్పగలవారు నీ సభాసదులు కావాలి. శాంతి, పరాక్రమాలు కల అమాత్యులు; సర్వవిద్యలూ నేర్చిన బ్రాహ్మణులు; సంతుష్టి కలిగి, కార్యసాధన పట్ల ఉత్సాహం కలవారు వీరిని ఆపదలన్నిటియందు సహాయులుగా గ్రహించాలి. సత్కులంలోవాడు, నిత్యపూజితుడు, శక్తిని దాచుకోనివాడు; రాజు ప్రసన్నుడయినా అప్రసన్నుడయినా, పీడింపబడినా, చనిపోతున్నా చాలా సార్లు అతని చుట్టూ తిరిగే వానినే మిత్రునిగా స్వీకరించాలి. సత్కులీనులు, దేశీయులు, పండితులు, రూపవంతులు, చాలా అనుభవం కలిగిన ప్రాజ్ఞులు, నీ పై అనురాగం కలవారు నీకు ప్రధానోద్యోగులు కావాలి. దుష్కులంలో పుట్టినవారు, లోభులు, క్రూరులు, సిగ్గువిడిచినవారు -

వీరు నీ చేతిలో తడి ఉన్నంతవరకే నిన్ను సేవిస్తారు. సత్కులంలో పుట్టినవారు, శీలసంపద కల్గి ఎదుటివారి భావాన్ని తెలిసినవారు, మెత్తని హృదయం కలవారు, దేశకాల పద్ధతులను తెలిసినవారు, రాజకార్యం, హితంకోరేవారు - వీరిని అన్ని పనులలోను నిత్యమూ మంత్రులుగా చేసుకోవాలి. నీకు ప్రియు లనిపించిన వారిని ధనం, గౌరవం, పూజ, సత్కారాలు, భోగాలు, ప్రియకార్యాలు చేసి, వారు నీ ధన భోగాలు అనుభవించేటట్లు చెయ్యాలి. ఆపదలలో కూడ విడవని విద్వాంసులు, సత్ప్రవర్తనతో వ్రతాచరణం చేసేవారు, నిత్యమూ నిన్ను యాచింపనివారు, నీచత్వం లేనివారు, సత్యం పలికేవారు, ద్రోహం చెయ్యని వారు - వీరిని మంత్రులుగా చెయ్యాలి. అనార్యులు, సమయ మెరుగని అల్పబుద్ధులు, మర్యాదలు విడిచినవారు - వీరిని నీవు దూరంగా ఉంచాలి. **గణాన్ని వదలి ఒకనిని గ్రహింపకూడదు. ఒక వేళ గణంకంటె ఒకడే అధికు డయితే గణాన్ని వదలి ఒక్కడినే గ్రహించాలి.** మంచివారి లక్షణం ఇది. అతనిలో పరాక్రమం ఉంటుంది. కీర్తి ముఖ్యం అనుకొంటాడు. చెప్పినమాట మీద నిలుస్తాడు. సమర్థులను పూజిస్తాడు. పోటీ పడరాని వారితో పోటీ పడడు. కోరికతో కాని, భయంతో కాని, క్రోధంతో కాని, లోభంతోకాని ధర్మం విడిచి పెట్టడు. అహంకారం లేనివాడు, సత్యవంతుడు. ఓర్పుకలిగి, మనసును అదుపులో పెట్టుకొంటాడు. ఆత్మాభిమానం కలవాడు.... ఈ లక్షణాలు కలవానిని అన్ని అవస్థలలోను పరీక్షించి నీ మంత్రాంగంలో సహాయుడుగా గ్రహించాలి. ధర్మజా ! సత్కులంలో పుట్టి, తనవారి అండదండలు కలిగి, కష్టాలను సహించుకోగల సమర్థుడు, అభిమాని, శూరుడు, కృతజ్ఞుడు, సత్యవంతుడు, ఇలా ఉండటం మంచివాని లక్షణం. ఇలా ప్రవర్తించే వానిని గురించి తెలిసిన మధ్యస్థులు కూడ సంతోషిస్తారు. అలాగే మిత్రులూ అవుతారు. ఆపైని రాజు తన ఉన్నతిని కోరి, ఇంద్రియనిగ్రహంతో పరిణతప్రజ్ఞ కలిగి, అమాత్యుల గుణదోషాలను పరీక్షించాలి. చుట్టరికం కల ఆప్తులు, సద్వంశంలో, తనదేశంలో పుట్టినవారు, అమ్ముడు పోనివారు, హద్దు మీరి ప్రవర్తింపనివారు, బాగా పరీక్షింపబడినవారు, ఉత్తములకు జన్మించినవారు, వేదవిధు లెరిగినవారు, తాత తండ్రుల వరుసలో సేవించేవారు, అహంకార రహితులు - ఇటువంటి వారిని ఆత్మోన్నతి కోరే పురుషుడు మంత్రులుగా చేసుకోవాలి. వారికి వినయబుద్ధి, శుభస్వభావం, తేజస్సు, ధైర్యం, సహనం, శుచిత్వం, అనురాగం, స్థిరత, ధైర్యం అనేవి ఉండాలి. నిత్యమూ గుణాలను పరీక్షించి, ప్రౌఢభావాలు కలిగి, భారం మోయగలవారిని, ప్రయోజనం సాధించగల ఉపధాశుద్ధులను అయిదుగురిని మంత్రులుగా చేసుకోవాలి. నిండుగా మాట్లాడే వారిని, వీరులను, నిర్ణయించగల్గ పండితులను,

కులీనులను, సత్త్వగుణ ప్రధానులను, ఎదుటివారి ఇంగితాన్ని గుర్తింపగలవారిని, మృదుస్వభావులను, దేశకాల విధానాలు తెలిసిన వారిని, రాజకార్యాలను, హితాన్నీ కోరేవారిని, మంత్రులుగా అన్నిపనులలోను (శాఖలలోను) రాజు చేసుకోవాలి. తేజోరహితుల సంపర్కం కల వ్యక్తి ఎన్నడూ కార్యనిర్ణయం చేయలేడు. అన్నిటా అతనికి సంశయం కలుగుతూనే ఉంటుంది.

సద్వంశంలో పుట్టినా, ధర్మార్థకామ సహితుడైనా, స్వల్ప విద్యకల మంత్రి, మంత్రాన్ని (రహస్యాలోచనను) పరీక్షింపలేడు. అలాగే బహుశాస్త్ర పండితు డయినా సద్వంశంలో పుట్టకపోతే నడిపే వాడులేని గ్రుడ్డివాని వలె చిన్నచిన్న పనులలోనే పడిపోతాడు / మోహపడతాడు. బుద్ధి, శాస్త్రజ్ఞానమూ, ఉపాయమూ కలవాడయినా స్థిరమయిన సంకల్పాలు లేనివాడు ఎంతకాలానికీ పని పూర్తి చేయజాలడు. విద్యారహితుడైన దుర్మార్గుడు ఎన్నిసార్లు ఆరంభించినా ఫలం చక్కగా పొందలేడు. మంత్రికి రాజు మీద అనురాగం లేకపోతే రాజుకు నమ్మకం కలగదు. అందుచేత అనురాగం లేనివానికి రహస్యం చెప్పకూడదు. గాలివల్ల తొర్రలలోకి ప్రవేశించిన అగ్ని చెట్టును కాల్చివేస్తుంది. అలాగే మంత్రులతో కూడిన వక్రబుద్ధి రాజును వ్యథపెడతాడు. కోపించిన రాజు ఒక్కొక్కప్పుడు ఎవరినయినా పదవినుండి లాగివేస్తాడు. మాటలతో తీసిపారవేస్తాడు. కాని మళ్లీ వెంటనే ప్రసన్నుడవుతాడు. అటువంటి వాటి నన్నిటినీ సేవకుడు అనురాగం ఉంటేనే సహించగలడు. ఎందుచేతనంటే మంత్రులకోపం పిడుగు పడినట్లు ఉంటుంది. రాజుకు ప్రీతికలిగించాలనే భావంతో వాటిని సేవకుడు సహించాలి. రాజు యొక్క సుఖదుఃఖాలు తనవే అనుకొనే సేవకునితో రాజు సంప్రదించాలి. రాజుమీద అనురాగం ఉన్నా, ఇతరసద్గుణాలు ఎన్నిఉన్నా, జ్ఞాన యుక్తు డయినా ఋజువైన ప్రవర్తన లేకపోతే అట్టివాడు రాజు యొక్క రహస్యం (మంత్రం) వినదగడు. శత్రువులతో చేతులు కలిపి పురజనులను గౌరవించనివాడు శత్రువనియే భావించాలి. వాడు మంత్రం (రాజరహస్యం) వినదగడు. పండితుడు కానివాడు, మనశ్శుద్ధిలేని వాడు, జడుడు, శత్రువులను సేవించేవాడు, ఆత్మస్తుతి చేసుకొనేవాడు, స్నేహితుడు కానివాడు, కోపం కలవాడు, లోభి – వీరెవరూ మంత్రాన్ని వినదగరు. అనురాగం కలిగిఉన్నా, బహుశ్రుతుడయినా, సత్కారాలు పొందినా, ప్రత్యేకతలు కలిగినా కొత్తగా వచ్చినవాడు మంత్రాన్ని వినదగడు. అన్యాయం చేసినందువల్ల ఒకని తండ్రి అపకారం పొందాడు. అయినా రాజు మళ్లీ వానిని ఒక పదవిలో నిలిపాడు. అటువంటి వాని కొడుకు మంత్రాన్ని వినదగడు. చిన్న అపరాధం వల్ల రాజుచేత ఒకడు ధనమంతా కోల్పోయాడు. మళ్లీ మంచి గుణాలతో ఉంటున్నాడు. వాడు మంత్రం వినదగడు.

చక్కనిప్రజ్ఞకల తెలివైనవాడు. పండితుడు. తన జనపదంలో ఉన్న శుద్ధుడు. పైగా అతడు అన్నిపనులలోను నిష్కల్మషుడు. అతడు మంత్రం వినదగినవాడు. జ్ఞాన విజ్ఞానాలు కలవాడు, తనయొక్క పరుల యొక్క స్వభావాలు తెలిసిన వాడు, రాజుకు ఆత్మసమానుడయిన స్నేహితుడు మంత్రం వినదగినవాడు. సత్యవాక్కు, శీల సంపదకలవాడు, లోతైన హృదయం కలవాడు, సిగ్గు, మార్దవం కలవాడు, తండ్రితాతల నుండి రాజును సేవించేవాడు మంత్రం వినదగును. సంతుష్టుడు, ఇష్టుడు, సత్యం, చురుకుదనం కలవాడు, పాపాలను ద్వేషించేవాడు, మంత్రవేత్త, కాలవేత్త, శూరుడు- ఈ లక్షణాలు కలవాడు మంత్రం వినదగును. చాలా కాలం దండధారణం చెయ్యాలనుకొన్నవాడు, లోకమంతటినీ తన మృదుశక్తితో వశంచేసుకొనే వానికోసం మంత్రాన్ని ప్రయోగింపజెయ్యాలి. ధార్మికులయిన పురజనులు, గ్రామప్రజలు విశ్వసించే యుద్ధనిపుణుడు, నీతికోవిదుడు మంత్రం వినదగినవాడు. ఈ గుణాలతో కూడిన పూజితులను, సర్వప్రకృతులను తెలిసినవారిని, మహత్వాన్ని పొందగోరేవారిని ముగ్గురికి తగ్గకుండా మంత్రులుగా నియమించుకోవాలి. తమ ప్రధానోద్యోగులలోను, శత్రువుల ప్రధానోద్యోగులలోను దోషాలను వారు పసిగట్టుతూ ఉండాలి. మంత్రుల మంత్రమే మూలం రాజు రాజ్యానికి. ఆ రాష్ట్రం ఎప్పుడూ వర్ధిల్లుతుంది. తన దోషం ఇతరులు చూడరాదు. శత్రువులను దోషాలలో ఇరికించాలి. తాబేలువలె అవయవాలను లోపలికి లాక్కోవాలి. తనలోపాలను ఇతరులకు తెలియకుండా కాపాడాలి. తెలివైన మంత్రులు రాజ్యం యొక్క మంత్రాన్ని రహస్యంగా ఉంచాలి. రాజుకు మంత్రమే రక్షణ కవచం. మిగిలిన ప్రజలంతా మంత్రానికి అంగాలు.

రాజ్యానికి గూఢచారులే ఆధారం. వారు మంత్రసారం అని చెపుతారు. రాజులు, మంత్రులు ఒకరినొకరు అనుసరించి, ప్రవర్తిస్తే జీవితం సుఖంగా గడుస్తుంది. మదం, క్రోధం, అహంకారం, ఈర్ష్య వీటిని జయించి సుఖపడాలి. అయిదు ఛలాలకూ అతీతులై రాజులు మంత్రులతో ఆలోచించాలి. ఆ ముగ్గురి మంత్రుల ఆలోచనలను రాజు వేర్వేరుగా తెలుసుకోవాలి. తన మనసును కూడ జోడించి, తన నిశ్చయాన్ని నిర్ణయజ్ఞానం కల గురువుకు నివేదించాలి. ధర్మార్థ కామాలు తెలిసిన ఆ గురువు నలువురి అభిప్రాయాలను పరీక్షించి, విమర్శించి, ఏకాభిప్రాయం సాధించే సిద్ధాంతం చేస్తాడు. తరువాత రాజు ఆ మంత్రాన్ని కార్యరూపంలో పెట్టాలి. మంత్ర తత్వార్థం తెలిసిన వారు సదా ఇలా ఆలోచించాలని చెపుతారు. ప్రజలను ఆకట్టుకొనటంలో సమర్థమయినది మంత్రమే. ఆ మంత్రాన్ని ఇలా రచించుకోవాలి, నిర్వహించాలి. మంత్రాలోచన చేసే చోట మరుగుజ్జులు,

గూనివారు, బక్కచిక్కిన వారు, కుంటి, గ్రుడ్డివారు, జడులు, స్త్రీలు, నపుంసకులు, పశుపక్ష్యాదులు ముందు గాని, వెనుక గాని, పైని గాని, క్రింద కాని ఏవిధంగానూ సంచరించరాదు. ఒక ఎత్తయిన భవనం ఎక్కి గాని, దర్భపాదలు, రెల్లుపాదలు లేని శూన్యప్రదేశంలో కాని దూరంగా మాత్రమే కనపడేచోట మంత్రాలోచన చెయ్యాలి. ఆ ఆలోచనలో దోషాలు ఉండకూడదు. వాగ్దోషాలు, అవయవాల కదలికలలో దోషాలు ఉండకూడదు. తగినంత సమయంలో పూర్తి చెయ్యాలి.'

84. శక్ర బృహస్పతి సంవాదము.

భీష్ముడు ఇలా చెపుతున్నాడు. 'ధర్మరాజా ! ఈ విషయంలో ఇంద్రునికి, బృహస్పతికి జరిగిన సంవాదమనే పురాతనమైన ఇతిహాసం ఉదాహరిస్తారు.' ఇంద్రుడు అడిగాడు. 'విప్రోత్తమా ! పురుషుడు ఏ ఒకటి ఆచరించి సర్వభూతాలకూ ప్రమాణమవుతాడు ? గొప్పకీర్తిని కూడ పొందుతాడు ?' అపుడు బృహస్పతి ఇలా చెప్పాడు. 'దేవేంద్రా ! సాంత్వమనేది ఒక్కటే కర్తవ్యం. దాన్ని చక్కగా ఆచరించిన వాడు సర్వభూతాలకూ ప్రమాణమవుతాడు. గొప్పకీర్తినీ పొందుతాడు. ఈ సాంత్వమనే ఒక్కపదమే సర్వలోకానికీ సుఖకర మయినది. దీన్ని ఆచరించి సదా సర్వభూతాలకూ ప్రియుడవుతాడు. ఎప్పుడూ ముఖం చిట్లించుకొని, ప్రియంగా మాట్లాడకుండా ఉండేవాడు అందరికీ ద్వేషింపదగినవాడవుతాడు. అన్నీ పరిశీలించి, తానే ముందుగా చిరునవ్వుతో పలుకరించే వానిని లోకమంతా ప్రసన్నంగా చూస్తుంది. మంచిమాటలు లేని దానం కూరలు లేని భోజనంలా ప్రాణులెవరికీ తృప్తి కలిగించదు. తియ్యగా మాట్లాడుతూ ప్రజల ధనమంతా అపహరించినా ఆ సాంత్వంతో సర్వలోకాన్ని వశపరచుకొనవచ్చు. దండంతో పాలించాలనుకొనేవాడు ప్రియంగా మాట్లాడాలి. అదే ఫలిత మిస్తుంది. సాంత్వానికి ఎవరూ ఉద్వేగం పొందరు. చక్కగా, ప్రియంగా, తియ్యగా, తగినట్లు సేవింపబడే సాంత్వానికి సమానమైనది ఏదీ కనపడదు.' భీష్ముడన్నాడు. 'ఇలా బృహస్పతి చెప్పాడు. ఇంద్రుడు సర్వమూ అలాగే ఆచరించాడు. ధర్మరాజా ! నీవు కూడా అలాగే చక్కగా ఆచరించు.'

85. అమాత్య విభాగము.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'రాజు ప్రజలను ఎటువంటి ధర్మవిశేషంతో పరిపాలిస్తూ ప్రీతినీ, శాశ్వతకీర్తినీ పొందుతాడు ?' భీష్ముడు చెపుతున్నాడు. 'ప్రజాపాలన తత్పరుడయిన రాజు శుద్ధమైన వ్యవహారంతో ధర్మాన్నీ, కీర్తినీ పొంది ఇహ పర లోకాలు రెంటినీ

సాధిస్తాడు.' అపుడు యుధిష్ఠిరుడు మళ్లీ అడిగాడు. 'మహాప్రాజ్ఞా ! ఎటువంటి వ్యవహారాలతో రాజు ఎవరితో వ్యవహరించాలి ? ఇంతకుముందు పురుషుని గూర్చి చెప్పిన గుణాలు అన్నీ ఏ ఒక్కపురుషునిలోనూ ఉండవని నా అభిప్రాయం.' భీష్ముడు చెపుతున్నాడు. 'బుద్ధిమంతుడా ! నిజమే. అది అంతే. ఈ శుభగుణాలన్నీ కూడిన పురుషుడు ఒక్కడయినా దుర్లభుడే. శీలం అంతటినీ ఒకచోట సంక్షేపించడం ఎంత ప్రయత్నించినా దుర్లభమే. ఎటువంటి అమాత్యులను నియమించుకోవాలో చెపుతాను. విద్యావంతులు, ప్రజ్ఞావంతులు, వేద విద్యను పూర్తి చేసిన శుద్ధమనస్కులు అయిన నలుగురు బ్రాహ్మణులను; బలవంతులై, ఆయుధ విద్యలలో ఆరితేరిన ఎనమండుగురు క్షత్రియులను; ధనవంతులయిన ఇరవై ఒక్క వైశ్యులను; వినయం, పవిత్రత, శ్రద్ధ కల ముగ్గురు శూద్రులను, మంత్రులుగా నియమించుకోవాలి. శుశ్రూష, శ్రవణం, గ్రహణం, ధారణం, ఊహ, అపోహ; విజ్ఞానం, తత్త్వజ్ఞానం అనే ఎనిమిది గుణాలు కల సూతుని పౌరాణికునిగా నియమించుకోవాలి. అతని లక్షణాలు ఇలా ఉండాలి. ఏబది ఏళ్ల వయసు ఉండాలి. చురుకుదనం, అసూయ లేకపోవడం; వేదాలు, ధర్మశాస్త్రాలు చదివి గుర్తులో ఉన్నవాడు; వినయం, సమదృష్టికలవాడు; వివాదాలను పరిష్కరింపగలవాడు; సప్తవ్యసనాలు లేనివాడు అయిఉండాలి పౌరాణికుడు. రాజు మంత్రాలోచనను ఎనమండుగురు మంత్రుల మధ్య మాత్రమే ఉంచాలి.* తరువాత రాష్ట్రంలోని రాష్ట్రసంబంధి ఉద్యోగికి ఆ వ్యవహారం చూపాలి. రాజు ఇటువంటి వ్యవహారంతో సదా ప్రజలను చూస్తూ ఉండాలి. (నీవు) రాజు ఎవరినుండి రహస్యంగా ద్రవ్యం గ్రహించకూడదు. అది నీకార్యాన్ని నశింపజేస్తుంది. కార్యం నశించాక ఆ అధర్మం నిన్నూ, వారినీ కూడా బాధిస్తుంది. డేగ వలన పక్షుల గుంపులు దూరంగా పారిపోయినట్లు రాష్ట్రం నుండి ప్రజలు పారిపోతారు. పగిలిపోయిన నావలోంచి దూకినట్లు ప్రజలు పారిపోతారు. అధర్మంతో ప్రజలను పరిపాలించే రాజుకు గుండె భయం పట్టుకొంటుంది. వానితో స్వర్గం కూడ విరోధిస్తుంది. ధర్మాసనం మీద నిలబెట్టిన రాజుకాని, మంత్రికాని, రాకుమారుడు కాని అధర్మంతో పాలించితే, రాజు నను సరించే అధికారులు సరిగా కార్యనిర్వహణం చేయకపోతే వారంతా రాజును ముందుంచుకొని అధోగతికి పోతారు. బలవంతులు బలాత్కరించినపుడు దీనంగా విలపించే అనాథులకు రాజే కదా రక్షకు డవుతాడు.

★ *విశేషం॥ సప్తవ్యసనాలు 1. వేట 2. జూదం 3. స్త్రీ 4. మద్యపానం (ఈ నాలుగూ కామసంబంధములు) 5. క్రూరమైన దండనం. 6. పరుషమైన మాట. 7. సొమ్మును వ్యర్థపరచటం. (ఈ మూడూ క్రోధంతో వచ్చినవి).*

ఎనమండుగురు : బ్రాహ్మణులు (4) నలుగురు; శూద్రులు (3) ముగ్గురు; సూతుడు (1) ఒకడు – మొత్తం ఎనమండుగురు.

అందువల్ల వాది ప్రతివాదులు పరస్పరం విరుద్ధంగా వాదిస్తూ ఉన్నప్పుడు సాక్షి (చెప్పినది) బలం సరియైన దవుతుంది. ఒక వేళ సాక్షి కూడ లేని దయితే, దిక్కులేని దయితే దాన్ని చాలా జాగ్రత్తతో విశేషంగా పరీక్షించాలి.

అపరాధానికి తగిన శిక్ష పాపులకు విధించాలి. ధనవంతు లయితే ధనం లాక్కోవాలి. ధనహీనులను బంధించాలి. దుష్ప్రవర్తన కలవారిని కొరడా దెబ్బలు కొట్టాలి. మంచి వారిని మంచిమాటలు చెప్పి సామ్ము ఇప్పించాలి. రాజును వధించాలనుకొన్న వానికి, ఇళ్లకు నిప్పుపెట్టేవానికి, దొంగకు, స్త్రీలను చెరచి వర్ణసంకరం చేసేవానికి చిత్రవధయే శిక్ష. శాస్త్రానుసారంగా సరిఅయిన దండం విధించే రాజుకు అధర్మం అంటదు. శాశ్వతంగా ధర్మమే నిలుస్తుంది. తన ఇష్టం వచ్చినట్లు విచక్షణ లేకుండా దండం విధించే రాజు ఈ లోకంలో అపకీర్తి పాలవుతాడు. మరణించాక నరకం పాలవుతాడు. ఒకని తప్పుకు మరొకరిని దండింపరాదు. శాస్త్రాన్ని పరిశీలించి బంధించవచ్చు. విడిచి పెట్టవచ్చు. ఎంత ఆపదలో నయినా రాజు దూతను చంపరాదు. దూతను చంపిన రాజు మంత్రులతో సహా నరకం పాలవుతాడు. తనరాజు చెప్పమన్నట్లు చెప్పే దూతను రాజధర్మాసక్తి కల రాజు చంపితే అతని తండ్రి తాతలు భ్రూణహత్యా పాపం పొందుతారు. సత్కులం, శీల సంపద, చక్కగా మాట్లాడటం, సమర్థత, ప్రియంగా మాట్లాడటం, చెప్పినదే మాట్లాడటం, జ్ఞాపకశక్తి - ఈ ఏడూ దూతలక్షణాలు. ప్రతీహారి, శిరోరక్షకుడు కూడ ఇటువంటి గుణాలే కలిగి ఉండాలి. ధర్మశాస్త్రార్థాల తత్త్వం తెలిసినవాడు, సంధి విగ్రహాలు నడపగలవాడు, బుద్ధి, ధైర్యం, సిగ్గు కలవాడు, రహస్యం దాచగలవాడు, కులీనుడు, బలిష్ఠుడు, పరిశుద్ధుడు అయిన అమాత్యుడు ప్రశంసింపబడతాడు. ఇవే గుణాలు కలవాడు సేనాపతి కావాలి. వ్యూహాలు, యంత్రాలు, ఆయుధాలు వీని తత్త్వం తెలిసినవాడు, పరాక్రమశాలి, వాన - చలి - ఎండ - గాలి వీటిని తట్టుకోగలవాడు, శత్రువుల దోషాలను తెలిసినవాడు సేనాపతి కావాలి. రాజు ఇతరులకు నమ్మకం కలిగేటట్లు ప్రవర్తించాలి. తాను ఎవరినీ నమ్మరాదు. కన్నకొడుకుల మీద కూడ నమ్మకం ప్రశంసనీయం కాదు. నీకు శాస్త్రార్థతత్త్వం చెప్పాను. రాజులకు అవిశ్వాసమే పరమ మంత్రం అని చెప్పబడింది."

86. దుర్గ పరీక్ష.

యుధిష్ఠిరుడు అడిగాడు. పితామహా ! రాజు నివసించటానికి పురం ఎటువంటిది ఉండాలి ? ముందే నిర్మింపబడినదా ? లేక తాను నిర్మించు కొన్నదా ? నాకు చెప్పు.' భీష్ముడు చెపుతున్నాడు. 'పుత్రులతో, జ్ఞాతులతో, బంధువులతో రాజు నివసించవలసిన

చోట వృత్తిని గురించి, రక్షణను గురించి అడగడం న్యాయ్యమే. నీకు దుర్గ నిర్మాణం గురించి విశేషంగా చెపుతాను. విని, ప్రయత్నంతో దాన్ని ఏర్పరుచుకొని, ఆచరించు. దుర్గం ఆరు విధాలుగా ఏర్పరచుకోవాలి. వానికి నగరాలు ఏర్పరచుకోవాలి. సంపదలకు మూలంగా, అన్నీ సమృద్ధిగా ఉండేటట్లు దుర్గం ఉండాలి. ధన్వదుర్గం, మహీదుర్గం, గిరిదుర్గం, మనుష్యదుర్గం, జలదుర్గం, వనదుర్గం అని దుర్గాలు ఆరు విధాలు. ధన్వదుర్గం అంటే భూదుర్గం. దాని చుట్టూ నీరులేని ప్రదేశం ఉంటుంది. అదే మరుదుర్గం అనికూడా అంటారు. పురం భూదుర్గంతో చుట్టి ఉండాలి. ధాన్య సంపన్నమయి, ఆయుధాలతో కూడి, చక్కని దృఢమైన ప్రాకారం, అగడ్త కలిగి ఏనుగులు, గుర్రాలు, రథాలతో నిండిఉంటుంది. విద్వాంసులు, శిల్పులు, ధనాగారాలతో ఉంటుంది. ధార్మికులయిన ప్రజలు, సమర్థులయిన ఉత్తమ జనులతో కూడి ఉండాలి. శక్తి కల నరులు, ఏనుగులు, గుర్రాలు, కలిగి నాలుగు రోడ్ల కూడళ్లు, వర్తక శాలలు, న్యాయస్థానాలు, కలిగి ప్రశాంతంగా నిర్భయంగా తిరిగేటట్లు ఉండాలి. చక్కని కాంతులతో, మంగళ ధ్వనులతో, ప్రశస్త భవనాలు కలిగి ఉండాలి. శూరులతో, వేద ఘోషలతో నిండి ఉండాలి. సమాజం ఉత్సవాలతో, దేవ పూజలతో ఉండాలి. అటువంటి నగరంలో రాజు తనకు వశులయిన అమాత్యులతో, సేనలతో కలిసి ప్రవేశించాలి. నగరంలో కోశం, బలం, స్నేహితులు, వ్యవహారాలు పెంపొందించాలి. నగరంలోను, చుట్టూరా జనపదాల్లోను దోషా లన్నీ తొలగించాలి.

ధనాగారం, ఆయుధశాలలు వీనిని ప్రయత్నంతో వృద్ధి పొందించాలి. ధాన్యపు నిల్వలు, యంత్రాలు, ఆయుధాల శాలలను వృద్ధిపొందించాలి. కట్టెలు, లోహాలు, ఊక, బొగ్గులు, చెక్కలు, కొమ్ములు, ఎముకలు, వెదురు వస్తువులు, కొవ్వు, నూనె, వస, తేనె, జనపనార, ధూపద్రవ్యాలు, ధాన్యం, ఆయుధాలు, బాణాలు, చర్మాలు, నరాలు, బెత్తం, ముంజగడ్డి, తుంగ, భేరీ మొదలయిన వాద్యాలు - వీటిని రాజు నిల్వ ఉంచాలి. పెద్ద నీటి తొట్టెలు, చలివేంద్రాలు, నిండిన చెరువులు, ఉండాలి. రాజు పాడి పశువులను, చెట్లను రక్షిస్తూ ఉండాలి. ఆచార్యులు, ఋత్విక్కులు, పురోహితులు, ధనుర్విద్యావిశారదులు, శిల్పులు, జ్యోతిషికులు, వైద్యులు - వీరిని రాజు శ్రద్ధతో సత్కరించాలి. ప్రాజ్ఞులు, మేధావులు, ఇంద్రియనిగ్రహం కలవారు, సమర్థులు, శూరులు, పండితులు, కులీనులు, బలసంపన్నులు, అన్నిపనులు నిర్వహింపగలవారు వీరిని సత్కరించాలి. రాజు ధార్మికులను పూజించాలి. అధార్మికులను దండించాలి. సర్వవర్ణాల వారిని వారివారి పనులలో నియోగించాలి. గూఢచారుల ద్వారా నగరాల్లోనూ, జనపదాల్లోను బాహ్య ఆంతరంగిక సమాచారాలను

సేకరించి బాగున్నాయని తెలిసికొని అపుడు పనులు ప్రయోగించాలి. మంత్రం, కోశం, దండం వీటి విషయంలో రాజే స్వయంగా గూఢచారులతో సమాలోచన చెయ్యాలి. రాజ్యం అంతా అందులోనే ఉంది. రాజులకు గూఢచారులే కళ్లు. నగరంలో, గ్రామాల్లో ఉదాసీనులు, శత్రువులు, మిత్రులు ఏమి చేయదలచుకొన్నారో అంతా చారుల ద్వారా తెలుసుకోవాలి.

భక్తులను పూజిస్తూ, ద్వేషించే వారిని శిక్షిస్తూ ప్రమాదపడకుండా ప్రతిక్రియ చేస్తూ ఉండాలి. నిత్యమూ యజ్ఞాలు చెయ్యాలి. ప్రజలను పీడించకుండా దానం చెయ్యాలి. ప్రజారక్షణమే రాజు కర్తవ్యం. ధర్మ బాధకమైన పని ఏదీ చేయరాదు. దీనులు, అనాథులు, వృద్ధులు, విధవస్త్రీలు - వీరి యోగక్షేమాలు, బ్రతుకుతెరువు నిత్యమూ కల్పించాలి. ఆశ్రమాల్లో కాలానుగుణంగా వస్త్రాలు, పాత్రలు, భోజనాలు - వీనిని సత్కారం చేసి, అర్చించి, గౌరవించి రాజు సదా చేకూరుస్తూ ఉండాలి. తపస్వులకు తన్నుగూర్చి, రాష్ట్రం గురించి అన్ని పనులూ శ్రద్ధతో నివేదించాలి. వారి ముందు ఎల్లప్పుడూ వినయంతో నిలవాలి. సద్వంశంలో పుట్టి, సర్వవిద్యలూ నేర్చి, సర్వమూ త్యాగం చేసిన వానిని చూసి రాజు శయనం, ఆసనం, భోజనాలతో పూజించాలి. ఏదయినా ఆపదలో ఉన్నపుడు రాజు అటువంటి వానిమీద నమ్మకం ఉంచాలి. తాపసుల మీద దొంగలు కూడా నమ్మకం ఉంచుతారు. తపస్వికి నిధు లివ్వవచ్చు. వారి ప్రజ్ఞను పూర్తిగా గ్రహించవచ్చు. కాని ఎల్లపుడూ సేవింపరాదు. ఎక్కువగా పూజింపరాదు. తన రాష్ట్రాలలో ఒకనిని, పర రాష్ట్రంలో మరొకనిని, అడవులలో ఇంకొకనిని, సామంత రాజుల నగరాల్లో వేరొకనిని తపస్వులను ఏర్పాటు చేసుకోవాలి. పరరాష్ట్రాలలోను, అడవులలోను ఉన్నవారికి చేసినట్లే రాష్ట్రంలోని వారికి సత్కారాలతో, గౌరవాలతో తగిన అగ్రహారాదులు కల్పించాలి. సంశితవ్రతులయిన తాపసులు ఏ అవస్థలో అయినా శరణార్థి అయిన రాజుకు తగినట్లు శరణ మివ్వాలి. ఎటువంటి నగరంలో రాజు నివసించాలో దాన్ని గురించి లక్షణ పూర్వకంగా సంక్షేపంగా నీకు చెప్పబడింది.'

87. రాష్ట్ర రక్షణ సంగ్రహములు.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'భరతోత్తమా ! రాష్ట్ర రక్షణం, రాష్ట్ర సంపాదనం అనే వాటిని గురించి తెలుసుకోవా లనుకొంటున్నాను. నాకు చెప్పండి.' భీష్ముడు చెపుతున్నాడు. 'రాష్ట్ర రక్షణం, రాష్ట్ర సంగ్రహమూ అంతా చెపుతాను. ఏకాగ్రతతో విను. ముందు గ్రామానికి ఒకనిని అధిపతిగా చెయ్యాలి. తరువాత పది ఊళ్లకు ఒకనిని, ఇరవై ఊళ్లకు

ఒకనిని, నూరు ఊళ్లకు ఒకనిని, వేయి ఊళ్లకు ఒకనిని అధిపతిగా చెయ్యాలి. గ్రామంలో వారిని, గ్రామ దోషాలను గ్రామపాలుడు (గ్రామికుడు) తెలుసుకొంటూఉండాలి. వాటినతడు దశపాలునకు, అతడు వింశతిపాలునకు చెప్పాలి. అతడు జానపదుల వ్యవహారాలను శతపాలునకు చెప్పాలి. గ్రామాలకు సంబంధించిన కప్పాలను గ్రామికుడు గ్రహించాలి. దానితో అతడు దశపాలుని భరించాలి. అతడు వింశతి పాలుని భరించాలి. చక్కగా జనసందోహంతో నిండిన పెద్ద గ్రామాన్నుండి గ్రామ శతాధ్యక్షుడు కప్పం గ్రహిస్తాడు. అలా గ్రామాలన్నిటి నిర్వహణం క్రమంగా రాజుకు అధీనంలో ఉంటుంది. ఉత్తముడైన, సహస్రపాలుడు రాష్ట్రియునితో కలిసి, ధన, బల, ధాన్యభోగాలు అనుభవిస్తూ శాఖానగర పాలకుడవుతాడు. వారికి గ్రామ కృత్యం, యుద్ధ కృత్యం రెండూ కర్తవ్యాలే. ధర్మజ్ఞుడైన మంత్రి ఒకడు ఆయాపనులను బద్దకించకుండా పర్యవేక్షిస్తూ ఉంటాడు. ప్రతీ నగరంలోనూ ఇలా సర్వప్రయోజనాలు చూసుకొనే వాడు ఒకడు ఉంటాడు. అతడు ఉన్నత స్థానంలో నక్షత్రాలకు గ్రహంవలె భయంకరంగా ఉండాలి. అతడు సభాసదులందరినీ కూడా చుట్టబెట్టేవాడు కావాలి. అతడు రాష్ట్రాలలో వారివారి వృత్తిని చక్కదిద్దుతూ ఉండాలి. రక్షణకోసం రాజుగారు నియమించిన అధికారుల మని చెప్పుకొంటూ హత్యలు, పాపకృత్యాలు చేద్దామనుకొనేవారు, సామ్మ దొంగిలించే దుర్మార్గులు ఉంటారు. వారి నుండి వీరు ప్రజలను రక్షించాలి.

అమ్మకం, కొనడం, దారిఖర్చులు, లాభాలు, ఉద్యోగుల జీతాలు, ఉద్యోగుల యోగక్షేమాల కయిన ఖర్చులు పరిశీలించి వ్యాపారులపై పన్నులు వెయ్యాలి. ఉత్పత్తిని, దానవృత్తిని, శిల్పాన్ని చాలాసార్లు సమీక్షించి, శిల్పుల శిల్పంమీద పన్నులు విధించాలి. మహారాజు పన్నులను కొద్ది హెచ్చు తగ్గులతో (స్థితిగతులను బట్టి) స్వీకరించాలి. పనివారు దివాలా తీయకుండా ఉండేటట్లు చూసి పన్నులు తీసుకోవాలి. ఫలితాన్ని, పనితనాన్ని దృష్టిలో పెట్టుకొని పన్నులు విధించడం కాని వసూలుచేయడం కాని చెయ్యాలి. ఫలమూ, కర్మ రెండూ నిష్ప్రయోజనాలయితే ఆ పనులు ఎవరూ చెయ్యరు. అందుచేత రాజూ, కర్తా ఇద్దరూ ఆ పనిలో భాగస్వాములే అని పరిశీలించి రాజు పన్నుల నిర్ణయం చెయ్యాలి. రాజు చక్కగా పరిశీలించి తన మూలాన్ని కాని, ఇతరుల (పన్నుకట్టేవారి) మూలాన్ని కాని అత్యాశతో నాశనం చేసుకోకూడదు. ఎక్కువగా పన్నులు తినేసే రాజుగా ప్రసిద్ధికెక్కితే ప్రజలు రాజును ద్వేషిస్తారు. ద్వేషింపబడిన వానికి శ్రేయస్సు కలుగదు. రాజుకు ఫలం కలుగదు. ఉత్తమమయిన బుద్ధితో ఆవు-దూడ సామెతగా పాలు పిండుకోవాలి. దూడకు

పాలు వదిలితేనే అది పెరిగి బలం పొంది కష్టం సహిస్తుంది. పాలు మొత్తం పిండివేస్తే ఆ దూడ ఏ పనీ చేయలేదు. అలాగే రాష్ట్రాన్ని కూడ మొత్తం పిండివేస్తే మహత్కార్యమేదీ చేయలేడు. (రాజు చేయలేడు). రాజు తన్ను తాను రక్షించుకొంటూ రాష్ట్రాన్ని అనుగ్రహిస్తే, ఆ కలిగిన దానితో జీవిస్తూ మంచి ఫలితాన్ని పొందుతాడు. ఆపద తీర్చుతూ ఇచ్చిన ధనం తన రాష్ట్రంలోనే మళ్లీ వృద్ధి చెందుతుంది. అపుడు రాష్ట్రమే కోశాగారం (అవుతుంది). అలా కోశాగారం ఇంటిలో ఉన్నట్లే పౌరులను, జానపదులను, ఆశ్రితులను, ఉపాశ్రితులను, స్వల్పభాగ్య వంతులను కూడ యథాశక్తిగా రాజు దయతో చూడాలి.

అడవి దొంగల గుంపులలో భేదం పెట్టాలి. అపుడు మధ్యలోని వాడు సుఖం అనుభవించాలి. ఇలా దుఃఖితులైన వారు సుఖం పొంది, రాజుపై కోపం ప్రకటించరు. ముందుగానే ధన సంగ్రహణం గురించి ప్రకటించాలి. తరువాత రాష్ట్రంలో అక్కడక్కడ భయం ప్రదర్శించాలి. ఇప్పుడొక ఆపద వచ్చింది. శత్రు సైన్యం వల్ల పెద్ద భయం ఏర్పడింది. వెదురుకు వెన్ను పుట్టినట్లు ఆది వారి వినాశానికే దారితీస్తుంది చివరకు. నా శత్రువులు దోపిడి దొంగలతో కలిసి మన రాష్ట్రాన్ని బాధించా లనుకొంటున్నారు. ఇది చివరకు వారి వధకే దారితీస్తుంది. కాని ఈ భయంకరమైన ఆపద నుండి మిమ్మల్ని రక్షించాలంటే ధనం కావాలి. అందుకు మీ నుండి ధనం కోరుతున్నాను. ఈ భయం నుండి గట్టెక్కిన తరువాత మీ సొమ్ము మీకు ఇస్తాను. శత్రువులు మీ సొమ్ము బలాత్కరించి, తీసుకుపోతే తిరిగి రాదు. భార్యతో మొదలుపెట్టి అంతా లాక్కుపోతారు. భార్యా పుత్రుల రక్షణ కోసమయినా డబ్బు సమకూర్చుకోవాలి గదా ! పుత్రుడు పుడితే తండ్రికి సంతోషం కలిగి నట్లు మీ వల్ల నేనూ సంతోషిస్తాను. మనరాష్ట్రంలో దొంగల పీడ తగ్గడంకోసం యథాశక్తిగా మీ నుండి ధనం సంగ్రహిస్తున్నాను. ఆపదలు వచ్చినపుడే మీరు ఎద్దుల వలె భారం వహించాలి. ఆపదలలో ధనం దాచుకొంటే ఎవరికీ ప్రియం కలిగించదు. ఇలా మెత్తని మాటలతో, సేవాపూర్వకంగా ప్రజలను వశపరచుకోవాలి. సమయం తెలుసుకొని రాజు యోగం అవలంబించి తన పగ్గాలు విడవాలి. (అధికారులను పన్నులు వసూలు చేయటానికి నెమ్మదిగా వదలాలి).

కోట ప్రాకారం, సేవకుల పోషణం, ఖర్చు, యుద్ధభయం, యోగక్షేమాలు అనేవాటిని చూపించి వైశ్యుల నుండి పన్నులు వసూలు చెయ్యాలి. ఊరుకొంటే అరణ్యవాసులైన వర్తకులు నష్టపోతారు. అందుచేత వారి విషయంలో మృదువుగా వ్యవహరించాలి. వైశ్యులకు

ఊరట ఇవ్వాలి. రక్షణ ఇవ్వాలి. దానమివ్వాలి. మాటిమాటికి ఇలా వారికి ప్రియం కలిగించాలి. వారి భాగాలు వారికివ్వాలి. వైశ్యుల విషయంలో ఎల్లప్పుడూ ఫలం ఇస్తూ ఉండాలి. వారు రాష్ట్రం మీద, వ్యవహారం మీద, వ్యవసాయం మీద ప్రభావం చూపుతారు. అందుచేత వివేకం కల రాజు ఆ వైశ్యులమీద ప్రయత్నంతో ప్రీతి కలిగించాలి. దయాపరుడై, అప్రమత్తుడై, మృదువుగా పన్నులు వసూలు చెయ్యాలి. వైశ్యులతో ఇలా వ్యవహరించడం చాలా తేలిక. అంతటా క్షేమంకరం. ఇంతకు మించిన వరం రాజుకు మరొకటి లేదు ధర్మజా !'

88. రాజు కోశమును వృద్ధిపరచుట.

యుధిష్ఠిరుడు ఇలా అడిగాడు. 'రాజు సమర్థుడయినా కోశవృద్ధిని కోరినపుడు ఎలా ప్రవర్తించాలి ? పితామహా ! నాకు చెప్పు.' భీష్ముడు చెపుతున్నాడు. 'దేశం, కాలం, బుద్ధి, బలం - వీటి ననుసరించి, ధర్మకాంక్షతో, జనహితమందే ప్రీతి కలిగి రాజు ప్రజలను పాలించాలి. ప్రజలకూ, తనకూ శ్రేయోదాయక మయిన కర్మలన్నీ రాష్ట్రంలో రాజు చెయ్యాలి. తేనెటీగలు చెట్టునుండి తేనెను గ్రహించినట్లు రాజు ప్రజల నుండి ధనం గ్రహించాలి. దూడ చక్కగా పెరగటానికి తగినన్ని పాలు విడిచి, మిగిలినవి పిండు కోవాలి. అంతేకాని పాదుగు కోయరాదు. రాజు జలగలాగా మృదువుగా రాష్ట్రంనుండి ధనం పీల్చాలి. ఆడుపులి తన పిల్లలను నోట కరచుకొన్నట్లు ప్రజలతో రాజు వ్యవహరించాలి కాని పీడించరాదు. సూది పళ్లతో చుంచు పాదం కొరికినట్లు మృదువైన ఉపాయంతో రాజు రాష్ట్రం నుండి ధనం పీల్చాలి. ఏటా పన్ను కొంచెంగా పెంచాలి. ఒక ఏడుకంటె మరోఏడు మరికాస్త పెంచాలి. ఇలా క్రమంగా పెంచాలి.

గిత్తదూడలను వశపరచుకొన్నట్లు అనగా బండిపై కొద్ది కొద్ది భారం పెంచినట్లుగా పన్నులను పెంచుతూ ఉండాలి. ఒక్కసారిగా ముక్కుత్రాళ్ళు బిగించి గుంజితే ఎద్దులు, గిత్తదూడలు ముందుకు పడి పోతాయి. వాటిని అదుపుచేయటం కష్టం. కాబట్టి తగినరీతిలో వాటిని ప్రయత్న పూర్వకంగా లొంగదీయాలి. అలాగే ప్రజలను క్రమక్రమంగా వశపరచుకొని పన్నులు అనుభవించాలి. అందరిపట్ల సమానపద్ధతి పనికిరాదు. ముఖ్యులయిన వారిని మృదుమార్గంలో వశపరచుకోవాలి. మిగిలిన వారి నుండి యథోచితంగా గ్రహించాలి. ఎవరు ముఖ్యులో ముందు విడమర్చుకొని కొంతమంది దగ్గర సాంత్వనం చేస్తూ గ్రహించాలి. అలా కష్టం లేకుండా సుఖంగా ధనం గ్రహించాలి. తగని పరిస్థితిలో, తగని కాలంలో

ప్రజలమీద పన్నులు విధించరాదు. కాలానికీ, శాస్త్రానికీ తగినట్లుగా విధించి మృదు మార్గంలో పన్నులు గ్రహించాలి. ఈ చెపుతున్న ఉపాయాలన్నీ మాయ లని అనుకోకు. ఉపాయం లేకుండా గుర్రాలను కూడా లొంగదీసుకోలేము. అలా చేస్తే వాటికే కోపం వస్తుంది. (ఇక ప్రజల గురించి చెప్పాలా ?) పానశాలలు, వేశ్యలు, ప్రియులకు వార్తలందించేవారు, విటులు, జూదరులు, ఇంకా ఇటువంటివారు - వీరిని అదుపులో ఉంచుకోవాలి. వీరు రాష్ట్రానికి దెబ్బకొడతారు. వీరు రాష్ట్రంలో నిలిచి మంచివారిని బాధిస్తారు.

"ఆపద లేని సమయంలో ఎవరూ, ఎవరినీ, కొంచెం కూడా అడుక్కోరాదు" అని ప్రాణులన్నిటికీ మనువు ఎపుడో ఒక వ్యవస్థ చేశాడు. అందరూ ఆ(మను) వ్యవస్థనే అనుసరించాలి. ఏ పనీ చేయకుండా మానవులుంటే లోకాలన్నీ నిస్సందేహంగా నశించిపోతాయి. ఇటువంటి వారిని నియంత్రించగల రాజు నియంత్రించకపోతే ఆ పాపంలో నాలుగో వంతు రాజు అనుభవిస్తాడని వేదం చెపుతోంది. ఇలా పాపంలోనే కాదు పుణ్యంలో కూడా రాజు పాలు పంచుకొంటాడు. అందుచేత రాజు పాపులను సదా అణగద్రొక్కుతూ ఉండాలి. వీరిని శిక్షింపని రాజు పాపం పంచుకొన్నట్లే. వారు చేసిన ధర్మం వలన కూడా రాజు పుణ్యం పంచుకొంటాడు. ఈ పానశాలలు మొదలగు వానిని అణచి, తరువాత వాని మీద ఆసక్తి పెంచుకొంటే అది ఐశ్వర్య నాశకమే. కామాసక్తి కలవాడు ఏ అకార్యాన్ని వదలుకొంటాడు ? రాగానికి, కామానికి వశుడయిన వాడు మద్యం, మాంసం, పరులధనం, భార్య, ఇతర సంపదలు - వీటి నన్నిటినీ అపహరిస్తాడు. అలాగే శాస్త్రం ప్రవర్తింపజేస్తాడు. ఎపుడూ చెయ్యి చాచని వారు ఆపదలలో యాచిస్తారు. అటువంటి వారిని కనిపెట్టి, ధర్మాన్ని అనుసరించి, దయతో దానం చెయ్యాలి. భయంతో కాదు. నీ రాష్ట్రంలో యాచకులూ, దొంగలూ లేకుందురు గాక ! వీరిని ఖండించే వారే ఉందురుగాక ! వారు ప్రాణులను రూపుమాపేవారు కారు. సర్వభూతాలనూ అనుగ్రహిస్తూ, ప్రజలను వృద్ధి పరచే వారే నీ రాష్ట్రంలో ఉందురుగాక ! ప్రాణులను రూపుమాపేవారు కాదు.

మహారాజా ! బాగా ధనం పీల్చివేసే అధికారులను కూడా నీవు దండించాలి. ఎందుకంటే శాస్త్రోక్తంగా పన్నులు రాబట్టే అధికారులకు కూడా వీరు పీల్చేసే విద్య నేర్పుతారు. వ్యవసాయం, గోపోషణం, వర్తకం - ఇంకా ఏవయినా ఇటువంటి పనులు; చాలామంది నిపుణుల చేత, వేర్వేరు కర్మలు చేయించాలి. ఎవడయినా ఒకడే కృషి, గోరక్ష, వాణిజ్యాలన్నీ చేస్తుంటే వాడికి రాజకీయ భయం వల్లకాని, దస్యుభయం వల్ల

కాని ప్రాణసంశయం కలుగవచ్చు. దానివల్ల రాజుకు నింద కలుగుతుంది. ధనవంతులను నిత్యమూ అన్నపానాలతో, వస్త్రాలతో పూజిస్తూ ఉండాలి. 'తమరు నాతో పాటు ప్రజలను కూడా అనుగ్రహించాలి' అని అంటూ ఉండాలి. ధనవంతు లంటే రాజ్యంలో ముఖ్యాంగం. ధనికుడు సర్వభూతాలకూ ఆయువుపట్టు. ఉన్నతుడు. సందేహం లేదు. ప్రజ్ఞాశాలి, శూరుడు, ధనికుడు, ధార్మికుడు, తపస్వి, సత్యవాది, బుద్ధిమంతుడు అయిన రాజు ప్రజలను చక్కగా రక్షిస్తాడు. అందుచేత రాజా ! అన్ని ప్రాణుల యందు ప్రీతికలిగి ఉండు. సత్యం, ఆర్జవం, అక్రోధం, క్రూరతలేకుండుట -వీటిని రక్షించుకో. రాజు సత్యమూ, ఆర్జవమూ కలిగి, మిత్రులను, కోశాన్ని, సేనలను గ్రహించి, దండమూ, ధనమూ, మిత్రులనూ, భూమినీ పొందుతాడు.'

89. రాష్ట్ర రక్షణము.

భీష్ముడు చెపుతున్నాడు. 'తినదగిన పళ్లు కాసే చెట్లను నీదేశంలో నరికి వేయరాదు. అట్లే బ్రాహ్మణుల మూలఫలం ధర్మమే అని మేధావులు చెపుతారు. దాన్ని కూడా నరికివేయరాదు. బ్రాహ్మణులకు కాని దానినే ఇతరులు అనుభవించాలి. బ్రాహ్మణునికి అపరాధం చేసి ఎవరూ హరింపరాదు. విప్రుడు బ్రతుకు తెరువుకోసం రాష్ట్రం విడిచిపోయే పరిస్థితి వస్తే రాజు అతనికి సకుటుంబంగా జీవనోపాధి కల్పించాలి. అయినా అతడు వెళ్లి పోతుంటే రాజు బ్రాహ్మణుల సభలోనికి వెళ్లి "మీరే ఇలా వెళ్లిపోతే ఇక ఎవరికై మర్యాదను నేను పాటించాలి ?" అనాలి. అయినా అతడు మానక 'నీవు ఇపుడు నాకు ఉపాధి కల్పిస్తున్నావు కాని పూర్వం చెయ్యలేదుగా అంటే రాజు "గతం మరిచిపొండి" అని ప్రార్థించాలి. "జనులు నిన్ను గూర్చి ఏవేమో చెప్పారు. కాని నేను నమ్మను" అనాలి రాజు. అలాగే అతడు భోగాలు కోరితే కల్పిస్తానని, వృత్తిలేకుండ జీవిస్తానంటే అలాగే చేస్తా ననాలి. వ్యవసాయం, గోరక్షణ, వర్తకం అనేవి ప్రజలకు జీవనం కల్పిస్తాయి. వేదవిద్య స్వర్గం కలిగిస్తుంది. అది ప్రాణులను ఆలోచింప జేస్తుంది.

ఆ వేదవిద్య పడిపోతూ ఉంటే, దానికి శత్రువులయిన దొంగలను వధించటానికి బ్రహ్మ క్షత్రియజాతిని సృష్టించాడు. ధర్మజా ! శత్రువులను జయించు. ప్రజలను రక్షించు. యజ్ఞాలతో దేవతలను పూజించు. వీరుడవై యుద్ధంలో పోరాడు. రక్షింపదగిన వారిని రక్షించే రాజే ఉత్తముడు. వారిని రక్షింపని రాజుతో ఏ ప్రయోజనమూ ఉండదు. లోకంలో

అందరి హితంకోసం రాజు పోరాడాలి. అందుకే సేవకులను రాజు ఉపయోగించుకోవాలి. లోపలి వారినుండి వెలుపలి వారిని, వెలుపలి వారినుండి లోపలివారిని, పరుల నుండి పరులను, తనవారి నుండి తనవారిని – ఇలా అందరినీ రక్షిస్తూ పరిపాలించు. రాజా ! అన్నివైపుల నుండి నిన్ను నీవు రక్షించుకొంటూ భూమిని పాలించు. అంతటికీ తన శరీరమే మూల మని విద్వాంసులు చెపుతారు. నాలో దోషమేమిటి ? వ్యసనమేది ? దేని వల్ల నాకు నాశం కలగకుండా ఉంటుంది ? ఎక్కడనుండి నన్ను దోషం చేరుతుంది ? అని సదా ఆలోచించాలి. నిన్న తాను చేసిన దాన్ని ప్రజలు మెచ్చు కొంటారా ? లేదా అనే విషయం రహస్యచారుల ద్వారా తెలుసుకోవాలి. ప్రజల అభిప్రాయాన్ని రాజు అనుసరించాలి. పల్లెలలోనూ, రాష్ట్రంలోనూ ప్రజలు నీ ప్రవర్తనను తెలుసుకొంటున్నారా ? ప్రశంసిస్తున్నారా ? నీ కీర్తిని ఇష్టపడుతున్నారా ?

అలాగే ధర్మజ్ఞులు, ధృతిమంతులు, పౌరులు, రాష్ట్రంలో నివసించే వారు, రాజ సేవకులు, అమాత్యులు, మధ్యస్థులు అంతా నిన్ను ప్రశంసిస్తున్నారా ? నిందిస్తున్నారా అనేది తెలుసుకోవాలి. నిందించినా, ప్రశంసించినా వారిని చక్కగా సత్కరించాలి. అందరికీ ఒకే విధంగా రుచి కల్పించటం ఎవరికీ శక్యంకాదు. ప్రజ లందరిలో మిత్రులు, శత్రువులు, మధ్యస్థులు అని ఉంటారు.'

ధర్మరాజు ఇలా అడిగాడు. 'భుజబలం, గుణాలు సమానంగా ఉన్నా వారిలో ఒకడు అధికుడై మిగిలిన వారిని వశపరచుకొంటున్నాడు. ఎలా ?' భీష్ముడు చెపుతున్నాడు. 'కదిలేవి కదలనివాటిని తింటాయి. కోరలు ఉండేవి లేని వాటిని, విషసర్పాలు విషంలేనివాటిని తింటాయి. అలాగే బలవంతులు బలహీనులను పీడిస్తారు. ధర్మజా ! ఇట్టివారిపట్ల జాగరూకతతో మెలగాలి. శత్రువు నుండి రక్షించుకోవాలి. వీరు గ్రద్దలవంటివారు. ఏ మాత్రం ఆదమరిచినా నెత్తిమీద తన్నుతారు. నీరాజ్యంలో వర్తకులు పన్నుకట్టలేక బాధపడటంలేదు కదా ! ఇష్టం వచ్చిన ధరలకు వస్తువులు అమ్మి అడవులలో దాగుకొనటం లేదు కదా ! రాజ భారంతో పాటు, ఇతరుల భారం కూడా మోసే కృషీవలులు పీడితులై రాష్ట్రం వదలి వెళ్లిపోవటం లేదు కదా ! ఇచట యజ్ఞ, శ్రాద్ధాదులలో ఇచ్చిన దానితో దేవతలు, పితృదేవతలు, మనుష్యులు, ఉరగులు, రక్షస్సులు, పక్షులు, పశువులు జీవిస్తూ ఉంటాయి. ఇది నీ రాష్ట్ర వృత్తి. రాజు రక్షణ. దీన్ని గురించి ఇంకా చెపుతాను.'

90. ఉతథ్య గీత - 1.

(ఉతథ్య మాంధాతృ సంవాదము)

భీష్ముడు చెపుతున్నాడు. "ధర్మజా ! బ్రహ్మవేత్తలలో ఉత్తముడయి ఆంగిరస గోత్రుడయిన ఉతథ్యుడు యువనాశ్వని కుమారుడయిన మాంధాతకు ప్రీతితో రాజధర్మాలు చెప్పాడు. ఆ బ్రహ్మవేత్త ఉతథ్యుడు చెప్పినట్లుగా అన్ని ధర్మాలూ నీకు చెపుతాను. ఉతథ్యుడు చెపుతున్నాడు. **'మాంధాతా ! ధర్మంకోసమే రాజు ఉన్నాడు కాని ఇష్టం వచ్చినట్లు చేయటానికి కాదు. రాజు లోకానికి రక్షకు డని తెలుసుకో.*** రాజు ధర్మం ఆచరిస్తే దేవత్వం పొందుతాడు. అధర్మం ఆచరిస్తే నరకానికి పోతాడు. సర్వభూతాలూ ధర్మం మీద నిలుస్తాయి. ధర్మం రాజుమీద నిలుస్తుంది. ఆ ధర్మాన్ని చక్కగా పాలించే రాజే భూమికి భర్త అవుతాడు. రాజు పరమధర్మాత్ము డయితే ధర్మం సంపత్సమృద్ధ మవుతుంది. ధర్మం లేకపోతే దేవతలు కూడా నిందింపబడతారు. స్వధర్మంలో ప్రవర్తించే వారికి అర్థాలు సిద్ధిస్తాయి. అందువల్లనే లోకం సర్వమూ శుభం ఆచరిస్తోంది.

ధర్మ ప్రవృత్తి కూలిపోతే అధర్మం విజృంభిస్తుంది. ఆ పాపం రాజు నివారించకపోతే అదే మహాభయం రాత్రింబవళ్లు పీడిస్తుంది. నాయనా ! రాజు పాపాన్ని వారించకపోతే సజ్జనులకు 'ధర్మతః ఇది నాది' అనేది ఏదీ ఉండదు. ఒక వ్యవస్థ ఉండదు. పాపబలం పెరిగిపోతే భార్యలేదు. పశువులులేవు. పాలంలేదు, ఇల్లులేదు. ఇవేవీ మనుష్యులకు కనపడవు. పాపం నివారింపబడకపోతే దేవతలకు మానవుల పూజలు తెలియవు. పితృదేవతలకు స్వధాకారాలు ఉండవు. అతిథులకు పూజలు ఉండవు. రాజు పాపం నివారించనపుడు వ్రతశీలు లయిన బ్రాహ్మణులు కూడ వేదాలు చదవరు. యజ్ఞాలు ఆచరింపరు. రాజు పాపనివారణ చేయనపుడు మానవుల మనస్సు ముసలి జంతువుల మనస్సులాగా విహ్వల మవుతుంది. ఇహ పరలోకాలు రెంటినీ స్వయంగా పరిశీలించి ఋషులు "ధర్మం కాపాడుతాడు ఇతడు" అని ఒక మహాభూతాన్ని సృష్టించారు. అదే రాజు. ఎవనిలో ధర్మం విరాజిల్లుతుందో అతడు రాజు. ధర్మం ఎవనిలో లయం పొందుతుందో వాడు వృషలుడు అంటారు దేవతలు. వృషః అంటే భగవాను డయిన ధర్ముడు. ధర్మాన్ని కనపడకుండా చేసేవాడు వృషలుడు అని దేవతలంటారు. అందుచేత ధర్మాన్ని వృద్ధి పరచాలి.

ధర్మం వృద్ధిపొందితే భూతాలన్నీ సదా వృద్ధిపొందుతాయి. ధర్మం తగ్గిపోతే

---

* ధర్మాయ రాజా భవతి న కామకరణాయ తు ।
మాంధాతరితి జానీహి రాజా లోకస్య రక్షితా ॥ 3

అన్నీ తగ్గిపోతాయి. అందుచేత ధర్మలోపం రానీయరాదు. ధనం నుండి ధర్మం పుడుతుంది. ధారణం చేయడంవల్ల కూడా ధర్మం అన్నారు. ఆ ధర్మం అకార్యాల సీమను అంతం చేస్తుందని చెప్పబడింది. ప్రాణుల కల్యాణంకోసమే బ్రహ్మ ధర్మాన్ని సృష్టించాడు. అందుచేత ప్రజానుగ్రహం కోసమే ధర్మం ప్రచారం చెయ్యాలి/ప్రవర్తింపజెయ్యాలి. అందుకే ధర్మం అన్నింటికంటె శ్రేష్ఠ మయినదని చెపుతారు. ప్రజలకు మేలు చేస్తూ శాసించేవాడే రాజు. కామక్రోధాలు విడిచి ధర్మాన్నే పాలించు. రాజులకు మేలుచేసే వాటిలో ధర్మమే ఉత్తమం. ధర్మానికి బ్రాహ్మణుడు జన్మస్థానం. అందుచేత బ్రాహ్మణులను సదా పూజించాలి. మాంధాతా ! మాత్సర్యం విడిచి బ్రాహ్మణులకు ఇష్టం కలిగించాలి. వారి ఇష్టాలను తీర్చకపోతే రాజుకు భయంకలుగుతుంది. మిత్రులు పెరగరు సరికదా మిత్రులు శత్రువు లవుతారు.

చిన్నప్పటినుంచి బలి బ్రాహ్మణులపై అసూయ పెంచుకొన్నాడు. అందుచేత అతనిలో అగ్నిజ్వాలవలె ప్రకాశించే సంపద తొలగి పోయింది. అతని నుండి తొలగిపోయిన సిరి దేవేంద్రుని చేరింది. అపుడు బలి ఇంద్రునిలోని లక్ష్మిని చూసి మనసులో పరితపించాడు. మాంధాతా ! ఇది అసూయ లేదా అభిమానం యొక్కఫలం. తెలుసుకో. నిన్ను ఆ జ్యోతి వదలి పోకుండా చూసుకో. దర్పం అనేది అధర్మం వల్ల లక్ష్మికి పుట్టిన పుత్రు డని వేదం చెపుతోంది. దానితో చాలామంది దేవ దానవులు నశించిపోయారు. ఎంతోమంది రాజర్షులు కూడా దర్పం వల్లనే నశించారు. దర్పాన్ని గెలిస్తే రాజు అవుతాడు. దర్పానికి ఓడిపోతే దాసు డవుతాడు. మాంధాతా ! నీవు చిరకాలం సింహాసనం మీద ఉండాలనుకొంటే ఎన్నడూ అధర్మంతో కూడిన దర్పం రానీయకు. మదించినవాడు, పొగరు బోతు, బాలుడు, పిచ్చివాడు- వీరిని ఎన్నడూ సేవించకు. అలవాటుగా వారితో కలిసి ఉండే వారిని కూడా సేవించకు. శిక్షపడిన మంత్రి నుండి, స్త్రీల నుండి, పర్వతాల నుండి, ఏనుగు, గుర్రం, పాము - వీనినుండి దూరంగా ఉండాలి. ఒకవేళ నిరంతరమూ కలిసి ఉండవలసివస్తే రాత్రివేళ వారిదగ్గర ఉండరాదు. త్యాగంలేక పోవడం, దురభిమానం, దంభం, క్రోధం విడిచిపెట్టాలి.

ఎరుగని స్త్రీలు, నపుంసకులు, వేశ్యలు, పరభార్యలు, కన్యలు వీరిని రాజు ఎన్నడూ కలియరాదు. వర్ణాలు కలగాపులగమయి పోయినపుడు ఆయా కులాల్లో పాపులు, రాక్షసులు, నపుంసకులు, అంగవైకల్యం కలవారు, బండనాలుకలు కలవారు, మందబుద్ధులు పుడతారు. రాజు ఏ మాత్రం ప్రమాదపడినా ఇంకా ఇటువంటి ఎన్నోరకాల వాళ్లు పుడతారు.

అందుచేత రాజు ప్రజాహితంలో విశేషంగా ప్రవర్తించాలి. క్షత్రియుడు ఏ మాత్రం ప్రమాదపడినా మహాదోషం కలుగుతుంది. ప్రజా సంకరానికి కారకులయిన అధర్మ పరులు పెరిగిపోతారు. శీతకాలం కాకపోయినా చలివేస్తుంది. శీతకాలంలో చలి ఉండదు. అనావృష్టి, అతివృష్టి, రోగాలు ఇవన్నీ ప్రజలను పీడిస్తాయి. ధర్మప్రవర్తనలో రాజు ఏమరితే తోకచుక్కలు, అరిష్టగ్రహాలు పొడసూపుతాయి. రాజ వినాశాన్ని సూచించే ఉత్పాతాలు కనిపిస్తాయి. తన్నుతాను రక్షించుకోలేని రాజు ప్రజలను రక్షింపలేడు. ప్రజలుకూడ అతని రాజ్యం నుండి తొలగిపోతారు. తరువాత రాజు నశిస్తాడు.' ఒకని చేతి సొమ్మును ఇద్దరు కలిసి లాక్కుంటారు. ఇద్దరి సొమ్మును చాలామంది కలిసి లాక్కుంటారు. కన్యలు చెడి పోతారు. అదంతా రాజదోషమని చెపుతారు. ధర్మం విడిచిరాజు ప్రమాదపడితే ప్రజలలో "ఇది నాది" అనే భావం ఎవరిలోనూ నిలవదు.

91. ఉతథ్య గీత - 2.

ఉతథ్యుడు చెపుతున్నాడు. మేఘుడు సకాలంలో వర్షిస్తే, రాజు ధర్మాన్ని చక్కగా నడిపిస్తే అదే మహాసంపద. అది ప్రజలను సుఖంగా నిలుపుతుంది. వస్త్రాల మాలిన్యాన్ని పోగొట్టలేని వాడు, రంగు బట్టలను శుభ్రపరచలేని (రంగు పోగొట్టకుండా) వాడు చాకలి కానట్లే రాజు ధర్మం నడపకపోతే రాజు కాడు. అలాగే విప్రులు, క్షత్రియులు, వైశ్యులు – ఈ వర్ణాలలో కర్మలు చేయలేక ఇతరకర్మలు చేసేవాడు కూడ శూద్రసమానుడే. వృత్తిపనులు శూద్రునిలో; వ్యవసాయం వైశ్యునిలో; దండనీతి రాజులో; బ్రహ్మచర్యం, తపస్సు, మంత్రాలు, సత్యం అనేవి బ్రాహ్మణులలోను స్థిరపడి ఉన్నాయి. వస్త్రాలు ఉతకటం లాగా ఆ వర్ణాలవారి శీల దోషాలను పూర్తిగా పోగొట్టే క్షత్రియుడే ప్రజలకు తండ్రి. అతడే ప్రజాపతి. కృతం, త్రేత, ద్వాపరం, కలి – అని రాజ ప్రవర్తనలన్నీ నాలుగు యుగ రూపాలుగా ఉంటాయి. నిజానికి రాజే యుగరూపు డని అంటారు. రాజు ధర్మం విషయంలో పొరబడితే చతుర్వర్ణాలు, చతురాశ్రమాలు అన్నీ చెడిపోతాయి. రాజు తన ధర్మం విషయంలో పొరబడితే త్రేతాగ్నులు లేవు. వేద విద్యలు లేవు. దక్షిణలతో కూడిన యజ్ఞాలు లేవు. అన్నీ చెడిపోతాయి. **రాజే సర్వభూతాలకు కర్త. రాజే వినాశకుడు. అతడు ధర్మాత్ముడయితే కర్త. అధర్మపరుడైతే వినాశకుడు.***

---

* రాజైవ కర్తా భూతానాం రాజైవ చ వినాశకః ।
ధర్మాత్మా యః స కర్తా స్యాద్ అధర్మాత్మా వినాశకః ॥ 9

రాజు ప్రమాదపడితే... రాజభార్యలు, పుత్రులు, బంధువులు, స్నేహితులు అంతా కట్టకట్టుకొని ఏడవాలి. రాజు అధర్మపరుడయితే ఏనుగులు, గుర్రాలు, ఆవులు, ఒంటెలు, కంచరగాడిదలు, గాడిదలు – ఇటువంటి జంతువులన్నీ దుఃఖిస్తాయి. మాంధాతా ! దుర్బలులైన వారి రక్షణ కోసమే బలవంతుడయిన రాజును విధాత సృష్టించాడు. బలమంతా ప్రతిష్ఠితమై యున్న రాజు దుర్బలుడైతే ఆ అనర్థం చాలా ఎక్కువగా ఉంటుంది. దుర్బల ప్రాణాలను రక్షించేవారు, వారి బంధువులు మొదలగువారూ, రాజు అధర్మపరు డయితే ఎంతో దుఃఖిస్తారు. దుర్బలుని కన్ను, మహర్షి కన్ను, పాము కన్ను – ఈ మూడూ సహింపరానివి. అందుచేత దుర్బలుని దగ్గరకు చేరకు. (రాజును దుర్బలునిగా చేయరాదు). నాయనా ! బలహీనులు అవమాన పడకుండా చూసుకొంటూ ఉండాలి. బంధుసహితంగా నిన్ను దుర్బలుల కళ్లు మాడ్చివేయకుండును గాక ! దుర్బలుని వలన మాడిపోయిన వాని కులంలో ఏమీ మొలవదు. అది వేళ్లతో సహా దహించివేస్తుంది. అందుచేత దుర్బలుని చేరకు. (దుర్బలులు లేకుండా రాజు చెయ్యాలి). బలవంతుడి కంటె దుర్బలుడే ఎక్కువ. వాని బలం వాయుదేవుని బలం వంటిది. దుర్బలుని (వాయువు యొక్క) బలంతో దగ్ధమైనది ఏదీ మిగలదు. అవమానం పొంది, దెబ్బతిన్నవాడు మొరపెట్టుకొన్నా రక్షకుడు ఆదుకోకపోతే వాడు అమానుషకృత్యం చేస్తాడు. అది – ఆ దండం రాజును చంపేస్తుంది. అందుచేత రణంలో నిలిచిన వీరునివలె దుర్బలుని తినెయ్యకు. అగ్ని తనకు ఆశ్రయమిచ్చిన కట్టెను కాల్చివేస్తుంది. అలాగే నిన్ను దుర్బలుల చూపులు కాల్చివేయకుండు గాక ! తప్పుడు శిక్షను పొంది ఏడ్చేవారి కన్నీరు ఏడిపించిన వారి పుత్రులను, పశువులను చంపుతుంది. కారణం తప్పుడు శిక్ష కనుక. **తానుచేసిన పాపం తనపట్ల ఫలింపకపోతే పుత్రుల మీదనో, మనుమలమీదనో, ముమ్మనుమల మీదనో ఫలిస్తుంది. మెల్లగా ఆవులా ఫలిస్తుంది.** అబలుడు చంపబడుతూ రక్షకుని పొందలేక పోయినపుడు దైవకృతంగా దారుణదండం ఆ చంపేవాని మీద పడుతుంది. యోగ్యులయిన జానపదులు బ్రాహ్మణుల వలె బిచ్చమెత్తితే అట్టి వారు వెంటనే భిక్షుకరూపంలో రాజును చంపుతారు. తన రాజ్యంలో చాలామంది ఉద్యోగులు అవినీతిపరులై ప్రవర్తిస్తుంటే అది రాజు యొక్క పాపమే అవుతుంది. కుయుక్తులతో కాని, కామంతో కాని, అర్థంకోసం కాని రాజు ధనం గ్రహిస్తే దాన్ని మళ్లీఇమ్మని జాలిగా అడుగుతూ వారు చనిపోతే అది నిజంగా రాజుకు చావే అవుతుంది. ఒక పెద్ద వృక్షం మొలుస్తుంది. పెరుగుతుంది. దాన్ని ఎన్నో ప్రాణులు ఆశ్రయించి ఉంటాయి. ఆ చెట్టు నరకడమో, కాల్చడమో చేస్తే దాన్ని ఆశ్రయించిన పక్షులన్నీ గూడు లేని వవుతాయి. రాష్ట్రంలో ఉత్తమ ధర్మం ఆచరించేవారు రాజు

యొక్క సంసారాన్ని సద్గుణాన్ని ప్రశంసిస్తే రాజుయొక్క పాపం పోతుంది. ఒకవేళ వారికి ధర్మం ఏమిటో తెలియక అధర్మం ఆచరిస్తే వెంటనే రాజుయొక్క పుణ్యం అంతా అతనిని వదలిపోతుంది. పాపాత్ములు బాహాటంగా తిరిగే చోట రాజులకు, సజ్జనులకు పాపం కలుగుతుంది. సత్ప్రవృత్తి లేని వారిని రాజు శిక్షిస్తే అపుడతని రాజ్యం వృద్ధి పొందుతుంది. మంత్రులను మనసారా మన్నిస్తూ రాజు రహస్యాలోచనలోను, యుద్ధంలోను నియోగించాలి. అపు డా రాజుయొక్క రాష్ట్రం వర్ధిల్లుతుంది. అతడు చిరకాలం సర్వభూమినీ అనుభవిస్తాడు. మంచిపనిని, చక్కని మాటను తెలిసికొని అటువంటి వానిని రాజు పూజిస్తే ఉత్తమ పుణ్యాన్ని / ధర్మాన్ని పొందుతాడు.

పంచుకొని తినడం, మంత్రులను అవమానింపకపోవడం, గర్వం కల బలవంతుని చంపడం – అనేవి రాజధర్మాలు. వాక్కుతో, చేష్టలతో అందరినీ రక్షిస్తూ, (తప్పు చేస్తే) కొడుకును కూడ సహింపకపోవడం రాజుధర్మం అని చెప్పబడుతుంది. బలహీనులయిన నరులకు తనకు ఉన్నదానిని పంచియిస్తూ వారిని బలవంతులను చేయడం రాజధర్మం అని చెప్పబడుతుంది. రాష్ట్రాన్ని రక్షించడం, దోపిడి దొంగలను వెడలగొట్టడం, యుద్ధంలో జయించడం రాజధర్మం అని చెప్పబడుతుంది. క్రియతో కాని, మాటతో కాని పాపం చేస్తే వాడు తనకు ఇష్టుడయినా శిక్ష విధిస్తే అది రాజధర్మం అనిపించుకొంటుంది. వైశ్యులను కన్నబిడ్డలవలె రక్షించి, మర్యాదాభంగం చేయకపోతే అది రాజధర్మం అనిపించుకొంటుంది. రాగద్వేషాలు విడిచి, శ్రద్ధతో భూరి దక్షిణలిచ్చి, యజ్ఞాలు చేస్తే అది రాజధర్మం అవుతుంది. దీనులు, అనాథులు, వృద్ధులు – వీరి కన్నీరు తుడిచి, ఆనందం కలిగిస్తే అది రాజధర్మం అనిపించుకొంటుంది. మిత్రులను వృద్ధిపొందించడం, శత్రువులను పీకివేయడం, సజ్జనులను పూజించడం – ఇదీ రాజధర్మం అంటే. సత్యాన్ని ప్రీతితో రక్షించడం, నిత్యమూ భూమిని దానం చెయ్యడం, అతిథులను, సేవకులను మన్నించడమూ – ఇదీ రాజధర్మం అనిపించుకొంటుంది. నిగ్రహం, అనుగ్రహం రెండూ ఎవనిలో నిలిచి ఉంటాయో ఆ రాజు ఇహపరాలు రెండిటా సత్ఫలం పొందుతాడు. మాంధాతా ! రాజు నిజానికి యముడు. కాని ధార్మికులకు పరమేశ్వరుడు. ఇంద్రియాలను అదుపు చేస్తే ఐశ్వర్యం పొందుతాడు. అదుపు తప్పితే పతితుడవుతాడు. ఋత్విజులను, పురోహితులను, గురువులను సత్కరించి, అవమానించక చక్కగా ఆదరిస్తే అది రాజధర్మం అవుతుంది. యముడు ప్రాణులన్నిటినీ ఎక్కువ తక్కువలు లేకుండా అదుపు చేస్తాడు. అలాగే రాజూ చెయ్యాలి. విధి అనుకొని ప్రజలను అదుపు చెయ్యాలి. వేయి కన్నులున్న ఇంద్రునితో రాజును పోలుస్తారు. అతడు దేనిని ధర్మంగా చూస్తాడో అదే ధర్మం

అవుతుంది. సహనం, బుద్ధి, ధైర్యం, మతి, తెలుసుకోవాలనే కోరిక, మంచి-చెడు అనే వాటిని సర్వులకూ సదా రాజు పొరబడకుండా నేర్పాలి. అందరినీ కలుపుకోవడం, దానం, తీయగా మాట్లాడటం కూడా ప్రజలకు నేర్పాలి. పౌరులను, జానపదులను సుఖానికి లోటు లేకుండా రక్షించాలి.

అసమర్థుడైన రాజు ఎన్నడూ ప్రజలను రక్షింపలేడు. రాజ్యభారం చాలా గొప్పది. రాజ్యం చెయ్యడం చాలా కష్టం. దండనీతి తెలిసిన వాడు, ప్రాజ్ఞుడు, శూరుడు అయిన రాజే రక్షింపగలడు. దండించడం తెలియని వానికి, పేడికి, బుద్ధిలేనివానికి అది శక్యం కాదు. సద్వంశంలో పుట్టిన వారు, సమర్థులు, రాజభక్తి కలవారు, చాలా విద్యలు నేర్చిన ఉత్తములచేత అందరి బుద్ధులూ; ఆశ్రమంలో ఉన్నవారి బుద్ధులు కూడా పరీక్షించు. సర్వప్రాణుల పరమధర్మాన్ని నీదేశంలోనూ, పరదేశంలోనూ తెలుసుకొంటే నీ ధర్మం నశించదు. అందుచేత అర్థ, కామాల కంటె ధర్మమే మేలయినది. ధర్మాత్ముడు ఇహపరలోకాల్లో సుఖవృద్ధి పొందుతాడు. మనుష్యులు రాజపూజ్యతకోసం భార్యాపుత్రులను కూడ విడిచి వెడుతున్నారు. అందరిని కలుపుకోవడం, దానం, తియ్యనిమాట, పొరబడకపోవడం, శుచిత్వం ఇవి రాజుకు గొప్పదనం కలిగిస్తాయి. మాంధాతా ! వీటి విషయంలో ఎన్నడూ పొరబడకు. రాజు అప్రమత్తుడై తనయొక్క, శత్రువులయొక్క దోషాలను గమనించాలి. తన లోపం ఎవరికీ తెలియకూడదు. శత్రువులను దోషాల్లో ఇరికించాలి. ఇంద్ర, యమ, వరుణులూ, రాజర్షులు అంతా నడిచిన తీరిది. ఈ తత్త్వం విడవక పాలించు. మహారాజా ! రాజర్షులు సేవించిన ఆ విధానం ఆచరించు. ఇపుడే దివ్యమార్గం ఆశ్రయించు. ధర్మవర్తన కలరాజును ఇహపరాల్లో శక్తిమంతులయిన దేవతలు, ఋషులు, పితృదేవతలు, గంధర్వులు కీర్తిస్తారు.' భీష్ముడిట్లన్నాడు. 'ఉతథ్యుడు ఇలా చెపితే మాంధాత నిశ్శంకంగా ఆచరించాడు. భూమినంతా ఒక్కడే వశపరచుకొన్నాడు. మహారాజా ! మాంధాత లాగా నీవూ ధర్మం చక్కగా ఆచరించి, భూమిని రక్షించు. స్వర్గంలో స్థానం పొందుతావు.

92. వామదేవ గీత - 1.

యుధిష్ఠిరుడు ప్రశ్నించాడు. 'ధర్మం మీదనే నిలబడా లనుకొనే ధార్మికుడు ఎలా ప్రవర్తించాలో చెప్పు తాతా !' భీష్ముడు చెపుతున్నాడు. "ఇందులోనూ ప్రాచీనమయిన ఇతిహాసం ఒకటి చెపుతారు. అర్థతత్త్వం తెలిసిన మేధావి వామదేవుడు దీన్ని గానం చేశాడు. వసుమనుడనే రాజు జ్ఞాని, ధృతిమంతుడు, పవిత్రుడు. అతడు వామదేవ మహర్షిని ఇలా అడుగుతున్నాడు. 'స్వామీ ! ధర్మార్థాలతో కూడిన మాటలతో నన్ను

శాసించండి. ఎటువంటి ప్రవర్తన ఉంటే నాధర్మం నుండి తొలగకుండా ఉంటానో చెప్పండి.' నహుషుని కొడుకయిన యయాతివలె బంగారు చాయగల శరీరంతో సుఖంగా కూర్చున్న వసుమనునితో వామదేవ మహర్షి ఇలా అన్నాడు.

'ధర్మాన్నే అనుసరించు. ధర్మాన్ని మించినది ఏదీలేదు. ధర్మం మీద నిలిచిన రాజులు ఈ భూమిని జయిస్తారు.* అర్థసిద్ధి కంటె ధర్మమే మంచిదనుకొనే రాజు ధర్మ వృద్ధి మీద బుద్ధి పెట్టి ధర్మంతో శోభిల్లుతాడు. అధర్మం మీదనే దృష్టి నిలిపి బలవంతాన ప్రవర్తించే రాజు త్వరలో ధర్మార్థాలు రెండూ విడిచి వెళ్లిపోతాడు. దుష్టులు, పాపులు అయిన మంత్రులు కల్గి ధర్మనాశం చేసే రాజు లోకానికి వధింపదగినవాడు. వాడు వెంటనే సపరివారంగా నశిస్తాడు. ఏ ప్రయోజనమూ సాధింపక, ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తూ, ఆత్మస్తుతి చేసుకొనే రాజు భూమి నంతటినీ పొందినా త్వరగా నశిస్తాడు. శుభాలు పొందుతూ, అసూయ లేకుండా, ఇంద్రియాలను జయించిన రాజు బుద్ధిమంతుడై నదీప్రవాహాలతో సముద్రం లాగా వృద్ధి పొందుతాడు. ధర్మార్థ కామాలతో కాని, బుద్ధితో కాని, మిత్రసంపదతో కాని ఎన్నడూ రాజు పరిపూర్ణుడ నని భావింపకూడదు. ఈ అన్నిటిలోనే లోకయాత్ర ప్రతిష్ఠితమై ఉంది. వీనిని విని, పాటించే రాజు కీర్తి సంపదలను, ప్రజలను వశపరచుకొంటాడు.

ఇలా ధర్మోత్సాహం కలిగి, ధర్మప్రయోజనాలను చక్కగా ఆలోచిస్తూ, అర్థాలను చక్కగా సేవించే వాడు నిశ్చయంగా గొప్పదనం పొందుతాడు. దాన స్వభావం లేనివాడు. ఎవరితోనూ స్నేహం లేనివాడు, దండంతో మాత్రమే ప్రజలను మళ్లించేవాడు, సాహసప్రకృతి అయిన రాజు త్వరగా నశిస్తాడు. పాపం చేసే వానిని బుద్ధితో కనిపెట్టలేని బుద్ధిరహితుడు ఇహమందు అపకీర్తి పాలవుతాడు. మళ్లీ పరమందు నరకం పొందుతాడు. వ్యసనం మానవునిలో పుట్టి, ఆ మానవునే చంపుతుంది. అలాగే గౌరవించేవాడు, దాత, మృదుస్వభావుడు, వశవర్తి అయిన వానిని మానవులు చంపాలనుకొంటారు. ధర్మ విషయంలో గురువు లేనివాడు, ఇతరులను అడగనివాడు, ధనలాభంలో మాత్రమే సుఖ వ్యవహారం కలవాడు (ఇతరత్ర లేనివాడు) అయితే రాజు చిరకాలం సుఖపడడు. ధర్మ విషయాల్లో గురువే ప్రధానమయినవాడు, స్వయంగా అన్ని పనులూ పరిశీలించేవాడు, లాభాలలో ధర్మమే ప్రధానంగా కలవాడు – ఇటువంటి రాజు చిరకాలం సుఖపడతాడు.'

---

* ధర్మమేవానువర్తస్వ న ధర్మాద్విద్యతే పరమ్ ।
ధర్మే స్థితా హి రాజానః జయంతి పృథివీమిమామ్ ॥ 6

93. వామదేవ గీత - 2.

వామదేవుడు చెపుతున్నాడు. 'బలవంతుడయిన రాజు బలహీనులపై అధర్మంగా ప్రవర్తిస్తే, రాజవంశంలో వాళ్లు కూడా అదే పని చేస్తూ ఉంటారు. ఆ పాపులు పాపి అయిన రాజునే అనుసరిస్తారు. అటువంటి అవినీతి పరులతో నిండిన రాష్ట్రం త్వరగా నశిస్తుంది. స్వధర్మాన్ని ఆచరించే రాజు ప్రవర్తనను ప్రజలు అనుసరిస్తారు. కాని రాజు అధర్మం ఆచరిస్తుంటే తనవారు కూడా సహింపరు. శాస్త్ర లక్షణాలు లేని రాజు సాహసం చేసి, ఏమాత్రం అతిగా ప్రవర్తించినా ఆ రాజు వెంటనే నశించిపోతాడు. ఆపన్నులకు, ఇతరులకు తగినట్లు రాజు పూర్వాచరిత మైనట్లు నడచుకోకపోతే అతడు క్షత్రియ ధర్మం నుండి తొలగిపోయినట్లే. ఉపకారం చేసినవాడు శత్రువుగా యుద్ధంలో చేతికి చిక్కినపుడు, ద్వేషంతో అతనిని అవమానించేవాడు క్షత్రధర్మం నుండి తొలగినవాడే. సమర్థుడైన రాజు చక్కగా సుఖాలను అనుభవిస్తూ, ఆపదలలో తగిన నివారణ చర్యలను చేపట్టాలి. అటువంటి వాడు ప్రజలకు ప్రీతిపాత్రు డవుతాడు. అతని సంపదలు నశించవు. రాజు ఎవరికైనా అప్రియం కలిగించినపుడు తిరిగి అతనికి ప్రియం చేయాలి. అతడు త్వరలోనే ఇతనికి ఇష్టుడై ప్రియం ఆచరిస్తాడు. అసత్యమాడకూడదు. అడుగకపోయినా ప్రియం చేయాలి. ఏ కోరికవలన గాని, క్రోధంవలన గాని, ద్వేషంవలన గాని ధర్మాన్ని విడిచిపెట్టకూడదు.

బుద్ధిమంతుడయిన రాజు ఋజువర్తనుడై ఉండాలి. సత్యాన్ని విడువరాదు. ప్రజలకు మేలు కలిగించే దమం, ధర్మం, శీలమే క్షత్రియధర్మం.

సమాధానం చెప్పడానికి సంకోచించకూడదు. బాగా ఆలోచించకుండా మాట్లాడకూడదు. తొందరపాటు కూడదు. ఎవరినీ నిందించరాదు. అలా ఉన్నప్పుడే శత్రువు వశ మవుతాడు. ప్రియం కలిగినపుడు ఎక్కువగా పొంగిపోకూడదు. అప్రియం కలిగినపుడు బాధపడకూడదు. ఆర్థికమైన ఇబ్బందులు వచ్చినపుడు ప్రజలమేలును దృష్టిలో ఉంచుకొని ఏ మాత్రం బాధపడకూడదు. గుణవంతుడైన రాజు నిత్యమూ అందరికీ ప్రియాన్నే చేస్తున్నట్లయితే, అతని కార్యాలన్నీ సఫలం అవుతాయి. అతనికి సంపదలు ఎప్పుడూ దూరంకావు. ప్రియమైన పనులే చేస్తూ, ప్రతికూల కార్యాలు చేయనట్టి, భక్తుడైన సేవకుని రాజు ఎల్లప్పుడూ జాత్రగా కనిపెట్టి చూడాలి. ఇంద్రియ నిగ్రహం కలిగి, అత్యంతమూ అనుకూలుడై; పవిత్రమైన ఆచార విచారాలు కలిగి, సమర్థుడై; అనురక్తుడైన వానినే మహత్కార్యాలలో నియోగించాలి. ఈ పైన చెప్పిన గుణాలు అన్నీ కలిగి, రాజును

సంతోష పెట్టేవాడు, స్వామికార్యం నేరవేర్చడంలో అప్రమత్తుడై ఉండే వానినే ధనసంబంధమైన కార్యాలలో నియోగించాలి. మూఢుడు, ఇంద్రియలోలుడు, నింద్యమైన ప్రవర్తన కలవాడు, శఠుడు, కపటి, క్రూరుడు, దుర్బుద్ధి కలవాడు, ఎక్కువగా శాస్త్రజ్ఞానం లేనివాడు. ఉదాత్తుడు కానివాడు, మద్యపానాసక్తుడు, జూదం, వెలది, వేటలయందు ఆసక్తి కలవాడు, అయిన వానిని మహత్కార్యాలలో నియోగించిన రాజు యొక్క సంపద తరిగిపోతుంది. తన్ను తాను రక్షించుకొంటూ, రక్షించదగినట్టి ఇతరులను కూడా రక్షిస్తూ ఉండే రాజుయొక్క రాజ్యంలోని ప్రజలు తప్పక వృద్ధి చెందుతారు. అతడు కూడా మహాఫలాలు పొందుతాడు. పెద్దగా పేరు గడించని మిత్రులద్వారా సమస్త రాజుల యొక్క వ్యవహారాలను తెలుసుకొంటూ ఉండే రాజు సర్వ శ్రేష్ఠుడు అవుతున్నాడు. బలవంతుడైన శత్రువునకు అపకారం చేసి, దూరంగా ఉన్నామని ఊరట పొందకూడదు. ఎందుకంటే ఏమరుపాటుగా ఉన్నపుడే వారు గద్దలా వచ్చిపడతారు. గట్టి పునాది కలిగి, దుష్టులను దూరంగా ఉంచిన రాజు తన బలం గుర్తించుకొని, తన కంటె బలహీనులైన వారి మీద దండెత్తాలి గాని, బలవంతులపై దండెత్తరాదు. ధర్మపరాయణుడైన రాజు పరాక్రమంలో మహారాజ్యాన్ని పొంది ప్రజలను ధర్మంగా పరిపాలించాలి, యుద్ధంలో శత్రుసంహారం చేయాలి.

ఈ జగత్తులో సర్వం నశించిపోయేదే. ఇక్కడ రోగం లేనిది కాని, శాశ్వతమైనది కాని ఏదీ లేదు. కనుక రాజు ధర్మాన్ని ఆచరిస్తూ, ధర్మబద్ధంగా ప్రజలను పరిపాలించాలి. రక్షణస్థావరాలైన దుర్గాలు, యుద్ధం, ధర్మ బద్ధమైన పరిపాలన, మంత్రాలోచన, సమయానుసారంగా సుఖం కల్పించడం – ఈ ఐదింటితో రాజ్యం వృద్ధిపొందుతుంది. ఈ పై చెప్పినవన్ని గుప్తంగా (సురక్షితంగా) ఉన్న రాజు సర్వోత్తముడు. వీనిని ఎల్లప్పుడూ పాటించే రాజు రాజ్యభారాన్ని వహించగలడు. ఎల్లప్పుడూ ఈ అన్నిటినీ ఒక్కడే పర్యవేక్షించుకోవడం సాధ్యంకాదు. కాబట్టి తగిన వారియందు అన్నిటినీ అప్పగించి, రాజు రాజ్యాన్ని అనుభవిస్తాడు. చక్కగా పంపకాలు చేయగలిగి దానశీలియై, మృదు స్వభావంతో, చక్కని నడత కలిగి, మనుష్యులను ఎన్నడూ వదిలిపెట్టని వానినే ప్రజలు రాజుగా ఎన్నుకొంటారు. మంగళప్రదమైన ఉపదేశం విని, తన అభిప్రాయాన్ని విడిచిపెట్టి, ఆ జ్ఞానాన్ని స్వీకరించినవానిని లోకం అనుసరిస్తుంది. తన ప్రయోజనం కోరుకొనే వానియొక్క మాటలను ప్రాతికూల్యంతో వినక, ఎప్పుడూ విమనస్కునివలె ప్రతికూలమైన మాటలనే వినేవాడు; శిష్టుల యొక్క నడతను ఎన్నడూ అనుసరించనివాడు; ఓడిపోయినవారు, గెలిచినవారు తమ ఆచారాలను పాటించకుండా అడ్డుకొనేవాడు క్షత్రియ ధర్మాన్నుండి తొలగినవాడే. ఇదివరలో ఎన్నడయినా

తాను బంధించిన మంత్రి నుండి, విశేషించి స్త్రీల నుండి, ఎగుడుదిగుడు పర్వతాలు, దుర్గాల నుండి, ఏనుగు, గుఱ్ఱం, పాము - వీటి నుండి రాజు సదా జాగరూకుడై తన్ను తాను రక్షించుకొంటూ ఉండాలి. ముఖ్యులైన అమాత్యులను విడిచి, హీనశ్రేణికి చెందిన వారిని తనకు ఇష్టులుగా చేసుకొంటే, రాజు సంకటస్థితిలో పడి, ఆశ్రయం లేనివాడు అవుతాడు.

మంచిగుణాలు కలిగిన జ్ఞాతులను ద్వేషభావంతో గౌరవించనివాడు, దృఢచిత్తం లేనివాడు, స్థిరమైనకోపం గలిగినవాడు అయిన రాజు మరణానికి చేరువగా ఉంటాడు. కాని గుణసంపన్నులైన వారు తన మనసునకు నచ్చకపోయినా, ప్రియంతో వారిని వశులుగా చేసుకొన్న రాజు చిరకాలం కీర్తి పొందుతాడు. రాజు అకాలంలో పన్నుల ద్వారా డబ్బు కూడ బెట్టాలని కోరుకోకూడదు. అప్రియం జరిగినపుడు కుమిలి పోకూడదు. ప్రియం జరిగినపుడు అతిగా సంతోషించకూడదు. ఆరోగ్య విధులను పాటించాలి. తన చుట్టూ ఉన్నవారిలో ఎవరు తనయందు అనురక్తులో, ఎవరు భయంచేత తన్ను ఆశ్రయించి ఉన్నారో, ఎవరు తటస్థులో, ఎవరు దోషులో అని నిత్యమూ ఆలోచిస్తూ జాగ్రత్తగా ఉండాలి. రాజు బలవంతుడయినా దుర్బలుని నమ్మరాదు. వారు ఏమరుపాటుగా ఉన్నపుడు గద్దవలె మీదపడతారు. సర్వగుణ సంపన్నుడై, చక్కగా ప్రియంగా మాటలాడే రాజు పట్లకూడా ద్రోహం తలపెట్టే పాపాత్ములు ఉంటారు. అటువంటి వారిని ఎప్పుడూ విశ్వసించకూడదు. నహుషపుత్రుడైన యయాతి మహారాజు మానవుల నిమిత్తం ఈ రాజోపనిషత్తును చెప్పియున్నాడు. దీనిని నమ్మి ఆచరించినవాడు గొప్ప గొప్ప శత్రువులనుకూడా సంహరించగలడు.'

94. వామదేవ గీత - 3.

వామదేవుడు చెపుతున్నాడు. 'యుద్ధం లేకుండానే రాజు విజయాలను వృద్ధి చేసుకోవాలి. యుద్ధంవలన కలిగే విజయం అధమమైనదని చెపుతారు. మూలం దృఢంగా లేనపుడు రాజు అలభ్యమైన దానిని ఆశించకూడదు. (ఇతర దేశాలను ఆక్రమించుకోవాలని అనుకోకూడదు). దుర్బలమైన మూలం కల రాజుకు లాభం చేకూరదు కదా ! సమృద్ధమై, ధనధాన్యాలలో నిండిఉన్న దేశం, రాజు పట్ల ఇష్టంగా మెలిగే జనులు, తుష్టి-పుష్టి కల మంత్రులు - ఇవి కలిగిన రాజు దృఢమైన మూలం కలవాడు అవుతాడు. వీరులు మిక్కిలి సంతుష్టులై, రాజుచేత సాంత్వన పొందినవారై, శత్రువులను మోసగించడంలో

ఆరితేరినవారు అయితే అల్పబలం కలిగినా రాజు విజయం పొందుతాడు.

శత్రుసైన్యం బలంగా ఉన్నచోట సామనీతిని ప్రయోగించాలి. అది కుదరకపోతే దాననీతిని ప్రయోగించాలి. అదికూడా సామపూర్వకమై, శత్రుభేద మూలకమైతే ప్రశస్తమవుతుంది. సామదాన భేదాలు మూడూ విఫలమయితే శత్రురాజు యొక్క బలహీనతను తెలుసుకొని రాజు మరో ఆలోచన లేకుండా దండనీతిని ప్రయోగించాలి.

నగర వాసులు, పల్లెవాసులు ప్రాణులపట్ల దయ గలిగి, ధనధాన్య సంపన్నులు అయితే ఆ రాజు దృఢమైన మూలం కలవాడు అవుతాడు.

ఈ ప్రజలలో రాజ్యానికి మేలు చేసేవారూ ఉంటారు. విరోధులూ ఉంటారు. దుర్వినీతులూ, వినయ సంపన్నులూ కూడా ఉంటారు. ప్రయత్నపూర్వకంగా అందరినీ వశపరుచుకోవాలి. చండాల మ్లేచ్ఛ జాతులవారు, పాషండులు, విపరీతకర్మలు చేసేవారు, బలవంతులు, సర్వాశ్రమ వాసులు, గాయకులు, నర్తకులు-వీరందరినీ ప్రయత్న పూర్వకంగా వశపరుచుకోవాలి. ధాన్య వృద్ధికి కారకులై, రాబడి పెంచడంలో సహాయకులైన వీరు ఏ రాజు యొక్క రాజ్యంలో ఉంటారో అతడు దృఢమైన మూలం కలవాడవుతాడు.

బుద్ధిశాలి అయిన రాజు తన పరాక్రమాన్ని చాటడానికి తగినకాలం అని తలచినప్పుడు శత్రురాజుల రాజ్యాన్ని, ధనాన్ని సంగ్రహించడానికి పూనుకోవాలి. భోగభాగ్యాలు దినదినాభివృద్ధి చెందగా, ప్రాణుల పట్లదయ కలిగిఉంటూ, కార్య సాధనలో వేగం కలిగి, తన్ను తాను రక్షించుకొనే రాజు యొక్క రాజ్యం ఉత్తరోత్తరాభివృద్ధి చెందుతుంది. చక్కని ప్రవర్తనకల స్వజనులపట్ల మిథ్యావ్యవహారం చేసే రాజు గొడ్డలితో అడవిని నరికినట్లు తనప్రవర్తనతో తన్నుతాను నరుకుకొంటాడు. తన్ను ద్వేషించేవారిని ఎన్నడూ దండించని రాజును ద్వేషించేవారు కూడా తక్కువగా ఉండరు. కోపాన్ని అదుపులో పెట్టుకోగలిగిన వానికి మాత్రం శత్రువు లంటూ ఎవరూ ఉండరు. తెలివైన రాజు ఆర్యజనులు ద్వేషించే పనిని ఎన్నడూ చేయకూడదు. అందరికీ శుభాన్ని కాంక్షిస్తూ, అందుకొరకే తన్ను తాను నియోగించుకోవాలి. తన కర్తవ్యాన్ని పూర్తి చేసిన తరువాతనే సుఖాలను అనుభవించే రాజును ఇతరులు పరాభవించరు. తానుకూడా పరితాపం పొందడు. ప్రజలపట్ల ఈ రీతిగా నడుచుకొనే రాజు ఇహపరలోకాలను రెండింటినీ జయించి విజయాలను స్థిరంగా పొందుతాడు.' భీష్ముడు చెపుతున్నాడు. 'వామదేవుడు చెప్పిన రీతిగా రాజు వసుమనుడు అన్నిటినీ పాటించాడు. నీవు కూడా అదే రీతిగా పాటించితే ఈ రెండు లోకాలను జయిస్తావు. ఇందుకు సందేహం లేదు.'

95. విజిగీషమాణ వృత్తము - 1.

యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు. 'యుద్ధంలో ఒక రాజు మఱియొక రాజును జయించాలని అనుకొన్నప్పుడు అతడు ఎలాంటి ధర్మాన్ని పాటించాలి ? ఇది నాకు కలిగిన సందేహం. అడుగుతున్నాను. నాకు సమాధానం చెప్పండి.' భీష్ముడు చెపుతున్నాడు. 'రాజు మొదట తాను జయించదలచుకొన్న రాజ్యానికి వెళ్లి అచటి ప్రజలతో "నేను మీకు రాజును. మిమ్మల్ని ఎల్లప్పుడూ రక్షిస్తాను. నాకు ధర్మబద్ధమైన కప్పం కట్టండి. లేదా నాతో యుద్ధం చేయండి". అని అడగాలి. వారు కనుక అతనిని సమీపించి, తమకు రాజుగా ఎన్నుకొంటే అందరికీ క్షేమం. రాజా ! వారు క్షత్రియులుగా కాక ఏరీతిగానయినా విరోధించినట్లయితే, వర్ణధర్మాన్ని పాటించని వారిని అన్ని ఉపాయాలతోను నిగ్రహించాలి. అచ్చటి క్షత్రియులు ఆయుధం పట్టకపోయినా, తమ్ము రక్షించుకోవడానికి తాము అత్యంతమూ అసమర్థులమని భావించినా, క్షత్రియేతరులు ఆయుధాన్ని పట్ట గలుగుతారు.' యుధిష్ఠిరుడు ఇలా ప్రశ్నించాడు. 'పితామహా ! ఒక రాజు మరియొక రాజుపై దండెత్తినపుడు, అతడు ఎలా యుద్ధం చేయాలి ? అది నాకు చెప్పండి.' భీష్ముడు చెపుతున్నాడు. 'క్షత్రియుడు యుద్ధంలో కవచం ధరించని వానితో పోరాడరాదు. ఒక వీరుడు మఱియొక వీరునితో 'నీవు నా మీద ఆయుధం ప్రయోగించు. నేను కూడా ప్రయోగిస్తాను.' అని చెప్పాలి. అతడు సన్నద్ధుడై వస్తే, సన్నద్ధుడు కావాలి. అతడు ససైన్యంగా వస్తే, ససైన్యంగానే ఆహ్వానించాలి. అతడు మోసంతో యుద్ధం చేస్తే మోసంతోనే ప్రతిఘటించాలి. అలా కాక ధర్మంగా యుద్ధం చేస్తే ధర్మంగానే ఎదుర్కోవాలి. అశ్వికుడు రథకునిపై దాడి చేయకూడదు. రథికుడు రథికునిపైనే దాడి చేయాలి. శత్రువు సంకటస్థితిలో ఉన్నపుడు, భయపడినపుడు, పరాజితు డైనపుడు ప్రహరించకూడదు. విషలిప్తమైన, కర్ణి అనే బాణాలను యుద్ధంలో ఉపయోగించకూడదు. ఇవి దుష్టులు వాడే ఆయుధాలు. చంపగోరిన వారితో యథార్థమైన యుద్ధం చేయాలి గాని, వారిపై కోపంతో చంపకూడదు.

సత్పురుషులమధ్య విభేదం కలిగి, అతడు వ్యాకులంగా ఉన్నప్పుడు, ప్రాణం లేనివాని మీదా ఆయుధం ఎత్తరాదు. సంతానం లేనివానిని కూడా చంపకూడదు. ఆయుధం విరిగిపోయిన వానిని, ఆపదలో ఉన్న వానిని, వింటినారి తెగిపోయిన వానిని, వాహనాలు చనిపోయిన వానిని, గాయపడి చికిత్స పొందదగినవానిని, తన రాజ్యాన్ని గాని, ఇంటిని గాని చేరిన వానిని చంపకూడదు. 'గాయాలు తగ్గిన వానిని మాత్రం విడిచి పెట్టాలి. ఇది సనాతన ధర్మం. కాబట్టి ధర్మబద్ధంగా యుద్ధం చేయాలి.' అని

స్వాయంభువమనువు చెప్పాడు. సద్ధర్మం సత్పురుషులయందే సదా నిలిచి ఉంటుంది. దానిని పాటించాలి, నాశనం చేయకూడదు. ధర్మయుద్ధంలో అధర్మంగా గెలిచిన రాజు మోసపు బ్రతుకుతో పాపాత్ముడై తన్ను తాను నాశనం చేసుకొంటాడు. అది అసాధువుల పని. అసాధువులను కూడా సాధుమార్గంలోనే జయించాలి. ధర్మయుద్ధంలో చనిపోయినా మంచిదే. కాని పాపకార్యంతో జయం పొందకూడదు. రాజా ! భూమిలో నాటిన విత్తు వెంటనే ఫలించదు. అలాగే అధర్మవర్తనమూ వెంటనే ఫలించదు. అది ఫలించే సమయానికి మూలంలో, శాఖలతో సహితంగా కాల్చివేస్తుంది. పాపాత్ముడు పాపకర్మలచేత ధనాన్ని సంపాదించి ఆనందం పొందుతూ ఉంటాడు. అతడు దొంగతనంతో వృద్ధిపొందే ఆ పాపంలోనే ఆసక్తి కలిగి ఉంటాడు. అతడు ధర్మమే లేదని తలుస్తూ సత్పురుషులను పరిహసిస్తూ ఉంటాడు. ధర్మం పట్ల శ్రద్ధ ఉండదు. పాపం వలన వినాశం పొందుతాడు. వరుణుని పాశాలకు కట్టుబడిపోతాడు. అయినా తన్ను తాను అజరామరుడ నని భావిస్తాడు. పాపాత్ముడు గాలితో నింపిన బుడగవలె ఉబ్బిపోతూంటాడు. సత్కార్యాలు ఏ మాత్రం చేయడు. చివరికి నదీతీరంలోని చెట్టు వేళ్లతో సహా పెకలింపబడినట్లు నాశన మవుతాడు. రాతిమీద కొట్టిన కుండవలె చితికిపోతాడు. అతనిని అందరూ నిందిస్తారు. కాబట్టి రాజు ధర్మబద్ధంగానే ధనాన్ని, విజయాన్ని సాధించాలి.

96. రాజు యొక్క ధర్మబద్ధ ప్రవర్తన - విజిగీషమాణవృత్తము-2.

భీష్ముడు చెపుతున్నాడు. 'రాజు ఎప్పుడూ అధర్మంగా భూమిని జయించాలని కోరుకోకూడదు. అధర్మంగా విజయం పొందిన ఏ రాజు గౌరవింపబడతాడు ? అధర్మంతో కూడిన విజయం అస్థిరమైనది. స్వర్గ హేతువు కాజాలదు. అది రాజును, రాజ్యాన్ని కూడా నశింపచేస్తుంది. కవచం తుత్తునియలు అయిన వానిని గాని, "నేను నీవాడిని" అని పలికిన వానిని గాని, చేతులు జోడించిన వానిని గాని, ఆయుధం వదిలిన వానిని గాని యుద్ధంలో బంధించి, హింసించకూడదు. సైన్యంచేత పరాజితుడైన వానితో రాజు యుద్ధం చేయరాదు. అతనికి ఏడాదిపాటు అనుకూలంగా మారేలా శిక్ష విధించాలి. తరువాత అతనికి కొత్త జన్మ లభిస్తుంది. (అతడు గెలుపొందిన రాజుకు కొడుకుతో సమానం. కనుక అతనిని వదిలివేయాలి). పరాక్రమం చేత పట్టుకొన్న కన్యను ఏడాది వరకు ప్రశ్నించకూడదు. (తదుపరి అడిగి ఆమె ఎవరినైనా వరిస్తే త్రిప్పిపంపాలి.) అలాగే తొందరపడి అపహరించి తెచ్చిన ఇతరుల ధనం కూడా. (ఏడాది తరువాత సొంతదారునికి అప్పగించాలి.)

వధ్యులైన చోరులు మొదలగు వారి ధనాన్ని రాజు తన దగ్గర ఉంచుకోకూడదు. గోవులు అయితే పాలను బ్రాహ్మణులే త్రాగాలి. ఎడ్లు అయితే వారే కాడికి కట్టుకోవాలి. లేదా అసలు వ్యక్తులు వస్తే క్షమించి వారికి ఇచ్చివేయాలి. రాజు రాజుతోనే యుద్ధం చేయాలి. ధర్మం అలాగే ఉంది. రాజులు కాని వారెవరూ రాజుపై ఏరీతిగానూ ఆయుధాలు ప్రయోగించకూడదు. రెండు సైన్యాలు తలపడినపుడు, వారి మధ్యకు సంధి చేయగోరి బ్రాహ్మణుడు వచ్చినట్లయితే ఇరుపక్షాల వారూ కూడా వెంటనే యుద్ధం ఆపివేయాలి. ఏ పక్షం వారయినా బ్రాహ్మణుని తిరస్కరించినట్లయితే వారు శాశ్వతమైన మర్యాదను ఉల్లంఘించినట్లే. నీచులైన క్షత్రియులు అలా ఉల్లంఘించినపుడు, అటు తరువాత వారిని క్షత్రియులుగా లెక్కించకూడదు. సభలలో వారికి స్థానం కల్పించకూడదు. ధర్మాన్ని లుప్తం చేసి, మర్యాదను ఉల్లంఘించి ఎవరయినా విజయాన్ని పొందితే, విజయాకాంక్షి అయిన రాజు అతని నడతను అనుసరించకూడదు. ధర్మలబ్ధమైన విజయంకంటె అధికమైన లాభం ఏముంటుంది ? విజయుడైన రాజు మంచిమాటలు చెప్పి, ఉపభోగ్య వస్తువులు ఇచ్చి, అనార్యులను వెంటనే శీఘ్రంగా ప్రసన్నం చేసుకోవాలి. ఇది అత్యుత్తమ రాజనీతి.

అలాకాక, అనుచితమైన కఠోరశాసనం సాగించినట్లయితే, దుఃఖితులై తమ దేశంనుండి తరలిపోతారు. ఆ రాజుకు శత్రువులై, అతని ఆపదకోసం ఎదురు చూస్తూ ఎక్కడో ఉంటారు. రాజా ! ఆ రాజు ఆపదలో ఉన్నపుడు, అతని ఆపదనే కోరుకొనే వారు శత్రువులచేత అన్నిరకాలుగా సంతుష్టులై వెంటనే శత్రుపక్షాన్ని స్వీకరిస్తారు. శత్రువుపట్ల మోసం పనికిరాదు. ఏ రీతిగానూ అతనిని ఎక్కువగా హింసించకూడదు. అలా అతిగా హింసిస్తే ఎప్పుడయినా అతడు ప్రాణాలు కూడా కోల్పోవచ్చును. కొద్దిగా లాభం చేకూరినా రాజు సంతోషిస్తాడు. అటువంటివాడే పరిశుద్ధమైన జీవితాన్ని గొప్పదిగా భావిస్తాడు. సమృద్ధమై, ధనధాన్య సంపన్నమై, రాజభక్తి కలిగి ఉన్న దేశం; సంతుష్టులైన సేవకులు, మంత్రులు కలిగి ఉన్న రాజు దృఢమైన మూలం కలవాడు. బుత్విక్కులు, పురోహితులు, ఆచార్యులు, ఇతర శాస్త్రవేత్తలు ఇటువంటి పూజింపదగినవారిని పూజించే రాజును లోకజ్ఞుడంటారు. ఇటువంటి ప్రవర్తనతోనే ఇంద్రుడు రాజ్యాన్ని పొందాడు. రాజులుకూడా అలాగే ఇంద్రపదవిని దక్కించుకోవాలని కోరుకొంటారు. రాజా ! పూర్వం ప్రతర్దనుడు గొప్పయుద్ధంలో గెలుపు పొంది, భూమిని మినహాయించి, ధనాన్ని, అన్నాన్ని, ఓషధులను తన రాజధానికి తెచ్చుకొన్నాడు. దివోదాసు అగ్నిహోత్రాన్ని, అగ్నిశేషమైన హవిస్సును, భోజనాన్ని కూడా తీసుకొని వచ్చాడు. అందువల్లనే అతడు తిరస్కృతు

డయ్యాడు. భరతనందనా ! నాభాగుడు శ్రోత్రియుల, తాపసుల ధనాన్ని కాకుండా మిగిలిన దేశాల నన్నిటిని బ్రాహ్మణులకు దక్షిణగా ఇచ్చాడు. యుధిష్ఠిరా ! ప్రాచీనులైన ధర్మజ్ఞులైన రాజుల వద్దగల అనేకవిధాలైన ధనాలు, యావత్తూ నాకు మంచివనే అనిపిస్తాయి. తాను వృద్ధిలోకి రావాలని కోరుకొనే రాజు సమస్తవిద్యలలో ఆరితేరడం ద్వారా జయం పొందాలే కాని, మాయతోను, దంభం తోను కాదు.'

97. విజిగీషమాణవృత్తము - 3.

యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు. 'క్షత్రధర్మం కంటె పాపాత్మకమైన ధర్మం వేరొకటి లేదు. నరాధిపా ! రాజు దండెత్తి యుద్ధం చేయడం ద్వారా మహాజనాలను చంపుతున్నాడు. భరతశ్రేష్ఠా ! విద్వాంసుడా ! ఏ కర్మలు చేస్తే రాజు పుణ్యలోకాలను పొందుతాడో తెలుసుకో గోరుతున్నాను చెప్పండి.' భీష్ముడు చెపుతున్నాడు. 'పాపులను శిక్షించడం, సజ్జనులను చేరదీయడం ద్వారా, యజ్ఞాలు, దానాలు చేయడంవలన రాజులు పాపవిముక్తులై నిర్మలులు, పరిశుద్ధులు అవుతారు. విజయం పొందడంకోసం ప్రజలను కష్టపెట్టిన రాజే, ఆ విజయం పొందాక తిరిగి వారిని ఉన్నతికి తెస్తాడు. దానాలు, యజ్ఞాలు, తపస్సు చేసిన ప్రభావం వలన పాపాలన్నీ తొలగిపోతాయి. ప్రాణులను అనుగ్రహించడం కోసం వారి పుణ్యాలు వృద్ధి చెందుతాయి. పొలంలో కలుపు తీసే రైతు కలుపు తీస్తూ ఉండగా, వరిమొక్కలు, గడ్డి కూడా పోతుంది. కాని ధాన్యం మాత్రం నశించదు. (పైగా కలుపుతీశాక ఏపుగా పెరుగుతుంది.) అలాగే రాజు ఆయుధాలను ప్రయోగించి చంపదగిన శత్రువులను అనేక రకాలుగా చంపుతాడు. కాని యుద్ధానంతరం ప్రజలు తిరిగి వృద్ధిలోనికి రావడమే అతని ఆ పాపానికి సంపూర్ణ నిష్కృతి. ధనక్షయం, హత్య, సంకటస్థితుల నుండి ప్రజలను రక్షిస్తూ, బందిపోటుల బారిపడకుండా ప్రాణదానం చేసే రాజు ధనాన్ని, సుఖాన్ని ఇచ్చే దేవుడే అవుతాడు. అన్ని యజ్ఞాలు చేస్తూ భగవంతుని ఆరాధించేరాజు; ప్రజలకు అభయాన్ని ఇచ్చి, దానాలు చేసే రాజు ఈ లోకంలో సుఖాలు అనుభవించి, పరలోకంలో ఇంద్రుని స్వర్గాన్ని పొందుతాడు. బ్రాహ్మణులను రక్షించవలసిన అవసరం కలిగినపుడు శత్రువులను చేరి తన్నుతాను యూపస్తంభంలా సమర్పించుకొని, యుద్ధం చేసిన రాజుకు అదే అనంత దక్షిణలతో కూడిన యజ్ఞం అవుతుంది. నిర్భయుడై శత్రువుల మీద బాణాలు విసురుతూ, బాణపు దెబ్బలను స్వీకరిస్తూ ఉండే రాజుకు ఈ భూమిపై ఇంతకంటె శ్రేయస్సు ఏదీ లేదని దేవతలందరూ పరికిస్తూ ఉంటారు. యుద్ధంలో

ఎన్ని శస్త్రాలు అతని శరీరాన్ని చీల్చివేస్తాయో, అక్షయ లోకాలను అన్నిటిని అతడు పొందగలుగుతాడు. అవి కోరికల నన్నింటినీ తీరుస్తాయి.

యుద్ధంలో శరీరం నుండి స్రవించే రక్తంతోటే అతడు అన్ని పాపాలనుండి విముక్తు డవుతాడు. యుద్ధంలో క్షత్రియుడు బాధపడుతూ సహించే దుఃఖాలతోనే అతని తపస్సు వృద్ధి చెందుతుందని ధర్మవేత్తలు అంటూ ఉంటారు. అధర్మపరులు భీరువులై యుద్ధంలో వెనుకడుగు వేసి, మేఘం నుండి ఆశించినట్లుగా శూరులవలన శరణుకోరి ప్రాణాలను రక్షించుకొంటారు. నిర్భయంగా ఉండే కాలంలోవలె అతనిని క్షేమంగా రక్షించినట్లయితే, అటువంటి శూరునికి ఆ భీరువు తనకు తగిన ఉపకారం చేస్తాడు. అలా అతడు చేయకపోయినా, అతని పుణ్యం అతనికి ఉంటుంది. రక్షించబడిన వారు కృతజ్ఞులై ఎల్లప్పుడూ అతనికి నమస్కరించి నట్లయితే యుక్తంగాను, న్యాయంగాను ఉంటుంది. అలా జరగకపోతే వారి స్థితి అందుకు వ్యతిరేకంగానే ఉంటుంది. పురుషులందరూ, ఒక్కలాగే ఉన్నా చాలా అంతరం వారిలో కనిపిస్తుంది. గొప్పదైన యుద్ధంలో సైన్యం పరస్పరం తలపడినపుడు ఆ అంతరం తెలుస్తుంది. వీరులు ముందుకు దూకుతారు. వీరుడు శత్రువులకు ఎదురొడ్డి నిలుస్తాడు. భీరువు పలాయనం చిత్తగిస్తాడు. అతడు స్వర్గానికి వెళ్లే దారిని పొందికూడా సంకటస్థితిలో సహాయకులను దేహాన్ని వదిలి వేస్తాడు. యుద్ధంలో సహాయకులను విడిచివేసి, క్షేమంగా ఇంటికి చేరుకొనే అధమ పురుషులను నీవు సృష్టించకు. అటువంటివారికి ఇంద్రాదులైన దేవతలు అమంగళాన్ని కలిగిస్తారు. సహాయకులను విడిచిపెట్టడం ద్వారా తమ ప్రాణాలను కాపాడుకోవాలని తలచే వారిని క్షత్రియులు కర్రలతో గాని, కట్టెలతో గాని చితకబాదాలి. లేదా తృణాగ్నిలో కాల్చివేయాలి. లేదా జంతువును చంపినట్లు మెడకు ఉరిబిగించి చంపాలి.

మంచం పట్టి మరణించడం క్షత్రియునికి అధర్మం. కఫమూత్రాలు విసర్జిస్తూ, దీనంగా బాధపడుతూ, శరీరం గాయపడకుండా దేహత్యాగం చేసేవారిని ప్రాచీన ధర్మవేత్తలు ప్రశంసించరు. ఎందుకంటే నాయనా ! క్షత్రియునికి ఇంటిలో మరణించడం ప్రశస్తం కాదు, వీరులైన వారికి పిరికితనం, దైన్యం అధర్మం అవుతుంది. "అయ్యో ! ఎంత దుఃఖం ? చాలా బాధగా ఉంది. ఇది నా పాప కర్మ." అని విలపిస్తూ, పాలిపోయిన ముఖంతో, దుర్గంధ శరీరంతో, మంత్రులను ఉద్దేశించి వాపోతూ ఉండడం, ఆరోగ్యంగా ఉండాలని కోరుకొంటూ, రోగబాధ భరించలేక మాటిమాటికీ చావును కోరుకోవడం స్వాభిమానం, దర్పం గల వీరునికి ఉచితం కాదు. బంధుజనులతో కలిసి, యుద్ధంలో

తీవ్రంగా పోరాడుతూ, పదునైన ఆయుధాల వలన బాధపడుతూ మరణించడమే క్షత్రియునికి తగినది. వీరుడు జయాభిలాషతో, రోషావిష్టుడై తీవ్రంగా యుద్ధం చేస్తాడు. శత్రువుల చేతిలో గాయపడిన అవయవాలను గురించి పట్టించుకోడు. అతడు యుద్ధంలో లోకులు మెచ్చుకొనే ప్రశస్తమైన మరణాన్ని పొంది, చక్కని స్వధర్మాన్ని పాటించి ఇంద్రలోకాన్ని చేరుకొంటాడు. ప్రాణాలకు ఆశపడక, యుద్ధరంగంలో నిలిచి సమస్త ఉపాయాలతో యుద్ధం చేస్తూ వెన్ను చూపని వీరుడు ఇంద్రలోకంతో సమానమైన లోకాన్ని పొందుతాడు. శత్రువుల చేత చుట్టుముట్టబడిన వీరుడు ఎక్కడ చనిపోయినా ధైన్యాన్ని పొందకపోతే, అక్షయలోకాలను పొందుతాడు.

98. ఇంద్రాంబరీష సంవాదము - 1.

యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు. పితామహా ! యుద్ధంలో వెనుతిరగకుండా పోరాడుతూ చనిపోయినవారికి ఏ లోకాలు కలుగుతాయో నాకు చెప్పండి.' భీష్ముడు చెపుతున్నాడు. 'యుధిష్ఠిరా ! దీనికి సంబంధించిన ఇంద్ర అంబరీష సంవాదమనే ప్రాచీన ఇతిహాసాన్ని చెప్తాను. నాభాగుని కొడుకైన అంబరీషుడు అత్యంత దుర్లభమైన స్వర్గాన్ని పొంది, అక్కడ దేవలోకంలో ఇంద్రునితో పాటు ఉన్న తన మంత్రిని చూశాడు. అతడు సర్వతేజోమయమైన, దివ్యమైన, శ్రేష్ఠమైన విమానాన్ని అధిరోహించి పైపైకి వెళ్తూ ఉన్నాడు. తన సేనాపతి తనకంటె పైపైకి వెళ్లడం చూసి ఉదారబుద్ధి అయిన అంబరీషుడు ఆ సుదేవుని సమృద్ధికి విస్మితుడై వాసవుని ఇలా అడిగాడు. అంబరీషుడు అడుగుతున్నాడు. 'వాసవా ! నేను సముద్రపర్యంతం గల భూమిని అంతటినీ యథావిధిగా పరిపాలించాను. ధర్మబుద్ధితో, శాస్త్రోక్తంగా చతుర్వర్ణ పరిపాలన యందు తత్పరుడనై ఉన్నాను. ఘోరమైన బ్రహ్మచర్యాన్ని అవలంబించి, గురువులు చెప్పినట్లు నడుచుకొని శుశ్రూష చేస్తూ ధర్మబద్ధంగా వేదాలు అభ్యసించాను. విశేషించి రాజశాస్త్రాన్ని నేర్చుకొన్నాను. అన్న పానాదుల చేత అతిథులను, స్వధా యజ్ఞంచేత పితరులను, స్వాధ్యాయ దీక్షలచేత ఋషులను, అత్యుత్తమ యజ్ఞాల చేత దేవతలను పూజించాను. క్షత్రధర్మాన్ని అవలంబించి శాస్త్రోక్తంగా, యథావిధిగా సైన్యం యొక్క బాగోగులు చూస్తూ, యుద్ధంలో విజయాలు పొందాను. దేవరాజా ! ఈ సుదేవుడు పూర్వం నాకు సేనాపతి, శాంతస్వభావం గల సైనికుడు. ఇతడు ఎందుకు నన్ను మించిపోయాడు ? దేవేంద్రా ! ఇతడు ముఖ్యమైన క్రతువులు ఏమీ చేయలేదు. విధిపూర్వకంగా బ్రాహ్మణులను తృప్తిపరచలేదు. అటువంటి ఇతడు ఎలా నన్ను మించి

పైకి పోతున్నాడు.

దేవతలందరకూ అతి దుర్లభమైన ఇటువంటి ఐశ్వర్యం ఇతనికి ఎలా కలిగింది ?'

ఇంద్రుడు చెపుతున్నాడు. 'రాజా ! నీవు ధర్మ పరుడవై పూర్వం భూమండలాన్నంతటినీ పాలిస్తూ ఉండగా ఇతడు చూపిన పరాక్రమం నీకు ప్రత్యక్షమే కదా ! రాజా ! శతశృంగుడనే రాక్షసుని యొక్క కుమారులు సంయముడు, వియముడు, మహాబలుడైన సుయముడు. ఆనే ముగ్గురూ రణదుర్మదులు, దుర్జయులు. వారు నీకు అపకారం చేసే శత్రువులు. వారందరినీ ఈ సుదేవుడు ఓడించాడు. నీవు దేవతలకు మేలు చేయగోరి అశ్వమేధ మహాయజ్ఞం సంకల్పించిన శుభతరుణంలో ఆ యజ్ఞానికి విఘ్నం కలిగించడానికి ఆ ముగ్గురు రాక్షసులు వచ్చారు. శతకోటి రాక్షస పరివారంతో కూడిన గొప్పసైన్యాన్ని తీసుకొనివచ్చి, వారు నీ ప్రజలందరిని బంధించారు. ప్రజలందరూ, నీ సైనికులందరూ కూడా వ్యాకులపాటు పొందారు. నీవు నీ మంత్రి మాటలు విని సేనానాయకుడైన సుదేవుని సమస్తకార్యాలనుండి తప్పించి, అధికారం నుండి తొలగించావు. మహీపతీ ! ఆ మంత్రుల యొక్క కపటపు మాటలు విని, దుర్జయులైన ఆ రాక్షసులను చంపడానికి సర్వసైన్యంతో కూడిన సుదేవుని నీవు పంపావు. రాక్షస సైన్యాన్ని జయించకుండా, తిరిగి రావద్దని, బందీలైన ప్రజలను, సైనికులను విడిపించకుండా నీవు తిరిగిరావడం సమ్మతం కాదని చెప్పావు. రాజా ! సుదేవుడు ఆ మాటలు విని బయలుదేరాడు. ప్రజలందరూ బంధింపబడిన చోటికి చేరుకొన్నాడు. మహాభయంకరమైన ఆ రాక్షస సైన్యాన్ని చూశాడు. చూసి, సేనాపతి అయిన సుదేవుడు ఇలా తలపోశాడు. ఇంద్ర సహితులైన దేవతలు గాని, రాక్షసులుగాని ఈ సైన్యాన్ని జయించలేరు. దివ్యాస్త్రబల సంపన్నుడైన అంబరీషుడు ఈ సైన్యంలోని పదహారవ వంతును కూడా నిర్జించడానికి సమర్థుడు కాడు. ఇక నా వంటివాడు ఎలా జయించగలుగుతాడు ? రాజా ! ఇలా తలపోసి, కపటులైన ఆ మంత్రులతో కూడి మీరు ఉన్నచోటికి తిరిగి ఆ సైన్యాన్ని అంతటినీ పంపివేశాడు. అనంతరం ఆ సుదేవుడు మహాదేవుడు, జగదీశ్వరుడు, శ్మశాన వాసి అయిన రుద్రుని శరణుచొచ్చి, ఆ వృషభధ్వజుని స్తోత్రం చేశాడు. ఆలా స్తోత్రం చేసి, ఆయుధం తీసుకొని తన శిరసును ఖండించుకోబోయాడు. అది చూసి దేవదేవుడు కరుణతో ఆయుధంతో ఉన్న అతని కుడి చేతిని పట్టుకొని ఇలా అన్నాడు.'

"నాయనా ! ఎందుకు ఇంతటి సాహసం చేయదలచుకొన్నావు ? చెప్పు". ఇంద్రుడు చెపుతున్నాడు. 'అప్పుడు సుదేవుడు శిరసు నేలకు వంచి మహాదేవునికి నమస్కరించి ఇలా అన్నాడు. "సురేశ్వరా ! దేవ దేవా ! ఈ రాక్షససైన్యాన్ని యుద్ధంలో జయించడానికి నేను అశక్తుడను. కనుక ప్రాణాలు వదిలేస్తున్నాను. జగన్నాథా ! మహాదేవా ! దీనుడనైన నాకు నీవే గతి. వారిని జయించకుండా నన్ను రావద్దన్నాడు రాజు. అంబరీష మహారాజు మంత్రులతో సహితంగా నాపై కోపించి ఉన్నాడు."
అధోముఖుడై నేలపై పడిఉన్న మహాత్ముడైన ఆ సుదేవుని చూసి, ప్రాణులకు మేలు చేయాలనే తలపు కలిగిన మహాదేవుడు గుణసహితంగా ఆకారంతో ఉన్న ధనుర్వేదాన్ని, రథనాగాశ్వాలతో కూడిన, దివ్యాస్త్ర సమలంకృతమైన, మహాభాగ్య సమన్వితమైన, త్రిపురాలను దహించిన రథాన్ని, పినాకమనే

ధనుస్సును, ఖడ్గాన్ని, సమస్త రాక్షసులను సంహరించిన రౌద్రాస్త్రాన్ని పిలిచి సేనాపతి అయిన సుదేవునితో ఇలా అన్నాడు. "సుదేవా ! ఈ రథం వలన నీవు సురాసురులకు కూడా దుర్జయుడ వౌతావు. మాయామోహితుడవై భూమిపై కాలు మోపకు. ఈ రథం అధిష్ఠించి దేవతలందరినీ, సర్వదానవులనూ జయించగలవు. వేయి సూర్యుల కాంతి గల ఈ రథాన్ని రాక్షసులు గాని, పిశాచులుగాని తేరి చూడలేరు. ఇక నీతో యుద్ధం ఎలా చేస్తారు ?" ఇంద్రుడు చెపుతున్నాడు. 'రాజా ! అనంతరం అతడు రాక్షసులందరినీ జయించి బందీలను విడిపించాడు. వారందరినీ చంపి, వియమునితో బాహుయుద్ధం చేస్తూ చనిపోయాడు. వియముడు కూడా అతని చేతిలో చనిపోయాడు.

నాయనా ! ఈ సుదేవుడు విస్తృతమైన మహాగొప్ప సంగ్రామ యజ్ఞాన్ని చేశాడు. ఇతరుడు ఎవరయినా సరే ఇలాగే యుద్ధం చేస్తాడు. కవచధారియై, యుద్ధ దీక్షితుడయిన ప్రతి యోధుడూ, సేనాముఖానికి వెళ్లి ఇలాగే సంగ్రామయజ్ఞానికి అధికారి అవుతాడని నా నిశ్చితాభిప్రాయం." అంబరీషుడు అడుగుతున్నాడు. 'శతక్రతూ ! ఈ యజ్ఞంలో హోమద్రవ్యా లేమిటి ? నేయి ఏది ? దక్షిణ ఏమిటి ? ఋత్విజులు ఎవరు ? నాకు చెప్పు.' ఇంద్రుడు చెపుతున్నాడు. 'ఈ యుద్ధమనే యజ్ఞంలో ఏనుగులే ఋత్విజులు, గుఱ్ఱాలు అధ్వర్యులు. శత్రుమాంసమే హోమ ద్రవ్యం. వారి రక్తమే నేయి అని చెప్తారు. నక్కలు, గద్దలు, కాకులు. ఇంకా మాంసం తినే పక్షులు ఆ యజ్ఞంలో సదస్యులు. యజ్ఞంలో మిగిలిన నేయిని (రక్తాన్ని) త్రాగుతాయి. హవిస్సును (మాంసాన్ని) భక్షిస్తాయి. ప్రాసతోమరాలు, ఖడ్గాలు, శక్తులు, పరశ్వధాలు, మిరుమిట్లు గొలిపే వాడియైన రక్తం గ్రోలిన బాణాలు ఆ యజ్ఞకర్తకు (యోధునికి) స్రుక్కులు అవుతాయి. ధనుర్వేగానికి దూరంగా పడి అతి విస్తృతమయి, వాడిగా ఉండి శత్రుశరీరాలను చీల్చే, సూటియైన, పదునైన, రక్తదాహంకల బాణాలే యజ్ఞకర్త చేతిలోని మహా స్రువాలు. పులితోలు ఒరగా కలిగి, దంతపు పిడికల, ఏనుగు తొండాలను ఖండించగల ఖడ్గమే అతనికి యుద్ధంలో యజ్ఞపాత్ర అవుతుంది.* మండుతున్న, వాడియైన, పూర్తిగా ఇనుముతో చేయబడిన, పదును గలిగిన ప్రాస, శక్తి, ఋష్టి, పరశువు లనే ఆయుధాలతో కొట్టే దెబ్బలే, కులీనుడు సంగ్రహించిన, బహు సంఖ్యాకమైన, సమయ సాధ్యమైన నానా ద్రవ్యాలు అవుతాయి. యుద్ధ భూమిలో వీరుల శరీరాల నుండి మహావేగంగా స్రవించే రక్తధారలే ఆ యుద్ధయజ్ఞంలో అన్ని కోరికలను ఈడేర్చే సమృద్ధమైన పూర్ణాహుతి అవుతుంది. సేనా ముఖంలో వినబడే 'కొట్టండి, చీల్చండి' అనే మాటలే సామగానం. సైనికులు సామగాయకులై శత్రువులను

* స్రుగ్ = కత్తివంటి యజ్ఞపాత్ర.

యమలోకం పంపడానికి సామలను గానం చేస్తున్నారనిపిస్తుంది. శత్రుసేనా ముఖమే అతనికి హవిస్సును ఉంచే పాత్ర (హవిర్ధానం) అవుతుంది. ఏనుగులు, గుఱ్ఱాలు, కవచధారులైన వీరులు – వీరి సమూహమే ఆ యజ్ఞంలో 'శ్యేనచితము' అనే పేరుగల అగ్ని అవుతుంది. వేలాదిగా వీరులు చనిపోయినపుడు నిటారుగా ఉన్న వారి కబంధాలే ఆ వీరుని రణయజ్ఞంలో ఖాదిరకాష్ఠంతో చేయబడిన ఎనిమిది కోణాలుగల యూప స్తంభమవుతుంది. రాజా ! నోటి ద్వారా చేసే హెచ్చరికలతో, అంకుశపుపోటులతో ఏనుగులు ఘీంకారాలు చేస్తూ ఉంటాయి. ఆ ఏనుగుల ఘీంకారనాదాలే యజ్ఞంలోని వషట్కారాలు. నరేశ్వరా ! దుందుభి నాదాలే సామవేదంలోని మూడు మంత్రాలను పఠించే ఉద్గాతలు.

బ్రాహ్మణుని సొత్తు దొంగిలింపబడినపుడు వీరుడైనవాడు యుద్ధంలో తన కిష్టమైన శరీరాన్ని విడిచిపెట్టడానికి సిద్ధమై, దానిని యూపస్తంభంగా ఉత్సర్జనం చేసి పోరాటం కొనసాగిస్తాడు. అది అనంతమైన దక్షిణలతో కూడిన యజ్ఞం అనిపించుకొంటుంది. ప్రభువుకోసం సేనాముఖంలో నిలబడి పరాక్రమం చూపే వీరుడు, భయంతో వెన్నుచూపకుండా ఉంటే అతనికి నాకు ప్రాప్తించిన లోకాలే దక్కుతాయి. నల్లనితోలు ఒరలలో గల ఖడ్గాలతో, పరిఘలవంటి బాహువులతో రణయజ్ఞం చేసే వీరునికి నాకు లభించినటువంటి లోకాలే లభిస్తాయి. ఎవరి సహాయాన్నీ కోరకుండా, విజయంకోసం శత్రుసేనామధ్యంలోనికి చొరబడిన వానికి నాకు లభించిన లోకాలే లభిస్తాయి. సంగ్రామ యజ్ఞం ఒక నది వంటిది. అది యోధునికి రక్తరూపమైన అవభృథస్నానం వలన కలిగే పుణ్యఫలాన్ని ఇస్తుంది. ఆ నదిలో రక్తమే జలం. భేరులే కప్పలు, తాబేళ్లు. వీరుల ఎముకలే గులకరాళ్లు. అది రక్తమాంసాలనే బురదతో నిండి దుర్గమంగా ఉంటుంది. కత్తులు, డాళ్లు పడవలు. ఆ ఘోరమైన నది వెండ్రుకలు అనే నాచుతో, గడ్డితో కప్పబడి ఉంటుంది. నరకబడిన గుఱ్ఱాలు, ఏనుగులు, రథాలు మెట్లుగా ఉంటాయి. ధ్వజపతాకాలు నదీతీరంలోని లతలు. చనిపోయిన ఏనుగులు ఆ నదిలో కొట్టుకుపోతూ ఉంటాయి. రక్తంతో నిండుగా ఉండే ఆ నది దాటాలనుకొనే వారికి దుస్తరంగా ఉంటుంది. చనిపోయిన ఏనుగులే పెద్ద పెద్ద మొసళ్లు. పరలోకంవైపు ప్రవహించే ఆ నది అమంగళకరమైనది. ఋష్టులు, ఖడ్గాలు అనే నౌకలతో, గద్దలు, కాకులు, రాబందులు అనే పడవలతో, రాక్షసులు తిరుగుతూ ఉంటే ఆ నది పిరికివారి మనసును కలత చెందిస్తుంది. సమరయజ్ఞంలో తన వేదిక శత్రుశిరసుల చేతను, గుఱ్ఱాల, ఏనుగుల కళేబరాలతోను నిండి ఉంటే ఆ వీరునికి నాకు లభించిన లోకాలే లభిస్తాయి. శత్రుసేనాముఖాన్ని తనకు అంతఃపురంగా చేసుకొని క్రీడించేవానిని తన సేనలో

యుద్ధయజ్ఞంలోని హవనీయపదార్థాలు ఉంచే పాత్రగా చెపుతూ ఉంటారు బుద్ధిమంతులు. దక్షిణ దిశలో ఉన్న వీరులు సదస్యులుగా, ఉత్తర దిశలో ఉన్న వీరులు ఆగ్నీధ్రులుగా (ఋత్విజులుగా), శత్రుసేన భార్యగా ఉన్న యోధునికి సమస్తపుణ్య లోకాలు సమీపవర్తులే. తనసైన్యం, ఎదిరిసైన్యం వ్యూహాకారంలో ఒకదానికొకటి ఎదురుగా నిలిచినపుడు తన ఎదురుగా కనిపించే ఆకాశమే ఆ యోధునికి యజ్ఞవేదిక అవుతుంది. అక్కడ యజ్ఞం కొనసాగుతూ, త్రేతాగ్నులు ప్రతిష్ఠితాలై ఉంటాయి. యుద్ధంలో భయపడి, వెన్నుచూపి, శత్రువుల చేత సంహరింపబడిన యోధుడు ఎక్కడా నిలువక నేరుగా నరకానికి పోతాడు. ఇందులో ఏ మాత్రం సందేహం లేదు. వెండ్రుకలు, మాంసం, ఎముకలతో నిండిపోయి రక్తవేగంతో బాగా తడిసిపోయిన సంగ్రామ యజ్ఞవేదిక గల వీరుడు పరమగతిని పొందుతాడు. శత్రుసేనాపతిని సంహరించి, అతని రథాన్ని ఆరోహించిన వీరుడు విష్ణువువంటి పరాక్రమం కలవాడుగా, బృహస్పతి వంటి బుద్ధిశాలిగా పరిగణింపబడతాడు.

శత్రుసేనా నాయకుని గాని, అతని కుమారుని గాని, లేక అతని పక్షంలోని పేరున్నవానిని గాని ప్రాణాలతో బంధించితే ఆ వీరునికి నేను పొందిన లోకాలే లభిస్తాయి. యుద్ధభూమిలో మరణించిన వీరుని గూర్చి ఏ విధంగానూ శోకించకూడదు. అటువంటి వీరుడు స్వర్గాన్ని పొందుతాడు. కనుక అతడు శోకించదగినవాడు కాడు. యుద్ధంలో మరణించిన వీరునికి మృతాశౌచ సంబంధమైన స్నానంగాని, పిండోదక ప్రదానాలుగాని చేయాలని అనుకోరు. ఆ వీరునికే ప్రాప్తించే లోకాలను గురించి చెపుతాను విను. యుద్ధంలో చనిపోయిన వీరుడు తమకే భర్త కావాలని వేలకొద్దీ వరాప్సరసలు త్వరితగతిని ఎదురుగా పరుగులు తీస్తూ వస్తారు. యుద్ధవ్రతాన్ని ఆచరించేవానికి అదే తపస్సు, పుణ్యం, సనాతన ధర్మం, చతురాశ్రమ పాలనం కూడా. యుద్ధంలో వృద్ధులను, బాలురను, స్త్రీలను చంపకూడదు. వెన్ను చూపినవానిని, గడ్డికరిచి 'నీ దాసుడను' అని పలికిన వానిని కూడా చంపకూడదు. జంభుడు, వృత్రుడు, బలుడు, పాకాసురుడు, వందల మాయలు నేర్చిన విరోచనుడు, అజేయుడైన నముచి, అనేక మాయలు తెలిసిన శంబరాసురుడు, దైత్యవంశానికి చెందిన విప్రచిత్తి, అన్నిరకాల దానవ సైన్యం, ప్రహ్లాదుడు వీరందరినీ యుద్ధంలో చంపి, ఆ పై దేవాధిపతిని అయ్యాను.' భీష్ముడు చెపుతున్నాడు. 'అని చెప్పిన ఇంద్రుని మాటలు విని, అంగీకరించి, అంబరీషుడు 'యోధులకు స్వతస్సిద్ధి లభిస్తుం'దని భావించాడు.'

99. విజిగీషమాణవృత్తము - 5.

భీష్ముడు చెపుతున్నాడు. 'ఈ సందర్భంలో ప్రాచీనమైన ప్రతర్దనునికి మిథిలాధిపతి అయిన జనకునికి జరిగిన యుద్ధాన్ని ఉదాహరిస్తారు. యుధిష్ఠిరా ! యజ్ఞోపవీతం ధరించిన మిథిలాపతి జనకుడు సంగ్రామంలో తన వీరులను ఉద్దేశించి చెప్పినది విను. మిథిలకు రాజయిన జనకుడు మహాత్ముడు, సర్వతత్త్వాలు తెలిసినవాడు. అతడు యోగబలంచేత తన వీరులకు స్వర్గనరకాలను ప్రత్యక్షంగా చూపి' ఇలా చెప్పాడు. వీరులారా ! చూడండి. ఈ ప్రకాశమానమైన లోకాలు వీరులయిన వారికే పొందదగినవి. ఇవి గంధర్వకన్యలతో నిండి ఉంటాయి. అన్ని కోరికలను తీర్చగలిగేవి. అక్షయము లైనవి. ఈ నరకాలు యుద్ధంలో పారిపోయిన వారికోసం ఉన్నవి. శాశ్వతమైన అపకీర్తి కూడా ఉంటుంది. ఇక మీరు విజయంకోసం ప్రయత్నించండి. ఈ స్వర్గనరకాలను చూశాక, ప్రాణాలకు తెగించి విజయం కోసం పోరాడండి. అప్రతిష్ఠ తెచ్చిపెట్టే నరకానికి వశులు కాకండి. "వీరులకు త్యాగం వలననే అత్యుత్తమమైన స్వర్గలోకద్వారం లభిస్తుంది." శత్రునగరాలను జయించే యుధిష్ఠిరా ! ఈ రీతిగా జనకమహారాజు చెప్పగా విన్న ఆ యోధులు తమ రాజుకు హర్షం కలిగేలా యుద్ధంలో శత్రువులను జయించారు. కాబట్టి మనస్వి అయిన యోధుడు రణాగ్రంలో నిలవాలి. గజసైన్యం మధ్యలో రథికులను, రథికులను వెన్నంటి ఆశ్వికసైన్యం, ఆశ్వికసైన్యం యొక్క మధ్యలో అస్త్రశస్త్రాలతో సన్నద్ధులైన పదాతి దళాన్ని నిలపాలి.

ఈ రీతిగా వ్యూహాన్ని పన్నిన రాజు ఎప్పుడూ శత్రువులను జయిస్తాడు. కాబట్టి యుధిష్ఠిరా ! నిత్యమూ నీవు కూడా ఇలాగే వ్యూహరచన చేయి. క్షత్రియులందరూ ఉత్తమ యుద్ధం చేసి స్వర్గాన్ని పొందాలని కోరుకొంటారు. కాబట్టి వారు కుపితులై మొసళ్లు సాగరాన్ని కలచివేసినట్లుగా సైన్యాన్ని చిందరవందర చేస్తారు. విచారగ్రస్తులైన సైనికులను పూర్వం చెప్పినట్లుగా వ్యూహాత్మకంగా నిలిపి, వారిలో ఉత్సాహాన్ని, ఆనందాన్ని రేకెత్తించాలి. జయించిన భూభాగాన్ని కాపాడాలి. యుద్ధంలో పారిపోతున్న వారిని ఎక్కువదూరం వెంటాడకూడదు. రాజా ! ప్రాణాలమీద ఆశవదులుకొని, యుద్ధభూమికి తిరిగివచ్చిన వారి యొక్క వేగం అతిదుస్సహంగా ఉంటుంది. కాబట్టి పారిపోతున్న వారిని ఎక్కువదూరం తరుమకూడదు. వీరులైన వారు పారిపోతున్నవారిపై ఎక్కువగా ఆయుధాలను ప్రయోగించడానికి ఇష్టపడరు. కాబట్టి పారిపోతున్న వారిని ఎక్కువ దూరం వెంటాడకూడదు. చరాలకు, అచరాలు; దంతాలున్న వాటికి, దంతాలు లేనివి; దాహంవేసిన వారికి నీరు ఎలా ఆహారమో, అలాగే శూరులకు పిరికివారు ఆహారం అవుతారు. వీరులకు, భీరువులకు కూడా వెన్ను,

పొట్ట, కాళ్లు, చేతులు అన్నీ సమానంగానే ఉంటాయి. కాని భీరువులు పరాభవాన్ని పొందుతారు. అందుచేత వారు భయార్తులై మాటిమాటికి కాళ్లమీద పడుతూ, చేతులు జోడించుకొని వీరులను శరణు కోరుతూ ఉంటారు. పుత్రుడు తండ్రిమీద ఆధారపడిఉన్నట్లుగా ఈ లోకమంతా వీరుల భుజస్కంధాలపై ఆధారపడిఉంది. కాబట్టి సర్వావస్థలయందు వీరులు గౌరవానికి పాత్రులు అవుతారు. ముల్లోకాలలోను శౌర్యానికి మించినది లేదు. శూరుడే సమస్తాన్ని పాలిస్తాడు. ఈ లోకమంతా అతనిమీదే ఆధారపడి ఉంది.

100. సేనానీతి కథనము.

యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు. 'భరతకులోత్తమా ! పితామహా ! విజయాభిలాషులైన రాజులు ధర్మాన్ని కొద్దిగా ఉల్లంఘించినప్పటికి, తమ సైన్యాన్ని ముందుకు నడిపిస్తారు. దానిని గురించి నాకు చెప్పు.' భీష్ముడు చెపుతున్నాడు. 'రాజా ! కొందరు సత్యంవలననే ధర్మం స్థిరంగా ఉంటుందంటారు. కొందరు యుక్తివాదంతో ధర్మం నిలబడుతుందంటారు. ఇంకకొందరు సాధువర్తన వలననే ధర్మానికి ఉనికి అంటారు. మరికొందరు సామదానాది ఉపాయాలవలన ధర్మం నిలబడుతుందని భావిస్తారు. ధర్మార్థాలలో అర్థసిద్ధికి సాధన భూతాలైన ధర్మోపాయాలను ఇప్పుడు చెపుతాను. దొంగలు, బందిపోటులు ధర్మాన్ని అతిక్రమించినపుడు, వారిని శిక్షించడానికి వేదాలలో చెప్పబడినదానిని చెపుతాను. నీవు సమస్త కార్యసిద్ధికొరకు ఆ ఉపాయాలను విను. భారతా ! బుద్ధి రెండు రకాలుగా ఉంటుంది. ఋజుబుద్ధి, వక్రబుద్ధి అని. ఈ రెండింటి గురించి రాజుకు తెలిసి ఉండాలి. సాధ్యమైనంతవరకు తెలిసి వక్రబుద్ధికి లోను కాకూడదు. ఒక వేళ స్వభావసిద్ధంగా వచ్చినా, దానిని దూరం చేసుకొనే ప్రయత్నం చేయాలి. రాజుకు శత్రువైనవాడు, అతనిని సేవిస్తూనే ఆంతరంగికులలో భేదాలు సృష్టిస్తూ ఉంటాడు. ఆ మోసాన్ని రాజు గుర్తెరిగి, శత్రువును తుదముట్టించినట్లుగానే అతనినీ నాశనం చేయాలి. పార్థా ! ఏనుగులను రక్షించడానికి ఆవుల, ఎద్దుల, కొండచిలువల చర్మాలతో కవచాలు తయారు చేయించాలి. ఇనుప ముళ్లు లోహాలతో తయారయిన కవచాలు, చామరాలు, తెల్లగా మెరుస్తూ పదునుగా ఉన్న ఆయుధాలు, ఎట్టని, పసుపు పచ్చని రంగుకల కవచాలు, అనేక రంగులతో శోభిల్లే ధ్వజాలు, పతాకాలు, ఋష్టులు, తోమరాలు, ఖడ్గాలు, వాడియైన పరశువులు, పలకలు, డాళ్లు వీనినన్నింటినీ అధికసంఖ్యలో ఉంచుకోవాలి. ఆయుధాలు సిద్ధంగా ఉండి, వీరులందరూ కృతనిశ్చయులై ఉంటే చైత్రంలో గాని, మార్గశీర్షమాసంలో గాని పూర్ణిమా తిథినాడు

సైన్యాన్ని యుద్ధానికి బయలుదేర తీయడం ప్రశస్తమైనదిగా భావిస్తారు. భారతా ! ఆ సమయంలో భూమి పంటలు పండి, జల సమృద్ధమై ఉంటుంది. కాలం అతిశీతలంగానూ ఉండదు, అతివేడిగానూ ఉండదు. కాబట్టి అప్పుడే దండయాత్రకు సిద్ధం కావాలి. లేదా శత్రువు క్లిష్టస్థితిలో ఉండగా దాడి చేయాలి. శత్రువులను బాధించటానికి సేనలో చేసే కట్టుదిట్టాలు ఇవి.

సైన్యం వెళ్లే మార్గంలో నీరూ, గడ్డీ సమృద్ధిగా ఉండాలి. వెళ్లే మార్గం సమప్రదేశం అయితే మంచిది. గూఢచారులు బాగా ఎరిగి అలవాటు పడినదీ కావాలి. సేనలు అరణ్యంలో పడి మృగాలవలె సుఖంగా పోలేవు. అందుచేత జయం కాంక్షించే రాజులు సేనలకు తగిన మార్గాలను కూర్చుకోవాలి. సేన ముందు భాగంలో కులీనులు, సమర్థులూ ఉండాలి. మధ్యలో నిలిచే చోటు నీళ్లు ఉన్నది, ఇతరులు ప్రవేశింపశక్యం కానిదీ, బయలు ప్రదేశమూ అయి ఉండాలి. అలా ఉంటే శత్రువులు చొరబడటానికి వీలుండదు. సేనలు నిలవటానికి బయలు ప్రదేశం కంటె అరణ్య సమీప ప్రదేశం మంచిదంటారు. సేనలకు దగ్గరలో యుద్ధనిపుణులు, గుణవంతుల రక్షణలో ధనాగారం ఉండాలి. రాజు ఆ ధనాగారానికి దగ్గరలో ఉండటం, కాల్బలాల రక్షణం, శత్రువుల చర్యలకు ఎదురు దెబ్బతీయటం - ఇవి ఆపద సమయాల్లో బాగా ఉపయోగిస్తాయి. సప్తర్షి మండలం వెనుక భాగాన ఉంచుకొని పర్వతంవలె నిలిచి యుద్ధం చెయ్యాలి. ఈ పద్ధతితో దుర్జయులయిన శత్రువులను కూడ జయింపగోరాలి. వాయువు వీచే దిక్కునుండి, సూర్యుడున్న దిక్కునుండి, శుక్రుడున్న దిక్కు నుండి జయం లభిస్తుంది. అన్నీ ఒకే కాలంలో ఉంటే శుక్రుని కంటె సూర్యుడు, సూర్యుని కంటె వాయువు బలీయాలు. గుర్రాలుండే చోటు బురదలేనిది, నీరు తడిలేనిది, గట్టులు లేనిది, రాళ్లు లేనిది కావాలని యుద్ధనిపుణులు చెపుతారు. రథాలుండే భూమి బురద లేకుండా గుంటలు లేకుండా ఉండాలి. ఏనుగులు, వానియోధులు ఉండే చోటు చిన్న చిన్న చెట్లు, పెద్ద పొదలు, నీరు కల ప్రదేశం అయి ఉండాలి. చాలా దుర్గాలు, పెద్ద పెద్ద పొదలు, వెదురు పొదలు కల భూమి పదాతిదళాలకు తగినది. పర్వతాలు, ఉపవనాలు కూడ మంచివి. కాల్బంటులు ఎక్కువగా ఉన్న సేన దృఢంగా ఉంటుంది. వానలేని రోజుల్లో రథాలు, గుర్రాలు కల సేన బాగా ఉపయోగిస్తుంది. కాల్బలం, ఏనుగులు కల సేన వర్షాకాలంలో బాగుంటుంది. ఈ గుణాలను, దేశ కాలాలను తెలిసికొని సేనను నడపాలి.

ఇలా చక్కగా ఆలోచించి, తిథి, నక్షత్రాలు బాగున్నపుడు రాజు సేనను

దండయాత్రకు ప్రయోగిస్తే తప్పక విజయం లభిస్తుంది. ఇందులో నిద్రించే వారిని, దప్పికతో ఉన్నవారిని, అలసిపోయిన వారిని, చెల్లాచెదరయిన వారిని బాధించరాదు. నగరాన్ని విడిచేటప్పుడూ, ప్రయాణించేటప్పుడు, భయసమయంలోను, అన్నపానాల వేళలలోనూ, బాగా నలిగిన వారిని, దెబ్బతిన్నవారిని, బక్క చిక్కినవారిని, దృఢత్వంలేని వారిని, పనిలో ఉన్నవారిని, రహస్య కృత్యాల్లో పాల్గొనే వారిని, బయటతిరిగే అల్పసేవకులను, భవన సేవకులను పీడించరాదు. అట్లే వంశపారంపర్యంగా రాజద్వారాదులలో పనిచేసే వారిని, ఇంకా ఇతర సేవలు చేసే కొన్ని వర్గాలవారిని (యుద్ధంకోసం) పీడించ కూడదు. శత్రుసేనను చీల్చి చెండాడే వారికి, చెల్లాచెదరయిన తమసేనను కూడగట్టగలవారికి, రాజు తనతో సమంగా అన్న పానాలు పెట్టాలి. రెట్టింపు వేతనం ఇవ్వాలి. పదేసి మందికి ఒకరిని, నూరుగురికి ఒకరిని, దళపతులను చేయాలి. తరువాత శూరుడై, అలసట ఎరుగని వానిని వెయ్యి మందికి అధిపతిగా నియమించాలి. యుద్ధ ముఖ్యులందరినీ ఒక చోట చేర్చి రాజు ఇలా చెప్పాలి. "యుద్ధంలో విజయం కోసం మనం ఒకరి నొకరు విడువం అని ప్రతిజ్ఞ చేస్తున్నాం. ఎవరయినా పిరికివాళ్లుంటే ఇక్కడి నుండే వెనుకకు మరలిపొండి. లేకపోతే వారు సంకుల సమరంలో నాయకుని చంపుకొంటారు. తుములమైన చోట ఇటువంటి వారు ఎవరినీ ఓడించనూ లేరు. వధింపనూ లేరు. తనను రక్షించుకొంటూ తన పక్షాన్ని చంపుకొంటాడు. పారిపోతే ధననాశం, మరణం, అపకీర్తి, ఉన్నపేరు పోవడమూ కలుగుతుంది. వీరుడు పారిపోతే మనోవ్యథ కలిగించే మాటలు పుడతాయి. మన శత్రువు సదా చీలిన పెదవులతో, దంతాలతో, వదలిన ఆయుధాలతో పగవారికి చిక్కునుగాక. యుద్ధం నుండి పారిపోయివచ్చిన వారు నరాధములు. రాశిని పెంచడానికి మాత్రం పనికి వస్తారు. వారికి ఇహమూ ఉండదు, పరమూ ఉండదు. పారిపోయే వానిని శత్రువులు సంతోషిస్తూ తరుముతారు. గెలిచిన వారిని సుగంధాలతో, అలంకారాలతో స్వాగతిస్తారు. యుద్ధంలో శత్రువులు తన కీర్తిని రూపుమాపితే అతని దుఃఖం చావు కంటె సహింపరానిదని భావిస్తాను. ధర్మానికీ, సర్వ సుఖానికీ జయమే మూలమని తెలుసుకోండి. పిరికివారి వేదనను శూరుడు లెక్కచేయడు. మనం స్వర్గాభిలాషతో యుద్ధంలో జీవితాలను వదలివేసి, గెలుపో - చావో ఏదయినా సద్గతిని పొందుతాం." ఇలా శపథాలు చేసి, బ్రతుకు మీద ఆశలు వదలి, పిరికితనం లేకుండా, వీరులు శత్రుసేనా వాహినిలో మునిగి తేలుతారు.

ముందుభాగంలో కత్తి, డాలు పట్టిన యోధుల సేన; వెనుకభాగాన రథసేన;

మధ్యలో రాజూ, అంతఃపురమూ నిలవాలి. సేనకు ముందు భాగంలో నడిచే పెద్దలు శత్రువులను ఎదురు దెబ్బతీయటానికి పదాతిదళాలను ప్రోత్సహించాలి. రాజుకు ఇష్టులై బలమూ, అభిమానమూ కలవారు వెనుకభాగాన ఉంటే వారు ముందు భాగాన ఉండాలి. ఇతరులు రాజును అనుసరించాలి. పిరికివారిని ప్రయత్నించి అయినా పురికొల్పాలి. కనీసం సముదాయాన్ని చూపటానికయినా దగ్గరగా నిలవాలి. గుమిగూడిన తన వారిని సేనాపతి శత్రువులతో పోరాడేటట్లు చెయ్యాలి. అందుచేత సైన్యాన్ని విస్తరించాలి. అల్పుల సేనను చాలా మందితో బలోపేతం చేసి, సేనను సూది మొనవలె చెయ్యాలి. తాను ఉత్కృష్ట స్థితిలో ఉన్నా, నీచస్థితిలో ఉన్నా, అది నిజమయినా అసత్యమయినా సరే ! చేతులు పైకెత్తి "శత్రులు ఓడిపోయారు. నా మిత్రబలం వచ్చింది. నిర్భయంగా బాదండి" అని అరవాలి. బలం పుంజుకొని పెద్దగా అరుస్తూ తరిమి కొట్టాలి. సింహనాదాలు, కిలకిలా రావాలు, రంపపుకోత ధ్వనులూ కొమ్ముబూరాల చప్పుళ్లు భేరులు, మద్దెలలు, పణవాలను మ్రోగించాలి.'

101. విభిన్నదేశయోధుల స్వరూపబల స్వభావాదుల వర్ణనము.

యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు. 'భరతవీరుడా ! యుద్ధరంగంలో ఎటువంటి స్వభావం, ఎటువంటి ప్రవర్తన, ఎటువంటి రూపం కలయోధులు తగినవారు ? వారి కవచాలు, అస్త్రశస్త్రాలు ఎలా ఉండాలి ?' భీష్ముడు చెపుతున్నాడు. 'అస్త్రశస్త్రాలు, వాహనాలు, యోధుల దేశాలు, వంశం - వీటి ఆచారాలకు అనుగుణంగానే ఉండాలి. వీరి పురుషులు పరంపరాగతంగా వచ్చే తమ ఆచారాలను అనుసరించియే అన్ని కర్మలను చేయాలి. గాంధార సింధుసౌవీర దేశయోధులు నఖర ప్రాసాలనే ఆయుధాలు ఉపయోగిస్తారు. వారు నిర్భయులు. మహాబల వంతులు. వారి సైన్యం మిగిలిన వారందరినీ మించి పోయేది. ఉశీనరయోధులు అన్ని ఆయుధాలను ప్రయోగించడంలో నేర్పరులు. అతిబలవంతులు. తూర్పు దేశవాసులు గజయుద్ధాలలో ఆరితేరిన వారు. కూట యుద్ధాలు చేస్తారు. యవనకాంబోజులు, మథురకు చుట్టుపక్కల వారు మల్లయుద్ధంలో కుశలులు. దాక్షిణాత్యులు చేత కత్తిపట్టి యుద్ధం చేస్తారు.

సాధారణంగా అన్ని దేశాలలోను మహా బల పరాక్రమవంతులు ఉద్భవిస్తారు. వారి గురించి చెప్పాను. ఇక వారి లక్షణాలను గూర్చి చెపుతాను విను. సింహశార్దూలాలవంటి వాక్కు, నేత్రాలు, నడక కలవారై; పావురాలు, కులింగాల వంటి నేత్రాలు కల యోధు

లందరూ శత్రువులను మథిస్తారు. మృగాలవంటి కంఠస్వరం; పులులవంటి, ఎద్దుల వంటి నేత్రాలు కలవారు వేగవంతులు, జాగరూకత లేనివారు, మూఢులు అయిఉంటారు. మువ్వలవంటి కంఠస్వరం కలవారు క్రోధస్వభావులై ఉంటారు. మేఘధ్వని వంటి కంఠం కలిగి, క్రోధముఖులై, ఒంటెవంటి శరీరంతో, ముక్కు, నాలుక వంపు తిరిగి ఉన్నవారు దూరం వెళ్లగలిగిన వారు, దూరంగా ఉండే లక్ష్యాన్ని ఛేదించగలిగిన వారు కూడా. పిల్లివలె పొట్టిగా ఉండే శరీరం కలిగి, వెండ్రుకలు, చర్మం పలుచగా ఉండేవారు వేగంగా ఆయుధాలు ప్రయోగించ గలిగినవారు. చపల వృత్తులు, దుర్జయులు అయిఉంటారు. ఉడుము వలె ఎప్పుడూ నిమీలితాక్షులై, మృదు స్వభావులై, నడకలో అశ్వం వంటి గమనం కల యోధులు యుద్ధపారంగతులు. దృఢమైన శరీరం, వెడల్పయిన రొమ్ము, తీర్చిదిద్దినట్లున్న అవయవాలు కల్గినవారు యుద్ధంలో స్థిరంగా నిలబడతారు, భేరీధ్వనులు వినగానే కుపితులవుతారు. వారికి కయ్యమంటే మహా సంతోషం. లోతై, ముందుకు పొడుచుకొని వచ్చినట్లుండే ఎఱ్ఱని కన్నులు కలవారు, ముంగిస వంటి కన్నులు కలవారు, బొమముడిపాటు కలిగిన అందరూ వీరులు, యుద్ధంలో దేహత్యాగం చేసేవారు. వంపుతిరిగిన కన్నులు, ఉన్నతమైన లలాటం, మాంసరహితమైన మూపురం కలిగి, దుర్బలమైన శరీరాలతో, భుజాల యందు వజ్రచిహ్నం, వ్రేళ్లయందు చక్రచిహ్నం కలిగి, నాడులన్నీ ఉబ్బెత్తుగా కనపడుతూ ఉండేవారు, యుద్ధం సంభవించగానే అతివేగంగా శత్రుమధ్యంలోకి చొచ్చుకుపోతారు. మదపు టేనుగుల వలె శత్రువులకు దుర్జయులై ఉంటారు. బిరుసెక్కిన ఎఱ్ఱని వెండ్రుకలు, వెడల్పయిన ప్రక్కటెముకలు, మూపురం, ముఖం కలిగి, ఎగుబుజాలతో, మెడ లావుగా, లావైన పిక్కలతో చూడడానికి వికటంగా ఉండేవారు; సుగ్రీవజాతి గుఱ్ఱాల వలె, గరుడపక్షివలె ఉద్ధతంగా ఉండేవారు; గుండ్రని తలతో, వెడల్పయిన ముఖంతో, పిల్లి ముఖం కలిగిన వారు ఉగ్రస్వరంతో కోపావిష్టులై ఉంటారు. యుద్ధంలో గర్జిస్తూ తిరుగుతూ ఉంటారు. ధర్మజ్ఞానం లేనివారు, గర్విష్ఠులు అయి ఉంటారు. ఘోరాకృతి కల్గి చూడడానికే భయంకరంగా ఉంటారు. ఈ వీరులందరూ అంత్యజులు. యుద్ధంలో వెనుతిరగని వారు. ప్రాణాలకు తెగించిన వారు. సైన్యంలో వీరు బహుమానింపతగిన వారు. దెబ్బ కొట్టగలవారు కూడా. వీరు అధార్మికులు. మర్యాదలను ఉల్లంఘించే వారు. వీరు రాజుల మీద కూడా మాటిమాటికీ కోపగిస్తూ ఉంటారు. వీరిని పరాభవించకుండా మృదువైన మాటలతోనే వశపరచుకోవాలి.'

102. సేనా నీతి.

యుధిష్ఠిరుడు ప్రశ్నించాడు. 'భారతకులోత్తమా! విజయాన్ని పొందే సేనకు ఉండే ప్రశస్తమైన లక్షణాలేమిటో తెలుసుకోవా లనుకొంటున్నాను.' భీష్ముడు చెపుతున్నాడు. 'భరతశ్రేష్ఠ ! జయించే సేనకు ఉండే ప్రశస్తమైన లక్షణాలను అన్నింటినీ చెప్తాను. కాలప్రేరితుడైన మనిషిపట్ల, పూర్వమే దైవం కోపించి ఉంటుంది. విద్వాంసులు దివ్యమైన జ్ఞాన చక్షువులతో దానిని దర్శిస్తారు. దానికి ప్రతీకారం చేయడం తెలిసినవారు మంగళకరమైన హోమాలు మొదలైన ప్రాయశ్చిత్తవిధులను చేస్తారు. చెరుపు కలిగించే ఉపద్రవాలను శాంతింప చేస్తారు. భారతా ! యోధులు, వాహనాలు ప్రసన్నమైన మనసులతో ఉత్సాహయుక్తులై ఉంటే ఆ సేన విజయాన్ని నిశ్చయంగా పొందుతుంది. సేన యుద్ధానికి బయలుదేరే సమయంలో వెనుకనుండి పిల్ల గాలులు వీస్తూ, ఇంద్రధనుస్సులు ఏర్పడుతూ ఉంటే; మేఘాలు అనుసరించి పరుగిడుతుంటే, మబ్బుల నీడలు కమ్ముతూంటే, సూర్యకాంతులు అన్నీ అనుకూలదిశలో వస్తుంటే ప్రశస్తమైన విజయం లభిస్తుంది. అగ్ని చక్కని ప్రకాశంతో పొగ లేకుండా, పైకి ప్రసరించే కాంతులతో, కుడి వైపుకు తిరిగే జ్వాలలు కలిగి ఉండడం; ఆహుతులు సువాసనలు వెదచల్లడం భావివిజయానికి లక్షణాలని చెప్తారు. శంఖాలు గంభీర నాదాలతో, భేరీలు ఉచ్చైఃస్వనాలతో మ్రోగుతూ ఉంటే యుద్ధోత్సాహంకల సైనికులు అనుకూలంగా ఉంటే- అది భావి విజయానికి శుభసూచకమని చెప్తారు.

యుద్ధానికి సైన్యం సిద్ధపడుతూ ఉన్నప్పుడు, బయలుదేరే సమయంలోను ఇష్టమైన మృగాలు వెనుకనుండిగాని, ఎడమవైపు నుండి గాని వస్తే ఫలప్రదాయకం అవుతుంది. యుద్ధం చేసేటప్పుడు దక్షిణ దిక్కుగా వచ్చిన ఫలసిద్ధి సూచకమే. కాని ఎదురుగా వస్తే మాత్రం యుద్ధ యాత్రను నిషేధించాలి. హంసలు, క్రౌంచపక్షులు, బెగ్గురుపక్షులు, నెమళ్లు మొదలైన పక్షులు మంగళ సూచకమైన ధ్వనులు చేస్తుంటే, యోధులు బలవంతులై ఆనందోత్సాహాలతో ఉంటే, అది భావివిజయానికి సూచకమని చెప్తారు. రకరకాల శస్త్రాలు యంత్రాలు, కవచాలు, ధ్వజాలతో, శోభిల్లుతూ; యువకుల ముఖాలు చక్కని కాంతులతో ప్రకాశిస్తూ; శత్రువులకు తేరి చూడరానిదిగా ఉండే సేన శత్రువుల మీద విజయం సాధించగలుగుతుంది. సైనికులు సేవా పరాయణులై, అహంకారరహితులై, పరస్పరం స్నేహభావంతో ఉంటూ; శౌచాచారాలను అనుష్ఠిస్తూ ఉంటే అది భావివిజయానికి శుభలక్షణ మని చెప్తారు. మనఃప్రమోదం కలిగించే శబ్దస్పర్శ గంధాలు వ్యాపించి, యోధుల మనసులలో ధైర్యం కదలాడుతూంటే అది విజయానికి

ద్వారంగా చెప్పవచ్చు. సైన్యం యుద్ధంలో ప్రవేశిస్తూ ఉండగా కుడివైపునుండి, ప్రవేశించాక ఎడమ వైపు నుండి, కాకి వస్తే శుభసూచకమే. వెనుక వైపు ఎగురుతున్నా కార్యం సిద్ధిస్తుంది. కాని ఎదురుగా వస్తే మాత్రం విజయానికి ఆటంకం కలుగుతుంది. యుధిష్ఠిరా! చతురంగ బలాలతో కూడిన పెద్ద సైన్యాన్ని సమీకరించి, ముందుగా సామోపాయం చేత సంధికోసం ప్రయత్నించాలి. అది విఫలమైతే తరువాత యుద్ధంకోసం ప్రయత్నం చేయాలి. భరతకుమారా! యుద్ధం వలన పొందే విజయం నీచమైనది. యుద్ధంలో విజయం యాదృచ్ఛికమైనదో, దైవేచ్ఛయో ముందుగా నిర్ణయించలేము.

విశాలమైన సైన్యం విచ్ఛిన్నం అయితే మహావేగంగా ప్రవహించిపోయే నీటిలా, భయభీతమైన మహామృగాలవలె వారింప శక్యం కాదు. లేళ్లసమూహంతో ఉపమించదగిన విశాల సేనావాహినిలో ఎంత గొప్ప బలవంతులున్నా అది విచ్ఛినం కావడం మొదలుపెడితే విచ్ఛిన్నం అయిపోతూనే ఉంటుంది. విద్వాంసులకు కూడా దానికి కారణం తెలియదు. పరస్పరం ఎరిగి ఉండి, ఆనందోత్సాహాలు పుష్కలంగా ఉండి, ప్రాణాల మీద ఆశలేని, దృఢనిశ్చయం కల వీరులు ఏభైమందే ఉన్నప్పటికి, శత్రుసైన్యాన్ని నాశనం చేయగలరు. కులీనులై, రాజగౌరవం పొంది, పరస్పరం సంఘటితంగా ఉన్న ఐదారుగురు లేక ఏడుగురు అయినా కృతనిశ్చయు లయితే శత్రువులపై చక్కని విజయాన్ని సాధించగలరు. సంధి చేయడానికి శక్యమయితే ఏరీతిగాను యుద్ధానికి దిగడం తగదు. ముందుగా సామభేదదానాలను ప్రయోగించి, చివరకు యుద్ధాన్ని ఆశ్రయించాలి. సైన్యాన్ని చూడగానే పిరికివారికి భయం కలుగుతుంది. భగభగ మండే పిడుగువంటి ఇది ఎవరి మీద పడుతుందోనని వారి భయం. సైన్యం యుద్ధానికి బయలుదేరిందని తెలిసికొని, దానికి ఎదురు నడిచేవారికి విజయం పట్ల మక్కువతో శరీరం చెమటలు కక్కుతుంది. రాజా! యుద్ధం సంభవించినపుడు దేశంలోని సమస్తస్థావర జంగమాలు వ్యథ చెందుతాయి. ఆయుధప్రతాపంతో తాపం చెందిన దేహధారుల యొక్క మజ్జకూడా ఎండిపోతుంది. అటువంటి వారి పట్ల కఠినత్వంతో పాటు మృదుత్వంతో కూడిన సాంత్వన కూడా చూపాలి. లేదా బాధాతప్తులైన వారు అన్ని వైపుల నుండి శత్రువులతో చేరిపోతారు శత్రువుల యొక్క ఆంతరంగికుల మధ్య భేదం సృష్టించడానికి గూఢచారులను నియోగించాలి. అందువలన బలవంతుడైన రాజు అతనితో సంధి చేసుకోవడం మేలు అనుకొంటాడు. అలా చేయకపోతే అతనికి అటువంటి సంకటస్థితి కలిగించడం సాధ్యం కాదు. అన్ని వైపుల సంకటస్థితి కల్పించేలా శత్రువుతో యుద్ధం చేయాలి. కుంతీ నందనా ! సత్పురుషులకే క్షమించడం తెలుస్తుంది. అసాధువులకు

ఎప్పుడూ అది తెలియదు. క్షమించడం, క్షమించకపోవడం వలన కలిగే ప్రయోజనాలు చెపుతాను తెలుసుకో.

శత్రువును జయించి, ఆ తరువాత క్షమించే రాజుకు కీర్తి పెరుగుతుంది. అతడు మహాపరాధం చేసినా శత్రువులు అతనిని విశ్వసిస్తారు. శత్రువును బాధించి దుర్బలునిగా చేసి, ఆపై క్షమించడం మంచిదని శంబరాసురుని మతం. వంకర తిరిగిన కర్రను వేడి చేయకుండా సాగ దీస్తే మళ్లీ యథా ప్రకారంగానే ఉంటుంది కదా ! అయితే ఆచార్యులు దీనిని మెచ్చుకోరు. ఇది సత్పురుషుల లక్షణం కాదు. కన్నకొడుకును వలెనే శత్రువులను కూడా కోపించకుండానే వశం చేసుకోవాలి. నాశనం చేయకూడదు. యుధిష్ఠిరా ! ఉగ్రత్వం గల రాజును ప్రాణులు ద్వేషిస్తారు. మృదుత్వం ఉంటే అవమానిస్తారు. కనుక రాజుకు రెండు లక్షణాలు ఉండాలి. భారతా ! రాజు శత్రువును దెబ్బతీయబోతూ, దెబ్బతీస్తుండగా కూడా ప్రియంగానే మాట్లాడాలి. దెబ్బకొట్టి కూడా శోకిస్తున్నవానిలాగా, విచారిస్తున్నవానిలాగా అతనిపై దయ చూపాలి. 'యుద్ధంలో నా వాళ్లు ఇంతమందిని చంపివేయడం నాకు నచ్చలేదు. మాటి మాటికి చెపుతున్నాగానీ వారు నా మాట పాటించడం లేదు. అయో ! జీవించాలని కోరుకొనే టటువంటి వారిని వధించకూడదు. యుద్ధరంగంలో పారిపోకుండా ఉండే సత్పురుషులు చాలా దుర్లభం. అటువంటి వారిని చంపి నా వాళ్లు అప్రియం కలిగించారు' అని శత్రువుకు వినబడేలా మాట్లాడుతూ, ఏకాంతంలో శత్రువీరులను చంపిన వారిని అభినందించాలి. శత్రువులను చంపి, వారి చేతిలో గాయపడిన తన వారి పట్ల అపరాధ భావన ప్రకటించాలి. జనాన్ని తన వైపు త్రిప్పుకోవడం కోసం వారి చేతులు పట్టుకొని కూడా విలపించాలి. ఈ రీతిగా సర్వావస్థలలోను సాంత్వన పూర్వకంగా వ్యవహరించే ధర్మజ్ఞుడైన రాజు ప్రజలకు ప్రీతి పాత్రుడు, నిర్భయుడు అవుతాడు. భారతా ! అటువంటి రాజును ప్రజలందరూ విశ్వసిస్తారు. ప్రజల విశ్వాసం పొందిన రాజు వారికి దగ్గరై, ఇష్టానుసారంగా భోగాలు అనుభవించగలుగుతాడు. కాబట్టి మహీమండలాన్ని అనుభవించాలనే కోరిక కల రాజు మాయా మర్మం వదిలి, ప్రజలందరికీ తనపై విశ్వాసం కలిగించాలి. అన్ని విధాలా ఆ భూమిని రక్షిస్తూ ఉండాలి.'

103. ఇంద్ర బృహస్పతుల సంవాదము.

యుధిష్ఠిరుడు ప్రశ్నించాడు. 'పితామహా ! పార్థివా ! ప్రబలమైన శత్రుపక్షం మృదువుగా ఉన్నప్పుడు వారితో ఎలా వ్యవహరించాలి ? తీక్ష్ణంగా ఉన్నప్పుడు ముందుగా రాజు వారితో ఎలా వ్యవహరించాలి ? అది నాకు చెప్పు.' భీష్ముడు చెపుతున్నాడు.

'యుధిష్ఠిరా ! ఇంద్రబృహస్పతి సంవాదమనే ప్రాచీన ఇతిహాసాన్ని ఈ సందర్భంగా పండితులు చెపుతూ ఉంటారు. శత్రువీరులను సంహరించే దేవపతి బృహస్పతిని సమీపించి, చేతులు జోడించి, నమస్కరించి, ఇలా అడిగాడు.' 'బ్రహ్మజ్ఞానీ ! శత్రువుల యందు జాగరూకుడనై నేను ఎలా ప్రవర్తించాలి ? వారిని సమూలంగా నాశనం చేయకుండా ఏ ఉపాయం చేత వశపరచుకోవాలి? పరస్పరం తలపడిన రెండు సేనల నడుమ విజయం అనేది సాధారణమైన విషయం. శత్రువులకు తాపం కలుగచేసే, సముజ్జ్వలమైన ఈ రాజ్యలక్ష్మి ఏం చేస్తే నన్ను విడిచి పెట్టకుండా ఉంటుంది ?'

ఇలా అడిగిన ఇంద్రునికి ధర్మార్థకామ విషయాలలో కుశలుడై, ప్రతిభాశాలియై, రాజ ధర్మ విధానాలను ఎరిగిన బృహస్పతి ఈ రీతిగా సమాధానం ఇచ్చాడు. 'యుద్ధం చేత శత్రువులను నియంత్రించడం జరుగకూడదు. ఇది అసహనంతో కూడినది. క్షమారహిత మైనది. దీనిని మూర్ఖులు మాత్రమే అనుసరిస్తారు. శత్రువులను చంపాలనే కోరిక గల రాజు క్రోధాన్ని, భయాన్ని, సంతోషాన్ని తనకు తానే మనసులో నిగ్రహించుకోవాలి. శత్రువు జాగరూకుడయ్యేలా చేయకూడదు. లోలోపల విశ్వసించకుండా, పైకి విశ్వసిస్తున్న వానిలా శత్రువును సేవించాలి. ఎప్పుడూ ప్రియంగానే మాట్లాడాలి. కొంచెం కూడా అతనికి అప్రియం చేయకూడదు. పురందరా ! శుష్కవైరాలకు దూరంగా ఉండాలి. కంఠాయాసం కలిగించే కేవలవాదాలను విసర్జించాలి. పక్షులను వేటాడేవాడు ఆ పక్షుల యొక్క కంఠధ్వనులను అనుకరిస్తూ, తత్సదృశమైన కంఠధ్వనితో వాటిని ఎలా వశం చేసుకొంటాడో అలాగే రాజు శత్రువులను చేరి, వారితో కలిసిపోయి, వారిని వశం చేసుకోవాలి. ఆ పై చంపివేయాలి. వాసవా ! నిత్యమూ శత్రువులను తృణీకరిస్తూ ఉండే రాజు సుఖంగా నిద్రించలేడు. ఆ దుష్టాత్ముడు ఎండుగడ్డితో కలిసి ప్రజ్వరిల్లే అగ్నిలా ఎప్పుడూ చిటచిటలాడుతూ నిద్రలేకుండా ఉంటాడు. రాజా ! ఇరుపక్షాలకు విజయం సాధారణమై ఉన్నపుడు, దాడి చేయడం కర్తవ్యం కాదు. శత్రువులకు విశ్వాసం కలిగించి వశపరచుకొని, అతనికి ఆప్తమయిన అర్థాల నన్నిటినీ నాశనం చేయాలి. శత్రువు ఉపేక్షించినా, అనుమానించినా మనసులో ఏ మాత్రం ధైర్యం కోల్పోక మంత్రులతో, మంత్రాంగం తెలిసిన మహాత్ములతో ఆలోచించి కర్తవ్యం నిశ్చయించుకోవాలి. శత్రువు ఒడిదుడుకు పరిస్థితిలో ఉన్న సమయం చూసి, అతనిని దెబ్బతీయాలి. ఆప్తులైన పురుషులను పంపి, అతని సైన్యంలో భేదం సృష్టించాలి. శత్రురాజ్యంయొక్క ఆదిమధ్యాంతాలు తెలుసుకొని, రహస్యంగా మంత్రులతో కలిసి కర్తవ్యాన్ని నిశ్చయించుకోవాలి. శత్రుసైన్యం యొక్క గుట్టుమట్టులను ప్రమాణపూర్వకంగా

తెలుసుకొన్న తరువాతనే వారిలో భేదాలు రగిలించాలి. భేదోపాయం చేత గాని, దానోపాయంచేత గాని వారిలో వైషమ్యాలు సృష్టించాలి. గూఢచారుల ద్వారా ఔషధాలు కూడా ప్రయోగించవచ్చును. కాని శత్రువుతో ప్రత్యక్షంగా ఈ విషయమై సంసర్గాన్ని పెట్టుకోకూడదు. అనుకూల సమయం కోసం ఎదురు చూస్తూ కాలక్షేపం చేయాలి. అందుకోసం దీర్ఘకాల మయినా ప్రతీక్షించాలి. అందువల్ల శత్రువు యొక్క విశ్వాసాన్ని చక్కగా పొందవచ్చు. అనంతరం శత్రువులను చంపవచ్చు. శత్రువుపై తొందరపడి దాడి చేయకూడదు. నిశ్చయంగా విజయం పొందే ఉపాయాన్ని ఆలోచించుకోవాలి. శత్రువుపై విషాన్ని ప్రయోగించకూడదు. మాటలతో గాయపరచకూడదు. దేవేంద్రా ! శత్రువును చంపాలనుకొనే వాడు అవకాశం దొరికినప్పుడే దెబ్బతీయాలి. శత్రువు విషయంలో ఆ అవకాశం మళ్లీ మళ్లీ సమకూడదు. కాలాన్ని ప్రతీక్షిస్తూ ఉండేవానికి ఆ అనుకూల సమయం గడిచిపోయి నట్లయితే, శత్రు సంహారం చేయాలనే కోరిక గల అతనికి మరల ఆ అవకాశకాలం దుర్లభమే. సాధు పురుషుల అనుమతితో బలగాన్ని సేకరించుకొంటూ తన బలాన్ని వృద్ధి చేసుకోవాలి. కలిసిరాని కాలంలో మిత్రులను పెంచుకోవాలే తప్ప శత్రువును బాధించకూడదు. కామ క్రోధాలను, అహంకారాన్ని కూడా విడిచి, జాగరూకుడై శత్రువులలోని లోపాలను పదే పదే వెదకాలి. సురోత్తమా ! ఇంద్రా ! మృదుత్వం, దండం, సోమరితనం, ఏమరుపాటు, శత్రువులు పన్నిన మాయలు-ఇవన్నీ తెలుసుకోలేని రాజు కష్టాలలో చిక్కుకొంటాడు. పైన చెప్పిన నాలుగింటిని వదుల్చుకొని, శత్రుమాయలకు ప్రతీకారాన్ని చేశాక, ఏమాత్రం ఆలోచించకుండా శత్రువుపై దాడి చేయడానికి శక్తు డవుతాడు.

తాను ఒక్కడే రహస్యంగా చేయడానికి సాధ్య మయినపుడు రాజు దానిని చేయాలి. ఎందుకంటే మంత్రులు అప్పుడప్పుడు రహస్యాన్ని వెల్లడి చేస్తారు. లేదా తమలో తాము చెప్పుకొంటూ ఉంటారు. తనకు అశక్య మయితేనే ఇతరులతో చర్చించాలి. శత్రువు దూరంగా ఉండి కనబడనపుడు బ్రహ్మదండాన్ని ప్రయోగించాలి. దగ్గరగా ఉండి కనపడుతూ ఉంటే చతురంగ బలాన్ని ఉపయోగించాలి. మొదట భేదోపాయాన్ని ప్రయోగించాలి. అలాగే ఉదాసీనతను, దండాన్ని కూడా ప్రయోగించాలి. రాజు ఆయా కాలాలలో అప్పటికప్పుడు తగిన ఉపాయాలను ప్రయోగించాలి. శత్రువు బలవంతుడై ఉన్న సమయంలో అవసరమయితే అతనికి నమస్కరింపవలసినదే. కాని శత్రువు ఏమరుపాటుగా ఉన్నప్పుడు తాను అప్రమత్తుడై, సావధానంతో అతని వధకు ఉపాయాన్ని అన్వేషించాలి. రాజు శత్రువును కూడా

నమస్కారాలతో, దానాలతో, మధురంగా మాట్లాడుతూ సేవించాలి. అతనికి ఏమాత్రం సందేహం కలుగకూడదు. శత్రురాజుకు సందేహాస్పదులైన వారి యొక్క స్థావరాలను ఎల్లప్పుడూ వదిలివేయాలి. వారిని రాజు ఎప్పటికీ విశ్వసించడు. ఈ లోకంలో రాజుచేత నిరాకృతులైనవారు శత్రువులై, ప్రతీకారం తీర్చుకోవడానికి జాగరూకులై ఉంటారు. సురోత్తమా ! రకరకాల వ్యవహారాలు నడిపేవారు కూడబెట్టిన ఐశ్వరం మీద పట్టు సాధించడం కంటే మించిన దుష్కరమైన కర్మ మరొకటి లేదు. వివిధ వ్యవహారాలు నడిపే వారి మీద పట్టు సాధించడం ఇలా కూడా సంభవ మవు తుందని చెప్పబడుతోంది. ఎలాగంటే రాజు మనోయోగాన్ని ఆశ్రయించాలి. ఎప్పుడూ ప్రయత్నశీలుడై ఉండాలి. ఎవరు మిత్రులో, ఎవరు శత్రువులో ఆలోచించుకోవాలి. మృదు స్వభావం గల రాజును జనులు అవమానిస్తారు. తీక్ష్ణంగా ఉంటే ఉద్విగ్నులవుతారు. నీవు తీక్ష్ణం గానూ ఉండకు. మృదువుగానూ ఉండకు. ఆయా సందర్భాలను బట్టి మృదువుగా, తీక్ష్ణంగా ఉండు. అంతటా జలంతో నిండి, వేగంగా ప్రవహించే నది ఒడ్డును విరిచేసి ప్రవహించిపోయే భయం ఉంటుంది. అలాగే రాజు సావధానంగా లేకపోతే ఆ రాజ్యం కూడా నశించిపోయే ప్రమాదం ఉంటుంది. వురందరా ! పెక్కుమంది శత్రువులపై ఒకే మారు దాడిచేయకూడదు. సామదాన భేద దండోపాయాల ద్వారా వారిని ఒక్కొక్కరిగా అణగద్రొక్కి, మిగిలినవారిని నిపుణంగా మట్టుపెట్టడానికి ప్రయత్నించాలి. తెలివైన రాజు శక్తిమంతు డయినప్పటికి శత్రువులు అందరినీ ఒకేసారి అణగద్రొక్కడానికి పూనుకోకూడదు. రథగజతురంగ పదాతి దళాలతో షడంగయుక్తమై; యంత్ర బహుళమైన మహాసైన్యం తనపట్ల అనురక్తి కలిగి ఉండి; తాను అన్ని విధాలా శత్రువుకంటే వృద్ధిలో ఉన్నప్పుడు మాత్రం దొంగలవంటి శత్రువులను ఏ మాత్రం ఆలోచించకుండా; బాహాటంగానే దెబ్బ కొట్టాలి.

శత్రువుల పట్ల సామోపాయం గాని, దండోపాయం గాని ప్రశస్తం కాదు. అలాగే మృదుత్వం గాని, దాడి చేయడం గాని ఎల్లప్పుడూ పనికిరావు. వారి పంటలను పాడుచేయడం గాని, విషప్రయోగాలు గాని చేయకూడదు. అంతే కాకుండా సప్త విధాలయిన ప్రకృతులను గురించి కూడా ఆలోచించకూడదు. రాజు తనకు విశ్వాసపాత్రులైన మనుష్యుల ద్వారా శత్రువు యొక్క నగరాలలో, రాజ్యంలో అనేక విధాలుగా పరస్పర విరోధాలను, వైరభావాన్ని సృష్టించాలి. మారు వేషాలలో గూఢచారులను నియోగించాలి. కాని తన కీర్తికి మచ్చ తెచ్చేలా చౌర్యం, రహస్యహత్యలు వంటి పాపకర్మలు తానై చేయకూడదు. పూర్వం కూడా రాజులు ఈ నీతి ననుసరించి వారి పురాల్లో భోగా లన్నీ సాధించారు. తమ స్థానాల్లో నీతి నేర్పరిచి భోగా లనుభవించారు. రాజా ! రాజు తన మనుష్యులనే

తప్పులు చేసి, దుష్టులయ్యా రని ప్రకటించి, దేశం నుండి వెళ్ళగొట్టాలి. ఆపై రహస్యంగా వారికి ధనవస్తువాహనాదులు అమరుస్తూ, తన ఆత్మీయులను కూడా వారికి తోడుగా నిలిపి, శత్రువుల నగరాలలో, రాజులలో గూఢచర్యం కోసం నియోగించాలి. అలాగే శాస్త్రవేత్తలను, శాస్త్ర ప్రయోగం తెలిసినవారిని, సుశిక్షితులైన భాష్యకథా విశారదులను వస్త్రభూషణాదులచేత సత్కరించి, వారి ద్వారా శత్రునగరాలలో కృత్యను ప్రయోగింపచేయాలి.'

ఇంద్రుడు అడుగుతున్నాడు. 'ద్విజోత్తమా ! దుష్టుడు ఎటువంటి లక్షణాలు కలిగిఉంటాడు ? దుష్టుని ఏ విధంగా తెలుసుకోగలుగుతాం? ఈ ప్రశ్నకు నాకు సమాధానం చెప్పవలసినది.' బృహస్పతి చెపుతున్నాడు - 'పరోక్షంలో దోషాలనే ఏకరువు పెడుతూ, సద్గుణాలను కూడా దుర్గుణాలుగానే ఆరోపిస్తూ, ఇతరులెవరైనా ఆ సద్గుణాలను కొనియాడితే మౌనంగా ముఖం చాటుచేసేవాడు దుష్టుడు అవుతాడు. మౌనంగా ఉండి కూడా అకారణంగానే నిశ్వసిస్తూ, పెదవులు కొరుకుతూ, తల ఊపుతూ ఉండేవాడు దుష్టుడు అని తెలుసుకోవాలి. మాటిమాటికి దగ్గరగా వస్తూ, దూరంగా ఉన్నపుడు దోషాలనే ఉంటకిస్తూ ఉండేవాడు; పని చేస్తానని హామీ ఇచ్చి, కనుమరుగు కాగానే ఆపని చేయనివాడు; ఎదురు పడినా మాట్లాడని వాడు, దుష్టభావాలతో నిండి ఉంటాడని తెలుసుకోవాలి. ఎక్కడినుండైనా వచ్చి, అందరితో కలవకుండా వేరుగా భుజించేవాడు, "ఇది ఈ రోజుకి తగినట్లులేదు". అంటూ కూర్చోవడంలో, పడుకోవడంలో, తిరగడంలో కూడా దుష్టునిలోని దుష్టభావాలు విశేషంగా గోచరిస్తాయి. ఆర్తులను చూసి ఆర్తి చెందడం, సంతోషించేవారిని చూసి సంతోషించడం మిత్రలక్షణం. తద్విరుద్ధంగా ఉండడం శత్రులక్షణం అని భావించాలి. త్రిదశాధిపా! ఈ రీతిగా నేను చెప్పిన లక్షణాలన్నీ గ్రహించు. దుష్టుల స్వభావం బలవత్తరమైనది. అమరేశ్వరా ! శాస్త్రంలోని తత్త్వాన్ని యథాతథంగా గ్రహించి, దుష్టుని లక్షణాలను నీకు నేను చెప్పాను.' భీష్ముడు చెపుతున్నాడు - 'శత్రువులను సంహరించాలనే ఆసక్తి గల ఇంద్రుడు బృహస్పతి చెప్పిన ఆ యథార్థ వచనాలను విని తు.చ. తప్పక పాటించాడు. అతడు సరియైన సమయంలో జైత్ర యాత్రకు బయలుదేరి, శత్రువులను వశపరచుకొన్నాడు.'

104. క్షేమదర్శి కాలకవృక్షీయుల సంవాదము.

యుధిష్ఠిరుడు అడిగాడు. పితామహా ! ధార్మికుడైన రాజు కోశాగారాన్ని సైన్యాన్ని కోలుపోయి, ధనం లేకుండా మంత్రుల చేత బాధింపబడుతూ ఉన్నప్పుడు అతడు సుఖాన్ని కాంక్షిస్తే ఎలా నడుచుకోవాలి ?' భీష్ముడు చెపుతున్నాడు. 'ఈ విషయంలో క్షేమదర్శీయమనే ఇతిహాసం ఒకటి చెప్పబడుతోంది. అదినీకు చెప్తాను. యుధిష్ఠిరా !

దానిని విను. నాకు తెలిసిన వృత్తాంతం. పూర్వం క్షేమదర్శి అనే రాజకుమారుడు తన సైన్యాన్నంతటినీ కోలుపోయి, కాలకవృక్షీయుడనే ముని దగ్గరకు వచ్చి, అతనికి నమస్కరించి తనకు వచ్చిన ఆపదను వివరించి, దాని నుండి విముక్తి ఎలా కలుగుతుందని అడిగాడు. 'బ్రహ్మజ్ఞుడా! ధనమందు భాగస్వామ్యాన్ని మాటిమాటికి కోరుకొనే పురుషుడు నా వలే రాజ్యాన్ని పొందలేకపోతే ఏమి చేయాలి? సత్పురుషా! మరణించడం, దైవాన్ని పొందడం, ఇతరులను ఆశ్రయించడం, అలాగే ఇతర నీచ కర్మలను ఆచరించడం కంటే వేరైన ఉపాయమేదైనా ఉంటే దానిని నాకు చెప్పు. శారీరకమైన వ్యాధితో గాని, ఇతర మానసికమైన రోగంతో గాని బాధపడే వారికి నీ వంటి ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు శరణ్యుడవుతాడు. మానవుడు కోరికలపట్ల వైరాగ్యం పొంది విరాగియై, జ్ఞానమయమైన ధనాన్ని పొంది, ప్రీతిని, శోకాన్ని కూడా విడిచి సుఖాన్ని పొందుతాడు. అర్థాన్ని ఆశ్రయించుకొనియే సుఖం ఉంటుందని భావించేవారిని గూర్చి నేను విచారపడుతున్నాను. ఎందుకంటే నాకు ఉన్న అనేకమైన ధనాలు కలలో వచ్చినట్లుగా నశించిపోయాయి. గొప్పవైన ధనాలను విడిచిపెట్టిన వారు దుష్కర మైన కార్యాన్ని చేసినట్లేకదా ! అవి నన్ను విడిచినా నేను వాటిమీద మోహాన్ని విడవలేక పోతున్నాను. బ్రహ్మజ్ఞుడా ! ధనాన్ని పోగొట్టుకొని, దీనుడను, ఆర్తుడను అయి ఇలాంటి అవస్థను పొందిన నాకు వేరే సుఖమే దయినా ఉంటే చెప్పండి.' బుద్ధిమంతుడయిన కోసల రాజకుమారుడు ఇలా అడగగా, మహాతేజశ్శాలి అయిన కాలకవృక్షీయముని ఇలా బదులిచ్చాడు.

'అన్నీ తెలిసిన నీ బుద్ధి ఇంతకు ముందే ఇది నిశ్చయించుకొని ఉండాలి. "నేను - నాది" అనేది అంతా అనిత్యమే. ఏదయితే నీవు ఉందని భావిస్తావో అది అంతా లేదని తెలుసుకో. ఇలా భావించిన ప్రాజ్ఞుడు కఠినమైన ఆపదను పొందికూడా వ్యథను పొందడు.' జరిగినది, జరుగబోయేది సమస్తమూ జరిగేది కాదు. ఇలా తెలుసుకోవలసినదానిని తెలుసుకొంటే నీవు అధర్మాల నుండి విముక్తుడవు కాగలవు. ఇంతకుముందు సముదాయం యొక్క అధీనంలో ఉండేది (గణతంత్రం), ఇంతకుముందు ఒకరి తర్వాత ఒకరికి సంక్రమించేది-ఇది అంతా నీకు లేనిదే. ఇది తెలుసుకొంటే ఎవడూ బాధపడడు. రాజ్యం ఇంతకుముందు ఉండి కూడా ఇప్పుడు లేకపోవచ్చు. ఇంతకుముందు లేకపోయినా ఇకపై రావచ్చును. కాబట్టి శోకించడంతో సామర్థ్యం రాదు. ఏ విధంగానూ శోకించడం పనికిరాదు. రాజా! ఈనాడు నీ పితృపితామహులు ఎక్కడున్నారు? నీవు వారిని ఇప్పుడు చూడడం లేదు. వారు కూడా నిన్ను చూడడం లేదు. శరీరం అనిత్యమని చూస్తూ కూడా నీవు

వారిని గూర్చి ఎందుకు శోకిస్తావు? బుద్ధితో బాగా ఆలోచించు, నీవు కూడా నిశ్చయంగా ఉండవు. రాజా! నేను, నీవు, నీశత్రువులు, మిత్రులు తప్పకుండా నశించిపోతాము. ఏదీ మిగులబోదు. ఇప్పుడు ఇరువది ముప్పది సంవత్సరాలున్న మానవులందరూ వంద సంవత్సరాలకు ముందుగానే మరణిస్తారు. గొప్ప సంపదలు తన్ను విడువకుండా ఉన్నప్పటికి మానవుడు "ఇది నాది కాదు" అనుకొని తనకు తాను మేలు చేసుకోవాలి. "రాబోయేది నాది కాదు, పోయినది నాది కాదు. ప్రారబ్ధం బలీయమైనది" అని భావించే వారిని పండితులు సత్పురుషునిగా వర్ణిస్తారు. ధనం లేని వారు కూడా బ్రతుకుతున్నారు. రాజ్యాన్ని కూడా పాలిస్తున్నారు. బుద్ధిపౌరుషాలతో కూడినవారు, నీతో సమానులూ ఉన్నారు, నీకంటే అధికులూ ఉన్నారు. నీ వలె వారు శోకించడం లేదు. కనుక నీవుకూడా శోకించకు. నీవు బుద్ధిపౌరుషాలలో వారితో సమానుడవో, వారికంటే అధికుడవో కావా?' రాజు అడుగుతున్నాడు 'బ్రాహ్మణోత్తమా! ఆ రాజ్యమంతా యాదృచ్ఛికమే అని భావిస్తాను. గొప్పశక్తిమంతమైన కాలం అంతటినీ నశింపచేస్తుంది. తపోధనా ! ఆ మహిమాన్వితమైన కాలం వలననే నదిలో కొట్టుకుపోయిన రీతిగా నా రాజ్యం పోయింది. ఆ ఫలాన్ని నేను అనుభవిస్తున్నాను. దొరికిన దానితోనే జీవిస్తాను.'

ముని అంటున్నాడు. 'కోసలరాజకుమారా ! యథార్థజ్ఞానం స్థిరంగా కలిగితే రాబోయేదాని గురించి గాని, గడిచిపోయిన దాని గురించి గాని శోకించ నక్కరలేదు. కాబట్టి అన్ని విషయాలలోనూ నీవు అలాగే ఉండు. పొందదగిన వస్తువులను కోరుకోవాలి. పొందదగని వాని గురించి ఎన్నడూ ఆశించకూడదు. కాబట్టి నీవు లభించిన వానినే అనుభవిస్తూ రాని వాని గురించి శోకించకు. కోసలరాజకుమారా ! దైవవశాత్తు సమకూడిన అర్థాలతో ఎలా నీవు సంతోషించావో, అలాగే రాజ్యలక్ష్మిని కోల్పోయినపుడు కూడా శుద్ధమనుసుతో శోకించకుండా ఉండలేవా ? ముందు సంపద లభించి తరువాత నష్టపోతే, ఆ హీన భాగ్యుడు దుర్బుద్ధియై బ్రహ్మదేవుని నిత్యమూ నిందిస్తూ ఉంటాడు తప్ప లభించిన సంపద గురించి సంతుష్టి చెందడు. అతడు ధనవంతులైన ఇతర జనులను ఆ ధనానికి అనర్హులుగా భావిస్తూ ఉంటాడు (ఈర్ష్యాకారణంగా). ఈ కారణంగానే ఈ దుఃఖం తరచుగా వెంటాడుతూ ఉంటుంది. కోసలాధిపా!రాజా! తమ్ము తాము పౌరుషవంతులుగా భావించుకోనే వారు చాలామంది ఈర్ష్య, అహంకారం కలిగి ఉంటారు. నీవు అటువంటి మాత్సర్యం కలవాడవు కావు కదా ? నీ దగ్గర లేకున్నా, ఇతరుల వద్దనున్న ధనాన్ని చూసి, సహించిఉండు (అసూయపడకు). ఎందుకంటే నేర్పరులు

ఇతరత్రా ఉన్న ధనలక్ష్మిని కూడా ఎప్పుడూ అనుభవిస్తూనే ఉంటారు. జనాన్ని ద్వేషించే వారి వద్ద ధనం ఉన్నా అది కరిగిపోతూనే ఉంటుంది. యోగధర్మవేత్తలు, ధర్మవర్తనులు, ధీరులు అయినవారు పుత్రపౌత్రులను, సంపదను స్వయంగా విడిచి పెడతారు సుమా!

స్వాయంభువ మనువు వంశంలోని సదాచారవంతుడైన భరతుడు అనేకరత్నాలతో సమృద్ధమైన రాజ్యాన్ని విడిచివెట్టాడని విన్నాము. అలాగే అనేకులు రాజులు మహాభ్యుదయం కల రాజ్యాన్ని వదిలివేశారు. రాజులందరూ రాజ్యాలను విడిచి అడవులలో వన్యఫలాలు తింటూ, తపస్సులో పారంగతులు కావడమే కాక దుఃఖాంతాన్ని కూడా పొందారు.

ధనం నిరంతరం శ్రమించడం వలన లభించేది అయినప్పటికీ అత్యంతమూ అస్థిరమైనదిగా గ్రహించి, పరమ దుర్లభ మని తలచి, ఎందరో దానిని విడిచి పెడుతున్నారు. నీవు ప్రాజ్ఞుడవు. కోరదగని వానిని కోరుకొంటూ, దైవాధీనమైన, అస్థిరమైన అర్థాలను గురించి దీనంగా పరితపిస్తున్నావు. ఆ బుద్ధిని పొందగోరి, నీవే అర్థరూపంలో ఉన్న ఆ అనర్థాలను పరిత్యజించు. ఎందుకంటే అర్థాలన్నీ అనర్థరూపాలే. భోగం కొఱకే కొందరి ధనం నశించిపోతోంది. దానివలన వచ్చే సుఖం అనంతమైనదని అనుకొని ఇతరులు ఆ ధనం కోరుకొంటున్నారు. ధనంలో మునిగి తేలుతూ ఉండేవాడు, అంతకంటే శ్రేయస్సును కలిగించేది మరొకటి ఉంటుందని అనుకోడు. ధనాన్ని కోరుకొనే అతని ప్రయత్నమంతా నశించిపోతూ ఉంటుంది.

కోసలనరేశా! అతికష్టం మీద సంపాదించిన ఆ ఇష్టమైన ధనం నశించిపోతే, దాని కోసం పడిన పాట్లన్నీ భగ్నమైపోగా ఆ నరుడు విరక్తుడు అవుతాడు.

ధనం యొక్క ఆ అనిత్యత్వాన్ని తెలుసుకొన్నవాడు ఎవడు ఆ ధనాన్ని కోరుకొంటాడు?

పుణ్యాత్ముల వంశంలో పుట్టిన కొందరు ధర్మాన్ని ఆశ్రయిస్తారు. పరలోక సుఖాలను కోరుకొని సమస్త లౌకిక వ్యాపారాలన్నిటి నుండి విరక్తు లవుతారు. కొందరు ధనలోభపరులై తమ ప్రాణాలను కూడా పణంగా పెడతారు. ధనాన్ని మించిన జీవిత పరమార్థం ఉంటుందని వారు అనుకోరు కదా! ఆ శాశ్వతమైన ఈ జీవితం మీద మోహంతో కేవలం ధనం మీదనే దృష్టి నిలిపిన వారి దీనత్వాన్ని, వారి అవివేకాన్ని పరికించు. కూడబెట్టడానికి అంతం వినాశనమే. జీవితానికి అంతం మరణమే. కలయికకు అంతం వియోగమే. అయినప్పుడు ఎవరి మనసు దీనికి విముఖం కాదు? రాజా! ధనాన్ని పురుషుడైనా విడిచి చెడతాడు. ధనం పురుషుని అయినా విడిచిపెడుతుంది. తప్పక జరిగే దీని కోసం పండితు డెవడు బాధపడతాడు?

ఇతరులకు ఆపద కలిగితే "నాకు రాలేదు కదా!" అని మూర్ఖుడు సంతోష పడతాడు.

కాని శాంతి మాత్రం లభించదు.

రాజా ! ఇతరులు కూడా మిత్రులనూ, ధనాన్ని కోల్పోతూనే ఉన్నారు. ఆలోచించు. నీ కష్టం వారి కష్టం వంటిదే. ఇంద్రియాలను అరికట్టు. మనస్సును నియంత్రించు. వాక్కును అదుపులో ఉంచు. ఇవి చాలా దుర్బలమైనవి. అహితాన్ని కలిగించేవి. వీటిని అడ్డగించేవాడు తాను తప్ప వేరెవరూ కారు. పదార్థాలన్నీ సంసర్గంలోనికి వచ్చినపుడు దృష్టిగోచరం అవుతాయి. దూరమైనపుడు అవి కనపడడం అసంభవం. నీ వంటి జ్ఞానవిజ్ఞాన తృప్తుడు, పరాక్రమవంతుడు వాటి గురించి శోకించడు. అల్పమైన దానినే కోరుకొంటూ, చాపల్యం లేకుండా మృదుత్వం, ఇంద్రియనిగ్రహం, దృఢనిశ్చయం కలిగి బ్రహ్మచర్యాన్ని పాటించే నీ వంటి వాడు ఏ మాత్రం శోకించడు. పాప భూయిష్ఠమై, దుష్టమై, కాపురుషోచితమై, క్రూర ప్రవృత్తి కలిగిన కపట వేషధారుల వర్తన కాని, కపాలం చేతపూని భిక్షమెత్తు కొనే కాపాలికుల ప్రవర్తన కాని నీకు తగినది కాదు. మహారణ్యంలో మూలఫలాలు తిని జీవిస్తూ, ఏకాంతంగా, వాక్కును నియంత్రించుకొని, ఇంద్రియనిగ్రహం కలిగి, సర్వభూతాలయందు దయగలవాడవై సంచరించు. అరణ్యాలలో వన్యఫలాలతో తృప్తిపడుతూ ఈషాదంతాలు కలిగిన ఏనుగుతో కలిసి విహరిస్తూ సంచరించడం పండితునికి తగనిది.* కల్లోలితమైన మహాహ్రదం తనకు తానే శాంతించినట్లుగా సంక్షుభితుడైన మానవుడు కూడా కృతప్రజ్ఞుడై శాంతిస్తాడు.

ఈ విధమైన అవస్థను పొందిన నీవు సుఖంగా జీవించడానికి ఇదే మార్గమని నాకు అనిపిస్తోంది.

రాజా! నీకు ఇప్పుడు ధనం అసంభవం. మంత్రులు లేరు. దైవం ప్రతికూలంగా ఉంది. ఇక నీవు దేనిని శ్రేయస్కర మని భావిస్తున్నావు ?

105. రాజ్యప్రాప్తికొఱకు కాలకవృక్షీయముని చెప్పిన ఉపాయములు.

ముని చెపుతున్నాడు. 'క్షత్రియుడా! నీలో ఏ కొంచెమైనా పౌరుషం ఉంటే, రాజ్యప్రాప్తి కోసం నీకు ఒక నీతిని ఉపదేశిస్తాను. దానిని ఆచరణలో పెట్టగలిగితే, ప్రయత్నం చేయగలిగితే, యథార్థంగా దాని తత్త్వాన్ని నీకు చెపుతాను. అది అంతా పూర్తిగా విను. నీవు ఆపని చేస్తే గొప్ప ప్రయోజనాలను పొందగలవు. రాజ్యాన్ని, రాజకీయమంత్రాంగాన్ని, మహాసంపదను తిరిగి పొందుతావు. రాజా! ఇది నీకు రుచిస్తే మళ్లీ ఒకమారు చెప్పు. నీకు వివరిస్తాను.' రాజు అంటున్నాడు. 'ప్రభూ! తమరు ఉపదేశించండి.

* · *ఈషాదంతం = నాగలి కోలవంటి దంతం (పెద్ద దంతం)*

నేను సిద్ధంగా ఉన్నాను. ఇప్పుడు మీతో నా ఈ సమాగమం అమోఘమైనది అగుగాక !'

ముని చెపుతున్నాడు. 'దంభాన్ని, కామక్రోధాలను, హర్ష భయాలను విడిచిపెట్టి; చేతులు జోడించి, తలవంచి, శత్రువులను కూడా సేవించు. విదేహరాజు సత్యప్రతిజ్ఞుడు. ఉత్తమమైన, పవిత్రమైన కర్మల ద్వారా నీవు అతనికి విశ్వాసం కలిగించు. అతడు నీకు ధనాన్ని ఇస్తాడు. అప్పుడు నీవు సర్వప్రాణులకు విశ్వాస పాత్రుడవు, రాజుగారికి కుడిభుజం అవుతావు. అప్పుడు నీవు దుర్వ్యసనాలు లేని, మంచి మనసు కలిగిన, ఉత్సాహపూరితులైన సహాయకులను పొందగలవు. శాస్త్రాలను అనుసరించి నడుచుకొనేవాడు, జితేంద్రియుడు, ఆత్మనిగ్రహం కలవాడు తన్ను తాను ఉద్ధరించుకొంటాడు, ప్రజలను కూడా ప్రసన్నులను చేసుకొంటాడు. ధైర్యవంతుడు, సంపన్నుడు అయిన జనక మహారాజు నిన్ను సత్కరిస్తాడు. అప్పుడు నీవు అందరికీ విశ్వాసపాత్రుడవు కాగలవు. మహాగౌరవాన్ని పొందుతావు. అనంతరం నీవు మిత్రుల సైన్యాన్ని పోగుచేసి, మంచి మంత్రులతో కూడి మంత్రాంగం చేసి, ఆంతరంగికుల ద్వారా శత్రువులలో భేదాన్ని, సృష్టించి ముల్లును ముల్లుతోనే తీయి. శత్రువుల సహాయంతోనే శత్రువులను నాశనం చేయి. లేదా శత్రువులతో కలిసి, వారి ద్వారానే శత్రు బలాన్ని నాశనం చేయించు. స్త్రీలు, ఉత్తరీయాలు, శయ్యలు, ఆసనాలు, వాహనాలు, విలువైన గృహాలు, పక్షులు, మృగాలు, రసగంధాలు గలిగిన ఫలాలు – ఇలా అలభ్యాలైన శుభవస్తువుల యందు, శత్రువుల మనస్సు లగ్నం అయ్యేలా చేయి. ఆ ఆసక్తితో వారు తదుపరి నాశనం అవుతారు. ఇలా జరిగేటపుడు శత్రువును వ్యసనం బారి పడకుండా అడ్డగించవలసి వచ్చినా, ఉపేక్షించ వలసి వచ్చినా చేయవలసినదే, కాని ఉత్తమ నీతిని అవలంబించగోరిన వాడు తన కార్యం ఎక్కడా వెల్లడి కాకుండా చూసుకోవాలి. **ప్రాజ్ఞుల విశ్వాసాన్ని చూరగొని పరమ శత్రువు యొక్క రాజ్యంలో కూడా హాయిగా విహరించు. కాని కుక్క, లేడి, కాకి వలె నిరంతరం జాగరూకుడవై, నిరర్థకకృత్యాలతో విదేహరాజు పట్ల మిత్రధర్మాన్ని నిర్వర్తించు.***

చేయడానికి దుష్కరమైన మహాకార్యాలను శత్రువుకు కల్పించు. దాటడానికి వీలుకాని నదిలా బలవంతులతో దుస్తరమైన విరోధాలను సృష్టించు. అతి విలువైన

* *వి॥ కుక్క ఎప్పుడూ మేలుకొని తిరిగినట్లుగా శత్రువుల యొక్క గమనాగమనాలను తెలుసుకోవడానికి ఎల్లప్పుడు జాగరూకుడై ఉండాలి. లేడి చిన్న చప్పుడుకు కూడా బెదిరి, వెంటనే పరుగు తీసినట్లుగా, ఏ మాత్రం సందేహం, భయం కలిగినా పారిపోవడానికి సిద్ధంగా ఉండాలి. కాకి ప్రతి మనిషి యొక్క కదలికను గమనిస్తూ ఎవరు చేయి వైకెత్తినా వెంటనే ఎగిరిపోతుంది. అలాగే శత్రువు యొక్క ప్రతి కదలికను గమనించి తదనుగుణంగా మసలుకోవాలి.*

ఉద్యానాలు, శయనాలు, ఆసనాలు మొదలైన భోగసుఖాలతోనే శత్రువుయొక్క కోశాగారం నిండుకొనేలా చేయి. ప్రసిద్ధ బ్రాహ్మణులను గూర్చి విదేహరాజు వద్ద ప్రశంసించి, అతనికి యజ్ఞదానాలు చేయమని వారిచే ఉపదేశ మిప్పించు. వారు నీకు ఉపకారం చేస్తారు. అతనిని తోడేళ్లవలె పీకుకొని తింటారు. నిస్సంశయంగా పుణ్యశీలుడు పరమగతిని పొందుతాడు. అతనికి స్వర్గలోకంలో పరమ పవిత్రమైన స్థానం లభిస్తుంది. కోసలాధిపా! ధర్మకార్యం గాని, అధర్మ కార్యం కాని, లేదా రెండిటి యందైనా గాని మునిగిపోయిన రాజు యొక్క కోశాగారం వట్టిపోతుంది. రాజ్యం శత్రువుల వశమవుతుంది. ఫలాలు, పంటలు, మూలాలు రహస్యంగా నాశనం చేయాలి. దాని వలన అతని శత్రువులు సంతోషిస్తారు. అది మనుషులు చేసిన పని కాదని, దైవఘటన అని అతనివద్ద వివరించాలి. దేవుని మీద భారం వేసి ప్రయత్నం చెయ్యని మనుష్యుడు శీఘ్రంగానే నశిస్తాడు. సర్వస్వాన్ని దానం చేయించి, అతని చేత విశ్వజిద్యాగం చేయించు. నిర్ధనుడిగా చేయి. దానితో నీ పని సిద్ధిస్తుంది. అనంతరం కష్టాల పాలయిన మహాపురుషులను గురించి, యోగధర్మాలు తెలిసిన పుణ్యాత్ములను గురించి ఆ శత్రురాజు వద్ద ప్రశంసిస్తూ చెప్పాలి. దానితో అతనికి రాజ్యాన్ని త్యజించాలనే ఆసక్తి కలుగుతుంది. ఒక్కొక్కసారి అతనికి ఏ కలతా కలగకపోవచ్చు. అప్పుడు సర్వ శత్రువినాశకమైన సిద్ధౌషధ ప్రయోగం నీ వారి ద్వారా చేయించి ఏనుగులను, గుఱ్ఱాలను, మనుష్యులను చంపించాలి. మనసును కట్టడి చేసుకోని, అధర్మానికి జంకని వానికి ఇవే కాక, ఇంకా ఎన్నో కపట ప్రయోగాలు చక్కగా ఆలోచించి చేయడానికి శక్యం అవుతాయి.

106. విదేహరాజు కోసల రాజకుమారుని అల్లునిగా చేసికొనుట.

రాజు అంటున్నాడు. 'బ్రహ్మజ్ఞుడా! మోసంతోగాని, దంభంతోగాని జీవించాలని నేను కోరుకోవడం లేదు. అధర్మయుక్త మయితే మహాసంపత్తిని కూడా నేను కోరను. దేవా ! ఇంతకుముందే నేను దీనిని వదిలి పెట్టాను, అందువల్ల నన్ను శంకించ నవసరం లేదు. దానివల్లనే సంపూర్ణంగా మేలు జరుగుతుంది. ఈ లోకంలో దయతో కూడిన ధర్మాన్ని ఆశ్రయించి, బ్రతకాలని కోరుకొంటున్న నేను ఈ పని చేయడానికి చాలను. ఇది మీకూ తగినది కాదు.' ముని అంటున్నాడు. 'క్షత్రియుడా ! నీ మాటలకు అనుగుణంగానే నీ గుణాలన్నీ ఉన్నాయి. స్వభావతః నీవు అటువంటివాడవే. బుద్ధిచేత కూడా ఎన్నో దర్శించగలవాడవు. నీకు, విదేహరాజు జనకునికీ-మీ ఇద్దరికీ ప్రయోజనం కలిగేలా

ప్రయత్నిస్తాను. నీకూ అతనికీ శాశ్వతమైన ఎడబాటులేని ఘనిష్ఠ సంబంధాన్ని నెలకొల్పుతాను. ఉత్తమ కులసంజాతుడవు, రాజ్యపాలన కళాకోవిదుడవు, అనేక శాస్త్రాలు నేర్చిన వాడవు, దయాళుడవు అయిన నీ వంటివానిని ఎవరు అమాత్యునిగా చేసుకోరు? రాజపుత్రా! నీవు రాజ్యాన్ని కోల్పోయావు. గొప్ప ఆపదలో ఉన్నావు. అయినా దయాప్రకృతితోనే జీవించడానికి ఇష్టపడు తున్నావు. నాయనా! సత్యప్రతిజ్ఞ డైన విదేహరాజు నా ఇంటికి వస్తాడు. అప్పు డతనిని ఆదేశిస్తాను. అది అతడు నిస్సందేహంగా చేస్తాడు. అనంతరం ముని విదేహరాజును పిలిపించి ఇలా అన్నాడు. "ఇతడు రాజవంశోద్భవుడు. ఇతని ఆంతరిక వివరాలన్నీ నాకు తెలుసును. ఇతడు అద్దంలాగా, శరత్కాల చంద్రునిలాగ విశుద్ధమైన మనసు కలవాడు. పరీక్షించి చూసినా నాకు ఇతనిలో ఏ మాత్రం పాపం కనపడలేదు. అతనితో నీకు సంధి అగునుగాక. నీవు నన్ను ఎలా విశ్వసిస్తావో అలాగే ఇతనిని కూడా విశ్వసించు. అమాత్యులు లేకుండా మూడు రోజులు కూడా రాజ్యాన్ని పాలించడం సాధ్యం కాదు. అమాత్యుడు పరాక్రమశాలి. బుద్ధిసంపన్నుడూ అయి ఉండాలి. ఈ బుద్ధి పరాక్రమాలు రెండిటి చేతనే ఇహపరలోకాలు రెండూ సిద్ధిస్తాయి రాజా ! బాగా ఆలోచించి చూడు. రాజ్యం కలిగి ఉండడానికి ప్రయోజనం ఈ రెండే.

ధర్మాత్ములైన రాజులకు లోకంలో ఇటువంటి మంత్రులే తప్ప వేరే మార్గం లేదు. ఈ రాజకుమారుడు మహాత్ముడు. సత్పురుషుల మార్గాన్ని అనుష్ఠిస్తున్నవాడు. ధర్మపూర్వకంగా ఇతనిని గౌరవంతో చేపట్టినట్లయితే, నీ చేత సత్కృతుడైన ఇతడు నీ శత్రువులను ఇబ్బడిముబ్బడిగా ముట్టడించగలడు. తండ్రి తాతల నుండి సంక్రమించిన రాజ్యాన్ని పొందాలనే కోరికతో యుద్ధంలో ఇతడు నీతో తలపడినా అది క్షత్రియునికి స్వధర్మమే అవుతుంది. అప్పుడు నీవు కూడా జయించితీరాలనే సంకల్పం కలవాడవై అతనితో యుద్ధానికి సిద్ధపడతావు. కాబట్టి నా ఆదేశాన్ని పాటించి, అతని మేలు కోరి, యుద్ధం చేయకుండానే ఇతనిని వశపరచుకో. అనుచితమైన లోభాన్ని విడిచిపెట్టి, నీవు ధర్మాన్ని పరిగణించు. కామంవలన గాని, ద్రోహ బుద్ధి వలన గాని స్వధర్మాన్ని విడువ కూడదు. నాయనా ! ఎప్పుడూ విజయమే లభించదు. ఎప్పుడూ పరాజయమే వరించదు. శత్రువుల యొక్క సంపదను నీవు అనుభవించినట్లుగా నీ సంపదను వారు కూడా అనుభవించాలి. తండ్రీ ! జయపరాజయాలను రెండింటినీ నీయందు కూడా చూసుకోవాలి. శత్రు సంపదలను నిశ్శేషంగా నిర్మూలించినట్లయితే, అలా నిశ్శేషం చేయడం అనే పాపం వలన భయం కలుగుతుంది." పూజనీయుడు, బ్రాహ్మణోత్తముడు అయిన ఆ

ముని యొక్క మాటలు విని, రాజు అతనిని పూజించి సత్కరించి, అతని మాటలు ఆమోదించి, అతనితో ఇలా అన్నాడు. 'మహాప్రజ్ఞులు, మహాపండితులు, శ్రేయోభిలాషులు చెప్పినట్లుగా మీరు సెలవిచ్చారు. ఇది మా ఇద్దరికీ సరిపడినది. మీరు నాకు ఎలా చెప్పారో అలాగే చేస్తాను. ఇదే నాకు పరమ శ్రేయస్సు. ఇందులో ఇంక నేను ఆలోచించవలసినది ఏమీ లేదు.' ఇలా చెప్పి మిథిలానరేశుడు కోసల రాజకుమారుని పిలిచి అతనితో " నేను ధర్మాన్ని నీతిని ఆశ్రయించి లోకాన్నంతటిని జయించాను. రాజోత్తమా ! నీవు నీ గుణాల చేత నన్ను జయించావు. నిన్ను నీవు కించపరచుకోక గెలుపొందిన వీరునిలా నడుచుకో. నేను నీ బుద్ధిని గాని, పౌరుషాన్ని గాని కించపరచను. నేను జయించానని నిన్ను తిరస్కరించను. నీవు విజయం పొందిన వీరునిలా నడుచుకో. రాజా ! చక్కగా, యథార్థంగా నీవు పూజలందుకొని నా ఇంటికి రావలసినది" అని చెప్పాడు. అనంతరం ఆ ఇద్దరు పరస్పర విశ్వాసంతో ఆ బ్రాహ్మణులను పూజించి ఇళ్లకు వెళ్లారు. విదేహరాజు జనకుడు కోసలరాజును ఆదర పూర్వకంగా తన ఇంటికి రప్పించి, పూజ్యుడైన అతనిని అర్ఘ్యపాద్యమధుపర్కాలతో పూజించాడు. అతనికి తన కుమార్తెతో పాటు అనేక రత్నాలను సమర్పించాడు. ఇదే రాజులకు పరమధర్మం. జయాపజయాలు అనిత్యాలు.'

107. గణతంత్రరాజనీతి.

యుధిష్ఠిరుడు అంటున్నాడు. 'పరంతపా ! భరతనందనా ! బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రుల యొక్క ధర్మబద్ధమైన ఆచారాలు; ధనం, జీవనానికి తగిన ఉపాయాలు, వాటి ఫలితాలు; రాజుల యొక్క ధనం, కోశం, కోశసంగ్రహం, శత్రు విజయం; మంత్రుల గుణాలు, నడవడికలు; ప్రజలయొక్క ఉన్నతి, సంధి విగ్రహాదులైన షడ్గుణ ప్రయోగాలు; సైన్యం యొక్క వర్తనం, దుష్టుల యొక్క లక్షణం, సత్పురుషుల లక్షణం, సమానుల - హీనుల - అధికుల లక్షణాలు; మధ్యమ వర్గాన్ని సంతుష్టి పరచడానికి అభ్యుదయ కాంక్షి అయిన రాజు ఎలా మసలుకోవాలో, బలహీనులను ఆదరించి, వారికి జీవికలను ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత - వీటన్నిటిని గురించి మీరు దేశాచారులను, శాస్త్రాలను అనుసరించి, ధర్మం తప్పకుండా సంక్షేపంగా చెప్పారు. బుద్ధిమంతులలో అగ్రగణ్యుడా ! విజయాభిలాషి అయిన రాజుయొక్క ప్రవర్తన గురించి కూడా మీరు చెప్పారు. ఇక నేను గణాల (గణరాజ్యాల) యొక్క వర్తనను గురించి తెలుసుకోవా లనుకొంటున్నాను. భారతా !

గణరాజ్యాలు ఎలా వృద్ధి చెందుతాయో, వారు పరస్పరం భేదించుకోకుండా ఎలా ఉంటారో, శత్రువులను ఎలా జయిస్తారో, స్నేహితులను ఎలా సంపాదించుకొంటారో వినాలని ఉంది. గణరాజ్యాలు నశించిపోవడానికి వారిలో భేదాలు కలగడమే మూలకారణ మని నేను అనుకొంటున్నాను. అనేకులు ఉన్నచోట రహస్యాన్ని దాచడం చాలా కష్టమని నా అభిప్రాయం. పరంతపా ! ఇదంతా పూర్తిగా వినాలని ఉంది. రాజా ! వారు తమలో తాము భేదించుకోకుండా ఎలా ఉంటారో, అది కూడా చెప్పు నాకు.'

భీష్ముడు చెపుతున్నాడు. 'భరతశ్రేష్ఠా ! నరాధిపా ! గుణాలలో గాని, కులాలలో గాని, రాజులలో గాని వైరాన్ని ఉద్దీపింపచేసేవి **లోభం, అమర్షం** - అనే రెండు గుణాలే. ముందు ఒకడు లోభాన్ని వరిస్తాడు (ఇతరుని ధనం తనకు కావాలను కొంటాడు). అనంతరం ఎదుటి వానిలో అమర్షం కలుగుతుంది (లోభిపట్ల కోపం ఏర్పడుతుంది). తరువాత ఆ లోభామర్షాలకు గురియైన వ్యక్తులు సముదాయానికి హాని కలిగిస్తూ పరస్పరం వినాశకులు అవుతారు. వారు గూఢచారులను ప్రయోగిస్తూ, రహస్య మంత్రాంగం ద్వారా సేనలను సమీకరించుకొంటూ, సామదాన భేదోపాయాలను ఆచరిస్తూ, ప్రాణ నష్టం, ధన వ్యయం మొదలైన భయాలను రేకెత్తించే ఉపాయాలతో పరస్పరం ఒకరినొకరు బలహీనపరచుకొంటారు. సంఘబద్ధులై జీవనం గడుపుకొనే గణ రాజ్యాల సైనికులు సమయానికి తిండి దొరకక, వేతనాలు అందక పోతే విడిపోతారు. విమనస్కులై విడిపోయిన వారు భయంతో శత్రువులకు లొంగిపోతారు. పరస్పరం విడిపోవడంవల్లనే గణరాజ్యాలు నశించిపోతాయి. విడిపోతే శత్రువులు సులభంగా జయిస్తారు. కాబట్టి గణరాజ్యాలు ఎప్పుడూ సంఘటితంగా ఉంటూ విజయం కోసం ప్రయత్నించాలి. సంఘటితమైన బలపౌరుషాలు కలవారికి అభీష్ట ప్రయోజనాలన్నీ సిద్ధిస్తాయి. సంఘటితంగా జీవనం గడుపుకొనే వారితో ఇతరులు కూడా మైత్రిని పాటిస్తారు. వారు పరస్పరం సేవించుకొంటూ, మనసులలో పొరపొచ్చాలు లేకుండా ఉంటారు. జ్ఞానవృద్ధులు వారిని ప్రశంసిస్తూ ఉంటారు. అన్ని విధాలా వారు సుఖంగా వృద్ధిచెందుతారు. గణరాజ్యాలలోని ఉత్తమ నాగరికులు శాస్త్రానుసారంగా ధర్మబద్ధమైన వ్యవహారాలను పాదుకొల్పుతారు. వారు యథోచితదృష్టితో అందరినీ కనిపెట్టి ఉంటూ, అభివృద్ధిని సాధిస్తారు. గణాలలోని ఉత్తమ నాగరికులు పుత్రులను, సోదరులను కూడా తప్పు చేస్తే దండిస్తూ ఉంటారు. వారికి ఎప్పుడూ ఉత్తమ శిక్షణను ఇస్తారు. అలా శిక్షణ పొందిన వారిని చేరదీస్తారు. అందువల్ల వారు విశేషంగా అభివృద్ధి పొందుతారు. మహాబాహూ ! వారు గూఢచర్యంలోను, మంత్రాంగంలోను,

కోశాగారాన్ని నింపడంలోను, ఎప్పుడూ తత్పరులై ఉంటారు. కాబట్టే అన్ని విధాలా గణరాజ్యాలు వృద్ధి పొందుతూ ఉంటాయి. రాజా ! ప్రాజ్ఞులను, పరాక్రమవంతులను, మహోత్సాహంతో పనులు చేసే వారిని, స్థిరమైన పౌరుషం ప్రకటించేవారిని, గౌరవిస్తూ గణరాజ్య సదస్యులు ఎప్పుడూ ప్రయత్నశీలురై ఉంటారు. కాబట్టే గణరాజ్యాలు వృద్ధి పొందుతున్నాయి. గణరాజ్యంలోని నాగరికు లందరూ ధనవంతులు, పరాక్రమవంతులు, శస్త్రప్రయోగం తెలిసినవారు, శాస్త్రపారంగతులు. ఆపదలలో చిక్కుకొని దిక్కు తోచని స్థితిలో ఉన్నవారిని వారు ఒడ్డుకు చేరుస్తారు. భరతశ్రేష్ఠా ! క్రోధం, భేదం, భయం, దండన, బలహీన పరచడం, బంధించడం, వధించడం - వంటి గుణాలు పుడితే - గణరాజ్యాలు వెంటనే శత్రువుకు లోబడి పోతాయి.

రాజా ! కాబట్టి ప్రధానంగా గణముఖ్యులు నీకు సన్మానింపదగినవారు. లోకయాత్ర అంతా ఎక్కువగా వారియందే సమాయత్తమై ఉంది. గణ రాజ్యాల వారు అందరూ రహస్యాన్ని వినడానికి తగినవారు కారు. వారిలో ప్రధానులు మాత్రమే మంత్రాంగాన్ని రహస్యంగా ఉంచడానికి, చారులుగా నియమించడానికి తగినవారు. గణముఖ్య లందరూ తమలో తాము కలుసుకొని గణాలకు హితమైన దానిని చేయాలి. అలా కాక గణాలు వేరుపడితే విడివిడిగా అనేక దళాలు పుట్టుకొని వస్తాయి. అప్పుడు సమస్త ప్రయోజనాలు దెబ్బతింటాయి. అనర్థాలు కూడా సంభవిస్తాయి. పరస్పరం వేరుపడి, తమ తమ శత్రువులను ప్రయోగిస్తూ ఉండేవారిలో ముఖ్యులను గణాలలోని పండితులు వెంటనే శిక్షించాలి. కులాలలో కలహాలు బయలుదేరినపుడు కులవృద్ధులు ఉపేక్షిస్తే, గణాలలో భేదాలు పుట్టడానికి కారణమై వంశనాశనం జరుగుతుంది. ఆంతరంగికమైన భయమే జాగ్రత్తగా గమనించవలసినది. బాహ్యంనుండి కలిగే భయం నిస్సారమైనదే. రాజా ! ఆభ్యంతర భయం వెంటనే మూలాలను నరికి వేస్తుంది. అకస్మాత్తుగా పుట్టిన క్రోధమోహాల వల్ల గాని, స్వాభావికమైన లోభంవల్లగాని పరస్పరం మాటలాడుకోకపోతే, అది వారి పరాజయానికి సూచన. జాతి చేతను, కులం చేతను అందరూ సమానులే, కాని ప్రయత్నం చేతను, బుద్ధి చేతను, రూపధనాదుల చేతను అలా సమానులుగా ఉండరు. శత్రువులు గణాలను భేదోపాయంచేతను, ధనం ఇవ్వడం చేతను చీల్చి వేస్తారు. కాబట్టి సంఘటితంగా ఉండడమే గణాలకు ఎంతో రక్షణ కలిగిస్తుంది.'

108. మాతాపితరులను, గురువును సేవించుటవలన కలుగు మహిమ.

యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు. 'భారతా ! ఈ ధర్మపథం చాలా గొప్పది. అనేక శాఖలు కలిగినది. ఈ ధర్మాలలో ఏది విశేషంగా ఆచరించదగినది అని మీ అభిప్రాయం ? అన్ని ధర్మాలలోను ఏది గొప్పగా ఆచరించదగినది ? దేనిని చేస్తే ఇహలోకంలోను, పరలోకంలోను పరమధర్మాన్ని చేసిన వాడిని అవుతాను ?' భీష్ముడు చెపుతున్నాడు. 'తల్లిదండ్రులను, గురువులను పూజించడం గొప్పదని నా అభిప్రాయం. ఈ లోకంలో దానికి కట్టుబడిన మానవుడు గొప్ప కీర్తిని, ఉన్నతలోకాలను పొందుతాడు. నాయనా ! యుధిష్ఠిరా ! చక్కగా పూజింపబడిన ఆ తల్లిదండ్రులు, గురువు ఏ పనిని చేయమని ఆజ్ఞాపిస్తారో అది ధర్మాధర్మాలకు విరుద్ధమైనా చేసితీరాలి. వారు ఆదేశించినది తప్ప వేరు ధర్మాన్ని ఆచరించనక్కర లేదు. వారు దేనిని ఆదేశించారో అదే ధర్మమని ధర్మాత్ముల నిర్ణయం. తల్లిదండ్రులు, గురువు అనే ఈ ముగ్గురే ముల్లోకాలు, మూడు ఆశ్రమాలు, మూడు వేదాలు, మూడు అగ్నులు. తండ్రి గార్హపత్యాగ్ని. తల్లి దక్షిణాగ్ని, గురువు ఆహవనీయాగ్ని. లౌకికాగ్ని కంటే ఈ త్రేతాగ్నియే గొప్పది. ఈ ముగ్గురినీ సేవించడంలో ఏమరుపాటు లేకుండా ఉంటే ముల్లోకాలను జయించగలవు. తండ్రిని సేవించడం వలన ఈలోకాన్ని, తల్లిని ఆరాధించడం వలన పరలోకాన్ని, గురువును నియమంగా సేవించడం వలన బ్రహ్మలోకాన్ని తరించగలవు. భారతా ! మూడులోకాల స్వరూపులయిన వీరి పట్ల చక్కగా నడుచుకో ! కీర్తిని, క్షేమాన్ని, చక్కని గొప్ప ఫలితాన్నిచ్చే ధర్మాన్ని పొందగలుగుతావు. వారి మాటను ఎన్నడూ జవదాటకు. వారికంటె ముందుగా ఎన్నడూ భుజించకు. వారిని ఎన్నడూ దూషించకు. నిత్యమూ పరిచర్యలు చేయి. అదే ఉత్తమమైన పుణ్యం. అందువలన కీర్తి, పుణ్యం, యశస్సు, ఉత్తమలోకాలను పొందుతావు. ఈ ముగ్గురినీ ఆదరించిన వానిని సర్వలోకాలు ఆదరిస్తాయి. వారిని అనాదరించినవారికి సర్వకార్యాలు విఫలమవుతాయి. ఈ ముగ్గురు గురువులను నిత్యమూ అవమానించిన వానికి ఈ లోకంలోనూ సుఖం లేదు. పరలోకంలోనూ ఉండదు. ఈ లోకంలోగాని, పరలోకంలోగాని అతని కీర్తి ప్రకాశించదు. పరలోకంలో ఉంటుందని చెప్పే ఇతరమైన శుభం కూడా అతనికి ఉండదు. నేను సమస్త శుభకర్మలను ఆచరించి వారికే సమర్పించాను. అందువల్ల అవి నాకు వందరెట్లు, వేల రెట్లు అధికమైన పుణ్యఫలాన్ని ఇచ్చాయి. యుధిష్ఠిరా ! అందువల్లనే ఈ ముల్లోకాలు నాకు కన్నుల ఎదుట ప్రకాశిస్తున్నాయి. పదిమంది శ్రోతియులకంటే ఆచార్యుడు ఎప్పుడూ అధికుడే. పదిమంది ఆచార్యుల కంటే ఉపాధ్యాయుడు,

పది మంది ఉపాధ్యాయులకంటే తండ్రి, పది మంది తండ్రులకంటే తల్లి ఎప్పుడూ అధికులే. తల్లి ఒక్కతే తన గౌరవం చేత ఈ సమస్త భూమిని తిరస్కరించగలదు. తల్లితో సమానుడైన గురువు లేడు. నా ఉద్దేశంలో తండ్రికంటే, తల్లికంటే గురువే గొప్పవాడు. మాతాపితరులిద్దరూ కేవలం ఈ శరీరానికి జన్మనివ్వడానికే ఉపయోగపడతారు. భారతా ! తల్లిదండ్రులు శరీరాన్ని మాత్రమే సృష్టిస్తారు. ఆచార్యునిచేత ఉపదేశం పొందిన ఆ రెండవ జన్మ దివ్యమైనది. అది అజరామరమైనది. తల్లి, తండ్రి ఏదైనా అపరాధం చేసినప్పటికీ, వీరు ఎప్పుడూ వధింప దగిన వారు కారు. అదే అపరాధం కొడుకు గాని, శిష్యుడు కాని చేస్తే అది వారి దృష్టిలో దోషమే కాదు. వారు అతనిని దూషించరు కూడా. ధర్మమార్గంలో నడిపించడానికి ప్రయత్నిస్తారు. అటువంటివారి మహిమను మహర్షులతో సహితంగా దేవతలు గుర్తిస్తారు. అవితథమైన సత్యకర్మ ద్వారా కవచంలా రక్షిస్తూ, వేదవాక్యాలను ఉపదేశిస్తూ, అనృతాన్ని తప్పిస్తూ ఉండే గురువునే తండ్రిగా, తల్లిగా భావించాలి. అతడు చేసిన ఉపకారాన్ని తెలుసుకొని, అతనిపట్ల ద్రోహం చేయకూడదు. విద్యను నేర్చుకొని, సమీపంగా ఉండి కూడా మనసుతోగాని, కర్మతోగాని గురువును ఆదరించని వారి యొక్క పాపం భ్రూణహత్యాపాపం కంటే మించినది. వారి కంటే పాపి లోకంలో ఎవడూ ఉండడు, గురువుల నుండి వారు ఆశించినట్లుగానే (ఆత్మోన్నతి) గురువులు కూడా వారికి పూజింపదగినవారు. కాబట్టి ప్రాచీన ధర్మాన్ని కోరుకొనే వానికి గురువులు పూజింపదగినవారు, అర్చించదగినవారు, ప్రయత్నపూర్వకంగా కావలసిన వస్తువులు ఇచ్చి సేవింపదగిన వారు అవుతారు.

తండ్రిని సంతోష పెడితే, ప్రజాపతి ప్రీతుడు అవుతాడు. తల్లి ప్రీతి పొందితే, భూదేవిని పూజించినట్లే. ఉపాధ్యాయుడు సంప్రీతి పొందితే, పరబ్రహ్మ పూజితుడయినట్లే. కనుక తల్లికంటే, తండ్రి కంటే గురువే పూజ్యతముడు. గురువులను పూజిస్తే పితృదేవతలతో పాటు ఋషులు, దేవతలు కూడా సంతోషిస్తారు. కాబట్టి గురువు పూజ్యతముడు. ఎటువంటి వర్తనం చేత కూడా గురువు అవమానింపదగిన వాడు కాడు. తల్లి, తండ్రి కూడా గురువు వంటి వారే. వారు అవమానించదగినవారు కారు. వారు చేసిన పనిని దూషించకూడదు. గురువులకు చేసిన సత్కారాన్ని మహర్షులు, దేవతలు తమకు జరిగినట్లుగా భావిస్తారు. ఉపాధ్యాయునికి, తల్లికి, తండ్రికి మనసా, కర్మణా ద్రోహం తలపెట్టిన వారి పాపం భ్రూణహత్యాపాపం కంటే గొప్పది. అతనిని మించిన పాపి వేరొకడు లోకంలో ఉండడు. **ఔరసపుత్రుడై పుట్టి, పెంచి పోషించి, పెద్దవాడుగా చేయబడిన కొడుకు**

తండ్రిని, తల్లిని పోషించి ఆదుకోకపోతే, ఆ పాపం భ్రూణహత్యకంటే విశిష్టమైనది. అతనికంటే పాపాత్ముడు లోకంలో మరొకడు ఉండడు. మిత్రద్రోహం చేసిన వాడు, కృతఘ్నుడు, స్త్రీ హత్య చేసిన వాడు, గురువును చంపిన వాడు - ఈ నలుగురికీ ప్రాయశ్చితం నేను విని ఉండలేదు. మానవుడు ఈ లోకంలో ఆచరించదగినది అంతా వివరంగానే చెప్పాను. ఇది శ్రేయస్సును కలిగిస్తుంది. దీనిని మించిన కర్తవ్యం వేరొకటి లేదు. సర్వధర్మాలను అనుసరించి, వాటిసారంగా దీనిని చెప్పాను.'

109. సత్యాసత్య వివేచనము - ధర్మలక్షణము - లౌకిక నీతి.

యుధిష్ఠిరుడు ప్రశ్నించాడు. 'భారతా ! ధర్మస్థితుడై ఉండాలని కోరుకొనేవాడు ఎలా నడుచుకోవాలి ? విద్వాంసుడా ! భరత శ్రేష్ఠా ! జిజ్ఞాసువు నైన నాకు దీనిని వివరించు. రాజా ! సత్యం, అసత్యం - ఈ రెండూ లోకాలను ఆవరించి ఉన్నాయి. ధర్మమందు నిశ్చితబుద్ధి కలవాడు ఈ రెంటిలో దేనిని ఆచరించాలి ? సత్యం అంటే ఏమిటి ? అసత్యం అంటే ఏమిటి? సనాతన ధర్మం ఏమిటి ? ఏ సమయంలో సత్యం చెప్పాలి ? ఏ సమయంలో అసత్యం చెప్పాలి ?' భీష్ముడు చెప్పసాగాడు. 'భారతా ! సత్యం పలకడమే మంచిది, సత్యం కంటే ఉత్కృష్టమైనది లేదు, లోకంలో తెలుసుకోవడానికి కష్టమైనదానిని చెపుతాను. ఎప్పుడయితే అసత్యమే సత్యమవుతుందో (ప్రాణాలను రక్షించేటపుడు), సత్యమే అసత్యం అవుతుందో (ప్రాణాలను తీసేటపుడు) అప్పుడు సత్యం చెప్పకూడదు. అసత్యం చెప్పడమే ఉచితం అవుతుంది. ఎవనియందు సత్యం స్థిరంగా ఉండదో ఆ మూర్ఖుడు మరణిస్తాడు. సత్యాసత్యాలను నిర్ణయించి, సత్యపాలన చేసే వాడే ధర్మవేత్త అవుతాడు. నీచుడు, సరియైన బుద్ధిలేనివాడు, అతిదారుణ స్వభావం కలవాడు కూడా గుడ్డి పశువులను చంపే బలాకు డనే వ్యాధుని వలె (కర్ణపర్వం - 69వ అధ్యాయం) మహాపుణ్యాన్ని పొందుతాడు. ధర్మకాంక్షి అయిన మూఢుడు (సత్యం చెప్పి) అధర్మఫలాన్ని పొందుతున్నాడు (కర్ణపర్వం- 69ఆ) గంగా తీరంలోని గుడ్లగూబవలె (హింస చేసి) ఒకడు గొప్ప పుణ్యఫలాన్ని పొందుతున్నాడు. ఎంత ఆశ్చర్యమో !* నీవు వేసిన ప్రశ్నయే అటువంటిది. ధర్మస్వరూపం గురించి తెలుసుకోవడం, వివేచించడం

* *వి॥ గంగా తీరంలో ఒక ఆడుపాము వేలకొద్దీ గుడ్లు పెట్టింది. ఒక గుడ్లగూబ రాత్రి వేళ ఆ అండాలనన్నింటినీ చిదిపివేసి నాశనం చేసింది. అందువల్ల అది మహాపుణ్యం చేసినట్లయింది. లేకపోతే ఆ అండాలనుండి వేలకొద్దీ విషసర్పాలు వచ్చి ఎంతోమందిని చంపివేసి ఉండేవి.*

అతికష్టం. దానిని ప్రతిపాదించడం కూడా దుష్కరమే. కాబట్టి ఎవరు ఏ విధంగా నిశ్చయించగలుగుతారు ? ప్రాణులయొక్క అభివృద్ధి కల్యాణాలకోసమే ధర్మప్రవచనం చేయబడినది. కాబట్టి అభ్యుదయ కల్యాణాలతో కూడినదే ధర్మమని శాస్త్రవేత్తలు నిశ్చయించారు. ధరించడం వలననే 'ధర్మం' అని చెప్పబడుతోంది. ప్రజ లందరిని ధర్మమే ధరిస్తోంది (అధోగతిలో పడకుండా కాపాడుతోంది. ప్రాణాలను రక్షిస్తోంది). ధారణ పోషణలు చేసేదే ధర్మమని పండితుల నిశ్చయం.**ప్రాణులను హింసించకుండా ఉండడంకోసమే ధర్మం ఉపదేశింపబడింది. అహింసతోకూడివదే ధర్మమని పెద్దల నిశ్చయం.***

కురుసత్తమా ! దేవదేవుడు, పరమేష్ఠి అయిన బ్రహ్మ "అహింస, సత్యం, అక్రోధం, తపస్సు, దానం, ఈర్ష్యాసూయామాత్సర్యాలు లేకపోవడం, శీలం, - అనేది ధర్మమని" చెప్పాడు. ఇదే సనాతనమైనది. రాజా! ధర్మాలను పాటిస్తూ ఉండేవాడు శుభాలను పొందుతాడు.

వేదాలలో చెప్పబడినదే ధర్మం అని కొందరంటారు. కాదని ఇతరులు కొంద రంటారు. ఆ వాదాలయందు మాకు దోషారోపణ ఏమీ లేదు. కాని అందులో అన్నీ విధింపబడలేదు. అన్యాయంగా అపహరించాలనే కోరికతో, ఎవరయినా ఒక ధనవంతుని జాడ కావాలని అడిగితే వారికి ఆ ధనవంతుని జాడ చెప్పకూడదు. అది ధర్మమని నిశ్చయించబడింది. చెప్పనందువల్ల ఆ ధనికుడు రక్షింపబడేట్లయితే ఏ విధంగానూ చెప్పకూడదు. తప్పకుండా చెప్పవలసి వస్తేనో, లేదా చెప్పక పోవడం వలన దొంగలకు సందేహం కలిగితేనో, అప్పుడు నిజం కంటే అబద్ధం చెప్పడమే మేలు. ఈ విషయం ఆలోచించి, నిర్ణయించబడింది. శపథం చేయడం వల్ల కూడా పాపాత్ముల చెరనుండి విడుదల పొందగలిగితే అలాగే చేయాలి. కాని సాధ్యమైనంత వరకు ఏ రకంగానూ వారికి ధనాన్ని ఇవ్వకూడదు. పాపులకు ధనం ఇస్తే దాతను కూడా పీడిస్తుంది. ఋణగ్రహీతను తన ఆధీనంలో ఉంచుకొని, సేవలు చేయించుకొంటూ, ధనం వసూలు చేసుకోవాలని అనుకొనేవాని వాదనలో సత్యాన్ని నిరూపించడానికి ఒక్కొక్క సారి సాక్షులు కావాలి. చెప్పవలసిన సత్యాన్ని చెప్పని ఆ సాక్షులు అందరూ అసత్యవాదులే.

కాని ప్రాణాపాయ సమయంలోను, వివాహవేళలలో, ఇతరుల అర్థాన్ని రక్షించడానికి, ధర్మం కోసం అసత్యం చెప్పవలసి వస్తుంది. ఇతరుల ప్రయోజనం కోరి నీచుడైనా

---

* **అహింసార్థాయ భూతానాం ధర్మప్రవచనం కృతమ్ ।**
యః స్యాదహింసాసంపృక్తః స ధర్మ ఇతి నిశ్చయః ॥ 12

ధర్మంగా భిక్షమెత్తినపుడు వాగ్దానం చేస్తే, తప్పక ఈయవలసినదే, స్వీయ కార్యమైతే (సొంతం కోసం) మాత్రం బలవంతంగా చేయబడినదే. ఎవడయినా ధర్మసాధకుడు ధర్మప్రతిజ్ఞ నుండి భ్రష్టుడై ఆ మార్గాన్ని (పాపమార్గాన్ని) ఆశ్రయిస్తే అతనిని దండించి చంపవలసినదే. ధర్మచ్యుతుడై, ఎల్లప్పుడూ ఆసురధర్మాలనే పాటిస్తూ, స్వధర్మాన్ని విడిచి, దాని చేతనే జీవించాలని కోరుకొనే శత్రుని, పాపాత్ముని, కపట జీవనం కలవానిని సమస్తోపాయాల చేత చంపవలసినదే. ఎందుకంటే పాపాత్ము లందరికీ ధన మొక్కటే ఉంటుందనే నిశ్చయం. ఇటువంటివారు ఇతరులకు అసహ్యులు, ఇతరులు తమ అన్నం వారికి పెట్టరు. వారి అన్నం తాము తినరు. వారు మోసంతో పతనాన్ని పొందిన వారు. దేవతలనుండి, మనుష్యులనుండి భ్రష్టులై ప్రేతాత్మల వలె ఉంటారు, యజ్ఞాలు చేయరు, తపస్సు ఉండదు. వారితో సాంగత్యం చేయకు. జీవితాన్ని నాశనం చేయడం ధననాశనం కంటే దుఃఖతర మైనది. ఈ ధర్మాన్ని ప్రేమించండి అని ప్రయత్నపూర్వకంగా నీవు చెప్పాలి. పాపాత్ములకు ధర్మమనేది ఏదీ లేదనే నిశ్చయం. అటువంటి వారిని చంపినా, పాపం అంటదు. పాపులు తమ కర్మల చేతనే మరణించి ఉంటారు - చచ్చినవారినే చంపుతున్నారు. కనుక పాపం అంటదు. ఈ హతబుద్ధులను చంపాలనే ప్రతిజ్ఞను ఎవరైనా చేయవచ్చును. కాకులు గద్దలు వలె కపటంతో జీవించేవారూ ఉంటారు. శరీరాలు విడిచాక వారు ఇటువంటి యోనులందే జన్మిస్తూ ఉంటారు. **ఒక వ్యక్తి ఎవరి పట్ల ఎలా ప్రవర్తిస్తాడో అతనిపట్ల వారు అలా ప్రవర్తించడమే ధర్మం, మాయావర్తములు మాయ చేత బాధింప తగినవారు. సాధువర్తములు సాధుత్వంచేత చేరదగిన వారు.***

110. దుఃఖనివారణోపాయములు (దుర్గాతి తరణము).

యుధిష్ఠిరుడు అడిగాడు. పితామహా ! ఆయా సమయాలలో ఆయా భావాలచేత బాధలు పడుతూ ఉండే జీవులు దేనివలన దుర్గమమైన బాధలను తరించగలుగుతారు ? అది నాకు చెప్పు.' భీష్ముడు చెపుతున్నాడు 'ద్విజాలు శాస్త్రంలో చెప్పబడిన నాలుగు ఆశ్రమాలలోనూ ఆయా నియమాలను పాటిస్తూ మనో నిగ్రహాన్ని కలిగి ఉంటే వారు ఆ కష్టాలను తరించగలరు. దంభాచారం లేనివారు, నియమబద్ధమైన నడవడిక కలవారు,

* **యస్మిన్వ్యథా వర్తతే యో మనుష్యః తస్మింస్తథా వర్తితవ్యం స ధర్మః ।**
మాయాచారో మాయయా బాధితవ్యః సాధ్వాచారః సాధునా ప్రత్యుపేయః ॥ 30

విషయవాసనలను నిగ్రహించినవారు దుర్గమమైన కష్టాలను తరించగలరు. ఇతరులు ఏమైనా అన్నా బదులివ్వనివారు, హింసించినా తిరిగి హింసించనివారు, ఇవ్వడమేతప్ప అడగనివారు దుర్గమమైన కష్టాలను తరించగలరు. అతిథులను నిత్యం తన ఇంట ఉంచుకొనేవారు, ఎవరిపైనా ఎన్నడూ దోషారోపణ చేయని వారు, నిత్యమూ స్వాధ్యాయ శీలురై ఉండేవారు దుర్గమమైన కష్టాలను తరిస్తారు. ధర్మవేత్తలై మాతా పితరుల సేవలో వర్తించే వారు, పగలు నిద్రపోయి కలలు కననివారు కష్టాలను అన్నింటినీ తరిస్తారు. మనసా వాచా కర్మణా పాపం చేయనివారు, ఏ ప్రాణినీ హింసించనివారు దుర్గమమైన కష్టాలను తరిస్తారు. రజోగుణ సమన్వితులై లోభంతో ధనాలను దోచుకొనని రాజులు, రాజ్యాలను అన్ని విధాలా సంరక్షించే రాజులు కష్టాలను తరిస్తారు. అగ్నిహోత్రకార్యాలు నిష్ఠగా ఆచరిస్తూ, ఋతుకాలమందు మాత్రమే తమ భార్యలతో శాస్త్రానుసారంగా నడుచుకొనే గృహస్థులు కష్టాలను తరిస్తారు. మరణం వల్ల కలిగే భయాన్ని వదిలి, ధర్మంగా జయించాలని కోరుకొనే వీరులు కష్టాలను తరిస్తారు. ప్రాణాలకు ముప్పు దాపురించిన సమయంలో కూడా సత్యం పలికేవారు, ప్రాణులందరికీ ప్రమాణభూతులై నిలిచి, కష్టాలను తరిస్తారు. ఆదర్శవంతమైన మంచిపనులు చేసేవారు, సత్యవాక్కులు పలికేవారు, ధనాన్ని సత్కార్యాలకే మీదుకట్టేవారు కష్టాలను తరిస్తారు. తపోనిష్ఠులు, మంచి తపస్సు చేసినవారు, అనధ్యయన దినాలలో స్వాధ్యాయం చేయని బ్రాహ్మణులు కష్టాలను తరిస్తారు. కౌమారదశలో బ్రహ్మచారులై తపస్సుచేసేవారు, విద్యావేదాధ్యయనాలు వ్రతంగా పాటించి స్నాతకులైనవారు - దుర్గమమైన కష్టాలను దాటగలరు. రజో గుణం పూర్తిగా శాంతించి తమోగుణాన్ని పూర్తిగా తుడిచిపెట్టి సత్త్వగుణస్థితులై ఉండే మహాత్ములు దుర్గమమైన కష్టాలను తరిస్తారు. ఎవరినీ భయపెట్టకుండా, ఎవరికీ భయపడకుండా ఉండేవారు, లోకాన్నంతటినీ ఆత్మసమానంగా చూసేవారు కష్టాలను తరిస్తారు. విషయసుఖాల నుండి మళ్లిన వారు ఇతరుల సంపదకు ఈర్ష్య పడని సత్పురుషులు కష్టాలను తరిస్తారు. దేవతలందరికీ నమస్కరిస్తూ, సమస్త ధర్మాలను వింటూ, శ్రద్ధాసక్తులు కలిగి, శాంతంగా ఉండేవారు దుర్గమమైన కష్టాలను తరిస్తారు. స్వయంగా గౌరవాన్ని కోరుకోకుండా, ఇతరులను గౌరవిస్తూ, మాననీయులకు నమస్కరించేవారు కష్టాలను తరిస్తారు. సంతానార్థులై ప్రతి తిథియందు పరిశుద్ధమైన మనసుతో శ్రాద్ధకార్యాలను చేసేవారు కష్టాలను తరిస్తారు. క్రోధాన్ని అదుపులో ఉంచుకొంటూ, క్రుద్ధులైన వారిని శాంతింపచేస్తూ, ప్రాణుల మీద ఎన్నడూ కోపగించని వారు కష్టాలను దాటుతారు. పుట్టినది మొదలుకొని మద్యాన్ని, మధుమాంసాలను ఎప్పుడూ వదిలిపెట్టిన మానవులు

ఈ లోకంలో కష్టాలను తరిస్తారు. **జీవయాత్ర గడుపుకోవడానికే భుజిస్తూ, సంతానం పొందడానికే మైథునక్రియ చేస్తూ, సత్యం చెప్పడానికే మాటాలాడుతూ ఉండేవారు దుర్గమమైన కష్టాలను తరించగలరు.*** సమస్త జీవులకు ఈశ్వరుడు, జగత్తునకు ఉత్పత్తి ప్రళయకారకుడు అయి భగవంతుడైన నారాయణుని యందు భక్తి భావంతో ఉండేవారు దుర్గమమైన కష్టాలను దాటగలరు. ఆ నారాయణుడు పద్మం వంటి ఎఱ్ఱని కన్నులు కలవాడు, పీతవస్త్రధారి, మహాభుజుడు, నీకు స్నేహితుడు, సోదరుడు, మిత్రుడు, బంధువు అయిన శ్రీకృష్ణుడే సుమా ! అచింత్య స్వరూపుడు, పురుషోత్తముడు, ప్రభువు అయిన గోవిందుడు ఇచ్ఛాపూర్వకంగా ఈ లోకాలన్నింటినీ చర్మంలాగా ఆవరించి ఉన్నాడు. పురుషశ్రేష్ఠా ! యుధిష్ఠిరా ! దుర్ధర్షుడైన ఈ పురుషోత్తముడే వైకుంఠనివాసుడైన ఆ శ్రీమహావిష్ణువు. రాజా! అతడు నీకు, అర్జునునికి ప్రియమూ, హితమూ చేస్తూ ఉన్నాడు. పాపాలను హరించే నారాయణుని భక్తితో గట్టిగా ఆశ్రయించేవారు ఈ లోకంలో దుర్గమమైన కష్టాలనుండి గట్టెక్కుతారు. ఇందులో ఆలోచించవలసిన దేమీ లేదు.

భారతా ! కమలలోచనుడైన కృష్ణుని యందు సమస్త భావాల చేత కర్మలను సమర్పించిన వారు కష్టాలను దాటుతారు. యజ్ఞముల చేత పూజింపదగిన దేవుని, లోకకర్తను, బ్రహ్మను, సత్పురుషులకు దిక్కయినవానికి నమస్కరించినవారు కష్టాలనుండి తరిస్తారు. ఇంద్ర విష్ణు మహేశ్వరులు, లోకాలకు పితామహుడైన బ్రహ్మ ఆ దేవదేవుని మహాప్రభువును వివిధ స్తోత్రాలతో స్తుతిస్తూ ఉంటారు. అతనిని పూజించే వారు శాశ్వతంగా కష్టాలనుండి గట్టెక్కుతారు.

ఈ దుర్గాతితరణమనే అధ్యాయాన్ని చదివినవారు, వినిపించినవారు, బ్రాహ్మణులకు వివరించినవారు దుర్గమమైన కష్టాలను తరిస్తారు. అనఘా ! ఇహపరలోకాలలో మానవులు కష్టాలను తరించడానికి నేను ఈ కర్తవ్య లేశాలను సంక్షేపంగా చెప్పాను.'

111. వ్యాఘ్రగోమాయు సంవాదము.

యుధిష్ఠిరుడు అన్నాడు. 'పితామహా ! క్రూరులు సౌమ్యం గాను, సౌమ్యులు క్రూరంగానూ కనిపిస్తూ ఉంటారు. ఇటువంటి పురుషులను మేము ఏ విధంగా తెలుసుకోగలుగుతాం?' భీష్ముడు చెపుతున్నాడు. 'ఈ విషయంలో పెద్దలు వ్యాఘ్రగోమాయు సంవాదం అనే ఈ పురాతన కథను చెప్తూ ఉంటారు యుధిష్ఠిరా ! దానిని శ్రద్ధగా విను. పూర్వం సుసంపన్నమైన పురిక అనే పేరుగల పట్టణంలో పౌరికుడనే ఒక రాజు ఉండేవాడు.

---

* యాత్రార్థం భోజనం యేషాం సంతానార్థం చ మైథునమ్ ।
వాక్సత్యవచనార్థాయ దుర్గాణ్యతితరంతి తే ॥ 23

అతడు క్రూరుడు. నరాధముడు. ఇతరులను హింసించడం వేడుకగా భావించేవాడు. అతడు ఆయువు తీరగానే ఎవరూ కోరుకోని గతిని పొందాడు. పూర్వకర్మల వలన నక్క జన్మను పొందాడు. పూర్వజన్మ వైభవాన్ని స్మరిస్తూ, పరమనిర్వేదాన్ని పొందాడు. ఇతరులు తెచ్చి ఇచ్చిన మాంసాన్ని కూడా తినడం లేదు. సర్వప్రాణులను హింసించడం మానుకొన్నాడు. సత్యవాక్పాలకుడై, ఆ వ్రతాన్ని మిక్కిలి నియమంగా కొనసాగిస్తున్నాడు. చెట్లనుండి రాలిన పళ్లనే నియమిత సమయాలలో ఆహారంగా స్వీకరిస్తూ ఉన్నాడు.

నియమంగా వ్రతాన్ని పాటిస్తున్నప్పటికీ ఒక్కొక్కసారి ఆకులను ఆహారంగా తీసుకొంటూ, ఒక్కొకసారి నీళ్లతోను గడుపుతూ సంయమనంతో ఉంటున్నాడు.

శ్మశానమే ఆ నక్కకు నివాస స్థాన మయింది. అదే దానికి ఇష్టమయింది. జన్మభూమి అనే పట్టింపువల్ల ఇతరత్ర నివసించడానికి ఇష్టపడలేదు. ఆ నక్క యొక్క సదాచారాలంటే గిట్టక తోడబుట్టిన నక్కలన్నీ వినయంగా, నమ్మకంగా మాటలాడుతూ దాని బుద్ధిని చలింపచేయాలని ప్రయత్నించాయి. "నీవు మాంసాహారివై ఉండీ, శ్మశానంలో నివసిస్తూ పవిత్రంగా ఉండాలని కోరుకొంటున్నావు. ఇది విపరీతంగా ఉంది. కాబట్టి నీవు మాతో సమానంగా ఉండు. నీకు భోజనం మేము పెడతాము. తిను. నీ సదాచారాలు వదిలి పెట్టు. నీ జాతివారికి ఏది ఆహారమో అదే నీకూ ఎప్పుడూ ఉండుగాక.' అని పలికిన వాటి మాటలు విని, ఆ నక్క ఏకాగ్రచిత్తంతో మధురంగా, వివరంగా, యుక్తియుక్తంగా, మృదువైన మాటలతో ఇలా బదులిచ్చింది.

'నా పుట్టుకయే నిరూపింపరానిది. సదాచారాలతోనే కులం వేరు తెచ్చుకొంటుంది. కులం యొక్క యశస్సు ఇనుమడించే కర్మలనే చేయాలని నేను కోరుకొంటున్నాను. శ్మశానం నా నివాసమంటారా ! దానికి నా సమాధానం వినండి. ఆత్మయే కర్మలను చేయిస్తుంది, కాని ఆశ్రమం (ఆవాసం) ధర్మానికి కారణం కాదు. ఆశ్రమంలో ఉంటూ ద్విజుని చంపితే అది పాపం కాకుండా పోతుందా ? ఆశ్రమం కాని చోట ఉంటూ గోవును దానం చేస్తే అది వ్యర్థం అవుతుందా? మీరందరూ స్వార్థం మీద లోభంతో కేవలం తినడం మీదనే ఆసక్తు లవుతున్నారు. దానిని అనుసరించి వచ్చే మూడు దోషాలను మూఢులై మీరు గమనించడం లేదు. మీ జీవిక అవిశ్వాసంతో నిండి ఉన్నది, నింద్య మైనది, ధర్మానికి హాని కలిగిస్తోంది కాబట్టి దూషితమైనది. ఇహపరలోకాలు రెండింటిలోను అనిష్టాన్ని కలిగించేది కాబట్టి ఈ వృత్తిని నేను మెచ్చను, నక్క మాటలు నలువైపులా వ్యాపించాయి. దానిని సదాచారవంతునిగా, పండితునిగా తలచి ప్రఖ్యాత

పరాక్రమం కల ఒక శార్దూలం, తనకు తగినట్లుగా పూజించి, స్వయంగా దానిని మంత్రిగా వరించింది. శార్దూలం అంటోంది. 'సౌమ్యుడా ! మీ గురించి నాకు తెలుసు. నాతో పాటు దేహయాత్ర సాగించండి. మీకు ఇష్టమైన భోగాలను పుష్కలంగా అనుభవించవచ్చును. అక్కరలేని వానిని పరిహరించవచ్చును. మీకు ఒక విషయం గుర్తు చేస్తున్నాను. మేము చాలా క్రూరులమని ప్రసిద్ధి చెందిన వారం. మృదు పూర్వకంగా, హితకరంగా ఉంటే శ్రేయస్సును పొందగలవు. మహానుభావుడైన మృగరాజు యొక్క ఆ మాటలను మిక్కిలిగా మన్నించి, గోమాయువు కొద్దిగా తలవంచి, వినయం ప్రకటిస్తూ ఇలా అంది.'

నక్క అన్నది. 'మృగరాజా ! మీరు నా గురించి చెప్పినది ఉచితంగానే ఉంది. ధర్మార్థాలను సాధించడంలో నేర్పరులు, పవిత్రవర్తనులు అయిన సహాయకులను మీరు వెదకడం కూడా బాగానే ఉంది. వీరుడా ! అమాత్యుడు లేకుండా మహాసామ్రాజ్యాన్ని పాలించడం సాధ్యంకాదు. అలా అని శరీరాన్ని శుష్కింపచేసే దుష్టమంత్రితో కూడా రాజ్యపాలన సాగదు. మహాభాగా ! మీ పట్ల అనురక్తులు, నీతిజ్ఞులు, సద్భావసంపన్నులు, పరస్పరం పెనవేసుకొనని వారు, జయ కాంక్షులు, లోభరహితులు, కపటనీతికుశలులు, బుద్ధిమంతులు, స్వామి కార్యతత్పరులు, మనస్వులు - అయినవారిని సహాయకులుగా నియమించుకొని, ఆచార్యులను పితరులను గౌరవించినట్లుగా పూజించాలి. మృగరాజా ! సంతుష్టికంటే నాకు వేరేమీ రుచించదు. నేను సుఖాలను గాని, భోగాలను గాని వాటి కాశ్రయమైన ఐశ్వర్యాన్ని గాని కోరను. మీ పాత సేవకుల యొక్క స్వభావంతో నా స్వభావం సరిపడదు. దుశ్శీలులైన వారు నన్ను, నిన్ను విడదీస్తారు. మీరు పరాక్రమవంతులైన ఇతరులకు కూడా మంచి ఆశ్రయం. సుశిక్షతమైన బుద్ధికలవారు. మహాభాగులు. తప్పులు చేసినవారిని కూడా దయతలచేవారు. మీరు దీర్ఘదర్శులు, మహోత్సాహులు, స్థూలమైన (స్పష్టమయిన) లక్ష్యంకలవారు, మహాబలులు, ధన్యులు, అమోఘంగా పనులు నెరవేర్చేవారు, భాగ్యాలంకృతులు. కాని నేనో ! నాకు నేను సంతుష్టిగా ఉండేవాడిని. దుఃఖకరమైన వృత్తిని అనుష్ఠిస్తున్నవాడిని. సేవ చేయడం కూడా తెలియనివాడిని. స్వేచ్ఛగా అడవిలో తిరిగేవాడిని. రాజాశ్రమంలో ఉన్నవారందరికీ రాజుకు సంబంధించిన దోషాలన్నీ అంటుతాయి. వనవాసులకైతే నిస్సంగంగా, నిర్భయంగా ఉండడమే వ్రత చర్య. రాజుగారి పిలుపు అందుకొన్న వానికి మనసులో భయం ఉంటుంది. అడవిలో మూలాలు, ఫలాలు తినే సంతుష్టునికి ఆ భయం ఉండదు. ఒక వైపు ఏమీ కష్టపడకుండా లభించే జలం, మరోవైపు భయంతో కూడిన రుచికరమైన భోజనం. ఆలోచిస్తే ఎక్కడ సంతోషం ఉందో

ఇదే సుఖం అనిపిస్తోంది.

అసత్యమైన అపరాధాలు ఆరోపించబడి, దూషితులై రాజులచేత మరణదండన పొందిన భృత్యుల సంఖ్య నిజమైన అపరాధాలు చేసి శిక్షించబడిన వారి సంఖ్యకన్న ఎక్కువ. మృగరాజా ! ఈ మంత్రిత్వ కార్యం నేను చేయాలనే నీవు భావిస్తే ఒక నియమం విధించా లనుకొంటున్నాను. దాని ప్రకారం నీవు నాపట్ల నడుచుకోవాలి. నా వారిని గౌరవించాలి. నేను చెప్పే హితోక్తులను వినాలి. నా జీవికకు నీవు కల్పించే వ్యవస్థ నీ వద్దనే సుస్థిరంగా ఉండాలి. నీ ఇతర మంత్రులతో కలిసి ఎన్నడూ మంత్రాంగం చేయను. ఎందుకంటే నీతిమంతులయిన వారు నాపై అసూయపడుతూ వ్యర్థమైన మాటలు అంటారు. నేను ఒక్కడినే ఏకాంతంగా మిమ్మల్ని కలసి రహస్యంగా హితవచనాలు చెప్తాను. నీ జ్ఞాతులకు సంబంధించిన కార్యాలలో మేలుకీళ్లను గురించి మాత్రం నన్ను అడగవద్దు. నాతో కలిసి ఆలోచన చేసి, తదుపరి నీవు నీ మంత్రులకు దోషులైనా ప్రాణదండన విధించకు. అలాగే నా వారి మీద కూడా కోపంతో దండన విధించకు.' "అలాగే అగుగాక !" అని పలికి మృగరాజు ఆ నక్కను మిక్కిలి గౌరవించాడు. నక్క ఆ పులిరాజుకు ఆలోచనలు చెప్పే మంత్రిగా నియమింపబడింది. నక్క మంచి పనులు చేయడం, చేసిన పనులకు సన్మానాలు పొందడం చూసి, పూర్వపు సేవకులు మాటిమాటికి సంఘటితమవుతూ అతనిని ద్వేషించసాగారు. ఆ కుటిలబుద్ధులు స్నేహం నటిస్తూ, గోమాయువు దగ్గర చేరి బుజ్జగిస్తూ, తమకు అనుకూలంగా చేసుకొని దోషాలలో తమతో సమానం చేయాలని అనుకొన్నారు. ఇంతకుపూర్వం వారు వేరుగా ఉండేవారు. ఇతరుల ద్రవ్యాన్ని అపహరిస్తూ ఉండేవారు. గోమాయువు అవన్నీ కట్టడి చేయడంతో కొద్దిగా కూడా ధనం తీసుకోవడానికి అశక్తు లయ్యారు. గోమాయువు యొక్క పతనాన్ని కోరుకొంటున్న వారు అనేక విధాలైన ప్రసంగాలతో అతనిని మభ్యపెడుతున్నారు. అధికమైన ధనం చేత అతని బుద్ధిని ప్రలోభపెడుతున్నారు. అయినా ఆ మహాప్రజ్ఞని ధైర్యం వాటి వలన చలించలేదు. అప్పుడు ఇతరు లందరూ అతని వినాశానికి ప్రతిజ్ఞపూని ప్రయత్నించ సాగారు. మృగేంద్రునికి కావలసిన, తయారుగా ఉంచబడిన మాంసాన్ని వారు స్వయంగా అక్కడి నుండి తీసి, గోమాయువు నివాసంలో పెట్టారు. మాంసం ఎందుకు అపహరించబడిందో ఎవరు పన్నాగం చేశారో అదంతా అతనికి విదితమే. ఏదో కారణం ఆశించి, సహించి, ఊరుకొన్నాడు. మంత్రి పదవిని చేపట్టేముందు వ్యాఘ్రంతో అతడు ఒక సమయం చేసుకొన్నాడు - "రాజా ! నాతో మైత్రిని కోరుకొంటే నీవు నన్ను చంపకూడదు". అని.

భీష్ముడు చెపుతున్నాడు. 'ఆకలిగొన్న మృగేంద్రుడు భుజించడానికి లేచేసరికి, భోజనంగా వడ్డించదగిన ఆ మాంసం కనపడలేదు. మృగరాజు దొంగను కనిపెట్టమని ఆజ్ఞాపించాడు. ఆ పని చేసిన వారే మృగేంద్రునికి ఆ మాంసం గురించి "మీరు ప్రాజ్ఞులని, పండితులని మన్నించే మీ మంత్రియే దానిని తీశాడు" అని వివరించారు. గోమాయువు యొక్క చాపల్యాన్ని విని శార్దూలం కోపం పట్టలేక పోయింది. సహించలేకపోయింది. దానిని చంపాలని కూడా అనుకొంది. అతనిలోని ఈ దోషాన్ని చూసి పూర్వపు మంత్రులు తమలో తాము – "ఇతడు మన అందరి వృత్తులను భంగపరచి నిలువ(దొక్కుకున్నాడు" అని నిశ్చయించుకొని, అందరూ కలిసి రాజుకు అతని తప్పుడు పనులను గూర్చి చెప్పడం మొదలు పెట్టారు. "మహారాజా! ఇతడు ఇటువంటి పని చేశాడంటే అతడు ఇంకేమి చేయకుండా ఉంటాడు? అతడు ఎటువంటి వాడని ప్రభువులు పూర్వం విన్నారో వాడు అటువంటి వాడు కాదు. అతడు మాటలలోనే ధర్మిష్ఠుడు. స్వభావంలో క్రూరుడు. ధర్మం ముసుగు కప్పుకొన్న ఈ పాపాత్ముడు ఆచారాలు పాటిస్తుండడం వట్టిదే. తన పనులకోసం, తిండికోసం అతడు వ్రతాలు చేస్తూ శ్రమపడుతున్నాడు. ఇది మీరు నమ్మకపోతే ఇదిగో మీకు దానిని చూపిస్తాం" అన్నారు. ఇలా అని వారు తక్షణమే ఆ మాంసాన్ని గోమాయువు వద్ద నుండి తీసుకొని వచ్చారు. మాంసాన్ని దొంగిలించాడని భావించి, వారి మాటలూ విని, వ్యాఘ్రం గోమాయువును వధించమని ఆదేశించింది.

శార్దూలం యొక్క మాటలు విని, దాని తల్లి మంచి మాటలతో నచ్చచెప్పడానికి వచ్చింది. "కుమారా ! ఇది కపటప్రయత్నంతో కూడుకొని ఉన్నట్లుంది. నీవు దీనిని పట్టించుకోకు. పనుల ఒత్తిడిచేత కలిగిన దోషాలచేత మలిన మనస్కులైనవారు నిర్దోషిని దోషిగా చూస్తారు. ఒకానొకడు ఇతరుని ఔన్నత్యాన్ని సహించలేడు. ఈర్ష్యయే వైరానికి కారణమై పనిచేస్తుంది. పరిశుద్ధుడైనప్పటికీ కార్యనిమగ్నుడైనవానియందు దోషారోపణ జరుగుతుంది. అడవులలో ఉంటూ తన పనులు తాను చేసుకొనే మునికి కూడా మిత్రులు, ఉదాసీనులు, శత్రువులు – అనే మూడు పక్షాలు ఏర్పడుతాయి. లోభులకు ఉదారులయందు, పిరికివారికి వీరులందు, మూర్ఖులకు పండితులందు, దరిద్రులకు ధనవంతులందు, అధార్మికులకు ధర్మనిష్ఠులయందు, విరూపులకు అందమైన వారి యందు ద్వేషం ఉంటుంది. చాలామంది పండితులలో కూడా మూర్ఖులు, లుబ్ధులు, కపట జీవనులు ఉంటారు. నిర్దోషి అయిన బృహస్పతి వంటి బుద్ధిమంతుని యందు కూడా దోషారోపణ చేస్తారు. నీ శూన్యగృహంనుండి ఆ మాంసం అపహరింప బడినప్పటికీ, అతడు మాంసాన్ని ఇచ్చినా

ముట్టడు, దీనిని బాగా తరచి ఆలోచించు. అసభ్యులు సభ్యుల మాదిరిగా ఉంటారు. సభ్యులు అసభ్యులుగా కనపడతారు. ఎన్నో రకాల భావాలు చూస్తూ ఉంటాం. వారిని పరీక్షించడం యుక్తం. ఆకాశం ఉబ్బెత్తుగా ఉన్నట్లుగా, మిణుగురు పురుగు అగ్నికణంలా కనపడుతుంది. కాని ఆకాశంలో ఉబ్బెత్తు ఉండదు. మిణుగురు పురుగులో నిప్పు ఉండదు. కాబట్టి ప్రత్యక్షంగా చూసినా విషయాన్ని పరిశీలించడం ఉచితం. పరీక్షించి నిర్ధారించుకొన్న విషయంలో ఆ తరువాత పశ్చాత్తాప పడనక్కరలేదు. కుమారా ! బలవంతుడైన రాజు ఇతరుని చంపడం కష్టమైన పనేమీ కాదు. కాని బలవంతులకు క్షమాగుణం లోకంలో గొప్పదనాన్ని, కీర్తిని కలిగిస్తుంది. కుమారా ! ఇతనిని నీవే మంత్రి పదవియందు కూర్చో పెట్టావు. నీ సామంతులలో కూడా ఇతడు పేరు తెచ్చుకొన్నాడు. పాత్రుడైన వ్యక్తి అతికష్టం మీద లభిస్తాడు. ఇతడు నీకు సుహృదుడు. ఇతనిని రక్షించు. ఇతరుల దోషాలవలన దోషిగా చేయబడిన నిర్దోషిని దండించే రాజు దుష్టులైన మంత్రులు కలిగిన వాడు కావడం చేత తనకు తానుగా శీఘ్రంగానే నశిస్తాడు అని చెప్పింది. అప్పుడు శత్రసమూహంనుండి ఒకడు ఇవతలకు వచ్చాడు. ఆ ధర్మాత్ముడు గోమాయువు పట్ల చేయబడిన మోసాన్ని అంతటినీ చెప్పాడు. అంతట అతని సత్ప్రవర్తనను తెలుసుకొని, రాజు అతనిని సత్కరించి, ఆ అభియోగాన్నుండి విముక్తుని చేశాడు. స్నేహభావంతో మాటి మాటికి ఆలింగనం చేసుకొన్నాడు. నీతిశాస్త్రవేత్త అయిన గోమాయువు రాజు యొక్క అనుమతి పొంది, ఆ అవమానంతో బాధపడుతూ ప్రాయోపవేశం చేయాలని అనుకొంది. కాని శార్దూలం స్నేహంతో కన్నులు బాగా విప్పార్చుకొని, ధర్మాత్ముడయిన గోమాయువును పూజలతో బాగా సత్కరించి, ప్రాయోపవేశాన్ని వారించింది. రాజుగారియందు స్నేహం వలన కలిగిన సంభ్రమాన్ని చూసి గోమాయువు అతనికి నమస్కరించి, బాష్పరుద్ధకంఠంతో ఇలా అంది.

రాజా ! మొదట మీరు నన్ను సత్కరించారు. పిదప అవమానించారు. శత్రువుపాలు చేయబడ్డాను. నేను మీ వద్ద ఉండడానికి తగను. అసంతుష్టులు, గౌరవమైన పదవులనుండి తొలగింపబడిన వారు, అవమానింపబడినవారు, స్వయంగా మోసపోయినవారు, ఇతరుల మోసాలకు గురై గౌరవం కోల్పోయిన వారు, పరిక్షీణులు, లుబ్ధులు, క్రుద్ధులు, భీతులు, మోసగింపబడిన వారు, ధనం అంతా కోల్పోయినవారు, గర్వితులు, ఆదాయం పోయినవారు, గొప్ప పదవులను ఆశించేవారు, బాధింపబడినవారు, రాజుగారికి చిక్కులు కలగాలని ఎదురుచూసేవారు, అజ్ఞాతంలో ఉండేవారు, కపటంతో నిండినవారు – వీరంతా శత్రువులకు

సాధనాలుగా మారతారు. ఒక పర్యాయం స్థాన భ్రష్టత పొందిన వాడిని, అవమానం పొందిన వాడిని కదా ! నన్ను ఎలా విశ్వసించగలుగుతారు? అయినా నేను ఎలా ఉండగలను ? సమర్థ డని చేరదీసి, పరీక్షించి, పదవి నిచ్చి, చేసుకొన్న ఒప్పందాన్ని ఉల్లంఘించి, నీవు నన్ను అవమానించావు. మొదట సభలో ఇతడు శీలవంతుడు అని ప్రకటించిన తరువాత, ప్రతిజ్ఞాపరిరక్షకుడు అతని దోషాలను చెప్పకూడదు. ఈ రీతిగా అవమానం పొందిన నాకు ఇక్కడ విశ్వాసం ఉండదు. మీకు కూడా నా మీద విశ్వాసం పోయింది. ఈ స్థితిలో నాకు భయం కలుగుతుంది. నీవు సందేహిస్తున్నావు. నేను భయపడుతున్నాను. ఇతరులలో తప్పులు వెదకేవారు ఇక్కడున్నారు. వారు నా యందు స్నేహభావం లేనివారు. వారిని తృప్తిపరచడం కష్టం. ఈ మంత్రి కార్యం కూడా చాలా మోసాలతో కూడుకొన్నది. **భిన్నమైన ప్రేమబంధం అతికష్టంమీద అతుక్కొంటుంది. అతుకుకొన్న ప్రేమ బంధం అతికష్టం మీద విడిపోతుంది. విడిపోతూ, కలుస్తూ ఉండే ప్రేమలో స్నేహం ఉండదు.*** తన్నుగాని, ఇతరులను గాని పట్టించుకోకుండా ప్రభువుయొక్క హితం మాత్రమే చూపేవాడు ఎవడో ఒక్కడుంటాడు. కార్యం సాధించాలని అపేక్షించేవారే ఉంటారు కాని, స్నేహభావం గలవారు మిక్కిలి దుర్లభులు. యోగ్యులయిన పురుషులను గురించి తెలుసుకోవడం రాజులకు మిక్కిలి కష్టం. వారి చిత్తం చంచలంగా ఉంటుంది. కనుక సమర్థుడైనప్పటికి శంకించదగని వాడు వందమందిలో ఒకడు దొరుకుతాడు. అకస్మాత్తుగా గౌరవించడం, అకస్మాత్తుగా అవమానించడం; మేలు చేసి కీడు చేయడం; గొప్పదనం కల్పించి, క్రిందికి దిగజార్చడం – ఇదంతా రాజులకుండే లఘు బుద్ధి.' ఈ విధంగా ధర్మకామార్థహేతువులతో కూడి ఉండేలా నచ్చ చెప్పి, రాజును సంతృప్తి పరచి, గోమాయువు అడవికి బయలుదేరింది. బుద్ధిశాలి అయిన గోమాయువు ఆ మృగేంద్రుని అనునయ వాక్యాలను పట్టించుకోక ప్రాయోపవేశం చేసి, శరీరాన్ని, విడిచి స్వర్గాన్ని పొందింది.'

112. ఉష్ట్రగ్రీవోపాఖ్యానము.

యుధిష్ఠిరు డిలా అడిగాడు. 'సమస్త ధర్మవేత్తలలో శ్రేష్ఠుడా ! రాజు ఏమి చేయాలి ? ఏమి చేస్తే రాజు సుఖంగా ఉంటాడు ? దీనిని యథార్థరూపంగా చెప్పు.' భీష్ముడు చెపుతున్నాడు. 'రాజా ! రాజుచేయవలసినది, ఏది చేస్తే రాజు సుఖంగా ఉంటాడో,

* దుఃఖేన శ్లిష్యతే భిన్నం శ్లిష్టం దుఃఖేన భిద్యతే ।
భిన్నాశ్లిష్టా తు యా ప్రీతిః న సా స్నేహేన వర్తతే ॥ 85

ఆ కార్యమంతా నిశ్చయించే నీకు నేను చెపుతాను విను. యుధిష్ఠిరా ! ఇదిగో ! ఒక ఒంటె యొక్క గొప్ప వృత్తాంతాన్ని వినిపిస్తున్నాను. అలా మాత్రం నడుచుకోకూడదు. దానిని జాగ్రత్తగా విను. ప్రాజాపత్యయుగంలో (సత్యయుగం) ఒక గొప్ప ఒంటె ఉండేది. దానికి పూర్వజన్మజ్ఞానం ఉంది. అది కఠోర నియమాలను వ్రతంగా పూని, అరణ్యంలో గొప్ప తపస్సు చేసింది. తపస్సు పూర్తి అయ్యాక భగవంతుడైన బ్రహ్మదేవుడు సంతోషించాడు. దానిని వరం కోరుకోమన్నాడు. అపుడు ఒంటె అంటోంది. "దేవా ! మీ దయవల్ల నా ఈ మెడ పొడవుగా అగుగాక ! ప్రభూ ! దాని వల్ల వంద యోజనాల వరకు మేయడానికి మెడతో ముందుకు సాగగలను." "అట్లే అగుగాక". అని ఆ మహాత్ముడు వరమిచ్చాడు. శ్రేష్ఠమైన వరాన్ని పొంది, ఒంటె తన వనానికి వెళ్లింది. ఆ దుష్టమైన ఒంటె కాలమోహితమై వరదానం వలన దుర్బుద్ధియై, సోమరి అయింది. మేయడానికి వెళ్లడానికి కూడా ఇష్టపడలేదు (బద్దకించింది). ఒకసారి అది తన ఆ పొడవైన మెడను వందయోజనాలవరకు సారించి విరామం ఎరుగని మనసుతో మేయసాగింది. అంతలో పెద్ద గాలి దుమ్ము లేచింది.

ఆ జంతువు తన తలను, మెడను ఒక గుహలో దాచుకొని ఉండిపోయింది. లోకాన్ని అంతటిని ముంచివేస్తూ పెద్దవాన కూడా వచ్చేసింది. అప్పుడు ఒక నక్క వర్షానికి బాధపడుతూ, చలికి వణుకుతూ, ఆకలితో అలసటతో ఉండి, భార్యతో సహా ఆ గుహలోకి వచ్చింది. భారతోత్తమా ! మాంసం తిని బతికే ఆ నక్క ఒంటె మెడను చూసి, ఆకలితో అలసటతో ఉందేమో సుష్ఠుగా తినేసింది. తనను ఏదో జంతువు తినేస్తోందని తెలుసుకొనగానే ఆ పశువు అతికష్టంమీద ముడుచుకోవడానికి ప్రయత్నించింది. అది పైకీ, క్రిందకీ ఎంతవరకూ మెడను కదిలిస్తోందో అంతవరకూ నక్క తన భార్యతో కలిసి తినేసింది. ఆ నక్క ఆ ఒంటెను చంపి తినేసి, గాలి, వాన తగ్గగానే గుహనుండి వెళ్ళిపోయింది. ఈ రీతిగా బుద్ధిలేని ఆ ఒంటె చనిపోయింది. సోమరితనాన్ని బట్టి క్రమంగా వచ్చే మహాదోషాన్ని గమనించు. నీవుకూడా ఇలాంటి పద్ధతిని (సోమరితనాన్ని) విడిచి, ఇంద్రియనిగ్రహం కలిగి, మనసుపెట్టి మసలుకో. విజయానికి బుద్ధియే కారణమని మనువు చెప్పాడు. **భారతా ! బుద్ధిబలంతో చేసే పనులు ఉత్తమాలు. బాహుబలంతో చేసేవి మధ్యమాలు. కాలి బలంతో చేసేవి అధమాలు. బరువెత్తు కొనే పనులు అన్నిటి కంటే అధమమైనవి.*** జితేంద్రియుడు, కార్యదక్షుడు అయిన వానికే రాజ్యం

* **బుద్ధిశ్రేష్ఠాని కర్మాణి బాహుమధ్యాని భారత ।**
తాని జంఘాజఘన్యాని భారప్రత్యవరాణిచ ॥ 18

నిలుస్తుంది. ఆపదలో ఉన్నవారికి బుద్ధిమూలకంగానే విజయం కలుగుతుందని మనువు చెప్పాడు. యుధిష్ఠిరా ! అనఘా ! రహస్యమంత్రాంగాన్ని చెవిని పెట్టిన వానికి, మంచి సహాయకులు ఉన్నవానికి, చక్కగా విమర్శించుకొని పనులు చేసుకొనే వారికి ఈ లోకంలో సంపదలు నిలుస్తాయి. సహాయకులతో కూడిన రాజు సంపూర్ణ మహీమండలాన్ని పరిపాలించడానికి సమర్థుడు అవుతాడు. రాజా ! పూర్వం రాజ్య పరిపాలనా విధానం తెలిసిన సత్పురుషులు ఈ విషయాన్ని చెప్పారు. నేను కూడా శాస్త్రదృష్టిని అనుసరించి, నీకు చెప్పాను. బాగా ఆలోచించుకొని, చెప్పినట్లుగా నడుచుకో !'

113. సరిత్సాగర సంవాదము.

యుధిష్ఠిరుడు ఆడిగాడు. 'భరతసత్తమా ! రాజు దుర్లభమైన రాజ్యాన్ని పొంది, సైన్యం, కోశాగారం మొదలైన సాధనాలు ఏమీ లేకుండా, అతి బలవంతుడైన శత్రువు ముందు ఎలా నిలువగలడు?' భీష్ముడు చెపుతున్నాడు. 'భారతా ! ఈ విషయంలో సాగరునికి, నదులకు మధ్య జరిగిన సంవాదరూపమైన ప్రాచీన ఇతిహాసాన్ని పెద్దలు ఉదాహరిస్తూ ఉంటారు. ఎల్లప్పుడూ దైత్యులకు నిలయమూ, నదులకు భర్త అయిన సాగరుడు ఒకసారి తనకు కలిగిన సందేహాన్ని నదు లన్నింటిని ఇలా అడిగాడు.' 'నదులారా ! ప్రవాహంతో నిండుగా పరవళ్లు త్రొక్కే మీరు పెద్ద విశాలమైన చెట్లను వేళ్లతో, కొమ్మలతో సహా కూల్చివేయడం చూశాను. కాని వాటిలో ప్రబ్బలి చెట్టు లేదు. వేతసవృక్షం పెద్ద శరీరం కలదీ కాదు. తక్కువ బలం కలది. మీ ఒడ్డునే పెరుగుతుంది. అయినప్పుడు తిరస్కారంతో దానిని మీరు పెకలించడం లేదా ? లేక అది మీకు ఏమైనా ఉపకారం చేసిందా ? దీనిపై మీ అందరి అభిప్రాయం ఏమిటో వినాలనుకొంటున్నాను. ఈ నదుల తీరాలను వదిలి వేతసం ఎందుకు రావడంలేదు.' వారిలో గంగానది నదీపతి అయిన సాగరునికి ఉత్తమమై, అర్థవంతమై, యుక్తియుక్తమై మనసుకు పట్టే రీతిలో సమాధానాన్ని ఇలా చెప్పింది.

'ఈ చెట్లు తమ స్థానాలలో ఒకే చోట పాతుకుపోయి నిటారుగా ఉంటున్నాయి. మా ప్రవాహానికి తలవంచడం లేదు. ఆ వ్యతిరేకత వలననే అవి తమ స్థానాన్ని కోల్పోతున్నాయి. వేతసం అలా కాదు. వస్తున్న వేగాన్ని చూసి వేతసం వంగుతుంది. ఇతర వృక్షాలు అలా వంగవు. నదీవేగం గడిచిపోయాక అది తన స్థానాన్ని పదిలంగా పొంది, నిలబడుతుంది. వేతసం కాలమహిమ తెలిసినది. పరిస్థితులను గుర్తించినది. ఎప్పుడూ మా వశంలో

ఉంటుంది. ఎన్నడూ గర్వించదు. అనుకూలంగా ఉంటుంది. స్తబ్దంగా ఉంటుంది. కాబట్టే అది ఎప్పుడూ ఇవతలకు రాదు. గాలివేగానికి, నీటివేగానికి వంగుతూ, పైకి లేస్తూ ఉండే ఓషధులు, వృక్షాలు, పొదలు, పరాభవాన్ని పొందవు.' 'అతి బలవంతుడై, బంధించడానికీ వినాశనం చేయడానికీ శక్తి కలిగిన శత్రువు యొక్క ప్రథమ వేగాన్ని సహించని (తలవంచని) రాజు శీఘ్రంగా నశించిపోతాడు. శత్రువు యొక్క, తనయొక్క సారాన్ని, అసారాన్ని, బలాన్ని, పరాక్రమాన్ని గుర్తించి, నడచుకొనే ప్రాజ్ఞుడు పరాభవాన్ని పొందడు. ఇదే రీతిగా విద్వత్తుకల రాజు శత్రువును అతి బలవంతునిగా భావించినపుడు వైతసీవృత్తిని ఆశ్రయించాలి (తలవంచాలి). ఇది విజ్ఞానుల లక్షణం.

114. టిట్టిభవృత్తాంతము.

యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు. 'శత్రుదమనుడా ! మూర్ఖుడైన నేర్పరి సభలో మెత్తని, సూది మాటలతో నిందిస్తే పండితుడైనవాడు ఎలా వ్యవహరించాలి.' భీష్ముడు చెపుతున్నాడు. 'రాజా ! విను. ఈ విషయంలో ఎప్పుడూ చెప్పబడుతూన్న విషయాన్నే చెపుతున్నాను. మంచి మనసు కలవాడు ఎప్పుడూ ఈ లోకంలో మూర్ఖుని మాటలను సహిస్తూనే ఉన్నాడు. **నిందించినవానిని కోపించకపోవడం వలన అతని సుకృతమంతా ఇతడు పొందుతున్నాడు. నిందను సహించడం వలన తన దుష్కృతమంతా నిందించిన వానిపైనే రుద్దుతున్నాడు.** రోగివలె గావుకేకలు పెడుతూ నిందించే ఆ టిట్టిభుని ఉపేక్షించాలి. అందువల్ల లోకులందరూ అతనిని ద్వేషిస్తారు. అతడు చేసిన పనులన్నీ కూడా నిరర్థకం అవుతాయి. ఆ పాపకర్ముడు నిత్యం తన్నుతాను "గౌరవం పొందిన ఫలానా వ్యక్తిని నేను జనులందరి మధ్య ఇలా అన్నాను. అంతే వాడు అక్కడే సిగ్గు పడిపోయాడు. వాడి ముఖం వాలిపోయింది. చచ్చిన వాడిలా ఉండి పోయాడు."అని పొగడుకొంటూ ఉంటాడు. నింద్యమైన ఆ పని చేస్తూ తన్ను తాను పొగడుకొంటూ సిగ్గుపడడు. అటువంటి నరాధముని ప్రయత్నపూర్వకంగా ఉపేక్షించాలి. అల్పబుద్ధి గల అతడు వాగినదంతా పండితుడు సహించి ఊరుకోవాలి. అడవిలో కాకిలా నిరర్థకంగా అరిచే మూర్ఖుడు ప్రశంసించినా, నిందించినా ఏమి చేయగలడు? (ఏమేలూ, కీడూ జరగదని అర్థం) పాపాత్ముడు కటువచనాలు ప్రయోగించినపుడు మాటలనే బదులుగా ప్రయోగించినట్లయితే కేవలం మాటలే ప్రయోజనంగా మిగులుతాయి (కలహమే మిగులుతుంది.) చంపదలచుకొన్నవానికి అది ప్రయోజనకారికాదు. నెమలి నృత్యాన్ని,

కోపానాన్ని కూడా చూపించినట్లుగా మూర్ఖుడు తన కుచేష్టల ద్వారా తనలో దాచిఉంచిన దోషాలను కూడా ప్రకటిస్తాడు.

ఈలోకంలో అనకూడనిదంటూ గాని, చేయకూడనిది అంటూ గాని లేని సంశ్లిష్టకర్మునితో పరిశుద్ధుడు మాటలాడనే కూడదు. లోకంలో ప్రత్యక్షంగా గుణాలను గానం చేస్తూ, పరోక్షంలో నిందలు వేసేవాడు కుక్కలా రెండులోకాలకు కాకుండా నష్టపోతాడు. పరోక్షంలో ఇతరులను నిందించే అటువంటివాడు వందమందికి దానాలు చేసినా, హోమాలు చేసినా తత్క్షణమే అతనిని నశింపచేస్తుంది. అందువల్ల సాధువులు కుక్క ముట్టిన మాంసాన్ని వదిలివేసినట్లుగా ప్రాజ్ఞుడైన నరుడు అటువంటి పాపచిత్తుని వెంటనే విడిచి వేయాలి. మహాజనులయందు దోషాలను ఉటంకించే దురాత్ముడు పడగెత్తిన పాములా తన దోషాలను మాత్రమే వెల్లడి చేస్తాడు. పరనిందలు స్వీయకార్యాలుగా చేస్తూఉండేవానికి బదులు చేయాలని కోరుకొనేవాడు బూడిద కుప్పలోని ధూళిలో పడిఉండే తెలివి తక్కువ గాడిద వంటి వాడు. ఎల్లప్పుడూ జనాపవాదాలయందే మునిగి తేలే వ్యక్తి మానవ శరీరమనే ఇంట్లో వసించే తోడేలు. (మనుష్యరూపంలోని తోడేలు). పిచ్చిపట్టిన ఏనుగు వలె అరుస్తూ ఉండే అతనిని అతిరౌద్రంగా ఉండే కుక్కను వలె త్యజించాలి. మూర్ఖులు అవలంబించే మార్గంలో చరించే వాడు; ఇంద్రియనిగ్రహం, వినయం లేనివాడు; శత్రుత్వమే వ్రతంగా చేపట్టినవాడు; నిత్యమూ ఇతరుల కించదనాన్నే కోరుకొనేవాడు; అయిన ఆ పాపాత్మునికి, పాప బుద్ధికి ఛీత్కారమే కలుగునుగాక ! నీచుల చేత పరిభవింపబడి, వారికి తిరిగి సమాధానం చెప్పాలి అనుకొనే వారిని శాంతింపచేసి వారితో "మీరు (ఆర్తులు కాకండి). బాధపడకండి, గొప్పవారు నీచునితో సమానమయితే స్థిరబుద్ధులు అతనిని నిందిస్తారు." అని చెప్పాలి. క్రూరుడైన మూఢునికి కోపం వస్తే క్రుద్ధుడైన అతడు అయిదువేళ్లు అంటించగలడు. లేదా దుమ్ముగాని, పొట్టుగాని మీద చల్లగలడు, లేదా పళ్లన్నీ బయటపెట్టి భయపెట్టనూ గలడు. అతడు దేనికైనా సిద్ధమే.' ఈ దృష్టాంతాన్ని సదా చదివినవాడు, సభలో పరమదురాత్ముడు చేసిన నిందను సహించినవాడు, దుర్జనుడు వాక్కుద్వారా చేసిన ఎట్టి అప్రియాన్నీ పొందడు.

115. రాజసహాయకుల గుణములు.

యుధిష్ఠిరుడు అంటున్నాడు. 'మహాప్రాజ్ఞా ! పితామహా ! నాకు ఇదొక గొప్ప సందేహం కలిగింది. రాజా ! మీరు మా వంశప్రవర్తకులు. మీరే దీనిని తీర్చాలి. తాతగారూ ! దురాచారులు, దురాత్ములు అయినవారి మాటలు, నడతలు చెప్పారు. కనుకనే ఇది

విన్నవించుకొంటున్నాను. రాజ్యస్వాతంత్ర్యానికి ఏది మేలో; వంశానికి ఏది సుఖదాయకమో; వర్తమానంలోను, భవిష్యత్తులోను క్షేమాన్ని వృద్ధిని కలిగించేది ఏదో; పుత్ర పౌత్రులకు హితకరమైనది, రాష్ట్రానికి వృద్ధి కలిగించేది ఏదో; అన్నపానాలకు శరీరానికి ఏది హితమో అదంతా నాకు చెప్పండి. రాజ్యపదమందు అభిషిక్తుడైన రాజు మిత్రులతో కూడి, మిత్రులతో కలిసి ఉండి, ప్రజలను ఏ విధంగా రంజింపచేయగలడు ? అసద్వస్తువులను సంగ్రహించడంలో ఆసక్తి కలిగి, స్నేహరాగాలకు వశీభూతుడై ఇంద్రియాలను వశపరచుకోలేక, అసజ్జనునిగా ఉండే రాజు వద్ద చేరే భృత్యు లందరూ ఉత్తమ కులం నుండి వచ్చినప్పటికీ గుణహీను లవుతారు. ఆ రాజు కూడా భృత్యుల వలన పొందే ప్రయోజనాలేవీ పొందలేడు. నా ఈ సంశయానికి సమాధానంగా దుర్జ్ఞేయమైన రాజధర్మాలను చెప్పడానికి బృహస్పతి వంటి బుద్ధి కల మీరే తగిన వారు. పురుషసింహా! మా వంశక్షేమం పట్ల ఆసక్తి చూపే మీరే చెప్పగలవారు. మహాప్రాజ్ఞుడైన విదురుడు కూడా మాకు సర్వదా చెపుతూ ఉంటాడు. కులహితం, రాజ్యహితం కలిగించే మాటలను నీ వలన విని, నేను అక్షయమైన అమృతం చేత తృప్తుడ నైనట్లుగా సుఖంగా నిద్రిస్తాను. ఎటువంటి సర్వగుణసంపన్నులైన భృత్యులు రాజుకు దగ్గరగా ఉండాలి ? ఎటువంటి కులీనులతో కలిసి రాజు యుద్ధయాత్ర చేయాలి ? భృత్యులు లేనిరాజు ఒంటరిగా రక్షకుడు కాలేడు. ఎందుకంటే కులీనులైన జనులందరూ ఈ రాజ్యాన్ని అభిలషిస్తూ ఉంటారు.'

భీష్ముడు చెపుతున్నాడు. 'భారతా ! ఒంటరిగా రాజ్యాన్ని పాలించడం సాధ్యం కాదు. నాయనా ! పైగా సహాయం లేనివానికి ఏ ప్రయోజనాలూ చేకూరవు. రాజ్యం లభించినా, లభించినదానిని రక్షించడం సాధ్యం కాదు. భరతసత్తమా ! సేవకులు అందరూ కులీనులై, జ్ఞానవిజ్ఞాన కోవిదులై, హితైషులై, స్నేహశీలురై ఉంటే ఆ రాజు రాజ్యఫలం అనుభవించగలడు. మంత్రులు ఉత్తమ కులసంజాతులు, ధనానికి అమ్ముడుపోనివారు, రాజుతో కలిసి నివసించేవారు, రాజుకు మంచిబుద్ధిని ఇచ్చేవారు, సత్పురుషులు, సంబంధ జ్ఞానకో విదులు, భవిష్యత్తును గూర్చి ప్రణాళికలు వేయగలిగినవారు, కాలజ్ఞానవిశారదులు, గడిచిపోయినదానికి శోకించనివారు అయితే రాజు రాజ్యఫలాన్ని అనుభవించగలడు. సహాయకులు సుఖదుఃఖాలపట్ల సములై ఉండేవారు, ప్రియాన్ని చేకూర్చేవారు, ఆదాయం గురించిన ఆలోచనపట్ల ఆసక్తి కలవారు, సత్యవాదులు అయినపుడు రాజు రాజ్యఫలం పొందుతాడు. రాజ్యంలోని ప్రజలు ఆర్తి చెందకుండా, ఎప్పుడూ సమీపస్థులై, ఉదాత్తులై, సన్మార్గాన్ని అవలంబిస్తే ఆ రాజు రాజ్యాన్ని అనుభవించగలడు. విశ్వాసపాత్రులు, సంతుష్టులు,

కోశాన్నివృద్ధి చేసేవారు - వీరి చేత కోశాగారం నిరంతరం వృద్ధి చెందుతూ ఉంటే ఆ రాజు రాజులలో శ్రేష్ఠుడు అవుతాడు. ధనానికి అమ్ముడుపోనివారు, విశ్వాసపాత్రులు, కూడ బెట్టడంలో ఆసక్తికలవారు, అర్హులైనవారు, లోభరహితులు పాలనచేస్తే కోశాగారం విశేషవృద్ధి చెందుతుంది. కర్మలను అనుసరించి ఫలాలు ప్రాప్తించే శంఖలిఖిత న్యాయవ్యవహారం ఏ నగరంలో ఉంటుందో ఆ రాజు ధర్మఫలాన్ని అనుభవించగలడు. రాజధర్మాలను తెలుసుకొని; మంచివారిని చేరదీసి; సంధి, విగ్రహ, యాన, ఆసన, ద్వైధీభావ, సమాశ్రయాలు అనే షడ్గుణాలను ఉపయోగిస్తూ ఉండే రాజు ధర్మఫలాన్ని అనుభవించగలడు.'

116. ఋషి శ్వాన సంవాదము - 1.

యుధిష్ఠిరుడు అడుగుతున్నాడు. 'భరతసత్తమా ! రాజు వద్ద కులీనులైన సహాయకులు లేనపుడు అతడు నీచకులజులను సహాయకులుగా చేసుకొనవచ్చునా ?'

భీష్ముడు చెపుతున్నాడు. 'సదా సజ్జనులు ఆచరించే లోకంలో ఉత్కృష్టమైన ఉదాహరణంగా ప్రాచీనమైన ఈ ఇతిహాసాన్ని పెద్దలు చెపుతూ ఉంటారు. తపోవనంలో ఋషివరులు జమదగ్నికుమారుడైన పరశురామునికి చెప్పగా నేను విన్నది ఈ విషయానికి సరిపడినదిగానే ఉంది. నిర్జనమైన ఒకానొక మహారణ్యంలో మూలాలు, ఫలాలు ఆహారంగా తీసుకొంటూ, నియమవ్రతుడై, ఇంద్రియనిగ్రహం కల ఒక ఋషి ఉండేవాడు. అతడు దీక్షాపరుడు. ఇంద్రియనిగ్రహపరుడు, శాంతుడు. స్వాధ్యాయంలో ఉత్తముడు. శుచి, ఉపవాసాలచేత పవిత్రాత్ముడైనవాడు. ఎల్లప్పుడూ సత్త్వగుణమందే నిలిచి ఉండేవాడు. ఒకేచోట కూర్చుని ఉండే బుద్ధిమంతుడయిన అతని యొక్క సద్భావాన్ని చూసి, వనంలో తిరిగే జంతువులన్నీ అతనికి సమీపంగా చేరేవి. క్రూరమైన సింహశార్దూల గణాలు, మదించిన మహాగజాలు, పెద్దపులులు, గవయమృగాలు, భల్లూకాలు, ఇంకా భయంకరంగా కనిపించే ఇతర జంతువులు అతని వద్దకు వస్తూండేవి. మాంసాహారులైన ఆ జంతువులన్నీ ఆ ఋషికి శిష్యులలాగే తలవంచి కూర్చొని, అతని కుశలాన్ని గూర్చి ప్రశ్నిస్తూ, అతనికి ప్రియం కలిగించేవి. ఆ జంతువులన్నీ అతని సుఖాన్ని గూర్చి ప్రశ్నించి ఎలా వచ్చినవి అలాగే వెళ్లిపోయేవి. ఒక గ్రామ్యమైన కుక్క మాత్రం అక్కడ ఆ మహామునిని వదిలిపోలేదు. అది ఆ మునికి భక్తుడు, అనురక్తుడు అయింది. ఎప్పుడూ ఉపవాసాలు చేసి కృశించిపోయింది. నిర్బల మయింది. ఫలమూలాలు, నీళ్లు ఆహారంగా తీసుకొంటూ

శాంతంగా సాధుపురుషునివలె ఉంది. మహామతీ ! ఆ ముని యొక్క పాదాల చెంతనే కూర్చుంటున్న అది మనుష్యునివలెనే స్నేహభావాన్ని పొందింది. అతనియందు మిక్కిలిగా స్నేహభావంతో కట్టుబడిపోయింది. ఇలా ఉండగా ఒకసారి మహాపరాక్రమశాలి, మాంసాహారి అయిన చిరుత పులి మహాసంతోషంగా కుక్కను పట్టుకోవడానికి క్రూరుడైన కాలునిలా, యమునిలా అటు వచ్చింది.

ఆ చిరుత పులి దాహంతో పెదవులు మాటిమాటికి నాకుతూ, తోక నేలకేసి కొడుతోంది. నోరు పెద్దగా తెరచుకొని ఉంది. ఆకలితో అలమటిస్తూ ఆ కుక్కమాంసాన్ని కావాలని అనుకొంది. రాజా ! నరపతీ ! క్రూరంగా వస్తున్న దానిని చూసి కుక్క ప్రాణరక్షణ కోసం మునితో ఏమన్నదో దానిని విను. 'దేవా ! ఈ చిరుత పులి కుక్కలకు శత్రువు. నన్ను చంపాలనుకొంటోంది. మహామునీ ! మహాబాహూ ! నీ అనుగ్రహం వల్ల నాకు దీని వలన భయం లేకుండేట్లు చేయి. నీవు సర్వజ్ఞుడవు. ఇందుకు సందేహం లేదు.' సిద్ధశక్తి సంపన్నుడై, అందరి భావాలు తెలిసి, అన్ని ప్రాణుల భాషలు తెలుసుకోగలిగిన ఆ ముని దాని భయానికి కారణం తెలుసుకొని అంటున్నాడు. "నీవు ఏ విధంగానూ మృత్యువువంటి చిరుతపులికి భయపడనక్కరలేదు. కుమారా ! ఇదిగో కుక్కరూపం పోయి నీవు చిరుతపులివి అవుతున్నావు" అన్నాడు. అపుడు ఆ కుక్క చిరుతపులి అయింది. దాని ఆకారం బంగారంలా మెరిసిపోతోంది. శరీరమంతా చిత్రవర్ణపు మచ్చలతో నిండిపోయింది. కోరలు తళతళలాడుతున్నాయి. అది అడవిలో నిర్భయంగా తిరగసాగింది. అప్పుడు ఎదుట తనవంటి ఆ జంతువును చూసిన చిరుతపులికి వెంటనే వైరభావం తొలగిపోయింది. తరువాత ఒకసారి మహారౌద్రంగా ఉన్న ఆకలిగొన్న పెద్దపులి ముఖం నాకుకొంటూ, నోరు పెద్దగా, తెరిచి రక్తం తాగాలనే కోరికతో చిరుతను వెంబడించింది. పెద్దకోరలతో అడవిలో తిరుగుతూ ఉండే పెద్దపులి ఆకలితో నకనకలాడడం చూసి, చిరుతపులి ప్రాణరక్షణ కోసం ఋషిని శరణుచొచ్చింది. సహవాసం వలన పుట్టిన పరమస్నేహం చేత ఋషి చిరుతను శత్రువులకంటే బలవత్తరమైన వ్యాఘ్రంగా మార్చాడు. నరపతీ ! అది చూసి, ఆ శార్దూలం దానిని చంపలేదు. ఆ కుక్క కూడా వ్యాఘ్రమై మాంసం తింటూ బలిష్ఠ మయింది. దానికి మూలాలు, ఫలాలు తినాలనే కోరిక కలగడం లేదు. మహారాజా ! మృగరాజు నిత్యం అడవిజంతువులను కాంక్షించినట్లుగా ఆ వ్యాఘ్రం కూడా అప్పుడు అలాగే మారిపోయింది.'

117. ఋషిశ్వాన సంవాదము - 2.

'ఆ వ్యాఘ్రం కూడా జంతువులను చంపితింటూ తృప్తిగా ఆ ముని కుటీర సమీపంలోనే నిద్రిస్తోంది. ఒక రోజున మేఘం వంటి ఒక మదగజం ఆ ప్రదేశానికి ఉద్ధతంగా వచ్చింది. దాని గండస్థలం నుండి మదజలం కారుతోంది. కుంభస్థలం విశాలంగా ఉంది. పద్మచిహ్నాలు ఉన్నాయి. అందమైన దంతాలతో అది పెద్ద శరీరం కలిగి ఉంది. మేఘగంభీరధ్వనితో ఘీంకరిస్తోంది. బలగర్వంతో మదపుటేనుగు రావడం చూసి, పులి ఆ ఏనుగు వలని భయంతో భీతిల్లి, ఆ ఋషిని శరణుచొచ్చింది. వెంటనే ఋషిపుంగవుడు ఆ పులిని మదపుటేనుగుగా మార్చివేశాడు. మహామేఘంతో సమానంగా ఉన్న దానిని చూసి ఆ గజం భయపడిపోయింది. ఆ పై అది తామరపుప్పొడి తాల్చి సంతోషంగా పద్మసమూహాలలోను, శల్లకీగుబురులలోను తిరుగసాగింది. కుటీరంలో నివసించే ఆ ఋషి ఎదుట కదాచిత్తుగా తిరుగుతూ ఉండే ఆ ఏనుగుకు ఎన్నో రాత్రులు గతించిపోయాయి. ఇలా ఉండగా హస్తికులానికి యమునివంటి ఒక సింహం అక్కడికి వచ్చింది. అది కేసరాలతో ఎట్టగా కనపడుతూ ఉంది. కొండగుహలలో పుట్టడం వలన భయంకరంగా ఉంది. వస్తున్న ఆ సింహాన్ని చూసి, ఏనుగు భయంతో కంగారుపడుతూ, వణికిపోతూ ఋషిని శరణు పొందింది. అప్పుడు ముని ఆ గజేంద్రుని సింహంగా చేశాడు. తన జాతికి చెందినదే అని గుర్తించడం వలన అది ఆ వన్యసింహాన్ని పట్టించుకోలేదు. కాని వచ్చిన సింహాన్ని చూసి, ఆ వన్యసింహమే భయపడి పోయింది. మహారణ్యంలో ఆ ఆశ్రమంలోనే అది ఉండసాగింది. దానికి భయపడిన ఇతర అడవిజంతువులు ప్రాణహానికి భయపడి, తపోవన సమీపానికి రావడం మానేశాయి. ఇలా ఉండగా ఒకసారి కాలవశాత్తు అడవిలో తిరుగుతూ, సమస్త ప్రాణులను హింసించే శరభమృగం ఆ సింహాన్ని చంపడానికి ఆ ముని ఆశ్రమం వైపు వచ్చింది. అది రక్తాన్ని మరిగినది. బలిష్ఠ మైనది. అన్ని జంతువులకు భీతి కలిగించేది. ఎనిమిదికాళ్ళతో కళ్ళు మీదికి ఉండి భయంగొలుపుతూ ఉంటుంది.

వస్తున్న శరభాన్ని చూసి సింహం మిక్కిలి భయంతో వణుకుతూ చేతులు జోడించి ఋషిని శరణు కోరింది.

శత్రుదమనుడా ! ముని దానిని మిక్కిలి బలిష్ఠమైన శరభంగా మార్చాడు. అంతట ఆ వన్యశరభం తన ఎదుట బలిష్ఠంగా అతి భయంకరంగా ఉన్న ముని చేసిన శరభాన్ని చూసి, అడవినుండి వేగంగా పారిపోయింది. ఈ రీతిగా అది మునిచేత శరభంగా మారింది. ముని ప్రక్కనే ఆ శరభం నిత్యమూ సుఖంగా ఉండ సాగింది. రాజా ! అటు తరువాత సమస్త జంతుజాలం శరభానికి భయపడి, ప్రాణరక్షణ కోసం భయంతో

దిక్కులు పట్టుకు పారిపోయింది. ఇక శరభం నిత్యమూ ప్రాణులను చంపుతూ మిక్కిలి సంతోషంగా ఉంది. మాంసాన్ని రుచిమరిగి, ఫలమూలాలు తినడానికి అది ఇష్టపడడంలేదు. బలిష్ఠంగా రక్తపిపాస కలిగి ఉన్న శరభం కుక్క జాతిలో పుట్టడం వలన కృతజ్ఞత లేక ఆ మునిని చంపాలని అనుకొంది.

పూర్వం కుక్కగా ఉంది. ఇప్పుడు శరభమైన అది ఇలా ఆలోచించింది. "ఇతని మహిమ వలన కేవలం నోటిమాటతోనే సర్వప్రాణులకు భయంకరమైన పొందరాని శరభత్వాన్ని పొందాను. ఇక్కడ మునిని ఆశ్రయించుకొని ఎన్నో ఇతర జంతువులు, పక్షిగణాలు జీవిస్తున్నాయి. అవి కూడా ఏనుగుల భయంచేత బాధపడుతూ కలత చెందుతున్నాయి. ఎప్పుడైన వాటికి కూడా ఈ లోకంలోనే అన్ని జంతువులకంటె శ్రేష్ఠమైన బలవంతమైనది అనే వేరు గల శరభత్వాన్ని ప్రసాదించవచ్చు. పక్షులకు కూడా ఎప్పుడైనా గరుత్మంతుని బలం వంటి బలం ఇవ్వవచ్చును. ఇతర జంతువుల పట్ల ప్రీతుడై దయగలిగి సంతుష్టుడై వాటిలో దేనికైనా బలం ప్రసాదించకముందే నేను ఈ విప్రుని శీఘ్రంగా చంపివేస్తాను. ముని చనిపోయాక నేను ఇక్కడ ఉండడానికి సాధ్యం అవుతుంది. సందేహం లేదు."

అప్పుడు తపశ్శక్తితో అతనికి తెలిసింది. జ్ఞాననేత్రంతో తెలిసికొని మహాప్రాజ్ఞుడైన ముని కుక్కతో ఇలా అన్నాడు. "కుక్కవు నీవు చిరుతపులివి అయ్యావు. చిరుతపులివి పెద్దపులివి అయ్యావు. పెద్దపులి శరీరాన్నుండి ఏనుగుగాను, మదబలం కలిగిన ఏనుగువి సింహంగాను మారావు. సింహంగా బలం పొందిన నీవు తిరిగి శరభమయ్యావు. స్నేహంతో పెనవేసుకుపోయిన నేను నీ జాతిని విస్మరించాను. పాపాత్ముడా ! ఏ పాపం ఎరుగని నన్ను చంపాలనుకొన్నావు. కనుక నీవు నీ స్వజాతి అయిన కుక్కవే అగుదువు గాక ". అని ముని - ఋషులను ద్వేషించే దురాత్ముడు, అజ్ఞాని, మూఢుడు అయిన శరభాన్ని శపించాడు. అది తిరిగి తన రూపాన్ని పొందింది."

118. ఋషి శ్వాన సంవాదము - 3.

ఆ కుక్క పూర్వరూపంతో మిక్కిలి ధైన్యాన్ని పొందింది. ఋషి హుంకరించి ఆ పాపిని తపోవనం నుండి వెళ్లగొట్టాడు. ఈ రీతిగా రాజు బుద్ధిమంతుడై భృత్యుల యొక్క నిజమైన పరిశుద్ధతను, ఋజుత్వాన్ని, స్వభావాన్ని, సత్యవాదిత్వాన్ని, పాండిత్యాన్ని, నడతను, కులాన్ని, ఇంద్రియనిగ్రహత్వాన్ని, దయను, బలాన్ని, పరాక్రమాన్ని, ప్రభావాన్ని, వినయం, క్షమ మొదలైన వానిని తెలుసుకొని ఎవరు ఎక్కడ యోగ్యులో వారిని అక్కడ నియమించి చక్కగా రక్షించాలి. రాజు పరీక్షించకుండా మంత్రిని నియమించకూడదు. నీచ కులాల వారితో కలిసి రాజు సుఖాన్ని, వృద్ధిని కూడా పొందలేడు. కులీనుడైన

మంత్రి తప్పుచేయకుండా ఒకవేళ రాజు చేత దండింపబడినా, అతడు ఆభిజాత్యం చేత ఎప్పుడూ మనసులో పాపాన్ని (అనిష్టాన్ని) తలపెట్టడు. నీచకులజుడు మంత్రిగా మంచి రాజు యొక్క ఆశ్రయాన్ని పొంది, దుర్లభమైన ఐశ్వర్యాన్ని పొందినప్పటికీ, నిందపొందితే శత్రుత్వం వహిస్తాడు. కులీనుడు, శిక్షితుడు, ప్రాజ్ఞుడు, జ్ఞాన విజ్ఞాన పారంగతుడు, సర్వశాస్త్రార్థాల తత్త్వాన్ని తెలిసినవాడు, సహనగుణం కలవాడు, స్వదేశంలోనే ఉండేవాడు, కృతజ్ఞుడు, బలవంతుడు, క్షమాశీలుడు, మనోనిగ్రహం ఇంద్రియ నిగ్రహం కలవాడు, లోభరహితుడు, దొరికిన దానితో తృప్తి పొందేవాడు, రాజ మిత్రుల ఉన్నతిని కోరేవాడు, దేశకాలజ్ఞుడు, ఉత్తమ వస్తువులను సేకరించడంలో ఆసక్తి కలవాడు, ఎప్పుడూ ఏకాగ్రచిత్తం కలవాడు, రాజహితాన్ని కోరేవాడు, సోమరితనం లేనివాడు, తగిన చారులను నియమించేవాడు, రాజ్యవిషయంలో సంధివిగ్రహాలు తెలిసినవాడు, రాజుకు కావలసిన ధర్మార్థకామాలను గుర్తెరిగినవాడు, నాగరికులకు జానపదులకు ఇష్టుడైనవాడు, అగడ్తలు, సొరంగాలు – మొదలైన వ్యూహాలను గురించి తెలిసినవాడు, సైన్యానికి ఉత్సాహాన్ని కల్గించడంలో నేర్పరితనం కలవాడు, ఎదుటివారి మనసులను చేష్టలను గుర్తించగలవాడు, దండయాత్రను గురించిన జ్ఞానం కలవాడు, ఏనుగులను నడపడం తెలిసినవాడు, అహంకారం లేనివాడు, నేర్పరి, ఉదారుడు, మనోనిగ్రహం కలవాడు, బలవంతుడు, యుక్తమైన పనులు చేసేవాడు, శుద్ధుడు, శుద్ధజనులతో కూడినవాడు, ప్రసన్నముఖం కలవాడు, చక్కని రూపుకలవాడు, నాయక లక్షణాలు కలవాడు, నీతికుశలుడు, చక్కనిగుణాలు చక్కని పనులు కలవాడు, ఔద్ధత్యం లేనివాడు, వినయవంతుడు, స్నేహశీలి, మృదువుగా మాట్లాడేవాడు, ధీరుడు, శూరుడు, మహైశ్వర్యం కలవాడు, దేశకాలాలను అనుసరించి పనులను చక్కబెట్టేవాడు – ఈ లక్షణాలు గలవానిని రాజు మంత్రిగా నియమించుకోవాలి.

ఇటువంటివానిని మంత్రిగా చేసుకొని, అతనిని ఎప్పుడూ అనాదరించకపోతే ఆ రాజ్యం చంద్రుని యొక్క వెన్నెలలా విస్తరిస్తుంది. రాజు కూడా ఈ గుణాలన్నీ కలిగి ఉండాలి. పైగా శాస్త్రవిశారదుడు, ధర్మపరాయణుడు, ప్రజాపాలన తత్పరుడు కావాలి. ఇటువంటివాడే ప్రజలకు ఇష్టుడు అవుతాడు. రాజు ధీరుడు, క్షమాశీలి, శుద్ధుడు, అప్పుడప్పుడు తీక్ష్ణుడు, సరియైన సమయంలో పౌరుషం చూపడం తెలిసినవాడు, వినేకోరిక కలవాడు, వేదజ్ఞుడు, శ్రుతపరాయణుడు, ఊహాపోహ విశారదుడు – కావాలి. మేధావి, ధారణ కలిగినవాడు, యథోచితన్యాయాన్ని చేసేవాడు, సంయమనం కలవాడు, ఎప్పుడూ ప్రియంగా మాటలాడేవాడు, శత్రువులందు క్షమాగుణం కలిగినవాడు అయి ఉండాలి. దానపరంపరను

స్వయంగా కొనసాగించేవాడు, శ్రద్ధాళువు, చూపులకే సుఖం కలిగించేవాడు, ఆర్తులకు చేయూతనిచ్చేవాడు, ఎల్లప్పుడూ ఆప్తులైన అమాత్యులు కలవాడు, నీతిపరాయణుడు అయి ఉండాలి. అహంకారం లేనివాడు, నిరంకుశుడు కానివాడు, వ్యర్థపుపనులు చేయనివాడు, అమాత్యులు చేసిన పనులకు బాధ్యత వహించేవాడు, భృత్యజనులకు ఇష్టుడు అయి ఉండాలి. జనులను చేరదీసేవాడు, చురుకుగా ఉండేవాడు, సదా ప్రసన్నమైన ముఖం కలవాడు, ఎప్పుడూ సేవకుల యొక్క యోగక్షేమాలను అపేక్షించేవాడు, క్రోధం లేనివాడు, మంచి గొప్ప మనసుకలవాడు అయి ఉండాలి. రాజు ఎల్లప్పుడూ ఉచిత దండన విధించేవాడు కావాలి. దండించనివాడు కాకూడదు. ధర్మకార్యాలను ఆచరింప చేయాలి. చారనేత్రుడై ఉండాలి. ప్రజలను కనిపెట్టి ఉండాలి. ధర్మార్థాల విషయంలో నేర్పరియై ఉండాలి. మనుజేంద్రా ! రాజుకు వంద గుణాలుండాలి. అటువంటి వాడే ప్రజలకు ఇష్టుడవుతాడు. అతని దగ్గర ఉండే యోధులు కూడా అందరూ గుణగణాలతో కూడి ఉండాలి. రాజ్యపాలనకు మంచివారిని సహాయకులుగా వెదకుకోవాలి. రాజు తన అభివృద్ధిని కాంక్షించేవాడయితే వారిని అవమానించకూడదు. యోధులు సమరపండితులు, కృతజ్ఞులు, శస్త్రకోవిదులు, ధర్మశాస్త్రయుక్తులు, పదాతిజనులతో కూడినవారు, నిర్భయులు, గజారోహణ చేసేవారు, రథాన్ని నడపడంలో ఆరితేరినవారు, బాణాలను, అస్త్రాలను సంధించడంలో నేర్పరులు అయి ఉంటే ఈ భూమి ఆ రాజుదే.

జ్ఞాతులను అవమానించనివాడు, సేవకుల యందు ఎప్పుడూ శౌర్యం చూపనివాడు, అర్థవంతమైన పనులలో నైపుణ్యం కలవాడు - ఇటువంటి రాజుదే ఈ భూమి. సోమరితనం, నిద్ర, వ్యసనాలు, అతిగానవ్వడం ఎవరిలో ఉండవో అతనికే ఈ భూమి చిరకాలం ఉంటుంది. వృద్ధులను సేవించేవానికి, మహోత్సాహం కలవానికి, నాలుగు వర్ణాలవారిని రక్షించేవానికి, ధర్మకార్యాలు చేసేవానికి ఈ భూమి చిరకాలం దక్కుతుంది. నీతిమార్గాన్ని అనుసరించేవానికి, ఎప్పుడూ పురుషార్థం కోసం యత్నించేవానికి, శత్రువులను అవమానించని వానికి ఈ రాజ్యం చిరకాలం ఉంటుంది. పురుషార్థం, దైవం - ఈ రెండింటిలోని భేదాలను గురించి పూర్వం మనువు వివరించాడు. చెప్తున్నాను. వినుకురుశ్రేష్ఠా ! రాజులు పురుషకారం కలిగి ఉండాలని బృహస్పతి చెప్పాడు. నీవు నీతి, అనీతి విధానాలను ఎప్పుడూ తెలిసికొని ఉండు. శత్రువుల యొక్క బలహీనతలను కనిపెట్టేవాడు, స్నేహితులకు ఉపకారం చేసేవాడు, సేవకుల గురించి విశేషంగా తెలుసుకొన్నవాడు రాజ్యఫలాన్ని పొందగలడు.

అందరిని చేకూర్చుకోవడంలో నిమగ్నుడై ప్రయత్నశీలుడై, మిత్రులు కలరాజు రాజోత్తముడు అవుతాడు. భారత ! నైన చెప్పిన రీతిగా మనుష్య లందరిని సంగ్రహించుకొన్న రాజు కేవలం వేయిమంది ఆశ్వికవీరులతో ఈ సంపూర్ణ భూమండలాన్ని జయించగలడు.'

119. ఋషి శ్వాన సంవాదము - 4.

భీష్ముడు చెపుతున్నాడు. 'ఇటువంటి గుణాలుకల సేవకులను రాజు వారి వారి స్థానాలలో, కార్యాలలో నియోగించితే రాజ్యఫలాన్ని పొందగలడు. పైన చెప్పిన కథలో కుక్క తన స్థానాన్నుండి పైకి వచ్చి, ఆ ప్రమాణాన్నీ పొందలేదు. గౌరవాన్నీ పొందలేదు. కుక్క (వంటివాడు) తన స్థానాన్నుండి పైకి ఎక్కించబడినప్పటికీ, ఇంకొక దానికి ఎగబ్రాకి పొరపాటు చేస్తుంది. తమ తమ జాతులకు చెందిన గుణాలతో కూడిన, తమ తమ పనుల యందు సుస్థిరులైన వారిని అమాత్యులుగా నియమించాలి గాని, దానికి విరుద్ధంగా అస్థానంలో నియమించడం ఉచితం కాదు. భృత్యుల యొక్క గుణాలతో పరిచితుడై, వారిని అనురూపమైన కర్మలలో నియోగించగలిగితే ఆ రాజు ఫలితాన్ని పొందగలడు. శరభం శరభస్థానంలోను, బలవంతమైన సింహం సింహస్థానంలోను, వ్యాఘ్రం వ్యాఘ్రస్థానంలోను, చిరుత చిరుత స్థానంలోను నియుక్తం కావాలి. (నాలుగు వర్ణాల వారు తమ తమకు ఉచితమైన పనులలో నియోగించబడాలి.) భృత్యులను యథావిధిగా వారికి అనురూపమైన కర్మల యందు నియోగించాలి. తాను చేపట్టిన కార్యాలకు తగిన ప్రయోజనాలను పొందాలనుకొనే రాజు అందుకు విరుద్ధంగా సేవకులను నియమించకూడదు. ప్రమాణాలను ఉల్లంఘించి, సేవకులను ప్రతికూలంగా ఆ యా కర్మలలో నియమించే బుద్ధిలేని రాజు ప్రజలను రంజింపచేయలేడు. గుణగణాలు కావాలని కోరుకొనే రాజు మూర్ఖులను, క్షుద్రులను, ప్రాజ్ఞులు కానివారిని, జితేంద్రియులు కానివారిని, కులీనులు కానివారిని, ఇటువంటి వారందరినీ ఆయా కర్మలలో నియమించకూడదు. సాధువులు, కులీనులు, శూరులు, జ్ఞానవంతులు, అసూయలేనివారు, క్షుద్రులు కానివారు, శుచులు, దక్షులు రాజుకు పార్శ్వచరులుగా ఉండాలి. వినయం గలవారు, కార్యతత్పరులు, శాంతులు, చతురులు, స్వభావసిద్ధంగా శుభగుణాలు కలవారు, తమ పదవులకు కళంకం తేనివారు - రాజులకు బాహ్యసేవకులుగా తగినవారు. సింహానికి పక్కన ఎప్పుడూ సింహమే అనుసరిస్తూ ఉండాలి. సింహం కాని జంతువైతే, సింహంతో కలిసి సింహంలాగే భోగాలు అనుభవిస్తుంది. సింహం యొక్క పనుల యందు ఫలాలయందు ఆసక్తి కలిగిన సింహానికి చుట్టూ కుక్కలు ఉన్నట్లయితే, వాటి చేత సేవింపబడే ఆ సింహం సింహఫలాలను అనుభవించజాలదు.

రాజేంద్రా ! ఇదీ అంతే. శూరులు, ప్రాజ్ఞులు, పండితులు, కులీనులు అయినవారితో కలిస్తే భూమినంతటినీ జయించడానికి సాధ్యం అవుతుంది. యుధిష్ఠిరా ! రాజులు తమ

పార్శ్వచరులుగా విద్యలేని, ఋజువర్తనలేని, ప్రాజ్ఞులు కాని, ధనంలేని వారిని నియమించుకోకూడదు. స్వామికార్య పరాయణులైన సేవకులు సంధించి విడిచిన బాణంలా కార్యసిద్ధి కోసం బయలుదేరుతారు. రాజుగారి మేలు కోరే ఇటువంటి సేవకులకు మంచిమాటల ద్వారా సాంత్వన చేకూర్చాలి. రాజులు ప్రయత్నపూర్వకంగా కోశాన్ని ఎల్లప్పుడూ రక్షించుకోవాలి. రాజులకు కోశమే మూలాధారం. కోశం వృద్ధి చెందుతూ ఉండాలి. నీ కోశాగారం కూడా నిత్యమూ పుష్టికరమైన ధాన్యాలతో నిండి ఉండాలి. దానిని ఎప్పుడూ సుజనులకే అప్పగించాలి. ధనధాన్యాలను పెంచడంలో జాగరూకుడవై ఉండు. నీ సేవకులు ఎప్పుడూ ఉత్సాహవంతులుగా, యుద్ధవిశారదులై ఉండాలి. ఈ సందర్భంలో వారికి గుర్రాలను నడపడంలోను, తోలడంలోను నేర్పరితనం కావాలి. కౌరవనందనా ! జ్ఞాతులను, బంధుజనులను చక్కగా చూసుకో. మిత్రసంబంధులతో కలిసి ఉండు. పౌరుల కోసం తలపెట్టే కార్యాలలో మేలును అన్వేషించు. ప్రజలపట్ల నీ బుద్ధి స్థిరంగా ఉండాలని నేను ఆశిస్తున్నాను. నాయనా ! కుక్క వృత్తాంతాన్ని నిదర్శనంగా చెప్పాను. ఇంకా ఏమి వినాలనుకొంటున్నావు ?

120. రాజధర్మకథనము.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'భారతా ! రాజధర్మ విషయాలు తెలిసిన పూర్వులు పూర్వం తాము అనుష్ఠించిన అనేక రాజోచిత చరిత్రలను నీవు వివరించావు. భరతసత్తమా ! సజ్జనసమ్మతమైన ప్రాచీనచరిత్రను వివరంగా చెప్పావు. ఆ రాజధర్మాలను సంక్షేపంగా చెప్పు. చక్కగా ఆచరించ గలుగుతాను.' భీష్ముడు చెపుతున్నాడు. 'రాజా ! సర్వప్రాణులను రక్షించడమే క్షత్రియులకు పరమధర్మం. ఆ రక్షణం ఎలా చేయాలో విను. (పాములను తినే) నెమలి చిత్ర చిత్ర పించాలను ధరించినట్లే ధర్మవేత్త అయినరాజు అనేక విధాలయిన రూపాలను ప్రకటించాలి. రాజు మధ్యస్థుడై, ఆయా సమయాలలో తీక్ష్ణత్వం, కుటిలత్వం, ప్రగల్భత్వం, సత్యం, ఋజుత్వం ప్రకటిస్తూ సత్త్వ గుణంతోనే ఉన్నట్లయితే సుఖాన్ని పొందుతాడు. ఏ విషయంలో ఏది హితమో ఆ వర్ణాన్ని, రూపాన్ని ప్రకటించినా అపరాధుల పట్ల రౌద్రాన్ని, దీనులపట్ల దయాళుత్వాన్ని ప్రకటించాలి. ఇలా బహురూపాలను ప్రకటించే రాజుకు చిన్న పనికూడా చెడిపోదు. శరత్కాలంలో నెమలిలా మౌనం పాటిస్తూ రాజు నిత్యమూ రాజ్యమంత్రాంగాన్ని గోప్యంగా ఉంచాలి. అతడు మృదువైన మాటలు, ఆకృతి కలిగి శ్రీమంతుడై, శాస్త్రవిశారదుడై ఉండాలి. నదులకు వరదలు వచ్చినపుడు ఎలాగో అలాగే ఆపదలు కలిగే చోట్ల జాగరూకుడై ఉండాలి. కొండల మీద కురిసిన వాననీటిని

ఉపయోగించుకొన్నట్లుగా సిద్ధపురుషులైన ద్విజులను ఆశ్రయించాలి. కార్యసిద్ధిని కోరుకొనే రాజు ధర్మధ్వజంలాగ ఉత్తమ లక్షణాలను తలదాల్చాలి. అపరాధులను దండించడానికి ఎప్పుడూ సంసిద్ధంగా ఉండాలి. ఏమరుపాటు లేకుండా ప్రతిపనీ చక్కబెట్టుకోవాలి. రాజ్యంలో ఆయవ్యయాలను చూసి, తాటి చెట్టు నుండి కల్లు తీసుకొన్నట్లుగా (చెట్టుకు హాని కలుగకుండా) ప్రజల వద్దనుండి వసూలు చేయాలి. తన బలగాలపట్ల సూటిగా వ్యవహరించాలి. శత్రువుల పంటలను గుఱ్ఱాల, ఎడ్ల కాలి గిట్టలతో త్రొక్కించాలి. తన పక్షం బలంగా ఉంటేనే శత్రువు మీద దాడికి స్పందించాలి. తన బలహీనతను బాగా గుర్తించాలి. శత్రువు యొక్క దోషాలను వెల్లడి పరచి, ఆ పక్షాన్ని చలింపజేసి, తన వైపు త్రిప్పుకోవాలి. అడవిలోని పూలను ఏరుకొన్నట్లుగా రాజులు బయటనుండి ధనాలను సమకూర్చుకోవాలి. ఉచ్చదశలో పై కెదిగిన కొండలవంటి శ్రీమంతులైన రాజులను నాశనం చేయాలి. వారికి తెలియకుండానే వారి నీడను ఆశ్రయించాలి. ఆపై రహస్యంగా యుద్ధానికి సిద్ధం చేయాలి. వర్షాకాలపు పూట ఏకాంతంగా ఉండే నెమలిగుణాలను పుణికి పుచ్చుకొని, రాజు కూడా వర్షాకాలంలో (శత్రువుపై దాడి చేయక) (ఏకాంతంగా రాజభవనంలోనే) ఉండాలి. స్త్రీల పట్ల దూరంగా ఉండాలి. కవచాన్ని ఎప్పుడూ విడువకూడదు. తన్ను తానే రక్షించుకోవాలి. విహారస్థలాలలో శత్రువులు పన్నిన పాశాలను తప్పించుకోవాలి. రాజు ఆ ప్రదేశం ప్రవేశించాలి. ఆ గహనంలో నశించిపోయే స్థితి కలిగితే కుటిల మార్గం అవలంబించి, క్రుద్ధుడై, విషం క్రక్కే శత్రువులను చంపాలి. శత్రువుల దళాల రెక్కలు నాశనం చేయాలి. సమీపస్థులను నివసించనీయాలి. ఎప్పుడూ నెమలివలె స్వేచ్ఛగా మంచిపని చేయాలి. (అది పురి విప్పినట్లుగా సైన్యాన్ని విస్తరింప చేయాలి.) అన్ని వైపుల బుద్ధి కుశలతను స్వీకరించాలి. అడవులలో మిడుతలదండులా శత్రుసర్వస్వాన్ని హరించాలి. ఈ రీతిగా రాజు నెమలివలె తన రాజ్యాన్ని పరిపాలించాలి. విచక్షణతో తనకు వృద్ధి కలిగించే నీతిని చేపట్టాలి.

తన బుద్ధితో మనసును కట్టడిచేసుకోవాలి. ఇతరుల (మంత్రుల) బుద్ధితో నిశ్చయించాలి. శాస్త్ర బుద్ధితో ఆత్మ గుణాలను పొందాలి. ఇది శాస్త్రంలో కనిపిస్తోంది. సామమార్గంలో ఇతరుని విశ్వసింపచేయాలి. తనశక్తిని కూడా ప్రదర్శించాలి. తన విమర్శనాత్మకమైన బుద్ధితో కార్యాన్ని గూర్చి ఆలోచించాలి. సాంత్వనతో, యుక్తితో కూడిన బుద్ధితో ప్రాజ్ఞుడై చేయవలసిన వానిని చేయిస్తూ, చేయకూడని వానిని మాన్పిస్తూ ఉండే నిగూఢ బుద్ధి గల ధీరునికి చెప్పవలసిన పని ఏముంది ? బుద్ధికి బృహస్పతివంటి ప్రాజ్ఞుడు ఎప్పుడైనా నీచంగా మాటలాడితే, కాల్చిన నల్లని ఇనుపముక్కను నీటిలో

ముంచినట్లుగా చల్లపరిస్తే, తిరిగి తన సహజస్వభావాన్ని పొందుతాడు. శాస్త్రాలలో చెప్పబడిన తన యొక్క, పరులయొక్క సమస్త కార్యాలనూ కూడా రాజు చేస్తూ ఉండాలి. కార్య సాధనవిధానం తెలిసిన రాజు తన కార్యసిద్ధికోసం మృదుస్వభావుని, ప్రాజ్ఞుడిని, పరాక్రమవంతుని, ఇంకా ఇతర బలాధికులను నియోగించాలి. వీణ యొక్క పొడవైన తంత్రులు ఒకే రాగం పలికినట్లుగా రాజు తనకు కావలసిన పనులయందు నియమించిన సేవకుల నందరిని ఒకేలా అనుసరించి ఉండాలి. ధర్మ విరుద్ధం కాకుండా 'ఇతడు నావాడు' అనుకొని రాజు అందరికీ ప్రియ మాచరించాలి. ఆటువంటి రాజు పర్వతంలా స్థిరంగా ఉంటాడు. సూర్యుడు తన దీర్ఘమైన కిరణాలను ప్రసరింపచేసి, అందరినీ రక్షించినట్లుగా రాజు ఇష్టులందు, అనిష్టులందు సమభావం కలిగి, గట్టిపూనికను వహించి ధర్మాన్నే రక్షించాలి. రాజు అన్ని పనులయందూ కూడా కుల స్వభావదేశ ధర్మాలను ఎరిగిన వారిని, మృదువుగా మాటలాడేవారిని, యౌవనంలో ఉన్నప్పుడు దోషాలు చేయనివారిని, మేలు చేయడంలో తత్పరులైనవారిని, కంగారు పడనివారిని, లోభులు కానివారిని, శిక్షణ పొందినవారిని, జితేంద్రియులను, ధర్మబద్ధులైన వారిని, ధర్మార్థాలను రక్షించేవారిని నియోగించాలి. ఈ రీతిగా రాజు జాగరూకుడై పనులయొక్క ఆరంభాన్ని, ముగింపును చక్కగా నిర్వర్తించాలి. సంతుష్టుడై ఉండాలి. చారులచేత సేవింపబడుతూ రాజ్యవిషయాలను తెలుసుకోవాలి.

వ్యర్థంగా క్రోధహర్షాలను చూపని, స్వయంగా పనులను పర్యవేక్షించుకొనే, ఆత్మవిశ్వాసమే నిధిగా గల రాజుకు ఈ భూమి ధనాన్ని ఇచ్చేది అవుతుంది. అందరిపట్లా అనుగ్రహం ప్రకటిస్తూ, సరియైన కారణానికే నిగ్రహం చూపుతూ, తనను, తన దేశాన్ని కూడా రక్షించుకొనే రాజే రాజధర్మాలను తెలిసినవాడు. ఉదయించిన సూర్యుడు కిరణాలతో నిత్యమూ లోకాన్ని దర్శిస్తున్నట్లుగా, రాజు రాష్ట్రాన్ని పర్యవేక్షించాలి. గూఢచారులను తరచుగా పంపి రాష్ట్రంలోని సమాచారాన్ని తెలుసుకోవాలి. స్వయంగా తాను కూడా తన బుద్ధితో ఆలోచించి నడుచుకోవాలి. బుద్ధిమంతుడైన రాజు అవసరం వచ్చినపుడే ప్రజలనుండి ధనాన్ని పొందాలి. తన అర్థసంబంధమైన విషయాలను ఎవరికీ ఎరుకపరచకూడదు. ఆవును రక్షిస్తూ రోజూ పాలను పితికి నట్లుగా భూమిని కాపాడుతూ ధనాన్ని సేకరించాలి. తుమ్మెద పూవులనుండి క్రమంతప్పకుండా తేనెను సంగ్రహించినట్లుగా రాజు ప్రజలనుండి ధనాన్ని సేకరించి కూడ బెట్టాలి. రాజ్యాన్ని సురక్షితంగా ఉంచడానికి కావలసిన ధనంకంటె మిగులు ధనాన్ని మాత్రమే రాజు ధర్మ కార్యాలకు, భోగాలకు వినియోగించాలి. అంతే

తప్ప శాస్త్రవేత్త, ఆత్మజ్ఞాని అయిన రాజు కూడబెట్టిన ధనాగారంనుండి ధనాన్ని వ్యయం చేయకూడదు. స్వల్పమైనా ధనాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. శక్తిహీనుడైనా శత్రువును అవమానించకూడదు. బుద్ధితో తనశక్తి సామర్థ్యాలను తెలుసుకోవాలి. బుద్ధిహీనులను ఎప్పుడూ నమ్మకూడదు. ధారణ, సామర్థ్యం, సంయమనం, తెలివి, శరీరపటుత్వం, ధైర్యం, పరాక్రమం, దేశకాలాలయందు ఏమరుపాటు లేకపోవడం–ఈ ఎనిమిది గుణాలు కొద్దో, గొప్పో ధనాన్ని వృద్ధి చేయడంలో ఇంధనాలు అవుతాయి. అల్పమైన అగ్ని కూడా నేతితో తడిస్తే వృద్ధిపొందుతుంది. ఒకే విత్తనం వేల మొలక లవుతుంది. ఆయవ్యయాల గురించి విస్తారంగా తెలుసుకొని, అల్పమైన ధనాన్ని కూడా అవమానించకూడదు. శత్రువు బాలుడైనా, యువకుడైనా, వృద్ధుడైనా ఏమరుపాటుగా ఉండే వానిని ఎప్పుడూ సంహరించాలి. లేకపోతే వానిని సమయంచూసి, మరొకడు అతని మూలాలను హరించివేస్తాడు. కాబట్టి కాలాన్ని పసిగట్ట గలిగిన వాడే రాజులలో శ్రేష్ఠుడు అవుతాడు. ద్వేషించే శత్రువు దుర్బలుడైనా గానీ, బలవంతుడైనా గానీ రాజు యొక్క కీర్తిని నశింపచేస్తాడు. అతని ధర్మాచరణానికి ఆటంకం కలిగిస్తాడు. ఆర్థికంగా పెరుగుతున్న బలాన్ని హరించివేస్తాడు. కాబట్టి వశీకృత చిత్తుడైన రాజు శత్రువును తక్కువగా అంచనావేయకూడదు (నిర్లక్ష్యం చేయకూడదు).

బుద్ధిమంతుడైన రాజు తన క్షయవృద్ధులను, పాలనావిధానాన్ని, ధనసంగ్రహ రీతిని చక్కగా గుర్తించి, పరస్పరం ఆశ్రయించుకొని ఉండే ఆ ధన భోగాలు రెండింటినీ కూడా దృష్టిలో ఉంచుకొని ఆపై శత్రువుతో సంధివిగ్రహాలను నెరపాలి. అందుకోసం బుద్ధిమంతులను ఆశ్రయించాలి. పదునైన బుద్ధి బలవంతుని కూడా నశింపజేస్తుంది. బుద్ధిచేతనే నశించిపోయిన బలం రక్షింపబడుతుంది. వృద్ధిపొందుతున్న శత్రువు బుద్ధిచేతనే బాధింపబడతాడు. బుద్ధితో బాగా ఆలోచించి తదుపరి చేసే కార్యం సర్వోత్తమం అవుతుంది. దోష వర్జితుడైన ధీరుడు అన్ని కోరికలను కోరుకొన్నా, తక్కువ బలాన్ని ఉపయోగించియే పొందగలుగుతాడు. కాని తనకోసం ఇతరులను అర్థించి పొందాలనుకొనేవాడు తన శ్రేయస్సు అనే ప్నాతను చిన్నదైనా నింపలేడు. కాబట్టి రాజు ప్రజలయందు అనుగ్రహం చూపుతూ, వారి నుండి పన్నుల రూపంలో ధనాన్ని సంపాదించుకోవాలి. అంతే కాని ఎక్కువ కాలం వారిని పీడిస్తూ, పిడుగుపాటులా విరుచుకుపడి సంపాదించకూడదు. విద్యగాని, తపస్సుగాని, విస్తారమైన ధనం కాని, అన్నీ ప్రయత్నం చేతనే సాధ్యమవుతాయి. ఆ ప్రయత్నం ప్రాణులలో బుద్ధికి లోబడి ఉంటుంది. కాబట్టి ప్రయత్నమే సమస్త కార్యాలను సిద్ధింప చేస్తుందని గ్రహించాలి. బుద్ధిమంతులు, మనస్సులు అయిన బుధులు

జ్ఞానేంద్రియాల యందు నివసిస్తూ ఉంటారు. ఆ ఇంద్రియాలకు అధిష్ఠానదేవతలై ఇంద్రుడు, విష్ణువు, సరస్వతి అక్కడ ఉంటారు. ప్రాణులన్నీ ఆ శరీరాన్ని ఆశ్రయించుకొని ఉంటాయి. కాబట్టి విద్వాంసుడు శరీరాన్ని అవమానించకూడదు. రాజు ఏదో కొంత ఇవ్వడం ద్వారా నిత్యమూ లుబ్ధుని అణిచిఉంచాలి. ఇతరుల సంపదతో లోభి ఎప్పుడూ తృప్తి పడడు. ఆయా కర్మలయొక్క ఫలభోగాలను అనుభవించడానికి అందరూ లుబ్ధులుగానే ఉంటారు. అర్థహీనుడు ధర్మకామాలను వదిలివేస్తాడు. ధనం, భోగం, పుత్రుడు, భార్య, సమస్త సమృద్ధిని లుబ్ధుడు ఇతరుల నుండియే పొందా లనుకొంటాడు. సమస్త దోషాలు లుబ్ధునియందు ఉంటాయి. కాబట్టి రాజు లుబ్ధుని ఏ పదవిలోనూ నియమించుకోకూడదు.

ప్రాజ్ఞుడైన రాజు నీచ మానవుని తన దృష్టి నుండి కూడా దూరంగా ఉంచాలి. ప్రాజ్ఞుడు శత్రువుల ప్రయత్నాలను, సమస్త కార్యాలను నాశనం చేయాలి. పాండుకుమారా ! ధర్మయుక్తులలో విశేషజ్ఞానం కలవాడు, సురక్షితుడు అయినవాడు మంత్రిగా ఉండాలి. విశ్వాసపాత్రుడు, కులీనుడు అయిన రాజు రాజులను చేరదీయడంలో సమర్థుడై ఉంటాడు. శాస్త్రాలలో చెప్పబడిన రాజధర్మాలను సంగ్రహంగా చెప్పాను. బుద్ధితో ఆలోచించుకొని మనసులో ధారణ చేసుకో. ఈ ధర్మాలను మనసులో ఉంచుకొని ఆచరణలో పెట్టే రాజు భూమిని పాలించడానికి సమర్థుడవుతాడు. అన్యాయంగా సంపాదించినది, బలవంతంగా పొందినది, దైవ విధానం వలన వచ్చినది అయిన సుఖం అదృష్టవశంగా వచ్చినట్లు కనిపిస్తుంది. రాజధర్మం తెలియని అటువంటి రాజుకు దిక్కులేదు. ఉత్తమమైన రాజ్యసుఖం కూడా అతనికి కలుగదు. ఈ చెప్పిన రాజధర్మాలను అనుసరించి, సంధివిగ్రహాది గుణ ప్రయోగాలలో ఎల్లప్పుడూ జాగరూకుడై ఉండే రాజు ధనవంతులై, బుద్ధి శీలాలతో పూజనీయులై, గుణవంతులై, యుద్ధ పరాక్రమంచూపే శత్రువులను కూడా కూటనీతి కౌశలంతో నశింపచేయగలడు. రకరకాల కార్యపద్ధతుల ద్వారా శత్రువిజయానికి ఉపాయాలను అన్వేషించాలి. అనుచితమైన ఉపాయాలను బుద్ధిలో చొరనీయకూడదు. ఎప్పుడూ దోషాలనే చూచేవాడు విశిష్టమైన సంపదను, విస్తారమైన కీర్తిని, ధనాన్ని పొందలేడు. స్నేహితులలో ఇద్దరు మిత్రులు కార్యభారాన్ని ఒకేసారి వహించినా, లేక ఒకేసారి తిరిగిపోయినా, ఆ ఇద్దరిలో మళ్లీ ఒకరు తిరిగి వచ్చి, కార్యభారాన్ని పూర్తిగా వహిస్తే, అతనినే మంచి స్నేహితు డని పండితులు వేర్కొంటారు. రాజా ! నేను చెప్పిన ఈ రాజధర్మాలన్నీ పాటించు. ప్రజలను రక్షించడంలో మనసు లగ్నం చేయి. అందువల్ల సుఖంగా పుణ్య ఫలాలను పొందగలుగుతావు. ఎందుకంటే **లోకమంతా ధర్మమూలకమే.**'

121. రాజధర్మకథనము.

యుధిష్ఠిరుడు అడిగాడు. 'సనాతనమైన ఈ రాజధర్మాన్ని గూర్చి పితామహులవారు సెలవిచ్చారు. దానిని బట్టి మహాదండమే ఈశ్వరుడు. దండమందే సర్వమూ నిలిచి ఉంది. ప్రభూ ! దేవతలకు, ఋషులకు, పితరులకు, మహాత్ములకు, యక్షరక్షఃపిశాచులకు, సాధ్యులకు, విశేషించి లోకంలోని పశుపక్ష్యాదియోనులకు సమస్త ప్రాణులకు మహా ప్రభావ శాలియైన, సర్వవ్యాపకమైన దండమే శ్రేయస్కరమైనది. భరతసత్తమా ! సురాసురులు, మానవులతో సహితంగా లోకాన్నంతటినీ సమీపంగా దర్శించగలుగుతున్న మీరు దండమందే చరాచర లోకమంతా ప్రతిష్ఠితమై ఉందని చెపుతున్నారు. దీనిని గూర్చిన యథార్థతత్త్వాన్ని తెలుసుకోవా లనుకొంటున్నాను. దండం అంటే ఏమిటి ? ఎలా ఉంటుంది ? దాని స్వరూపం ఎలాంటిది ? అది దేనిమీద ఆధారపడి ఉంటుంది ? ప్రభూ ! దానికి ఉపాదానం ఏమిటి ? అది ఎలా పుట్టింది ? దాని ఆకారం ఎలా ఉంటుంది ? ప్రజలందరియందు మిక్కిలి శ్రద్ధ గలిగిన దండం ఏ విధంగా వారిని శాసించడానికి మెలకువ కలిగిఉంటుంది ? ఈ దండానికి పూర్వాపరాలను పాలించడానికి ఎవరు మెలకువ కలిగి ఉంటారు ? పూర్వం దీనిని ఏమని అనేవారు ? దండమనే పేరుగల వానిలో ఏది ప్రసిద్ధం ? దండం దేని మీద ఆధారపడి ఉంటుంది ? దీని గతి ఏ విధంగా చెప్పబడింది?'

భీష్ముడు చెపుతున్నాడు. 'కౌరవ్యా ! దండమంటే ఏమిటో, దాని వ్యవహారం ఎలా ఉంటుందని చెప్పబడిందో అదంతా విను. ఈ లోకమంతా దేనికి అధీనమై ఉందో అదే దండమని ఇక్కడ చెప్పబడుతోంది. మహారాజా ! ధర్మానికే మరోపేరు వ్యవహారం, లోకంలో మిక్కిలి శ్రద్ధగల వానికి ధర్మం పట్ల ఎలాంటి లోపమూ కలగకూడదు. అందుకే దండం అవసరం. ఆ వ్యవహారానికే వ్యవహారత్వం అని పేరు.* రాజా ! పూర్వకాలంలో మనువు "ఇష్టులపట్ల, అనిష్టులపట్ల సమాన భావం కలిగి, ఎవరిమీదా పక్షపాతం చూపక, సరిగా దండాన్ని ఉపయోగిస్తూ ప్రజలను చక్కగా రక్షిస్తూ ఉంటే అదే అతనికి సరియైన ధర్మం" అని చెప్పాడు. మానవేంద్రా ! ఈ పైన చెప్పిన మాటలన్నీ మనువు ముందు గానే చెప్పాడు. నేను చెప్పిన మాటలు బ్రహ్మ చెప్పిన మహావచనాలు. ఈ మాటలే

---

* *ఎవని వలన ధర్మానికి లోపం జరిగిందో వాడు "వ్యవహారం" అనబడతాడు. ఈ వ్యుత్పత్తిని అనుసరించి ధర్మానికి లోపం కలిగినపుడు రక్షించడమనే వ్యవహారమే వ్యవహారత్వం అవుతుంది. (నీల)*

ముందుగా మనువు చెప్పడం వలన "ప్రాగ్వచనం" అని కూడా పండితులు అనుకొంటారు.. ఇక్కడ వ్యవహారమని ప్రతిపాదించడం వలన వ్యవహారమనే పేరు కూడా వచ్చింది. దండాన్ని సరిగ్గా ప్రయోగించినట్లయితే రాజుకు ధర్మార్థ కామాలు మూడూ ఎప్పుడూ సమకూరుతాయి. కాబట్టి దండమే పరమదైవం. ఇది అగ్నివలె తేజోరూపంతో ప్రకటమవుతుంది. దీని శరీరం నల్లకలువరేకులవలె శ్యామలంగా ఉంటుంది. నాలుగు దంష్ట్రలు, నాలుగు భుజాలు ఉంటాయి. ఎనిమిది పాదాలు, అనేక నయనాలు కలిగి, శంకువులాంటి చెవులతో, నిక్కపొడుచుకొన్న రోమాలు కలిగి ఉంటుంది. శిరసుపై జటలు ఉంటాయి. రెండు నాలుకలతో ముఖం రాగిరంగులో ఉంటుంది. వ్యాఘ్రచర్మంతో శరీరం ఆచ్ఛాదింపబడి ఉంటుంది. ఈ రీతిగా దుర్ధర్షమైన దండం ఎప్పుడూ ఇలాంటి భయంకరమైన రూపాన్ని ధరించి ఉంటుంది. కత్తి, విల్లు, గద, శక్తి, త్రిశూలం, ముద్గరం, బాణం, ముసలం, పరశువు, చక్రం, పాశం, దండం, ముష్టి, తోమరం. ఇవే కాక ఇంకా ఇటువంటివి ఏ ఏ ఆయుధాలు ఉన్నాయో ఆ అన్నింటిలోను సర్వాత్మ అయిన దండమే మూర్తీభవించి లోకంలో చరిస్తోంది. ఆ దండమే అపరాధులను భేదిస్తూ, ఛేదిస్తూ, బాధిస్తూ, ఖండిస్తూ, చీలుస్తూ, పగుల గొడుతూ, గాయపరుస్తూ, పరుగులు తీయిస్తూ అన్నివైపుల చరిస్తోంది. యుధిష్ఠిరా ! అసి, విశసనం, ధర్మం, తీక్ష్ణవర్మ, దురాధరం, శ్రీగర్భం, విజయం, శాస్త, వ్యవహారం, సనాతనం, శాస్త్రం, బ్రాహ్మణుడు, మంత్రం, ప్రాగ్వదతాంవరుడు, ధర్మపాలుడు, అక్షరుడు, దేవుడు, సత్యగుడు, నిత్యగుడు, అగ్రజుడు, అసంగుడు, రుద్రతనయుడు, మనువు, జ్యేష్ఠుడు, శివంకరుడు– ఇవన్నీ దండానికి పేర్లుగా చెప్పబడుతున్నాయి. దండం సర్వత్ర వ్యాపించి ఉండడం వలన విష్ణువు, నరులకు ఆశ్రయం కావడంవలన నారాయణుడు, ప్రభావశాలి అవడం వలన ప్రభువు అని చెప్పబడుతోంది. ఎల్లప్పుడూ మహారూపం ధరించి ఉండడం వలన మహాపురుషునిగా చెప్పబడుతోంది. అలాగే దండనీతిని బ్రహ్మయొక్క కుమార్తెగా చెప్తారు. ఇంకా లక్ష్మీ, వృత్తి, సరస్వతి, జగద్ధాత్రి అని కూడా దానికి పేర్లు. ఈ రీతిగా దండం అనేక రూపాలు ధరించి ఉంది.

అర్థానర్థాలు, సుఖదుఃఖాలు, ధర్మాధర్మాలు, బలాబలాలు, దౌర్భాగ్య భాగధేయాలు, పుణ్యపాపాలు, గుణాగుణాలు, కామం-అకామం, ఋతువులు మాసాలు, రాత్రులు పగళ్లు, క్షణం, ప్రమాదం, అప్రమాదం, హర్షక్రోధాలు, శమం, దమం, దైవం, పురుషకారం, మోక్షం, బంధం, భయం, అభయం, హింస, అహింస, తపస్సు, యజ్ఞం, సంయమనం విషం, అవిషం, ఆదిమధ్యాంతాలు, కార్యవిస్తారం, మదం, ఏమరుపాటు, దర్పం, దంభం,

ధైర్యం, నీతి, అవినీతి, శక్తి, అశక్తి, మానం, స్తబ్ధత, వ్యయం, అవ్యయం, వినయం, దానం, కాలం, అకాలం, సత్యం, అసత్యం, జ్ఞానం, శ్రద్ధ అశ్రద్ధ, అకర్మణ్యత, ప్రయత్నం, లాభం, హాని, జయం, అపజయం, తీక్ష్ణత్వం, మృదుత్వం, మృత్యువు, రాక, పోక, విరోధం, అవిరోధం, కార్యం, అకార్యం, సబలత, నిర్బలత, అసూయ, అనసూయ, ధర్మం, అధర్మం, లజ్జ, నిర్లజ్జ, సిగ్గరితనం, సంపత్తి, విపత్తి, స్థానం, తేజస్సు, కర్మలు, పాండిత్యం, వాక్శక్తి, తత్త్వబుద్ధి, - ఇవన్నీ దండానికి ఉన్న అనేక నామాలు, అనేక రూపాలు. భారతా ! కురునందనా ! ఈ రీతిగా లోకంలో దండం అనేక రూపాలుగా ఉంది. యుధిష్ఠిరా ! లోకంలో ఈ దండమే లేకుంటే లోకులు ఒకరినొకరు చంపుకొంటారు. దండం వలని భయం చేతనే మనుష్యులు ఒకరినొకరు చంపుకోవడం లేదు. ఈ దండం వలన రక్షణ పొందుతున్నారు. కనుకనే ప్రజలు ప్రతిదినం రాజును ధన ధాన్యాలతో వృద్ధిపొందిస్తున్నారు. కనుక దండమే అందరికీ ఆశ్రయించతగినది. ఈ లోకాన్ని శీఘ్రంగా సత్యంలో నిలిపేది దండమే. సత్యంలోనే ధర్మం యొక్క ఉనికి. ఆ ధర్మం బ్రాహ్మణులలో నిలిచిఉంది. ద్విజశ్రేష్ఠులు ధర్మపరులు, స్వాధ్యాయపరులు అయిఉంటారు. వేదాల నుండి యజ్ఞం పుట్టింది. యజ్ఞం దేవతలను తృప్తి పరుస్తుంది. తృప్తి పొందిన దేవతలు ప్రజలకోసం ప్రతిదినం ఇంద్రుని ప్రార్థిస్తారు. ఇంద్రుడు ఆ ప్రజలపై అనుగ్రహించి (సమయానికి వర్షాలు కురిపించి, పంటలు పండించి) అన్నం ఇస్తాడు. జీవులందరి యొక్క ప్రాణాలు నిత్యమూ అన్నంవలననే నిలిచి ఉంటాయి. కాబట్టి దండమే ప్రజల ఉనికికి కారణం. ఆ దండమే ప్రజల రక్షణకు నిత్యమూ జాగరూకమై ఉంటుంది. ఈ రీతిగా రక్షించడం అనే ప్రయోజనం కలిగిన దండం క్షత్రియత్వాన్ని పొందింది. అక్షరమైన దండం మిక్కిలి శ్రద్ధతో ప్రజలను రక్షిస్తూ నిత్యమూ జాగరూకతతో ఉంటుంది. ఈశ్వరుడు, పురుషుడు, ప్రాణం, సత్త్వం, చిత్తం, ప్రజాపతి, భూతాత్మ, జీవుడు- అనే ఎనిమిది నామాలతోను దండమే ప్రతిపాదింపబడుతోంది. నిత్యం సైనికబలంతో కూడి, ధర్మం, వ్యవహారం, దండం, ఈశ్వరుడు, జీవుడు - అనే ఐదురకాలైన రూపాలను ధరిస్తూ ఉండే రాజుకు భగవంతుడు దండనీతిని, తన ఐశ్వర్యాన్ని ప్రసాదించాడు.

యుధిష్ఠిరా ! ప్రాకృతమని, ఆహార్యమని రాజు యొక్క బలం రెండురకాలుగా ఉంటుంది. కులం, అధికధనం, మంత్రి, బుద్ధి. ఈ నాలుగూ ప్రాకృత బలం. క్రింద చెప్పబోయే ఎనిమిది రకాల వస్తువులతో కూడినది వేరొక టైన ఆహార్యకమనే బలం. ఏనుగులు, గుఱ్ఱాలు, రథాలు, కాల్బలం, నౌకలు, వెట్టివాళ్లు, దేశంలోని ప్రజలు, గొఱ్ఱెలు మొదలైన పశువులు - ఈ ఎనిమిది అంగాలతో కూడిన బలం ఆహార్యకం. సంయుక్తమైన

అంగంలోని రథాలు, గజారోహులు, అశ్వారోహులు, పదాతులు, మంత్రులు, వైద్యులు, భిక్షకులు, న్యాయవాదులు, జ్యోతిషికులు, దైవజ్ఞులు, కోశం, మిత్రులు, ధాన్యం, ఇంకా ఇతర సమస్త సామగ్రి, రాజ్యానికి సంబంధించిన సప్తప్రకృతులు (రాజు, మంత్రి, సుహృత్తు, కోశం, రాష్ట్రం, దుర్గం, సేన), పైన చెప్పిన ఎనిమిది అంగాలతో కూడిన బలం. ఇవన్నీ రాజ్యానికి "శరీరం" గా చెప్పబడతాయి. ఈ అన్నింటిలో దండమే ప్రధానమైన అంగం. ఎందుకంటే అది అన్నింటికీ మూలకారణం. ఈశ్వరుడు ప్రయత్న పూర్వకంగా క్షత్రియునికి అతనితో సమానాత్మ అయిన దండం ప్రసాదించాడు. కాబట్టి దండమే సనాతన వ్యవహారానికి కారణం. బ్రహ్మలోకరక్షణ నిమిత్తం, స్వధర్మ స్థాపన కోసం ప్రదర్శించిన (ఉపదేశించిన) ధర్మం దండమే. రాజులకు దీనిని మించిన పరమపూజనీయమైన వేరొక ధర్మం లేదు. న్యాయమూర్తి యొక్క విశ్వాసాన్ని అనుసరించి పుట్టిన వ్యవహారం వేరు. అతడు విధించిన దండం పేరు "భర్తృ ప్రత్యయ లక్షణం". అది ఈ సమస్త జగత్తునకు హితకరమైనదిగా చూడబడుతోంది. నరశ్రేష్ఠా ! వేద ప్రతిపాదితమైన దోషాలను ఆచరించే వారిపట్ల చేసే వ్యవహారాన్ని లేదా విచారణను "వేద ప్రత్యయం" అని అంటారు. (ఇది రెండవ భేదం). కులాచారాలను భంగపరచినపుడు జరిపే వ్యవహారాన్ని 'మౌలం" అంటారు. (ఇది మూడవ భేదం) ఇందులో కూడా శాస్త్రోక్తమైన దండవిధానమే పాటింపబడుతుంది. ఇంతకు ముందు చెప్పబడిన "భర్తృప్రత్యయ లక్షణం" అనే దండం మనరాజులలోనే ఉంటుందని తెలుసుకోవాలి. ఎందుకంటే ఆ విశ్వాసం, దండం రాజుల మీదే ఆధారపడి ఉంటుంది. ప్రభువు యొక్క విశ్వాసం మీద ఆధారపడినప్పటికీ ఆ దండం వ్యవహార స్వరూపంగానే భావింపబడుతుంది. అలా భావింపబడే ఆ వ్యవహారం కూడా వేదోక్త విషయం కంటె వేరైనది కాదు. వేదాలనుండి పుట్టిన అది ధర్మమే. ఆ ధర్మం తన గుణాలను ప్రదర్శిస్తుంది. పుణ్యాత్ములు ధర్మాన్ని అనుసరించియే ధర్మ విశ్వాసమూలకమైన దండాన్ని ప్రతిపాదించారు. యుధిష్ఠిరా ! బ్రహ్మ చెప్పిన ప్రజారక్షక రూపమైన ఆ వ్యవహారం సత్యస్వరూపమేకాక ఐశ్వర్యాన్ని వృద్ధిచేసేది కూడా. అదే ముల్లోకాలను ధరించి ఉంది. దండమే మా దృష్టిలో సనాతన వ్యవహారం. వ్యవహారంగా దర్శింపబడే అదే వేదం. ఇది నిశ్చయంగా చెప్పబడినది. వేదమే ధర్మం. ధర్మమే సన్మార్గం. పితామహుడు ప్రజాపతి అందరికంటె ముందు ఉదయించిన వాడు అయిన బ్రహ్మయే ఆ సత్పురుషుడు. దేవతలను, రాక్షసులను, అసురులను, మనుష్యులను, నాగులను, సమస్త లోకాలలోని ప్రాణులను సృష్టించినవాడు, లోకకర్త - ఆ బ్రహ్మయే. అతనివలననే భర్తృ ప్రత్యయలక్షణమనే పేరుగల వేరే విధమైన దండం

ప్రవర్తిల్లింది. పైగా అతడే ఈ వ్యవహారం కోసం ఈ ఆదర్శ వాక్యాన్ని చెప్పాడు. "తల్లి, తండ్రి, సోదరుడు, భార్య, పురోహితుడు– ఎవరైనా కానీ తన ధర్మాన్ని స్థిరంగా పాటించకపోతే రాజు వారిని దండించాలి. రాజుకు దండింప తగని వారెవరూ లేరు.'

122. దండోత్పత్తి క్షత్రియులకు పరంపరాగతమగుట.

భీష్ముడు చెపుతున్నాడు. 'ఈ దండోత్పత్తి విషయమై ప్రాజ్ఞులు ప్రాచీన ఇతిహాసాన్ని ఒక దానిని ఉదాహరిస్తూ ఉంటారు. వినుము. అంగదేశాన్ని వసుహోముడనే పేరు గల తేజస్వంతుడైన రాజు పరిపాలిస్తున్నాడు. ఒక సారి ధర్మజ్ఞుడు, మహాతపస్వి అయిన ఆ రాజు తన భార్యతో కలిసి దేవతలు, ఋషులు, పితరులు పూజిస్తూ ఉండే ముంజపృష్ఠమనే తీర్థానికి వెళ్లాడు. రాజేంద్రా ! అది కనకమయమైన మేరు పర్వతానికి సమీపంలో ఉన్న హిమాలయ శిఖరంపై ఉంది. అక్కడ ముంజావటంలో పరశురాముడు తన జటలను ముడివేయటానికి ఆదేశించాడు. అప్పటి నుండి కఠోరవ్రతాన్ని ఆచరించే ఋషులందరూ ఆ రుద్రసేవితమైన ప్రదేశాన్ని "ముంజ పృష్ఠం" అనసాగారు. అక్కడ అతడు వేదోక్తమైన గుణాలతో కూడి తపస్సు చేయసాగాడు. తన తపః ప్రభావం వలన అతడు దేవతలతో సమానుడైనాడు. బ్రాహ్మణులలో అతని గౌరవం ఇనుమడించ సాగింది. ఒక రోజున ఇంద్రుని స్నేహితుడు, శత్రుకర్శనుడు, ఉదారహృదయుడు అయిన మాంధాతరాజు అతని యొక్క దర్శనం కోసం వచ్చాడు. మాంధాత మహారాజు గొప్ప తపస్సు చేస్తున్న నరేశ్వరుడు వసుహోముని సమీపించి, అతనిని దర్శించి, అతని ఎదుట వినీతుడై నిలిచాడు. వసుహోముడు కూడా ఆ రాజుకు అర్ఘ్యపాద్యాలు నివేదించి, సప్తాంగాలతో కూడిన రాజ్యం యొక్క క్షేమసమాచారాన్ని అడిగాడు. పూర్వం పెద్దలు ఆచరించిన దానిని యథాతథంగా అనుసరిస్తున్న మాంధాతను వసుహోముడు "రాజా ! మీకు నేను ఏమి చేయగలను" అని అడిగాడు. కురునందనా ! దానికి మిక్కిలి సంతోషించిన మాంధాత కూర్చునిఉన్న మహాప్రాజ్ఞుడు, రాజోత్తముడు అయిన వసుహోమునితో ఇలా అన్నాడు. 'రాజా ! బృహస్పతి నీతిశాస్త్రాన్ని అంతటినీ నీవు అధ్యయనం చేశావు. నరోత్తమా ! అలాగే శుక్రాచార్యుని శాస్త్రం కూడా నీకు తెలుసు. కాబట్టి దండం యొక్క ఉత్పత్తిని గూర్చి తెలుసు కోవాలనుకొంటున్నాను. దీనికి ముందు ఏది జాగరూకత వహించేది ? ఈ దండం అన్నింటికంటె పరమశ్రేష్ఠమని ఎందుకంటారు ? ఇప్పుడు ఆ దండం క్షత్రియుల చేతిలోకి ఎలా వచ్చింది ? మహాప్రాజ్ఞా ! ఇదంతా నాకు చెప్పండి. నేను మీకు గురుదక్షిణ ఇస్తాను.'

వసుహోముడు చెప్పాడు. 'రాజా ! లోకాన్ని నియమించడం కోసం, ప్రజలను అవినయాన్నుండి కాపాడడంకోసం ఏర్పడిన ధర్మ స్వరూపమూ, సనాతనమూ అయిన దండం యొక్క పుట్టుకను గురించి విను. సర్వలోక పితామహుడు, భగవానుడు అయిన బ్రహ్మ యజ్ఞం చేయగోరాడని, కాని ఆయనకు తనతో సమానుడైన బుత్విజుడు కనిపించలేదని మనం విన్నాం. అప్పుడతడు చాలా ఏళ్లపాటు తన తలమీద ఒక గర్భాన్ని ధరించి ఉన్నాడు. వేయి సంవత్సరాలు గడిచాక అతనికి తుమ్ము వచ్చింది. దానితో ఆ గర్భం కిందపడింది. అరిసూదనా ! మహారాజా ! ఆ గర్భం నుండి పుట్టిన బాలునికి "క్షుపుడు" అనే పేరు వచ్చింది. మహాత్ముడైన బ్రహ్మకు అతడు బుత్విజుడు ఆయ్యాడు. రాజోత్తమా ! బ్రహ్మ ఆ యజ్ఞం ప్రారంభించగానే ఆ యజ్ఞమే ప్రధానంగా కనిపించడం వలన బ్రహ్మ యొక్క దండం అంతర్ధానమై పోయింది. అది అంతర్హితం కాగానే ప్రజలలో వర్ణసాంకర్యం కలిగింది. కార్యాకార్య, భక్ష్యా భక్ష్య వివేచన లేక పోయింది. ఇక ఇది త్రాగవచ్చు, ఇది త్రాగకూడదు అనేది ఎక్కడుంటుంది ? లోకులు పరస్పరం హింసించుకోసాగారు. ఆ సమయంలో గమ్యం, అగమ్యం అనేది కూడా లేకపోయింది. తన సొమ్ము, పరుల సొమ్ము ఒకటిగానే అనిపించసాగింది. కుక్కలు మాంసం కోసం కాట్లాడుకొన్నట్లుగా వారు పరస్పరం దెబ్బలాడుకోసాగారు. బలవంతులు బలహీనులను చంపివేశారు. అపుడు విశృంఖలత్వం వ్యాపించింది. ఇటువంటి దశలో పితామహుడయిన బ్రహ్మ సనాతనుడు, భగవానుడు అయిన విష్ణువును పూజించి, వరదుడు, దేవుడు అయిన మహాదేవునితో - "శంకరా ! ఈ పరిస్థితిలో మీరు దయ చూపాలి. లోకంలో వర్ణసంకరం కలుగని రీతిలో మీరు ఏదైనా ఏర్పాటు చేయండి" అని అడిగాడు. అంతట శ్రేష్ఠమైన శూలాయుధాన్ని ధరించిన సురశ్రేష్ఠుడైన భగవంతుడు చాలాసేపు ధ్యానించి, తన్ను తానే దండంగా సృష్టించుకొన్నాడు. దాని వలన ధర్మాచరణం జరగడం చూసి, నీతి స్వరూపమైన సరస్వతీ దేవి దండనీతిని సృజించింది. అది ముల్లోకాలలోనూ ప్రసిద్ధికెక్కింది. శూలపాణి అయిన ఆ భగవానుడు మళ్లీ చాలాసేపు ధ్యానించి, ఆయా సమూహాలకు ఒక్కొక్కరు చొప్పున రాజులను ఏర్పాటు చేశాడు. సహస్ర నేత్రుడైన ఇంద్రుని దేవతలకు రాజుగా చేశాడు. సూర్య సుతుడైన యముని పితరులకు రాజుగా చేశాడు. కుబేరుని ధనానికి, రాక్షసులకు అధిపతిగా; మేరువును పర్వతాలకు అధిపతిగా, సముద్రుని నదులకు అధిపతిగా చేశాడు. నీటికి, అసురుల యొక్క రాజ్యానికి వరుణుని ప్రభువుగా చేశాడు. మృత్యువును ప్రాణాలకు, అగ్ని దేవుని తేజస్సుకు అధిపతులుగా చేశాడు. మహాత్ముడు, విశాలాక్షుడు, సనాతనుడు

అయిన మహాదేవుని (తన్ను తాను) రుద్రులకు అధిపతిగా, శక్తి శాలి అయిన రక్షకునిగా చేశాడు. విప్రులకు వసిష్ఠుని, వసువులకు జాతవేదు డనే అగ్నిని, తేజస్సులకు భాస్కరుని, నక్షత్రాలకు చంద్రుని అధిపతులుగా చేశాడు. అంశుమంతుని లతలకు, పన్నెండు భుజాలతో అలరారే శక్తిశాలి అయిన కుమారస్కందుని భూతాలకు రాజుగా నియమించాడు. సంహార వినయ (ఉత్పాదనం) స్వరూపుడూ, సర్వేశుడూ అయిన కాలుని నాలుగు విభాగాలుగా ఉండే మృత్యువుకు, సుఖానికి, దుఃఖానికి స్వామిగా చేశాడు. అందరకు దేవుడు, రాజులకు రాజు, నరులకు అధిపతి, అయిన శూలపాణి శంకరుడు సమస్త రుద్రులకు అధీశ్వరుడని వింటూ ఉంటాం. బ్రహ్మ యొక్క చిన్నకొడుకుగా పుట్టిన ఆ ఈ క్షుపుని ప్రజలకు, సమస్త ధర్మధరులకు అధిపతిగా చేశాడు. అనంతరం బ్రహ్మ యొక్క యజ్ఞం యథావిధిగా ముగిసిన తరువాత మహాదేవుడు ధర్మాన్ని రక్షించే దండాన్ని సత్కారపూర్వకంగా విష్ణువుకు సమర్పించాడు. విష్ణువు అంగిరసునికి ఇచ్చాడు. ముని సత్తముడైన అంగిరసుడు ఇంద్రమరీచులు ఇద్దరికీ ఇచ్చాడు. మరీచి భృగువుకు ఇచ్చాడు. ధర్మ సమాహితమైన ఆ దండాన్ని భృగువు ఋషులకు ఇచ్చాడు. ఋషులు లోకపాలురకు, లోకపాలురు క్షుపునకు, క్షుపుడు సూర్యపుత్రుడైన మనువుకు (శ్రాద్ధదేవునికి), మనువు సూక్ష్మమైన ధర్మార్థాల రక్షణ కోసం దానిని తన పుత్రులకు అప్పగించారు.

కాబట్టి ధర్మానుసారంగా న్యాయాన్యాయాలను విచారించాకనే దండాన్ని ప్రయోగించాలి. ఇష్టం వచ్చినట్లు ఉపయోగించకూడదు. దుష్టులను అణచివేయడమే దండం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. బంగారు నాణేలు తీసుకొని కోశాన్ని నింపుకోకూడదు. దండాన్ని ఉపయోగించి సువర్ణం (ధనం) తీసుకోవడం బాహ్యక్రియ. గౌణకర్మ. స్వల్పమైన అపరాధం కారణంగా ప్రజల శరీరావయవాలను ఖండించడం, చంపడం, రకరకాల యాతనలకు గురిచేయడం, ప్రాణాలు వదిలేలా చేయడం, లేదా దేశం నుండి వెడలగొట్టడం ఎప్పుడూ తగినది కాదు. సూర్య పుత్రుడైన మనువు ప్రజల రక్షణకోసం తన పుత్రుల చేతికి ఈ దండాన్ని అప్పగించాడు. అదే క్రమంగా ఉత్తరోత్తర అధికారుల చేతులలోకి వచ్చి, ప్రజా పరిపాలనలో జాగరూకమై ఉంది. ఇంద్రుడు ఈ దండాన్ని ఉపయోగించడంలో సదా జాగరూకుడై ఉంటాడు. ఇంద్రుని నుండి తేజశ్శాలి అయిన అగ్ని, అగ్ని నుండి వరుణుడు, వరుణుని నుండి ప్రజాపతి ఆ దండాన్ని పొంది దానిని యథోచితంగా ప్రయోగించడంలో సదా జాగరూకులై ఉంటారు. లోకానికంతటికీ శిక్షణ నిచ్చే ధర్ముడు ప్రజాపతినుండి దండాన్ని గ్రహించి, ప్రజల రక్షణ కోసం సదా జాగరూకుడై ఉంటున్నాడు.

బ్రహ్మ పుత్రుడు సనాతనుడు అయిన వ్యవసాయుడు ఆ దండాన్ని ధర్ముని నుండి గ్రహించి, లోకరక్షణలో నిమగ్నుడై ఉంటున్నాడు. వ్యవసాయుని నుండి తేజస్సు దండాన్ని గ్రహించి, జగద్రక్షణ చేస్తూ జాగరూకుడై ఉన్నాడు. తేజస్సు నుండి ఓషధులు, ఓషధులనుండి పర్వతాలు, పర్వతాలనుండి రసం, రసం నుండి నిర్ఋతి, నిర్ఋతి నుండి జ్యోతిస్సులు, క్రమంగా ఆ దండాన్ని హస్తగతం చేసుకొని, లోకరక్షణలో ఏమరుపాటు లేక ఉంటున్నాయి. జ్యోతిస్సుల నుండి ఆ దండాన్ని గ్రహించి, వేదం ప్రతిష్ఠితం అయింది. వేదాలనుండి భగవంతుడైన హయగ్రీవుడు, హయగ్రీవుని నుండి అవ్యయుడు, ప్రభువు అయిన బ్రహ్మ ఆ దండాన్ని పొంది లోకరక్షణలో జాగరూకుడై ఉన్నాడు. పితామహుడైన బ్రహ్మనుండి మహాదేవుడు, భగవంతుడు అయిన శివుడు దండాన్ని, రక్షణాధి కారాన్ని పొంది, జాగరూకుడై ఉన్నారు. శివుని నుండి విశ్వే దేవులు, విశ్వేదేవతలనుండి ఋషులు, ఋషులనుండి భగవంతుడైన సోముడు, సోముని నుండి సనాతన దేవగణం, దేవతల నుండి బ్రాహ్మణులు ఆ అధికారాన్ని పొంది లోకరక్షణలో సదా జాగరూకులై ఉన్నారు. ఇదంతా నీవు చక్కగా గ్రహించు. అనంతరం బ్రాహ్మణుల నుండి దండధారణాధికారాన్ని పొంది, క్షత్రియులు ధర్మానుసారంగా లోకాల నన్నింటినీ రక్షిస్తున్నారు. ఈ సనాతనమైన చరాచరజగత్తు క్షత్రియులవలననే సురక్షితంగా ఉంది. ఈ లోకంలో ప్రజలు జాగరూకులై ఉంటారు. ఆ ప్రజలపట్ల దండం కూడా జాగరూకమై ఉంటుంది. బ్రహ్మతో సమానమైన తేజస్సు గల ఆ దండం అందరినీ వారి వారి హద్దులలో ఉంచుతుంది. భారతా ! ఈ కాల రూపమైన దండం సృష్టియొక్క ఆది మధ్యాంతాలలో కూడా జాగరూకమై ఉంటుంది. ఇది సర్వలోకేశ్వరుడైన మహాదేవుని స్వరూపం. ఇదే సమస్త ప్రజలను పాలిస్తుంది. దేవదేవుడు, మంగళ స్వరూపుడు, సర్వాత్ముడు, ప్రభువు, జటాజూటధారి, సుఖదాయకుడు, ఉమాపతి, స్థాణుస్వరూపుడు, దుఃఖహారి అయిన శివుడు సర్వదా జాగరూకుడై ఉంటాడు. ఈ రీతిగా ఈ దండం ఆదిమధ్యాంతాలలో విఖ్యాతమయింది. ధర్మజ్ఞుడైన రాజు దీనిద్వారా యథాన్యాయంగా నడుచుకోవాలి.' భీష్ముడు చెపుతున్నాడు. 'ఈ రీతిగా వసుహోముడు చెప్పిన ఈ మతాన్ని విన్నవాడు, విని యథోచితంగా నడుచుకొన్నవాడు అన్ని కోరికలను పొందగలడు. నరోత్తమా ! భారతా ! సమస్తలోకాన్ని నియమానికి లోబరచుతూ ధర్మం చేత ఆక్రాంతమై ఉండే ఈ దండం గురించిన అన్ని విషయాలూ నేను నీకు చెప్పాను.'

123. కామందక - ఆంగరిష్ఠ సంవాదము.

యుధిష్ఠిరుడు ఆడిగాడు. 'తాత ! ధర్మార్థకామాల గురించి నీ నిశ్చితాభిప్రాయాన్ని వినాలనుకొంటున్నాను. లోకయాత్ర సంపూర్ణంగా జరగాలంటే వేటి మీద ఆధారపడి ఉంటుంది ? ధర్మార్థ కామాలకు మూలం ఏమిటి ? ఈ మూడింటియొక్క ఉత్పత్తి కారణ మేమిటి ? ఇవి ఒక్కొక్కసారి ఒక దానితో ఒకటికలిసి, ఒక్కొక్కసారి విడివిడిగాను ఎందుకు ఉంటాయి ?' భీష్ముడు చెపుతున్నాడు. లోకంలో మనుష్యులు చిత్తశుద్ధి కలిగి, ధర్మపూర్వకంగా ఏదైనా అర్థాన్ని పొందాలని నిశ్చయించుకొని ప్రవర్తించినపుడు సరియైన కాలం, కారణం, కర్మానుష్ఠానం వలన ధర్మ అర్థ కామాలు మూడూ ఒకేసారి కలిసి కనిపిస్తాయి. ఇందులో ధర్మం ఎప్పుడూ అర్థప్రాప్తికి కారణంగా, కామం అర్థానికి ఫలంగా చెప్పబడుతుంది. కాని ఈ మూడింటికి మూలకారణం సంకల్పం, సంకల్పం అంటే విషయరూపమే. విషయాలన్నీ సంపూర్ణంగా ఇంద్రియాల ఉపభోగం కొరకే. ఇదే ధర్మార్థకామాలకు మూలం. దీనినుండి మరలడమే "మోక్షం" అనబడుతుంది. ధర్మం వలన శరీరం రక్షింపబడుతుంది. ధర్మాన్ని సంపాదించడానికే అర్థం యొక్క ఆవశ్యకత అని చెప్తారు. కామానికి ఫలం రతి. అవన్నీ రజోగుణమయాలే. ఈ ధర్మాదులు సమీపవర్తులై అంటే వాస్తవికంగా తనకు మేలుచేసేవిగా ఉండాలి. ఆ రూపంలోనే వాటిని సేవించాలి. అంటే వాటిని కళ్యాణకారులుగా చేసుకొని ఉపయోగించుకోవాలి. మనసుతోనైనా వాటిని త్యజించకూడదంటే.... ఇక స్వరూపంతో శరీరం ద్వారా త్యజించడం సుదూరమైన సంగతి. కేవలం తపస్సు చేతనో, విచారణ చేయడం ద్వారానో మాత్రమే వాటినుండి ముక్తుడవ్వాలి. అంటే ఆసక్తిని, ఫలాన్ని విడిచిపెట్టిన తరువాతనే ఈ ధర్మార్థకామాలన్నింటినీ సేవించాలి. ఆసక్తిని, ఫలేచ్ఛను విడిచి, త్రివర్గాలను సేవించితే దాని పర్యవసానం శుభంగానే ఉంటుంది. మనుష్యుడు దానిని పొందగలిగితే అది చాలా అదృష్టమే. అర్థసిద్ధికోసం కావాలని ధర్మానుష్ఠానం చేసినప్పటికీ ఆ అర్థం ఒకప్పుడు సిద్ధిస్తుంది. ఒకప్పుడు సిద్ధించదు. అంతే కాకుండా, ఒక్కొక్కప్పుడు ఇతర ఉపాయాలు కూడా అర్థసాధకాలు అవుతాయి. ఒకప్పుడు అర్థసాధకమైన కర్మ కూడా వ్యతిరేక ఫలాన్ని ఇస్తుంది. మనుష్యుడు ఒక్కొక్కసారి ధనం పొంది కూడా, అనర్థకారులయిన పనులు చేస్తాడు. ధనం వలన ఏర్పడే ఇతరమైన వివిధ సాధనాలు ధర్మసాధనకు కూడా సహాయకాలు అవుతాయి. కాబట్టి ధర్మంవలన ధనం, ధనం వలన ధర్మం కలుగుతాయి. అజ్ఞానులు, అల్పబుద్ధులు, మోహితులు అయిన మూఢులు ఈ మానసీయ విషయాన్ని నమ్మరు. కాబట్టి వారికి రెండింటి ఫలాలు సులభంకావు. ఫలేచ్ఛ

ధర్మానికి మాలిన్యం. కూడబెట్టడం అర్థానికి మాలిన్యం. ఆమోద ప్రమోదాలు కామానికి మాలిన్యం. కాని ఈ త్రివర్గాలూ తమకు ఉండే దోషాలు లేకువున్నట్లయితే అవి కల్యాణకారకా లవుతాయి. ఈ విషయంలో ప్రాజ్ఞులు ఆంగరిష్ఠకామందకుల సంవాదరూపమైన ప్రాచీన ఇతిహాసాన్ని ఉదాహరిస్తూ ఉంటారు.

ఒకసారి కామందక ఋషి తన ఆశ్రమంలో కూర్చుని ఉండగా మహారాజు ఆంగరిష్ఠుడు అతనికి నమస్కరించి ప్రశ్నించడానికి తగిన సమయం చూసుకొని ఇలా అడిగాడు. 'మహర్షీ ! ఎవరైనా రాజు కామమోహాలకు వశుడై పాపం ఆచరించి, ఆపై పశ్చాత్తాపపడితే ఆ పాపం తొలగించుకోవడానికి అతనికి ప్రాయశ్చిత్తం ఏమిటి ? లోకంలో ప్రసిద్ధుడైన వ్యక్తి అజ్ఞానం వలన అధర్మాన్ని ధర్మంగా భావించి ఆచరించితే రాజు అతనిని అధర్మాన్నుండి ఎలా మరలించగలడు ?'

కామందకుడు చెపుతున్నాడు. 'ధర్మార్థాలను రెండింటిని విడిచి, కేవలం కామాన్నే సేవించేవాడు, ఆ ధర్మార్థాలను విడిచిపెట్టడం వలన బుద్ధినాశాన్ని పొందుతాడు. ప్రజ్ఞా నాశరూపమైన మోహం ధర్మార్థాలను రెండింటినీ నశింపచేస్తుంది. అందువల్ల మనుష్యుడు నాస్తికుడై, దురాచారుడు అవుతాడు. దురాచారులైన అతిదుష్టులను రాజు దండం చేత నియంత్రించలేనపుడు, ఇంట్లో ఉన్నపాముకి భయపడినట్లుగా ప్రజలు ఆ రాజుకు భయపడతారు. ఆ స్థితిలో రాజుకు ప్రజలు మద్దతు ఇవ్వరు. సాధువులు, బ్రాహ్మణులు కూడా తోడుపడరు. దానితో అతని జీవితమే సంశయదశకు చేరుకొంటుంది. చివరికి ప్రజల చేతులలోనే అతనికి చావు మూడుతుంది. అతడు తనపదవిని కోల్పోయి, అవమానంతో దుఃఖ పూరితమైన జీవితాన్ని గడుపుతాడు. పదభ్రష్టుడు అయ్యాక కూడా జీవించి ఉంటే, అతడు నిజానికి మరణించినట్లే. ఈ దశలో ఆచార్యగణం అతనికి కర్తవ్యాన్ని ఇలా చెప్పింది. "చేసిన పాపాలను నిందించుకొంటూ, వేదాలను నిరంతరం అధ్యయనం చేస్తూ, బ్రాహ్మణులను సత్కరిస్తూ ఉండాలి". మనసును ధర్మాచరణంలో లగ్నం చేయాలి. ఉత్తమకులంలో వివాహ మాడాలి. ఉదారులు క్షమాశీలులు అయిన బ్రాహ్మణులను సేవించాలి. నీటిలో నిలబడి గాయత్రీ మంత్రం జపించాలి. ఎల్లప్పుడూ ప్రసన్నంగా ఉండాలి. పాపాత్ములను రాజ్యం నుండి వెళ్లగొట్టి, ధర్మాత్ములతో సాంగత్యం చేయాలి. మధురమైన మాటలతో, ఉత్తమమైన పనులతో అందరినీ ప్రసన్నులను చేయాలి. ఇతరులలోని గుణాలను కీర్తించాలి. ఎప్పుడూ అందరితో "నేను మీవాడను - నన్ను మీవాడని అనుకోండి". అని చెపుతూ ఉండాలి. ఈ విధంగా ఆచరించే రాజు శీఘ్రంగానే నిష్పాపుడై,

అందరి మన్ననలు పొందుతాడు. అతడు తాను చేసిన అతికఠినమైన పాపాలను కూడా నశింపచేసుకోగలడు. ఇందులో ఏ మాత్రం సంశయం లేదు. **గురుజనులు నీకు ఏది ఉత్తమ ధర్మమని ఉపదేశించారో, దానిని ఆ రకంగానే పాటించు. గురుజనుల కృపవలన నీవు పరమ శుభాలను అనుభవించగలవు.'**

124. శీల వర్ణనము.

యుధిష్ఠిరుడు ప్రశ్నించాడు. 'నరోత్తమా ! భూమండలంలోని ప్రజలందరూ అన్నిటికంటె ముందుగా ధర్మానికి అనురూపమైన శీలాన్నే అధికంగా ప్రశంసిస్తూ ఉంటారు. కాబట్టి ఈ విషయంలో నాకు గొప్ప సందేహం ఉంది. ధర్మాత్ములలో శ్రేష్ఠుడా ! శీలం ఏవిధంగా లభిస్తుందో తెలుసుకోవాలని ఉంది. అదంతా వినాలనుకొంటున్నాను. శీలం ఎలా కలుగుతుంది ? ఇది వినాలని నాకు చాలా కోరికగా ఉంది. వక్తలలో శ్రేష్ఠుడవైన పితామహా ! దాని లక్షణం ఏమిటి ? అది నాకు చెప్పు.' భీష్ముడు చెపుతున్నాడు. 'మహారాజా ! భారతా ! పూర్వం ఇంద్రప్రస్థంలో తమ్ములతో కలిసి ఉన్న నీయొక్క ఆ అద్భుత సంపదను, ఆ పరమోత్తమమైన సభను, సమృద్ధిని చూసి సంతాపం పొందిన దుర్యోధనుడు కౌరవసభలో కూర్చుండి, ధృతరాష్ట్రునికి తన గాఢమైన చింతను ప్రకటిస్తూ, మనోవ్యథను అంతటినీ చెప్పుకొన్నాడు. అతడు సభలో ఆ నాడు అన్నమాటలు అన్నీ చెపుతాను విను. ఆ సమయంలో ధృతరాష్ట్రుడు దుర్యోధనుని మాటలు విని, కర్ణుడు వింటూండగా దుర్యోధనునితో ఇలా అన్నాడు. 'నాయనా ! ఎందుకు బాధపడుతున్నావు ? అసలు సంగతి తెలుసుకోవాలనుకొంటున్నాను. విన్నాక అది సమంజసం అనిపిస్తే నీకు నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తాను. శత్రుపురాలను జయించే వాడా ! నీకు కూడా మహదైశ్వర్యం ఉందికదా ! నీ సోదరులు అందరూ, మిత్రులూ, బంధువులూ ఎప్పుడూ నీ సేవలోనే ఉంటున్నారు కదా ! విలువైన వస్త్రాలు ధరిస్తున్నావు. మంచి మాంసాహారం తింటున్నావు. ఆజానేయాలైన గుఱ్ఱాలు నీ రథాన్ని లాగుతున్నాయి. ఎందుకు ఇలా పాలిపోయి కృశించి పోతున్నావు ?'

దుర్యోధనుడు చెప్పాడు. 'తండ్రీ ! యుధిష్ఠిరుని గృహంలో స్నాతకులై మహాత్ములైన బ్రాహ్మణులు పదివేలమంది ప్రతిదినం బంగారు పళ్లెరాలలో భుజిస్తున్నారు. భారతా ! దివ్య పుష్పఫలాలతో శోభిల్లుతున్న ఆ సభను, తిత్తిరిపక్షులవలె చిత్రవర్ణాలతో కూడిన గుఱ్ఱాలను, రకరకాల వస్త్రాలను చూసి, శత్రువులైన పాండవేయుల యొక్క కుబేర

సంపదను చూసి నేను నిరంతరం శోకిస్తున్నాను.' ధృతరాష్ట్రుడు అన్నాడు. 'నాయనా ! పురుషవ్యాఘ్రా ! యుధిష్ఠిరుని వద్ద ఉన్నటువంటి లేదా అంతకంటె ఎక్కువదైన సంపదను పొందాలనుకొంటే శీలవంతుడవు కమ్ము. శీలంతోనే ముల్లోకాలను జయించడం సాధ్యం అవుతుంది. అందుకు సందేహం లేదు. లోకంలో శీలవంతునకు అసాధ్యమైన దేదీ లేదు. మాంధాత ఒక్కరోజులోను, జనమేజయుడు మూడు రోజులలోనూ, నాభాగుడు ఏడు రోజులలోను రాజ్యాన్ని పొందారు. ఈ రాజులందరూ శీలవంతులు, దయాన్వితులు. కాబట్టి వారి గుణాలకు వశమైపోయి ఈ భూమి స్వయంగా వారివద్దకు వచ్చింది.' దుర్యోధనుడు అడిగాడు. 'భారతా ! ఏ శీలం చేత వారికి శీఘ్రంగా ఈ వసుంధర ప్రాప్తించిందో, ఆ శీలం ఎలా లభిస్తుందో, వినాలని ఉంది.'

ధృతరాష్ట్రుడు చెప్పాడు. 'భారతా ! శీలానికి సంబంధించి పూర్వం నారదుడు చెప్పిన ప్రాచీన ఇతిహాసాన్ని ఈ విషయంలో పెద్దలు చెపుతూ ఉంటారు. శీలాన్ని ఆశ్రయించుకొన్న దైత్యరాజు ప్రహ్లాదుడు మహాత్ముడైన మహేంద్రుని యొక్క రాజ్యాన్ని హస్తగతం చేసుకొన్నాడు. అంతేకాదు. ముల్లోకాలనూ వశపరచుకొన్నాడు. అంతట మహాప్రాజ్ఞుడైన ఇంద్రుడు చేతులు జోడించి బృహస్పతిని సమీపించి "నాకు శ్రేయస్కరమైనది తెలుసుకోవా లనుకొంటున్నాను" అన్నాడు. కురుశ్రేష్ఠా ! అప్పుడు భగవానుడైన బృహస్పతి ఇంద్రునికి నిఃశ్రేయసకరమైన పరమజ్ఞానాన్ని ఉపదేశించాడు. "ఇదే శ్రేయస్సు" అని మాత్రమే బృహస్పతి చెప్పాడు. ఇంద్రుడు "దీనికంటె విశేషం ఏమి ఉంది ?" అని మళ్లీ అడిగాడు. బృహస్పతి చెప్పాడు. 'నాయనా ! సురోత్తమా ! ఇంతకంటె కూడా గొప్ప విశేషమైన జ్ఞానం మహాత్ముడైన శుక్రాచార్యునికి ఉంది. నీవు అక్కడికే వెళ్లు. నీకు శుభమగుగాక ! అతని వద్దకు వెళ్ళి, మళ్లీ ఆ జ్ఞానాన్ని పొందు. పరమ తేజశ్శాలి, మహాతపస్వి అయిన ఇంద్రుడు తనకు శ్రేయస్సు కలిగించే జ్ఞానాన్ని ప్రీతితో భార్గవుని నుండి తిరిగి పొందాడు. మహాత్ముడైన భార్గవుడు అతనికి ఉపదేశించి అనుమతినీయగా, శతక్రతువు "ఇంతకంటె విశేషమైన శ్రేయస్సు ఉందా" అని మళ్లీ శుక్రాచార్యుని అడిగాడు. సర్వజ్ఞుడైన భార్గవుడు మహాత్ముడైన ప్రహ్లాదునికి 'విశేషమైన జ్ఞానం ఉంది' అని చెప్పాడు. అది విని అతడు సంతోషించాడు. అనంతరం మేధావి అయిన పాకశాసనుడు బ్రాహ్మణునిలా మారి, ప్రహ్లాదుని వద్దకు వెళ్లి "శ్రేయస్సు ఏమిటో తెలుసుకోవాలనుకొంటున్నాను" అని అడిగాడు. ప్రహ్లాదుడు ఆ విప్రునితో "ద్విజోత్తమా ! త్రైలోక్య రాజ్యాన్ని ఏలుతుండడం వలన సమయం లేదు. కనుక నీకు ఉపదేశించలేను." అన్నాడు. బ్రాహ్మణుడు "రాజా !

ఎప్పుడు సమయం ఉంటుందో అప్పుడే నేను సర్వోత్తమమైన, ఆచరణీయమైన ధర్మాన్ని ఉపదేశంగా పొందా లనుకొంటున్నాను" అన్నాడు. అంతట రాజయిన ప్రహ్లాదుడు ప్రీతుడై ఆ బ్రాహ్మణునికి 'సరే' అని చెప్పి, ఒక శుభ కాలంలో జ్ఞానతత్త్వాన్ని అనుగ్రహించాడు. బ్రాహ్మణుడు కూడా అతనిపట్ల యథాయోగ్యంగా పరమోత్కృష్టమైన గురుభక్తిని ఆచరించాడు. అతని మనసుకు నచ్చేలా అన్నిరకాలుగా అతనిని సేవించాడు. బ్రాహ్మణుడు అనేక పర్యాయాలు "ధర్మజ్ఞుడా ! అత్యుత్తమమైన త్రైలోక్యరాజ్యం ఎలా లభించింది. అది నాకు చెప్పు." అని అడిగాడు. మహారాజా ! అప్పుడు ప్రహ్లాదుడు బ్రాహ్మణునికి ఇలా చెప్పాడు.

'విప్రుడా ! నేను రాజును' అనే గర్వంతో ఎప్పుడూ బ్రాహ్మణులను తూలనాడను. వారు నాకు శుక్రనీతిని ఉపదేశిస్తున్నపుడు నేను సంయమనంతో వారి మాటలు వింటాను. వారి ఆజ్ఞలను శిరసావహిస్తాను. ఆ బ్రాహ్మణులు విశ్వసించి నాకు నీతిని ఉపదేశిస్తూ ఎప్పుడూ నన్ను సంయమనంతో ఉంచేవారు. నేను ఎప్పుడూ యథాశక్తి శుక్రాచార్యుడు చెప్పిన నీతిమార్గాన్ని అనుసరించి నడుచుకొంటూ, బ్రాహ్మణులను సేవిస్తూ, ఎవరిలోనూ దోషాలు ఎంచక, ధర్మంలోనే మనసును లగ్నం చేశాను. క్రోధాన్ని జయించి, ఇంద్రియాలను అదుపులో ఉంచుకొన్నాను. అందువలన తేనెటీగలు తేనెపట్టును మకరందంతో తడిపినట్లుగా, ఉపదేశించిన బ్రాహ్మణులందరూ శాస్త్రంలోని అమృత వాక్కులతో నన్ను తడిపివేశారు. నేను వారి నీతివిద్యల రసాన్ని ఆస్వాదించాను. చంద్రుడు నక్షత్రాల మీద ఆధిపత్యం పొందినట్లుగా నేను నా జాతి వారిని శాసించ గలిగాను. బ్రాహ్మణుల నోళ్లల్లో ఉండే శుక్రాచార్యుని నీతివాక్యాలు ఈ భూమికి అమృతమే. అది సర్వోత్తమమైన నేత్రం. రాజు దానిని విని దానినే అనుసరించి నడుచుకోవాలి. 'ఇది శ్రేయస్సు' అని ప్రహ్లాదుడు బ్రహ్మవాది అయిన బ్రాహ్మణునికి చెప్పాడు. ఆ తరువాత కూడా అతనికి శుశ్రూష చేయడం వలన దైత్యరాజు ప్రహ్లాదుడు అతనికి ఇలా చెప్పాడు. 'ద్విజోత్తమా ! నీవు చేసిన యథోచితమైన ఈ గురుసేవకు నేను సంతుష్టుడ నయ్యాను. నీకు శుభమగుగాక. వరం కోరుకో. ఇస్తాను. ఇందులో సందేహం లేదు.' అప్పుడు ఆ బ్రాహ్మణుడు దైత్యరాజుతో "మీరు నాకోరికను సంపూర్ణంగా నెరవేర్చారు" అన్నాడు. ఇది విని ప్రహ్లాదుడు మరింతగా సంతోషించి "ఏదైనా వరం కోరుకో" అన్నాడు.

బ్రాహ్మణుడు అన్నాడు. 'రాజా ! నీవు నిజంగా ప్రసన్నుడవు అయితే, నాకు ప్రీతిని కలుగ చేయదలచుకొంటే, నీ శీలాన్ని పొందాలని నేను కోరుకొంటున్నాను. ఇదే నాకు కావలసిన వరం అన్నాడు.' అది విని దైత్యేంద్రుడు సంతోషించాడు. కాని అతనికి

మనసులో గొప్ప భయం కలిగింది. బ్రాహ్మణుడు వరం అడిగాక, "ఇతడు ఎవరో సాధారణ తేజస్సు కలవాడు కాడు" అని ఆలోచించసాగాడు. అప్పుడు ప్రహ్లాదుడు విస్మయంతో "అలాగే అగుగాక" అని అన్నాడు. ఆ విప్రునికి వరం ఇచ్చి, అతడు దుఃఖితు డయ్యాడు. మహారాజా ! వరం ఇచ్చిన తరువాత విప్రుడు వెళ్లిపోయాడు. అప్పుడు ప్రహ్లాదునికి ఎంతో చింతకలిగింది. "ఏం చేయాలి ?" అనుకొన్నాడు గాని, ఒక నిశ్చయానికి రాలేకపోయాడు. అతడు అలా చింతిస్తూ ఉండగానే, ఒక గొప్ప కాంతి తేజస్సు మూర్తీభవించినట్లుగా నీడరూపంలో అప్పుడు అతని శరీరాన్ని వదలి బయటకు వచ్చింది. ప్రహ్లాదుడు ఆ గొప్పఆకారాన్ని చూసి 'ఎవరు నీవు' అని దానిని అడిగాడు. "తిరస్కరింపబడిన శీలాన్ని నేను. నీవు నన్ను విడిచివేశావు. నేను వెళ్లిపోతున్నాను." అన్న దది. 'రాజా ! నీ వద్ద శిష్యునిగా చేరి, నీ దగ్గరే సర్వదా సావధాన చిత్తుడై ఉన్న ఆ అనిందితుడైన ద్విజోత్తమునియందు నివసిస్తాను.' ప్రభూ ! ఇలా చెప్పి శీలం అదృశ్యమై ఇంద్రుని శరీరంలో ప్రవేశించింది. ఆ తేజస్సు వెళ్లిపోయాక అటువంటి రూపమే మరొకటి అతని శరీరాన్నుండి బయటికి వచ్చింది. "నీ వెవరవు" అని అడిగాడు ప్రహ్లాదుడు. "ప్రహ్లాదా ! దైత్యేంద్రా ! నన్ను ధర్మునిగా తెలుసుకో ఆ ద్విజోత్తముని వద్దకు వెళ్తున్నాను. శీలం ఎక్కడుంటుందో నేనూ అక్కడే ఉంటాను." అని సమాధానం చెప్పింది. మహారాజా ! అనంతరం ప్రకాశిస్తున్న మరొక తేజస్సు మహాత్ముడైన ఆ ప్రహ్లాదుని శరీరాన్నుండి వెలువడింది. "నీ వెవరవు" అని అడిగితే ఆ మహాతేజస్సు అతనికి "అసురేంద్రా ! సత్యం అని నన్ను తెలుసుకో, ఇప్పుడు నేను ధర్మాన్ని వెన్నంటి వెళ్తున్నాను." అని చెప్పింది. సత్యం వెళ్లిన తరువాత మరొక మహాపురుషుడు అతని నుండి వెలువడ్డాడు. ఆ మహాబలుని ప్రశ్నించగా, అతడు "ప్రహ్లాదా ! నన్ను సదాచారం అని తెలుసుకో. సత్యం ఎక్కడుంటే నేను అక్కడ ఉంటాను." అని చెప్పాడు. అతడు వెళ్లిపోగానే అతని శరీరం నుండి మహాశబ్దం చేస్తూ ఒక పురుషుడు వెలుపలికి వచ్చాడు. అతనిని అడిగిన మీదట "నన్ను బలం అని తెలుసుకో. ఎక్కడ సదాచారం ఉంటుందో అక్కడ నేను ఉంటాను." అని చెప్పాడు. రాజా ! ఇలా చెప్పి సదాచారం వెనుకనే బలం బయలు దేరింది. తరువాత కాంతిమతి అయిన ఒక దేవి అతని శరీరంనుండి వెలుపలికి వచ్చింది. దైత్యేంద్రుడు ఆమెను అడిగాడు. "నీ వెవరవు" అని. తాను "సంపదను" అని ఆమె చెప్పింది. 'సత్యపరాక్రముడా ! నేను స్వయంగా నీయందు నివసిస్తున్నాను. కాని నీవు నన్ను వదలివేస్తావు. కాబట్టి వెళ్లిపోతున్నాను. నేను బలాన్ని అనుసరించి ఉంటాను' అప్పుడు మహాత్ముడైన ప్రహ్లాదునికి భయం కలిగింది. అతడు మళ్లీ "కమలాలయా !

నీవు ఎక్కడికి వెళ్తున్నావు నీవు సత్యవ్రతురాలివి. దేవివి. లోకానికి పరమేశ్వరివి. ఆ బ్రాహ్మణశ్రేష్ఠుడు ఎవరు ? నిజం తెలుసుకోవాలని ఉంది". అని అడిగాడు.

లక్ష్మీదేవి చెప్పింది. 'నీవు విద్యలు ఉపదేశించిన ఆ బ్రహ్మచారి ఇంద్రుడు. ప్రభూ ! ముల్లోకాలలోనూ నీకు ఉన్న ఐశ్వర్యాన్ని అతడు అపహరించాడు. ధర్మజ్ఞుడా ! శీలం చేతనే నీవు ముల్లోకాలనూ గెలువగలిగావు. ప్రభూ ! అది తెలుసుకొన్న ఇంద్రుడు నీ శీలాన్ని హరించాడు. మహాప్రాజ్ఞుడా ! ధర్మం, సత్యం, సదాచారం, బలం, అలాగే నేను కూడా ఎల్లప్పుడూ శీలమే మూలంగా కలిగినవారం. ఇందులో సందేహం లేదు.' భీష్ముడు చెపుతున్నాడు. 'ఇలా చెప్పి సంపద, శీలం మొదలైన సద్గుణాలు అన్నీ ఇంద్రుని వద్దకు వెళ్లిపోయాయి. యుధిష్ఠిరా ! దుర్యోధనుడు తిరిగి తండ్రిని "కౌరవనందనా ! శీలం యొక్క తత్త్వాన్ని తెలుసుకోవాలని ఉంది. శీలాన్ని పొందే ఉపాయం కూడా నాకు చెప్పు." అని అడిగాడు. ధృతరాష్ట్రుడు చెప్పాడు. 'నరేశ్వరా ! మహాత్ముడైన ప్రహ్లాదుడు పూర్వమే శీలస్వరూపాన్ని, దాన్ని పొందే ఉపాయాన్నీ కూడా చెప్పాడు. శీలాన్ని పొందే ఉపాయాన్ని సంక్షేపంగా చెప్తాను. శ్రద్ధగా విను. **కర్మచేతగాని, మనసుచేతగాని, వాక్కు చేతగాని ఏ ప్రాణికీ ద్రోహం చేయకపోవడం, అందరి పట్ల దయ కలిగి ఉండడం, దానం చేయడం శీలం అవుతుంది. దీనిని అందరూ కొనియాడుతూ ఉంటారు.*** తాను పురుషకారంతో చేసే పని ఇతరులకు మేలు చేయనపుడు, సిగ్గుపడేపని ఏరకంగానూ చేయకూడదు. కురుసత్తమా ! పది మంది కూడిన సభలో మెప్పుపొందే పని అలాగే చేయాలి. శీలం గురించి నేను సంక్షేపంగా దీనిని చెప్పాను. **నరేశ్వరా ! తండ్రీ ! ఎప్పుడైనా శీలరహితుడు సంపదను పొందినా, చిరకాలం అతడు దానిని అనుభవించలేడు. సమూలంగా అది నశించి పోతుంది.**** కుమారా ! మిక్కిలి విశిష్టమైన సంపదను యుధిష్ఠిరుని నుండి నీవు పొందాలనుకొంటే, దీని యథార్థతత్త్వాన్ని గ్రహించి శీలవంతుడవు అగుము.' భీష్ముడు చెపుతున్నాడు. నరేశ్వరుడైన ధృతరాష్ట్రుడు తన పుత్రునికి ఇదంతా చెప్పాడు. కొంతేయా ! దీనిని ఆచరించు. పిమ్మట ఆ ఫలితాన్ని పొందగలవు.'

---

* అద్రోహః సర్వభూతేషు కర్మణా మనసా గిరా।
అనుగ్రహశ్చ దానం చ శీలమేతత్ప్రశస్యతే ॥ 66

** యద్యప్యశీలా వృపతే ప్రాప్నువంతి శ్రియం క్వచిత్।
న భుంజతే చిరం తాత సమూలాశ్చ న సంతి తే ॥ 69

125. ఋషభ గీత - 1.

యుధిష్ఠిరుడు ప్రశ్నించాడు. పితామహా ! మనిషికి శీలం ప్రధానమని నీవు చెప్పావు. ఆశ అనేది ఎలా పుడుతుంది ? ఆశ అంటే ఏమిటి ? అది చెప్పు నాకు. శత్రుపురంజయా ! పితామహా ! నాకు ఈ గొప్ప సందేహం కలిగింది. దీనిని తీర్చేవారు నీకంటె వేరెవరూ లేరు. పితామహా ! నాకు దుర్యోధనుని మీద గొప్ప ఆశ ఉండేది. "యుద్ధం కనుక వస్తే అతడు ఉచిత మైనదే చేస్తా డని యుద్ధం చేయకుండానే అతడు నాకు అర్ధరాజ్యం ఇస్తాడు." అని. ప్రతి మనిషికీ గొప్ప ఆశ పుడుతూనే ఉంటుంది. అది భగ్నమయితే దుఃఖం కలుగుతుంది. ఒక్కొక్కసారి మరణం కూడా సంభవిస్తుంది. ఇందుకు సందేహం లేదు. రాజేంద్రా ! ఆ దురాత్ముడు దుర్యోధనుడు దుర్బుద్ధినైన నన్ను హతాశుని చేశాడు. నా దురదృష్టం చూడు. రాజా ! మహావృక్షాలు ఉన్న పర్వతం కంటె కూడా ఆశ మిక్కిలి గొప్పదని అనుకొంటున్నాను. లేకుంటే ఆకాశం కంటె కూడా అప్రమేయమైనది. కురుశ్రేష్ఠా ! ఇది ఆలోచించడానికి వీలులేనిది. పొందడానికి సాధ్యంకానిది. దుర్లభత్వం వలననే నేను దానిని గొప్పదనుకొంటున్నాను. దీనికంటె దుర్లభమైనది ఇంకొకటి ఏమి ఉంటుంది ?' భీష్ముడు చెపుతున్నాడు. 'యుధిష్ఠిరా ! ఈ విషయంలో సుమిత్రునికి, ఋషభునికి జరిగిన వృత్తాంతాన్ని చెప్తాను. శ్రద్ధగా విను.

హైహయవంశానికి చెందిన సుమిత్రుడనే రాజర్షి ఒకనాడు వేటకు వెళ్లాడు. వంగిన కణుపుకల బాణంతో లేడిని గాయపరిచి, అతడు దానిని వెంబడించాడు. అమితవేగంగా ఆ మృగం బాణంతో సహా పారిపోయింది. రాజు కూడా బలవంతంగా ఆ మృగయూథపతిని వేగంగా అనుసరించాడు. వేగంగా పరుగెత్తే ఆ మృగం పల్లంవైపు పరుగు తీసింది. రాజేంద్రా ! రెండుక్షణాలలోనే అది సమతల భూమికి వెళ్లిపోయింది. రాజు యువకుడు, గుండె బలం కలవాడు. కనుక ధనుర్బాణాలు, కవచం ధరించి, కత్తి చేతపట్టి దానిని వెంబడించాడు. వనచరమైన ఆ మృగం ఒంటరిగా నదీనదాలను, నీటికయ్యలను, వనాలను దాటుకుంటూ ముందు ముందుకు సాగిపోయింది. రాజా ! అతివేగం కల ఆ మృగం తన ఇచ్ఛానుసారంగానే ఆ రాజుకు దగ్గర దగ్గరగా వస్తూ, తిరిగి మహావేగంతో ముందుకు సాగిపోయింది. రాజా ! ఆ మృగం రాజు వేసిన అనేక బాణాలతో గాయపడి కూడా క్రీడిస్తున్నట్లుగా అతనికి మళ్లీ దగ్గరగా వస్తోంది. రాజేంద్రా ! వేగం గల మృగయూథపం తిరిగి వేగాన్ని పుంజుకొని, దూరదూరాలన్నీ గడిచి, మళ్లీ సమీపానికి వచ్చింది. అప్పుడు శత్రుమర్దనుడైన రాజు ఒక భయంకరమైన వాడి బాణాన్ని- మర్మస్థలాన్ని ఛేదించగలిగిన దానిని- చేతిలోకి తీసుకొని వింటికి సంధించాడు. ఆ మృగయూథపం రెండు క్రోసుల

దూరం వెళ్లి బాణమార్గాన్ని తప్పించుకొని, నవ్వుతున్నట్లుగా నిలబడింది. మండుతున్న తేజస్సుతో ఉన్న బాణం భూమి మీద పడగానే ఆ మృగం మహారణ్యంలో దూరిపోయింది. రాజు కూడా దానిని వెంబడించాడు.'

126. ఋషభ గీత - 2.

భీష్ముడు చెపుతున్నాడు. 'ఆ రాజు సుమిత్రుడు మహారణ్యంలో ప్రవేశించి తాపసాశ్రమాన్ని చేరుకొన్నాడు. అలిసిపోయి అక్కడ కూర్చుండి పోయాడు. విల్లుధరించి, అలసిపోయి, ఆకలితో ఆర్తుడై ఉన్న అతనిని సమీపించి, ఋషులు యథావిధిగా అతనిని పూజించారు. ఋషులు ఇచ్చిన ఆతిథ్యాన్ని స్వీకరించి, రాజు ఆ తాపసుల నందరినీ 'తపస్సు బాగా వృద్ధిపొందుతోందా ?' అని అడిగాడు. తపోధనులైన ఋషులందరూ ఆ రాజు మాటలను సాదరంగా స్వీకరించి, ఆ రాజసింహుని అక్కడికి వచ్చిన ప్రయోజనం అడిగారు. "నరేశ్వరా ! భద్రా ! కత్తిని నడుమున కట్టుకొని, వింటిని బాణాలను ధరించి, కాలినడకన ఏ సుఖం ఆశించి తపోవనానికి వచ్చావు ? ఇతరులను మన్నించేవాడా ! ఎక్కడినుండి వచ్చావు ? ఏ వంశంలో పుట్టావు ? నీపేరేమిటి ? ఇదంతా వినాలని కోరికగా ఉంది. మాకు చెప్పు." పురుషసత్తమా ! భారతా ! అంతట ఆ రాజు ఆ ద్విజులందరితో యథోచితంగా మాట్లాడాడు. తన కార్యక్రమం గురించి తెలిపాడు.

'నేను హైహయవంశంలో పుట్టాను. మిత్రులను సంతోష పెట్టేవాడిని. సుమిత్రుడని పేరు. వేల బాణాలతో మృగసమూహాన్ని గాయపరుస్తూ విహరిస్తున్నాను. గొప్పసైన్యం నన్ను రక్షిస్తూండగా, మంత్రులతో, అంతఃపురంతో సహా వచ్చాను. నా బాణం తగిలి ఒక మృగం ఆ బాణంతోనే ఇటు పారి వచ్చింది. పారిపోతున్న ఆ మృగాన్ని వెంబడించి, యథేచ్ఛగా ఈ వనంలో మీ దగ్గరకు వచ్చాను. నా శోభ తరిగి పోయింది. హతాశుడి నయ్యాను. శ్రమచేత నీరసించి ఉన్నాను. రాజ లాంఛనాలన్నీ కోల్పోయి, హతాశుడినై, అలసటతో నీరసించి మీ ఆశ్రమాన్ని చేరుకొన్నాను. ఇంతకంటె వేరే దుఃఖం ఏముంది ? తపోధనులారా ! నా ఆశ భగ్నం కావడం వలన కలిగినంత తీవ్రమైన దుఃఖం, నా రాజ లాంఛనాలన్నీ వదలడం వలన గాని, పట్టణం వదలడం వలనగాని కలగలేదు. **మహాపర్వతం హిమాలయంగాని, అగాధమైన జలరాశి కల సముద్రం గాని తమ వైశాల్యం చేత ఆశతో సమానం కావు. తాపసశ్రేష్ఠులారా ! అంతులేని ఆకాశంలా ఆశకు కూడా అంతం చూడ లేదు నేను. మీ కంతా తెలుసును. తపోధనులు సర్వజ్ఞులు కదా !** మీరందరూ గొప్ప మహానుభావులు. కాబట్టి నా సందేహాన్ని అడుగుతున్నాను.

ఆశావాది అయిన పురుషుడా ? అంతరిక్షమా ? లోకంలో ఈ రెండింటిలో మహత్వం వలన ఏది గొప్పదని మీకు అనిపిస్తోంది ? దీని యొక్క తత్వాన్ని వినాలని ఉంది. ఇక్కడ దుర్లభమైన దేముంటుంది ? ద్విజోత్తములారా ! ఇది మీకు సదా గొప్ప విషయం కాకపోతే వెంటనే వివరించండి. గోప్యమైతే మీవలన వినాలని లేదు. మీ తపస్సుకు విఘ్నం అవుతుందనుకొంటే నేను ఈ విషయాన్ని విరమించుకొంటాను. మీకు సమయం ఉంటే నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పండి. ఆశకు గల కారణాన్ని, సామర్థ్యాన్ని తత్వపరంగా తెలుసుకోవా లను కొంటున్నాను. మీరందరూ నిత్యం తపస్సు చేసేవారు. మీరంతా కలిసి దీనికి సమాధానం చెప్పండి.'

127. ఋషభ గీత - 3.

భీష్ముడు చెపుతున్నాడు. 'అప్పుడు ఆ ఋషులందరిలోనూ ఋషిసత్తముడు అయిన ఋషభుడనే పేరుగల విప్రవరుడు ఆశ్చర్యంగా ఇలా అన్నాడు. "రాజ సింహమా ! ప్రభూ ! పూర్వం నేను తీర్థాటనం చేస్తూ దివ్యమైన నరనారాయణాశ్రమాన్ని చేరుకొన్నాను. రాజా ! అక్కడ అందమైన రేగుచెట్లు ఉన్నాయి. వైహాయసకుండం ఉంది. అశ్వశిరుడు (హయగ్రీవుడు) సనాతనమైన వేదాలను పఠిస్తూ ఉంటాడు. ఆ వైహాయసకుండంలో ముందుగా శాస్త్రోక్తంగా పితరులకు, దేవతలకు తర్పణాలిచ్చి, ఆ తరువాత ఆశ్రమంలో ప్రవేశించాను. అక్కడ నిత్యమూ నరనారాయణ ఋషులు ఇద్దరూ నివసిస్తూ ఉంటారు. దానికి దగ్గరలోనే మరొక ఆశ్రమానికి నివాసం కోసం వెళ్లాను. నారచీర, చర్మం ధరించి, పొడవుగా సన్నగా కృశించి ఉన్న 'తనువు' అనే ఒక తపోధనుడైన ఋషి అక్కడకు రావడం చూశాను. మహాబాహూ ! అతని శరీరం ఇతర మానవుల కంటె ఎనిమిదిరెట్లు పొడవుగా ఉంది. రాజర్షీ ! అటువంటి కృశత్వం కూడా ఎక్కడా చూడలేదు నేను. రాజేంద్రా ! అతని శరీరం చిటికెన వ్రేలంత సన్నగా ఉంది. మెడ, చేతులు, పాదాలు, వెండ్రుకలు- అన్నీ అబ్బురంగా కనిపించాయి. రాజోత్తమా ! తల, చెవులు, కన్నులు- అన్నీ శరీరానికి తగినట్లుగానే ఉన్నాయి. అతని మాట, చేష్ట సామాన్యంగానే ఉన్నాయి. కృశించిన ఆ విప్రుని చూసి నేను భయపడి, మనసులోనే మిక్కిలి బాధపడ్డాను. అతని పాదాలకు నమస్కరించి, చేతులు జోడించి ఎదుటనిలబడ్డాను. నా నామ గోత్రాలు, తల్లి దండ్రుల గురించి నివేదించాను. నరోత్తమా ! అతడు ఆసనం చూపగానే మెల్లగా దానిపై కూర్చున్నాను. ధర్మపరాయణులలో శ్రేష్ఠుడైన మహారాజా ! తనువు ఋషుల మధ్య కూర్చుండి ధర్మార్థాలతో కూడిన కథను చెప్పసాగాడు.

అతడు చెప్తూ ఉండగానే, కమలాల వంటి కన్నులు గల ఒకరాజు వేగవంతమైన గుఱ్ఱాలెక్కి, ససైన్యంగా, అంతఃపురంతో సహా అక్కడకు వచ్చాడు. అతడు భూరిద్యుమ్నుని తండ్రి. మహాకీర్తిశాలి, శ్రీమంతుడు అయిన వీరద్యుమ్నుడు. అరణ్యంలో పుత్రుని కోల్పోయి మనసులోనే పరమదుఃఖితుడై ఉన్నాడు. "ఆ కొడుకును ఇక్కడ చూశాను ఇక్కడ చూశాను" అంటూ ఆ రాజు ఆశాహతుడై ఇంతకు ముందు ఈ వనంలో తిరగసాగాడు. "పరమధార్మికుడు, ఒక్కడే కొడుకు. మహారణ్యంలో పోయాడు. అతనిని చూడడం ఇక నాకు దుర్లభం." అని అతడు పదే పదే అనసాగాడు. అతనిని చూడడం నాకు శక్యంకాదు. అయినా నాకు చాలా ఆశగా ఉంది. ఆ ఆశ నన్ను సంపూర్ణంగా శరీరమంతా ఆవహించి ఉంది. అందుకోసం చావడానికి కూడా సిద్ధంగా ఉన్నాను. ఇందులో సందేహం లేదు. మునివరులలో ఉత్తముడయిన తనుమహర్షి ఇది విని, తలవంచి, ధ్యానమగ్నుడై రెండు గడియలసేపు ఉండిపోయాడు. అతడు ధ్యానించడం చూసి, దుఃఖితుడైన రాజు దీనంగా మెల్లమెల్లగా చాలాసార్లు ఇలా అన్నాడు. దేవర్షీ ! దుర్లభమైన దేది ? ఆశకంటె గొప్పది ఏది ? భగవాన్ ! నావద్ద ఇది మీకు దాచకూడనిది అయితే చెప్పండి.' ముని చెప్పాడు. 'నీ కొడుకు పూర్వం బుద్ధితక్కువ వాడై తన దురదృష్టం కొద్దీ ఒక పూజ్యుడైన మహర్షిని అవమానించాడు. రాజా ! అతడు బంగారు కలశాన్ని, వల్కలాలను అడిగాడు. నీ కొడుకు అవమానించి కూడా వాటిని ఇవ్వలేదు. దానితో ఆ విప్రర్షి మిక్కిలి ఖిన్నుడై నిరాశచెందాడు. నరశ్రేష్ఠా ! ఇలా చెప్పిన తరువాత ఆ ధర్మాత్ముడు లోక పూజ్యుడైన ఆ ఋషికి నమస్కరించి, అలసటతో కూలబడిపోయాడు. తపోవనాలలో ఆచరించే శిష్టాచార విధిని అనుసరించి మహర్షి అర్ఘ్యపాద్యాలు తెచ్చి, రాజుకు సమర్పించాడు. పురుషవ్యాఘ్రా ! అప్పుడు మునులందరూ నరశ్రేష్ఠుడయిన ఆ వీరద్యుమ్నుని సప్తర్షులు ధ్రువనక్షత్రాన్ని వలె నలువైపులా చుట్టి కూర్చున్నారు. అపజయమెరుగని రాజును అప్పుడు వారు ఈ ఆశ్రమానికి రావడానికి గల ప్రయోజనాన్ని అంతటినీ ప్రశ్నించారు.'

128. ఋషభ గీత - 4.

రాజు చెపుతున్నాడు. 'దిక్కులయందు ప్రసిద్ధి కెక్కిన వీరద్యుమ్నుడనే పేరుగల రాజును నేను. పోగొట్టుకొన్న నా కొడుకు భూరిద్యుమ్నుని కోసం అన్వేషిస్తూ అడవికి వచ్చాను. విప్రోత్తమా ! అనఘా ! నాకు అతడు ఒక్కడే కొడుకు. చిన్నపిల్లవాడు. అడవిలో కనపడలేదు. అన్వేషిస్తూ తిరుగుతున్నాను నేను.' ఋషభుడు చెప్పాడు. 'రాజు ఇలా

చెప్పగానే ముని అధోముఖుడై ఊరికే ఉండిపోయాడు. రాజుకు ఏమీ బదులు చెప్పలేదు. పూర్వమెప్పుడో ఆ రాజే ఆ ఋషిని మిక్కిలిగా గౌరవించలేదు. రాజేంద్రా ! ఆశాభంగమైన అతడు "ఏ రకంగానూ రాజులనుండి ఏదీ ప్రతి గ్రహించను. ఇతర వర్ణాలనుండి కూడా ఏదీ తీసుకోను". అని నిశ్చయించుకొని అప్పుడు దీర్ఘకాలికమైన తపస్సులో లగ్నమయ్యాడు. 'చిరకాలం నిలిచే ఆశయే మూర్ఖుడైన పురుషుని నడిపిస్తుంది. దానిని నేను తొలగించుకొంటాను. అని నిశ్చయించుకొన్నాను.' వీరద్యుమ్నుడు మునిసత్తముని తిరిగి ఇలా ప్రశ్నించాడు. 'ఆశకంటె దుర్బలమైన దేది ? ఈ భూమి మీద దుర్లభమైన దేది ? భగవాన్ ! తమరు ధర్మార్థాలను దర్శించినవారు కదా ! ఈ తత్త్వాన్ని తెలియచేయండి. అంతట ఆ విషయమంతా గుర్తుకు తెచ్చుకొని అతనికి గుర్తు చేస్తున్నవాడిలా భగవానుడై కృశించిన శరీరం కల ఆ విప్రోత్తముడు రాజుతో ఇలా అన్నాడు. ఋషి అన్నాడు. 'రాజా ! ఆశను మించిన బలహీనత మరొకటి లేదు. ఆ దుర్లభత్వం చేతనే నేను రాజులను యాచించాను.' రాజు అన్నాడు. 'బ్రహ్మన్ ! నీ మాటలవలన ఆశవలన దుర్బలత్వం (కృశత్వం) కలుగుతుంది, ఆశను జయించడం వలన పుష్టి (అకృశత్వం) కలుగుతుందని గ్రహించాను. ద్విజోత్తమా ! ఆశించినవస్తువు దుర్లభ మని కూడా తెలుసుకొన్నాను. మహాప్రాజ్ఞా ! నాకు మనసులో ఒక గొప్ప సందేహం కలిగింది. మునీ ! అడుగుతున్న నాకు నిజాన్ని చెప్పవలసింది. భగవాన్ ! మునిసత్తమా ! దాచుకోవలసినది ఏదీ లేకపోతే చెప్పండి. మీ కంటె మించిన బలహీనమైనదే ముంది ?'

కృశుడైన ముని చెప్పాడు. అవసరపడి కూడా ధైర్యం చిక్కపట్టుకొని యాచించనివాడు దుర్లభుడు నాయనా ! యాచకుని అవమానించనివాడు దుర్లభతరుడు. యాచకుని సత్కరించి కూడా యథోచితంగా తన శక్తిని అనుసరించి ఉపకారం చేయకపోతే అప్పుడు సమస్త ప్రాణుల యందు ఉండే ఆశ నా కంటె దుర్బలతరంగా ఉంటుంది. కృతఘ్నులు, క్రూరులు, సోమరులు, ఇతరులకు అపకారం చేసేవారు. వీరిలో ఉండే ఆశ (ఎన్నటికీ తీరదు కాబట్టి చింతతో దుర్బలం అవుతుంది.) నాకంటె కూడా దుర్బలంగా ఉంటుంది. **ఒక్కడే కొడుకున్న తండ్రికి, తన కొడుకు పోయినపుడు లేదా దేశాంతరగతుడైనపుడు అతని సమాచారం తెలియక పోవడం వలన మనసులో కలిగే ఆశ నాకంటె కూడా అతి దుర్బలమైనది. నరేంద్రా ! వృద్ధివనితలకు పుత్రుని కనాలనే ఆశ, ధనికులకు మరింత ధనం సంపాదించాలనే ఆశ నాకంటె కూడా అతిదుర్బల మైనది.** వయసువచ్చిన కన్యలు వివాహ సంబంధమైన మాటలువింటూ వివాహం పట్ల పెంచుకునే ఆశ నాకంటె దుర్బలతరం అయినది.' రాజా ! ఆ విప్రవరుని

మాటలు విని, ఆ రాజు తన అంతఃపురకాంతతో సహా అతని పాదాలను శిరసుతో తాకి, సాగిలపడ్డాడు. రాజు అన్నాడు. 'దేవా ! అనుగ్రహించండి. నా కొడుకును కలుసుకోవాలని కోరికగా ఉంది. ద్విజోత్తమా ! ఇప్పుడు మీరు నాతో చెప్పినదంతా సత్యమే. అంతట ధర్మపరాయణులలో శ్రేష్ఠుడు, భగవానుడు అయిన తనుమహర్షి నవ్వి, తన తపస్సు చేత, శాస్త్రజ్ఞాన ప్రభావం చేత అతని కొడుకును వెంటనే అక్కడికి రప్పించాడు. అతని కొడుకును అక్కడికి రప్పించి రాజును దెప్పి పొడిచి, ధర్మ పరాయణులలో శ్రేష్ఠుడయిన ఆ ముని తన ధర్మ స్వరూపాన్ని అతనికి చూపించాడు. రాజుకు తన దివ్యమైన, అద్భుతమైన రూపాన్ని చూపించి, తనుమహర్షి పాపరహితుడై, క్రోధం విడిచి, సమీపంలో ఉన్న అడవికి వెళ్లిపోయాడు. రాజా ! ఇదంతా నేను చూశాను. ఆ ముని చెప్పిన మాటలన్నీ విన్నాను. కనుక శరీరాన్ని మిక్కిలిగా కృశింపచేసే ఈ మృగాన్ని గూర్చిన ఆశను వెంటనే తొలగించుకో.' భీష్ముడు చెపుతున్నాడు. 'రాజా ! ఋషభమహాత్ముడు అలా చెప్పగానే సుమిత్రుడు మిక్కిలి కృశింపచేసే ఆశను వెంటనే వదిలి వేశాడు. కౌంతేయా ! మహారాజా ! అలాగే నీవు కూడా నా ఈ మాటలు విని, ఆశను వదిలి హిమవత్పర్వతంలా స్థిరంగా ఉండు. మహారాజా ! కష్టాలు వెన్నంటి వచ్చినప్పటికి ఇక్కడ తగినరీతిగా ప్రశ్నలు వేస్తూ, వానికి తగిన సమాధానాలు పొందుతున్నావు. కాబట్టి దుర్యోధనునితో సంధి కానందుకు నీవు బాధపడనక్కరలేదు.'

129. యమగౌతమసంవాదము.

యుధిష్ఠిరుడు అన్నాడు. 'భారతా ! అమృతం త్రాగేవాడికి తృప్తి కలుగనట్లుగా నీ ఉపదేశవాక్యాల వలన నాకు తనివి తీరడం లేదు. ధ్యానమగ్నుడైన వానివలె తృప్తి పొందుతున్నాను. కాబట్టి పితామహా ! మళ్లీ మళ్లీ నీవు ధర్మాలను గురించే చెప్పు. ఈ నీ ధర్మామృతాన్ని త్రాగుతున్న నాకు తృప్తి కలగడంలేదు.' భీష్ముడు చెపుతున్నాడు. 'ఈ ధర్మ విషయకంగా మహాత్ముడైన యమునికి, గౌతమునికి జరిగిన సంవాదాన్ని ప్రాచీన ఇతిహాసంగా పెద్దలు చెపుతూ ఉంటారు. పారియాత్రమనే గిరిపై గౌతముని యొక్క మహాశ్రమం ఉంది. అక్కడ గౌతముడు ఎంత కాలం నివసించాడో అది కూడా చెపుతాను విను. గౌతముడు అరవైవేల సంవత్సరాలు ఆ ఆశ్రమంలో తపస్సు చేశాడు. పురుషసింహమా ! అలా ఉగ్రతపస్సు చేస్తున్న పవిత్రుడైన ఆ మహాముని దగ్గరకు అప్పుడు లోకపాలకుడైన యముడు వచ్చాడు. అతడు గొప్ప తపస్సు చేస్తున్న గౌతముని చూశాడు. బ్రహ్మర్షి గౌతముడు తేజస్సును బట్టి ఆ వచ్చినవాడు యముడని తెలుసుకొని,

తపోధనుడైన అతడు చేతులు జోడించి, నిగ్రహంతో అతని సమీపంలో ఆసీనుడయ్యాడు. ధర్మరాజు ఆ ద్విజశ్రేష్ఠుని చూడగానే సత్కరించి "మీకు నేను ఏమి చేయగలను ?" అని అడుగుతూ ధర్మగోష్ఠికి ఆహ్వానాన్ని అంగీకరించాడు.' గౌతముడు అన్నాడు. 'మాతాపితరుల ఋణాన్ని ఏమి చేసి తీర్చుకోగలం ? మానవుడు దుర్లభమైన పవిత్రలోకాలను ఎలా పొందగలడు ?' యముడు చెప్పాడు. **'నిత్యమూ తపస్సు చేయాలి. శౌచం పాటించాలి. సత్యధర్మాలయందు ప్రీతి కలిగి ఉండాలి. తల్లిదండ్రులను అహరహం పూజించాలి.** తగిన దక్షిణలిచ్చి అనేక అశ్వమేధయాగాలు చేయాలి. దాని వలన మానవుడు అద్భుతంగా కనిపించే లోకాలను పొందుతాడు.'

130. ఆపదలందు రాజు యొక్క ధర్మము.

యుధిష్ఠిరుడు ప్రశ్నించాడు. 'భారతా ! మిత్రులు తగ్గిపోయి, శత్రువులు అధికమై, కోశాగారం క్షీణించిపోయి బలహీనపడినరాజు గతి ఏమిటి ? దుష్టమంత్రులే సహాయకులై, యంత్రాగం నుండి దూరమై, అన్నివిధాలా రాజ్యం నుండి భ్రష్టత్వం పొందడానికి సిద్ధమై, ముందుదారి కనపడక ఉన్న రాజు ఏమి చేయాలి ? శత్రుసేనల మీద దాడి చేసి, శత్రుదేశాలను మట్టికరిపించి, తనకంటె బలవంతుడయిన రాజుతో విరోధం సంభవించిన రాజు ఏమి చేయాలి ?' దేశం అస్తవ్యస్తంగా ఉండి, దేశకాలాలను గమనించలేక, అధికబాధల వల్ల సామభేదోపాయాలు ప్రయోగించలేని రాజు తన ప్రాణాలు కాపాడుకోవాలా ? లేక ధనాన్ని రక్షించుకోవాలా ? రెండింటిలో ఏది మంచిపని ? భీష్ముడు చెపుతున్నాడు. 'ధర్మజా ! అత్యంత గోప్యమయినది నీవు నన్ను అడిగావు. ఈ ధర్మం నీవు అడగనిదే నేను చెప్పడానికి ఉత్సాహం చూపను.

భారతోత్తమా ! సూక్ష్మమైన ధర్మం, జ్ఞానం కూడా విని తెలుసుకొన్నాక సదాచారాల ద్వారా ఉపాసించే సజ్జనుడు అరుదుగా ఉంటాడు. ఆలోచించి పనులు చేసేవాడు అయినా కాకపోయినా గానీ, ఇటువంటి ఈ ప్రశ్నలు మాత్రం స్వంతబుద్ధితోనే ఆలోచించి నిశ్చయించుకోతగినవి. నీవు అడిగిన రాజుయొక్క జీవనయాత్రకు ధర్మబాహుళ్యమైన ఉపాయాన్ని విను. ధర్మకారణంగా ఇటువంటి ధర్మాన్ని నేను కొనియాడను. ఆపత్కాలంలో అయినా ప్రజలను కష్టపెట్టి పన్నులు స్వీకరించటం రాజ వినాశనానికే దారి తీస్తుంది. ఎన్ని విధాల ఆలోచించినా ఇదే నిర్ణయం. మానవుడు నిత్యమూ శాస్త్రాలను ఏయే రీతులలో అధ్యయనం చేస్తాడో, ఆయా రీతులలోనే తెలుసుకొంటాడు. అలాగే అతనికి రుచిస్తుంది. శాస్త్రజ్ఞానం లేకపోవడం వలన మానవునికి ఉపాయాల లేమి కలుగుతుంది.

విజ్ఞానం వలననే ఉపాయాలు స్ఫురిస్తాయి. శ్రేష్ఠమైన ఉపాయమే సంపత్కరం. సందేహించకుండా, దోషాలు ఎంచకుండా ఈ మాటలు విను. కోశం క్షీణించి పోవడం వలననే రాజుకు సైన్యం కూడా క్షీణించిపోతుంది. నీరులేనిచోట నీరు పుట్టించినట్లుగా రాజు కోశాన్ని సృష్టించుకోవాలి. (బావి త్రవ్వి నీరు పొందినట్లుగా కష్టమైనా పన్నులు ద్వారా ధనం సంపాదించాలి.) కాలం కలిసివచ్చినపుడు అనుగ్రహం చూపాలి. ఇది ప్రాచీనకాలం నుండి ఆచరింపబడుతున్న ధర్మం. పూర్వం కూడా ఈ ధర్మోపాయాన్ని అనుసరించియే జనులు నడుచుకొన్నారు. భారతా ! సమర్థులకు ఉండే ధర్మం వేరు. ఆపత్కాలంలో ధర్మం వేరు. ముందుగా కోశం సంపాదించుకోవడం వల్లనే ధర్మం లభిస్తుంది. ఎందుకంటే జీవిక (బ్రతకడం కోసం చేసేపని) ధర్మం కంటే గొప్పది. దుర్బలుడు ధర్మం ఆచరించి, న్యాయోచితమైన జీవికను పొందలేడు. ఎందుకంటే ధర్మాచరణం వలన బలం ప్రాప్తిస్తుందని నిశ్చయంగా తెలియదు. కాబట్టి ఆపదసమయాలలో అధర్మం కూడా ధర్మలక్షణమే అని చెప్పబడుతోంది. కాని పండితులు ఆ అధర్మంవల్ల అధర్మమే కలుగుతుందని అంటారు.

ఆపద గడిచాక క్షత్రియునికి ఏమి చేయాలనే విచికిత్స కలుగుతుంది. (ప్రాయశ్చిత్తం చేసుకోవాలా ? పన్నులు వసూలు మానేయాలా ?) అప్పుడు అతడు ధర్మానికి గ్లాని కలుగకుండా, శత్రువుకు వశం కాకుండా ఉండేలా నడుచుకోవాలి. తన్ను తాను నశింపచేసుకోకూడదు అని చెప్పారు. **ఆపదకాలంలో తనధర్మమూ లేదు. ఇతరుల ధర్మమూ లేదు. సమస్త శక్తులతో, సర్వోపాయాలతో తన్ను తాను ఉద్ధరించుకోవాలనే కోరికతో ఉండాలి. ఇది అందరూ నిశ్చయించినది.** నాయనా ! ధర్మవేత్తల యొక్క నిశ్చయం ధర్మనైపుణ్యం అయినట్లే బాహువీర్యంవలన ఉద్యమించడం క్షత్రియులనైపుణ్యం అని శ్రుతి చెప్తోంది. భారతా ! జీవికకు అవరోధం ఏర్పడినపుడు తాపసుల సొమ్ము, బ్రాహ్మణుల సొమ్ము విడిచి క్షత్రియుడు ఇతరుల ఎవరి సొమ్మును తీసుకోకుండా ఉంటాడు ? బ్రాహ్మణుడు జీవికలేక నశించిపోయే దశలో యజ్ఞాధికారి కాని వానిచేత యజ్ఞం చేయిస్తాడు. భుజించకూడని అన్నాన్ని కూడా తింటాడు. అలాగే ఇది కూడా. (పైన చెప్పినది) ఇందులో సందేహం లేదు. బాధితుడికి మార్గం కాని దేముంది ? పూర్తిగా ధైర్యం కోల్పోయిన వాడికి చెడుమార్గం అంటూ ఏముంది ? బాధితుడు ద్వారం లేనిచోటనుండి కూడా పారిపోతాడు ? కోశం, సైన్యం నశించిపోయి, లోకమంతటా పరాభవమే ఎదురయిన క్షత్రియునికి (పైన చెప్పిన మార్గం) అడుక్కు తినటం విహితం కాదు. వైశ్యశూద్రుల జీవికలు విహితం కావు. జాత్యాలైన స్వధర్మాలను అనుసరించి జీవించలేనివానికి వేరొకవృత్తి ఉంది. ప్రథమకల్పాన్ని అనగా స్వధర్మాన్ని

విడిచినవాడు అనుకల్పం చేత అనగా అంతకంటె తక్కువ వర్ణాల వారి ధర్మంచేత జీవించవచ్చు. ఆపద పొందినపుడు ధర్మాలకు విరుద్ధంగా అన్యాయమైన జీవనం అవలంబించడం ఉంది. ఇది సాధారణంగా జీవన నిర్వాహకమైన వృత్తి క్షీణించిపోయిన బ్రాహ్మణులయందు కనిపిస్తుంది. ఇక క్షత్రియుల విషయమై సందేహం ఎందుకు ? వారికి సదా ఇదే నిశ్చితం. విశిష్టులైన ధనవంతులనుండి బలవంతంగా ధనం సంగ్రహించవచ్చును. ఏ రీతిగానూ ధనం లేక నశించిపోవడం తగదు. క్షత్రియుని ప్రజలను రక్షించేవాని గానూ, చంపేవాని గానూ కూడా చెప్తూ ఉంటారు. కాబట్టి క్షత్రియ బంధువునకు ప్రజలను సంరక్షిస్తూనే ధనసంగ్రహం చేయడం కర్తవ్యం. రాజా ! లోకంలో ఎవరికీ కూడా హింసారహితమైన వృత్తి లేదు. చివరికి అడవిలోనే ఉంటూ, ఒంటరిగా తిరిగేమునికి కూడా లేదు. కురుశ్రేష్ఠా ! శంఖలిఖిత* వృత్తినే ఆధారంగా చేసుకొని (స్వధర్మానుష్ఠానం) జీవించడం ఎవరికీ సాధ్యం కాదు. విశేషించి ప్రజాపాలన చేయాలనుకొనే క్షత్రియునికి. కాబట్టి ఆపత్కాలంలో రాజు, దేశప్రజలు కూడా పరస్పరం రక్షించుకోవాలి. ఇది నిత్య కర్తవ్యం. ఇది సనాతన ధర్మం. ఆపదలలో రాజు దేశాన్ని ధనరాశులచేత ఎలా రక్షిస్తాడో, అలాగే కష్టసమయంలో దేశం కూడా రాజును రక్షించాలి. రాజు ఆకలితో పీడింపబడుతున్నప్పుడు కూడా కోశం, దండం, బలం, మిత్రులు - కూడ బెట్టినది ఇంకా వేరేదైనా దేశం నుండి దూరం చేయకూడదు. మనిషి తాను తినే అన్నం నుండి కూడా గింజను మిగిల్చి సంపాదించుకోవాలని ధర్మవేత్తలు చెపుతారు. ఈ విషయంలో మహామాయావి అయిన శంబరుని దృష్టి కూడా ఇదే అంటారు.

దేశంలోని ప్రజలు, వైదేశికులయిన ఇతరమనుష్యులు కూడా జీవనాధారాలు లేక నశించిపోతుంటే ఆ రాజు జీవితం చీకొట్టవలసినదే. రాజుకు ప్రధానాధారం కోశం, సైన్యం. అందులో సైన్యానికి మూలం కోశం. సర్వధర్మాలకూ సైన్యం మూలం. ధర్మాలకు మూలం ప్రజలు. లోకంలో ఇతరులను పీడించకుండా ధనసంగ్రహం ఎలా శక్యం అవుతుంది ? అది లేనిదే సైన్యం ఎక్కడిది ? దాని కోసం పీడించినా కూడా రాజు దోషి కాజాలడు. యజ్ఞం కోసం యజ్ఞకర్మలలో అకార్యం కూడా చేయబడుతుంది. ఈ కారణంగా రాజు పాపం పొందడానికి అర్హుడు కాడు. (దోషికాడు.) ఆపత్కాలంలో ప్రజాపీడనం ధనసంగ్రహం కోసం కాబట్టి అది అర్థకారకమే (ప్రయోజనం కోసమే.) దానికి విపరీతంగా మరొకటి జరిగితే (ప్రజలను పీడించకపోవడం) అది అనర్థకారకమే. అలాగే ఇతర మైనది ఏదయినా (వ్యయకారకమైన సైన్యసంగ్రహం మొదలైనవి) అదంతా అర్థకారకమే. మేధావులు ఈ

* శంఖమనగా నుదుటి ఎముక - దానిపై వ్రాయబడినది (నుదుటివ్రాత) (నీల)

రీతిగా బుద్ధితో ఆలోచించి కార్యనిశ్చయం చేయాలి. ఇతరేతరమైన సామగ్రి అంతా యజ్ఞసిద్ధికోసమే. యజ్ఞం ఇతర ప్రయోజనం కోసం అవుతుంది. యజ్ఞసంబంధమైన ఇతరేతర వాక్కులు కూడా ఏదో ఒక విశేషాన్ని సిద్ధింపచేయడానికే అయిఉంటాయి. ఈ రీతిగా ఇవన్నీ యజ్ఞానికి సాధనాలే అవుతాయి. ధర్మస్వరూపాన్ని వెల్లడించే ఒక ఉపమానాన్ని చెపుతాను. యజ్ఞం కోసం యూపస్తంభాన్ని నరుకుతారు. అప్పుడు అక్కడ చుట్టూ ఆక్రమించుకొని, అడ్డుగా ఉన్న కొన్ని చెట్లను కూడా నరుకుతారు. ఆ చెట్లు కూడా పడిపోతూ ఇతర వృక్షాలను కొన్నిటిని నేలమట్టం చేస్తాయి. పరంతపా ! అలాగే గొప్పదైన కోశం విషయంలో కూడా అడ్డువచ్చిన మనుష్యులను చంపకుండా కార్యం సిద్ధించ దనిపిస్తోంది. ధనంవల్ల ఈ లోకం, పరలోకం రెండూ కూడా జయించవచ్చు. సత్యధర్మాలను కూడా సంపాదించవచ్చు. కాని నిర్ధనుడు అలా చేయలేడు. భారతా ! యజ్ఞ ప్రయోజనానికి సాధకమైన ధనం అన్ని ఉపాయాల ద్వారా సంపాదించుకోవాలి. ఇతర సందర్భాలలో కార్యాకార్యాలకు ఉండే తుల్యదోషం ఇలా ఇక్కడ ఉండదు. రాజా ! భూపాలా ! ధనసంగ్రహం, ధనత్యాగం ఈ రెండూ ఎప్పుడూ ఒకే వ్యక్తిలో ఉండవు. అరణ్యంలో ధనవృద్ధులైన వారిని నేను ఎప్పుడూ చూడలేదు. ఇక్కడ నేలపై ఏ కొంచెం ధనం కనబడినా 'ఇదినాది ఇదినాది' అంటూ ప్రజలు దానికోసం ఆశిస్తారు. పరంతపా ! రాజుకు రాజ్యరక్షణతో సమానమైన ధర్మం ఏదీ లేదు. చెప్పబడిన ధర్మం అంతా రాజులకు కేవలం ఆపత్కాలంలో ఆచరించడానికే కాని ఇతరత్రా కాదు. దానం చేత కొందరు, యజ్ఞకర్మల చేత కొందరు, తపస్సుచేత కొందరు, బుద్ధిచేత కొందరు, సామర్థ్యం చేత కొందరు ధనరాశులను పొందుతారు. ధనహీనుడిని దుర్బలు డంటారు. ధనంతో బలవంతు డవుతాడు. ధనవంతునికి అన్నీ లభిస్తాయి. నిధి కలవాడు అన్ని కష్టాలనూ దాటగలడు. ధనం వలన ధర్మం, కామం, ఇహపరలోకాలు సిద్ధిస్తాయి. ఆ ధనాన్ని కూడా ధర్మంగా పొందాలని కోరుకోవాలి. ఎప్పుడూ అధర్మంగా పొందకూడదు.

ఇది శాంతిపర్వం మొదటిభాగం



భారతం ఎందుకు చదవాలి ?

1. మనం భారతీయులం కనుక. భారతీయులుగా పెరగాలంటే భారతీయులుగా మిగలాలంటే భారతం చదివి తీరాలి.
2. నీవు - నేను అనే భేదం విడిచి మనం అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
3. మనల్ని మనం చక్కగా పరిపాలించుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
4. ప్రపంచంలో మన ఉనికిని నిలుపుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
5. ప్రజలంతా నా బంధువులు, మిత్రులు అనే భావం పెరగాలంటే... భారతం చదివి తీరాలి.
6. దేవ, ఋషి, పితృఋణాలతో పాటు మనుష్యఋణం తీర్చుకోవాలంటే... భారతం చదివి తీరాలి.
7. పాలించడమంటే చెప్పుకిందకు తొక్కడం కాదనీ రక్షించడమనీ తెలియాలంటే... భారతం చదివి తీరాలి.
8. బుద్ధిజీవి అయిన మానవుడు వయసులో ఉన్నపుడే భారతం చదివితే ఇహపర సౌఖ్యాలు రెండూ అందుకోగలడు. కనుక ముందుగా యువతరం భారతం చదివి తీరాలి.
9. తీవ్రబుద్ధి మనిషి మనస్సును చీలుస్తుంది - సద్బుద్ధి మనుషుల మనస్సులను బుద్ధులను కలుపుతుంది. ఆ భావన కోసం... భారతం చదివి తీరాలి.